ఓం గం గణపతయే నమః ।

శ్రీకృష్ణాయ నమః । శ్రీగోపీజనవల్లభాయ నమః ।

శ్రీమదాచార్యచరణకమలేభ్యో నమః ।

శ్రీమద్వల్లభాచార్య విరచిత

# 'శ్రీ పురుషోత్తమనామసహస్రమ్'

శ్రీమద్రఘునాథులు వ్రాసిన

## "నామచంద్రికా" వ్యాఖ్యకు తెలుగు అనువాదము

"సహస్రం యైస్తు పఠితం స్యాచ్ఛుకామృతం"

అనువాదకుడు :

**బలజపల్లి వేంకట శ్రీరామచంద్రమూర్తి**

ప్రథమ ముద్రణ :

ప్రతులు :

వెల :

ప్రాప్తిస్థానము :
**డా॥ బి.వి.యస్.ఆర్. మూర్తి**
8-3-169 / 65, సిద్ధార్థనగర్,
హైదరాబాద్ - 500 038.
ఫోన్ : 9391012779.

ముద్రణ :
ఎక్సెలియన్ ప్రింటింగ్ స్కూల్,
సుబ్బలక్ష్మీనగర్, విశాఖపట్నం-530 016.
☏ 2747320, 2751329.



# విషయ సూచిక


1. ఉపోద్ఘాతము .......... 7
2. అనువాదము గురించి .......... 9
3. అనువాదకుని మనవి .......... 11
4. గ్రంథ పరిచయము .......... 15
5. శ్రీమద్వల్లభాచార్యులవారి సంక్షిప్త జీవితచరిత్ర .......... 17
6. శ్రీపురుషోత్తమనామసహస్రమ్ (మూలము) .......... 29
7. మంగళాచరణము, ఋష్యాదులు .......... 53
8. ప్రథమస్కంధ నామములు (అధికారలీలా నామములు) .......... 58
9. ద్వితీయస్కంధ నామములు (సాధనలీలా నామములు) .......... 92
10. తృతీయస్కంధ నామములు (సర్గలీలా నామములు) .......... 101
11. చతుర్థస్కంధ నామములు (విసర్గలీలా నామములు) .......... 130
12. పంచమస్కంధ నామములు (స్థాన(స్థితి)లీలా నామములు) .......... 157
13. షష్ఠ స్కంధ నామములు (పోషణలీలా నామములు) .......... 185
14. సప్తమస్కంధ నామములు (ఊతిలీలా నామములు) .......... 206
15. అష్టమస్కంధ నామములు (మన్వంతరలీలా నామములు) .......... 222
16. నవమస్కంధ నామములు (ఈశానుకథాలీలా నామములు) .......... 249
17. దశమస్కంధ(పూర్వార్థ) నామములు (నిరోధలీలా నామములు) ............ 270
18. దశమస్కంధ(ఉత్తరార్థ) నామములు (నిరోధలీలా నామములు) ............ 330
19. ఏకాదశస్కంధ నామములు (ముక్తిలీలా నామములు) .......... 360
20. ద్వాదశస్కంధ నామములు (ఆశ్రయలీలా నామములు) .......... 369
21. ఇతర పురాణములనుండి ఏర్చి కూర్చిన నామములు .......... 377
22. ఫలశ్రుతి .......... 379

## సంక్షిప్తముల వివరణము

| | | |
|---|---|---|
| ఈ. ఉ. | – | ఈశావాస్యోపనిషత్ |
| గీత | – | భగవద్గీత |
| తై. ఉ. | – | తైత్తిరీయోపనిషత్ |
| భాగ | – | శ్రీమద్భాగవతము (వ్యాసకృతము) |
| వి.స.నా. | – | విష్ణుసహస్రనామస్తోత్రము,<br>– శంకర భాష్యము, గీతాప్రెస్ |
| పూ.పీ. | – | పూర్వ పీఠిక |
| ఉ.పీ. | – | ఉత్తర పీఠిక |
| వా.రా.బాల | – | వాల్మీకి రామాయణమ్ – బాలకాండ. |



॥ श्रीहरिः ॥

**गोस्वामी श्याम मनोहर**

६३, स्वस्तिक सोसायटी,
४ था रस्ता, जुहुस्कीम, पारले,
मुंबइ – ४०० ०५६. महाराष्ट्र.

श्रीराम श्रीकृष्ण श्रीवेदव्यास और श्रीबुद्ध भगवान्के ये चारों अवतार भारतके उत्तर भूभागोंमें हुए तो श्रीशंकर श्रीरामानुज श्रीमध्व और श्रीवल्लभ वेदान्ताचार्योंका अवतार देशके दक्षिणी भूभागके आधुनिक चार प्रान्त केरल तामिलनाडु कर्णाटक और आन्ध्रप्रदेश में हुआ. इन चारों आचार्योंने समग्र देशको अपनी कर्मभूमि मान कर न केवल देशकी चारों दिशाओंमें परिभ्रमण किया अपितु–अपने 2 केन्द्र भी स्थापित कर देशकी सांस्कृतिक एकताको अखण्डित रखनेका महान् आदर्श प्रस्तुत किया था।

फिर भी उत्तरी भूभागके राजस्थान–गुजरातसे आन्ध्रप्रदेशमें जो महाप्रभु श्रीवल्लभाचार्य द्वारा पुष्टिमार्गके अनुगामी जो आन्ध्रप्रदेशमें जा बसे उनके अपवादको छोड़ कर शेष आन्ध्रप्रदेशकी जनताको अब महाप्रभु श्रीवल्लभाचार्यके धर्म दर्शन या उनके योगदान के बारेमें बहुत जानकारी नहीं है।

श्री बी.वी. एस्. आर्. मूर्तिजीने महाप्रभु द्वारा विरचित श्रीपुरूषोत्तम नामसहसम् की नामचन्द्रिका का तेलगु भाषामें अनुवाद कर जो उसे प्रकाशित करनेका संकल्प प्रकट किया है। उसके कारण आन्ध्रप्रदशकी जनताको स्वयं अपने प्रदेशके ही आचार्यसे कुछ परिचय प्राप्त करनेका सुअवसर प्रदान किया है। एतदर्थ इनको हृदयसे अभिनन्दित करता हुं।

पांच सौ वर्ष पूर्व हमारे आद्याचार्य, मुझसे सोलहवीं पीढ़ीपर, महाप्रभु श्रीवल्लभाचार्यका परिवार उत्तरी भुभागमें स्थलान्तरण कर गया होनेसे हमारी स्थिति यह है कि हमारे परिवारमें कुछ अपवादोंको

छोड़ कर बहुत कम लोगोंको आज अपनी तेलगु मातृभाषाको लिखने पढ़ने या बोलने का अभ्यास रह गया है। अत: अपनी मातृभाषामें इस अभिनन्दन पत्रको लिखनेकी बलवती आकांक्षाके बावजूद इसे हिन्दीमें लिखनेको मुझे बाधित होना पड़ रहा है।

आशा है कि श्रीमान् मूर्तिजी मेरे इस पत्रका तेलगुभाषामें अनुवाद करनेका श्रम लेंगे पुनश्च श्रीमान् मूर्तिजीको इस अनुवादके प्रकाशनके समय अनेकानेक अभिनन्दन प्रदान करते हुए....

दिनांक :
श्रावणशुक्ला नवमी,
वि.सं. २०६३



**గోస్వామి శ్యామ మనోహర.**

63, స్వస్తిక్ సొసయిటీ,
4వ రోడ్డు, జుహుస్కీమ్,
పారలే, ముంబయీ - 400 056.

## ఉపోద్ఘాతము

భగవానుడు శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీవేదవ్యాస, శ్రీబుద్ధ రూపములలో భారతదేశ ఉత్తరభాగములలో అవతరిస్తే శ్రీశంకర, శ్రీరామానుజ, శ్రీమధ్వ, శ్రీవల్లభుల రూపములలో వేదాంతాచార్యులుగా ప్రస్తుతము కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అని పిలవబడే దేశ దక్షిణభాగములలో అవతరించారు. ఈ నలుగురు ఆచార్యులు భారతదేశమంతటిని తమ కర్మభూమిగా భావించారు. వారు దేశము నలుమూలలా పర్యటించి వారివారి కేంద్రములను స్థాపించారు. ఈ విధముగా వారు మనదేశసంస్కృతియొక్క, ఏకత్వమును, అఖండతను, నిలుపుట కొరకు గొప్ప ఆదర్శమును చాటి చూపించారు.

ఇలా అయినప్పటికి, ఉత్తర భూభాగములోని రాజస్థాన్, గుజరాత్ ప్రాంతముల నుండి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అక్కడ నివసిస్తున్న మహాప్రభువు శ్రీవల్లభాచార్యులవారి పుష్టిమార్గ అనుయాయులకు తప్పించి, మిగిలిన ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులకు మహాప్రభువు శ్రీ వల్లభాచార్యులు సనాతన ధర్మ(పాలన)ము కొరకు జేసిన సేవ గురించిగాని, పుష్టిమార్గము గురించి గాని, వారి శుద్ధాద్వైతసిద్ధాంతము గురించి గాని విశదముగా తెలియదు.

శ్రీ బి.వి.ఎస్.ఆర్.మూర్తిగారు మహాప్రభువిరచిత పురుషోత్తమనామ సహస్రమునకు వ్యాఖ్యగా వ్రాసిన నామ చంద్రికను తెలుగులోనికి అనువదించి, దానిని ప్రచురింప సంకల్పించారు. స్వయముగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీవల్లభాచార్యులవారి గురించి ఈ విధముగా ఆంధ్రప్రజానీకమునకు కొంత పరిచయము చేసే ప్రయత్నము జరిగినది. ఇందుకు శ్రీమూర్తిగారికి నా హృదయ పూర్వక అభినందనలు.

ఐదు వందల (500) సంవత్సరములకు పూర్వము జన్మించిన మా ఆద్యాచార్యులవారు మాకు పదహారు (16) తరములముందువారు. మహాప్రభువు శ్రీవల్లభాచార్యుల పరివారము స్థలాంతరము జరిగి, దేశ ఉత్తరభాగములో నివసించడము చేత, ఇప్పుడు మా పరివారములో ఏ కొద్ది మందికో తప్ప, మిగిలిన వారికి మాతృభాష అయిన తెలుగు చదవడముగాని, వ్రాయడముగాని, మాట్లాడడము గాని అలవాటులో లేదు. ఈ కారణముగా ఈ అభినందనను, మన మాతృభాషలో వ్రాద్దామన్న బలవత్తర కోరికఉన్నా, దీనిని నేను హిందీ భాషలో వ్రాసినందుకు బాధపడవలసి వచ్చినది.

అందుచేత దీనిని తెలుగు భాషలోనికి అనువదించమని శ్రీమూర్తిగారిని కోరుచున్నాను. ఆయన ఈ అనువాద(గ్రంథ)మును ప్రచురించే సమయములో మరల మరల వారిని అభినందిస్తున్నాను.

దినాంకము :
శ్రావణ శుక్ల నవమి,
2063 (వి.సం.)

**- గోస్వామీ శ్యామ మనోహర**

(గోస్వామి శ్రీ శ్యామమనోహరగారి ఉపోద్ఘాతమునకు తెలుగు అనువాదము)



# అనువాదము గురించి

కొన్ని నెలల క్రితము పరమపూజ్య గోస్వామి శ్రీశ్యామమనోహరగారు ముంబాయి నుంచి నాకు టెలిఫోను చేసి యీ క్రింది విధముగా చెప్పారు.

“శ్రీ డా॥ బి. వి. ఎస్. ఆర్. మూర్తి అనే హైదరాబాదు వాస్తవ్యుడు శ్రీమద్వల్లభాచార్యకృత శ్రీపురుషోత్తమనామసహస్రమునకు శ్రీమద్రఘునాథులు వ్రాసిన నామ చంద్రిక అనే సంస్కృత వ్యాఖ్యను తెలుగు భాషలోనికి అనువాదము చేసినట్లు చెప్పారు. నాకు తెలుగుభాషలో ప్రవేశము లేనందున ఆ అనువాదము శ్రీరఘునాథులవారి వ్యాఖ్యతో సరిగా ఉన్నదో లేదో మీరు పరిశీలించి, అవసరమైతే తగిన సూచనలు చేసి, అతనికి సహాయము చేయండి”. ఇది జరిగిన తరువాత శ్రీ మూర్తిగారు నాకు యీ విషయమై టెలిఫోను చేసి తాను వ్రాసిన అనువాద ప్రతిని పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వమని కోరారు. నా అనుమతి పొంది, ఆ అనువాద ప్రతిని నేను అహమ్మదాబాదులో ఉండగా వారి కుమార్తె డా॥ బాలా సుబ్రహ్మణ్యము ద్వారా నాకు అందజేసారు. దానిని నేను సునిశితముగా పరిశీలించాను. అనువాదము చక్కగా ఉన్నది. ఎక్కడెక్కడ చిన్న చిన్న మార్పులు చేస్తే వీరి అనువాదము నామచంద్రికకు, శ్రీ వల్లభాచార్య సిద్ధాంతములకు సరిపోతుందో ఆ మార్పులను సూచిస్తూ, ఆ వ్రాతప్రతిని వారు అహమ్మదాబాదులో నన్ను కలిసినపుడు తిరిగి ఇచ్చాను. ఈ అనువాదము సరళమైన తెలుగులో సామాన్యులకు కూడా అర్థమయ్యే శైలిలో ఉన్నది.

వృత్తి పరముగా రసాయన శాస్త్రజ్ఞుడైనా, డా॥ మూర్తిగారు తమ మొదటి ప్రయత్నములోనే శ్రీవల్లభాచార్యుల గ్రంథమును ఇంతచక్కగా అనువాదము చేయడం మెచ్చుకోదగిన విషయము. మూర్తిగారి ఆధ్యాత్మిక గ్రంథముల జ్ఞానము నాకెంతో సంతోషము కలిగించినది. జగద్గురువు శ్రీవల్లభాచార్యుల వారు భారతదేశములో ప్రఖ్యాతిగాంచిన నలుగురు ఆచార్యులలో ఒకరు.

వీరు శుద్ధాద్వైతమును, పుష్టిమార్గమును సిద్ధాంతీకరించిరి. వీరు ఆంధ్రదేశమునకు చెందిన ఏకైక ఆచార్యులు. వీరి తండ్రిగారు కృష్ణానదీతీరమునుండి కాశీకి వచ్చి స్థిరపడిరి. వారి సంతతి వారు ఇప్పటికి కూడా సాధ్యమైనంతవరకు తెలుగు వారితోనే వైవాహిక సంబంధములు చేసుకొంటారు.

శ్రీవల్లభాచార్యులవారి గ్రంథములను, సిద్ధాంతమును తెలుగు వారికి పరిచయము చేయవలసిన అవసరము ఎంతో ఉన్నది. డా॥ బి.వి.ఎస్. ఆర్. మూర్తిగారు యీ దిశలో చేసిన కృషి నాకు ఆనందము కలిగించినది. ఇకముందు కూడా వారు ఇతర పుష్టి మార్గము గ్రంథములను తెలుగులోనికి అనువాదముచేసి, శ్రీకృష్ణునికి, తెలుగువారికి సేవ చేస్తారని ఆశిస్తాను.

వరోదరా

20-8-06 — డా॥ పెద్దిభొట్ల కృష్ణకుమార్



# అనువాదకుని మనవి

శ్రీమద్భాగవతము పరబ్రహ్మముయొక్క వాఙ్మయరూపము. అందులోనున్న పన్నెండు స్కంధములు విరాట్పురుషుని పన్నెండు అవయవములుగా వర్ణింపబడ్డాయి. భాగవతము భక్తిశాస్త్రము. భాగవతపఠన, శ్రవణ, కీర్తనలు భగవద్భక్తిని వృద్ధి పొందించి, దృఢపరుస్తాయి. అందుచేత ఇది భగవత్ప్రాప్తికి సరళ సాధనము.

శ్రీ మద్వల్లభాచార్యులవారు (ఆచార్యులవారు) తమ శుద్ధాద్వైత సిద్ధాంత నిరూపణకు, పుష్టిమార్గబోధనకు, ప్రస్థానత్రయముతోపాటు భాగవతమును ప్రమాణగ్రంథముగా ఎన్నుకొన్నారు. తమ పుత్రులు శ్రీ గోపీనాథులు ప్రతిదినము భాగవతపఠనము సంక్షిప్తముగా చేయగలరన్న మిషతో శ్రీ ఆచార్యులవారు యీ శ్రీపురుషోత్తమనామసహస్రమును రచించారు. సామాన్యులందరూ కూడా ఇది పఠించి భగవద్భక్తి పొందుతారన్నది కూడా వారి లోకకళ్యాణ దృష్టిగా మనము భావించాలి.

శ్రీ మద్భాగవతములోని పన్నెండు స్కంధములలో వర్ణింపబడ్డ భగవల్లీలలను ఏర్చి, కూర్చి 1075 లీలానామముల రూపములో (256 అనుష్టుప్ శ్లోకములలో) శ్రీపురుషోత్తమనామసహస్రమనే పేరుతో రచించారు. ఈ నామముల అర్థము తెలుసుకొని, యీ గ్రంథ పఠనము చేస్తే శ్రీమద్భాగవత పఠనమవుతుందని శ్రీ ఆచార్యులవారి ఆదేశము.

"సర్వధర్మ వినిర్ముక్తః సర్వ సాధన వర్జితః ।
ఏతద్ధారణ మాత్రేణ కృష్ణస్య పదవీం వ్రజేత్ ॥
హర్యావేశిత చిత్తేన శ్రీ భాగవతసాగరాత్ ।
సముద్ధృతాని నామాని చింతామణి నిభాని హి॥

కంఠస్థితాన్యర్థ దీప్త్యా బాధంతేఽజ్ఞానజం తమః।
భక్తిం శ్రీకృష్ణ దేవస్య సాధయన్తి వినిశ్చితం ॥"

శ్రీపురుషోత్తమనామసహస్రమునకు శ్రీమద్రఘునాథులు సంస్కృతములో "నామ చంద్రికా'' అనే వ్యాఖ్యను వ్రాసారు. పైని చెప్పిన ఆచార్యులవారి

ఆదేశమును అనుసరించడానికి ఈ లీలానామార్థముల అర్థములు తెలుసుకోవాలి. తెలుగువారైన శ్రీ వల్లభాచార్యులవారు, పురుషోత్తమ నామసహస్రము వ్రాసి, దాని అర్థసహిత పఠన మాత్రము చేత సంపూర్ణ భాగవతపఠన ఫలము కలుగుతుందని చేసిన ఆదేశము యొక్క ఫలము తెలుగువారు పొందగలుగుతారన్న ఉద్దేశ్యముతో కూడా యీ అనువాదము చేయబడింది. ఈ గ్రంథ అనువాదమునకు సంబంధించిన (సుమారు మూడు సంవత్సరముల పూర్వము (క్రీ.శ. 2003)లో జరిగిన) ఒక ముఖ్య విషయమును భగవత్కృపగా భావించి తెలియజేస్తున్నాను. కొన్ని సంవత్సరములనుండి శ్రీమద్భాగవతమునకు శ్రీమద్వల్లభాచార్యులవారు వ్రాసిన శ్రీసుబోధినీ అనే వ్యాఖ్యా గ్రంథము కొరకు ఎన్ని ప్రయత్నములు చేసినా, అది నాకు దొరకలేదు. ఇండోరు వాస్తవ్యులు శ్రీ గజానన శర్మగారి అడ్రసు "కళ్యాణ్" ప్రచురణ కర్తల నుండి తెప్పించి వారిని శ్రీసుబోధినీ నాకు దొరికే మార్గము చూపమనగా- వారు పరమ పూజ్య గోస్వామి శ్రీ శ్యామ మనోహర గారి వద్ద మీకు సుబోధిని దొరకవచ్చునని వారి అడ్రసు ఇచ్చారు. అంతట నేను గోస్వామి శ్రీ శ్యామ మనోహర గారికి లేఖ వ్రాయగా వారు నాయందెంతో దయతో భాగవత దశమస్కంధములోని కొన్ని అధ్యాయములకు శ్రీసుబోధిని పంపుతూ, ఆ పుస్తకములతో పాటు శ్రీ ఆచార్యులవారి కొన్ని ఇతర గ్రంథములు కూడా పంపారు. శ్రీ పురుషోత్తమ నామసహస్రము అందులో ఒకటి.

గోస్వామీ శ్రీశ్యామ మనోహర గారు శ్రీకృష్ణ భక్తులు. గొప్ప పండితులు పరిశోధకులు. ఎన్నో పుష్టిమార్గ గ్రంథకర్తలు. నేను నామచంద్రికకు చేసిన తెలుగు అనువాదమును తెలుగు వచ్చిన పుష్టిమార్గ పండితులచే పరిశీలింప ఏర్పాటు చేయమని కోరగా, పుష్టిమార్గ నిష్ణాతులు, బహుగ్రంథ కర్తలు, శ్రీకృష్ణ భక్తులు అయిన బ్రహ్మశ్రీ డా॥ పెద్దిభొట్ల కృష్ణకుమారుగారిని, యీనా అనువాదము పరిశీలించవలసినదని శ్రీ గోస్వామిగారు కోరారు. ఆ తరువాత వారిని యీ అనువాదము గురించి సంప్రదించి, నా కోరిక పై యీ పుస్తకమునకు ఉపోద్ఘాతము వ్రాసి పంపారు. వారికి తెలుగు భాష రానందున, వారు హిందీలో వ్రాసిన ఉపోద్ఘాతము, దాని తెలుగు అనువాదము యీ పుస్తకములో



ముద్రింపబడింది. ఇట్లు వారు నాపై చూపిన దయ, గురువులు శిష్యులపై చూపే కృప అని నేను తలుస్తాను. వారికి నేను పాదాభివందనము చేస్తున్నాను. వారికి నేనెంతో కృతజ్ఞుడను.

శ్రీ డా॥ కృష్ణకుమార్‌గారు, యీ అనువాదమును పరిశీలించి అక్కడక్కడ ఏమేమి మార్పులు చేస్తే నామచంద్రికకు, శుద్ధా ద్వైతమునకు అనుగుణముగా ఉంటుందో సూచించారు. వాటిని ఆ యా స్థలములందు పొందు పరిచాను. నేను వారిని అహమ్మదాబాదులో కలిసినపుడు వారి నుండి శుద్ధాద్వైత సిద్ధాంతము గురించి పుష్టిమార్గము గురించి ఎన్నో విశేషములు తెలుసుకొన్నాను. వారి పాండిత్యమునకు నేనెంతో ముగ్ధుడనయ్యాను. వారు నాయందు చూపిన ఆత్మీయత మరువలేనిది. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్కారములు.

ఈ అనువాదము చేసిన మొదటి దశలో (పుస్తకము శ్రీ డా॥ కృష్ణ కుమార్ గారికి పంపక పూర్వము) దానిని ముఖ్యులైన నా యిద్దరు మిత్రులకు చూపించాను. వారిలో ఒకరు శ్రీ ఈశ్వరప్రగ్గడ శేషావతారముగారు. వీరు వృత్తిరీత్యా రసాయనశాస్త్రజ్ఞులు. రిటైర్డు కాలేజీ ప్రిన్సిపాలు, బహుముఖ ప్రజ్ఞావంతులు. పండితులు, ఆధ్యాత్మిక సాధన చేసినవారు. వారు యీ పుస్తకమును మొదటి నుండి చివర వరకు పూర్తిగా పరీక్షించి, విలువైన కొన్ని సవరణలు సూచించారు. నా రెండవ మిత్రులు శ్రీ పింగళి సూర్యసుందరముగారు. వీరు వృత్తిరీత్యా అకౌంటెంటు జనరల్‌గా పనిచేసి రిటైరయినారు. వీరు మంచి పండితులు. ఆధ్యాత్మిక సాధన చేసినవారు, ఆధ్యాత్మిక గ్రంథ రచయితలు. కొన్ని గ్రంథములు ఇంగ్లీషు నుండి తెలుగులోకి మరికొన్ని తెలుగు నుండి ఇంగ్లీషులోకి అనువదించారు. వీరు రాష్ట్రీయ పురస్కార (National Award) గ్రహీతలు. ఈ నా అనువాదము చదివిన తరువాత వారిద్దరు చేసిన సూచనల ననుసరించి తగిన మార్పులు చేసాను. వీరిద్దరు మిత్రులకు నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

భగవద్భక్తులైన మా తల్లిదండ్రులు - శ్రీమతి వేంకటరమణమ్మ, శ్రీ గోదావరిరాజుగార్లు నా చిన్నతనమునుండి నాలో ఆధ్యాత్మిక విషయములందు

రుచి కలుగునట్లు చేసారు. వారు నన్ను ఆధ్యాత్మిక గ్రంథ పఠనము నందు ఎంతో ప్రోత్సాహించారు. వారి దీవనలే యీ విధముగా నేను శ్రీకృష్ణుని సేవ చేసే అవకాశము కలిగించాయి. వారి ఋణము నేను తీర్చుకోలేనిది.

ఈ అనువాదము చేసే సమయములో నా భార్య శ్రీమతి కనకమ్మ నాతో ఎంతో సహకరించి ప్రోత్సాహించినది. ఆమెకు ముందు జన్మలలో శ్రీకృష్ణచరణ భక్తి దృఢపరచమని నేను భగవంతుని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకము డి.టి.పి. చేసే ముందు, డి.టి.పి. చేసే సమయములోను నా తమ్ముడు చి॥డా॥ వేంకట తిరుమలరావు నా కెన్నో విధములుగా సహాయ పడ్డాడు. అతని భార్య, నా మేనకోడలు చి॥సౌ॥ శేషు మరియు నా మేనకోడలు చి॥సౌ॥ రమ, ఆమె భర్త చి॥ సూర్యనారాయణగారు, నేను యీ పని నిమిత్తము విశాఖపట్నములో నున్నప్పుడు నా కెన్నో సదుపాయములు చేసారు. వీరిపై శ్రీకృష్ణ కృప కలుగవలెనని భగవంతునికి నా ప్రార్థన.

ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూలు, విశాఖపట్నము వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక పుస్తక ప్రచురణ కర్తలు అయిన శ్రీ పసుమర్తి కృష్ణమోహన్ గారు ఎంతో శ్రమ తీసుకొని, యీ పుస్తకము డి.టి.పి. చేసి, సి.డి.పై ఇచ్చారు. వారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకము అనువాదము చేసే సమయము నుంచి, చివరి వరకు నాకు అప్పుడప్పుడు సహాయపడిన వారందరికి నా కృతజ్ఞతలు. వారందరికి భక్తిని అనుగ్రహించమని భగవంతునికి నా ప్రార్థన.

పండితులు ఈ పుస్తకములో ఏ విధమైన తప్పులు చూచినా నాకు తెలియపరచ ప్రార్థన. వాటిని కృతజ్ఞతా పూర్వకముగా సవరించగలను.

ఈ అనువాద గ్రంథము శ్రీకృష్ణ భగవానుని చరణకమలములకు సమర్పిస్తున్నాను.

శ్రీకృష్ణః శరణం మమ ।

- బ॥వేం॥ శ్రీరామచంద్రమూర్తి



## గ్రంథ పరిచయము

శ్రీమద్వల్లభాచార్యమహాప్రభువులు (మహాప్రభువులు) తమ జ్యేష్ఠ పుత్రుడైన శ్రీగోపీనాథుల నిమిత్తము శ్రీపురుషోత్తమనామసహస్రమనే గ్రంథమును రచించారని చెప్పుదురు. శ్రీగోపీనాథులు "శ్రీమద్భాగవతమును పూర్తిగా పారాయణ చేస్తే గాని ప్రసాదస్వీకారము చేయనన్న" నియమము పాటించేవారు. ఈ కఠిన నియమపాలన వలన వారికి దైనందిన వ్యవహారములలోనే కాక భగవత్సేవ చేయుటలో కూడా ఎంతో అసౌకర్యము కలుగుతూ ఉండేది. ఈ అసౌకర్యము కలుగకుండా శ్రీగోపీనాథులు భాగవత పఠనము పూర్తిచేయుట కొరకు శ్రీమహాప్రభువులు భగవన్నామాత్మకమైన చింతామణి రత్నములను బోలిన వేయినామములు శ్రీమద్భాగవతసముద్రము లోతుల నుండి వెలికితీసి శ్రీగోపీనాథులకు ప్రదానము చేసారు. ఈ భగవల్లీలానామముల పఠన చింతనల వలన శ్రీమద్భాగవతములో వర్ణింపబడిన దశవిధలీలల పఠన చింతనలు పూర్తిగా అవుతాయి. ఏ వ్యక్తి అయినా శ్రద్ధాపూర్వకముగా ఏకాగ్రచిత్తముతో అర్థసహితముగా అనుసంధానము చేసి ఈ భగవన్నామములు పఠిస్తే వారికి శ్రీభగవాన్ గోవిందుని చరణకమలప్రాప్తి సిద్ధిస్తుందని శ్రీమహాప్రభువుల సందేశము. ఈ నామముల పారాయణ చింతనలు శ్రీకృష్ణునిపై భక్తిని వృద్ధి చేయుటకు ఎంతో ఉపయోగకరములు. సిద్ధి ప్రదములు. శ్రీపురుషోత్తమనామ సహస్రపారాయణము శ్రీమద్భాగవత పారాయణముతో సమానము. "సహస్రంయైస్తుపఠితైః పఠితం స్యాత్ శుకామృతం" అని మహాప్రభువుల ఆదేశము. శ్రీపురుషోత్తమనామసహస్రమునకు శ్రీమద్రఘునాథులు 'నామ చంద్రిక' అనే వ్యాఖ్య వ్రాసారు.

ఈ సంస్కృతగ్రంథ సంగ్రహ ప్రకాశితముల గురించి పరిచయము.

"1) ఈ గ్రంథము యొక్క మూడు ప్రతులు ఉపలబ్ధమైనవి. శ్రీఅచల రామభూదరజీత్‌గారి నుండి ఒకటి, శాస్త్రి వసంతరామగారి నుండి రెండవది, భద్రశంకరగారి నుండి మూడవది. ఈ మూడు ప్రతులలోను, ప్రాయః

శుద్ధమైన టీకలతో గల మూలము కలదు. మూడు ప్రతులలోను గల కొన్ని కొన్ని అత్యంత సందిగ్ధముగా నున్న టీకలను యథాశక్తి సంశోధనము చేసి ఈ గ్రంథము ముద్రింపబడినది. భగవద్ధర్మపరాయణులైన రణఛోడదాస వరజీవనదాసశ్రోఫ్‌గారు ద్రవ్యసహాయము చేయగా గ్రంథము ముద్రించబడినది."

"ప్రస్తుత సంస్కృత గ్రంథము, వి.సం. 1974 (1918 A.D.) లో ప్రకాశితమైన సంస్కరణము యొక్క (ఆఫ్‌సెట్ ప్రోసెస్ ద్వారా చేసిన) ముద్రణము. పైని పేర్కొనిన (సంస్కరణ చేసిన) పుస్తకము శ్రీ మూలచంద్ర-తులసీదాసతేలీవాలాగారు, శ్రీభద్రశంకరజయశంకరశాస్త్రిగారులచే సంగ్రహింపబడి పేటలారీ శ్రీరణఛోడ్‌దాస వరజీవనదాసశ్రోఫ్‌గారిచే ప్రకాశితమైనది. ఈ మహానుభావులందరు చిరస్మరణీయులు. కృతజ్ఞతా పూర్వముగా స్మరిస్తున్నాము."

**శ్రీమూలచంద్రతులసీదాసతేలీవాలా, ముంబయి**
**వారిచే వ్రాయబడిన పరిచయము.**

"భాగవత పారాయణము నందు శ్రీమద్గోపీనాథులు శ్రీవిఠ్ఠలనాథులు అనుభవించుచున్న అసహనమైన కష్టము చూచి పుత్రవాత్సల్యము చేత వారియందు కృపతో శ్రీమహాప్రభువులు శ్రీహరిని హృదయమందు ధారణ చేసి శ్రీపురుషోత్తమనామసహస్రమును, శ్రీమద్భాగవతసాగరమునుండి వెలికి తీసిరి. దీని పారాయణచేత శుకామృతమైన శ్రీభాగవతము పారాయణ అవుతుంది. శ్రీమహాప్రభువులు వి.సం. 1535 (1479 A.D.) లో వైశాఖ కృష్ణ ఏకాదశినాడు అవతరించారు. శ్రీమద్రఘునాథులవారు శ్రీపురుషోత్తమనామసహస్రమునకు 'నామచంద్రిక' అనే వ్యాఖ్యను వ్రాసేరు. వీరు శ్రీమద్వల్లభాచార్యుల ద్వితీయ పుత్రులైన శ్రీ విఠ్ఠలేశప్రభుచరణుల ఐదవకుమారులు. వి.సం॥ 1611 (1555 A.D.) కార్తికశుక్ల ఏకాదశీ-ద్వాదశీ దినమున జన్మించారు.



శ్రీకృష్ణాయ నమః

## శ్రీమద్వల్లభాచార్యులవారి సంక్షిప్త జీవితచరిత్ర

**శ్రీ**మద్వల్లభాచార్య మహాప్రభువులు (ఆచార్యులవారు) ఒక తెలుగు వెలనాడు బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు. వారి ఇంటిపేరు కంభం పాటివారు. వారి పూర్వుల స్వస్థానము ఇప్పటి కృష్ణాజిల్లాలోని కాకరపాడని చెబుతారు. వీరి తండ్రిగారు శ్రీలక్ష్మణభట్టుగారు. తల్లి ఎల్లమ్మగారు. శ్రీలక్ష్మణభట్టుగారు కాశీలో తమ నివాసస్థానము ఏర్పరుచుకొన్నారు.

### శ్రీవల్లభాచార్యుల జననము :

ఆ రోజులలో మహమ్మదీయులు కాశీపై దండెత్తుతున్నారన్న వార్త విని శ్రీలక్ష్మణభట్టుగారు కుటుంబ మిత్ర సహితముగా వారి స్వస్థానమునకు బయలుదేరారు. అప్పటికి ఎల్లమ్మగారు నిండు చూలాలు. వారు చంపారణ్యములో ప్రయాణము చేస్తూ ఉండగా దట్టమైన అడవిలో ఎల్లమ్మ గారు ఒక స్పృహలేని మగశిశువును కన్నారు. శిశువు బ్రతికి లేడని అనుకొని, ఆ శిశువును ఆకులలో చుట్టి ఒక జమ్మిచెట్టు తొఱ్ఱలో దాచి ముందుకు ప్రయాణము సాగించారు. కాని ఆ రాత్రే ఆ శిశువు బ్రతికి ఉన్నట్లు ఎల్లమ్మగారికి స్వప్నము వచ్చింది. వెంటనే తల్లిదండ్రులిద్దరు తిరిగి ఆ జమ్మిచెట్టు దగ్గరకు వెళ్ళి చూడగా శిశువు కదులుతున్నాడు. చుట్టూ మంటలు అతనిని కాపాడుతున్నాయి. వారాశిశువును తీసుకొని ప్రయాణము ముందుకు సాగించారు. ఆ శిశువే శ్రీవల్లభాచార్యులు. వీరి జన్మదినము వి.సం. 1535 (1479 A.D.) వైశాఖ బహుళ ఏకాదశి.

ఆచార్యులవారు పుట్టిన సమయానికి గోవర్ధన పర్వతముపై శ్రీకృష్ణుని నల్లని ముఖారవిందము ఒక పశులకాపరికి కనిపించినట్లు చెప్పుకుంటూ ఉండేవారని ఆచార్యులువారు గోవర్ధనగిరికి వెళ్ళినపుడు తెలిసింది. భగవంతుని ముఖము నందు అగ్ని కలదు. (అగ్నిర్ముఖం, రుద్రః శిఖాల (శ్రుతి) జమ్మి చెట్టుతొఱ్ఱలో నున్న శిశువు- మంటలచే రక్షింపబడ్డాడు. శ్రీ వల్లభాచార్యులు అగ్నిదేవుని అంశావతారులని చెప్పబడానికి ఇవి నిదర్శ నములుగా చెపుతారు. ఆచార్యులవారు జన్మించిన కొద్ది దినములలోనే

మహమ్మదీయులు కాశీపై దండెత్తకుండా వెనుకకు తిరిగి పోయారన్న వార్త తెలిసింది. ఈ వార్త వినిన వెంటనే శ్రీలక్ష్మణభట్టు గారు కాశీకి తిరిగి వచ్చి చేరారు.

**బాల్యము - విద్య :**

ఆచార్యులవారు పుట్టినప్పటి నుంచి ఎంతో జ్ఞానవంతులుగా ఉండే వారు. వారికి ఆరవ ఏట అక్షరాభ్యాసము, తొమ్మిదవ ఏట ఉపనయనము చేసారు. వెంటనే వారు విద్యాభ్యాసము మొదలుపెట్టారు. వారికి పదకొండవ ఏడు వచ్చేసరికి సకల శాస్త్రపారంగతులయ్యారు. చిన్నతనములోనే వారు వివిధ సిద్ధాంతములలోగల భేదములను చక్కగా గ్రహించారు. ప్రస్థాన త్రయము (బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత)తో సహా శ్రీమద్భాగవతప్రాతిపదికపై వారు తమ శుద్ధాద్వైత సిద్ధాంతమును, పుష్టి మార్గభక్తిని బోధించారు.

**దిగ్విజయయాత్ర :**

ఆచార్యులవారు తమ పదకొండవ ఏటనే దివ్యక్షేత్ర సందర్శనార్థము తమ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో వారి తండ్రి శ్రీలక్ష్మణభట్టు గారు కూడా వారితో బయలు దేరారు. ఆచార్యులవారు ఇట్టి యాత్రలు ముమ్మారు చేసారు. ఇవే వారి దిగ్విజయ యాత్రలు కూడా. ఆ రోజులలో దేశము అన్ని ప్రాంతములలో శ్రీ ఆదిగురువు శంకరాచార్యులవారి మాయా వాదముతో కూడిన కేవల- అద్వైతసిద్ధాంతము ప్రచారములో ఉండేది. శ్రీరామానుజులవారి విశిష్టాద్వైతము, శ్రీమధ్వాచార్యులవారి ద్వైతమతము కూడ దక్షిణాదిని ఎక్కువ ప్రాచుర్యము కలిగి ఉండేవి. ఆచార్యులవారి మొదటి యాత్రలో జగన్నాథపురి (పూరి)లో శంకర అద్వైతమతానుయాయు లకు శ్రీవల్లభాచార్యులకు పూరీ రాజు గారిసభలో సిద్ధాంత చర్చలు జరిగాయి. అందులో ఆచార్యులవారు బ్రహ్మతత్త్వ వాదమును సునిశిత భాషలో ప్రతిపాదించి తమ వాదనను నిర్ధారణ చేసారు. కాని అద్వైతవాదులు యీ బాలుని సిద్ధాంతము నంగీకరించ నిరాకరించారు. అప్పుడు రాజుగారు



తమ నాలుగుప్రశ్నలకు ఏ పండితు లిచ్చిన సమాధానము శ్రీజగన్నాథస్వామి అంగీకరిస్తారో వారు జయించినట్లని ప్రకటించారు. ఆ ప్రశ్నలేవనగా

1) అన్ని శాస్త్రములలోను ముఖ్యమైన శాస్త్రము ఏది ?

2) అందరు దేవతలలోను ముఖ్యమైన దేవుడు ఎవరు ?

3) అన్ని మంత్రములలో ఫలప్రదానమైన మంత్రము ఏది ?

4) చేయవలసిన కర్మలన్నిటిలో సుళువైన కర్మ ఏది ?

ఈ ప్రశ్నలకు అందరు ఇచ్చిన సమాధానములు, ఒక తాళపత్రము ఒక ఘంటము ఒకనాటి రాత్రి దేవుని సన్నిధిలో ఉంచారు. మరుచటిరోజు ఉదయము తలుపులు తెరువగా, ఆచార్యులువారు వ్రాసిన యీ క్రింది సమాధానము సరియైనదని ఆ పత్రముపై వ్రాసి యున్నది. ఆచార్యుల వారిచ్చిన సమాధానము ఇది.

1) ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం

2) ఏకో దేవో దేవకీపుత్ర ఏవ.

3) మంత్రోఽప్యేకస్తస్య నామాని యాని

4) కర్మాఽప్యేకో తస్యదేవస్య సేవ.

పండితులందరు భగవంతుని యీ ఆదేశమును శిరసావహించారు. ఇది వారి శుద్ధాద్వైతసిద్ధాంతమునకు మొదటి విజయము.

ఈ యాత్ర జరుగుతూ ఉండగా వి.సం. 1546 (1491 A.D.)లో శ్రీ లక్ష్మణభట్టుగారు పరమపదించారు. అయినా ఆచార్యులవారు ఈ యాత్ర ముందుకు జరుపుతూ బుందేల్‌ఖండ్ రాజ్యములో ఓర్చానగరము చేరారు. అక్కడ ఉద్దండ పండితుడు, సరస్వతీదేవి ఉపాసకుడు, అయిన ఒక తాంత్రికవేత్తతో శాస్త్రచర్చ చేసి అతనిని ఓడించారు. ఆ సందర్భముగా ఓర్చా రాజుగారు ఆచార్యులవారిని సత్కరించి, కనకాభిషేకము చేసారు. ఆ తరువాత వారు శ్రీకృష్ణుని జన్మస్థలమైన మథురానగరమునకు, బాల్య పౌగండ లీలలు జరిపిన వ్రజదేశమునకు వచ్చి శ్రీకృష్ణుని దర్శించుకొన్నారు.

వ్రజభూమిలో వారు యమునా తీరమునగల ఠాకురాణీఘాట్ అనే చోట నివాసమేర్పరుచుకొని, కొన్నాళ్ళక్కడ ఉన్నారు. అక్కడ ఉన్నన్నాళ్లు, నిత్యము, శ్రీమద్భాగవతపారాయణము, ప్రవచనములు చేసేవారు. వారు వ్రజ ప్రదేశములో ఉండగా, వి.స.1550 (1494A.D.)లో శ్రావణశుద్ధ ఏకాదశినాడు అర్ధరాత్రి సమయములో గోవర్ధననాథుడైన శ్రీకృష్ణుడు ఆచార్యులవారిని అనుగ్రహించి, స్వయముగా బ్రహ్మసంబంధదీక్షను ఇచ్చారు. ఈ బ్రహ్మ సంబంధదీక్ష గురించి ఆచార్యులవారు "సిద్ధాంత రహస్యము" అనే గ్రంథములో వివరించారు. బ్రహ్మసంబంధ దీక్ష అంటే భక్తుడైన జీవి తనవి అనుకొన్న అన్ని సాంసారిక సంపదలను, తన భార్యా బిడ్డలను, తన దేహేంద్రియములను అంతఃకరణముతో సహా శ్రీకృష్ణునికి సమర్పించి శ్రీకృష్ణుని శరణు పొందుట. భగవానుడు ప్రభువు, తాను సేవకుడిననే సంపూర్ణ భావముతో తాను పొందిన మంత్రోపదేశమును అనుసంధానము చేస్తూ త్రికరణ శుద్ధిగా భగవత్సేవకు అంకితమగుట. ఇది పుష్టిభక్తిమార్గ సేవారూపము.

ఆ తరువాత కొద్ది రోజులలో తిరిగి తమ యాత్ర కొనసాగిస్తూ దక్షిణదేశములో నున్న విజయనగరసామ్రాజ్య రాజధాని చేరి, అక్కడ ఉన్న అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతమత సిద్ధాంతులతో చర్చలు జరిపారు. ఆ చర్చలలో ప్రస్థానత్రయమే కాక భాగవతము కూడా భక్తి శాస్త్రమని, ప్రమాణ గ్రంథమని దృఢీకరించారు. ఈ నాలుగు గ్రంథములు ప్రమాణముగా తీసుకొని తమ బ్రహ్మవాదమును, శుద్ధాద్వైతసిద్ధాంతమును పుష్టిభక్తిమార్గమును నిర్ధారించారు. పండితులు ఎవ్వరూ ఆచార్యులవారి సిద్ధాంతమును కాదన లేకపోయారు. రాజుగారు ఆచార్యుల వారికి "అఖండ భూమండాలాచార్య" లని బిరుదునిచ్చి కనకాభిషేకము చేసారు. హంపీలో కొన్నాళ్ళుండి ఆచార్యులవారు తిరిగి పుణ్యక్షేత్రముల యాత్రచేస్తూ జార్ఖండ్ ప్రాంతములో నుండగా గోవర్ధనగిరిపై నున్న భగవానుని ముఖారవింద స్వరూపమునకు ప్రతిష్ఠ చేసి మందిరము కట్టించమని స్వప్నములో భగవదాజ్ఞ అయినది. ఈ స్వరూపమే ఆచార్యులవారు పుట్టినపుడు స్వయంభువుగా వెలిసిన శ్రీకృష్ణముఖారవిందము. ఆచార్యులవారు వెంటనే గోవర్ధనగిరి చేరి, గోవర్ధన



నాథునికి ఒక చిన్నమందిరము నిర్మించారు. తరువాత కొంతకాలము వరకు ఆ కొండ క్రింద నున్న అన్యోర్ గ్రామములో నివసిస్తూ గోవర్ధననాథుని సేవ చేసేవారు. వీరి యాత్రలు అంతటితో ఆగలేదు. తిరిగి యాత్ర కొనసాగిస్తూ వారు పండరిపురి చేరుకొన్నారు. విఠ్ఠలదేవుని సేవించారు. అక్కడ ఉండగా, విఠ్ఠలనాథుడు ఆచార్యుల వారిని వివాహము చేసుకోమని (స్వప్నములో) ఆజ్ఞాపించారు.

**వివాహము - కాశీనివాసము - విశేషములు :**

ఆ ఆజ్ఞ శిరసావహించి వారు కాశీ తిరిగివచ్చి శ్రీమధుమంగళము అనే బ్రాహ్మణుని కుమార్తె మహాలక్ష్మిని వి.సం.1568 (1512A.D.)లో వివాహము చేసుకొన్నారు. వీరికి శ్రీగోపీనాథులు, శ్రీవిఠ్ఠలనాథులు అన్న ఇద్దరు పుత్రులు కలిగారు వారు మహాపండితులు. శ్రీ విఠ్ఠలనాథులు ఆచార్యులవారి పుష్టిమతమును రాజస్థాన్ గుజరాత్‌లలో ప్రచారము చేసారు. శుద్ధాద్వైతము, పుష్టిభక్తిమార్గములపై అనేక గ్రంథములు రచించారు.

వివాహానంతరము శ్రీఆచార్యులువారు కాశీలో ఉండి పండిత చర్చలు చేస్తూ అనేక రచనలు చేసారు. వీరు పండితులతో చేసిన చర్చల సారాంశమును "పత్రావలంబన" అనే పేరుతో ఎప్పటికప్పుడు అందరు చదువుకొనుటకు వీలుగా శ్రీకాశీవిశ్వేశ్వరుని మందిరము గోడలపై అంటించేవారు.

**ఆచార్యులవారు రచించిన గ్రంథములు :**

శ్రీఆచార్యులవారు బ్రహ్మసూత్రములకు, ఉపనిషత్తులకు భగవద్గీతకు శుద్ధాద్వైతసిద్ధాంతానుసారము భాష్యములు వ్రాసారు. అనేక స్వతంత్ర గ్రంథములు వ్రాసారు. శ్రీమద్భాగవతమునకు సంబంధించి శ్రీమద్భాగవతార్థ ప్రకరణము "తత్వార్థదీపనిబందన", శ్రీ మద్భాగవత ప్రథమ, ద్వితీయ, తృతీయ, దశమ స్కంధములకు విస్తృతముగా వ్రాసిన "శ్రీ సుబోధినీ" భాష్యము, షోడశ గ్రంథములు ముఖ్యమైనవి- ఆచార్యులవారు తమనాశ్రయించిన శిష్యుల భక్తి దృఢపడుటకు షోడశగ్రంథములు వ్రాసారు. ఇవన్నీ సంస్కృత గ్రంథములు. ఆచార్యులవారి గ్రంథములకు వారి

తరువాతవారు ఎన్నో భాష్యములు వ్రాసారు. ఆచార్యుల వారు తెలుగులో ఒక గ్రంథము వ్రాసినట్లు చెపుతారు కాని ఆగ్రంథము ఇంకా సంపాదించ వలసి ఉంది.

## శుద్ధాద్వైత సిద్ధాంతము - పుష్టిమార్గము :

(శ్రీవల్లభాచార్యులవారు నిరూపణ చేసిన శుద్ధాద్వైత సిద్ధాంత సంబంధిత చర్చ ఈ చిన్న వ్యాసములో పొందుపరచుట కష్టము. కనుక అట్టి ప్రయత్నము చేయలేదు. కాని ఆ సిద్ధాంతమును అవగాహన చేసుకొనుటకు అవసరమైన కీలకాంశములు ఈ క్రింద చెప్పబడ్డాయి.)

సర్వము పరబ్రహ్మము. బ్రహ్మము కంటె వేరేమీ లేదు. బ్రహ్మము తనలో నుండి విశ్వమునంతటిని సృష్టించాడు. దానంతటిలోను బయట తానేనిండి ఉన్నాడు. ఇతరుల అవసరము (అపేక్ష) లేకుండా తనలోనుండి అన్నిస్థావర జంగమములతో కూడిన త్రిగుణాత్మకమైన ఈ జగత్‌ను సృష్టించుటకు కారణము, కర్త, ఆ పరబ్రహ్మమే. అతడే కార్యరూపమైన ఈ జగత్ కూడ. సృష్ట్యాదికాలము నుండి ప్రాకృతప్రళయము వరకు ఈ పరబ్రహ్మమే సచ్చిదానందస్వరూపుడై జగత్‌లోని అన్ని కార్యములు తన లీలలగా ప్రకటింపజేస్తాడు.

శ్రీమద్భగవద్గీత (15 అ॥ 18, 19, 20 శ్లో॥)లో యీ సచ్చిదానంద స్వరూపము క్షర, అక్షర, ఉత్తమ పురుషులుగా చెప్పబడ్డాయి. ఈ పాంచభౌతిక రూపములో నున్న జగత్ (ఆధిభౌతిక రూపము) క్షరము- ఇది సత్ స్వరూపము. పురుషసూక్తములోని మంత్రములు, శ్రీమద్భాగవతము ఈ జగత్ పరబ్రహ్మము యొక్క "సత్" స్వరూపము అని తేటతెల్లము చేస్తాయి. చిత్ అనగా స్వప్రకాశము, జ్ఞానము. ఇది అక్షర స్వరూపము. (ఆధ్యాత్మిక రూపము) ఇది 'సత్' నుండి వేరు చేయలేనిదిగా ఉంటుంది. ఈ సత్, చిత్‌ల కంటె వేరుగా ఉండి, ఈ జగత్‌కు సత్ చిత్ లక్షణములు సమ



కూర్చేది ఉత్తమ పురుషుడు అని చెప్పబడే ఆనందస్వరూపము (ఆధి దైవికము).

"శ్రీకృష్ణః, సచ్చిదానందః నిత్యలీలావినోదకృత్ । సర్వాగమ వినోదీ చ లక్ష్మీశః పురుషోత్తమః (శ్రీపురుషోత్తమనామసహస్రము - శ్లో॥ 9; 1-6 నామములు). ఈ నామముల అర్థము పరబ్రహ్మము గురించి తెలుపుతాయి. 'శ్రీకృష్ణః' పరబ్రహ్మ వాచ్యము. అతడే పురుషోత్తముడు. సచ్చిదానంద స్వరూపుడై ఈ జగత్‌లో నిత్యము లీలలు చేస్తూ ఉంటాడు. వేదములు ఈ భగవానుని గురించి తెలుపుతాయి. (ప్రేరణ చేస్తాయి). ఐశ్వర్యాదిషడ్గుణములు ఆతని అవతారలీలలో ప్రదర్శిస్తూ ఉంటాడు. (లక్ష్మీశః). భూమి క్లేశములు తీర్చమని చతుర్ముఖబ్రహ్మ పురుషసూక్త విధానముగా పరబ్రహ్మమును స్తుతిస్తాడు. అప్పుడతనికి శ్రీకృష్ణావతారము గురించి ఆకాశవాణి వినిపిస్తుంది. ఈ నిరాకారబ్రహ్మమే, శ్రీకృష్ణాది అవతారముల సమయములో భక్తోద్ధరణకొరకు ఐశ్వర్యాది భగలక్షణములతో మనకు దర్శనమిచ్చే సాకారబ్రహ్మము.

ఈ రెండువిధములా వర్ణింపబడే పరబ్రహ్మము ఒక్కడే. శ్రీ శంకరుల అద్వైతసిద్ధాంతములో పరబ్రహ్మ మొక్కటే సత్ అని మిగిలినవన్నీ 'అసత్' అని నిర్వచనము చేస్తుంది. మాయ ఆ 'సత్'ను ఆవరించి ఉండుట వలన ఆ ఆసత్ స్వరూప బ్రహ్మమును గోచరింపజేయదు. మిథ్య (అసత్) అయిన జగత్‌ను నిజమైనది అనునట్లు భ్రమకలిగించేది కూడా యీ మాయయే అని శంకరులు వివరించారు. శ్రీవల్లభాచార్యుల వారు యీ మాయా వాదాన్ని అంగీకరించలేదు. ఉపనిషద్ వాక్యములు యీ జగత్ అంతా పరబ్రహ్మస్వరూపమేనని ఘోషిస్తూ ఉంటే పరబ్రహ్మ స్వరూపము తెలుసు కొనుటకు మాయావాదము అవసరములేదని, దానిని తిరస్కరించారు. శ్రీవల్లభాచార్యుల సిద్ధాంతములో (శుద్ధాద్వైత సిద్ధాంతములో) మాయ అంటే యోగమాయ ఈ యోగమాయ భగవానుని ఆజ్ఞను నిత్యము కార్య రూపములో ఆచరించే శక్తి స్వరూపిణి. శ్రీకృష్ణావతారములో భగవానుడు

యోగమాయను ఆజ్ఞాపించాడు (భాగ 10-2-(9-12). ఈ విధముగా సాకార నిరాకార బ్రహ్మములుగా చెప్పబడే రెండు స్వరూపములు ఒకే పరబ్రహ్మము.

జీవుడు అంశ. బ్రహ్మము సర్వేసర్వత్ర వ్యాపించిఉన్న అవిచ్ఛిన్న అంశ. త్రిగుణాత్మక సృష్టిలో అహంకార మమకారములకు లోనై జీవుడు తాను భగవంతుని అంశ అన్న జ్ఞానము లేకుండా సంసార బంధములలో చిక్కుకొని ఉంటాడు. కర్మమార్గము వలన కోరికలు తీరుతాయి. జ్ఞాన మార్గము వలన సంసారమందలి విషయలోలత దుఃఖముపోయి ముక్తి కలుగుతుంది. కాని "రసోవైసః" అనే బ్రహ్మానందము, భగవత్ప్రాప్తి భక్తి వలననే కలుగుతుంది. ఇది అనుభవము వలన తెలియబడుతుంది. ఈ ఆనందము తర్కము, జ్ఞానమునకు అతీతము. ఈ విధముగా సర్వప్రమాణ సమ్మతమై జ్ఞానము కలిగించి భక్తిని వృద్ధిపొందించే శుద్ధాద్వైత సిద్ధాంతము శ్రీవల్లభాచార్యుల వారిచే నిర్ధారించబడింది.

**పుష్టిభక్తిమార్గము :**

పుష్టి అనగా అనుగ్రహము. పోషణము. భగవదనుగ్రహముచే జీవుడు జ్ఞానసహిత భక్తిని పొంది, దానిని వృద్ధి చేసుకొని, ఆ దృఢమైన భక్తితో "రసోవైసః" అనే ఆనందానుభూతి పొందుతాడు. "ప్రేమభక్తి" భగవత్స్వరూపమైన భాగవత పఠన, కీర్తన, స్మరణముల వలన కలుగుతుంది. జ్ఞానులు, భక్తులు (శుకమహాముని, సనకాదులు, నారదుడు, ఇంకా ఎందరో భగవద్భక్తులు) కూడా ఈ భగవత్కథాపఠన, కీర్తన, స్మరణములు నిత్యము చేస్తూ ఉంటారు అందువలన భక్తి సాధనరూపమే కాకుండా భగవత్ప్రాప్తి, ఆనందము అనే ఫలరూపమై ఉంటుంది. భక్తుడు ఈ ఫలప్రాప్తి పొందుటకు సంన్యసించనక్కర లేదు. పుష్టిమార్గములో గురువు "బ్రహ్మసంబంధదీక్ష"ను ఉపదేసిస్తారు. ప్రజాధిపతి శ్రీ కృష్ణుడేభగవానుడు, పూజ్యుడు. బ్రహ్మ-సంబంధదీక్ష తీసుకొన్న భక్తులు తమ సర్వస్వము - ప్రాపంచక సంపత్తులు, భార్యా బిడ్డలు, తమ దేహములు, ఇంద్రియములు, అంతఃకరణముతో



సహా- శ్రీ భగవానునికి సమర్పించి, ఇవన్నీ భగవానునివే కాని తనవి కావు అన్న భావముతో ఉంటారు. భగవంతునికి నైవేద్యము చేయని ఏ వస్తువును స్వీకరించరు. భగవంతుడు ప్రభువు, తాను సేవకుడు. తనవనుకొనేవి భగవంతునివే కాని తనవి కావు- భగవంతుని సర్వవిధములా సేవించాలి. జ్ఞానయుక్త భావనతో నిర్మలమైన అంతఃకరణముతో (కథాపఠన, కీర్తన, స్మరణములతో సహా) ఎల్లవేళల భగవత్సేవ చేయగా, భక్తి క్రమముగా వృద్ధి చెంది మనస్సు భగవంతుని యందు నిలుస్తుంది. శ్రీవల్లభాచార్యులు భక్తికి మూడుసోపానములు (మెట్లు) ఉన్నాయని చెప్పారు. భగవంతుని యందు భక్తునికి ప్రేమభక్తి కలుగగా అతనిలో బీజభావభక్తి మొలకెత్తుతుంది. ఇది ఒకటవ మెట్టు. భగవంతునినే (భగవత్సేవయే) కోరుకుంటూ భగవంతునియందు ఆసక్తికలిగి ఉండుట రెండవ మెట్టు. "భగవంతుడే కాని ఇంకేమీ అక్కరలేదు" అని ఉండుట వ్యసనము అనే మూడవమెట్టు. భక్తి ఫలస్వరూపమని చెప్పడానికి ఆచార్యుల వారు ఒక మంచి ఉదాహరణము చెప్పారు. భగవంతుడనే వృక్షమును ఆధారముగా చేసుకొని అల్లుకొని పోయే లత "భక్తి". బీజభావభక్తి భగవంతు డనే చెట్టు వద్ద అంకురించుట, భగవంతుని యందు భక్తునికి ప్రేమ-భక్తి కలుగుట. వృక్షమును విడువకుండా పెరిగి దానిని చుట్టుకొని ఉండుట ఆసక్తి. లత పూర్తిగా పెరిగి చెట్టు నంతటా కప్పివేసి, చెట్టు యొక్క ఆకులు, పువ్వులు ఫలములు- లత యొక్క ఆకులు, పువ్వులు, ఫలములు, వేరు చేయలేని విధముగా ఉండుట భగవద్వ్యసనము. ఇట్టి భక్తిలత ఉదాహరణ పుష్టిభక్తి ఫలసిద్ధిని తెలుపుతుంది.

**సంన్యాసము :**

ఆచార్యులవారు ప్రయాగ దగ్గర అడేల్ గ్రామములో ఉండగా ఆచార్యుల వారిని గోలోకమునకు తిరిగి రావలెనని భగవదాజ్ఞ అయినది. ఇట్టి ఆజ్ఞలు ఆచార్యులవారింతకుముందు రెండుసార్లు పొందినా, తనచే

భగవంతుడు చేయించే కార్యము (శ్రీభాగవత సుబోధినీ రచన పూర్తికానందున) ఆ ఆజ్ఞలు పాటించలేకపోయారు. ఈ మూడవ ఆజ్ఞను ఆచార్యుల వారు శిరసావహించి ప్రయాగలోనున్న శ్రీనారాయణేంద్రతీర్థుల వద్ద సంన్యాసాశ్రమము తీసుకొన్నారు. సంన్యాసాశ్రమము తీసుకొన్న తరువాత సుమారు నలభై రోజులలో వి.సం. 1587 (1531 A.D.)లో జ్యేష్ఠ బహుళ పాడ్యమినాడు కాశీలో హనుమాన్‌ఘాట్‌లో జలసమాధి చేసారు.

అగ్నిదేవుల అంశావతారులైన శ్రీ వల్లభాచార్యులవారు కలికాలములో సులభముగా ఆచరణ యోగ్యమైన పుష్టిభక్తి మార్గమును లోకకల్యాణార్థము స్థాపించారు. ఈ పుష్టిమార్గభక్తి రాజస్థాన్, గుజరాత్ ప్రాంతములలో ఎంతో ఆదరణపొంది, వ్యాప్తిచెంది ఆచరణలో నున్నది.

ఓం తత్సత్ ।

---

ఆధారము :

**"Fleeting Glimpses into Vallabha's Philosophy" -**

by *Dr. P. Krishna Kumar,* Published by Sri Vakpati Foundation (1994).



శ్రీకృష్ణాయ నమః ।

శ్రీగోపీజనవల్లభాయ నమః ।

శ్రీమదాచార్యచరణకమలేభ్యో నమః ।

# 'శ్రీ పురుషోత్తమనామసహస్రమ్'

## ( మూలము )

శ్రీకృష్ణాయ నమః ।
శ్రీగోపీజనవల్లభాయ నమః ।
శ్రీమదాచార్యచరణకమలేభ్యో నమః ।

# ‘శ్రీ పురుషోత్తమనామసహస్రమ్’

## ( మూలము )

పురాణపురుషో విష్ణుః పురుషోత్తమ ఉచ్యతే ।
నామ్నాం సహస్రం వక్ష్యామి తస్య భాగవతోద్ధృతమ్ ॥ 1

యస్య ప్రసాదాద్వాగీశాః ప్రజేశా విభవోన్నతాః ।
క్షుద్రా అపి భవంత్యాశు శ్రీకృష్ణం తం నతోస్మ్యహం ॥ 2

అనంతా ఏవ కృష్ణస్య లీలా నామప్రవర్తికాః ।
ఉక్తా భాగవతే గూఢాః ప్రకటా అపి కుత్రచిత్ ॥ 3

అతస్తాని ప్రవక్ష్యామి నామాని మురవైరిణః ।
సహస్రం యైస్తు పఠితైః పఠితం స్యాచ్ఛుకామృతం ॥ 4

కృష్ణనామసహస్రస్య ఋషిరగ్నిర్నిరూపితః ।
గాయత్రీ చ తథా ఛందో దేవతా పురుషోత్తమః ॥ 5

వినియోగః సమస్తేషు పురుషార్థేషు వై మతః ।
బీజం భక్తప్రియః శక్తిః సత్యవాగుచ్యతే హరిః ॥ 6

భక్తోద్ధరణయత్నస్తు మంత్రోఽత్ర పరమో మతః ।
అవతారితభక్తాంశః కీలకం పరికీర్తితమ్ ॥ 7

అస్త్రం సర్వసమర్థశ్చ గోవిందః కవచం మతమ్ ।
పురుషో ధ్యానమత్రోక్తః సిద్ధిః శరణసంస్మృతిః ॥ 8

శ్రీకృష్ణః సచ్చిదానందో నిత్యలీలావినోదకృత్ ।
సర్వాగమవినోదీ చ లక్ష్మీశః పురుషోత్తమః ॥ 9

ఆదికాలః సర్వకాలః కాలాత్మా మాయయావృతః ।
భక్తోద్ధారప్రయత్నాత్మా జగత్కర్తా జగన్మయః ॥ 10

నామలీలాపరో విష్ణుర్వ్యాసాత్మా శుకమోక్షదః ।
వ్యాపివైకుంఠదాతా చ శ్రీమద్భాగవతాగమః ॥ 11

శుకవాగమృతాబ్ధీందుః శౌనకాద్యఖిలేష్టదః ।
భక్తిప్రవర్తకస్త్రాతా వ్యాసచింతావినాశకః ॥ 12

సర్వసిద్ధాంతవాగాత్మా నారదాద్యఖిలేష్టదః ।
అంతరాత్మా ధ్యానగమ్యో భక్తిరత్నప్రదాయకః ॥ 13

ముక్తోపసృప్యః పూర్ణాత్మా ముక్తానాం రతివర్ధనః ।
భక్తకార్యైకనిరతో ద్రౌణ్యస్త్రవినివారకః ॥ 14

భక్తస్మయప్రణేతా చ భక్తవాక్పరిపాలకః ।
బ్రహ్మణ్యదేవో ధర్మాత్మా భక్తానాం చ పరీక్షకః ॥ 15

ఆసన్నహితకర్తా చ మాయాహితకరః ప్రభుః ।
ఉత్తరాప్రాణదాతా చ బ్రహ్మాస్త్రవినివారకః ॥ 16

సర్వతః పాండవపతిః పరీక్షిచ్ఛుద్ధికారణమ్ ।
గూఢాత్మా–సర్వవేదేషు భక్తైకహృదయంగమః ॥ 17

కుంతీస్తుత్యః ప్రసన్నాత్మా పరమాద్భుతకార్యకృత్ ।
భీష్మముక్తిప్రదః స్వామీ భక్తమోహనివారకః ॥ 18

సర్వావస్థాసు సంసేవ్యః సమః సుఖహితప్రదః ।
కృతకృత్యః సర్వసాక్షీ భక్తస్త్రీరతివర్ధనః ॥ 19

సర్వసౌభాగ్యనిలయః పరమాశ్చర్యరూపధృక్ ।
అనన్యపురుషస్వామీ ద్వారకాభాగ్యభాజనమ్ ॥ 20



బీజసంస్కారకర్తా చ పరీక్షిజ్జ్ఞానపోషకః ।
సర్వత్రపూర్ణగుణకః సర్వభూషణభూషితః ॥ 21

సర్వలక్షణదాతా చ ధృతరాష్ట్రవిముక్తిదః ।
సన్మార్గరక్షకో నిత్యం విదురప్రీతిపూరకః ॥ 22

లీలావ్యామోహకర్తా చ కాలధర్మప్రవర్తకః ।
పాండవానాం మోక్షదాతా పరీక్షిద్భాగ్యవర్ధనః ॥ 23

కలినిగ్రహకర్తా చ ధర్మాదీనాం చ పోషకః ।
సత్సంగజ్ఞానహేతుశ్చ శ్రీభాగవతకారణం ॥ 24

ప్రాకృతాదృష్టమార్గశ్చ శ్రోతవ్యః సకలాగమైః ।
కీర్తితవ్యః శుద్ధభావైః స్మర్తవ్యశ్చాత్మవిత్తమైః ॥ 25

అనేకమార్గకర్తా చ నానావిధగతిప్రదః ।
పురుషః సకలాధారః సత్త్వైకనిలయాత్మభూః ॥ 26

సర్వధ్యేయో యోగగమ్యో భక్త్యా గ్రాహ్యః సురప్రియః ।
జన్మాదిసార్థకకృతిర్లీలాకర్తా పతిః సతామ్ ॥ 27

ఆదికర్తా తత్త్వకర్తా సర్వకర్తా విశారదః ।
నానావతారకర్తా చ బ్రహ్మావిర్భావకారణమ్ ॥ 28

దశలీలావినోదీ చ నానాసృష్టిప్రవర్తకః ।
అనేకకల్పకర్తా చ సర్వదోషవివర్జితః ॥ 29

వైరాగ్యహేతుస్తీర్థాత్మా సర్వతీర్థఫలప్రదః ।
తీర్థశుద్ధైకనిలయః స్వమార్గపరిపోషకః ॥ 30

తీర్థకీర్తిర్భక్తగమ్యో భక్తానుశయకార్యకృత్ ।
భక్తతుల్యః సర్వతుల్యః స్వేచ్ఛాసర్వప్రవర్తకః ॥ 31

గుణాతీతోఽనవద్యాత్మా సర్గలీలాప్రవర్తకః ।
సాక్షాత్సర్వజగత్కర్తా మహదాదిప్రవర్తకః ॥ 32

మాయాప్రవర్తకః సాక్షీ మాయారతివివర్ధనః ।
ఆకాశాత్మా చతుర్మూర్తిశ్చతుర్ధా భూతభావనః ॥ 33

రజఃప్రవర్తకో బ్రహ్మా మరీచ్యాదిపితామహః ।
వేదకర్తా యజ్ఞకర్తా సర్వకర్తాఽమితాత్మకః ॥ 34

అనేకసృష్టికర్తా చ దశధాసృష్టికారకః ।
యజ్ఞాంగో యజ్ఞవారాహో భూధరో భూమిపాలకః ॥ 35

సేతుర్విధరణో జైత్రో హిరణ్యాక్షాంతకః సురః ।
దితికశ్యపకామైకహేతుసృష్టిప్రవర్తకః ॥ 36

దేవాభయప్రదాతా చ వైకుంఠాధిపతిర్మహాన్ ।
సర్వగర్వప్రహారీ చ సనకాద్యఖిలార్థదః ॥ 37

సర్వాశ్వాసనకర్తా చ భక్తతుల్యాహవప్రదః ।
కాలలక్షణహేతుశ్చ సర్వార్థజ్ఞాపకః పరః ॥ 38

భక్తోన్నతికరః సర్వప్రకారసుఖదాయకః ।
నానాయుద్ధప్రహరణో బ్రహ్మశాపవిమోచకః ॥ 39

పుష్టిసర్గప్రణేతా చ గుణసృష్టిప్రవర్తకః ।
కర్దమేష్టప్రదాతా చ దేవహూత్యఖిలార్థదః ॥ 40

శుక్లనారాయణః సత్యకాలధర్మప్రవర్తకః ।
జ్ఞానావతారః శాంతాత్మా కపిలః కాలనాశకః ॥ 41

త్రిగుణాధిపతిః సాంఖ్యశాస్త్రకర్తా విశారదః ।
సర్గదూషణహారీ చ పుష్టిమోక్షప్రవర్తకః ॥ 42



లౌకికానందదాతా చ బ్రహ్మానందప్రవర్తకః ।
భక్తిసిద్ధాంతవక్తా చ సగుణజ్ఞానదీపకః ॥ 43

ఆత్మప్రదః పూర్ణకామో యోగాత్మా యోగభావితః ।
జీవన్ముక్తిప్రదః శ్రీమానన్యభక్తిప్రవర్తకః ॥ 44

కాలసామర్థ్యదాతా చ కాలదోషనివారకః ।
గర్భోత్తమజ్ఞానదాతా కర్మమార్గనియామకః ॥ 45

సర్వమార్గనిరాకర్తా భక్తిమార్గైకపోషకః ।
సిద్ధిహేతుః సర్వహేతుః సర్వాశ్చర్యైకకారణమ్ ॥ 46

చేతనాచేతనపతిః సముద్రపరిపూజితః ।
సాంఖ్యాచార్యస్తుతః సిద్ధపూజితః సర్వపూజితః ॥ 47

విసర్గకర్తా సర్వేశః కోటిసూర్యసమప్రభః ।
అనంతగుణగంభీరో మహాపురుషపూజితః ॥ 48

అనంతసుఖదాతా చ బ్రహ్మకోటిప్రజాపతిః ।
సుధాకోటిస్వాస్థ్యహేతుః కామధుక్కోటికామదః ॥ 49

సముద్రకోటిగంభీరస్తీర్థకోటిసమాహ్వయః ।
సుమేరుకోటినిష్కంపః కోటిబ్రహ్మాండవిగ్రహః ॥ 50

కోట్యశ్వమేధపాపఘ్నో వాయుకోటిమహాబలః ।
కోటీందుజగదానందీ శివకోటిప్రసాదకృత్ ॥ 51

సర్వసద్గుణమాహాత్మ్యః సర్వసద్గుణభాజనమ్ ।
మన్వాదిప్రేరకో ధర్మో యజ్ఞనారాయణః పరః ॥ 52

ఆకూతిసూనుర్దేవేంద్రో రుచిజన్మాఽభయప్రదః ।
దక్షిణాపతిరోజస్వీ క్రియాశక్తిః పరాయణః ॥ 53

దత్తాత్రేయో యోగపతిర్యోగమార్గప్రవర్తకః ।
అనసూయాగర్భరత్నమృషివంశవివర్ధనః ॥ 54

గుణత్రయవిభాగజ్ఞశ్చతుర్వర్గవిశారదః ।
నారాయణో ధర్మసూనుర్మూర్తిపుణ్యయశస్కరః ॥ 55

సహస్రకవచచ్ఛేదీ తపఃసారో నరప్రియః ।
విశ్వానందప్రదః కర్మసాక్షీ భారతపూజితః ॥ 56

అనంతాద్భుతమాహాత్మ్యో బదరీస్థానభూషణమ్ ।
జితకామో జితక్రోధో జితసంగో జితేంద్రియః ॥ 57

ఉర్వశీప్రభవః స్వర్గసుఖదాయీ స్థితిప్రదః ।
అమానీ మానదో గోప్తా భగవచ్ఛాస్త్రబోధకః ॥ 58

బ్రహ్మాదివంద్యో హంసః శ్రీర్మాయావైభవకారణమ్ ।
వివిధానంతసర్గాత్మా విశ్వపూరణతత్పరః ॥ 59

యజ్ఞజీవనహేతుశ్చ యజ్ఞస్వామీష్టబోధకః ।
నానాసిద్ధాంతగమ్యశ్చ సప్తతంతుశ్చ షడ్గుణః ॥ 60

ప్రతిసర్గజగత్కర్తా నానాలీలావిశారదః ।
ధ్రువప్రియో ధ్రువస్వామీ చింతితాధికదాయకః ॥ 61

దుర్లభానంతఫలదో దయానిధిరమిత్రహా ।
అంగస్వామీ కృపాసారో వైన్యో భూమినియామకః ॥ 62

భూమిదోగ్ధా ప్రజాప్రాణపాలనైకపరాయణః ।
యశోదాతా జ్ఞానదాతా సర్వధర్మప్రదర్శకః ॥ 63

పురఞ్జనో జగన్మిత్రం విసర్గాంతప్రదర్శకః ।
ప్రచేతసాం పతిశ్చిత్రభక్తిహేతుర్జనార్దనః ॥ 64



స్మృతిహేతుర్బ్రహ్మభావసాయుజ్యాదిప్రదః శుభః ।
విజయీ స్థితిలీలాబ్ధిరచ్యుతో విజయప్రదః ॥ 65

స్వసామర్థ్యప్రదో భక్తకీర్తిహేతురధోక్షజః ।
ప్రియవ్రతప్రియస్వామీ స్వేచ్ఛావాదవిశారదః ॥ 66

సంగ్యగమ్యః స్వప్రకాశః సర్వసంగవివర్జితః ।
ఇచ్ఛాయాం చ సమర్యాదస్త్యాగమాత్రోపలంభనః ॥ 67

అచింత్యకార్యకర్తా చ తర్కాగోచరకార్యకృత్ ।
శృంగారరసమర్యాదా ఆగ్నీధ్రరసభాజనమ్ ॥ 68

నాభీష్టపూరకః కర్మమర్యాదాదర్శనోత్సుకః ।
సర్వరూపోఽద్భుతతమో మర్యాదాపురుషోత్తమః ॥ 69

సర్వరూపేషు సత్యాత్మా కాలసాక్షీ శశిప్రభః ।
మేరుదేవీవ్రతఫలమృషభో భగలక్షణః ॥ 70

జగత్సంతర్పకో మేఘరూపీ దేవేంద్రదర్పహా ।
జయన్తీపతిరత్యంతప్రమాణాశేషలౌకికః ॥ 71

శతధాన్యస్తభూతాత్మా శతానందో గుణప్రసూః ।
వైష్ణవోత్పాదనపరః సర్వధర్మోపదేశకః ॥ 72

పరహంసక్రియాగోప్తా యోగచర్యాప్రదర్శకః ।
చతుర్థాశ్రమనిర్ణేతా సదానందశరీరవాన్ ॥ 73

ప్రదర్శితాన్యధర్మశ్చ భరతస్వామ్యపారకృత్ ।
యథావత్కర్మకర్తా చ సంగానిష్టప్రదర్శకః ॥ 74

ఆవశ్యకపునర్జన్మకర్మమార్గప్రదర్శకః ।
యజ్ఞరూపమృగః శాన్తః సహిష్ణుః సత్పరాక్రమః ॥ 75

రహూగణగతిజ్ఞశ్చ రహూగణవిమోచకః ।
భవాటవీతత్త్వవక్తా బహిర్ముఖహితే రతః ॥ 76

గయస్వామీ స్థానవంశకర్తా స్థానవిభేదకృత్ ।
పురుషావయవో భూమివిశేషవినిరూపకః ॥ 77

జంబూద్వీపపతిర్మేరునాభిపద్మరుహాశ్రయః ।
నానావిభూతిలీలాఢ్యో గంగోత్పత్తినిదానకృత్ ॥ 78

గంగామాహాత్మ్యహేతుశ్చ గంగారూపోఽతిగూఢకృత్ ।
వైకుంఠదేహహేత్వంబుజన్మకృత్ సర్వపావనః ॥ 79

శివస్వామీ శివోపాస్యో గూఢః సంకర్షణాత్మకః ।
స్థానరక్షార్థమత్స్యాదిరూపః సర్వైకపూజితః ॥ 80

ఉపాస్యనానారూపాత్మా జ్యోతీరూపో గతిప్రదః ।
సూర్యనారాయణో వేదకాన్తిరుజ్జ్వలవేషధృక్ ॥ 81

హంసోఽన్తరిక్షగమనః సర్వప్రసవకారణమ్ ।
ఆనందకర్తా వసుదో బుధో వాక్పతిరుజ్జ్వలః ॥ 82

కాలాత్మా కాలకాలశ్చ కాలచ్ఛేదకృదుత్తమః ।
శిశుమారః సర్వమూర్తిరాధిదైవికరూపధృక్ ॥ 83

అనంతసుఖభోగాఢ్యో వివరైశ్వర్యభాజనమ్ ।
సంకర్షణో దైత్యపతిః సర్వాధారో బృహద్వపుః ॥ 84

అనంతనరకచ్ఛేదీ స్మృతిమాత్రార్తినాశనః ।
సర్వానుగ్రహకర్తా చ మర్యాదాభిన్నశాస్త్రకృత్ ॥ 85

కాలాంతకభయచ్ఛేదీ నామసామర్థ్యరూపధృక్ ।
ఉద్ధారానర్హగోప్తాత్మా నామాదిప్రేరకోత్తమః ॥ 86



అజామిలమహాదుష్టమోచకోఽఘవిమోచకః ।
ధర్మవక్తాఽక్లిష్టవక్తా విష్ణుధర్మస్వరూపధృక్ ॥ 87

సన్మార్గప్రేరకో ధర్తా త్యాగహేతురధోక్షజః ।
వైకుంఠపురనేతా చ దాససంవృద్ధికారకః ॥ 88

దక్షప్రసాదకృద్ధంసగుహ్యస్తుతివిభావనః ।
స్వాభిప్రాయప్రవక్తా చ ముక్తజీవప్రసూతికృత్ ॥ 89

నారదప్రేరణాత్మా చ హర్యశ్వబ్రహ్మభావనః ।
సుబలాశ్వహితో గూఢవాక్యార్థజ్ఞాపనక్షమః ॥ 90

గూఢార్థజ్ఞాపనః సర్వమోక్షానందప్రతిష్ఠితః ।
పుష్టిప్రరోహహేతుశ్చ దాసైకజ్ఞానహృద్గతః ॥ 91

శాంతికర్తా సుహితకృత్ స్త్రీప్రసూః సర్వకామధుక్ ।
పుష్టివంశప్రణేతా చ విశ్వరూపేష్టదేవతా ॥ 92

కవచాత్మా పాలనాత్మా చ వర్మోపచితికారణమ్ ।
విశ్వరూపశిరశ్ఛేదీ త్వాష్ట్రయజ్ఞవినాశకః ॥ 93

వృత్రస్వామీ వృత్రగమ్యో వృత్రవ్రతపరాయణః ।
వృత్రకీర్తిర్వృత్రమోక్షో మఘవత్ప్రాణరక్షకః ॥ 94

అశ్వమేధహవిర్భోక్తా దేవేంద్రామీవనాశకః ।
సంసారమోచకశ్చిత్రకేతుబోధనతత్పరః ॥ 95

మంత్రసిద్ధిః సిద్ధిహేతుః సుసిద్ధిఫలదాయకః ।
మహాదేవతిరస్కర్తా భక్త్యై పూర్వార్థనాశకః ॥ 96

దేవబ్రాహ్మణవిద్వేషవైముఖ్యజ్ఞాపకః శివః ।
ఆదిత్యో దైత్యరాజశ్చ మహత్పతిరచింత్యకృత్ ॥ 97

మరుతాం భేదకస్త్రాతా వ్రతాత్మా పుంప్రసూతికృత్ ।
కర్మాత్మా వాసనాత్మా చ ఊతిలీలాపరాయణః ॥ 98

సమదైత్యసురః స్వాత్మా వైషమ్యజ్ఞానసంశ్రయః ।
దేహాద్యుపాధిరహితః సర్వజ్ఞః సర్వహేతువిద్ ॥ 99

బ్రహ్మవాక్స్థాపనపరః స్వజన్మావధికార్యకృత్ ।
సదసద్వాసనాహేతుస్త్రిసత్యో భక్తమోచకః ॥ 100

హిరణ్యకశిపుద్వేషీ ప్రవిష్టాత్మాఽతిభీషణః ।
శాంతిజ్ఞానాదిహేతుశ్చ ప్రహ్లాదోత్పత్తికారణమ్ ॥ 101

దైత్యసిద్ధాంతసద్వక్తా తపఃసార ఉదారధీః ।
దైత్యహేతుప్రకటనో భక్తిచిహ్నప్రకాశకః ॥ 102

సద్ద్వేషహేతుః సద్ద్వేషవాసనాత్మా నిరంతరః ।
నైష్ఠుర్యసీమా ప్రహ్లాదవత్సలః సంగదోషహా ॥ 103

మహానుభావః సాకారః సర్వాకారః ప్రమాణభూః ।
స్తంభప్రసూతిర్నృహరిర్నృసింహో భీమవిక్రమః ॥ 104

వికటాస్యో లలజ్జిహ్వో నఖశస్త్రో జవోత్కటః ।
హిరణ్యకశిపుచ్ఛేదీ క్రూరదైత్యనివారకః ॥ 105

సింహాసనస్థః క్రోధాత్మా లక్ష్మీభయవివర్ధనః ।
బ్రహ్మాద్యత్యంతభయభూరపూర్వాచింత్యరూపధృక్ ॥ 106

భక్తైకశాంతహృదయో భక్తస్తుత్యః స్తుతిప్రియః ।
భక్తాంగలేహనోద్ధూతక్రోధపుంజః ప్రశాన్తధీః ॥ 107

స్మృతిమాత్రభయత్రాతా బ్రహ్మబుద్ధిప్రదాయకః ।
గోరూపధార్యమృతపాః శివకీర్తివివర్ధనః ॥ 108



ధర్మాత్మా సర్వకర్మాత్మా విశేషాత్మాశ్రమప్రభుః ।
సంసారమగ్నస్వోద్ధర్తా సన్మార్గాఖిలతత్త్వవాక్ ॥ 109

ఆచారాత్మా సదాచారః మన్వంతరవిభావనః ।
స్మృత్యాశేషాశుభహరో గజేంద్రస్మృతికారణం ॥ 110

జాతిస్మరణహేత్వైకపూజాభక్తిస్వరూపదః ।
యజ్ఞో భయాన్మనుత్రాతా విభుర్బ్రహ్మవ్రతాశ్రయః ॥ 111

సత్యసేనో దుష్టఘాతీ హరిర్గజవిమోచకః ।
వైకుంఠో లోకకర్తా చ అజితోఽమృతకారణం ॥ 112

ఉరుక్రమో భూమిహర్తా సార్వభౌమో బలిప్రియః ।
విభుః సర్వహితైకాత్మా విష్వక్సేనః శివప్రియః ॥ 113

ధర్మసేతుర్లోకధృతిః సుధామాంతరపాలకః ।
ఉపహర్తాయోగపతిర్బృహద్భానుః క్రియాపతిః ॥ 114

చతుర్దశప్రమాణాత్మా ధర్మో మన్వాదిబోధకః ।
లక్ష్మీభోగైకనిలయో దేవమంత్రప్రదాయకః ॥ 115

దైత్యవ్యామోహకః సాక్షాద్గరుడస్కంధసంశ్రయః ।
లీలామందరధారీ చ దైత్యవాసుకిపూజితః ॥ 116

సముద్రోన్మథనాయత్తోఽవిఘ్నకర్తా స్వవాక్యకృత్ ।
ఆదికూర్మః పవిత్రాత్మా మందరాఘర్షణోత్సుకః ॥ 117

శ్వాసైజదబ్ధివార్వీచిః కల్పాంతావధికార్యకృత్ ।
చతుర్దశమహారత్నో లక్ష్మీసౌభాగ్యవర్ధనః ॥ 118

ధన్వంతరిః సుధాహస్తో యజ్ఞభోక్తార్తినాశనః ।
ఆయుర్వేదప్రణేతాచ దేవదైత్యాఖిలార్చితః ॥ 119

బుద్ధివ్యామోహకో దేవకార్యసాధనతత్పరః ।
స్త్రీరూపో మాయయా వక్తా దైత్యాంతఃకరణప్రియః ॥ 120

పాయితామృతదేవాంశో యుద్ధహేతుస్మృతిప్రదః ।
సుమాలిమాలివధకృన్మాల్యవత్ప్రాణహారకః ॥ 121

కాలనేమిశిరశ్ఛేదీ దైత్యయజ్ఞవినాశకః ।
ఇంద్రసామర్థ్యదాతా చ దైత్యశేషస్థితిప్రియః ॥ 122

శివవ్యామోహకో మాయీ భృగుమంత్రస్వశక్తిదః ।
బలిజీవనకర్తా చ స్వర్గహేతుర్వ్రతార్చితః ॥ 123

అదిత్యానందకర్తా చ కశ్యపాదితిసంభవః ।
ఉపేంద్ర ఇంద్రావరజో వామనబ్రహ్మరూపధృక్ ॥ 124

బ్రహ్మాదిసేవితవపుర్యజ్ఞపావనతత్పరః ।
యాంచోపదేశకర్తా చ జ్ఞాపితాశేషసంస్థితిః ॥ 125

సత్యార్థప్రేరకః సర్వహర్తా గర్వవినాశకః ।
త్రివిక్రమస్త్రిలోకాత్మా విశ్వమూర్తిః పృథుశ్రవాః ॥ 126

పాశబద్ధబలిః సర్వదైత్యపక్షోపమర్దకః ।
సుతలస్థాపితబలిః స్వర్గాధికసుఖప్రదః ॥ 127

కర్మసంపూర్తికర్తా చ స్వర్గసంస్థాపితామరః ।
జ్ఞాతత్రివిధధర్మాత్మా మహామీనోఽబ్ధిసంశ్రయః ॥ 128

సత్యవ్రతప్రియో గోప్తా మత్స్యమూర్తిధృతశ్రుతిః ।
శృంగబద్ధధృతక్షోణిః సర్వార్థజ్ఞాపకో గురుః ॥ 129

ఈశసేవకలీలాత్మా సూర్యవంశప్రవర్తకః ।
సోమవంశోద్భవకరో మనుపుత్రగతిప్రదః ॥ 130



అంబరీషప్రియః సాధుర్దుర్వాసాగర్వనాశకః ।
బ్రహ్మశాపోపసంహర్తా భక్తకీర్తివివర్ధనః ॥ 131

ఇక్ష్వాకువంశజనకః సగరాద్యఖిలార్థదః ।
భాగీరథమహాయత్నో గంగాధౌతాంఘ్రిపంకజః ॥ 132

బ్రహ్మస్వామీ శివస్వామీ సగరాత్మజముక్తిదః ।
ఖట్వాంగమోక్షహేతుశ్చ రఘువంశవివర్ధనః ॥ 133

రఘునాథో రామచంద్రో రామభద్రో రఘుప్రియః ।
అనంతకీర్తిః పుణ్యాత్మా పుణ్యశ్లోకైకభాస్కరః ॥ 134

కోశలేంద్రః ప్రమాణాత్మా సేవ్యో దశరథాత్మజః ।
లక్ష్మణో భరతశ్చైవ శత్రుఘ్నో వ్యూహవిగ్రహః ॥ 135

విశ్వామిత్రప్రియో దాన్తస్తాడకావధమోక్షదః ।
వాయవ్యాస్త్రాబ్ధినిక్షిప్తమారీచశ్చ సుబాహుహా ॥ 136

వృషధ్వజధనుర్భంగప్రాప్తసీతామహోత్సవః ।
సీతాపతిర్భృగుపతిగర్వపర్వతనాశకః ॥ 137

అయోధ్యాస్థమహాభోగయుక్తలక్ష్మీవినోదవాన్ ।
కైకేయీవాక్యకర్తా చ పితృవాక్పరిపాలకః ॥ 138

వైరాగ్యబోధకోఽనన్యసాత్త్వికస్థానబోధకః ।
అహల్యాదుఃఖహారీ చ గుహస్వామీ సలక్ష్మణః ॥ 139

చిత్రకూటప్రియస్థానో దండకారణ్యపావనః ।
శరభంగసుతీక్ష్ణాదిపూజితోఽగస్త్యభాగ్యభూః ॥ 140

ఋషిసంప్రార్థితకృతిర్విరాధవధ పండితః ।
ఛిన్నశూర్పణఖానాసః ఖరదూషణఘాతకః ॥ 141

ఏకబాణహతానేకసహస్రబలరాక్షసః ।
మారీచఘాతీ నియతసీతాసంబంధశోభితః ॥ 142

సీతావియోగనాట్యశ్చ జటాయుర్వధమోక్షదః ।
శబరీపూజితో భక్తహనుమత్ప్రముఖావృతః ॥ 143

దుందుభ్యస్థిప్రహరణః సప్తతాలవిభేదనః ।
సుగ్రీవరాజ్యదో వాలీఘాతీ సాగరశోషణః ॥ 144

సేతుబంధనకర్తా చ విభీషణహితప్రదః ।
రావణాదిశిరశ్ఛేదీ రాక్షసాఘౌఘనాశకః ॥ 145

సీతాఽభయప్రదాతా చ పుష్పకాగమనోత్సుకః ।
అయోధ్యాపతిరత్యంతసర్వలోకసుఖప్రదః ॥ 146

మథురాపురనిర్మాతా సుకృతజ్ఞస్వరూపదః ।
జనకజ్ఞానగమ్యశ్చ ఐలాన్తప్రకటశ్రుతిః ॥ 147

హైహయాన్తకరో రామో దుష్టక్షత్రవినాశకః ।
సోమవంశహితైకాత్మా యదువంశవివర్ధనః ॥ 148

పరబ్రహ్మావతరణః కేశవః క్లేశనాశనః ।
భూమిభారావతరణో భక్తార్థాఖిలమానసః ॥ 149

సర్వభక్తనిరోధాత్మా లీలానంతనిరోధకృత్ ।
భూమిష్ఠపరమానందో దేవకీశుద్ధికారణమ్ ॥ 150

వసుదేవజ్ఞాననిష్ఠసమజీవనివారకః ।
సర్వవైరాగ్యకరణస్వలీలాధారశోధకః ॥ 151

మాయాజ్ఞాపనకర్తా చ శేషసంభారసంభృతిః ।
భక్తక్లేశపరిజ్ఞాతా తన్నివారణతత్పరః ॥ 152



ఆవిష్టవసుదేవాంశో దేవకీగర్భభూషణమ్ ।
పూర్ణతేజోమయః పూర్ణః కంసాధృష్యప్రతాపవాన్ ॥ 153

వివేకజ్ఞానదాతా చ బ్రహ్మాద్యఖిలసంస్తుతః ।
సత్యో జగత్కల్పతరుర్నానారూపవిమోహనః ॥ 154

భక్తిమార్గప్రతిష్ఠాతా విద్వన్మోహప్రవర్తకః ।
మూలకాలగుణద్రష్టా నయనానందభాజనమ్ ॥ 155

వసుదేవసుఖాబ్ధిశ్చ దేవకీనయనామృతమ్ ।
పితృమాతృస్తుతః పూర్వసర్వవృత్తాంతబోధకః ॥ 156

గోకులాగతిలీలాప్తవసుదేవకరస్థితిః ।
సర్వేశత్వప్రకటనో మాయావ్యత్యయకారకః ॥ 157

జ్ఞానమోహితదుష్టేశః ప్రపంచాస్మృతికారణమ్ ।
యశోదానందనో నందభాగ్యభూగోకులోత్సవః ॥ 158

నందప్రియో నందసూనుర్యశోదాయాః స్తనంధయః ।
పూతనాసుపయఃపాతా ముగ్ధభావాతిసుందరః ॥ 159

సుందరీహృదయానందో గోపీమంత్రాభిమంత్రితః ।
గోపాలాశ్చర్యరసకృత్ శకటాసురఖండనః ॥ 160

నందవ్రజజనానందీ నందభాగ్యమహోదయః ।
తృణావర్తవధోత్సాహో యశోదాజ్ఞానవిగ్రహః ॥ 161

బలభద్రప్రియః కృష్ణః సంకర్షణసహాయవాన్ ।
రామానుజో వాసుదేవో గోష్ఠాంగణగతిప్రియః ॥ 162

కింకిణీరవభావజ్ఞో వత్సపుచ్ఛావలంబనః ।
నవనీతప్రియో గోపీమోహసంసారనాశకః ॥ 163

గోపబాలకభావజ్ఞశ్చౌర్యవిద్యావిశారదః ।
మృత్స్నాభక్షణలీలాస్యమాహాత్మ్యజ్ఞానదాయకః ॥ 164

ధరాద్రోణప్రీతికర్తా దధిభాండవిభేదనః ।
దామోదరో భక్తవశ్యో యమలార్జునభంజనః ॥ 165

బృహద్వనమహాశ్చర్యో వృందావనగతిప్రియః ।
వత్సఘాతీ బాలకేలిర్బకాసురనిషూదనః ॥ 166

అరణ్యభోక్తాప్యథవా బాలలీలాపరాయణః ।
ప్రోత్సాహజనకశ్చైవమఘాసురనిషూదనః ॥ 167

వ్యాలమోక్షప్రదః పుష్టో బ్రహ్మమోహప్రవర్ధనః ।
అనంతమూర్తిః సర్వాత్మా జంగమస్థావరాకృతిః ॥ 168

బ్రహ్మమోహనకర్తా చ స్తుత్య ఆత్మా సదాప్రియః ।
పౌగండలీలాభిరతిర్గోచారణపరాయణః ॥ 169

వృందావనలతాగుల్మవృక్షరూపనిరూపకః ।
నాదబ్రహ్మప్రకటనో వయఃప్రతికృతిస్వనః ॥ 170

బర్హినృత్యానుకరణో గోపాలానుకృతిస్వనః ।
సదాచారప్రతిష్ఠాతా బలశ్రమనిరాకృతిః ॥ 171

తరుమూలకృతాశేషతల్పశాయీ సఖిస్తుతః ।
గోపాలసేవితపదః శ్రీలాలితపదాంబుజః ॥ 172

గోపసంప్రార్థితఫలదాననాశితధేనుకః ।
కాలీయఫణిమాణిక్యరంజితశ్రీపదాంబుజః ॥ 173

దృష్టిసంజీవితాశేషగోపగోగోపికాప్రియః ।
లీలాసంపీతదావాగ్నిః ప్రలంబవధపండితః ॥ 174



దావాగ్న్యావృతగోపాలదృష్ట్యాచ్ఛాదనవహ్నిపః ।
వర్షాశరద్విభూతిశ్రీర్గోపీకామప్రబోధకః ॥ 175

గోపీరత్నస్తుతాశేషవేణువాద్యవిశారదః ।
కాత్యాయనీవ్రతవ్యాజసర్వభావాశ్రితాంగనః ॥ 176

సత్సంగతిస్తుతివ్యాజస్తుతవృందావనాంఘ్రిపః ।
గోపక్షుచ్ఛాంతిసంవ్యాజవిప్రభార్యాప్రసాదకృత్ ॥ 177

హేతుప్రాప్తేంద్రయాగస్వకార్యగోసవబోధకః ।
శైలరూపకృతాశేషరసభోగసుఖావహః ॥ 178

లీలాగోవర్ధనోద్ధారపాలితస్వవ్రజప్రియః ।
గోపస్వచ్ఛందలీలార్థగర్గవాక్యార్థబోధకః ॥ 179

ఇంద్రధేనుస్తుతిప్రాప్తగోవిందేంద్రాభిధానవాన్ ।
వ్రతాదిధర్మసంసక్తనందక్లేశవినాశకః ॥ 180

నందాదిగోపమాత్రేష్టవైకుంఠగతిదాయకః ।
వేణువాదస్మరక్షోభమత్తగోపీవిముక్తిదః ॥ 181

సర్వభావప్రాప్తగోపీసుఖసంవర్ధనక్షమః ।
గోపీగర్వప్రణాశార్థతిరోధానసుఖప్రదః ॥ 182

కృష్ణభావవ్యాప్తవిశ్వగోపీభావితవేశధృక్ ।
రాధావిశేషసంభోగప్రాప్తదోషనివారకః ॥ 183

పరమప్రీతిసంగీతసర్వాద్భుతమహాగుణః ।
మానాపనోదనాక్రందగోపీదృష్టిమహోత్సవః ॥ 184

గోపికావ్యాప్తసర్వాంగః స్త్రీసంభాషావిశారదః ।
రాసోత్సవమహాసౌఖ్యగోపీసంభోగసాగరః ॥ 185

జలస్థలరతివ్యాప్తగోపీదృష్ట్యభిపూజితః ।
శాస్త్రానపేక్షకామైకముక్తిద్వారవివర్ధనః ॥ 186

సుదర్శనమహాసర్పగ్రస్తనందవిమోచకః ।
గీతమోహితగోపీధృక్శంఖచూడవినాశకః ॥ 187

గుణసంగీతసంతుష్టిర్గోపీసంసారవిస్మృతిః ।
అరిష్టమథనో దైత్యబుద్ధివ్యామోహకారకః ॥ 188

కేశీఘాతీ నారదేష్టో వ్యోమాసురవినాశకః ।
అక్రూరభక్తిసంరాద్ధపాదరేణుమహానిధిః ॥ 189

రథావరోహశుద్ధాత్మా గోపీమానసహారకః ।
హృదసందర్శితాశేషవైకుంతాక్రూరసంస్తుతః ॥ 190

మథురాగమనోత్సాహో మథురాభాగ్యభాజనమ్ ।
మథురానగరీశోభాదర్శనోత్సుకమానసః ॥ 191

దుష్టరంజకఘాతీ చ వాయకార్చితవిగ్రహః ।
వస్త్రమాలాసుశోభాంగః కుబ్జాలేపనభూషితః ॥ 192

కుబ్జాసురూపకర్తా చ కుబ్జారతివరప్రదః ।
ప్రసాదరూపసంతుష్టహరకోదండఖండనః ॥ 193

శకలాహతకంసాప్తధనూరక్షకసైనికః ।
జాగ్రత్స్వప్నభయవ్యాప్తమృత్యులక్షణబోధకః ॥ 194

మథురామల్ల ఓజస్వీ మల్లయుద్ధవిశారదః ।
సద్యః కువలయాపీడఘాతీ చాణూరమర్దనః ॥ 195

లీలాహతమహామల్లః శలతోశలఘాతకః ।
కంసాంతకో జితామిత్రో వసుదేవవిమోచకః ॥ 196



జ్ఞాతతత్త్వపితృజ్ఞానమోహనామృతవాఙ్మయః ।
ఉగ్రసేనప్రతిష్ఠాతా యాదవాధివినాశకః ॥ 197

నందాదిసాంత్వనకరో బ్రహ్మచర్యవ్రతే స్థితః ।
గురుశుశ్రూషణపరో విద్యాపారమితేశ్వరః ॥ 198

సాందీపనిమృతాపత్యదాతా కాలాంతకాదిజిత్ ।
గోకులాశ్వాసనపరో యశోదానందపోషకః ॥ 199

గోపికావిరహవ్యాజమనోగతిరతిప్రదః ।
సమోద్ధవభ్రమరవాక్ గోపికామోహనాశకః ॥ 200

కుబ్జారతిప్రదోఽక్రూరపవిత్రీకృతభూగృహః ।
పృథాదుఃఖప్రణేతా చ పాండవానాం సుఖప్రదః ॥ 201

జరాసంధసమానీతసైన్యఘాతీ విచారకః ।
యవనవ్యాప్తమథురాజనదత్తకుశస్థలిః ॥ 202

ద్వారకాద్భుతనిర్మాణవిస్మాపితసురాసురః ।
మనుష్యమాత్రభోగార్థభూమ్యానీతేంద్రవైభవః ॥ 203

యవనవ్యాప్తమథురానిర్గమానందవిగ్రహః ।
ముచుకుందమహాబోధయవనప్రాణదర్పహా ॥ 204

ముచుకుందస్తుతాశేషగుణకర్మమహోదయః ।
ఫలప్రదానసంతుష్టిర్జన్మాంతరితమోక్షదః ॥ 205

శివబ్రాహ్మణవాక్యాప్తజయభీతివిభావనః ।
ప్రవర్షణప్రార్థితాగ్నిదానపుణ్యమహోత్సవః ॥ 206

రుక్మిణీరమణః కామపితా ప్రద్యుమ్నభావనః ।
స్యమంతకమణివ్యాజప్రాప్తజాంబవతీపతిః ॥ 207

సత్యభామాప్రాణపతిః కాలిందీరతివర్ధనః ।
మిత్రవిందాపతిః సత్యాపతిర్వృషనిషూదనః ॥ 208

భద్రావాంఛితభర్తా చ లక్ష్మణావరణక్షమః ।
ఇంద్రాదిప్రార్థితవధనరకాసురసూదనః ॥ 209

మురారిః పీఠహంతా చ తామ్రాదిప్రాణహారకః ।
షోడశస్త్రీసహస్రేశః ఛత్రకుండలదానకృత్ ॥ 210

పారిజాతాపహరణో దేవేంద్రమదనాశకః ।
రుక్మిణీసమసర్వస్త్రీసాధ్యభోగరతిప్రదః ॥ 211

రుక్మిణీపరిహాసోక్తివాక్తిరోధానకారకః ।
పుత్రపౌత్రమహాభాగ్యగృహధర్మప్రవర్తకః ॥ 212

శంబరాన్తకసత్పుత్రవివాహహతరుక్మికః ।
ఉషాపహృతపౌత్రశ్రీర్బాణబాహునివారకః ॥ 213

శీతజ్వరభయవ్యాప్తజ్వరసంస్తుతషడ్గుణః ।
శంకరప్రతియోద్ధా చ ద్వంద్వయుద్ధవిశారదః ॥ 214

నృగపాపప్రభేత్తా చ బ్రహ్మస్వగుణదోషదృక్ ।
విష్ణుభక్తివిరోధైకబ్రహ్మస్వవినివారకః ॥ 215

బలభద్రాహితగుణో గోకులప్రీతిదాయకః ।
గోపీస్నేహైకనిలయో గోపీప్రాణస్థితిప్రదః ॥ 216

వాక్యాతిగామియమునాహలాకర్షణవైభవః ।
పౌండ్రకత్యాజితస్పర్ధః కాశీరాజవిభేదనః ॥ 217

కాశీనిదాహకరణః శివభస్మప్రదాయకః ।
ద్వివిదప్రాణఘాతీ చ కౌరవాఖర్వగర్వనుత్ ॥ 218



లాఙ్గలాకృష్టనగరీసంవిగ్నాఖిలనాగరః ।
ప్రపన్నాభయదః సాంబప్రాప్తసన్మానభాజనమ్ । 219

నారదాన్విష్టచరణో భక్తవిక్షేపనాశకః ।
సదాచారైకనిలయః సుధర్మాధ్యాసితాసనః ॥ 220

జరాసంధావరుద్ధేన విజ్ఞాపితనిజక్లమః ।
మంత్ర్యుద్ధవవాదివాక్యోక్తప్రకారైకపరాయణః ॥ 221

రాజసూయాదిమఖకృత్ సంప్రార్థితసహాయకృత్ ।
ఇంద్రప్రస్థప్రయాణార్థమహత్సంభారసంభృతిః ॥ 222

జరాసంధవధవ్యాజమోచితాశేషభూమిపః ।
సన్మార్గబోధకో యజ్ఞక్షితివారణతత్పరః ॥ 223

శిశుపాలహతివ్యాజజయశాపవిమోచకః ।
దుర్యోధనాభిమానాబ్ధిశోషబాణవృకోదరః ॥ 224

మహాదేవవరప్రాప్తపురశాల్వవినాశకః ।
దంతవక్త్రవధవ్యాజవిజయాఘౌఘనాశకః ॥ 225

విదూరథప్రాణహర్తా న్యస్తశస్త్రాస్త్రవిగ్రహః ।
ఉపధర్మవిలిప్తాంగసూతఘాతీ వరప్రదః ॥ 226

వల్వలప్రాణహరణపాలితర్షిశ్రుతిక్రియః ।
సర్వతీర్థాఘనాశార్థతీర్థయాత్రావిశారదః ॥ 227

జ్ఞానక్రియావిభేదేష్టఫలసాధనతత్పరః ।
సారథ్యాదిక్రియాకర్తా భక్తవశ్యత్వబోధకః ॥ 228

సుదామారంకభార్యార్థభూమ్యానీతేంద్రవైభవః ।
రవిగ్రహనిమిత్తాప్తకురుక్షేత్రైకపావనః ॥ 229

నృపగోపీసమస్తస్త్రీపావనార్థాఖిలక్రియః ।
ఋషిమార్గప్రతిష్ఠాతా వసుదేవమఖక్రియః ॥ 230

వసుదేవజ్ఞానదాతా దేవకీపుత్రదాయకః ।
అర్జునస్త్రీప్రదాతా చ బహులాశ్వస్వరూపదః ॥ 231

శ్రుతదేవేష్టదాతా చ సర్వశ్రుతినిరూపితః ।
మహాదేవాద్యతిశ్రేష్ఠో భక్తిలక్షణనిర్ణయః ॥ 232

వృకగ్రస్తశివత్రాతా నానావాక్యవిశారదః ।
నరగర్వవినాశార్థహృతబ్రాహ్మణబాలకః ॥ 233

లోకాలోకపరస్థానస్థితబాలకదాయకః ।
ద్వారకాస్థమహాభోగనానాస్త్రీరతివర్ధనః ॥ 234

మనస్తిరోధానకృతవ్యగ్రస్త్రీచిత్తభావితః ।
ముక్తిలీలావిహరణో మౌశలవ్యాజసంహృతిః ॥ 235

శ్రీభాగవతధర్మాదిబోధకో భక్తినీతికృత్ ।
ఉద్ధవజ్ఞానదాతా చ పంచవింశతిధా గురుః ॥ 236

ఆచారభక్తిముక్త్యాదివక్తా శబ్దోద్భవస్థితిః ।
హంసో ధర్మప్రవక్తా చ సనకాద్యుపదేశకృత్ ॥ 237

భక్తిసాధనవక్తా చ యోగసిద్ధిప్రదాయకః ।
నానావిభూతివక్తా చ శుద్ధధర్మావబోధకః ॥ 238

మార్గత్రయవిభేదాత్మా నానాశంకానివారకః ।
భిక్షుగీతాప్రవక్తా చ శుద్ధసాంఖ్యప్రవర్తకః ॥ 239

మనోగుణవిశేషాత్మా జ్ఞాపకోక్తపురూరవాః ।
పూజావిధిప్రవక్తా చ సర్వసిద్ధాన్తబోధకః ॥ 240



లఘుస్వమార్గవక్తా చ స్వస్థానగతిబోధకః ।
యాదవాఙ్గోపసంహర్తా సర్వాశ్చర్యగతిక్రియః ॥ 241

కాలధర్మవిభేదార్థవర్ణనాశనతత్పరః ।
బుద్ధో గుప్తార్థవక్తా చ నానాశాస్త్రవిధాయకః ॥ 242

నష్టధర్మమనుష్యాదిలక్షణజ్ఞాపనోత్సుకః ।
ఆశ్రయైకగతిజ్ఞాతా కల్కిః కలిమలాపహః ॥ 243

శాస్త్రవైరాగ్యసంబోధో నానాప్రలయబోధకః ।
విశేషతః శుకవ్యాజపరీక్షిజ్జ్ఞానబోధకః ॥ 244

శుకేష్టగతిరూపాత్మా పరీక్షిద్దేహమోక్షదః ।
శబ్దరూపో నాదరూపో వేదరూపో విభేదనః ॥ 245

వ్యాసః శాఖాప్రవక్తా చ పురాణార్థప్రవర్తకః ।
మార్కండేయప్రసన్నాత్మా వటపత్రపుటేశయః ॥ 246

మాయావ్యాప్తమహామోహదుఃఖశాన్తిప్రవర్తకః ।
మహాదేవస్వరూపశ్చ భక్తిదాతా కృపానిధిః ॥ 247

ఆదిత్యాంతర్గతః కాలః ద్వాదశాత్మా సుపూజితః ।
శ్రీభాగవతరూపశ్చ సర్వార్థఫలదాయకః ॥ 248

ఇతీదం కీర్తనీయస్య హరేర్నామసహస్రకమ్ ।
పంచసప్తతివిస్తీర్ణం పురాణాంతరభాషితమ్ ॥ 249

య ఏతత్ప్రాతరుత్థాయ శ్రద్ధావాన్ సుసమాహితః ।
జపేదర్థాహితమతిః స గోవిన్దపదం లభేత్ ॥ 250

సర్వధర్మవినిర్ముక్తః సర్వసాధనవర్జితః ।
ఏతద్ధారణమాత్రేణ కృష్ణస్య పదవీం వ్రజేత్ ॥ 251

హర్యావేశితచిత్తేన శ్రీభాగవతసాగరాత్ ।
సముద్ధృతాని నామాని చింతామణినిభాని హి ॥ 252

కంఠస్థితాన్యర్థదీప్త్యా బాధన్తేఽజ్ఞానజం తమః ।
భక్తిం శ్రీకృష్ణదేవస్య సాధయన్తి వినిశ్చితమ్ ॥ 253

కిం బహూక్తేన భగవాన్ నామభిః స్తుతషడ్గుణః ।
ఆత్మభావం నయత్యాశు భక్తిం చ కురుతే దృఢామ్ ॥ 254

యః కృష్ణభక్తిమిహ వాంఛతి సాధనౌఘై-
ర్నామాని భాసురయశాంసి జపేత్స నిత్యమ్ ।
తం వై హరిః స్వపురుషం కురుతేతి శీఘ్ర-
మాత్మార్పణం సమధిగచ్ఛతి భావతుష్టః ॥ 255

శ్రీకృష్ణ కృష్ణసఖ వృష్ణివృషావనిధ్రుక్-
రాజన్యవంశదహనానపవర్గవీర్య ।
గోవింద గోపవనితావ్రజభృత్యగీత
తీర్థశ్రవః శ్రవణమంగల పాహి భృత్యాన్ ॥ 256

శ్రీమద్వల్లభాచార్యసముద్ధృతం శ్రీపురుషోత్తమనామసహస్రమ్ ।



శ్రీగురుభ్యో నమః ।
శ్రీకృష్ణాయ నమః ।
శ్రీమదాచార్యచరణకమలేభ్యో నమః ।

# ‘శ్రీ పురుషోత్తమనామసహస్రమ్’

**శ్రీ రఘునాథకృత నామచంద్రికా వ్యాఖ్యకు తెలుగు అనువాదము**

**మంగళాచరణము :**

శ్లో॥ వ్రజస్త్రీవిప్రయోగాగ్నిశమనాయ య ఉత్థితః ।
దినాన్తేఽద్భుతజీమూతస్తచ్ఛాయాఽస్తు సదా మయి ॥

శ్లో॥ ఆచార్యచరణద్వంద్వం భక్తిజ్ఞానాబ్జభాస్కరమ్ ।
నమస్యామి మనఃకర్మవాగ్భిరస్తతమోపహమ్ ॥

శ్లో॥ యత్కృపాదృష్టివృష్టేన దైవదగ్ధోపి తత్క్షణాత్ ।
ప్రరోహతి నిజేచ్ఛాభిస్తం వన్దే కమపీశ్వరమ్ ॥

శ్రీమద్భాగవతము సకలవేదరూప కల్పవృక్షఫలమై జీవులకు జ్ఞాన సహిత భక్తిని ప్రసాదించే భక్తిశాస్త్రము. తక్కువ మాటలలో ఈ శాస్త్ర పరిజ్ఞానము కలిగించడంకోసం శ్రీమద్భాగవతములో వర్ణింపబడ్డ శ్రీకృష్ణ లీలావిలాసములు “శ్రీపురుషోత్తమనామసహస్రమ్” పేరుతో శ్రీమద్వల్లభాచార్యులవారు గ్రంథస్థము చేసారు.

వస్తునిర్దేశరూపముగా మంగళాచరణము చేస్తూ “పురాణపురుషో విష్ణుః ....” అని ప్రారంభించారు.

**పురాణపురుషో విష్ణుః పురుషోత్తమ ఉచ్యతే ।**
**నామ్నాం సహస్రం వక్ష్యామి తస్య భాగవతోద్ధృతమ్ ॥ 1**

తాత్పర్యము : ఎవరు పురాణపురుషుడో ఆయనే పురుషోత్తముడని చెప్పబడతాడు. భగవద్గీత, ఇతర పురాణములలో పురాణపురుషుడు, పురుషోత్త

ముదు పర్యాయవాచకములు. ఒకే అర్థము కలవి. ఈ మాటలతో ఆ శ్రీకృష్ణునే వర్ణించారు. శ్రీఆచార్యులవారు శ్రీకృష్ణుని సహస్రనామములు శ్రీమద్భాగవతము నుండి వెలికితీసి, ఏర్చి, కూర్చి చెప్పుచున్నారు.

ప్రతిబంధములు లేకుండా గ్రంథరచన పూర్తి చేయడానికై తిరిగి మంగళాచరణము చేసారు.

**యస్య ప్రసాదాద్వాగీశాః ప్రజేశా విభవోన్నతాః ।**
**క్షుద్రా అపి భవంత్యాశు శ్రీకృష్ణం తం నతోస్మ్యహం ॥ 2**

తాత్పర్యము : వాగీశాః అనగా బృహస్పతి లేక బ్రహ్మదేవునితో సమానమైన వాక్ప్రతిభ కలవారు. శ్రీవల్లభాచార్యులవారు 'వాగీశులు'గా ప్రసిద్ధి. ప్రజేశాః అంటే రాజులు. రాజులవలె ప్రజాగౌరవము ఆదరము పొంది వారిని పరిపాలించే వారు. ఏ భగవానుని ప్రసాదము పొంది క్షుద్రులు (అధములు) కూడా అతి శీఘ్రముగా గొప్పవక్తలు, ప్రభువులు, మహావైభవోపేతులు (ఐశ్వర్యవంతులు) అవుతారో ఆ శ్రీకృష్ణునికి నమస్కారము.

శ్రీకృష్ణుని లీలానామములు అనంతములు. అందుచేత "అనంతా ఏవ కృష్ణస్య లీలానామ ప్రవర్తికాః" అని మొదట చెప్పారు.

**అనంతా ఏవ కృష్ణస్య లీలానామప్రవర్తికాః ।**
**ఉక్తా భాగవతే గూఢాః ప్రకటా అపి కుత్రచిత్ ॥ 3**

తాత్పర్యము : అనంతములైన శ్రీకృష్ణలీలానామములలో కొన్ని గూఢార్థ ములు కలవి. మరికొన్ని కథాభిప్రాయమును ప్రకరణార్థమును అనుసరించి, ప్రకటార్థములు కలవి. అట్టి అనంతమైన శ్రీకృష్ణుని లీలానామముల నుండి ఈ సహస్రనామములు ఏర్చి, కూర్చి చెప్పబడ్డాయి.

**అతస్తాని ప్రవక్ష్యామి నామాని మురవైరిణః ।**
**సహస్రం యైస్తు పఠితైః పఠితం స్యాచ్ఛుకామృతం ॥ 4**



అమృతతుల్యములైన మాటలలో శుకుడు పరీక్షిత్తునకు చెప్పిన శ్రీమద్భాగవతకథ "శుకామృతం".

తాత్పర్యము : శ్రీమద్భాగవతార్థజ్ఞానము కలిగించి, భాగవతము అంతా చదివిన ఫలమును ఇచ్చేవి "శ్రీపురుషోత్తమనామసహస్రము" అనే శ్రీకృష్ణ లీలానామములు. వాటిని శుకవాగమృతమైన భాగవతమునుండి తీసి శ్రీ వల్లభాచార్యులవారు చెప్పుచున్నారు.

1. మురుడనే రాక్షసుని చంపినవాడు మురారి, శ్రీకృష్ణుడు.

2. ముర అంటే అజ్ఞానము. దానిని పోగొట్టేవాడు మురారి, భగవానుడు. భగవన్నామములు మంత్రరూపములు. వాటి పఠన, శ్రవణ, కీర్తన, మననాదులు అజ్ఞానమును పోగొట్టి ముక్తినిస్తాయి. మురారి నామము ఈ మహాత్మ్యమును తెలుపుతుంది. "*సంసారసర్పదష్టస్య నష్టచేష్టైక భేషజం । కృష్ణేతి వైష్ణవం మంత్రం శ్రుత్వా ముక్తోభవేన్నరః ॥*" సంసారమనే సర్పముచేత కాటువేయబడి, చేష్టలుడిగి ఏ మాత్రము ప్రయత్నముచేయలేని (కదలలేని) మనుష్యునికి "కృష్ణః " అనే వైష్ణవ మంత్రము చక్కని ఔషధము. కృష్ణమంత్రము వినగానే మనుష్యుడు ముక్తి పొందుతాడు.

మననముచేసేవారిని రక్షించేది మన్త్రము, (*మననాత్ త్రాయతే మంత్రః*) కృష్ణ అనే నామము పరబ్రహ్మ వాచకము. కృష్ణమంత్రము అజ్ఞానమును తొలగించి జ్ఞానముతో కూడిన భక్తిని జీవులకు ప్రసాదించేది. విష్ణు శబ్దము సర్వవ్యాపకత్వము సూచిస్తుంది. ఇట్టి విష్ణుసంబంధమైన కృష్ణమంత్రము వైష్ణవ మంత్రము. దీని జపం, ధ్యానం, అన్ని మంత్రముల జపం చేసిన ఫలం ఇస్తుంది.

భగవన్నామములు మంత్రరూపములు. ఈ కారణముచేత శ్రీపురుషోత్తమ నామసహస్రములోని నామములు మంత్రములు. మంత్రజపంచేసే సమయములో ఆ మంత్రమునకు సంబంధించిన ఋషి, ఛందస్సు, దేవత, వినియోగము, మొదలైనవి చెప్పి మంత్రజపం చేయడం మంత్రసిద్ధి పొందడానికి అవసరం.

అందుచేత వాటి జ్ఞానము ఆవశ్యకము. ఇవి తెలియక జపము చేయుట దోషమని చెప్పబడినది. కాబట్టి శ్రీపురుషోత్తమనామసహస్రములోని నామములకు ఋష్యాదులు చెప్పుచున్నారు. (యో హ వా అవిదితాఽ ఽర్షేయచ్ఛందో దైవత బ్రాహ్మణేన మంత్రేణ యజతి యాజయతి వా- ఛందోగ్యోపనిషత్). ఇందు ప్రతినామము ఒక మంత్రము అగుటచేత వీనికి సంబంధించిన ఋష్యాదులు చెప్పబడుతున్నాయి.

వీనిని "కృష్ణనామసహస్రస్య ఋషి...." నుంచి "సిద్ధిః శరణ సంస్మృతిః" వరకు (5వ శ్లోకము నుంచి 8వ శ్లోకము వరకు) నాలుగు శ్లోకములలో చెప్పారు.

**ఋష్యాదులు :**

**కృష్ణనామసహస్రస్య ఋషిరగ్నిర్నిరూపితః ।**
**గాయత్రీ చ తథా ఛందో దేవతా పురుషోత్తమః ॥ 5**

**వినియోగః సమస్తేషు పురుషార్థేషు వై మతః ।**
**బీజం భక్తప్రియః శక్తిః సత్యవాగుచ్యతే హరిః ॥ 6**

**భక్తోద్ధరణయత్నస్తు మంత్రోఽత్ర పరమో మతః ।**
**అవతారితభక్తాంశః కీలకం పరికీర్తితమ్ ॥ 7**

**అస్త్రం సర్వసమర్థశ్చ గోవిందః కవచం మతమ్ ।**
**పురుషో ధ్యానమత్రోక్తః సిద్ధిః శరణసంస్మృతిః ॥ 8**

**ఋషి :** ఈ పురుషోత్తమనామసహస్రములోని నామములకు ఋషి స్వయముగా అగ్ని (శ్రీవల్లభాచార్యులవారు అగ్ని దేవతా అంశావతారులు. వీరేఋషి.)

**ఛందస్ :** గాయత్రీ. గాయత్రీఛందస్సు భగవానుని రూపము. "గాయత్రీ ఛందసామహం" (గీత 10-35). భాగవతము గాయత్రీ రూపము. శ్రీపురుషోత్తమనామసహస్రములోని నామముల ఛందస్సు కూడా గాయత్రీయే. (ఈ నామార్థములు గాయత్రీ మంత్రార్థ వ్యాఖ్యానమునకు సరియైన మహాత్మ్యము కలవని తెలుసుకోవాలి.)



దేవతా : పురుషోత్తముడే దేవత.

వినియోగః : సమస్త పురుషార్థసాధనలయందు, సిద్ధియందు భగవదను-సంధానముతో ఉండుటయే వినియోగము.

బీజం : భగవానునికి భక్తుడే ప్రియుడు, "యో మద్భక్తః సమేప్రియః" (గీత 12-16) భక్తప్రియత్వము యీ మంత్రములకు బీజము.

శక్తిః : ప్రణవరూపపరబ్రహ్మము శక్తి. ఇదే సత్యవాగ్రూపము.

మన్త్రం : భక్తుల అజ్ఞానము, దుఃఖము పోగొట్టి ఉద్ధరించే యీ నామములే మన్త్రములు.

కీలకం : భక్తులరూపములో అవతరించిన భగవదంశలే కీలకము.

అస్త్రం : భగవానుని సర్వసమర్థత్వము అస్త్రము.

కవచం : గోవిందుడే కవచము.

ధ్యానం : పురుషుని (పురుషోత్తముని) ధ్యానించుటయే ధ్యానము.

సిద్ధిః : శ్రీకృష్ణుడే నాకు శరణము, (శ్రీకృష్ణః శరణం మమ) అని నిరంతరము స్మృతియందు ఉంచుకొనుటయే సిద్ధి.

ఇకముందు జపింపదగిన నామములు చెప్పబడుతున్నాయి.

## శ్రీమద్భాగవత ప్రథమస్కంధ నామములు

అధికారలీలా నామములు (1-81)

శ్లోక సంఖ్య (9-25).

శాస్త్రార్థరూపమును తెలిపే సహస్రనామములను ప్రతిపాదించే ఫల స్వరూపమైన శ్రీకృష్ణనామము ముందుగా చెప్పబడుతున్నది. ఈ నామములలో "శ్రీకృష్ణః" (నామము 1, శ్లోకం 9) నుంచి "శ్రీమద్భాగవతాగమః" (నామము 19 శ్లోకము 11) వరకు గూఢలీలానామములు.

**శ్రీకృష్ణః సచ్చిదానందో నిత్యలీలావినోదకృత్ ।**
**సర్వాగమవినోదీ చ లక్ష్మీశః పురుషోత్తమః ॥ 9**

### 1. శ్రీకృష్ణః :

శ్రీకృష్ణనామము పరబ్రహ్మమనే అర్థము కలది. కనుక ఈ గ్రంథములో చెప్పబడ్డ భగవానుని అన్నినామములను ప్రతిపాదిస్తుంది. "*కృషిః భూ వాచకశ్శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః । తయోరైక్యం పరంబ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే॥*" (మహాభారతము, ఉద్యోగపర్వము) విష్ణుపురాణములో శ్రీకృష్ణావతరణ ఘట్టములో పరబ్రహ్మ సాక్షాత్ విష్ణుఅంశతో శ్రీకృష్ణుడై అవతరించాడని చెప్పబడింది. "*యదోర్వంశం నరః శ్రుత్వా సర్వపాపైః ప్రముచ్యతే । యత్రావతీర్ణం విష్ణ్వాఖ్యం పరంబ్రహ్మ నారాకృతి॥*" భాగవతములో "*కృష్ణస్తు భగవాన్ స్వయం*" అని చెప్పబడింది.

ఒకటవ నామము మొదలుకొని ఎనిమిదవ నామము వరకు

జన్మాద్యస్య యతోఽ న్వయాదితరతశ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే ముహ్యన్తి యత్సూరయః ।
తేజోవారిమృదాం యథా వినిమయో యత్ర త్రిసర్గోఽ మృషా
ధామ్నా స్వేన సదా నిరస్తకుహకం సత్యం పరం ధీమహి ॥ *(భాగ 1-1-1)*

అనే శ్లోకము మీద ఆధారపడి ఉన్నాయి.



శ్రీ కృష్ణనామము "*జన్మాద్యస్యయతోఽ న్వయాది తరతశ్చ*" యొక్క అర్థమును తెలుపుతుంది.

### 2. సచ్చిదానందః :

సత్ *:*

1. 'సత్' అంటే నిత్యమైన ఉనికి. ఏ ఉనికి వలన అన్నీ ఉన్నాయో అది సత్'.
2. 'సత్' అంటే సద్భావము. సాధుభావము. ఇది దేనియందు కలదో అది 'సత్'.
3. కర్మలలో ప్రశస్తమైన యజ్ఞము, తపస్సు, దానము చేయడంలోఉన్నది 'సత్'.

**'చిత్'** :

'చిత్' అంటే స్వప్రకాశము లేక జ్ఞానము. అంటే సత్ వల్లనే అన్నీ నిలిచి ఉన్నాయన్న జ్ఞానము 'చిత్'.

**ఆనందః** :

పై జ్ఞానమువలన కలిగేది ఆనందము. ఈ సత్, చిత్, ఆనందములు మూడు ఎవరిలో కలవో అతడు సచ్చిదానందుడు. ఇదే శ్రీకృష్ణుని స్వరూపము. పరబ్రహ్మలక్షణము. "అర్థేష్వభిజ్ఞః" వాక్యార్థము సచ్చిదానందః.

### 3. నిత్యలీలావినోదకృత్ :

1. నిత్యము లీలావినోదములు చేసే భగవానుడు లేక నిత్యలీలలు చేస్తూ విశేషప్రేరణ కలిగించే భగవానుడు, "నిత్యలీలావినోదకృత్"-

2. వి = విశేష; నోద = ప్రేరణ; భగవానుని విశేష ప్రేరణచేతనే సృష్టి స్థితి లయములు, వాటికి సంబంధించిన కార్యములు, ఈ జగత్తులో జరుగుతూ ఉంటాయి. అవి ఊహాతీతములు, ఆశ్చర్యకరములు. ఇవి నిత్యము జరుగుతూ ఉంటాయి గనుక భగవానుడు "నిత్యలీలావినోదకృత్"

3. శ్రీకృష్ణుడు తన వేణువాద్యముచేత వ్రజగోగోపాలగోపికలను తనవైపు ఆకర్షించి వారిలో తనపై భక్తి కలుగునట్లు విశేషముగా ప్రేరేపించాడు. శ్రీకృష్ణుని అన్ని బాలలీలలు కూడా ఈ విధముగా నిత్యలీలలలో భాగమే. "స్వరాట్" అన్న వాక్యార్థము, "నిత్యలీలావినోదకృత్".

## 4. సర్వాగమవినోదీ (చ) :

1. ఆగమములు అంటే వేదములు. అవి భగవానుని ఉచ్ఛ్వాస నిశ్వాస రూపములు. ఇవి పరమాత్మనుగురించి విశేషప్రేరణ కలిగించేవి. వినోదరూపములు.

*"వేదైశ్చ సర్వైరహమేవవేద్యః"* *(గీత 15-15).*

2. ఏఏకాలములందు ఏఏవైదికకార్యములు చేయాలో వానిని విశేషముగా ప్రేరణచేసి, చేయించే భగవానుడు.

"యావజ్జీవమగ్నిహోత్రం జుహోతి" *(శ్రుతి).*

3. వేదమంత్రములు వివిధ దేవతారూపములలోనున్న పరమేశ్వరుని ఉపాసనలు, ఆరాధనలు చేయుటకు విశేషప్రేరణచేస్తాయి. అందుచేత "సర్వాగమవినోదీ" పరమేశ్వరుడు.

"యేఽప్యన్యదేవతాభక్తాయజన్తే శ్రద్ధయాన్వితాః" (గీత 9-23) "తేనే బ్రహ్మహృదాయ ఆదికవయే" అన్న వాక్యార్థము 'సర్వాగమవినోదీ.

## 5. లక్ష్మీశః :

లక్ష్మి అంటే కాంతిపుంజములు; విభూతిరూపములు; లక్ష్మీదేవి. లక్ష్మియొక్క ప్రభువు "లక్ష్మీశః". భగవానుడు తనకాంతి, విభూతులచేత లోకములనన్నింటిని మోహింపజేస్తాడు. మహాజ్ఞానులు, భక్తులుకూడా మోహింపబడతారు. అట్టి సర్వమోహనరూపుడైన భగవానుడు లక్ష్మీశుడు.

"ముహ్యంతి యత్సూరయః" అన్న వాక్యార్థము లక్ష్మీశః (భాగ 1-1-1).

## 6. పురుషోత్తమః :

1. "పురుషేషు బ్రహ్మాదిషు ఉత్తమః సర్వోపాస్యత్వాత్". బ్రహ్మాది దేవతలందరికి ఉపాస్యుడు కనుక పురుషోత్తముడు.

2. అక్షరపురుషునికంటె ఉత్తముడు ఉత్తమపురుషుడు; పరమాత్మ.



*"యస్మాత్ క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః । అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః" (గీత 15-18). "తేజోవారిమృదాం యథా వినిమయో యత్ర త్రిసర్గోఽమృషా ధామ్నా స్వేన"* వాక్యార్థము పురుషోత్తముడు.

**ఆదికాలః సర్వకాలః కాలాత్మా మాయయావృతః ।**
**భక్తోద్ధారప్రయత్నాత్మా జగత్కర్తా జగన్మయః ॥ 10**

## 7. ఆదికాలః :

1. నిమేషము, ముహూర్తము, కాష్ఠము అహోరాత్రములు మొదలైన 'కాలపరిమాణముల'చే కాలము లెక్కింపబడుతుంది. సృష్ట్యాదినుంచి యీ గణనము ప్రారంభించబడుతుంది. ఆ గణనము ప్రారంభించినకాలము పూజనీయమైన ఆదికాలము. ఆ ఆదికాలస్వరూపుడు భగవానుడు.

*"యతః సర్వాణి భూతాని భవంత్యాదియుగక్షయే" (స్మృతి) "సర్వే నిమీషా జజ్ఞిరే విద్యుతః పురుషాదధికాలా ముహూర్తా....." (శ్రుతి.)*

2. కాలగణనము చేయుట కొరకు కాలవిభజన జరిగింది. అన్ని కాలములు పుట్టుటకు సంబంధముగల మొదటి కాలము భగవానుడు ఆదికాలవాచ్యుడు. "సదా నిరస్త కుహకం" అన్న వాక్యార్థము "ఆదికాలః".

## 8. సర్వకాలః :

1. ఆది, మధ్య, అంత రూపములుగల కాలము సర్వకాలము.

"అహమాదిశ్చ మధ్యంచ, భూతానామంత ఏవచ" (గీత 10-20).

2. ఈ జగత్తులో సర్వకార్యములను గణనములోనికి తెచ్చేది సర్వకాలము.

3. 'సర్వ' అంటే సత్యస్వరూపము. అన్ని వేళలందు సత్యస్వరూప స్థితిని తెలిపే కాలము"సర్వకాలః". "సత్యం పరం ధీమహి" వాక్యార్థము "సర్వకాలః".

9 నుండి 15 వరకు గల నామములు భాగవత ప్రథమస్కంధ ప్రథమాధ్యాయములోని 2వ శ్లోకార్థముపై ఆధారపడి ఉన్నాయి.

శ్లో॥ ధర్మః ప్రోజ్ఝితకైతవోఽత్ర పరమో నిర్మత్సరాణాం సతాం
వేద్యం వాస్తవమత్ర వస్తు శివదం తాపత్రయోన్మూలనం ।
శ్రీమద్భాగవతే మహామునికృతే కిం వా పరైరీశ్వరః
సద్యో హృద్యవరుధ్యతేఽత్ర కృతిభిః శుశ్రూషుభిస్తత్ క్షణాత్ ॥ (భాగ 1-1-2)

## 9. కాలాత్మా :

1. కాలరూప పరమాత్మ "కాలాత్మా".

*"కాలః కలయతామహం" (గీత 10-30) కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధః (గీత 11-32) "అహమేవాక్షయః కాలః (గీత 10-33)*

2. కాలః అంటే రుద్రుడు. "కాలాయనమః" (శ్రుతి) అహంకారరూపముతో నున్న రుద్రుడు కాలాత్ముడు.

3. ధర్మహాని జరిగేకాలంలో అవతరించే భగవానుడు కాలాత్ముడు. *"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత." (గీత 4-7);* "ధర్మః ప్రోజ్ఝిత కైతవోఽత్ర పరమః" వాక్యార్థము, కాలాత్ముడు.

## 10. మాయయాఽఽవృతః :

1. అవిద్య (మాయ)చేత కప్పబడ్డ పరమాత్మ, "మాయయా ఽఽవృతః"

2. శ్రీ అనే భగలక్షణముచే ఎల్లప్పుడు సేవింపబడుతూ ఉన్నవాడు.

3. మాయచే కప్పబడి (లేక చుట్టబడి) ఉండుటచే స్పష్టముగా తెలియబడని భగవానుడు "మాయయాఽఽవృతః" అనబడతాడు. "నిర్మత్సరాణాం సతాం" అన్న వాక్యార్థము "మాయయాఽఽవృతః"

## 11. భక్తోద్ధారప్రయత్నాత్మా :

ఎన్ని ప్రయత్నాలు సాధనలు చేసినా, జీవునికి సంసారతాపత్రయములు దూరముకావు. భగవద్భక్తి కుదిరినపుడు మాత్రమే భగవానునికి భక్తునిపై కృప కలిగి అతని అంతఃకరణమును సంసారమునుండి మరల్చి తనయందే



నిలుపుటకు ప్రేరేపించుతాడు. ఇది భగవంతుని భక్తోద్ధారప్రయత్నము. "వేద్యం వాస్తవమత్ర వస్తు" వాక్యార్థము, "భక్తోద్ధారప్రయత్నాత్మా".

## 12. జగత్కర్తా :

1. పంచభూతములనేకాక, జగత్తులోని స్థావరజంగమములనన్నిటిని భగవంతుడే కుమ్మరివాడు కుండలు చేసినట్లు సృష్టించాడు. వాటికి ఆయనే ఆధారము. ఇట్టి అపరోక్షజ్ఞానము కలిగించే భగవానుడే జగత్కర్త.

"యతో వా ఇమాని భూతాని జాయంతే......" (శ్రుతి)। "ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః జంగమా జంగమంచేదం జగన్నారాయణోద్భవం" వి.స.నా.ఉ.పీ.(శ్లో॥ 138), "అహం సర్వస్య ప్రభవో మత్తస్సర్వం ప్రవర్తతే" *(గీత 10-8).*

2. సర్వజగత్కర్తృత్వముచే భక్తులకు సర్వవాంఛితార్థములు ప్రసాదించే భగవానుడు, జగత్కర్త. "శివదం" వాక్యార్థము, జగత్కర్త.

## 13. జగన్మయః :

1. "జగత్కర్తా" అన్ననామముచేత భగవానుడు జగత్తుకు కారణభూతుడనీ, "జగన్మయః" అన్ననామముచేత కార్యరూపమైన యీ జగత్తు అంతా భగవానుడేనని తెలుసుకోవాలి. జగత్తుకి భగవానునికి అభేదము సూచింపబడింది.

*"పురుష ఏవేదగ్ం సర్వం...." (శ్రుతి). "బ్రహ్మ విశ్వమిదం జగత్" (శ్రుతి). మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి (గీత 7-7)" జ్యోతీంషి విష్ణుర్భువనాని విష్ణుర్వనాని విష్ణుర్గిరయో దిశశ్చ నద్యస్సముద్రశ్చ స ఏవ సర్వోయదస్తి యన్నాస్తి చ విప్రవర్యా (విష్ణుపురాణము).*

భగవంతుడే జగద్రూపుడని చెప్పుటచే భక్తులు అన్నిటిలో భగవద్రూపము చూడవలెనని ఆదేశము. "తాపత్రయోన్మూలనం" అన్నవాక్యార్థము "జగన్మయః."

**నామలీలాపరో విష్ణుర్వ్యాసాత్మా శుకమోక్షదః ।**
**వ్యాపివైకుంఠదాతా చ శ్రీమద్భాగవతాగమః ॥ 11**

## 14. నామలీలాపరః :

1. నామము ఏ లీలను తెలుపుతుందో అది నామలీలా. ఆనామము ఆ భగవల్లీలయందు నిష్ఠ కలుగచేస్తుంది (పరః = నిష్ఠ).

2. ఎవరి నామలీలలు (పరః) ఉత్కృష్టములైనవో ఆ భగవానుడు.

3. భగవతత్త్వమును సంపూర్ణముగా తెలిపేవి లీలలు. వాటిని సూచించేది నామము. ఆ నామమునందు భగవంతుడు పూర్ణరూపముతో వ్యాపించి ఉంటాడు.

భగవన్నామమహాత్మ్యము, దాని ఉత్కృష్టత అన్నిచోట్ల వింటాము. బృహన్నారదీయములో "హరేర్నామైవ నామైవ నామైవ మమ జీవనం కలౌనాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా" అని. పద్మపురాణములో "అనన్యగతయో మర్త్యా భోగినోఽపి పరంతప । జ్ఞానవైరాగ్యరహితా బ్రహ్మచర్యాదివర్జితాః । సర్వధర్మోజ్ఝితా విష్ణోర్నామ మాత్రైక జల్పకాః । సుఖేన యాం గతిం యాన్తి న తాం సర్వేపి ధార్మికాః ॥" అని చెప్పబడింది. నామ్నోస్తి యావతీ శక్తిః పాప నిర్దహనే హరేః । తావత్కర్తుం నశక్నోఽతి పాతకం పాతకీ నరః ॥ (పురాణాంతరం). "జన్మ కర్మ చ మేదివ్యమేవం యోవేత్తి తత్త్వతః । త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥" (గీత 4-9). "చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరం । ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతక నాశనం ॥" (వాల్మీకి రామాయణము) "విష్ణోర్ను కం వీర్యాణి ప్రవోచం విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పశ్పశ" (శ్రుతి).

ఈ విధముగా నామలీలా (లీలానామ) ఉత్కృష్టత పలుచోట్ల స్తోత్రము చేయ బడింది. శ్రీమద్భాగవతములో "శ్రీమద్భాగవతే మహాముని కృతే కింవాఽపరైః...." అన్నమాటలు నామలీలాపరత్వము తెలుపుతాయి.

## 15. విష్ణుః :

1. విషేర్వ్యాపకత్వవాచినో, 'ను' ప్రత్యయాన్తస్యరూపం । "వేవేష్టి వ్యాప్నోతి విశ్వం విష్ణురితి ॥" అనగా విశ్వమంతటిని చుట్టుకొని వ్యాపించి లోపల బయట నిండియున్నవాడు విష్ణువు.



"అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" (శ్రుతి). అణోరణీయాన్ మహతో మహీయాన్" (శ్రుతి). ఇవి వ్యాపకత్వము తెలిపే వాక్యములు.

2. "విశ ప్రవేశన ఇత్యస్య 'ను' ప్రత్యయాన్తస్యరూపం "విష్ణుః" । 'విశే' అంటే ప్రవేశించి ఉండుటవలన, ఏ వస్తువు నుండి విడదీయలేని విధముగా ఉన్న విష్ణువు. యస్మాత్సర్వమిదం విశ్వం తస్య శక్త్యా మహాత్మనః । తస్మాదేవోచ్యతే విష్ణుః విశేర్ధాతో ప్రవేశనాత్ ॥" (విష్ణుపురాణము). "విష్ణుర్యః సర్వవేదేషు పరమాత్మా సనాతనః ।" (వరాహపురాణము). భగవానుడంతటా వ్యాపించి ఉండుటచేత (భక్తుని హృదయములోనూ ఉండి) భక్తుని అంతఃకరణమును సులభముగా తత్క్షణమే భగవానునియందు నిలుపుటకు (నిరోధించుటకు) ప్రేరణ చేస్తాడు.

*"ఈశ్వరః సద్యో హృద్యవరుధ్యతేఽత్ర కృతిభిః శుశ్రూషభిః తత్ క్షణాత్. (భాగ 1-1-2)* యొక్క అర్థము విష్ణువు.

శ్లో॥ నిగమకల్పతరోర్గలితం ఫలం శుకముఖాదమృతద్రవసంయుతం।
పిబత భాగవతం రసమాలయం ముహురహో రసికా భువి భావుకాః ॥

*(భాగ 1-1-3)*

16వ నామము నుండి 19వ నామము వరకు గల నాలుగు నామములు, పైశ్లోకార్థమునే ప్రతిపాదిస్తాయి.

## 16. వ్యాసాత్మా :

వ్యాసుడే తన స్వరూపముగా గల భగవానుడు, వ్యాసాత్మా. ఇరవైఎన మండుగురు వ్యాసులలో పరాశరపుత్రుడు కృష్ణద్వైపాయనుడు అనే వ్యాసుడు నారాయణుని అంశావతారుడు. అందుచేత వ్యాసాత్మా అన్న నామము. "కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం ప్రభుం । కోహ్యన్యః పుండరీకాక్షాన్మహాభారతకృద్భవేత్ ॥" (పుండరీకాక్షుడనగా సర్వదర్శి భగవానుడు). కృష్ణద్వైపాయనుడనే పేరుగల వ్యాసుని నారాయణుడని తెలుసుకొనుము.

సాక్షాత్ భగవానుడుతప్ప ఇతరులెవ్వరు మహాభారతమును వ్రాయగలరు? భగవానునిఅంశాఅవతారుడు గనుకనే వ్యాసుడు వేదములను విభజించాడు. వానికి ఉపబృంహణరూపములో పురాణాదులను విస్తారముగా వ్రాసాడు. వేదసారభూతమైన భాగవతము "నిగమకల్ప తరోర్గలితం ఫలం" అని చెప్పబడింది.

## 17. శుకమోక్షదః :

శుకునకు మాయాస్పర్శలేకుండా చేయుటయే అతనికి మోక్షమును ఇచ్చుట. ఈ విషయము బ్రహ్మవైవర్తాది పురాణములలో చెప్పబడింది. శుకుడు పుట్టినప్పుడే ముక్తుడు (మాయా సంబంధములేనివాడు). ముక్తిని పొందినవారు భగవల్లీలల శ్రవణ కీర్తనలు చేయాలని కోరుకుంటారు. ఎందుకంటే వారి అంతః కరణములో సంసార విషయములకు తావులేదు. భగవంతుడే నిండి ఉంటాడు. ఈ కారణముచేత, వ్యాసుడు కోరగా శుకుడు శ్రీమద్భాగవతమును తండ్రిదగ్గర విని మాయాబంధము తనకు ఉండకూడదని భగవల్లీలలను కీర్తిస్తూ మాయాస్పర్శ ఎన్నడూ తనకు కలుగకుండా ఉన్నాడు. ఇట్టి స్థితిని శుకునకు ప్రసాదించిన భగవానుడు"శుకమోక్షదః" అని చెప్పబడ్డాడు.

"శుక ముఖాదమృతద్రవ సంయుతం" అన్న వాక్యార్థము, "శుకమోక్షదః" (భాగ 1-1-3).

## 18. వ్యాపివైకుంఠదాతా (చ) :

1. వ్యాపి అంటే వ్యాపించిఉన్నవాడు. సర్వవ్యాపకుడు, జ్ఞానఘనుడైన పరమాత్మ "వ్యాపీ". అతడే వైకుంఠుడు. వైకుంఠుడున్న లోకములో భక్తులు జ్ఞానముకలవారై ఉంటారు.

*"వైకుంఠభవనయోగం గమిష్యతి తదిదం పరం పుండరీకం విజ్ఞానఘనం" (అధర్వశిరోపనిషత్); "నతద్భాసయతే సూర్యో నశశాంకో నపావకః యద్గత్వా ననివర్తంతే తద్ధామపరమం మమ" అని భగవద్వాక్యము (గీత15-6) .*



2. తనకున్నట్టి జ్ఞానము,కాంతి ఏకాన్తభక్తులకు కూడా ఇచ్చే భగవానుడు "వ్యాపి వైకుంఠదాతా".

"చకారః సర్వత్ర అన్తే శ్రూయమాణః, శ్రీకృష్ణ ఇతి. ఇదం నామ సముచ్చినోతి. యతస్తన్నామ ప్రపంచరూపత్వమే-వాన్యన్నామ్నామితి". 'చ'కారము సముచ్చయార్థకము. (Conjunction - కలిపేది) ఏ ఏ నామములు కలుపబడుచున్నవో వాటి చివర 'చ' వస్తుంది. వ్యాపివైకుంఠదాతాచ అంటే, శ్రీకృష్ణ నామముతో సముచ్చయము చేసి శ్రీకృష్ణః వ్యాపి వైకుంఠదాత చ అని చెప్పుకోవాలి. అలా చెప్పడం చేత నామము ప్రపంచరూపమైనదైనా విశ్వరూపము గలది అవుతుంది. ఇతరనామముల సంబంధములో కూడా ఈ అర్థము వర్తిస్తుంది. వైకుంఠమునందున్న ఆనందరసముతో సమానమైన ఆనందము కలిగించేదని ఈ నామము అర్థము.

"పిబత భాగవతం రసం" (భాగ 1-1-3) అన్న వాక్యార్థము ఈ నామము.

## 19. శ్రీమద్భాగవతాగమః :

1. శ్రీ మద్భాగవతము భక్తిశాస్త్రము (ఆగమము = శాస్త్రం).

2. "శ్రీమద్భాగవతస్య ఆగమః ప్రాదుర్భావోయస్మాత్ తద్రూప ఇతివా" ఆగమము అంటే ప్రాదుర్భావము. శ్రీమద్భాగవతమును వ్యాసుడు రచించినా, దీని మూలము చతుఃశ్లోకీ భాగవతము. [భాగ 2-9 - (32-35)] దీనిని మొట్టమొదట భగవానుడు బ్రహ్మదేవునికి చెప్పాడు. ఆ భాగవతమును నారదుడు వ్యాసునికి ఉపదేశము చేసాడు. ఆ తరువాత ధ్యానములోనున్నప్పుడు వ్యాసుని అంతఃకరణములో బాగవతార్థము తెలిసింది. అతనిచే భాగవతము సంపూర్ణ భక్తిశాస్త్రముగా రచింపబడింది. వ్యాసుడు నారాయణుని అంశావతారుడు గనుక ఈ శ్రీభాగవతపురాణముకూడా భగవంతుని నుండి ఆవిర్భవించినదనే తెలుసుకోవాలి. ఏ భగవానునినుండి భాగవతము ప్రాదుర్భావము చెందినదో ఆ భగవానునికి (పరమాత్మ, శ్రీకృష్ణునికి) "శ్రీమద్భాగవతాగమః" అని పేరు.

3. భాగవతములో భగవల్లీలలు విస్తారముగా వర్ణింపబడ్డాయి. ఇతర

శాస్త్రములపై ఆధారపడకుండా, భగవద్ధర్మము, భగవద్భక్తి, ప్రమాణ, ప్రమేయ, సాధన, ఫల సహితముగా భాగవతశాస్త్రములో చక్కగా బోధింపబడ్డాయి. భాగవతమునకు, భగవంతునికి అభేదము. అందుచేత శ్రీమద్భాగవతాగమః అని భగవానుని నామము. "ఆలయం ముహురహో రసికాఃభువి భావుకాః" అన్న వాక్యార్థము, "శ్రీమద్భాగవతాగమః "

"నిగమకల్పతరోర్గలితం ఫలం" శ్లోకములో ప్రతిపాదించిన విశేషములకు సంబంధించిన నామములు ఇకపైని చెప్పబడతాయి.

**శుకవాగమృతాబ్ధీందుః శౌనకాద్యఖిలేష్టదః ।**
**భక్తిప్రవర్తకస్త్రాతా వ్యాసచింతావినాశకః ॥ 12**

## 20. శుకవాగమృతాబ్ధీందుః :

శుకుడు పరీక్షిత్‌కు అమృతతుల్యములైన మాటలలో చెప్పిన భాగవత కథ శుకవాగమృతము. ఈ కథలో హద్దులు లేని సముద్రమువలె భగవంతుని అనంత ఐశ్వర్యగుణములు వర్ణింపబడ్డాయి. అందుచేత భాగవతకథ "శుక వాగమృతాబ్ధిః". సముద్రములో ఎన్నో గొప్పరత్నములు దొరుకుతాయి. చంద్రుడు ఆ రత్నములలో ఎన్నో గొప్పగుణములుకల ముఖ్యమైన రత్నము. చంద్రుడు అందరికి తన వెన్నెలతో ఆహ్లాదము కలిగించినట్లు భాగవతములోని భగవంతుని అనంతఐశ్వర్యగుణములు అందరికి ఆనందముకలిగించుతాయి. అందుచేత శ్రీమద్భాగవతకథ "శుకవాగమృతాబ్ధీందుః" అని చెప్పారు.

## 21. శౌనకాద్యఖిలేష్టదః :

శౌనకాదులు నైమిశారణ్యములో సత్రము జరుపుతున్న సమయమందు సూతుడక్కడికి రాగా, వారు భక్తిసాధనచేయాలన్న కోరికతో సూతుని భాగవతకథ చెప్పమని ప్రార్థించారు. శౌనకాదులకీ ఇష్టము (కోరిక)ను పుట్టించి,ఆ గొప్ప కోరికను తీర్చిన భగవానుడు "శౌనకాద్యఖిలేష్టదః" అని చెప్పబడతాడు.

## 22. భక్తిప్రవర్తకః :

"భక్తేః ప్రవర్తకో భక్తిప్రవర్తకః" భక్తి కలిగించి, (ప్రేరేపించి)



వృద్ధిపరిచేవాడు, భక్తిప్రవర్తకుడు. జీవుని మనుస్సులో భక్తిని కలుగజేసే భగవానుడు అని అర్థము. శౌనకాదులు కర్మిష్ఠులు. యజ్ఞయాగాదులు నిష్ఠా పూర్వకంగా చేసే కర్మశుద్ధి కలవారు– సూతుని నుండి పురాణములు వినడంచేత వారికి జ్ఞానశుద్ధి కలిగింది. భగవంతునికి వారిపై కృపకలిగి, భక్తియోగసాధన చెయ్యడానికి భాగవతశ్రవణము చేయాలన్న ప్రేరణ వారికి కలిగించాడు. ఈ విధముగా భగవానుడు భక్తిప్రవర్తకుడు.

## 23. త్రాతా :

జలచరములకు జలమే జీవనమైనట్లు భక్తియే జీవనమైన భక్తునకు అభయమిచ్చి రక్షించే భగవానుడు, 'త్రాతా'. భగవద్రక్షణలో నున్న భక్తునికి ఎట్టి అశుభములు కలుగవు.

"న క్రోధో న చ మాత్సర్యం న లోభోనాశుభా మతిః । భవన్తి కృతపుణ్యానాం భక్తానాం పురుషోత్తమే ॥ నవాసుదేవభక్తానా మశుభం విద్యతే క్వచిత్ । జన్మమృత్యుజరావ్యాధిభయం నాప్యుపజాయతే॥" (వి.స.నా. ఉ.పీ.శ్లో. 131, 133) సర్వాభీష్టములు చేకూర్చే శక్తి కూడా భక్తులయందు కలదని వింటాము. "యస్య దేవే పరాభక్తిర్విభౌ నారాయణాహ్వయే । తస్య స్యాత్ సఫలం జన్మ ముక్తిశ్చైవ కరే స్థితా॥ ధర్మార్థకామమోక్షాఖ్యాః పురుషార్థా ద్విజోత్తమాః । హరిభక్తిపరాణాం వై సంపద్యంతే న సంశయః ॥ యథా జలౌకసాం నిత్యం జీవనం సలిలం మతం । తథా సమస్త సిద్ధీనాం జీవనం భక్తిరిష్యతే ॥ యథా భూమిం సమాశ్రిత్య సర్వే జీవన్తి జన్తవః తథా భక్తిం సమాశ్రిత్య సర్వకర్మాణి సాధయేత్ ॥" (బృహన్నారదీయము). సర్వవ్యాపకుడైన (నారాయణ నామము గల) పరబ్రహ్మయందు పరమభక్తిగల భక్తుని జన్మ సఫలము. అతనికి ముక్తి కరతలామలకము. ఓ ద్విజోత్తములారా! హరిభక్తిపరులకు ధర్మార్థకామమోక్షములు (నాలుగు పురుషార్థములు) లభించును. ఇందుకు సందేహములేదు. జలచరములకు నీరే జీవనాధార మైనట్లు సమస్త సిద్ధులకు భక్తియే ఆధారము. భక్తిలేనిదే సిద్ధులు మనలేవు. భూమిని ఆశ్రయించి ప్రాణులన్నీ జీవిస్తున్నట్లే, భక్తిని ఆశ్రయించుకొని అన్ని పనులు చేసుకొనవలెను. ఇట్టి వచనములు ఇతర గ్రంథములలో అనేక స్థలములలో కలవు. గ్రంథ విస్తారభీతిచే ఆ వచనములు వ్రాయలేదు.

## 24. వ్యాసచింతావినాశకః :

వేదములు పరిష్కరించినా, వేదరహస్యములు విపులీకరించి మహాభారతము వ్రాసినా వ్యాసునికి "ఆత్మానుభూతి, ఆనందము కలుగలేదు." అనే చింత ఉండేది. ఈచింత భగవల్లీలాస్మరణ సంకీర్తనల వల్లనే గాని మరిదేనివలన పోదని, భాగవతము వ్రాయమని, నారదుడతనికి ఉపదేశించాడు. వ్యాసుడు ధ్యానమునందు సమాధిస్థితిపొంది ఈ సత్యము తెలుసుకొని శ్రీమద్భాగవత పురాణము రచించాడు. చింతకు దూరమయి, శాంతిని పొందగలిగాడు. ఈ కార్యములు నారదునిచేత వ్యాసునిచేత చేయించిన భగవానుడు వ్యాసచింతా వినాశకుడు.

*"తథాపి బత మే దైహ్యో హ్యాత్మా చైవాత్మనా విభుః ....." నుంచి .....సమాధి నానుస్మర తద్విచేష్టితం" వరకు (భాగ 1-4-30 నుంచి 1-5-13 వరకు)*

**సర్వసిద్ధాంతవాగాత్మా నారదాద్యఖిలేష్టదః ।**
**అంతరాత్మా ధ్యానగమ్యో భక్తిరత్నప్రదాయకః ॥ 13**

## 25. సర్వసిద్ధాన్తవాగాత్మా :

1. సమాధిస్థితియందు అంతఃకరణములో వాగ్రూపముగా పొందబడిన సిద్ధాన్తజ్ఞానము సిద్ధాన్తవాక్. సిద్ధాన్తజ్ఞానము యొక్క ఇట్టి నిజస్వరూపము సిద్ధాన్తవాగాత్మా. సర్వ సిద్ధాన్తములను తెలుపు వాగ్రూపము ధరించిన జ్ఞానమే తన నిజరూపముగాగల భగవానుడు, "సర్వసిద్ధాన్తవాగాత్మా". ఇట్టి భగవానుని కన్న అధికుడుగాని, చెప్పదగినవాడుగాని వేరే లేడు. కపిలాదులందరు తమ తమ సిద్ధాంతజ్ఞానమును యీ రూపములోనే తెలుసుకున్నారు.

## 26. నారదాద్యఖిలేష్టదః :

నారదుని మొదలైన మునుల అఖిలమైన కోరికలు తీర్చిన భగవానడు "నారదాద్యఖిలేష్టదః" అని చెప్పబడతాడు. నారదుడు తన పూర్వజన్మలో దాసీ పుత్రుడు; నీచకులస్థుడు. హరిభక్తులసేవచేసి భగవద్భక్తిపొంది, మరుచటి జన్మలో



దేవర్షి అయినాడు. వ్యాసునికి కూడా ఉపదేష్ట అయినాడు. నారదునికి పర్వతాది ఇతర మునులకు గల (భక్తి) సంబంధము వలన వారివారి కోరిక లన్నిటిని భగవంతుడు తీర్చాడు. అందుచేత "నారదాద్యఖిలేష్టదః" అనే నామము.

## 27. అన్తరాత్మా :

1. (ఇక్కడ) అంతః అంటే అంతఃకరణమని అర్థము. అంతఃకరణ రూపములో నున్న భగవానుడు "అంతరాత్మా".

2. సమాధి పొందుటకు చేసే సాధనలో అంతఃకరణము ప్రధానమైనది. కనుక భగవానునికి అంతరాత్మ రూపత్వము చెప్పబడినది (సమాధౌ అంతః కరణస్య ప్రాధాన్యత్వాత్ తద్రూపత్వముక్తమ్).

3. ఇంద్రియాణాం మనశ్చాస్మి, భూతానామస్మి చేతనా..... (గీత 10-22). ఇంద్రియములలో నేను మనస్సును; ప్రాణులలో చైతన్యమును .... (ఎరుకను) అని భగవద్వాక్యము. ఇట్లు భగవంతునికి అంతఃకరణరూపత్వము చెప్పుటవలన భగవానుడు "అంతరాత్మా".

4. విభూతులయందు సత్త్వరూపములోనున్న పరమాత్మ అంతరాత్మ.

*(యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవ వా, (గీత 10-41).*

## 28. ధ్యానగమ్యః :

"ధ్యానేన సమాధ్యావేశితచిత్తేన గమ్యోజ్ఞేయ ఇతి యావత్". ధ్యానము నందు (సమాధి పొందినపుడు) చిత్తము చేత తెలుసుకోబడేవాడు "ధ్యానగమ్యుడు."

నారదోపదేశముపొంది వ్యాసుడు (సరస్వతీనదికి పశ్చిమతీరములో ఉన్న) శమ్యాప్రాసమనే పేరుగల బదరీవృక్షముల(రేగుచెట్ల)తో నిండియున్న తన ఆశ్రమములో కూర్చుని జలములనాచమించి నారదమహర్షి చెప్పినట్లు

సమాధిద్వారా మనస్సునుస్థిరపరుచుకొని ధ్యానముద్రలోనుండగా నారాయణుని, ఆయన స్వాధీనములోనున్న మాయను చూచెను.

*"....ఆసీనోఽ పఉపస్పృశ్య మనః ప్రణిదధ్యౌ స్వయం ॥" "భక్తియోగేన మనసి సమ్యక్ ప్రణిహితేఽ మలే ॥ అపశ్యత్పురుషం పూర్వం మాయాంచ తదపాశ్రయాం ॥"*

*(భాగ 1-7-3,4)*

## 29. భక్తిరత్నప్రదాయకః :

ఇక్కడ భక్తి అనగా భక్తియొక్క సాధనరూపము. భాగవతము భక్తిని ఇచ్చి దానిని దృఢపరచే శాస్త్రము. అందుచేత భక్తిని పొందుటకు, శ్రీమద్భాగవతము సంహితారూపమైన సాధనము, భక్తిరత్నము. అట్టి భక్తిరత్నమైన శ్రీమద్భాగవతసంహితను వ్యాసునిద్వారా లోకమునకిచ్చిన భగవానుడు భక్తిరత్నప్రదాయకుడు.

**ముక్తోపసృప్యః పూర్ణాత్మా ముక్తానాం రతివర్ధనః ।**
**భక్తకార్యైకనిరతో ద్రౌణ్యస్త్రవినివారకః ॥ 14**

## 30. ముక్తోపసృప్యః :

1. "ముక్తాః" ముక్తి పొందినవారు "ఉపసృప్యః" సమీపమునకు చేరుటకు యోగుల్యైనవారు. ముక్తులైన భక్తులు మాత్రమే భగవంతుని సమీపమునకు చేరగలరు. ఇతరులకు అట్టి చేరువ సాధ్యము కాదు అని తెలిపే భగవానుడు "ముక్తోపసృప్యః".

2. ముక్తులైన భక్తుల సమీపమునకు స్వయముగా చేరే (వచ్చే) భగవానుడు.

3. ముక్తులుకూడా భగవద్భజనచేయుటచేతనే భగవంతుని సామీప్యము (పరమగతి) పొందగలరని తెలిపే భగవానుడు "ముక్తోపసృప్యః"

భక్తితో కూడినభజనయే కాని మరిఏదీ భగవత్సామీప్యము కలిగించలేదు. కనుక ముక్తులైనవారు భగవద్భజనను విడువలేరు (శుకుని వంటివారు కూడా).



## 31. పూర్ణాత్మా :

1. "పూర్ణశ్చ అసౌ ఆత్మా" అన్నిటియందు సంపూర్ణముగా నిండియున్న ఆత్మస్వరూపుడు పూర్ణాత్మ, భగవానుడు.

2. భక్తిరసముతోనిండియున్న భక్తులహృదయమందు ఆత్మస్వరూపుడై ఉన్న భగవానుడు, పూర్ణాత్మ.

3. సర్వైశ్వర్యగుణములతోనిండియున్న ఆత్మస్వరూపుడు పూర్ణాత్మ.
*"మాయాతత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా...." (గీత 9-4);*
*"వృక్ష ఇవ స్తబ్ధో దివితిష్టత్యేకస్తేనేదం పూర్ణం పురుషేణసర్వం" (శ్రుతి)*

4. శుకునివంటి ముక్తాత్మ "పూర్ణాత్మా".
*"స వై నివృత్తినిరతః సర్వత్రోఽ పేక్షకో మునిః" (భాగ 1-7-9).*

## 32. ముక్తానాం రతి వర్ధనః :

రతి అనగా భగవంతునియందు స్నేహరూపమైన అలౌకికభక్తి. అన్ని బంధములనుండి సంపూర్ణముగా ముక్తులైన శుకునివంటివారికి కూడా భగవంతునియందు అలౌకికమైన భక్తిని పెంపొందించే భగవానుడు, "ముక్తానాం రతివర్ధనః" ।

*"ఆత్మారామాశ్చ మునయో నిర్గ్రంథా అప్యురుక్రమే..." (భాగ 1-7-10).*

## 33. భక్తకార్యైకనిరతః :

1. భక్తులకార్యములు చేయడానికి ఎల్లప్పుడు ఉద్యుక్తుడై ఉండే భగవానుడు భక్తకార్యైకనిరతుడు.

2. భక్తులు ఎల్లప్పుడు భగవద్భజన చేయడానిని మాత్రమే కోరుకుంటారు. వారికి ఆ భక్తియందే ప్రీతికలిగించి ఆ కార్యము నిరంతరము జరిపించుట యందు తత్పరుడైన భగవానుడు భక్తకార్యైకనిరతుడు.

"యోమద్భక్తః స మే ప్రియః । (గీతా 12-16). భక్త్యైవ తుష్టి మభ్యేతి హరిరన్యద్విడంబనం॥" భక్తివలననే శ్రీహరి సంతుష్టి పొందుతాడు. శ్రీహరి తన

అవతారములలో చేసిన కార్యములన్నీ తన భక్తులకు భక్తిభావము దృఢపడుటకు చేసినవే. లోకధర్మములననుకరించి చేసిన కార్యములవలె తోచును. ఇవే భగవల్లీలలు.

3. కురుపాండవ యుద్ధములో శ్రీకృష్ణుని భక్తకార్యైకనిరతత్వము అందరికి తెలిసినదే.

## 34. ద్రౌణ్యస్త్రవినివారకః :

ఉపపాండవులను హత్యచేసిన తర్వాత, తనను వెంబడిస్తున్న అర్జునిపై అశ్వత్థామ బ్రహ్మశిరోనామాస్త్రము ప్రయోగించాడు. అశ్వత్థామకు ఆ అస్త్రప్రయోగము తెలియును గాని దానిని ఉపసంహరించుట తెలియదు. అర్జునునకు దాని ప్రయోగ ఉపసంహరణలు రెండూ తెలియును. ఆపరి స్థితిలో ఏమిచేయాలో తెలియక అర్జునుడు వికలుడైనపుడు బ్రహ్మశిరో అస్త్రమును ప్రయోగించి, ఉపసంహరించిన రెండుఅస్త్రములు ఉపసంహరింప బడతాయన్న నివారణోపాయమును శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పాడు. ఆ విధముగా అర్జునునిచే చేయించి అశ్వత్థామవేసిన అస్త్రమును పూర్తిగా నివారింపజేసిన శ్రీకృష్ణుడు ద్రౌణ్యస్త్రవినివారకుడు.

*"కృష్ణ కృష్ణ మహాబాహో భక్తానామ భయంకర...." నుంచి "ప్రజోపప్లవమాలక్ష్య లోకవ్యతికరం చ తం । మతం చ వాసుదేవస్య సంజహారార్జునో ద్వయం" వరకు. [భాగ 1-7- (22-32)].*

**భక్తస్మయప్రణేతా చ భక్తవాక్పరిపాలకః ।**
**బ్రహ్మణ్యదేవో ధర్మాత్మా భక్తానాం చ పరీక్షకః ॥ 15**

## 35. భక్తస్మయప్రణేతా (చ) :

1. "స్మయ" అంటే విస్మయము, ఆశ్చర్యము లేదా గర్వము. ఉపపాండవు లను హత్యచేసిన అశ్వత్థామ బ్రాహ్మణుడైనా వధార్హుడని అర్జునునితో చెప్పి, పాండవులనందరిని ఆశ్చర్యపరిచిన శ్రీకృష్ణుడు "భక్తస్మయప్రణేతా" (ప్ర+నయ కర్తా = ప్రణయకర్తా, ప్రణేతా)."

*"మైనం (నైనం) పార్థార్హసి త్రాతుం బ్రహ్మబంధు ర్మిమం జహి..." (భాగ 1-7-35)*

2. అశ్వత్థామను తమ శక్తిసామర్థ్యములచేత అవమానపరిచేమన్న భీమార్జునుల గర్వము (భక్తస్మయము) పోగొట్టిన శ్రీకృష్ణుడు.



## 36. భక్తవాక్పరిపాలకః :

భీమార్జునులు ఆతతాయి అయిన అశ్వత్థామను చంపుతామని చెప్పగా, సాధ్వి ద్రౌపది "గురుపుత్రుని చంపవద్దని, తనకు కలిగినట్టి పుత్రశోకము గురుపత్నికి కలిగించవద్దని" చెప్పింది. ఇది విన్న శ్రీకృష్ణుడు అశ్వత్థామను అవమానపరిస్తే చంపినట్లే అవుతుందని చెప్పి అర్జునుని బ్రహ్మహత్యాపాపము నుండి రక్షించాడు. భక్తురాలు ద్రౌపది వాక్పరిపాలన చేసాడు.

*"తథాఽఽ హృతం పశువత్ పాశబద్ధమవాఙ్ముఖం కర్మజుగుప్సితేన..." నుంచి "...తత్కులం ప్రదహత్యాశు సానుబంధం శుచార్పితం" [భాగ 1-7- (42-48)].*

## 37. బ్రహ్మణ్యదేవః :

1. సాధువులు, జ్ఞానులు అయిన బ్రాహ్మణులు బ్రహ్మణ్యులు. వారిని ప్రకాశింపజేసే భగవానుడు బ్రహ్మణ్యదేవుడు.

2. బ్రహ్మణ్యులయందు రమించే భగవానుడు, బ్రహ్మణ్యదేవుడు.

3. బ్రహ్మణ్యులచే స్తుతింపబడేవాడు లేక వారిని స్తుతించే భగవానుడు బ్రహ్మణ్యదేవుడు. "నమో బ్రహ్మణ్య దేవాయ గోబ్రాహ్మణ హితాయచ । జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః ॥"

## 38. ధర్మాత్మా :

1. ధర్మమే ఆత్మస్వరూపముగా గలవాడు ధర్మాత్మ, భగవానుడు.

2. ధర్మరాజైన యుధిష్ఠిరుని రూపములోనున్న భగవానుడు.

3. ధర్మరక్షణ కొరకు అవతరించిన భగవానుడు.

"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।" నుంచి "...సంభవామి యుగే యుగే ॥" (గీత 4-7,8).

4. ధర్మమే ఎల్లప్పుడు తనచిత్తములో కలవాడు "ధర్మాత్మా".

## 39. భక్తానాం చ పరీక్షకః :

భక్తులైన పాండవులను ద్రౌపదిని కూడా పరీక్షించిన భగవానుడు- అశ్వత్థామను అవమానపరిచిన సందర్భమున వీరందరిని పరీక్షించిన భగవానుడు "భక్తానాం చ పరీక్షకః"

*"బ్రహ్మబంధుర్నహంతవ్య ఆతతాయీ వధార్హణః" (భాగ 1-7-53).*

**ఆసన్నహితకర్తా చ మాయాహితకరః ప్రభుః ।**
**ఉత్తరాప్రాణదాతా చ బ్రహ్మాస్త్రవినివారకః ॥ 16**

## 40. ఆసన్నహితకర్తా (చ) :

"ఆసన్నమ్" అంటే శీఘ్రముగా "హితకర్తా" అంటే హితము చేసేవాడు. లేక "ఆసన్నేషు" అంటే అంతరంగిక భక్తులకు, హితకర్తా హితము చేసేవాడు శ్రీకృష్ణుడు. పుత్రశోకముతో దుఃఖించే ద్రౌపదికిగల దుఃఖమును తగ్గించి, అశ్వత్థామను చంపుదామనుకొంటున్న అర్జునునకు ఆమెచే "చంపవద్దని" చెప్పించి, అతి శీఘ్రముగా, ఊహించని విధముగా, భక్తుడైన అర్జునునకు బ్రహ్మహత్యాదోషము నివారించుట, అశ్వత్థామను చంపకుండా అవమానించుట వంటి హితమును అనూహ్యముగా అప్పటికప్పుడే జరుగునట్లు చేసి, భక్తులైనపాండవులకు హితముచేసిన శ్రీకృష్ణుడు "ఆసన్నహితకర్తా" అనుటకు నిదర్శనము.

## 41. మాయాహితకరః :

1. "మాయయాహితకరః - మాయయా అంటే లోకరీతిగా, హితకరః అంటే హితము చేసేవాడు. లోకరీతిగా విదురునిచే హితము చెప్పించి,



ధృతరాష్ట్రునిచే వానప్రస్థాశ్రమము స్వీకరింపజేసి, భగవదా రాధన చేయించి, ధృతరాష్ట్ర గాంధారుల శోకము పోగొట్టిన భగవాన్ శ్రీకృష్ణుడు మాయాహితకరుడు.

2. ధృతరాష్ట్రుడు ప్రజ్ఞాశాలి అయినప్పటికి, పుత్రస్నేహము అనే మాయలో పడి సర్వస్వము పోగొట్టుకొన్నాడు. ఈ విధముగా అతనికి అహితము కలుగజేసిన శ్రీకృష్ణుడు (మాయా+అహితకరః = మాయాహితకరః)

3. తన ఆధీనములోనున్న "మాయ" అనే శక్తియందు అభయంకరుడైన భగవానుడు. భగవానుని కార్యములన్నీ మాయాశక్తిచేతనే జరుపబడతాయి. కాని అభయదములైన కార్యములు తానే తన నిజశక్తిచేత చేస్తాడు. అట్టి భగవానుడు మాయాహితకరుడు

**4.** 'మా' అంటే లక్ష్మి. 'అయః' అంటే ఆమె అధీనములోనున్న శుభములు కలిగించే విధి, (అయః శుభావహో విధిః, కోశము). అట్టి మాయద్వారా హితము కలిగించే భగవానుడు మాయాహితకరుడు.

## 42. ప్రభుః :

1. బ్రహ్మాదులందరికంటె అధికుడు (గొప్పవాడు), వారికి పూజ్యుడు అయిన భగవానుడు, ప్రభువు.

2. సకలకార్యములుచేసే సమర్థతగలిగి ప్రకాశించే భగవానుడు, ప్రభువు.

3. యుధిష్ఠిరునకు యుద్ధములో జయము చేకూర్చి, రాజ్యమునిచ్చి, అశ్వమేధాదియాగములు చేయించి, పాండవుల కందరికి ప్రభువైన శ్రీకృష్ణ భగవానుడు.

*"సాధయిత్వాஜాతశత్రోః స్వం రాజ్యం....." నుంచి "..... తద్యశః పావనం దిక్షు శతమన్యోరివాతనోత్" వరకు (భాగ 1 - 8 - 5,6).*

## 43. ఉత్తరప్రాణదాతా (చ) :

ఉత్తరకు ప్రాణదానముచేసిన శ్రీకృష్ణభగవానుడు. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము ఉత్తరగర్భములోనున్న శిశువును దగ్ధము చేస్తున్నప్పుడు ఆమె ప్రాణములు పోకుండా ఆమెకు, శిశువుకు ప్రాణదానము చేసిన శ్రీకృష్ణభగవానుడు.

*"పాహి పాహి మహాయోగిన్ దేవదేవ జగత్పతే" (భాగ 1-8-9).*

## 44. బ్రహ్మాస్త్రవినివారకః :

బ్రహ్మాస్త్రము అమోఘశక్తి కలది. తిరుగులేనిది. ఆ అస్త్రము ఉత్తరాగర్భస్థ శిశువును దగ్ధముచేయుచుండగా తనవైష్ణవతేజస్సుతో దానిని పూర్తిగా నివారించి ఆ శిశువుకు ప్రాణమునిచ్చిన శ్రీకృష్ణభగవానుడు.

*"యద్యప్యస్త్రం బ్రహ్మశిరస్త్వమోఘం చాప్రతిక్రియం...." (భాగ 1-8-15)*

**సర్వతః పాండవపతిః పరీక్షిచ్ఛుద్ధికారణమ్ ।**
**గూఢాత్మా-సర్వవేదేషు భక్తైకహృదయంగమః ॥ 17**

## 45. సర్వతః పాండవపతిః :

1. "సర్వతః సర్వస్మాత్ అనిష్టాత్ పాండవానాంపతిః పాలకో రక్షకః" పాండవులను అన్ని అనిష్టములు, కష్టములనుండి ఎల్లవేళల కాపాడిన శ్రీకృష్ణుడు "సర్వతః పాండవపతిః".

2. పాండవులకు ఐహికాముష్మిక ఫలములు ప్రసాదించిన శ్రీకృష్ణుడు. *"తర్హ్యేవాథ మునిశ్రేష్ఠ పాండవాః పంచసాయకాన్" నుంచి "... సుదర్శనేన స్వాస్త్రేణ స్వానాం రక్షాం వ్యధాద్విభుః వరకు (భాగ 1-8-12, 13).*

## 46. పరీక్షిచ్ఛుద్ధికారణం :

"పరీక్షితః శుద్ధేః కారణం" పరీక్షిత్ పవిత్రత పొందుటకు కారణమైన భగవానుడు.



ప్రతిజీవికి ముక్తి కలగడానికి ముందు శుద్ధి అవసరము. శుకుడు చెప్పిన భాగవతకథ విని పరీక్షిత్ ముక్తిపొందుటకు ముందుగా శుద్ధి అవసరము. ఉత్తరగర్భములో దగ్ధమవుతున్న శిశువును (పరీక్షిత్) రక్షించి గర్భదోషాదులు తొలగించి శుద్ధి కలిగించాడు. ఇట్లు పరీక్షిత్ పుట్టుటకు ముందుగానే శుద్ధిని ప్రసాదించిన శ్రీకృష్ణభగవానుడు పరీక్షిచ్ఛుద్ధి కారణం.

"వైయాసకిః స భగవానథ విష్ణురాతమ్" ఈ వాక్య సందర్భముగా విష్ణురాత పదమును వాఖ్యానిస్తూ శ్రీవల్లభాచార్యులువారిలా చెప్పారు. విష్ణురాతః అంటే విష్ణు భగవానునిచే రక్షింపబడ్డవాడు లేక గ్రహింపబడ్డవాడు. "విష్ణునా ఏతదర్థమేవ రక్షితః అన్యథా పురుషార్థో న సిద్ధ్యతి." పరీక్షిత్‌కు జన్మాంతమున ముక్తి ప్రసాదించుట కొరకు భగవానుడు గర్భస్థశిశువైన పరీక్షిత్‌ను రక్షించాడు. అట్లు కాకున్న పరీక్షిత్‌నకు చతుర్థపురుషార్థము అయిన మోక్షము (ముక్తి) సిద్ధించదు కదా!

## 47. గూఢాత్మా - సర్వవేదేషు :

"గూఢాత్మా + సర్వేష్వపివేదేషు" అన్న రెండు సమాసములు కలిసి "గూఢాత్మా సర్వవేదేషు" అన్న ఏకపదము (నామము)గా చెప్పబడినది. ఇట్లు చెప్పుట శాస్త్రవిరుద్ధము కాదు. మహాభారతములోని విష్ణుసహస్రనామస్తోత్రములో కూడా ఇట్టి రెండు సమాసములతో కూడిన ఏకపదనామములు కలవు. "ముక్తానాం పరమాగతిః" (వి.స.నా. 12వ నామం 15వ శ్లోకం) "శ్రీమతాం వరః" (వి.స.నా.604వ నామం 77వ శ్లోకం) మొదలైనవి. "భగవానుని (ఆత్మా) స్వరూపము అన్ని వేదములలోను అతి గూఢము (గుప్తము)గా చెప్పబడి (అతిగూఢముగా వ్యాపించి) అన్ని చోట్ల స్ఫురిస్తుంది." ఇది ఈ నామము యొక్క అర్థము.

"వేదైశ్చ సర్వైరహమేవవేద్యః" (గీత 15-15) అనగా సర్వవేదముల లోను నేనే తెలియబడుచున్నాను. "వేదే రామాయణే పుణ్యే పురాణే భారతే తథా ఆదావన్తేచ మధ్యేచ హరిః సర్వత్రగీయత" అనగా వేదములు, రామాయణము, మహాభారతము, పురాణములు మొదలైన గ్రంథములందు మొదటినుంచి చివరవరకు భగవానుడే ప్రతిపాదింపబడి, కీర్తింపబడ్డాడు. ఇలా చెప్పినప్పటికి, భగవానుని యథార్థస్వరూపము

తెలియుట లేదు. "న తం విదాథ య ఇమా జజాన" (శ్రుతి). నానా రూపములు గల ఈ ప్రకృతి ఎవరి నుండి పుట్టెనో, ఆ ప్రకృతి భగవానుని తెలుసుకొనలేదు. లేక అనంతములైన వేదవాక్కులు ఎవరినుండి పుట్టాయో అవి (వేదవాక్కులు) ఆ భగవానుని తెలుసుకొనలేవు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ (శ్రుతి). అనూహ్యమైన భగవానుని మనస్సుచేత కూడా పొందలేరు. అందుచేత మాటలు ఆ భగవానుని (వర్ణించలేక) చేరలేక వెనుకకు మరలాయని అర్థము- అన్నివేదములలోను, గ్రంథముల లోను అంతటా భగవానుని ప్రతిపాదించి నప్పటికి అతని నిజస్వరూపము వర్ణించ లేనప్పటికి, ఆతని గురించి పండితుల భావము ఏమిటో ఆ విధముగానే ఆయనను భావించాలి. "ప్రతత్తే అద్య శిపివిష్టనామార్థః సగ్ంశామి వయునాని విద్వాన్ / తం త్వా గృణామి తవ సమతవ్యాన్ క్షయన్తమస్య రజసః పరాకే" (శ్రుతి). అంటే శిపివిష్ట ! విష్ణుమూర్తి ! లోకములోను వేదములోను సుప్రసిద్ధమైన నీ నామములను నేను స్తోత్రము చేయుచున్నాను. నీవు ఎటువంటి వాడివో ఎలా ఉంటావో నాకు తెలియదు. పండితులు నిన్నెలా కీర్తిస్తారో ఆ లోక, వేదప్రసిద్ధి చెందిన నామములతో అనూచాన సాంప్రదాయము ననుసరించి నేను కూడా ఆ విధముగానే స్తుతిస్తాను. నీవు అందరిలోను అన్నివిధముల అధికుడవు. నేను అల్పుడను. అన్ని విధములలోను చాలా తక్కువవాడిని. నీవు ఈ ప్రపంచమునకు రంజనాత్మకుడవు. ఈ ప్రపంచము కంటె వేరుగా ఉంటావు. "మాంతు వేద న కశ్చన" (గీత 7-26) నీ అభిప్రాయమును, నీ మహాత్మ్యమును ఎవ్వరు తెలుసుకోలేరు. ఇది గూడాత్మాసర్వదేషు నామార్థము.

## 48. భక్తైకహృదయంగమః :

1. భక్తుల హృదయములో మాత్రమే ఉండే భగవానుడు "భక్తైక హృదయంగమః" అనబడతాడు.

2. భక్తుల హృదయమే తన హృదయమై (రెండూ ఒక్కటై) ఉన్న భగవానుడు లేక అట్టి జ్ఞానము భక్తులకు కలిగించే భగవానుడు "భక్తైకహృదయంగముడు"

**కుంతీస్తుత్యః ప్రసన్నాత్మా పరమాద్భుతకార్యకృత్ ।**
**భీష్మముక్తిప్రదః స్వామీ భక్తమోహనివారకః ॥ 18**



## 49. కుంతీస్తుత్యః :

"కుంత్యాస్తుత్యః స్తోతుం యోగ్యః భక్తైకహృదయంగమత్వాదేవ స్త్రియాపి కుంత్యా స్తుత్యో భవత్యేవ స్వరూపజ్ఞానస్య జాతత్వాత్ । స్తుతేశ్చ స్వరూపజ్ఞానస్య సాధ్యత్వాదితి ।" శ్రీకృష్ణుడు కుంతికి భక్తైకహృదయంగముడు. అందువలన ఆమెకు భగవానుని స్వరూపజ్ఞానము కలిగింది. ఈ కారణముచేత స్త్రీ అయినను భగవానుని స్వరూపజ్ఞానము తెలిపే స్తుతి చేయగలిగినది. ఆమె చేసిన శ్రీకృష్ణుని స్తుతి ఇందుకు నిదర్శనము. ఈ విధమైన స్తుతి కుంతీదేవిచే చేయబడ్డ శ్రీకృష్ణుడు కుంత్యాస్తుత్యుడు.

*"నమస్యే పురుషం త్వాఽఽ ఉద్యమీశ్వరం ప్రకృతేః పరం...." నుంచి "యోగేశ్వరాఖిలగురో భగవన్నమస్తే ॥" [భాగ 1-8 - (18-43)].*

## 50. ప్రసన్నాత్మా :

"ప్రసన్న ప్రసాదయుక్త ఆత్మా చిత్తం యస్యేతి ప్రసన్నాత్మా." ప్రసాద యుక్త మనగా నిర్మలమైన అంతఃకరణ కలవాడు లేక అనుగ్రహముతో కూడిన చిత్తము కలవాడు. రజస్తమో గుణములు అంతఃకరణమును కలుషితము చేస్తాయి. ఈ గుణములు లేకుండా నిర్మలమైన (స్వచ్ఛమైన, అంతఃకరణము (ఆత్మ) కలిగి యుండుట భగవత్ప్రసాదము. భక్తులకు ఇట్టి స్థితి కలిగించిన భగవానుడు స్వయముగా "ప్రసన్నాత్మా". ఇట్టి వారికి సర్వకామములు సిద్ధిస్తాయి.

## 51. పరమాద్భుతకార్యకృత్ :

ఇతరులు చేయలేని ఆశ్చర్యకరములైన మహత్తర కార్యములు చేసే భగవానుడు "పరమాద్భుతకార్యకృత్". వ్యాసాది మహర్షుల ఎదుట భీష్ముడు యుధిష్ఠిరునకు సర్వభగవద్ధర్మములు బోధించుచు శ్రీకృష్ణుడు మహాద్భుత కార్యములు చేసే పరమాత్మ అని సర్వధర్మఉపదేష్ట అని వర్ణించాడు.

*"నహ్యస్య కర్హిచిద్రాజన్ ....." నుంచి "...... ముఖాంబుజోధ్యానపథశ్చతుర్భుజః " వరకు [భాగ 1-9 - (16-24)].*

## 52. భీష్మముక్తిప్రదః :

భీష్మునికి అన్నిదుఃఖములు పోగొట్టి మోక్షము ప్రసాదించిన శ్రీకృష్ణ భగవానుడు.

*''తదోప సంహృత్య గిరః'' నుంచి ''సోఽన్తఃశ్వాస ఉపారమత్''. [భాగ 1-9-(30-43)].*

## 53. స్వామీ :

"స్వం భక్తరూపమేవ విద్యతే యస్యేతి స్వామీ" ముక్తరూపులైన భక్తుల స్వరూపమునందు చక్కగాఉండే భగవానుడు స్వామి. ... "యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహం" (గీత 9-29) ఎవరు నన్ను భక్తితో సేవిస్తారో వారు నాయందు ఉన్నారు. నేను కూడా వారి యందున్నాను అని అర్థము.

## 54. భక్తమోహనివారకః :

ఇక్కడ భక్తుడైన యుధిష్ఠిరునిగురించి చెప్పబడింది. యుద్ధములో బంధువధ జరిగినదని యుధిష్ఠిరునకు మోహము కలిగినది. ఆ మోహము పోవడానికి శ్రీకృష్ణుడు అతనిని భీష్ముని దగ్గర భగవద్ధర్మములు తెలుసుకో మన్నాడు. శ్రీకృష్ణుని ఉపదేశానుసారము భీష్ముడు చెప్పిన భగవద్ధర్మములు వినిన యుధిష్ఠిరునికి మోహము పోయినది ఇట్లు తనభక్తుని మోహనివారణ చేసిన శ్రీకృష్ణుడు భక్తమోహనివారుకుడు.

*"నిశమ్య భీష్మోక్తమథాచ్యుతోక్తం...." (భాగ 1-10-3).*

**సర్వావస్థాసు సంసేవ్యః సమః సుఖహితప్రదః ।**
**కృతకృత్యః సర్వసాక్షీ భక్తస్త్రీరతివర్ధనః ॥ 19**

## 55. సర్వావస్థాసు సంసేవ్యః :

బాల్యము మొదలుకొని ఆపైనున్న అన్ని వయస్సులలోను (సర్వావస్థలలో) ఉన్న శ్రీకృష్ణభగవానుడు కపటరహితమైన చిత్తము గల భక్తులచే చక్కగా పూజింప (సేవింప, లేక భజింప) దగినవాడు, "సర్వావస్థాసుసంసేవ్యః."



## 56. సమః :

1. అన్ని కాలములందు- సృష్టికి పూర్వము, సృష్టి, స్థితుల సమయము లోను ప్రళయము తర్వాత, సర్వవికారరహితుడై అన్నిటియందు సమదృష్టికలిగి, అన్నిటిని స్వీకరించే భగవానుడు సముడు.

*"సమం సర్వేషు భూతేషు..." (గీత 13-27). సమం పశ్యన్హి సర్వత్ర... (గీత 13-28) "సమః శత్రౌచ మిత్రేచ (గీత 12-18) "సమోఽహం సర్వభూతేషు" (గీత 9-29) మొదలైన వాక్యాలు "సమః"కు అర్థము.*

2. మ = లక్ష్మీ; స = సహితము; లక్ష్మీదేవితో కూడియున్న భగవానుడు సముడు.

## 57. సుఖహితప్రదః :

1. "సుఖంచ హితంచ భక్తేభ్యః ప్రకర్షేణ దదాతి ఇతి "సుఖహితప్రదః". భక్తులకు ఎల్లవేళల సుఖము, హితము చక్కగా చేకూర్చే భగవానుడు సుఖహిత ప్రదుడు.

2. "భక్తేభ్యః సుఖాయ యద్ హితం తత్ ప్రదదాతి" భక్తులకు సుఖము (ఆనందము) చేకూర్చుటకు ఏది మంచిదో దానిని అధికముగా ప్రసాదించే భగవానుడు.

## 58. కృతకృత్యః :

1. "కృతం - సర్వదాసిద్ధమేవకార్యం యస్య - పూర్ణకామత్వాత్" భగవానుడు పూర్ణకాముడు. ఆయన పనులన్నీ పూర్తిగా చేయబడి ఉంటాయి. పూర్తికాకుండా ఏ కార్యము మిగిలి ఉండదు. అందుచేత భగవానుడు కృతకృత్యుడు.

"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన" (గీత 3-22)

2. భూభారహరణాది కార్యములు (లోకకళ్యాణము కొరకు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ) పూర్తిగా ఆచరించే భగవానుడు, కృతకృత్యుడు.

## 59. సర్వసాక్షీ :

జీవుడు తన ఇంద్రియములు, అంతఃకరణము సహాయముతో విషయములను తెలుసుకుంటాడు. ఇందులో ఏ ఒక్కటి సరిగా లేకపోయినా లేక సరిగా పనిచేయకపోయినా దేనినీ తెలుసుకొనలేడు. భగవంతుడు అలాగ కాదు. భగవంతునికి ఈ విశ్వములో చూడనివి కాని, తెలియని కాని ఏమీ ఉండవు. సాక్షాత్ జ్ఞానస్వరూపుడు కనుక అతడు ఏ ఇతర కరణముల సహాయము లేకుండా, సర్వము సాక్షాత్ తన జ్ఞాన స్వరూపము చేత తెలుసుకుంటాడు. అందుచేత "సర్వసాక్షీ."

## 60. భక్తస్త్రీరతివర్ధనః :

1. "భక్తానాం యుధిష్ఠిరాధీనాం; స్త్రీణాం కుంత్యాదీనాం; రతిం భక్తిం; వర్ధయతీతి వర్ధనః" యుధిష్ఠిరాది పాండవులు, కుంతీ, ద్రౌపది మొదలైన కురువంశ స్త్రీలు శ్రీకృష్ణుని భక్తులు. వారి భక్తి తనయందు రోజు రోజుకు వృద్ధిచెందనట్లు చేసే శ్రీకృష్ణభగవానుడు భక్తస్త్రీరతివర్ధనుడు.

2. తనను ప్రేమించే "ప్రేమభక్తి" గల స్త్రీల యందు తనపై భక్తి వృద్ధి చేసే శ్రీకృష్ణుడు.

*"..... నసేహిరే విముహ్యన్తో విరహం శార్ఙ్గధన్వనః" (భాగ 1-10-10) ప్రాసాదశిఖరారూఢాః కురునార్యో దిదృక్షయా..." (భాగ 1-10-16)*

**సర్వసౌభాగ్యనిలయః పరమాశ్చర్యరూపధృక్ ।**
**అనన్యపురుషస్వామీ ద్వారకాభాగ్యభాజనమ్ ॥ 20**

## 61. సర్వసౌభాగ్యనిలయః :

శ్రీకృష్ణుడు హస్తినాపురము నుండి ద్వారకకు వెళ్లే సమయములో హస్తినాపురస్త్రీలు సర్వసౌభాగ్యములకు సహజస్థానమైన ఆతని గొప్ప సౌభాగ్యములు వర్ణించారు. అట్టి శ్రీకృష్ణుడు సర్వసౌభాగ్యనిలయుడు



*"స వై కిలాయం పురుషః పురాతనో......." నుంచి "....... న జాత్వపైత్యాహృతి-భిర్హృదిస్పృశన్"* [భాగ 1-10 - (21-30)].

## 62. పరమాశ్చర్యరూపధృక్ :

శ్రీకృష్ణుని దివ్యమంగళవిగ్రహము అందరిని ఆకర్షించి పరమాశ్చర్యములో ముంచివేస్తుంది. ఇట్టి రూపము ఆతనిలో తప్ప మరి ఎక్కడ కానరాదు. ఇంతకు ముందు చూడలేదు. ముందు ముందు కూడా ఇట్టి రూపము ఎవ్వరిలోను చూడలేము అనిపిస్తుంది. ఇట్టిది శ్రీకృష్ణుని పరమాశ్చర్య రూపము.

*"సితాతపత్రవ్యజనైరుపస్కృతః" (భాగ 1-11-27).*

## 63. అనన్యపురుషస్వామీ :

1. అన్యము అంటే వేరే మరిఒకటి. అన్యము లేనిది అనన్యము. భగవంతుడు తప్ప వేరేమియు లేనివారు అనన్యపురుషులు లేక అనన్యభక్తులు. అనన్యభక్తులకు స్వామి లేక ప్రభువు లేక రక్షకుడు అనన్యపురుషస్వామీ.

2. ద్వారకలోనున్న యాదవులందరు దేవతల అంశలతో అవతరించినవారు. వారికి శ్రీకృష్ణుడు తప్పవేరెవ్వరూ ప్రభువు కారు. వీరు అనన్య పురుషులు. శ్రీకృష్ణుడు అనన్యపురుషస్వామి.

3. ప్రాణులకు పురుషుడు అనే పేరున్నది. వీరందరికి పరమాత్మ తప్ప వేరెవ్వరు స్వామి కాడు. అందుచేత పరబ్రహ్మ అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు అనన్యపురుషస్వామి.

## 64. ద్వారకాభాగ్యభాజనమ్ :

భాజనం అనగా కారణము, ఆధారము, స్థానము. మహేంద్రుని భోగభాగ్యములకంటె గొప్పవైన భోగభాగ్యములతో ద్వారకానగరము శ్రీకృష్ణుని కొరకు నిర్మింపబడింది. ఇట్టి భోగములు కలుగుటకు కారకుడై, వాటిని అనుభవించే శ్రీకృష్ణుడు "ద్వారకాభాగ్యభాజనమ్". ఆ భోగభాగ్యములకు స్థానమైనవాడు శ్రీకృష్ణుడు.

**బీజసంస్కారకర్తా చ పరీక్షిజ్జ్ఞానపోషకః ।**
**సర్వత్రపూర్ణగుణకః సర్వభూషణభూషితః ॥ 21**

## 65. బీజసంస్కారకర్తా (చ) :

"బీజస్య పరీక్షిద్దేహస్య సంస్కారః కర్మోపార్జిత పూర్వదేహనివృత్త్యా భగవద్భజనయోగ్య దేహసంపత్తిస్తస్య కర్తా" అని భాష్యము. పరీక్షిత్ యొక్క పూర్వ జన్మకర్మలచే సంపాదింపబడిన (కలిగిన) దేహసంబంధవాసనలు పోగొట్టి, భగవంతుని సేవించుటకు యోగ్యమైన దేహసంపత్తిని పరీక్షిత్‌కు ప్రసాదించిన శ్రీకృష్ణభగవానుడు అని అర్థము. ఇట్లు పరీక్షిత్ ప్రాణములను రక్షించుటేకాక అతనికి భగవద్భజనయోగ్యత కూడా ప్రసాదించిన భగవానుడు బీజసంస్కారకర్త.

## 66. పరీక్షిజ్జ్ఞానపోషకః :

జీవులు తల్లి గర్భములో ఉన్నప్పుడు పూర్వజన్మల సంస్కారజ్ఞానము కలిగిఉంటారు. పుట్టగానే అజ్ఞానము పోతుంది. పరీక్షిత్‌కు అలా కాకుండా పూర్వజన్మల సంస్కారజ్ఞానము దృఢపడి, జన్మించిన తర్వాత కూడా ఆ జ్ఞానము ఉండేటట్లు చేసిన భగవానుడు "పరీక్షిజ్జ్ఞానపోషకుడు"

## 67. సర్వత్రపూర్ణగుణకః :

"సర్వత్రాఽన్తర్బహిరపి, పూర్ణా అక్షయా, గుణా ఐశ్వర్యాదయో యస్య సః" లోనబయట అంతటా వ్యాపించి, అక్షయములైన పూర్ణ ఐశ్వర్యగుణములతో కూడుకున్న భగవానుడు "సర్వత్రపూర్ణగుణకః" అనబడుతాడు. మాతృగర్భములో బ్రహ్మాస్త్రముచే దహించుకుపోతున్న పరీక్షిత్- శిశువును ఇట్టి ఐశ్వర్యగుణకుడైన భగవానుడు రక్షించాడు.

*"మాతుర్గర్భగతో వీరః స తదా భృగునందన...." (భాగ 1-12-7).*

## 68. సర్వభూషణభూషితః :

ఉత్తరగర్భములోఉన్న పరీక్షిత్- శిశువును రక్షించిన భగవానుడు అంగుష్ఠ



మాత్ర శరీరుడు, ఎంతో తేజస్వి, చతుర్భుజములు కలవాడు. గదతో బ్రహ్మాస్త్రమును నివారించుచున్నవాడు. సర్వభూషణములు ధరించినవాడు. ఇట్టి భగవానుని ఆ శిశువు (పరీక్షిత్) చూచాడు.

*"అంగుష్ఠమాత్రమమలం, స్ఫురత్" నుంచి "..... పర్యేక్షత క ఇత్యసౌ" [భాగ 1-12- (8-10)].*

**సర్వలక్షణదాతా చ ధృతరాష్ట్రవిముక్తిదః ।**
**సన్మార్గరక్షకో నిత్యం విదురప్రీతిపూరకః ॥ 22**

## 69. సర్వలక్షణదాతా (చ) :

ఇక్ష్వాకాది చక్రవర్తులందరికి భగవానుడు ఎన్నో గొప్పలక్షణములు ప్రసాదించాడు. వారందరికి ప్రసాదించిన ప్రసిద్ధ లక్షణములన్నీ భగవానుడు పరీక్షిత్‌కు కూడా ప్రసాదించాడు. అందుచేత భగవానుడు సర్వలక్షణదాత.

*"పార్థ ప్రజావితా సాక్షాదిక్ష్వాకురివ మానవః....." నుంచి ".... గర్భేదృష్టమను ధ్యాయన్ పరీక్షేత నరేష్విహ" [భాగ 1-12 - (19-30)].*

## 70. ధృతరాష్ట్రవిముక్తిదః :

విదురుని మాటలు వినిన ధృతరాష్ట్రునికి విశేషమైన వైరాగ్యము కలిగింది. వ్యాసమహర్షి ఉపదేశానుసారము అడవికి వెళ్లి భగవద్భక్తితో శేషజీవితము వానప్రస్థాశ్రమములో గడిపి ముక్తి పొందాడు. ఇట్టి ముక్తిని ధృతరాష్ట్రునకు ప్రసాదించిన భగవానుడు.

*"ఏవం రాజా విదురేణానుజేన ప్రజ్ఞాచక్షుర్బోధిత ఆజమీఢః...." (భాగ 1-13-28).*

## 71. సన్మార్గరక్షకోనిత్యం :

"అయమేవ సతాంమార్గో రీతిః యద్గృహత్యాగ పూర్వకం భగవత్ప్రాప్తి సాధనం కార్యం". అనగా గృహత్యాగం చేసి భగవత్ప్రాప్తికి సాధనచేయడం సన్మార్గము. ధృతరాష్ట్రుడు వైరాగ్యము కలిగి, వానప్రస్థాశ్రమము గ్రహించి,

భగవద్భక్తితో ముక్తి పొందుటకు భగవానుడే కారణము. భక్తులకు నిత్యము సన్మార్గరక్షణ చేసేవాడు భగవానుడే.

**72. విదురప్రీతిపూరకః :**

విదురునకు ఎక్కువగా ప్రీతి కలిగించేది భగవద్భక్తి. ఆ భక్తిలో అతడు ఆనందము అనుభవించేవాడు. అట్టి భక్తిని విదురునకు ఇచ్చి, ఆతనికి పూర్తిగా ఆనందము (సుఖము, ప్రీతి) కలిగించిన భగవానుడు విదురప్రీతిపూరకుడు, శ్రీకృష్ణుడు.

**లీలావ్యామోహకర్తా చ కాలధర్మప్రవర్తకః ।**
**పాండవానాం మోక్షదాతా పరీక్షిద్భాగ్యవర్ధనః ॥ 23**

**73. లీలావ్యామోహకర్తా (చ) :**

1. లీలా అంటే చేష్ట; వి-అంటే కాలము; మోహకర్తా-అంటే మోహింప జేసేవాడు. ఈ అనంతకాలములో భగవానుడు తన నిత్యలీలలచే అందరిని (అసురులను, భక్తులనుకూడా) మోహింప చేస్తాడు. అందుచే "లీలా వ్యామోహ కర్తా" అనే నామము;

*"యోఽయంకాలస్తస్యతేఽవ్యక్త బంధో...."*

2. శ్రీకృష్ణుడు మనుష్య రూపములో తన లీలలు ప్రదర్శించి (ప్రకటించి) లోకకంటకులైన అసురులను విశేషముగా మోహింపజేసి- జరాసంధుని కాలయవనుని మహాభారత యుద్ధములో హతులైన రాజులను-అంతము చేసాడు. ఈ విధముగా శ్రీకృష్ణభగవానుడు లీలావ్యామోహకర్త.

*"యత్తేజసా నృప శిరోఽంఘ్రి మహన్మఖార్థే....." నుంచి "..... మిథో నిఘ్నంతి భూతాని భావయంతి చ యన్మిథః"* *[భాగ 1-15 - (9-24)].*

**74. కాలధర్మప్రవర్తకః :**

"కాలస్యరౌద్రస్య ధర్మాః త్రివిధ ఉత్పాతాః తేషాం ప్రవృత్తి కర్తా కాలధర్మ ప్రవర్తకః" కాలమనగా కాలుడు లేక రుద్రుడు. "కాలాయనమః" *(శ్రుతి)* రుద్రుని ధర్మములు (లక్షణములు) త్రివిధములైన (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక) దుఃఖములు కలిగించే (లేక ఉత్పాతములు కలిగించే) కాలధర్మములు. ఆయా కాలములలో ఆయా ఉత్పాతములు కలుగజేసే భగవానుడు, కాలధర్మ ప్రవర్తకుడు.



*"వ్యతీతాః కతిచిన్మాసాస్తదా...." నుంచి "..... పృచ్ఛతి స్మ సుహృన్మధ్యే సంస్మరన్నారదేరితం" వరకు.* *[భాగ 1-14 - (2-24)]*

**75. పాండవానాం మోక్షదాతా :**

అర్జునుడు ద్వారకనుంచి హస్తినాపురము తిరిగి వచ్చాక, పరీక్షిత్‌కు పట్టాభిషేకము చేసి, పాండవులు భగవానుని చిత్తములో స్మరిస్తూ, నారచీరలు కట్టుకొని, నిరాహారులై, కేశములు విరబోసుకొని మౌనముగా ఉత్తర దిశగా ప్రయాణము చేసి మోక్షము పొందారు.

*"చీరవాసా, నిరాహారో బద్ధవాజ్ ముక్తమూర్ధజః....." నుంచి ".... లబ్ధ్వా హరౌ భక్తిముపైతి సిద్ధిం" వరకు [భాగ 1-15 - (43-51)].*

**76. పరీక్షిద్భాగ్యవర్ధనః :**

"పరిత ఈక్షతే సర్వం జానాతీతి పరీక్షిత్" అన్ని విషయములందు పనులయందు పూర్తిగా దృష్టి సారించి క్షుణ్ణంగా తెలుసుకొనేవాడు పరీక్షిత్. పరీక్షిత్ పుట్టినపుడు బ్రాహ్మణులు అతని భోగభాగ్యాదులు, రాజ్యపాలన మొదలైన విషయముల గురించి ఏమేమి చెప్పారో అవన్నీ ఆయన పరిపాలనా కాలములో వర్ధిల్లజేసిన భగవానుడు పరీక్షిద్భాగ్యవర్ధనుడు. అతని రాజ్యపాలనా సమయంలో ప్రజలు సుఖముగా ఉండిరి. వారి భోగభాగ్యములన్నీ గొప్పగా వృద్ధి చెందాయి.
*"తతః పరీక్షిద్ ద్విజవర్యశిక్షయా మహీం మహాభాగవతః శశాస హ"* *(భాగ 1-16-1).*

**కలినిగ్రహకర్తా చ ధర్మాదీనాం చ పోషకః ।**
**సత్సంగజ్ఞానహేతుశ్చ శ్రీభాగవతకారణం ॥ 24**

## 77. కలినిగ్రహకర్తా (చ) :

పరీక్షిత్ కలిని పూర్తిగా వశపరుచుకున్నట్లు చేసిన భగవానుడు కలినిగ్రహకర్త.

*"న తే గుడాకేశ యశోధరాణాం బద్ధాంజలేర్వై భయమస్తి కించిత్..." నుంచి "... యత్రైవ నియతో వత్స్య ఆతిష్ఠంస్తేఽనుశాసనమ్"* [భాగ 1-17 - (31-37)].

## 78. ధర్మాదీనాం చ పోషకః :

పరీక్షిత్ కలిని నిగ్రహించి వృషభరూపుడైన ధర్మమునకు నష్టపోయిన తప శ్శౌచ దయా రూపులైన మూడు పాదములు ప్రసాదించి, ధర్మరూప వృషభమును నాలుగు పాదములపై నడిపించినట్లు చేసిన భగవానుడు.

"వృషస్య నష్టాంస్త్రీన్ పాదాన్ తప శ్శౌచం దయామితి" నుంచి "..... యస్య పాలయతః క్షోణీం యూయం సత్రాయ దీక్షితాః" వరకు [ భాగ 1-17 - (42-45) ].

## 79. సత్సంగజ్ఞానహేతుః (చ) :

1. సతాంసంగః సత్‌సంగః. భక్తుల సాంగత్యము, వారి దర్శన, స్పర్శ, ఆలాపాదులు సత్సంగము. ఇట్టి సత్సంగముచే జ్ఞానము కలుగుతుంది. కాని యీ సత్సంగము భగవానుని కృపవలన మాత్రమే కలుగుతుంది. ఆ భగవత్కృప లేకపోయినచో కలుగదు. పరీక్షిత్‌పై భగవానునికిగల కృపచేత అతనికి సత్సంగ ఫలమైన జ్ఞానము ప్రాప్తించినది. కాబట్టి భగవంతుడు సత్సంగజ్ఞానహేతువు.

2. ఏ సత్సంగము జ్ఞానమునకు కారణమౌతుందో, అదే సత్సంగజ్ఞాన హేతువు.

3. భగవద్భక్తుల సత్సంగము లవలేశము కలిగినా ఆ సత్సంగ సుఖముతో స్వర్గసుఖముగాని, ముక్తిగాని సరిపోల్చలేము. సత్సంగ సుఖము అంతగొప్పది.

*"తులయామ లవేనాపి న స్వర్గం నాపునర్భవమ్ భగవత్సంగి సంగస్య మర్త్యానాం కిముతాశిషః"* *(భాగ. 4-30-34).*



## 80. శ్రీభాగవతకారణం :

'శ్రీ' అనగా శ్రేయస్సు. 'శ్రీమత్' అనగా శ్రేయస్సుతో కూడుకొన్నది. అట్టి శ్రేయస్సుతో కూడుకున్న భాగవతము "శ్రీమద్భాగవతము". శ్రీమద్భాగవత పఠన, శ్రవణ, మననములు శ్రేయస్సును, భగవద్భక్తిని ప్రసాదిస్తాయి. ఇంతగొప్పదైన భాగవతము అందరికి అందుబాటులో ఉండడానికని పరీక్షిత్‌కు బ్రాహ్మణశాపము, శుకమహర్షి వచ్చి అతనికి భాగవతము వినిపించుట, పరీక్షిత్‌కు మోక్షము కలుగుట, వ్యాజములు (మిషలు). జీవకారుణ్యము చేత భాగవతమును మనకందరికి అందజేయుటకు కారణమైన భగవానుడు "శ్రీభాగవతకారణం".

**ప్రాకృతాదృష్టమార్గశ్చ .......... ।**
**.............................. ॥ 25**

## 81. ప్రాకృతాదృష్టమార్గః (చ) :

1. "అదృష్టం కర్మ, తదాధీనో మార్గః అదృష్ట మార్గః". అదృష్టమనగా కర్మ. దానికి అధీనమైన మార్గము పుట్టుట, గిట్టుట మొదలైనవి. ప్రకృతి కార్యములు. సర్వజీవస్వభావము ప్రాకృతము. ఈ విధముగా సర్వజీవులకు జన్మమృత్యువులతో కూడిన కర్మయుక్త సంసారమార్గము కలిగించిన భగవానుడు, "ప్రాకృతాదృష్టమార్గః" అని చెప్పబడతాడు.

2. అదృష్టమనగా కనబడనిది, పూర్వజన్మకర్మ. సర్వజీవులకు ప్రకృతి వలన పూర్వజన్మ కర్మలతో సంబంధించిన మార్గము విధింపబడుతుంది. ఇట్టి కర్మయుక్త సంసారమార్గము కలిగించే భగవానుడే "ప్రాకృతాదృష్టమార్గః" అని చెప్పబడతాడు.

3. ప్రకృతికార్యం ప్రాకృతం (దేహాదులు) అదృష్టంప్రారబ్ధం "మార్జయతి దూరీ కరోతీతి మార్గః" కనుక ప్రారబ్దమును, దేహాదులతో బంధమును, సకలవాసనలను, పోగొట్టి శుద్ధి కలిగించి, జ్ఞానయుక్త భక్తిని ప్రసాదించు భగవానుడు "ప్రాకృతాదృష్టమార్గః" అని చెప్పబడతాడు.

*ఇంతవరకు ప్రథమస్కంధ నామములు.*

## శ్రీమద్భాగవత ద్వితీయస్కంధ నామములు

*సాధనలీలా నామములు (82-106)*

*శ్లోక సంఖ్య (25-29)*

**............... శ్రోతవ్యః సకలాగమైః ।**
**కీర్తితవ్యః శుద్ధభావైః స్మర్తవ్యశ్చాత్మవిత్తమైః ॥ 25**

82, 83, 84 నామములు ప్రథమ స్కంధాంతమున గల పరీక్షిత్ ప్రశ్నకు శుకుడు ఇచ్చిన జవాబునకు సంబంధించినవి.

పరీక్షిత్ ప్రశ్న : యచ్ఛ్రోతవ్యమథో జప్యం యత్కర్తవ్యం నృభిః ప్రభో ।
స్మర్తవ్యం భజనీయం వా బ్రూహి యద్వా విపర్యయం. *(భాగ 1-19-38)*

తాత్పర్యం : ప్రభో! మనుష్యుడు భగవత్ప్రాప్తికొరకు ఏమి చేయాలి? ఏమిటి (ఎవరి కథ) వినాలి? ఏ నామము జపించాలి? ఎవరిని స్మరించాలి? దేనిని త్యాగము చేయాలి? అని.

### 82. శ్రోతవ్యః సకలాగమైః :

సకలాగమైః అన్ని వేదశాస్త్రములలోను, శ్రోతవ్యః స్తోత్రము చేయదగిన వాడు లేక స్వరూపజ్ఞానసిద్ధి కొరకు వినదగినవాడు భగవానుడే అని చెప్పబడ్డది. అన్ని వేదములలోను, శాస్త్రములలోను, సిద్ధాంతములలోను శ్రీకృష్ణుడే (శ్రీహరియే) శ్రోతవ్యుడు.

"వేదైశ్చసర్వైరహమేవ వేద్యః" (గీత 15-15); సర్వేవేదాః యత్పదమామనన్తి (శ్రుతి). అన్ని వేదములు దేనిని (ఏ స్థానమును) చక్కగా స్తోత్రము చేయుచున్నవో లేక పూజించుచున్నవో ఆ స్థానము భగవానుడు. "తస్మాద్భారత సర్వాత్మా భగవానీశ్వరోహరిః। శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛతాఽభయమ్" (భాగ 2-1-5). మోక్షముకోరు పురుషులు సర్వాత్ముడు, ఈశ్వరుడు, భగవానుడు అయిన శ్రీహరినే కీర్తింపవలెను. స్మరింపవలెను.



### 83. కీర్తితవ్యః శుద్ధభావైః :

కామక్రోధాదిభావరహితమైన అంతఃకరణ వృత్తులు కలవారు శుద్ధ భావులు. వారిచే కీర్తింపబడేయోగ్యుడు భగవానుడు 'శ్రీహరి' మాత్రమే. "మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాస్థితాః। భజన్త్యనన్య మనసో జ్ఞాత్వా భూతాది మవ్యయం॥ సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే" (గీత 9-13, 14). మహాత్ములు దైవీ ప్రకృతిని (దేవతా సంబంధమైన స్వభావమును) ఆశ్రయించి, భగవానుని సమస్త ప్రాణులకు హేతువుగను, నాశనము లేనివానిగను తెలుసుకొని, ఇతర చింతలు లేనివారై (శుద్ధభావైః) సేవిస్తారు. వారు పవిత్ర భావముతో ఎల్లప్పుడు శ్రీహరిని కీర్తించుచు దృఢమైన నియమములు కలవారై, ప్రయత్నపూర్వకముగా భక్తితో నమస్కరించుచు, ఎల్లప్పుడు భగవంతుని యందే మనస్సు కలవారై నన్ను ఉపాసించుచున్నారు అని అర్థము.

### 84. స్మర్తవ్యశ్చాత్మవిత్తమైః :

"ఆత్మానం భగవంతం విందతీత్యాత్మవిదః". ఆత్మను (భగవంతుని) తెలుసుకున్నవారు ఆత్మవిదులు. వారిలో అత్యధిక శ్రేష్ఠమైన శ్రేణికి చేరిన వారు ఆత్మవిత్తములు. అట్టి ఆత్మవిత్తములచే స్మరింపదగిన భగవానుడు శ్రీహరి మాత్రమే.

**అనేకమార్గకర్తా చ నానావిధగతిప్రదః ।**
**పురుషః సకలాధారః సత్త్వైకనిలయాత్మభూః ॥ 26**

### 85. అనేకమార్గకర్తా (చ) :

భగవత్ప్రాప్తికి ఎన్నో మార్గములున్నాయి. కర్మ, జ్ఞాన, భక్తి, యోగ, ధ్యాన, మొదలైన మార్గములు. వీటన్నిటికీ భగవంతుడే కర్త. "ఏకో నైకః సవః కః కిం..." వి.స.నా (725-729 నామములు, 91 శ్లోకము). 'ఏకః' అంటే పరమార్థమున ఏక రూపముగల భగవానుడు. 'నైకః' అంటే (న+ఏకః =

నైకః) = అనేకః. మాయాశక్తిచే అనేక రూపములుగల వానిగా కనబడే భగవానుడు. సవః = యజ్ఞస్వరూపుడైన భగవానుడు. కః సుఖవాచకము. ఆనంద స్వరూపుడైన భగవానుడు. కిం= నిర్గుణ పరబ్రహ్మముగా చెప్పబడ్డ భగవానుడు. ఈ విధముగా భగవానుడు అనేకమార్గకర్త.

## 86. నానావిధగతిప్రదః :

1. కర్మలు ఆచరించి స్వర్గము, జ్ఞాన సాధనచే ముక్తి, ఇత్యాది ఎన్నెన్నో ప్రకారములైన సాధనలవలన కలుగు ఫలములను ప్రసాదించే భగవానుడు నానావిధగతిప్రదుడు.

2. కీర్తనం, స్మరణం, భజన మొదలైన సాధనలలో ఏ ఒక్క సాధన చేసినా జ్ఞానము, భక్తి అనే ఫలములు ప్రసాదించే భగవానుడు నానావిధ గతిప్రదుడు.

## 87. పురుషః :

1. పురుష శబ్దమునకు పరబ్రహ్మమని అర్థము.

2. "పురం శరీరం వా తస్మిన్ శేతే ఇతి పురుషః" పురమంటే శరీరము దానియందతట వ్యాపించి ఉన్నవాడు పురుషుడు, ఆత్మ స్వరూపుడైన భగవానుడు. "నవద్వారం పురం పుణ్యమేతైర్భావైః సమన్వితం । వ్యాప్య శేతే మహాత్మా యత్ తస్మాత్పురుష ఉచ్యతే" (మహాభారతము) నవద్వారములు కలిగి (పుట్టుట, ఉండుట, పెరుగుట, మార్పు చెందుట, క్షీణించుట, నశించుట అనే) ఆరు వికారములతో కూడుకొని, అంతఃకరణము, చేష్టలు, భావములతో కార్యములు చేయు శరీరమునిచ్చి, దాని యందంతట వ్యాపించి (నిండి) ఉన్న భగవానుడు పురుషుడు.

3. "పూర్ణత్వాద్వా, పురాణత్వాద్వా సదనాద్వా పురుషః" అంతటా పరి పూర్ణముగా నిండిఉండుటవలన, అన్నిటి కంటె పురాతనమై ఉండుటవలన, అన్నిటియందు వ్యాపించి నివసించి ఉండుట వలన (సదనాత్) భగవానుడు పురుషశబ్దముచే తెలియబడుచున్నాడు.



*"పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే । పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే (ఈ.ఉ.)– అజోనిత్యః శాశ్వతోஉయం పురాణో.." (గీత. 2-20);* "పురాణాత్సదనాచ్చైవ తతోஉసౌ పురుషః ॥"

4. "పురుషు భూరిషు ఉత్కర్షశాలిషు సర్వేషు సీదతి ఇతివా" గొప్ప ప్రతిభా శాలురైన పురుషులందరిలోను నిండియున్న భగవానుడు.

పరబ్రహ్మపరముగా ఇంకా ఎన్నో అర్థములు పురుష శబ్దమునకు కలవు.

## 88. సకలాధారః :

అన్ని బ్రహ్మాండములకు ఆధారము, ఆశ్రయము అయిన భగవానుడు, సకలాధారుడు.

*"మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ" (గీత 7-7) ".... విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితో జగత్" (గీత 10-42) "వ్యస్తభ్నా రోదసీ విష్ణవేతే దాధర్థ పృథివీమభితో మయూఖైః" (శ్రుతి).*

## 89. సత్త్వైకనిలయాత్మభూః :

1. ఒక్క సత్త్వమునందు మాత్రమే ఆశ్రయభూతమైన చిత్తము (ఆత్మ) కలవాడు (భగవానుడు) సత్త్వైకనిలయాత్మభూః॥

2. సత్త్వము నందే (నుండే) ఆవిర్భావమగు భగవానుడు.

3. సత్త్వగుణసంపన్నులచే ధ్యానింపబడేవాడు; వారిచిత్తము నందే ఉండేవాడు.

4. సత్త్వగుణము కలవారిని పుట్టించువాడు లేక వారి చేతనే భావింప బడేవాడు.

5. సత్త్వమే స్వరూపముగా గల భగవానుడు. "సత్త్వైకనిలయాత్మభూః" అని చెప్పబడతాడు.

**సర్వధ్యేయో యోగగమ్యో భక్త్యా గ్రాహ్యః సురప్రియః ।**
**జన్మాదిసార్థకకృతిర్లీలాకర్తా పతిః సతామ్ ॥ 27**

### 90. సర్వధ్యేయః :

1. "సర్వైర్భక్తైః ధ్యేయ, సర్వత్రధ్యేయ ఇతివా." అందరు భక్తులు ధ్యానము చేసి పొందుటకు యోగ్యుడు లేక సర్వులకు ధ్యేయము అయిన భగవానుడు.

2. అన్నిటియందు ధ్యేయస్వరూపుడైయున్న భగవానుడు.

*"యోమాం పశ్యతి సర్వత్ర, సర్వం చ మయి పశ్యతి" (గీతా 6-30). భగవానుడు అన్నిటి యందు ధ్యానము చేయయోగ్యుడు "తస్మాత్సర్వాత్మనా రాజన్ హరిః సర్వత్ర సర్వదా । శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యో భగవాన్నృణాం ॥" (భాగ 2-2-36).*

### 91. యోగగమ్యః :

యోగము అంటే ఇక్కడ భక్తియోగము సూచింపబడింది. భక్తియోగము చేతనే భగవత్ప్రాప్తి కలుగుతుంది. వేరేదేనిచేతను కలుగదు. అందుచేత భగవానుడు (భక్తి) యోగగమ్యుడు.

*"భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః । తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరం॥" (గీత 18-55) "భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోర్జున । జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥" (గీత 11-54)*

### 92. భక్త్యా గ్రాహ్యః :

1. భగవత్ప్రాప్తికి భక్తి ఒక్కటే మార్గము. ఒక్కభక్తి వలననే భగవంతుని సంపూర్ణస్వరూపజ్ఞానము కలుగుతుంది గాని వేరే ఏ సాధనలచేతను కలుగదు. అందుచే భక్తితో ఇచ్చినదేదైనా భగవానుడు గ్రహిస్తాడు. సంతోషిస్తాడు. కనుక భగవానుడు "భక్త్యా గ్రాహ్యః" అనబడతాడు.

*"పత్రం పుష్పం ఫలం తోయం..." (గీత 9-26).*

2. భక్తి చేతనే జీవునికి సర్వమును పొందచేసే భగవానుడు.

### 93. సురప్రియః :

1. దేవతలకు (జీవులకు) ప్రియము చేసేవాడు, సురప్రియుడు. భగవానుడు దేవతలను సంతోషపెట్టేవాడు.



2. దేవతలచేత భగవంతుడు ప్రీతిని (ప్రీతితో పూజలు) పొందేవాడు.

3. జీవులచే / దేవతలచే ప్రేమించబడి వారిని ప్రేమించే భగవానుడు సురప్రియుడు.

### 94. జన్మాదిసార్థకకృతిః :

ప్రతి జీవికి పుట్టిన దగ్గర నుంచి ఆయురారోగ్యములు ఇచ్చి జన్మ (సార్థకము) సఫలము చేసేవాడు భగవానుడు. ఇవి వాని లీలలవలననే జరుగుతాయి. భగవదాశ్రయం లేకుండా జీవితం సఫలీకృతం కాదు. అందుచేత భగవానుడు "జన్మాదిసార్థకకృతిః" అనబడతాడు.

శ్రీహరి కథలను కీర్తిస్తూ వింటూ కాలము గడిపే భక్తులకు తప్ప ఇతర జీవులకు ఆయువులు ఉండుట వ్యర్థము. సూర్యోదయ సూర్యాస్త మయములు వారి ఆయువును క్షీణింప చేస్తాయి. (హరిస్తాయి).

*"ఆయుర్హరతి వై పుంసాముద్యన్నస్తం చ యన్నసౌ" (భాగ 2-3-17).*

### 95. లీలాకర్తా :

"లీయతే శ్లిష్యతే అనయా ఇతి లీలా, మాయా". శ్లిష్యతే అనగా గట్టిగా పట్టుకొని ఉండుట. జగత్తు అంతా మాయచేత గట్టిగా పట్టుకోబడి ఉంటుంది. ఈ మాయ భగవానుని ఆధీనములో ఉంటుంది. ఎప్పుడూ భగవానుని విడిచి ఉండదు. మాయ భగవానుని చేత ప్రేరేపించబడి విశ్వములో సృష్ట్యాది అన్ని కార్యములు చేస్తుంది. ఈ కార్యరూపములే లీలలు. అందుచేత భగవానుడు లీలాకర్త.

### 96. పతిః సతాం :

పతిః సతాం అంటే భక్తులకు, సత్పురుషులకు ప్రభువు. వారిని రక్షించి, పరిపాలించేవాడు. *"శ్రియః పతిర్యజ్ఞపతిః ప్రజాపతిః...." (భాగ 2-4-20).*

**ఆదికర్తా తత్త్వకర్తా సర్వకర్తా విశారదః ।**
**నానావతారకర్తా చ బ్రహ్మావిర్భావకారణమ్ ॥ 28**

## 97. ఆదికర్తా :

1. అందరికన్నా, అన్నిటికన్నా ముందునుంచి ఉన్నవాడు. సృష్ట్యాది, కార్యములు చేసినవాడు, భగవానుడు ఆదికర్త.

2. "ఆదేరాకాశస్య కాలస్య వా కర్తా" ప్రప్రథమముగా ఆకాశమును కాలమును సృష్టించిన భగవానుడు ఆదికర్త, పరబ్రహ్మ.

త్రిగుణములచే కూడుకొని ఆవరణలచే కప్పబడియున్న జీవుడు ఎంతగొప్ప వాడైనా ఈ ఆదికర్త అయిన భాగవానుని స్వరూపమును తెలుసుకొనలేడు.

*"తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః" (తై॥ఉ॥ ఆనంద వల్లీ-1) స ఏష భగవాఁల్లింగై స్త్రిభిరేభిరధోక్షజః" (భాగ. 2-5-20).*

## 98. తత్త్వకర్తా :

ప్రకృతితో మొదలైన ఇరవైనాలుగు తత్త్వాలకు భగవానుడు కర్త. అందుచేత తత్త్వకర్త అని పేరు. ఈ తత్త్వములు సాంఖ్యశాస్త్రములో చెప్పబడ్డాయి. మూలప్రకృతి (అవ్యక్తము) ఒకటి. మహదాది ప్రకృతి-వికృతులు ఏడు. వికృతులు పదహారు - మొత్తం ఇరవైనాలుగు. ఈ ప్రకృతి, వికృతులకు కారకుడైన పురుషుడు వాటికన్నవేరుగా ఉంటాడు. ఈ తత్త్వములన్ని శ్రీహరి శక్తిచే పని చేస్తాయి.

*"కాలాద్గుణ వ్యతికరః పరిణామః స్వభావతః" (భాగ 2-5-22).*

## 99. సర్వకర్తా :

1. వేర్వేరుగాను (వ్యస్తముగాను) అన్నీకలిసి ఒకేదానిగాను ఉన్న యీ విశ్వమంతటికి కారణభూతుడై వానిని సృష్టించిన భగవానుడు "సర్వకర్తా".

2. కుమ్మరివాడు మట్టినుండి కుండలు, బొమ్మలు మొదలైన అన్ని రూపములు గల వస్తువులు చేసినట్లే సర్వరూపములుగల విశ్వమును సృష్టించిన భగవానుడు "సర్వకర్తా".



## 100. విశారదః :

1. "విశిష్టా శారదా వాణీ యస్యేతి విశారదః" విశిష్టమైన (శారదా = వాణీ) వేద శాస్త్రములు - వీనికి కారణభూతుడైన భగవానుడు - విశారదుడు.

2. "విగతః తిరస్కృతః శారదః శరచ్చంద్రోయస్మాత్, యేనవా, నిపుణ ఇతి." ఎంతో ఆహ్లాదముకలిగించే శరత్కాలవెన్నెలను 'శారద' అంటారు. దీనిని ఎవ్వరూ తిరస్కరించలేరు. కాని దీనిని తిరస్కరించగల ఆనందమును ఇవ్వగల భగవానుడు విశారదుడు. భగవానుడు శరచ్చంద్రునికన్న అధికమైన తన సౌందర్య, ఆహ్లాదజనక, పుష్టికర లక్షణములవలన శ్రేయస్కరుడై బ్రహ్మానందము కలిగిస్తాడు. అందుచే విశారదుడనే పేరు.

3. అన్ని కార్యములు చక్కగా సాధించుటలో నిపుణుడు గనుక భగవానుడు విశారదుడు.

## 101. నానావతారకర్తా (చ) :

ఆదివరాహాది ఎన్నెన్నో అవతారములు ధరించి లోకకళ్యాణమును సమకూర్చే భగవానుడు నానావతారకర్త.

*"యత్రోద్యతః క్షితితలోద్ధరణాయ....." నుంచి "... శృణ్వతః శ్రద్ధయా నిత్యం మాయయాఽఽత్మా న ముహ్యతి" వరకు. [భాగ 2-7- (1-53)]*

## 102. బ్రహ్మావిర్భావకారణమ్ :

హిరణ్యగర్భబ్రహ్మ పుట్టుటకు కారణమైన భగవానుడు.

"హిరణ్యగర్భస్సమ వర్తతాగ్రే । భూతస్య జాతః పతిరేత ఆసీత్, సదాధారపృథివీం ద్యాముతే మాం తస్మై, దేవాయ హవిషా విధేమ ॥ (తైత్తిరీయోపనిషత్)

*"....బ్రహ్మణే దర్శయన్ రూపమవ్యలీక వ్రతాదృతః ॥" (భాగ 2-9-4).*

**దశలీలావినోదీ చ నానాసృష్టిప్రవర్తకః ।**
**అనేకకల్పకర్తా చ సర్వదోషవివర్జితః ॥ 29**

## 103. దశలీలావినోదీ (చ) :

1. సర్గ (ప్రాకృత సృష్టి), విసర్గ (వైకృత సృష్టి) – 138 నామము చూడండి– స్థానం (స్థితి) పోషణము, ఊతి (వాసనలు), మన్వంతరములు, ఈశాను కథలు (భగవానుని అవతార కథలు), నిరోధము, ముక్తి, ఆశ్రయము అనే లీలలు చేస్తూ క్రీడించే భగవానుడు "దశలీలా వినోదీ"

*"అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః । మన్వంతరేశానుకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥* *(భాగ 2-10-1)*

2. ఈ దశలీలల చేత (వే = కాలస్య, నోదః = ప్రేరణ) కాలములో ప్రేరణ కలిగించే భగవానుడు "దశలీలావినోదీ".

## 104. నానాసృష్టిప్రవర్తకః :

ఎన్నో విధములైన దేవ, పితృ మనుష్యాది సర్వజీవులను సృష్టిచేసి వాటిని నడిపించే భగవానుడు నానాసృష్టిప్రవర్తకుడు.

*"పురుషోఽ ణ్డం వినిర్భిద్య యదాసౌ స వినిర్గతః...." (భాగ 2-10-10).*

## 105. అనేకకల్పకర్తా (చ) :

బ్రహ్మ, పద్మ మొదలైన వివిధకల్పములు ప్రవర్తింపచేసే భగవానుడు "అనేకకల్పకర్త".

*"అయం తు బ్రహ్మణః కల్పః సవికల్ప ఉదాహృతః" (భాగ 2-10-46).*

## 106. సర్వదోషవివర్జితః :

బంధు పరివారములలోగల దోషములచే విదురునకెన్నో దుఃఖములు కలిగినవి. వారందరిని విడిచి తీర్థయాత్రలు సేవించి సత్సంగము చేయుట వలన ఆ దుఃఖములు పోయినవి. ఇట్లు ప్రవర్తింపజేసిన భగవానుడు సర్వదోషవివర్జితుడు.

*"యదాహ నో భవాన్ సూత క్షత్తా భాగవతోత్తమః...." (భాగ 2-10-48).*

ఇంతవరకు ద్వితీయస్కంధ నామములు.



# శ్రీమద్భాగవత తృతీయస్కంధ నామములు

*సర్గలీలా నామములు (107-202)*

*శ్లోక సంఖ్య (30-47)*

**వైరాగ్యహేతుస్తీర్థాత్మా సర్వతీర్థఫలప్రదః ।**
**తీర్థశుద్ధైకనిలయః స్వమార్గపరిపోషకః ॥ 30**

## 107. వైరాగ్యహేతుః :

మహాభారతయుద్ధము జరిగేముందు దుర్యోధనుడు పలికిన కటువచనములు విదురునికి వైరాగ్యము కలిగించాయి. విదురుడు ఇట్లు వైరాగ్యము పొందుటకు హేతువైన భగవానుడు, వైరాగ్యహేతువు.

*"క ఏనమత్రోపజుహావ జిహ్మం....." (భాగ 3-1-15).*

## 108. తీర్థాత్మా :

1. తీర్థస్వరూపుడైన భగవానుడు, "తీర్థాత్మా".

2. తీర్థమునకు అధిష్ఠానదేవత అయిన భగవానుడు; తీర్థాత్మా అని చెప్పబడతాడు.

## 109. సర్వతీర్థఫలప్రదః :

తీర్థరూపములో దర్శనమిచ్చి, ఆ తీర్థములో స్నానము చేయుటచే కలిగే ఫలితము భక్తులకు భగవానుడు ఇస్తాడు. ఈ విధముగా అన్ని తీర్థములలో దర్శనమిచ్చి అన్ని తీర్థముల ఫలమును విదురున కిచ్చిన భగవానుడు సర్వతీర్థ ఫలప్రదుడు.

"తతస్త్వతివ్రజ్య సురాష్ట్రమృద్ధం...." (భాగ 3-1-24).

## 110. తీర్థశుద్ధైకనిలయః :

తీర్థయాత్రలు చేసినవారు శుద్ధి పొందుతారు. విదురుడు అన్ని

తీర్థములలో స్నానము చేసి శుద్ధి పొందాడు. విదురునివంటివారు తీర్థశుద్ధులు. వారిలో భగవంతుడు నివసిస్తాడు. వారిలోనున్న భగవానుడు తీర్థశుద్ధైక నిలయుడు.

## 111. స్వమార్గపరిపోషకః :

1. "స్వస్యమార్గః" భగవంతునిచే చేయబడ్డ మార్గము స్వమార్గము. అదే భగవంతుని పొందుటకై చేయబడిన భక్తిమార్గము. ఆ భక్తిమార్గమును చక్కగా పోషించి వృద్ధిచేసే భగవానుడు, స్వమార్గపరిపోషకుడు.

2. "స్వానాం భక్తానాం వా మార్గః సంగతి రూపః" తన యొక్క మార్గము, ఈ మార్గము తనదేకాక భక్తులు అనుసరించే మార్గము కూడా "సంగతి రూపః" భక్తులతో సత్సంగము లేక సహవాసము అనేరూపము కలది. భగవంతుని యెడల ప్రేమ (ఆత్మవిచారణ వలన కలిగిన) జ్ఞానము మొదలైన లక్షణములు గలది సంగతి రూపము. ఇట్టి స్వమార్గమును చక్కగా పోషించే భగవానుడు, స్వమార్గపరిపోషకుడు.

**తీర్థకీర్తిర్భక్తగమ్యో భక్తానుశయకార్యకృత్ ।**
**భక్తతుల్యః సర్వతుల్యః స్వేచ్ఛాసర్వప్రవర్తకః ॥ 31**

## 112. తీర్థకీర్తిః :

1. నరనారాయణులు బదరికాశ్రమములో తపస్సు చేసినందువలన దానికి తీర్థములన్నింటిలో గొప్ప కీర్తి వచ్చినది. బదరికాశ్రమమునకు ఇట్టి కీర్తి కలిగించిన భగవానుడు. "తీర్థకీర్తిః"

2. తీర్థములంటే పుణ్యక్షేత్రములు. ఈ తీర్థములు ప్రత్యేక కీర్తిని ఎవరి వలన పొందుతాయో ఆ భగవానుడు "తీర్థకీర్తిః" అనబడతాడు.

## 113. భక్తగమ్యః :

1. ఉద్ధవాది భక్తులు పొంద యోగ్యమైన స్థానము భక్తగమ్యము, భగవానుడు.



2. భక్తులు వెళ్ళడానికి యోగ్యమైన ప్రదేశము. బదరికాశ్రమము మొదలైనవి. ఆ రూపములో నున్న భగవానుడు.

## 114. భక్తానుశయకార్యకృత్ :

భక్తుల మనస్సులు భగవంతునియందు నిలిచిఉండే కార్యము (నిరుద్ధము) భాగవానుని కృపచే చేయబడుతుంది. ఇది భక్తానుశయకార్యము. భగవానుడు "భక్తానుశయకార్యకృత్".

## 115. భక్తతుల్యః :

(భక్తుడు తక్కువ, భగవంతుడు ఎక్కువ అని కాకుండా) భక్తులతో అన్ని విధముల సమానముగా ప్రవర్తించే భగవానుడు భక్తతుల్యుడు. భక్తులను భగవంతునితో సమానులుగాను, భగవంతుని పోలినవారుగాను చేసే భగవానుడు.

*"నోద్ధవోఽణ్వపి మన్న్యూనో యద్గుణైర్నార్దితః ప్రభుః...." (భాగ 3-4-31).*
*"న చలతి నిజవర్ణధర్మతో యః సమమతిరాత్మ సుహృద్విపక్షపక్షః" (విష్ణు పురాణము).*

## 116. సర్వతుల్యః :

1. "సర్వేషు తుల్యః సమమతిః" అన్నిటి యందు సమబుద్ధి కల భగవానుడు సర్వతుల్యుడు.

2. ఏఏకర్మలు జీవులు చేసారో ఆయాకర్మలకు తగిన ఫలములను తూచినట్లు సరిగా ఇచ్చే భాగవానుడు సర్వతుల్యుడు (సర్వేతుల్యాః తోలనీయాః)

*"సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి న ప్రియః ।" (గీత 9-29).*

## 117. స్వేచ్ఛాసర్వప్రవర్తకః :

1. తన యొక్క లేక తన భక్తుల యొక్క ఇచ్ఛానుసారము అందరికి భక్తిని ఇచ్చే భగవానుడు.

2. తన ఇచ్ఛానుసారము జీవులు ఫలితములు పొందేటట్లు ప్రవర్తింపజేసే (నడిపించే) భగవానుడు, స్వేచ్ఛాసర్వప్రవర్తకుడు.

**గుణాతీతోఽనవద్యాత్మా సర్గలీలాప్రవర్తకః ।**
**సాక్షాత్సర్వజగత్కర్తా మహదాదిప్రవర్తకః ॥ 32**

## 118. గుణాతీతః :

1. ఈ జగత్తు సత్త్వాది త్రిగుణాత్మకమైనది. "గుణాన్ సత్త్వాదీనతిక్రమ్య ఇతః గతః" త్రిగుణములకు వశముకాక వాటిని అతిక్రమించిన మనోగతి గల త్రిగుణాతీతుడైన భగవానుడు గుణాతీతుడు.

2. త్రిగుణములను దాటగల జ్ఞానము (ఇతం = జ్ఞానం) కలవాడు త్రిగుణాతీతుడు, భగవానుడు.

## 119. అనవద్యాత్మా :

ఎవ్వరిచేతను, ఏవిధముగాను గర్హించడానికి (లేక ఎత్తిచూపడానికి) వీలుపడని గుణములు కలవాడై అవతరించే భగవానుడు అనవద్యాత్ముడు.

పైన చెప్పిన విధముగా గర్హింప వీలులేని గుణములుకల జ్ఞాని, భక్తుడు కూడా అనవద్యాత్మయే.

*"కరోతి కర్మాణి కృతావతారో...."* *(భాగ 3-5-5).*

## 120. సర్గలీలాప్రవర్తకః :

'సర్గ' అంటే సృష్టి. సృష్టికి సంబంధించిన లీలలను చేసే లేక చేయించే భగవానుడు సర్గలీలాప్రవర్తకుడు.

"భగవానేక ఆసేదమగ్ర ఆత్మాఽఽత్మనాం విభుః....." (భాగ 3-5-23).

## 121. సాక్షాత్సర్వజగత్కర్తా :

ఇతరుల అవసరము (అపేక్ష) లేకుండా తనంతట తానే అన్ని స్థావర, జంగమములతో కూడిన జగత్తును సృష్టించుటకు కారణభూతుడైన భగవానుడు సాక్షాత్సర్వజగత్కర్త.



*భగవతః సాక్షాత్ కర్తృత్వం కారణమితి తృతీయ రూపత్వా దేవ । పురుష ఏవేదగ్ం సర్వం; సవై సర్వమిదంజగత్; పాదోఽస్యేహాఽభవత్ పునః ।* *(శ్రుతి)*

*"అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్.."* *(గీత 9-16)*

*"జన్మాద్యస్య యతోఽన్వయాదితరతశ్చ"* *(భాగ. 1-1-1).*

## 122. మహదాదిప్రవర్తకః :

"మహత్" తత్త్వము మొదలుకొని అహంకారాది ఇతర తత్త్వముల వరకు సృష్టించిన భగవానుడు మహదాదిప్రవర్తకుడు.

*"తతోఽభవన్మహత్తత్త్వమవ్యక్తాత్కాలచోదితాత్"* *(భాగ 3-5-27).*

**మాయాప్రవర్తకః సాక్షీ మాయారతివివర్ధనః ।**
**ఆకాశాత్మా చతుర్మూర్తిశ్చతుర్ధా భూతభావనః ॥ 33**

## 123. మాయాప్రవర్తకః :

సత్త్వాదిగుణములతోకూడిన మాయచే జీవులకు ప్రేరణ కలిగించి జగత్తును నడిపించే భగవానుడు, మాయాప్రవర్తకుడు.

*"మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరం...."* *(గీత 9-10).*

## 124. సాక్షీ :

1. "సాక్షాదవ్యవధానేన పశ్యతి" వ్యవధానమంటే ఎడము, ఆచ్ఛాదన, కట్టుట, తిరోధానము. అవ్యవదానము అంటే వ్యవధి లేకుండా (ఎడతెరిపి లేకుండా) పశ్యతి. జరుగుతున్న కార్యములన్నిటిని తన దృష్టిలో ఎల్లప్పుడు ఉంచుకొని చూచే భగవానుడు, "సాక్షీ."

2. భగవంతుని దృష్టికి ఏదీ అడ్డులేదు. అన్ని విషయములు కాలవిలంబన లేకుండా ఎప్పటికప్పుడే భగవానుడు చూస్తూ ఉంటాడు కనుక "సాక్షీ".

*"కాలమాయాంశయోగేన భగవద్వీక్షితం నభః"* *(భాగ 3-5-32).*

## 125. మాయారతివివర్ధనః :

1. రతి అనగా ఆసక్తి. భగవంతుడు అందరిలోను అంతర్యామియై ఉండి తన మాయచేత, జీవులకు గృహపుత్రాదులయందు ఆసక్తిని విశేషముగా వర్ధిల్లచేస్తాడు కనుక మాయారతివివర్ధనుడు.

2. మాయా + అరతి = మాయారతి అని చెప్తే భగవానుడు జీవునికి తన మాయచేత గృహపుత్రాందులందు ఆసక్తి కలిగించి తన యందు మాత్రము (అరతి) ఆసక్తి కలుగకుండా ఉండే పరిస్థితులను ఎంతో వర్ధిల్లచేస్తాడు. ఈ విధముగా భగవానుడు మాయారతివివర్ధనుడు.

*"యత్సానుబంధేऽసతి దేహగేహే......"* *(భాగ 3-5-43).*

## 126. ఆకాశాత్మా :

1. ఇక్కడ ఆత్మ అంటే దేహము, రూపము. భగవానుడు ఆకాశమే దేహము (రూపము) గా కలవాడు. ఆకాశరూపము గల భగవానుడు "ఆకాశాత్మా".

2. "అ = అసమంతాత్; కాశతే = స్వేన తేజసా దీప్తోభవతి" తన తేజస్సుచేత భగవంతుడు అన్నిటిని (అంతటిని) ప్రకాశింప జేస్తాడు. ఆకాశః అంటే అర్థము ఇది. అట్టి ఆకాశరూపముగల భగవానుడు "ఆకాశాత్మా".

*"స్మరన్ విశ్వసృజామీశో విజ్ఞాపితమధోక్షజః..."* *(భాగ 3-6-10).*

## 127. చతుర్మూర్తిః :

1. వాసుదేవాది నాలుగు దేవతామూర్తులుగా (వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధడుగా) ఉండే భగవానుడు "చతుర్మూర్తిః"

2. విరాట్‌పురుషుని నుండి నాలుగుమూర్తులు పుట్టాయి. ముఖమునుండి బ్రాహ్మణులు, బాహువులనుండి క్షత్రియులు. తొడలనుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు. అందుచేత భగవానుడు, చతుర్మూర్తి.



*"బ్రాహ్మణోऽస్య ముఖమాసీత్ బాహూరాజన్యకృతః ఉరూతదస్యయద్ వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత* *(శ్రుతి).*

3. బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులనే నాలుగు వర్ణముల రూపములో నున్న భగవానుడు, చతూర్మూర్తి.

## 128. చతుర్ధా :

1. నాలుగు భాగములుగా (విధములుగా) విభజింపబడినది చతుర్ధా. "చతుర్ణాం వర్ణానాం యా భిన్నా వృత్తయస్తత్తద్రూపః" (బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులనే) నాలుగు వర్ణముల వారి భిన్న భిన్న వృత్తుల రూపములలో గల భగవానుడు.

*"ముఖతోऽవర్తత బ్రహ్మ పురుషస్య కురూద్వహ....."* నుంచి *"...... శ్రద్ధయాऽऽత్మవిశుద్ధ్యర్థం యజ్జాతః సహ వృత్తిభిః"* వరకు *[భాగ 3-6 - (30-34)].*

2. "యః చతురః పురుషార్థాన్ ధత్త ఇతి వా" ఏ భగవానుడు నాలుగు పురుషార్థములను విభజించి ధరించి యున్నాడో ఆ భగవానుడు చతుర్ధా అని పిలువబడతాడు.

## 129. భూతభావనః :

1. భూతములను పుట్టించుట, వృద్ధిచేయుట, అనే భావములుగల భగవానుడు భూతభావనుడు.

2. భూతములచేత భావింప (చింతింప)బడే భగవానుడు భూతభావనుడు.

**రజఃప్రవర్తకో బ్రహ్మా మరీచ్యాదిపితామహః ।**
**వేదకర్తా యజ్ఞకర్తా సర్వకర్తాऽమితాత్మకః ॥ 34**

## 130. రజఃప్రవర్తకః :

రజస్ అనగా రంజనాత్మకమైన గుణము. రంజనాత్మకమైన గుణమును

లోకములో ప్రవర్తింపజేసే భగవానుడు రజఃప్రవర్తకుడు (సృష్టికి ముందు రజోగుణ ప్రవృత్తిని భగవానుడు తన నాభి నుండి కమలరూపములో బయటకు తెచ్చాడు.)

*"తస్యార్థ (తథార్థ) సూక్ష్మాభినివిష్టదృష్టేరన్తర్గతోఽర్థో రజసా తనీయాన్..."*

*(భాగ 3-8-13).*

## 131. బ్రహ్మా :

1. "బృంహణత్వాద్ బ్రహ్మా" బృంహణం అంటే పెరుగుట అనే గుణము. ఆ గుణము కలది "బ్రహ్మా".

2. తనంతట తానే ఉన్నది లేక ఉన్నవాడు (స్వయంభూః) "బ్రహ్మా".

*"తల్లోకపద్మం స ఉ ఏవ విష్ణుః ..." నుంచి " ... నాత్మానమద్ధావిదదాది దేవః"* వరకు *[భాగ 3-8 - (15-17)].*

## 132. మరీచ్యాదిపితామహః :

మరీచ్యాదులకు తండ్రి చతుర్ముఖబ్రహ్మ. అతని తండ్రి భగవానుడు, మరీచ్యాదులకు పితామహుడు (తాత).

## 133. వేదకర్తా :

1. భగవంతుని ఉచ్ఛ్వాసనిశ్వాసములు వేదములు. అందుచేత భగవానుడు వేదములకు కర్త. వేదకర్తృత్వము గురించి వేదములలో చెప్పబడింది.

*"తస్మాద్యజ్ఞాత్సర్వహుతః ఋచస్సామాని జజ్ఞిరే (శ్రుతి)*

2. వేదములకు హేతుభూతమవడము చేత భగవానుడు వేదకర్త.

*"భూయస్త్వం తప ఆతిష్ఠ విద్యాం చైవ మదాశ్రయామ్....." (భాగ 3-9-30).*

## 134. యజ్ఞకర్తా :

1. అగ్నిహోత్రాదులు, వివిధయజ్ఞములు ఆచరింపజేసే భగవానుడు, "యజ్ఞకర్త"



2. యజ్ఞములు చేసే విధానములు నిర్ణయించే భగవానుడు యజ్ఞకర్త.

3. ప్రజాపతులచే యజ్ఞములు చేయించి, సృష్ట్యాదులు చేయించిన భగవానుడు యజ్ఞకర్త.

*"ప్రజాపతిర్యజ్ఞానసృజతాఽగ్నిహోత్రం చాగ్నిష్టోమం చ పౌర్ణమాంసీం చోక్థ్యామావాస్యాం చాతిరాత్రంచ" (శ్రుతి) "యజ్ఞేనవై ప్రజాపతి ప్రజా అసృజత (శ్రుతి).*

## 135. సర్వకర్తా :

సర్వవేదమయః కర్తా సర్వకర్తా" మధ్యమపదలోపీసమాసము. వేదములలో నున్న మంత్రములన్నిటికి కర్త అయిన భగవానుడు సర్వకర్త.

*"సర్వవేదమయేనేదమాత్మానాఽఽత్మాఽఽత్మయోనినా....." (భాగ 3-9-43).*

## 136. అమితాత్మకః :

1. అమితమైన (అసంఖ్యాకమైన) అవతారములు ఎత్తిన భగవానుడు అమితాత్మకుడు.

2. వేర్వేరుగా కనిపించినా వాటన్నిటిలో ఉన్న ఒకే ఆత్మ అపరిచ్ఛిన్నమైనది అమితమైనది అందుచేత భగవానుడు అమితాత్మకుడు

*పద్మకోశం తదాఽఽవిశ్య భగవత్కర్మచోదితః...."* *(భాగ 3-10-8).*

**అనేకసృష్టికర్తా చ దశధాసృష్టికారకః ।**
**యజ్ఞాంగో యజ్ఞవారాహో భూధరో భూమిపాలకః ॥ 35**

## 137. అనేకసృష్టికర్తా (చ) :

అనేక విధములుగా కలిసిఉన్నట్లు, కలియకుండా ఉన్నట్లు త్రిగుణములను సృష్టిచేసిన భగవానుడు "అనేకసృష్టికర్తా" అనబడతాడు.

## 138. దశధాసృష్టికారకః :

ఆరువిధములైన ప్రాకృత సృష్టులు (1. మహత్తత్త్వము, 2. అహంకారము,

3. పంచభూతములు (పంచతన్మాత్రలతో సహా) 4. జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు, 5. ఇంద్రియాధిష్ఠాన దేవతలు (మనస్సుతో సహా), 6. ఐదు విధములైన ఆవరణలు (బుద్ధి కలిగించే అవిద్య). నాలుగు విధములైన వైకృతసృష్టులు 1 వృక్షాది స్థావరములు, 2. పశుపక్ష్యాది తిర్యగ్ జంతువులు 3. మనుష్యులు, 4. దేవతలు. మొత్తం పది విధములైన సృష్టులు – వీటిని చేసే విధానములకు కారకుడైన భగవానుడు దశధాసృష్టికారకుడు.

*"కాలద్రవ్యగుణైరస్య త్రివిధః ప్రతిసంక్రమః..." నుంచి "......దశైతే విదురాఖ్యాతాః సర్గాస్తే విశ్వసృక్కృతాః"* వరకు. *[భాగ 3-10 - (14-28)].*

## 139. యజ్ఞాంగః :

వరాహరూపభగవానుని యజ్ఞపురుషునిగాను ఆయన అంగములను యజ్ఞావయవములుగాను మరీచ్యాదిమునులు, ఋషులు వర్ణించారు. అట్లు వర్ణింపబడ్డ వరాహభగవానుడు యజ్ఞాంగుడు

*"స్రుక్తుండ ఆసీత్స్రువ ఈశ నాసయోరిడోదరే చమసాః కర్ణరంధ్రే...." నుంచి ".... జ్ఞానాయ విద్యా గురవే నమో నమః"* వరకు *[భాగ 3-13 - (36-39)].*

*హరివంశములో వరాహభగవానుని అంగములు యజ్ఞాంగములుగా చేసిన వర్ణన ఈ క్రింది విధముగా ఉన్నది. "వేదపాదో యూపదంష్ట్రః క్రతుహస్తశ్చితీ ముఖః । అగ్నిజిహ్వో దర్భరోమా బ్రహ్మశీర్షో మహాతపాః ॥ అహోరాత్రేక్షణో దివ్యో వేదాన్త శ్రుతిభూషణః । ఆజ్యనాసః స్రువాతుండః సామఘోష స్వనో మహాన్ ॥ ధర్మం సత్యమయః శ్రీమాన్ కర్మవిక్రమ సత్క్రియః । ప్రాయశ్చిత్తనఖో ఘోరః పశుర్జానుర్మహాభుజః ॥ ఉద్గాత్రాన్తో హోమలింగః ఫలబీజమహౌషధిః బాహ్యాంతరాత్మా మంత్రస్ఫిగ్వికృతః సోమశోణితః ॥ వేదీ స్కంధో హవిర్గంధో హవ్యకవ్యాతి వేగవాన్ । ప్రాగ్వంశకాయో ద్యుతిమాన్ నానాదీక్షాభిరర్చితః ॥ దక్షిణా హృదయో యోగీ మహాసత్రమయో మహాన్ । ఉపాకర్మోష్ఠరుచికః ప్రవర్గ్యావర్తభూషణః ॥ నానాఛందోగతిపథో గుహ్యోపనిషదాసనః ॥ ఛాయాపత్నీ సహాయో వై మేరుశృంగమివోచ్ఛ్రితః ॥ (హరివంశము).*

## 140. యజ్ఞవారాహః :

"వరాహో ఏవ వారాహః" వరాహము అన్నా వారాహము అన్నా అర్థము ఒక్కటే. యజ్ఞరూపుడైన వరాహావతార భగవానుడు యజ్ఞవారాహుడు.



## 141. భూధరః :

సముద్రజలములలో మునిగిపోయిన భూమిని తన కోరలపై (దంతములపై) పెట్టుకొని వెలికితీసిన వరాహభగవానుడు భూధరుడు.

*"దంష్ట్రాగ్రకోట్యా భగవంస్త్వయా ధృతా...." (భాగ 3-13-40).*

## 142. భూమిపాలకః :

"పాలకః" అంటే రక్షకుడు. హిరణ్యాక్షుని చంపి, వాని దగ్గర నుండి భూమిని రక్షించి, తిరిగి దాని స్థానములో నుంచిన వరాహభగవానుడే భూమి పాలకుడు.

*"సంస్థాపయైనాం జగతాం సతస్థుషాం...." (భాగ 3-13-42).*

**సేతుర్విధరణో జైత్రో హిరణ్యాక్షాంతకః సురః ।**
**దితికశ్యపకామైకహేతుసృష్టిప్రవర్తకః ॥ 36**

## 143. సేతుః :

1. "సినోతి బధ్నాతి సర్వాన్, స్వస్వధర్మేషు ఇతిసేతుః" అందరిని వారి వారి ధర్మములతో బంధించి ఉంచేది సేతువు.

2. "సంసృతి తరణహేతుత్వాత్ సేతుః" జీవుని సంసార సముద్రము దాటించేది సేతువు.

3. మర్యాదారూప ఇతివా "చెలియలికట్టను దాటకుండా ఉండే మర్యాదను సముద్రము పాటిస్తుంది. ఇటువంటి మర్యాదలు పాటింపజేసే భగవానుడు సేతువు.

*"సేతుర్విధరణ ఏషాం లోకానామసంభేదాయ" (శ్రుతి).*

## 144. విధరణః :

1. "విధరణః" విశేషముగా (జాగ్రత్తగా) ధరించినవాడు. భూమిని

జలము నుండి పైకి తీసి తన దంతములమీద జాగ్రత్తగా ధరించిన వరాహ భగవానుడు "విధరణః" అని చెప్పబడ్డాడు.

2. వేః అంటే కాలము. కాలమును ధరించేవాడు (విధరణః) లేక కాలమునకు ప్రభువు, భగవానుడు (విధరణః).

3. వేః అంటే పక్షి. పక్షిరాజు గరుత్మంతునిచే ధరింపబడ్డ శ్రీహరి భగవానుడు, "విధరణః" అని చెప్పబడతాడు.

## 145. జైత్రః :

"జయనశీలో జైత్రః" జయించే శక్తి, నేర్పు, శీలముగల భగవానుడు "జైత్రః". హిరణ్యాక్షుని జయించిన వరాహభగవానుడు, జైత్రః అనబడతాడు.

## 146. హిరణ్యాక్షాంతకః :

దైత్యుడైన హిరణ్యాక్షుని చంపిన వరాహభగవానుడు హిరణ్యాక్షాంతకుడు.

## 147. సురః :

1. ఈ మాటకు సాధారణ అర్థము దేవత.

2. "సు శోభనమ్ రాతి దదాతి ఇతి సురః" మంగళములు కలుగజేసే భగవానుడు సురుడు. సురులు మంగళప్రదులు. హిరణ్యాక్షుని చంపి లోకమునకు మంగళముచేకూర్చిన వరాహభగవానుడు, సురుడు.

## 148. దితికశ్యపకామైకహేతుసృష్టిప్రవర్తకః :

సంధ్యాకాలములో దితి కామేచ్ఛతో భర్త కశ్యపుని చేరి సంతానము కోరినది. కశ్యపుడు వారించినను ఆమె వినలేదు. దితికి ఆ సమయములో కామేచ్ఛ కలిగించి, కశ్యపునిచేత ఆమె కామేచ్ఛపూర్తి చేయించి, దైత్యుల సృష్టికి కారణుడై, దైత్యులను ప్రవర్తింపజేసిన భగవానుడు. ఇచ్చట దైత్యుల పుట్టుకకు,



దితికి ప్రాధాన్యత కలదు గనుక 'దితికశ్యపకామైకహేతుసృష్టి ప్రవర్తకః' అని నామము.

*"దితిర్దాక్షాయణీ క్షత్తర్మారీచం కశ్యపంపతిం......." నుంచి "జగ్రాహ వాసో బ్రహ్మర్షేర్వృషలీవ గతత్రపా" వరకు [భాగ 3-14 - (7-29)].*

**దేవాభయప్రదాతా చ వైకుంఠాధిపతిర్మహాన్ ।**
**సర్వగర్వప్రహారీ చ సనకాద్యఖిలార్థదః ॥ 37**

## 149. దేవాభయప్రదాతా (చ) :

ఇంద్రాది దేవతలకు అభయమిచ్చిన భగవానుడు.

*"తమ ఏతద్విభో వేత్థ సంవిగ్నా యద్వయం భృశం....." (భాగ 3-15-3).*

## 150. వైకుంఠాధిపతిః :

వైకుంఠము విజ్ఞానఘనస్వరూపము. ఆ వైకుంఠలోకాధిపతి శ్రీహరి భగవానుడు.

*"త ఏకదా భగవతో వైకుంఠస్యామలాత్మనః...." (భాగ 3-15-13).*

## 151. మహాన్ :

1."మహపూజాయాం" మహాన్ అంటే పూజింపదగిన (యోగ్యమైన) లేక పూజ్యుడైన భగవానుడు.

2. ఎంతో గొప్పవాడు (పెద్దవాడు, వృద్ధుడు).

*"...మహతో మహీయాన్ ... ।" (శ్రుతి);*

*"శబ్దాదిగుణరహితత్వాత్, నిరతిశయ సూక్ష్మత్వాత్, నిత్యశుద్ధబుద్ధ సర్వగతత్వాదితి ప్రతిబంధకం ధర్మజాతం తర్కతోఽపి వక్తుమశక్యమతఏవ మహానితి."*

*(వి.స.నా.శంకరభాష్యము. శ్లో. 103, నామము 841) .*

## 152. సర్వగర్వప్రహారీ (చ) :

"ప్రకర్షేణ హరణశీలః ప్రహారీ " అందరి భక్తుల గర్వము (అహంకారము)ను పూర్తిగా పోగొట్టే భగవానుడు, సర్వగర్వప్రహారీ. బ్రహ్మ

మానస పుత్రులు, నిత్యముక్తులు, భగవద్భక్తులు అయిన సనకాదులు భగవద్దర్శనార్థము వైకుంఠ ధామము వెళ్ళారు. జయవిజయులు వారి కోరికకు అడ్డుపడ్డారు. (ప్రతి బంధకమైనారు). కోరికలు కలుగుట, కోరిక తీరకుండుట అనే రెండు ప్రతిబంధకములు సనకాదులను అహంకారమునకు గురిచేసి క్రోధము కలిగించాయి. వారు జయవిజయులను శపించారు. భగవద్దర్శనము కాగానే వారికి వారి తప్పిదము తెలిసినది. రజో తమో గుణములు పోగొట్టమని భగవంతుని ప్రార్థించారు. భగవానుడు వారికీ విధముగా పశ్చాత్తాపము కలుగజేసి వారి గర్వపరిహారము చేసాడు. భగవానుడు "సర్వగర్వప్రహారీ".

*"తాభ్యాం మిషత్స్వ నిమిషేషు నిషిధ్యమానాః......" నుంచి "...... పాపీయసస్త్రయ ఇమే రిపవోఽస్య యత్ర" వరకు. [భాగ 3-15 - (31-34)].*

*"న వయం భగవన్ విద్మస్తవ దేవ చికీర్షితం...." నుంచి "... యేఽ యుజ్క్ష్మ, నాగసావయమయుజ్క్ష్మహికిల్బిషేణ" వరకు. [భాగ 3-16 - (16-25)].*

## 153. సనకాద్యఖిలార్థదః :

అఖిల అంటే అమోఘము, అన్యూనము. అమోఘమైన భగవద్దర్శనము సనకాదులర్థించారు. వారికి ఫలము దక్కినది. సనకాదులకిట్టి అఖిలార్థము లిచ్చిన భగవానుడు "సనకాద్యఖిలార్థదః" అనబడతాడు.

*"తం త్వాగతం ప్రతిహృతౌపయికం స్వపుంభిస్తేఽ చక్షతాక్షవిషయం, స్వసమాధిభాగ్యం....." భాగ 3-15-38).*

**సర్వాశ్వాసనకర్తా చ భక్తతుల్యాహవప్రదః ।**
**కాలలక్షణహేతుశ్చ సర్వార్థజ్ఞాపకః పరః ॥ 38**

## 154. సర్వాశ్వాసనకర్తా (చ) :

అందరిని (సనకాదులను, జయవిజయులను) సమాధానపరిచి ఆశ్వాసించిన భగవానుడు సర్వాశ్వాసనకర్త.

"ఏతౌ తౌ పార్షదౌ మహ్యం జయో విజయ ఏవ చ....." (భాగ 3-16-2).



## 155. భక్తతుల్యాహవప్రదః :

భక్తునకు అనురూపమైన లేక అతనితో సమానమైన యోగ్యతతో యుద్ధము చేయువాడు భక్తతుల్యాహవప్రదుడు. భగవద్భక్తుడైన హిరణ్యాక్షుడు మహాయోధుడు. యుద్ధకుశలత కలవాడు. అతనితో సమానముగా యుద్ధము చేయుటకు తగిన రౌద్రరూపముదాల్చి అతనితో హోరాహోరీగా పోరాడిన వరాహభగవానుడు భక్తతుల్యాహవప్రదుడు (భాగ 3-18 అ.; 3-19 అ.).

## 156. కాలలక్షణహేతుః (చ) :

హిరణ్యాక్షుడు పుట్టిన సమయములో కాలలక్షణములుగా, ఉత్పాతములు దుశ్శకునములు కనిపించాయి. వీనికి కారణభూతుడు, ప్రవర్తకుడు అయిన భగవానుడు కాలలక్షణహేతువు.

*"ఉత్పాతా బహవస్తత్ర నిపేతుర్జాయమానయోః (భాగ 3-17-3)*

*"అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తత" (గీత 10-8).*

## 157. సర్వార్థజ్ఞాపకః :

1. సర్వార్థములు అంటే సర్వధర్మాదులు ఎవరిదగ్గర కలవో ఆవరాహ స్వామి రూపములో ఉన్న భగవానుడు, సర్వార్థజ్ఞాపకుడు.

2. వరాహభగవానుని రూపము హిరణ్యాక్షునికి సర్వధర్మప్రవర్తకుడైన విష్ణుభగవానుని జ్ఞాపకము చేసినది. అట్లు హిరణ్యాక్షునికి జ్ఞాపకము కలిగించిన విష్ణుభగవానుడే సర్వార్థజ్ఞాపకుడు.

*"దదర్శ తత్రాభిజితం ధరాధరం...." (భాగ 3-18-2)*

## 158. పరః :

'పరః' అంటే భక్తుని కోరిక పూర్తిచేసేవాడని అర్థము. (పిపర్తి = పూరయతి భక్తయుద్దేచ్ఛాం ఇతి 'పరః') హిరణ్యాక్షునికి వరాహభగవానునితో యుద్ధము చేయాలన్న కోరికను తీర్చిన భగవానుడే పరుడు.

**భక్తోన్నతికరః సర్వప్రకారసుఖదాయకః ।**
**నానాయుద్ధప్రహరణో బ్రహ్మశాపవిమోచకః ॥ 39**

**159. భక్తోన్నతికరః :**

భక్తుడైన హిరణ్యాక్షునకు భగవంతునికన్నా ఎక్కువ విక్రమమును, యుద్ధకౌశలమును ప్రదర్శించుటకు అవకాశమిచ్చి, అతని గొప్పదనమును ఉన్నతిని అందరికీ తెలియజేసిన భగవానుడు భక్తోన్నతికరుడు.

*"ఆసన్న శౌండీరమపేతసాధ్వసం....."* *(భాగ 3-18-21)*

**160. సర్వప్రకారసుఖదాయకః :**

"సర్వే ప్రకారా యస్మిన్ సుఖే తాదృశస్య దాతా సర్వప్రకారసుఖదాతా" హిరణ్యాక్షుడు దైత్యుడైనప్పటికి అతనికి ఇంద్రాదుల స్వర్గసుఖముల కంటె అధికమైన సుఖములు కలుగజేసిన భగవానుడు సర్వప్రకారసుఖదాయకుడు.

**161. నానాయుద్ధప్రహరణః :**

ప్రహరణము అంటే ఆయుధము, దెబ్బకొట్టుట. యుద్ధములో ఎదుట వారిని కొట్టడానికి ఉపయోగించే వివిధ ఆయుధముల (నానాయుద్ధ ప్రహరణ ముల) తో హిరణ్యాక్షుని కొట్టి అతని యుద్ధేచ్ఛను పూర్తిచేసిన భగవానుడు, "నానాయుద్ధప్రహరణః" అనబడతాడు.

**162. బ్రహ్మశాపవిమోచకః :**

హిరణ్యాక్షుడై పుట్టిన విజయని చంపి అతనికి బ్రహ్మశాపము (బ్రాహ్మణు లైన సనకాదుల శాపము) విశేషముగా తొలగించిన భగవానుడు. (హిరణ్యాక్షుని వధించుట వలన మూడు జన్మములలో ఒక జన్మ సంబంధిత శాపము తీరి పోయినది.)

*"తద్వామముష్య పరమస్య వికుంఠభర్తుః...."* *(భాగ 3-15-34).*



**పుష్టిసర్గప్రణేతా చ గుణసృష్టిప్రవర్తకః ।**
**కర్దమేష్టప్రదాతా చ దేవహూత్యఖిలార్థదః ॥ 40**

**163. పుష్టిసర్గప్రణేతా (చ) :**

"పుష్టిః పోషణం, అనుగ్రహః" పుష్టి అంటే పోషణము, అనుగ్రహము అని అర్థములు. సర్గ అంటే సృష్టి. సృష్టి చక్కగా జరుగుటకు భగవానుని అనుగ్రహమే ముఖ్యకారణము. అట్లు చేయుటలో భగవానుడు నేర్పరి (ప్ర+నయకర్తా = ప్రణయకర్తా, ప్రణేతా) చక్కగా నడిపించేవాడు. (జరిపించేవాడు, నేర్పరి) అందుచే భగవానుడు "పుష్టిసర్గప్రణేత". మనుకశ్యపాదులచే విస్తరింప జేసిన సృష్టిలో ఎందరో భగవద్భక్తులు కలుగుట భగవానుని అనుగ్రహసృష్టి, భగవానుని నేర్పరితనము.

**164. గుణసృష్టిప్రవర్తకః :**

మూలప్రకృతిలో త్రిగుణములు సామాన్యస్థితిలో ఉంటాయి. ప్రకృతిలో క్షోభ కలుగగా గుణములలో విషమత ఏర్పడుతుంది. అందులోనుండి మహత్తత్త్వము దానినుండి అహంకారము మొదలైన ప్రాకృత సృష్టిని, ఆ పిమ్మట వైకృత సృష్టిని ప్రేరణ చేసే భగవానుడు, గుణసృష్టిప్రవర్తకుడు.

*"దైవేన దుర్వితర్క్యేణ పరేణానిమిషేణ చ...." నుంచి "..... సాగ్రం వై వర్షసాహస్రమన్వవాత్సీత్తమీశ్వరః" వరకు.* *[భాగ 3-20 - (12-15)].*

**165. కర్దమేష్టప్రదాతా (చ) :**

కర్దమప్రజాపతి ఇష్టప్రకారము వివాహాదులు, (కర్దమ దేవహూతల వివాహము, వారికి సంతానము కలుగుట, భగవానుడు కపిలుడై జన్మించుట) జరుగునట్లు చేసిన భగవానుడు కర్దమేష్టప్రదాతా.

*"విదిత్వా తవ చైత్యం మే పురైవ సమయోజి తత్..."* *(భాగ 3-21-23).*

## 166. దేవహూత్యఖిలార్థదః :

దేవహూతి చేసిన సేవలకు కర్దమప్రజాపతి సంతోషించి ఆమెకు బహు విధ సౌఖ్యములు కలుగజేసి, రమించి ఆమె కోర్కెలన్నీ తీరునట్లు చేసిన భగవానుడు "దేవహూత్యఖిలార్థదః" అని చెప్పబడ్డాడు.

*"ప్రియాయాః ప్రియమన్విచ్ఛన్ కర్దమో యోగమాస్థితః...." నుంచి ".... రేమే చిరం ధనదవల్లలనావరూథీ" వరకు (భాగ 3-23-12-39).*

**శుక్లనారాయణః సత్యకాలధర్మప్రవర్తకః ।**
**జ్ఞానావతారః శాంతాత్మా కపిలః కాలనాశకః ॥ 41**

## 167. శుక్లనారాయణః :

సత్యయుగములో శుద్ధ సత్వాత్మకుడైన శుక్లనారాయణునిగా భగవానుడు అవతరించాడు. ఇతనిచే సృష్టింపబడిన బిందుసరోవరములో స్నానము చేసిన వారికి సకల కామములు సిద్ధిస్తాయి. కర్దమప్రజాపతి ఆదేశానుసారము దేవహూతి ఆ బిందుసరోవరములో స్నానముచేసి శుక్లనారాయణుని ఉపాసించింది.

*"నిమజ్జ్యాస్మిన్ హ్రదే భీరు...." (భాగ 3-23-23); బిందు సరోవర మహాత్మ్యము [భాగ 3-23 - (23-39)].*

## 168. సత్యకాలధర్మప్రవర్తకః :

"సత్యో యదార్థః కాలస్య కాలసంబంధీ యో ధర్మః క్రీడోపయోగీ యౌవనాదిః" సత్యము అంటే యదార్థము. కాలధర్మమంటే ఆ కాలసంబంధిత (యౌవన ప్రాదుర్భావసమయమున) క్రీడోపయోగమైన లౌకిక ధర్మము. దీనిని ప్రవర్తింపజేసే భగవానుడు సత్యకాలధర్మప్రవర్తకుడు. కర్దమ ప్రజాపతి దేవ హూతులు సత్యకాలధర్మము తప్పకుండా యౌవనాది క్రీడోపయోగీ కార్యమును (సంతానము మొదలైనవి) పాటించారు. ఈ విధముగా దేవహూతిచేత సత్య కాలధర్మమును పాటింపజేసిన భగవానుడు, సత్యకాలధర్మప్రవర్తకుడు.



## 169. జ్ఞానావతారః :

జ్ఞానస్వరూపుడైన శుక్లనారాయణుని అవతారుడై ఆవిర్భవించిన భగవానుడు.

*"స త్వయాఽఽరాధితః శుక్లో వితన్వన్మామకం యశః...."(భాగ 3-24-4).*

## 170. శాంతాత్మా :

"శాంతః కామక్రోధాదిరహితః ఆత్మా స్వరూపం యస్యేతి, జ్ఞానావతారస్య శాంతత్వం యుక్తమేవ ।" కామక్రోధాదిరాహిత్యము (= లేకపోవుట) శాంతత్వము. జ్ఞానావతారుడైన శుక్లనారాయణుడు ఇట్టి "శాంతాత్మా".

## 171. కపిలః :

1. కపిలవర్ణము (పింగళవర్ణము) కలవాడు కపిలుడు.

2. "కం జలం పిబతీతి కపయః రశ్మయః తాన్ లాతి ఆదత్తే సూర్య రూపేణేతి కపిలః ।" సూర్యరూపుడై తన కిరణములచేత జలమును ఆవిరిగా జేసే భగవానుడు. కపిలుడు

*"సూర్యో మరీచి మాదత్తే సర్వస్మాద్ భువనాదధీ" (శ్రుతి).*

3. "కపీన్ శ్రేష్ఠాన్ లాతి అనుగ్రహాతీతి కపిలః ।" శ్రేష్ఠత్వమును తెచ్చి పెట్టే భగవానుడు కపిలుడు.

*కపిర్వరాహః శ్రేష్ఠశ్చ ధర్మస్య వృష ఉచ్యతే । తస్మాద్వృషాకపి ప్రాహ కశ్యపో మాం ప్రజాపతిః । (భారతం)*

## 172. కాలనాశకః :

1. "కాలశ్చాసౌ నాశకః కాలనాశకః" కాలమును (కాలగతమైన సర్వమును) నాశనముచేయు భగవానుడు కాలనాశకుడు.

*కాలాయనమః (శ్రుతి).*

2. సర్వమును నాశనము చేసే కాలరూప (మృత్యురూప) భగవానుడు కాలనాశకుడు.

*"స చావతీర్ణం త్రియుగమాజ్ఞాయ విబుధర్షభం......." (భాగ 3-24-26).*

యుగమంటే జత. త్రియుగము అంటే మూడుజతలు లేక ఆరు. ఆరు భగలక్షణములు గల భగవానుడు త్రియుగము.

3. దేవహూతికి (తల్లికి) తత్త్వోపదేశము చేసి అన్ని సంశయములు నాశనము చేసిన కపిల భగవానుడు కాలనాశకుడు.

**త్రిగుణాధిపతిః సాంఖ్యశాస్త్రకర్తా విశారదః ।**
**సర్గదూషణహారీ చ పుష్టిమోక్షప్రవర్తకః ॥ 42**

## 173. త్రిగుణాధిపతిః :

సత్వరజస్తమోగుణముల (త్రిగుణముల) పై ఆధారపడి జరిగేకార్యములు ధర్మ- అధర్మకార్యములుగాను, కాలమునుబట్టి మంచి లేక చెడ్డ ఫలితము లిచ్చేవిగాను ఉంటాయి. అందుచేత గుణపదముచేత అట్టి మంచి లేక చెడ్డ కాలములు చెప్పబడతాయి. కాలగతిలో యీ త్రిగుణములపై ఆధారపడిఉన్న కార్యములకు అధిపతి "త్రిగుణాధిపతి" భగవానుడే త్రిగుణాధిపతి.

*"పరం ప్రధానం పురుషం మహాన్తం కాలం కవిం త్రివృతం లోకపాలం...." (భాగ 3-24-33).*

## 174. సాంఖ్యశాస్త్రకర్తా :

సాంఖ్యమనగా ఆత్మానాత్మవివేకము. దానిని తెలిపే ఆధ్యాత్మికశాస్త్రము సాంఖ్యశాస్త్రము. దీనికర్త కపిలభగవానుడు.

*"మాత్ర ఆధ్యాత్మికీం విద్యాం శమనీం సర్వకర్మణాం..." (భాగ 3-24-40).*

## 175. విశారదః :

1. సాంఖ్యశాస్త్రమందు నిపుణుడు, విశారదుడు, కపిలభగవానుడు.



2. విశారణం, విశారః హృదయగ్రంథి దూరీకరణేన అంతఃకరణ వికాశః తేన సంసారం ద్యతి. అతఏవ వక్ష్యతేఽపి భిద్యతే హృదయ గ్రంథిః - ఇత్యాదినా తం దదాతీతివా విశారదః" హృదయ గ్రంథి ఛేదించి, అంతఃకరణమును వికసింపజేసి, సంసారబంధము నుండి విడదీసేవాడు (ఆత్మజ్ఞానమును కలుగజేసేవాడు), విశారదుడు భగవంతుడు.

## 176. సర్గదూషణహారీ (చ) :

సర్గ అంటే సృష్టి. దీని దూషణము లేక దీనిలోని దోషగుణములు (హారీ) లేకుండా చేసే భగవానుడు సర్గదూషణహారి. తన సృష్టిలో అధర్మాది దోషగుణములు లేకుండా సత్యకాల ధర్మయుక్తంగా కర్దమ దేవహూతులు జీవించారు. అందువల్ల భగవానుడు వారికి పుత్రుడై (కపిలుడుగా) జన్మించాడు. ఈ విధముగా కర్దమప్రజాపతి జీవితములో సర్గదూషణములు లేకుండా చేసిన భగవానుడు.

## 177. పుష్టిమోక్షప్రవర్తకః :

పుష్టిమార్గములో చెప్పబడిన మోక్షము లేక పుష్టిమార్గావలంబకులకు వచ్చే మోక్షము పుష్టిమోక్షము. కర్దమునకు ఇట్టి పుష్టిమోక్షము నిచ్చిన భగవానుడు పుష్టిమోక్షప్రవర్తకుడు.

*"వ్రతం స ఆస్థితో మౌనమాత్మైకశరణో మునిః...." (భాగ 3-24-42).*

**లౌకికానందదాతా చ బ్రహ్మానందప్రవర్తకః ।**
**భక్తిసిద్ధాంతవక్తా చ సగుణజ్ఞానదీపకః ॥ 43**

## 178. లౌకికానందదాతా (చ) :

లోకరీతిని అనుసరించి ఉన్నది లౌకికము. కపిలభగవానునియందున్న పుత్ర స్నేహముతో దేవహూతి కపిలుని బ్రహ్మజ్ఞానము గురించి ప్రశ్నిస్తూ శాస్త్రజ్ఞానము తెలుసుకుంటుంది. ఇంత జ్ఞానము కలిగినా ఆమెకు పుత్రస్నేహము

పోలేదు. నా కొడుకు ఇంతగొప్పవాడన్న లౌకికానందము ఆమెకు కలిగింది. (బ్రహ్మానందము కాదని అర్థము). ఇట్టి లౌకికానందము దేవహూతికి కలిగించిన కపిలభగవానుడు లౌకికానందదాత.

*"తమాసీనమకర్మాణం తత్త్వమార్గాగ్ర దర్శనం....." (భాగ 3-25-6).*

2. శాస్త్రము వినుట వలన, దాని గొప్పతనము బోధపరుచుకొనుట వలన, సంసార విషయజీవులలో కూడా లౌకికానందము కలుగుతుంది. ఇది వారిలో కలిగించే భగవానుడు, లౌకికానందదాత.

## 179. బ్రహ్మానందప్రవర్తకః :

"స ఏకోబ్రహ్మణ ఆనందః ।" (తై. ఉపనిషత్). ఉపనిషత్తులో చెప్పబడిన సత్యానుభవపూర్వక అక్షర బ్రహ్మానందము– జీవులకు ప్రసాదించే భగవానుడు, బ్రహ్మానందప్రవర్తకుడు.

## 180. భక్తిసిద్ధాన్తవక్తా (చ) :

అనన్యభక్తితో సతతము భగవద్భజన చేయుటయే భక్తి యొక్క ముఖ్య సిద్ధాంతము, (భక్తి సిద్ధాంతము). దీనిని కపిలభగవానుడు తల్లి దేవహూతికి ఉపదేశించాడు. అందుచేత భక్తిసిద్ధాంతవక్త.

*"దేవానాం గుణలింగానామానుశ్రవికకర్మణాం...." నుంచి ".... తీవ్రేణ భక్తి యోగేన మనో మయ్యర్పితం స్థిరం" వరకు [భాగ 3-25 - (32-44)].*

## 181. సగుణజ్ఞానదీపకః :

1. గుణములతో కూడుకున్నది సగుణము. ప్రపంచములోని వస్తు సమూహములు విషయములు (లేక వివిధ రూపములలో కనిపించే ప్రపంచము) సగుణము. వీటన్నింటి గురించి తెలిపే జ్ఞానమును ప్రకాశింప జేసే భగవానుడు సగుణజ్ఞానదీపకుడు.

2. నామ రూపములచే తెలియబడే సగుణబ్రహ్మజ్ఞానము కలిగించే భగవానుడు సగుణజ్ఞానదీపకుడు.



*"అథ తే సంప్రవక్ష్యామి తత్త్వానాం లక్షణం పృథక్" నుంచి ".... భోక్తృత్వే సుఖ దుఃఖానాం పురుషం ప్రకృతేః పరం" వరకు [భాగ. 3-26 - (1-8)].*

**ఆత్మప్రదః పూర్ణకామో యోగాత్మా యోగభావితః ।**
**జీవన్ముక్తిప్రదః శ్రీమానన్యభక్తిప్రవర్తకః ॥ 44**

## 182. ఆత్మప్రదః :

శాస్త్రప్రమాణముతో కూడుకున్న సంపూర్ణ ఆత్మజ్ఞానము లేక స్వస్వరూప జ్ఞానమును ప్రసాదించే భగవానుడు "ఆత్మప్రదుడు".

## 183. పూర్ణకామః :

1. కోరికలన్నిటిని సంపూర్ణముగా సఫలము చేసుకున్నవాడు పూర్ణకాముడు, భగవానుడు.

2. ఎవరి దగ్గర నుండి ఏమీ పొందాలనే కోరిక లేకుండా, తనంతట తానే సర్వము పొందిఉండి, వేరే ఏ కోరిక లేనివాడు పూర్ణకాముడు; అతడే భగవంతుడు.

3. భక్తులకు ఎవరినుండి అట్టి పూర్ణకామత్వము సిద్ధిస్తుందో ఆ భగవానుడు, పూర్ణకాముడు.

## 184. యోగాత్మా :

ఇక్కడ యోగమంటే అష్టాంగయోగము. ఈ యోగసాధనచే సమాధి యందు ఆత్మను ధ్యేయస్వరూపముగా తెలుసుకున్న కపిలభగవానుడిట్టి యోగాత్మ.

## 185. యోగభావితః :

1. "భావితః" అంటే పొందదగినది (పొందయోగ్యమైనది) సంపాదింప బడినది అని అర్థము. యోగభావితః అంటే యోగమార్గముచేత పొందయోగ్య మైన భగవానుడు.

2. "యోగభావితో యేన" అంటే ఎవరిచేత యోగమార్గము వ్యక్తము చేయబడినదో ఆ భగవానుడు, యోగభావితుడు.

## 186. జీవన్ముక్తిప్రదః :

పూర్వశుభకర్మ ఫలితముగా కలిగిన శరీరముతో జీవించి ఉండగానే భక్తునికి కామాదుల నుంచి ముక్తి, భగవద్భక్తి ప్రసాదించే భగవానుడు జీవన్ముక్తి ప్రదుడు.

*"అనిమిత్తనిమిత్తేన స్వధర్మేణామలాత్మనా....." నుంచి "..... ఆత్యన్తికీ యత్ర న మృత్యుహాసః" వరకు [భాగ 3-27 - (21-30)].*

## 187. శ్రీమాన్ :

శ్రీ అంటే శోభ. ఐశ్వర్యాది ఆరు భగలక్షణములతో శోభాయమానముగా ఒప్పుచున్న భగవానుడు శ్రీమాన్-

*"ప్రసన్నవదనాంభోజం పద్మగర్భారుణేక్షణం...." (భాగ 3-28-13).*

## 188. అన్యభక్తిప్రవర్తకః :

1. "అన్యన్ మహదాదికం భక్తశ్చ తయోః ప్రవర్తకః" భగవంతుని కన్న వేరైన "మహత్" మొదలైన తత్త్వముల ఉపాసనతో కూడిన భక్తిని కలుగజేసే భగవానుడు, అన్యభక్తిప్రవర్తకుడు. భగవంతునియందుండవలసిన నిష్కామ అనన్య భక్తికి బదులుగా, ఇతర దేవతలను, తత్త్వములను ఉద్దేశించి కోరికలతో కూడుకున్న భక్తి అన్యభక్తి.

2. సాత్త్విక, రాజస, తమో గుణములతో కూడుకున్న కోరికలు, భావనలు మనస్సులో ఉంచుకొని వివిధ దేవతల ఉపాసనలు పూజలు మొదలైనవి చేసేవారు కూడా అన్యభక్తి కలవారే- "అన్యేభ్యః పురుషార్థేభ్యః చతుర్భ్యః అపి అధికత్వేన భక్తేరేవ ప్రవర్తకః అన్యభక్తి ప్రవర్తకః" సాత్త్విక గుణము కలిగినా నాలుగు పురుషార్థములను భావించి భగవంతుని భక్తితో పూజించుట సహితము అన్యభక్తి.

(భగవంతుడు తనకన్న ఇతరములైన నాలుగు పురుషార్థముల కొరకు భక్తిని విస్తరింప జేస్తాడు. భగవంతుని యందు నిష్కామ అనన్యభక్తి కలిగి, సాలోక్య, సార్ష్టి



సామీప్య, సారూప్య సాయుజ్యములు కూడా లెక్క చేయక భగవన్నామ స్మరణ, కథాశ్రవణము, భగవత్సేవయే లక్ష్యముగా గల భక్తులు మాత్రము భగవంతుని హృదయ మందు నిల్పుకొని ఆనందిస్తారు. ఇట్టివారు బహు దుర్లభము. అన్యభక్తి కలవారు సామాన్యము.

*"భక్తియోగో బహువిధో మార్గైర్భామిని భావ్యతే...." నుంచి "....అహైతుక్యవ్యవహితా యా భక్తిః పురుషోత్తమే ।" [భాగ 3-29 - (7-12)].*

**కాలసామర్థ్యదాతా చ కాలదోషనివారకః ।**
**గర్భోత్తమజ్ఞానదాతా కర్మమార్గనియామకః ॥ 45**

## 189. కాలసామర్థ్యదాతా (చ) :

"కాలస్యాధియజ్ఞాత్మకస్య సామర్థ్యం దదాతీతి తథా" ఈ జగత్తులోని పదార్థము లన్నీ కాలము గడుస్తూ ఉండగా, (లేక కాలముచేత) మార్పులు చెందుతూ ఉంటాయి. చివరికి నశిస్తాయి. ఇవి అధిభూతములు. అధియజ్ఞ స్వరూప భగవానుడు కాలరూపములో యీ మార్పులు కలగజేస్తాడు. లేక కాలమునకు ఇట్టి సామర్థ్యము నిస్తాడు. కనుక "కాలసామర్థ్యదాతా"

*"ఏతద్భగవతోరూపం బ్రహ్మణః పరమాత్మనః..." నుంచి "..... స విష్ణ్వాఖ్యోఽధియజ్ఞోఽసౌ కాలః కలయతాం ప్రభుః" వరకు [భాగ 3-29 - (36-38)].*

*"అధిభూతం క్షరోభావః పురుషశ్చాధిదైవతం అధియజ్ఞోఽహ మేవాత్ర దేహే దేహభృతాం వర" (గీత 8-4).*

## 190. కాలదోషనివారకః :

"కాలకృతదోషాః కాలదోషాః" కాలవశమున చేయబడ్డ దోషములు కాలదోషములు వాటిని నివారించే భగవానుడు కాలదోషనివారకుడు. జగత్తులో జీవులు కార్యములు చేసేటప్పుడు తమ స్వరూపభూతుడైన భగవానుని మరచి భోగరూప ప్రమాదములలోపడి దోషములు చేస్తారు. అట్టి దోషములు చేసే దుష్టులను (శిక్షించి) సంహరించి, కాలదోషనివారణ చేసే భగవానుడు కాలదోషనివారకుడు.

*"నచాస్య కశ్చిద్దయితో నద్వేష్యో నచ బాంధవః ......" (భాగ 3-29-39).*

## 191. గర్భోత్తమజ్ఞానదాతా :

గర్భస్థశిశువు సప్తమ మాసమునుండి జన్మించే వరకు భగవంతుని స్తుతిస్తూ జ్ఞానము కలిగి ఉంటాడు. ఇట్టి జ్ఞానమునిచ్చే భగవానుడు, గర్భోత్తమజ్ఞానదాత.

*"యస్యోపసన్నమవితుం జగదిచ్ఛయాత్త నానాతనోర్భువి" (భాగ. 3-31-12).*

## 192. కర్మమార్గనియామకః :

1. అదృష్టమైన కర్మల ఆధీనములో నున్న మార్గము కర్మమార్గము. "జాయస్వమ్రియస్వ ఇత్యేవం రూపః; మృత్వాపునః మృత్యుం ఆపాద్యన్తే అర్ద్యమానాః స్వకర్మభిః" (శ్రుతి) "తస్య నితరాం, యామకోనాశకః యద్వా తత్ర నియామకస్తదనురూప ఫలదాతేతి." పుట్టుట, మరణించుట వంటివి, అనివార్యములైన అంతములేని కార్యములు. జీవి తాను చేసిన (అదృష్ట) కర్మల ఫలితాన్ని అనుభవించడానికి మరణానంతరము యీ ప్రపంచములో పుట్టడము అనివార్యము. ఇట్టి (అదృష్ట) కర్మలకు అనురూపమైన ఫలము నిచ్చే భగవానుడు కర్మమార్గనియామకుడు.

2. ఏ కర్మ చేస్తే ఆ కర్మకు అనురూపమైన ఫలమేది కలదో దానిని నియమించిన భగవానుడు కర్మమార్గనియామకుడు.

**సర్వమార్గనిరాకర్తా భక్తిమార్గైకపోషకః ।**
**సిద్ధిహేతుః సర్వహేతుః సర్వాశ్చర్యైకకారణమ్ ॥ 46**

## 193. సర్వమార్గనిరాకర్తా :

"సర్వే యే మార్గాః భక్త్యజనకాః కర్మాదయః తేషాం నిరాకర్తా." జీవునిలో భక్తిని పుట్టించని కర్మమార్గము మొదలైన ఇతర మార్గములెన్ని ఉన్నాయో వాటిని నిరాకరించే భగవానుడు, సర్వమార్గనిరాకర్త.

## 194. భక్తిమార్గైకపోషకః :

"భక్తిమార్గస్యైకస్య కర్మాదినాఽసముచ్చితస్య పోషకః స్థాపకః" కర్మ మార్గము మొదలైన మార్గములు వేటితోను కలియకుండా వాటికంటే వేరైన,



ప్రత్యేకమైన భక్తి మార్గమును మాత్రమే విశేషముగా పోషించే భగవానుడు భక్తిమార్గైక పోషకుడు.

*"తస్మాత్త్వం సర్వభావేన భజస్వ పరమేష్ఠినం......" (భాగ 3-32-22).*

## 195. సిద్ధిహేతుః :

తల్లి దేవహూతి ప్రార్థించగా ఆమెకు సాంఖ్యయోగము, భక్తియోగము, బోధించి, భగవత్ప్రాప్తి అనే సిద్ధి కలిగించుటకు కారణమైన కపిల భగవానుడు, సిద్ధిహేతువు.

## 196. సర్వహేతుః :

1. భగవత్ప్రాప్తి పొందిన భక్తులందరికి అన్ని సిద్ధులు కరతలామక మౌతాయి. అట్టి సర్వసిద్ధులు వారికి కలుగుటకు హేతువైన భగవానుడు సర్వహేతువు.

2. ప్రపంచములో జరిగేకార్యము లన్నిటికి కారణభూతుడైన భగవానుడు. సర్వహేతువు.

*"మార్గేణానేన మాతస్తే సుసేవ్యేనోదితేన మే...." నుంచి ".... యేన మామభవం యాయా మృత్యుమృచ్ఛంత్యతద్విదః" వరకు (భాగ 3-33-10, 11).*

## 197. సర్వాశ్చర్యైకకారణమ్ :

ఏ ఒక్కరు చేయశక్యముకాని అసాధారణకార్యములు ఆశ్చర్యము కలిగేటట్లు చేయుటకు కారణమైన భగవానుడు సర్వాశ్చర్యైకకారణుడు. దేవహూతి జీవితము అసాధారణమై ఆశ్చర్యములతో నిండి ఉండినది. ఆమెకు కర్దమప్రజాపతి భర్త అగుట, సాక్షాత్ భగవానుని పుత్రునిగా పొందుట, స్త్రీ జన్మఅయినా పుత్రుడగు కపిలునిచే బ్రహ్మోపదేశపూర్వకముగా సాంఖ్య శాస్త్రము తెలుసుకొనుట, వెను వెంటనే వైరాగ్యము కలుగుట. బ్రహ్మజ్ఞానము, భక్తి, సిద్ధులు కలుగుట, దేవహూతి మూలముగా లోకమునకు సాంఖ్యశాస్త్రము ప్రాప్తించుట, అన్నీ పరమాశ్చర్య కరములు. వీటన్నిటికి కారణుడైన భగవానుడు సర్వాశ్చర్యైకకారణుడు.

**చేతనాచేతనపతిః సముద్రపరిపూజితః ।**
**సాంఖ్యాచార్యస్తుతః సిద్ధపూజితః సర్వపూజితః ॥ 47**

### 198. చేతనాచేతనపతిః :

చేతనమంటే ఏ విషయమైనా, ఏ పరిస్థితిలోనైనా తత్కాలమే చక్కగా తెలుసుకోగలిగిన లేక తెలుసుకొనే శక్తి. భగవత్‌చింతన చేస్తూ ఎల్లవేళల హృదయకమలములోనున్న భగవానుని తెలుసుకొని ఆనందించే భక్తులు, ఋషులు, చేతనాసిద్ధులు. ఇట్టిశక్తి లేని పామరులు అచేతనులు. అచేతనులకు సంసారవిషయములు మాత్రమే తెలుసుకొనేశక్తి ఉంటుంది. చేతనులకు అచేతనులకు ప్రభువు చేతనాచేతనపతి, భగవానుడు. ఈ రెండు తెగలవారిని పాలించి రక్షిస్తాడు.

### 199. సముద్రపరిపూజితః :

సముద్రముచేత బహువిధములుగా పూజింపబడి స్తుతింపబడ్డ భగవానుడు సముద్రపరిపూజితుడు.

*"సిద్ధచారణగన్ధర్వైర్మునిభిశ్చాపసరోగణైః స్తూయమానః సముద్రేణ...."*
*(భాగ. 3-33-34).*

### 200. సాంఖ్యాచార్యస్తుతః :

"ఆచరన్తి స్వయం కర్మ కృత్వా ప్రదర్శయన్తి లోకసంగ్రహార్థమిత్యా చార్యాః మార్గప్రవర్తకాః" స్వయముగా కర్మలనాచరిస్తూ, లోకములో యోగక్షేమము కలుగుటకు ఆదర్శముగా ఉంటూ, వారు ఆచరించే మార్గము అందరికి చూపించేవారు ఆచార్యులు. సాంఖ్యాచార్యులచేత స్తుతింపబడ్డ భగవానుడు "సాంఖ్యాచార్యస్తుతః" అనబడతాడు.

*"ఆస్తేయోగం సమాస్థాయ సాంఖ్యాచార్యై రభిష్టుతః..."* *(భాగ 3-33-35).*

### 201. సిద్ధపూజితః :

నిదాఘాది సిద్ధులచే పూజింపబడిన (అర్చింపబడిన) భగవానుడు సిద్ధపూజితుడు.



*"సిద్ధచారణ గంధర్వైః ...... స్తూయమానః"* *(భాగ 3-33-34).*

### 202. సర్వపూజితః :

మునులు, సిద్ధులు, చారణులు, గంధర్వులు మొదలైన వారందరి చేతను పూజింపబడ్డ భగవానుడు సర్వపూజితుడు (భాగ 3-33-34)

ఇంతవరకు తృతీయస్కంధ నామములు.

## శ్రీమద్భాగవత చతుర్థస్కంధ నామములు

*విసర్గలీలా నామములు (203-300)*

*శ్లోక సంఖ్య (48-65)*

**విసర్గకర్తా సర్వేశః కోటిసూర్యసమప్రభః ।**
**అనంతగుణగంభీరో మహాపురుషపూజితః ॥ 48**

### 203. విసర్గకర్తా :

మూడవ స్కంధములో "సర్గలీలలు" వర్ణింపబడ్డాయి. ఆసర్గను ఆధారము చేసుకొని విలక్షణముగా చేయబడిన సృష్టి "విసర్గ". ఈ విసర్గలీలల కర్త అనగా ఆ లీలలకు కారకుడైన భగవానుడు విసర్గకర్త.

*"భూతమాత్రేంద్రియధియాంజన్మ సర్గ ఉదాహృతః । బ్రహ్మణో గుణ వైషమ్యా ద్విసర్గః పౌరుషః స్మృతః ॥ (భాగ 2-10-3) "మనోస్తు శతరూపాయాం తిస్రః కన్యాశ్చ జజ్ఞిరే...." (భాగ 4-1-1).*

### 204. సర్వేశః :

అందరికి ప్రభువు, రక్షకుడైనవాడు సర్వేశ్వరుడు. బ్రహ్మాది దేవతలతో కూడిన సకలలోకములకు ప్రభువైన భగవానుడు సర్వేశ్వరుడు.

ఇకముందొచ్చే నామములలో కోటిశబ్దము. అసంఖ్యాక వాచకము. "లెక్కపెట్టలేనన్ని" అని అర్థము. 'సహస్రశీర్షా పురుషః' అన్నప్పుడు సహస్రము నకు లెక్కలేనన్ని అని అర్థము చెప్పినట్లు.

### 205. కోటిసూర్యసమప్రభః :

తేజస్సు ఎక్కడున్నా అది భగవానునిదే. సూర్యుని తేజస్సు ఎంతో ఎక్కువ. కోటి (లెక్కలేనన్ని) సూర్యుల తేజస్సు ఊహించడానికి పట్టుబడనిది.కాని అది కూడా భగవానుని తేజస్సు ముందు తక్కువే. ఆ తేజస్సు గురించి చెప్పడానికి వేరొక విధానము లేక భగవానుని తేజస్సు కోటి (లెక్కలేనన్ని) సూర్యుల తేజస్సుతో సమానమని చెప్పారు.



*"యదాదిత్య గతం తేజో జగద్భాసయతేఽఖిలం...." (గీత 15-12); దివిసూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా..." (గీత 11-12).*

### 206. అనంతగుణగంభీరః :

భగవానుని ఐశ్వర్యాది గుణములు, భక్తవాత్సల్యాది గుణములు అనంతములు. అవి సులభముగా తెలియబడనవి గనుక గంభీరమైనవి, దేశకాలపరిమితములు కావు. ఇతరుల గుణములు అల్పములు గనుక భగవానుని గుణములతో సరిపోల్చదగినవి కావు. అందుచేత భగవానుడు అనంత గుణగంభీరుడు. "పరో మాత్రయా తన్వా వృధాన న తే మహిత్వమన్వశ్నువన్తి. ఉభే తే విద్మ రజసీ పృథివ్యా విష్ణో దేవ త్వం పరమస్య విత్స" (శ్రుతి) అంటే ఈ లోకములోను పరలోకములోను ఏ ఏ గుణములు కలవో అవి భగవానునికి తప్ప వేరే ఎవ్వరికీ తెలియవు.

### 207. మహాపురుషపూజితః :

మహాపురుషులైన బ్రహ్మ, నారదుడు మొదలైన వారిచే పూజింపబడే భగవానుడు మహాపురుషపూజితుడు.

**అనంతసుఖదాతా చ బ్రహ్మకోటిప్రజాపతిః ।**
**సుధాకోటిస్వాస్థ్యహేతుః కామధుక్కోటికామదః ॥ 49**

### 208. అనంతసుఖదాతా (చ) :

అవధులు లేనంత లేక లెక్కలేనంత సుఖము (బ్రహ్మానందము) నిచ్చే భగవానుడు "అనంతసుఖదాతా" అనబడతాడు.

### 209. బ్రహ్మకోటిప్రజాపతిః

చతుర్ముఖబ్రహ్మ ఒక బ్రహ్మాండమందున్న భూతజాతములన్నింటికి సృష్టికర్త కనుక ప్రజాపతి అని చెప్పబడతాడు. అటువంటి కోట్ల కొలది బ్రహ్మాండమల సృష్టికి కారకుడు బ్రహ్మకోటిప్రజాపతి - భగవానుడు.

"బ్రహ్మస్తుతి"లో "క్వేదృగ్విధా విగణితాండపరాణుచర్యావాతాధ్వరోమ వివరస్య చ తే మహిత్వం" అని బ్రహ్మ భగవానుని ప్రశంసించేడు.

### 210. సుధాకోటిస్వాస్థ్యహేతుః :

సుధా అంటే దేవతలకు ఆరోగ్యము అమరత్వము ఇచ్చే అమృతము. భగవానుడు అమృతము కంటే కోట్లరెట్లు ఆరోగ్యము కలిగించేవాడు. కాలాదుల వలన భయము లేకుండాచేసి, అమృతత్వము (అభయస్థితి) పొందించి భక్తులను కాపాడేవాడు. అందుచేత దశమస్కంధంలో ఇలా చెప్పబడింది.

*"తథా న తే మాధవ తావకాః క్వచిద్...." (భాగ 10-2-33) "మర్త్యో మృత్యువ్యాళభీతః పలాయన్....." (భాగ 10-3-27)*

### 211. కామధుక్కోటికామదః

కోరికలన్నిటినీ తీర్చగలిగినది కామధేనువు. "కామధుక్కోటిఇవకామదః" కోట్ల కొద్దీ కామధేనువులకు సమానముగా కోర్కెలు తీర్చే భగవానుడు "కామధుక్కోటికామదుడు."

**సముద్రకోటిగంభీరస్తీర్థకోటిసమాహ్వయః ।**
**సుమేరుకోటినిష్కంపః కోటిబ్రహ్మాండవిగ్రహః ॥ 50**

### 212. సముద్రకోటిగంభీరః :

శ్రేష్ఠత్వము, గొప్పదనము, పెద్దదై ఉండుట, మొదలైన మహద్గుణములు కలిగి సముద్రము గంభీరమైనది. అట్టి అసంఖ్యాక సముద్రముల వలె గంభీరత్వముగల భగవానుడు సముద్రకోటిగంభీరుడు.

### 213. తీర్థకోటిసమాహ్వయః :

1. దైవపూజ నిమిత్తము మరియు పవిత్రస్నానాదులు చేసేటప్పుడు ముందుగా గంగా మొదలైన తీర్థ దేవతలను ధ్యానించి; ఆ దేవతలను జలము నందు ఆహ్వానించి, తరువాత పూజలు, స్నానాదులు జరుపుతాము. ఈ తీర్థ జలముల ఆహ్వానము చేయడం చేత తీర్థజలములుకాని నీరు పవిత్ర



మవుతుందని భావన. అదే విధముగా భగవానుని (విష్ణువును) జలములందు ఆహ్వానము చేయుటచే ఆ నీరు తీర్థముల ఆవాహనకంటె కోటిరెట్లు (లెక్క లేనంత) పుణ్య ఫలప్రదమవుతుంది.

2. ఆహ్వాయమనగా కీర్తనము. శ్రీవిష్ణునామ సంకీర్తనము కోటి (లెక్కలేనన్ని) తీర్థములతో సమానము గనుక భగవానుడు తీర్థకోటి సమాహ్వాయుడు.

3. ఆహ్వాయమనగా అభిదానము లేక నామము. భగవానుని నామము కోటి (లెక్కలేనన్ని) తీర్థములతో సమానమైన పవిత్రత కలది. అందుచేతనే "యస్య స్మృత్యా చ నామోక్త్యా తపః పూజా క్రియాదిషు న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందే తమచ్యుతం...." అని భగవన్నామ స్మరణము గురించి చెప్పబడినది.

### 214. సుమేరుకోటినిష్కంపః :

1. మేరుపర్వతమును "సుమేరు" అంటారు. మేరుపర్వతము, పర్వతము లన్నిటిలో అతి శ్రేష్టమైనది, ఎత్తైనది, పెద్దది. ఇది కదుల్చుటకు వీలులేనిది (నిష్కంపము). అట్టి కోటిమేరుపర్వతములకంటె అచలమైనవాడు భగవానుడు.

2. మేరు పర్వతము చుట్టూ సూర్యభగవానుడు తిరుగుతూ కాలమును నడిపిస్తాడు. ఇట్టి సూర్యునకు భ్రమణము (కదలిక) ఉన్నది. కాలమునకు కూడా కదలిక ఉన్నది. భగవానుడు తాను కదలకుండా (స్థిరుడై) కాలమునకు గమనము కలిగిస్తాడు. అందుచేతనే భగవానుడు "సమేరుకోటినిష్కంపః" అని చెప్పబడతాడు.

### 215. కోటిబ్రహ్మాండవిగ్రహః :

విగ్రహము అనగా శరీరము లేక దేహము. కోటిబ్రహ్మాండవిగ్రహః అంటేకోట్ల సంఖ్యలో గల బ్రహ్మాండములే దేహముగా కలవాడు. లేక తన దేహమునందే కోట్ల బ్రహ్మాండములు కలవాడు – భగవానుడు.

*"పురుష ఏ వేదగ్ం సర్వం" (శ్రుతి).*

అర్జునునికి విశ్వరూప సందర్శనము చేయించి భగవానుడు తన విరాట్ పురుషుని దేహమందు బ్రహ్మాండములన్నీ చూపించాడు.

*"పశ్యామి దేవాంస్తవ దేవ దేహే..."* *(గీత 11-15).*

**కోట్యశ్వమేధపాపఘ్నో వాయుకోటిమహాబలః ।**
**కోటీందుజగదానందీ శివకోటిప్రసాదకృత్ ॥ 51**

## 216. కోట్యశ్వమేధపాపఘ్నః :

బ్రహ్మహత్యాది సర్వపాపములను పోగొట్టేది అశ్వమేధయాగము. అందుకే బహుకాలము, బహుశ్రమతో, సహనముతో కష్టపడి రాజులు అశ్వమేధయాగము చేస్తారు. "సర్వం పాప్మానం తరతి, తరతి బ్రహ్మహత్యాం యోఽ శ్వమేధేన యజతే" (శ్రుతి); అశ్వమేధయజ్ఞము చేసిన వారు సకల పాపములనుండి బ్రహ్మహత్యా పాతకము నుండి (కూడా) తరిస్తారు (దాటుతారు.) భగవన్నామస్మరణ ఎట్టిదంటే, ఒక్క మారు భగవన్నామము స్మరించినంత మాత్రాన్నే, కోటి (లెక్కలేనన్ని) అశ్వమేధయాగములు చేసిన ఫలము లభిస్తుంది. ఇది ఎంతో గొప్ప విశేషము కనుక భగవన్నామ స్మరణము "కోట్యశ్వమేధపాపఘ్నః" అని చెప్పారు.

"నా మ్నోస్తి యావతీ శక్తిః పాపనిర్దలనే హరేః । తావత్ కర్తుం న శక్నోతి పాతకం పాతకీనరః. ఏ పాపాత్ముడు కూడా శ్రీహరి నామస్మరణము పోగొట్టేటంతపాపము చేయలేదు. పాపములు హరించుటలో భగవన్నామమునందు అంతశక్తి కలదు. "ప్రాయశ్చిత్తాన్యశేషాణి తపః కర్మాత్మకాని వై । యాని తేషామశేషాణాం కృష్ణానుస్మరణం పరం" పాపములు పోగొట్టుకోడానికి తపస్సుతోను కర్మలతోను కూడిన ప్రాయశ్చిత్తములు అనేకములు ఉన్నాయి. ఆ అసంఖ్యాకమైన ప్రాయశ్చిత్తములలో శ్రీకృష్ణానుస్మరణము (తిరిగి తిరిగి కృష్ణ నామము స్మరించుట) మిక్కిలి శ్రేష్ఠమైనది.

## 217. వాయుకోటిమహాబలః :

వాయువు మహాబలుడు (బలం చెప్పాలంటే వాయుబలమని చెప్తారు). ఇట్టి కోట్లవాయువుల బలసంపన్నమైనది భగవన్నామము.



## 218. కోటీందుజగదానందీ :

చంద్రుడూ, వెన్నెలా జీవులందరికీ ఆనందము సమకూర్చుతాయి. ఇట్టి కోట్ల (లెక్కలేనన్ని) చంద్రులు ఇచ్చే ఆనందముకన్నా ఎక్కువ ఆనందము భగవన్నామస్మరణము చేతనే కలుగుతుంది.

## 219. శివకోటిప్రసాదకృత్ :

శివుడు ఆశుతోషుడు. భోలా శంకరుడు. శీఘ్రముగా సులభ సాధన చేతనే సంతోషించి భక్తులకు వరములు ప్రసాదిస్తాడు. శివుని పూజలు, జపములు, తపములకంటె భగవన్నామస్మరణ సులభతరము. నామస్మరణ మాత్రము చేతనే భగవానుడు సర్వఫలములు ప్రసాదిస్తాడు. స్మరణ మాత్రము చేతనే శివుడిచ్చేవర ప్రసాదములకన్న కోటి (లెక్కలేనన్ని) రెట్లు ఎక్కువ వరములు ప్రసాదించే భగవానుడు "శివకోటిప్రసాదకృత్" అని చెప్పబడతాడు.

నామస్మరణము ఇంత గొప్పదైనపుడు స్తుతించడానికి సందేహము ఉండ నవసరము లేదు. నామస్మరణము యొక్క గొప్పదనము చెప్పే నామములు ఈ క్రింది శ్లోకములో చెప్పబడ్డాయి.

**సర్వసద్గుణమాహాత్మ్యః సర్వసద్గుణభాజనమ్ ।**
**మన్వాదిప్రేరకో ధర్మో యజ్ఞనారాయణః పరః ॥ 52**

## 220. సర్వసద్గుణమాహాత్మ్యః :

మాహాత్మ్యమనగా ప్రభావము. పుణ్యక్షేత్రములలోగల తీర్థదేవతల దివ్యశక్తి కన్న సద్గుణముల మహాత్మ్యము గొప్పది. అన్ని సద్గుణములకు (ఐశ్వర్యాది భగశబ్దార్థషడ్గుణములకు) భగవంతుడే నిధి. అందుచేత భగవానుడు సర్వసద్గుణ మాహాత్మ్యుడు.

## 221. సర్వసద్గుణభాజనం :

'భాజనం' అంటే యోగ్యము, యోగ్యుడు, ఆధారము అని అర్థము. భగవానుడు సమస్త సద్గుణములు గల యోగ్యుడు. సర్వసద్గుణములు సేవింప

దగినవి. కోరికలతో యజ్ఞయాగాది కర్మలు ఆచరించేవారు, వ్యూహాదుల నుపాసించే వారు, సర్వసద్గుణములకు నిధి అయిన భగవానుని భజించరు. సర్వసద్గుణభాజనుడైన భగవానుని భజన మహాత్మ్యము తెలుసుకొని కామనార హితముగా భజించాలని భావము.

204వ నామము "సర్వేశః" నుంచి 221వ నామము "సర్వసద్గుణ భాజనమ్" వరకు ఏర్చి కూర్చిన పద్దెనిమిది (18) నామములు ఇతర పురాణములలో ప్రసిద్ధములు. ఇవి భగవానుని సర్వ సమర్థతను తెలుపుతాయి. సర్వకార్యములు చేసే సమర్థతను తెలిపే యీ భగవానుని నామముల వివేచన, భాగవతములో ముందు ముందు వర్ణింపబడుతుంది.

## 222. మన్వాదిప్రేరకః :

సృష్టిని విస్తరింపజేయడానికి స్వాయంభువాది మనువులను, ప్రజాపతులను అత్ర్యాది మహర్షులను, ఇతరులను ప్రేరణ చేసిన భగవానుడు మన్వాది ప్రేరకుడు.

## 223. ధర్మః :

ప్రజలు ధర్మబద్ధులై ఉండి జీవించడానికి, మన్వాదులు ధర్మశాస్త్రములు చేసారు. వీరిచే చెప్పబడిన ధర్మము భగవత్స్వరూపమే. అందుచేత "ధర్మః" అంటే భగవానుడు.

## 224. యజ్ఞనారాయణః :

యజ్ఞస్వరూపుడైన నారాయణుడు యజ్ఞనారాయణుడు.

*"ప్రజాపతిః స భగవాన్ రుచిస్తస్యామజీజనత్" (భాగ 4-1-3).*

## 225. పరః :

1. "పిపర్తి దేవానితి పరః" దేవతలనందరిని పాలించువాడు లేక పోషించువాడని "పరః" శబ్దమునకు అర్థము. దేవతలకు పరుడైన దేవుడు, భగవానుడు.



2. దేవతలందరికన్న ఉత్కృష్టమైన భగవానుడు "పర"వాచ్యుడు.

**ఆకూతిసూనుర్దేవేంద్రో రుచిజన్మాఽభయప్రదః ।**
**దక్షిణాపతిరోజస్వీ క్రియాశక్తిః పరాయణః ॥ 53**

## 226. ఆకూతిసూనుః :

స్వాయంభువమనువు శతరూపుల పుత్రిక ఆకూతి. ఈమె "రుచి" అనే ప్రజాపతి భార్య. వీరికి సాక్షాత్ యజ్ఞస్వరూపుడైన విష్ణువు పుత్రుడై జన్మించాడు. అందుచేత భగవానుడు ఆకూతిసూనుడు.

*"మనోస్తు శత రూపాయాం తిస్రః కన్యాశ్చ జజ్ఞిరే...." నుంచి "..... యా స్త్రీ సా దక్షిణా భూతేరంశభూతానపాయినీ." [భాగ 4-1 - (1-4)].*

## 227. దేవేంద్రః :

1. ఇంద్ర శబ్దము శ్రేష్ఠవాచకము. "దేవానామింద్రః దేవేంద్రః" అంటే దేవతలలో శ్రేష్ఠుడు భగవానుడు అని. "దేవశ్చాసౌ ఇంద్రశ్చ" ఈ దేవుడు ఇంద్రుడు అని అర్థము.

2. దేవతలందరికి ప్రభువైన ఇంద్రుని రూపములోనున్న భగవానుడు దేవేంద్రుడు. స్వాయంభువ మన్వంతరములో భగవాన్ యజ్ఞుడు దేవేంద్రుడై ఉండెను.

*"తుషితా నామ తే దేవా ఆసన్ స్వాయంభువాన్తరే...." (భాగ 4-1-8).*

## 228. రుచిజన్మా :

రుచిప్రజాపతికి ఆకూతికి జన్మించిన యజ్ఞభగవానుడు "రుచిజన్మా" అని చెప్పబడ్డాడు. [భాగ 4-1 - (3-4)].

## 229. అభయప్రదః :

యజ్ఞస్వరూపుడై అసురుల నుండి దేవతలకుభయము లేకుండా చేసిన (అభయమిచ్చిన) యజ్ఞభగవానుడు, అభయప్రదుడు.

*"యజ్ఞేనాసురానపానుదన్త...." (శ్రుతి).*

**230. దక్షిణాపతిః :**

ఆకూతి రుచిప్రజాపతులకు యజ్ఞభగవానునితో సహా లక్ష్మీ అంశతో "దక్షిణా" అనే పుత్రిక జన్మించినది. దక్షిణా లక్ష్మీ అంశతో పుట్టుటచేత యజ్ఞ భగవానుడైన విష్ణువునే కోరి వివాహము చేసుకొన్నది.

*"తాం కామయానాం భగవానువాహ యజుషాం పతిః"* *(భాగ 4-1-6).*

**231. ఓజస్వీ :**

ఓజస్ అనునది ఉత్సాహ విశేషము. అది కలవాడు ఓజస్వీ, భగవానుడు.

**232. క్రియాశక్తిః :**

"క్రియా" అనగా కర్మ. కర్మలు (జపతపాదులు) చేయుశక్తి (సామర్థ్యము) "క్రియాశక్తి". ఇది భగవానునినుంచి ఉద్భవిస్తుంది. ఈ క్రియా శక్తి రూపములో నున్న భగవానుడు. ఈ క్రియాశక్తిత్వము నిశ్చయముగా అంతటా కనబడుతుంది. అయినప్పటికి ఫలసిద్ధి అన్నిచోట్ల (అందరి యందు) కనిపించదేమి? అన్న ప్రశ్నకు సమాదానము "పరాయణః" అన్న దీని తర్వాత నామములో చెప్పబడింది.

**233. పరాయణః :**

1. "పరం అక్షరం, అయనం అధిష్ఠానం యస్యేతి పరాయణః." పరం అంటే అక్షరబ్రహ్మ. అయనం అంటే అధిష్ఠానము లేక ఉండే స్థానము. పర బ్రహ్మస్థానము అని అర్థము. అక్షర పరబ్రహ్మమే యీ నామరూపాత్మకమైన జగత్తు అంతటికి అధిష్ఠానము లేక ఉండే స్థానమని తెలుసుకున్నవాడు పరాయణుడు.

2. "పరం ఉత్కృష్టం, అయనం జ్ఞానం" ఇట్టి పరమోత్కృష్ట జ్ఞానము కలవాడు పరాయణుడు.

3. "పరేషు ఉత్కృష్టేషు సంసరణ యస్యేతి పరాయణః" ఉత్కృష్టస్థితి లేక స్థానము పొందిన జ్ఞానులు, భక్తులు అనుసరించిన మార్గములో వెళ్ళుట పరాయణము.



**దత్తాత్రేయో యోగపతిర్యోగమార్గప్రవర్తకః ।**
**అనసూయాగర్భరత్నమృషివంశవివర్ధనః ॥ 54**

**234. దత్తాత్రేయః :**

"దత్తశ్చ అసౌ ఆత్రేయశ్చ" ఇతడు దత్తుడు ఆత్రేయుడు అని అర్థము. 'దత్త' అంటే భగవంతుని అంశగా ఇవ్వబడ్డవాడు. "ఆత్రేయః" అంటే అత్రి మహాముని కొడుకు - దత్తాత్రేయుడు. అత్రి అనసూయలకు దత్తాత్రేయుడు, దుర్వాసుడు. చంద్రుడు అనే ముగ్గురు పుత్రులున్నారు. వీరు క్రమముగా విష్ణు, శంకర, బ్రహ్మ అంశలతో పుట్టారు.

*"అత్రేః పత్న్యనసూయా త్రీఞ్జజ్ఞే సుయశసః సుతాన్"* *(భాగ 4-1-15).*

**235. యోగపతిః :**

విష్ణ్వంశసంభూతుడైన దత్తాత్రేయుడు అష్టాంగయోగమునకు అధిపతి. యోగాచార్యుడు కనుక యోగపతి లేక యోగులకు స్వామి అయిన భగవానుడు.

**236. యోగమార్గప్రవర్తకః :**

యోగులను, సాధకులను యోగమార్గమందు ప్రవర్తింపజేసే భగవానుడు, యోగమార్గప్రవర్తకుడు.

**237. అనసూయాగర్భరత్నం :**

అత్రి మహర్షి భార్య అనసూయ. దత్తాత్రేయ, దుర్వాస, చంద్రులు వారి తనయులు. విష్ణ్వంశతో జన్మించిన దత్తాత్రేయుడు వారి ముగ్గురిలో శ్రేష్ఠుడు కనుక ఆయన అనసూయా గర్భరత్నము.

*"సోమోఽభూద్బ్రహ్మణోఽంశేన దత్తో విష్ణోస్తుయోగవిత్ । దుర్వాసాః శంకరస్యాంశో...."* *(భాగ 4-1-33).*

**238. ఋషివంశవివర్ధనః :**

అంగిర మొదలగు ఋషుల యొక్క వంశపరంపరను విశేషముగా వృద్ధిపొందించిన భగవానుడు ఋషివంశవివర్ధనుడు.

**గుణత్రయవిభాగజ్ఞశ్చతుర్వర్గవిశారదః ।**
**నారాయణో ధర్మసూనుర్మూర్తిపుణ్యయశస్కరః ॥ 55**

**239. గుణత్రయవిభాగజ్ఞః :**

ప్రకృతిలోని ద్రవ్యము మూడు విధములైన గుణములతో కూడి ఉంటుంది. ఆ గుణములు సత్త్వరజస్తమో గుణములు. ఇవి శుద్ధసత్త్వ, శుద్ధరజస్, శుద్ధతమో గుణముల రూపములలో వేర్వేరుగా కాకుండా మిశ్రమ గుణముల రూపములో ఉంటాయి. వీని విభాగము వివేచనములు విశేషముగా తెలిసిన భగవానుడు గుణత్రయవిభాగజ్ఞుడు.

**240. చతుర్వర్గవిశారదః :**

ధర్మార్థకామమోక్షములు అనే నాలుగు విధములైన పురుషార్థములు, చతుర్వర్గములు. వాని సముదాయము, వాటిలోని సూక్ష్మతల గురించి చక్కగా తెలిసిన భగవానుడు చతుర్వర్గవిశారదుడు.

**241. నారాయణః :**

నరః అంటే ఆత్మ. దాని నుండి పుట్టిన ఆకాశాది పంచభూతములు "నారములు" ఈ పంచభూతముల నుండి ఏర్పడిన జగత్తులోని స్థూల సూక్ష్మములు అయిన సర్వవస్తుసముదాయములోను వ్యాపించి, వాటికి ఆధారము, స్థానము అయి ఉండుట "అయనము". ఈ విధముగా జగత్తు అంతట వ్యాపించి ఉన్న భగవానుడు నారాయణుడు.

*1. "యచ్చకించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపివా అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" (శ్రుతి). "నరాజ్జాతాని తత్త్వాని నారాణీతి తతో విదుః । తాన్యేవాయనం తస్య తేన నారాయణః స్మృతః' ।' (మహాభారతము) "నరాణామయనం యస్మాత్ తస్మాన్నారాయణ స్మృతః" (బ్రహ్మవైవర్తపురాణము). ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపోవైనరసూనవః అయనం తస్య తా పూర్వం తేన నారాయణ స్మృతః । (మనుస్మృతి).*

*2. "నయతీతినరః ప్రోక్తః పరమాత్మా సనాతనః' ।" (వ్యాసుడు).* సనాతనుడైన పరమాత్మ జీవుల నందరినీ ఉత్తమ స్థితితికి తీసుకొని వెళ్లును కాన పరమాత్మ నారాయణుడు.



**242. ధర్మసూనుః :**

'ధర్మ' అనే ముని కుమారుడు నారాయణుడు. దక్ష ప్రజాపతి తన పుత్రికలలో పదముగ్గురిని ధర్మ అనే మునికిచ్చి వివాహము చేసాడు. వారిలో మూర్తి అను ఆమెకు ధర్మమునికి నర నారాయణులు పుత్రులై అవతరించారు. అందుచేత నారాయణ భగవానుడు ధర్మసూనుడు.

*"ప్రసూతిం మానవీం దక్ష ఉపయేమే హ్యాజాత్మజః" నుంచి "మూర్తిః సర్వగుణోత్పత్తిర్నర నారాయణావృషీ" [భాగ 4-1 - (47-52)].*

**243. మూర్తిపుణ్యయశస్కరః :**

ధర్మముని భార్య మూర్తి పుణ్యఫలము వలన భగవానుడు నర నారాయణుల రూపములో ఆమెకు జన్మించేడు. అందుచేత భగవానుడు మూర్తిపుణ్య యశస్కరుడు.

*"మూర్తిః సర్వగుణోత్పత్తిర్నరనారాయణావృషీ" నుంచి "…. దేవా బ్రహ్మాదయః సర్వే ఉపతస్థురభిష్టవైః" వరకు [భాగ 4-1 - (52-55)].*

**సహస్రకవచచ్ఛేదీ తపఃసారో నరప్రియః ।**
**విశ్వానందప్రదః కర్మసాక్షీ భారతపూజితః ॥ 56**

**244. సహస్రకవచచ్ఛేదీ :**

1. వేలకొలది కవచములు ధరించినా ఆకవచము లన్నింటినీ ఛేదించగల శక్తి కలిగిన భగవానుడు "సహస్రకవచచ్ఛేదీ."

2. సంసారవిషయములు వేలకొలది కవచములవలె జీవుని ఆత్మ జ్ఞానమునకు అడ్డంకులవుతాయి. భగవత్కృప కలిగినపుడు యీ విషయ కవచములన్నీ ఛేదింపబడి ఆత్మజ్ఞానము ప్రాప్తిస్తుంది. అందుచేత భగవానుడు "సహస్రకవచచ్ఛేదీ".

### 245. తపఃసారః :

సారః అంటే గ్రాహ్యము, చేవ, బలము, ముఖ్యమైన స్థిరమైన భాగము. తపస్సే ముఖ్యమైన లేక సారభూతమైన సాధనమని ఎల్లవేళల తపోనిష్ఠలో ఉన్న నరనారాయణుల రూపములో నున్న భగవానుడు.

*"తపశ్చాస్మి తపస్విషు" (గీత 7-9).*

### 246. నరప్రియః :

1. నరునికి ప్రియమైనవాడు లేక నరుడు ఎవరికి ప్రియుడో ఆ భగవానుడు నరప్రియుడు. నారాయణరూపభగవానునికి నరుడు ప్రియుడు నరునకు నారాయణుడు ప్రియుడు.

2. నరులకు (మనుష్యులకు) నారాయణ భగవానుడు ప్రియుడు.

### 247. విశ్వానందప్రదః :

1. విశ్వములో అందరికి ఆనందము నిచ్చే భగవానుడు విశ్వానంద ప్రదుడు. ధర్మముని మూర్తులకు నరనారాయణుల రూపములో భగవానుడు జన్మించినపుడు విశ్వమంతా ఆనందించినది. అందుచేత భగవానుడు విశ్వానంద ప్రదుడు.

2. విశ్వహితము కొరకే నరనారాయణులు ఎల్లప్పుడు తపస్సు చేస్తారు గనుక వారి రూపములలో నున్న భగవానుడు విశ్వానందప్రదుడు.

*"యయోర్జన్మన్యదో విశ్వమభ్యనందత్సునిర్వృతమ్" (భాగ 4-1-53).*



### 248. కర్మసాక్షీ :

1. "దేవమనుష్యాదీనాం కర్మశుభాశుభం సాక్షాత్పశ్యతి తథావివినక్తీతి సాక్షీ." దేవతలు, మనుష్యాదులు చేసే శుభాశుభ కర్మలన్నిటిని సాక్షాత్ (ఇతరుల వలన గాక స్వయముగా) చూచి ఆయాకర్మఫలములు యథాతథముగా ఇచ్చే భగవానుడు "కర్మసాక్షీ".

2. నరనారాయణులు తమకొరకు గాక, లోకకళ్యాణార్థము మాత్రమే తపస్సు చేస్తూ ఉంటారు. *"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరోజనః।"* (గీత 3-21) శ్రేష్ఠులేది ఆచరిస్తారో ఇతర జనులు కూడా ఆ విధముగానే చేస్తారు. నిష్కామముగా తపస్సు చేయవలెనని ఇతరులకు తెలియజేయుటకు నరనారాయణులు ఆ విధమైన తపస్సు సాక్షీభూతముగా చేస్తూ ఉంటారు.

### 249. భారతపూజితః :

1. భరతవంశములో పుట్టిన యుధిష్ఠిరాదులు శ్రీకృష్ణుని సహాయము ఎల్లవేళలా పొందేవారు. వారు శ్రీకృష్ణుని పూజించారు. శ్రీకృష్ణ భగవానుడిట్లు భారతపూజితుడైనాడు.

2. "భారత" అంటే సారస్వత పాండిత్యము కలవారు. వారిచే పూజింపబడే భగవానుడు భారతపూజితుడు.

3. భరతఖండములో నున్న వారందరి చేత పూజింపబడే భగవానుడు భారతపూజితుడు.

**అనంతాద్భుతమాహాత్మ్యో బదరీస్థానభూషణమ్ ।**
**జితకామో జితక్రోధో జితసంగో జితేంద్రియః ॥ 57**

### 250. అనంతాద్భుతమాహాత్మ్యః :

అంతములేని (లేకహద్దులు లేనట్టి) ఆశ్చర్యము పుట్టించే మహాత్మ్యము గల లీలలు చేసే భగవానుడు అనంతాద్భుతమాహాత్మ్యుడు. రామాయణము,

మహాభారతము, భాగవతము మొదలైన పురాణము లన్నిటిలోను భగవంతుని అనంతాద్భుతమహాత్మ్యములు ప్రసిద్ధములు.

**251. బదరీస్థానభూషణం :**

బదరికాక్షేత్రమునందు నారాయణుడు తపస్సు చేసాడు. అచ్చట తపస్సు చేసేవారందరిలోనూ ఆయన తలమాణిక్యము వంటివాడు. అందుచేత నారాయణుడు బదరీస్థానభూషణుడు.

**252. జితకామః :**

తపస్సు విఘ్నము చేసే కామదేవుని జయించిన వాడు జితకాముడు. దేవేంద్రుడు నరనారాయణుల తపస్సు భంగము చేయడానికి కామదేవుని ప్రోత్సాహించాడు. కాని కాముడు వారి తపస్సునకు విఘ్నము కలిగించ లేకపోయాడు. అందుచేత నారాయణ భగవానుడు జితకాముడు.

**253. జితక్రోధః :**

క్రోధమును జయించిన వాడు, క్రోధమును తన వశము నందుంచు కొన్నవాడు లేక ఎంత మాత్రము క్రోధము లేనివాడు జితక్రోధుడు. రుద్రుడు కోపము చేత కామదేవుని భస్మము చేసేడు. కాని నారాయణుడు కాముని పై క్రోధము చూపించకుండానే తిరస్కరించాడు. అందుచేత జితక్రోధుడు.

**254. జితసంగః :**

విషయవ్యాసంగములతో నిండిన ఈ సంసార సంగమును విడిచి పెట్టినవాడు, జితసంగుడు, భగవానుడు.

**255. జితేంద్రియః :**

ఇంద్రియములు విషయములపైకి పోకుండా వశములో గలవాడు జితేంద్రియుడు. అందుచే ఇంద్రియములకు ప్రభువైన హృషీకేశుడనే పేరు నారాయణభగవానునికి కలదు.

**ఉర్వశీప్రభవః స్వర్గసుఖదాయీ స్థితిప్రదః ।**
**అమానీ మానదో గోప్తా భగవచ్ఛాస్త్రబోధకః ॥ 58**



**256. ఉర్వశీప్రభవః :**

ముల్లోకములలో సాటిలేని సౌందర్యము గల ఊర్వశి అనే అప్సరసను తన తొడలలో నుంచి పుట్టించిన నారాయణుడు "ఉర్వశీప్రభవః" అని చెప్పబడతాడు.

**257. స్వర్గసుఖదాయీ :**

స్వర్గములో ఇంద్రాది దేవతలు పొందే సుఖము స్వర్గసుఖము. ఊర్వశిని స్వర్గమునకు పంపి, ఆమెను అప్సరసలలో ముఖ్యమైన దానిగా చేసి, దేవతలతో సమానముగా ఆమెకు స్వర్గ సుఖము కలుగజేసిన నారాయణుడు- "స్వర్గ సుఖదాయీ."

**258. స్థితిప్రదః :**

ఇక్కడ స్థితి అంటే స్థిరమైన స్థానము. ఊర్వశిని స్వర్గమునకు పంపి ఆమెకు అక్కడ స్థిరమైన స్థానమును కలిగించిన నారాయణ భగవానుడు. ఆమె తిరిగి నారాయణుని వద్దకు వెళ్లలేదు (ఆమెను పిలిపించలేదు).

**259. అమానీ :**

మానము అనగా అభిమానము, అహంకారము, గర్వము. దేహాత్మబుద్ధితో జీవించే తాను ఇతరులకంటె అధికుడనని అనుకోవడం "మానము". ఇట్టి మానము అధికముగా కలవాడు "మానీ". ఇది అసురలక్షణము. అట్టి అభిమానము లేనివాడు "అమానీ" (న+మానీ) భగవానుడు.

**260. మానదః :**

1. మాన అంటే అభిమానము (దానిని) ద్యతి ఖండించినవాడు మానదుడు. స్వాభిమానమును పూర్తిగా ఖండించువాడు లేక పోగొట్టువాడు, మానదుడు.

2. లోకకల్యాణార్థము ఇతరులను సన్మానించువాడు మానదుడు, నారాయణభగవానుడు.

**261. గోప్తా :**

గోప్తా అంటే రక్షించేవాడు, భగవానుడు. అన్ని లోకములను రక్షించే నారాయణ భగవానుడు "గోప్తా".

**262. భగవచ్ఛాస్త్రబోధకః :**

ఇక్కడ బోధకుడంటే జ్ఞాపకము చేసే వాడని అర్థము. పంచరాత్రాది శాస్త్రములు భగవచ్ఛాస్త్రములు. వాటిని నారదాదులకు జ్ఞప్తి చేసిన భగవానుడు, నారాయణుడు.

**బ్రహ్మాదివంద్యో హంసః శ్రీర్మాయావైభవకారణమ్ ।**
**వివిధానంతసర్గాత్మా విశ్వపూరణతత్పరః ॥ 59**

**263. బ్రహ్మాదివంద్యః :**

బ్రహ్మశివాది దేవతలందరికి వందనీయుడు, భగవానుడు, నారాయణుడు.

**264. హంసః :**

1. "హంతి సంస్మృతి జానాతీతివా ఇతి హంసః." సంసారమును (సంసార విషయములను) పోగొట్టే వాడు లేక లేకుండా చేసే భగవానుడు, "హంసః"

2. "సర్వం హంసః పరమాత్మేతియావత్" ఉన్నదంతా పరబ్రహ్మమే. అంత కంటే వేరే మరేదీ లేదు. అందుచే 'హంసః' అంటే భగవానుడు.

**265. శ్రీః :**

1. "శ్రయన్తే అనేన ఇతిశ్రీః". దేని చేత రక్షణ పొందుతారో ఆ రక్షణ రూపములో గల భగవానుడు "శ్రీ"

2. అందరికి ఆశ్రయమైన లక్ష్మీదేవి రూపములోనున్న భగవానుడు.



3. కీర్తి లేక పూజనీయత తెలియజేయడానికి దేవతలపేర్ల ముందు, గొప్పవారైన స్త్రీ, పురుషులపేర్ల ముందు శ్రీ అని చేరుస్తారు. ఈ కీర్తి లేక పూజనీయత రూపములో గల భగవానుడు, శ్రీ అని చెప్పబడతాడు.

**266. మాయావైభవకారణం :**

భగవానుడు మాయ సహాయముతో (మాయను ప్రేరణచేసి) సృష్టించుట, పెంచుట, నశింపజేయుట మొదలైన చిత్ర విచిత్రకార్యములు చేస్తాడు. ఇవే భగవానుని లీలలు (వైభవోపేతకార్యములు). వీటిలో భగవానుని వైభవము కనిపిస్తూ ఉంటుంది. అందుచేత భగవానుడు మాయావైభవకారణుడు.

**267. వివిధానంతసర్గాత్మా :**

సృష్టి ఎన్నో విధములుగాను అనంతముగాను జరుగుతుంది. దక్ష యజ్ఞము నాశనముచేసే నిమిత్తము రుద్రుడు తనజుట్టులో నుంచి వీరభద్రాదులను సృష్టించుట దీనికి ఒక ఉదాహరణము (నిదర్శనము). ఇట్టి పలువిధములైన, అనంతములైన సామర్థ్యములతో సృష్టిచేయు భగవానుడు 'వివిధానంత సర్గాత్మ.'

**268. విశ్వపూరణతత్పరః :**

1. "విశ్వస్య పూరణే పోషణే తత్పరః సావధానః విశ్వపూరణతత్పరః" పూరణమనగా పోషించుట. విశ్వము నంతటిని పోషించుటయందు ఏమరు పాటు లేకుండా నిమగ్నమయి ఉండే భగవానుడు విశ్వపూరణతత్పరుడు.

2. "విశ్వపూరణస్య తననం విశ్వపూరణ తత్, తదేవ పరం ఉత్కృష్టం యస్యేతి" తననం అంటే శ్రద్ధ కలిగి ఉండుట లేక ఉపకారము చేయుట. విశ్వమును పోషించుట అనే ఉత్కృష్టకార్యము నందు పూర్తిగా శ్రద్ధ వహించే భగవానుడు విశ్వపూరణతత్పరుడు.

**యజ్ఞజీవనహేతుశ్చ యజ్ఞస్వామీష్టబోధకః ।**
**నానాసిద్ధాంతగమ్యశ్చ సప్తతంతుశ్చ షడ్గుణః ॥ 60**

## 269. యజ్ఞజీవనహేతుః (చ) :

1. కొందరు యజ్ఞాదికర్మలు చేయడమే తమ జీవనముగా భావించి దక్షునివలె జీవిస్తారు. ఇట్టి బుద్ధి వారికి కలుగుటకు కారణమైన భగవానుడు.

2. దక్షునిచే తిరిగి యజ్ఞము చేయించుటకు కారణమైన భగవానుడు.

*"యదాభిషిక్తో దక్షస్తు బ్రహ్మణా పరమేష్ఠినా" (భాగ 4-3-2)*
*"క్షమాప్యైవం స మీఢ్వాంసం బ్రహ్మణా చానుమంత్రితః (భాగ 4-7-16).*

## 270. యజ్ఞస్వామీ :

1. యజ్ఞమునకు స్వామి లేక ప్రభవు, భగవానుడు.

2. యజ్ఞము చేసే యజమానికి స్వామి "యజ్ఞో యజమానః" (శ్రుతి) యజమాని రూపము గల భగవానుడు.

3. యజ్ఞరూప భగవానుడు యజ్ఞస్వామి. "యజ్ఞోవై విష్ణుః (శ్రుతి).

## 271. ఇష్టబోధకః :

దక్షయజ్ఞ విధ్వంసము జరిగిన తర్వాత ఋత్విజులు, సదస్యులు రుద్రుని ప్రసాదము పొందవలెనని బ్రహ్మదేవునిచే వారికి ఇష్టబోధ చేయించిన భగవానుడు.

*"తదాకర్ణ్య విభుః ప్రాహ తేజీయసి కృతాగసి...." నుంచి .... యస్యాత్మతంత్రస్య క ఉపాయం విధిత్సేత్" [భాగ 4-6 - (4-7)].*

## 272. నానాసిద్ధాంతగమ్యః :

అనేక విధములైన సిద్ధాంతములు, నిర్దేశించిన సాధనలు చేసి చివరకు చేరే స్థానము (గమ్యస్థానము) అయిన భగవానుడు లేక వివిధ సిద్ధాంతములచే తెలియబడే భగవానుడు, నానాసిద్ధాంతగమ్యుడు.

యజ్ఞయాగాది కర్మలు నమ్మేవారు వారి వారి జ్ఞానము ననుసరించి భగవానుని స్తుతిస్తారు. ఏ సిద్ధాంతము నమ్మినా అన్ని సిద్ధాంతములవారు కోరుకొనే గమ్యస్థానము భగవానుడు, నానా సిద్ధాంతగమ్యుడు.

*"తత్త్వం న తే వయమనంజన రుద్రశాపాత్...." నుంచి "సర్వ భూతాత్మనాం బ్రహ్మన్ స శాన్తిమధిగచ్ఛతి" వరకు [భాగ 4-7 - (27-54)].*

## 273. సప్తతన్తుః (చ) :

1. అగ్నిష్టోమాది ఏడువిధములైన అగ్నిహోత్రకార్యముల ఆచరణను విస్తరింపజేసే భగవానుడు.

2. ఏడు లోకములలోను అగ్నిహోత్రకార్యములను విస్తరింపజేసే భగవానుడు, "సప్తతన్తుః" అని చెప్పబడతాడు.

## 274. షడ్గుణః :

భగశబ్దముచే చెప్పబడిన ఐశ్వర్యాదిషడ్గుణములు (లక్షణములు) గల భగవానుడు షడ్గుణుడు. "ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షడైతే భగ ఉచ్యతే". ఈ షడ్గుణములు- 1) సమగ్ర ఐశ్వర్యము, 2) వీర్యము, 3) యశస్సు 4) శ్రియము (సంపద, లక్ష్మి), 5. జ్ఞానము, 6) వైరాగ్యము. ఇవి గల భగవానుడు, షడ్గుణుడు.

**ప్రతిసర్గజగత్కర్తా నానాలీలావిశారదః ।**
**ధ్రువప్రియో ధ్రువస్వామీ చింతితాధికదాయకః ॥ 61**

## 275. ప్రతిసర్గజగత్కర్తా :

1. 'ప్రతిసర్గ' అనగా బ్రహ్మ సృష్టిని పోలిన మరీచ్యాదుల సృష్టి. ఇట్టి సృష్టిచేసి జగత్తును విస్తరింపజేసిన భగవానుడు.

2. ప్రళయాంతమున (లేక ప్రతిఒక్క సర్గాంతమునందు) తిరిగి జగత్తును సృష్టించిన భగవానుడు ప్రతిసర్గజగత్కర్తా.

*"సంగ్రహేణ మయాఽఽఖ్యాతః ప్రతిసర్గస్తవానఘ...."* *(భాగ 4-8-5)*

**276. నానాలీలావిశారదః :**

నానాలీలలు అనగా సృష్టి స్థితి లయములకు సంబంధించిన బహువిధ లీలలు. వానియందు నిపుణుడైన భగవానుడు నానాలీలావిశారదుడు.

**277. ధ్రువప్రియః :**

1. "ధ్రువస్యప్రియః ధ్రువప్రియః" ధ్రువునకు ప్రియుడైన భగవానుడు.

2. ధ్రువః ప్రియో యస్య ధ్రువప్రియః" ఎవరికి ధ్రువుడు ప్రియుడో ఆ భగవానుడు ధ్రువప్రియుడు. ఉత్తానపాదుని కుమారుడైన ధ్రువునిపై కృపతో ఇష్టసిద్ధి (ప్రియము) కలిగించిన భగవానుడు, ధ్రువప్రియుడు.

**278. ధ్రువస్వామీ :**

ధ్రువునకు ప్రభువు ధ్రువస్వామి. అందువలననే ధ్రువుని తన స్థానము నందు ఉంచుకున్న భగవానుడు.

**279. చింతితాధికదాయకః :**

సవతితల్లి ఆడిన సూటిపోటి మాటలకు దుఃఖించి భగవత్కృపకలిగినట్లైతే ఆ దుఃఖముపోయి తండ్రి వలన సుఖము రాజ్యము కలుగుతాయని చెప్పిన తల్లి మాటలయందు గౌరవముంచి, ధ్రువుడు తపస్సు చేసాడు. కేవలం భగవత్ప్రాప్తి కొరకై కాదు. అతని తపస్సునకు సంతోషించి ధ్రువుడు ఊహించ లేనట్టి సప్తఋషులతో సమానమైన స్థానమును అతనికి ఇచ్చిన భగవానుడు చింతితాధికదాయకుడు.

*"అహోఽస్య తపసో వీర్యమహోఽస్య తపసః ఫలం। యదేనం పురతః కృత్వా ధ్రువం సప్తర్షయః స్థితా."* *(ఉశనసాగీతం - విష్ణు పురాణము)*



**దుర్లభానంతఫలదో దయానిధిరమిత్రహా ।**
**అంగస్వామీ కృపాసారో వైన్యో భూమినియామకః ॥ 62**

**280. దుర్లభానన్తఫలదః :**

దేవతలకు కూడా పొందశక్యము కాని (దుర్లభ) నాశనము లేని (అనన్త) శాశ్వతపదవిని (ఫలమును) ధ్రువునకు భగవానుడు ప్రసాదించాడు. అందుచేత భగవానుడు దుర్లభానంతఫలదాయకుడు.

*"వేదాహం తే వ్యవసితం హృది రాజన్యబాలక...." నుంచి "... ఉపరిష్టాదృషిభ్యస్త్వం యతో నావర్తతే గతః" వరకు* *[భాగ 4-9 - (19-25)].*

**281. దయానిధిః :**

ఐదు సంవత్సరముల వయస్సుగల బాలుడు ఎన్నో కష్టాలుపడి తపస్సు చేస్తున్నాడన్న జాలిచేత దయకలిగిన భగవానుడు, దయానిధి.

**282. అమిత్రహా :**

రుద్రానుచరులు తన అన్నదమ్ములను చంపగా ఆ శత్రువులను చంపిన ధ్రువుడు. ఈ శక్తిని ధ్రువునకు ప్రసాదించిన భగవానుడు "అమిత్రహా".

*"ధ్రువో భ్రాతృ వధం శ్రుత్వా కోపామర్షశుచార్పితః....." నుంచి "...లోకోఽఞ్జసా తరతి దుస్తరమంగమృత్యుమ్"* *[భాగ 4-10 - (4-30)].*

**283. అంగస్వామీ :**

"అంగస్యరాజ్ఞః స్వామీ అంగస్వామీ" భక్తుడైన అంగరాజునకు ప్రభువైన భగవానుడు, అంగస్వామి.

*"సుదుర్జయం విష్ణు పదం జితం త్వయా....." నుంచి "... స్వర్గ్యం ధ్రౌవ్యం సౌమనస్యం ప్రశస్యమఘమర్షణం" వరకు* *[భాగ 4-12 - (25-45)].*

**284. కృపాసారః :**

భగవంతుడు భక్తులకు ప్రసాదించే వాటన్నిటిలో కృప ఉత్కృష్టమైనది.

అట్టి కృపకు సారభూతుడు భగవానుడు. కుపుత్రుడైన వేనుని ప్రసాదించి, అంగరాజుకు వైరాగ్యము కలిగించి అతనిలో భగవద్భక్తి వృద్ధి చేసిన భగవానుడు కృపాసారుడు.

*"కదపత్యం వరం మన్యే సదపత్యాచ్ఛుచాం పదాత్" నుంచి "... న్యవేదయన్ పౌరవ భర్తృ విప్లవం." వరకు [భాగ 4-13 - (46-49)].*

**285. వైన్యః :**

వేనుని కొడుకు పృథుమహారాజు, వైన్యుడు. సాక్షాత్ భగవదంశ సంభూతుడు.

*"అయంతు ప్రథమో రాజ్ఞాం పుమాన్ ప్రథయితా యశః" (భాగ 4-15-4).*

**286. భూమినియామకః :**

భగవదంశతో పుట్టిన పృథుమహారాజు తన తండ్రి వేనుని కాలములో రాజ్యములో జరిగిన దుష్పరిపాలనను మరిపింపజేసే విధముగా ఆధిపత్యము స్థాపించి రాజ్యమేలేడు. ఈ విధముగా తన అంశతో పృథుమహారాజుచే పరిపాలింపజేసిన భగవానుడు, భూమినియామకుడు.

*"వసుధే త్వాం వధిష్యామి మచ్ఛాసన పరాఙ్ముఖీం" (భాగ 4-17-22).*

**భూమిదోగ్ధా ప్రజాప్రాణపాలనైకపరాయణః ।**
**యశోదాతా జ్ఞానదాతా సర్వధర్మప్రదర్శకః ॥ 63**

**287. భూమిదోగ్ధా :**

భూమి అనే గోవునుంచి ప్రజలనే దూడలకు వారి వారి అవసరములను బట్టి ఆయా పదార్థములు (పాలు) ఇచ్చి రాజ్యము పాలించిన పృథుమహారాజు రూపములో నున్న భగవానుడు "భూమిదోగ్ధా".

*"వత్సం కల్పయ మే వీర యేనాహం వత్సలా తవ...." నుంచి ".... సర్వకామదుధాం పృథ్వీం దుదుహుః పృథుభావితాం" వరకు [భాగ 4-18 - (9-26)].*



**288. ప్రజాప్రాణపాలనైకపరాయణః :**

భగవదంశ సంభూతుడైన పృథుమహారాజు ప్రజల ప్రాణములను తన ప్రాణములతో సమానముగా రక్షించుటే తన ఏకైక కర్తవ్యమని తలచి ఆపనిలో తత్పరుడై ఉండేవాడు. ఇట్టి ప్రజాప్రాణపాలనైకపరాయణుడు, పృథుమహారాజు, భగవదంశసంభూతుడు.

**289. యశోదాతా :**

యశస్సు (కీర్తి) నిచ్చే భగవానుడు యశోదాత. పృథుమహారాజు ఇతరులకొరకు మహాద్భుత ప్రజోపయోగకార్యములను చేసాడు. తన ధనుస్సు చివరతో కొండలు పగలగొట్టి భూమిని సమతలము చేసాడు. ప్రజలు సర్వసుఖములు పొందునట్లు పాలించి గొప్ప కీర్తిని పొందాడు. ఇట్టి కీర్తిని పృథుమహారాజున కిచ్చిన భగవానుడు యశోదాత.

*"చూర్ణయన్ స్వధనుష్కోట్యా గిరికూటాని రాజరాట్....." (భాగ 4-18-29).*

**290. జ్ఞానదాతా :**

పృథుమహారాజు సనత్కుమారాదులద్వారా ఆత్మజ్ఞానబోధ పొందాడు. ఇట్లు పృథుమహారాజునకు జ్ఞానము నిప్పించిన భగవానుడు. "జ్ఞానదాతా".

*"స ఏవం బ్రహ్మపుత్రేణ కుమారేణాత్మమేధసా..." (భాగ 4-22-41).*

**291. సర్వధర్మప్రదర్శకః :**

పృథు మహారాజు ప్రవృత్తి, నివృత్తి లక్షణములు గల ధర్మములను చక్కగా ఆచరించాడు. విష్ణ్వంశసంభూతుడైన పృథుమహారాజులో సర్వధర్మములు ప్రదర్శింపజేసిన భగవానుడు, సర్వధర్మప్రదర్శకుడు.

**పురఞ్జనో జగన్మిత్రం విసర్గాంతప్రదర్శకః ।**
**ప్రచేతసాంపతిశ్చిత్రభక్తిహేతుర్జనార్దనః ॥ 64**

**292. పురంజనః :**

"పురం శరీరం జనయతీతి పురంజనః." "పురం" అంటే శరీరము (దేహము). ఈ శరీరమును కలుగజేసే భగవానుడు, పురంజనుడు.

*"పశ్చాద్భ్రామి మథోపురః" (శ్రుతి). "పురుషం పురంజనం విద్యాద్యద్ వ్యనక్త్యాత్మనః పురం" నుంచి "............. ఇతి వేద స వై విద్వాన్ యో విద్వాన్ స గురుర్హరిః" వరకు [భాగ 4-29; (2-51)].*

**293. జగన్మిత్రం :**

భగవంతుడు జగత్తు అంతటికి మిత్రుడు, స్నేహితుడు. జగత్తులో ప్రతిజీవికి పరమాత్మయే బంధువు.

*"ఆత్మైవ హ్యాత్మనో బంధుః...." (గీత 6-5).*

**294. విసర్గాన్తప్రదర్శకః :**

"విసర్గః" అంటే పునఃసృష్టి. మరల మరల పుట్టుట, పుట్టవలెనని, కర్మలు చేయవలెనని కోరిక. ఇట్టి భావములు లేకుండా చేసేవాడు లేక అంతం చేసేవాడు విసర్గాన్తప్రదర్శకుడు భగవానుడు. నారదుడు ప్రాచీనబర్హికి ఆత్మజ్ఞానము ఉపదేశించగా అతనికి కర్మనిష్ఠ (యజ్ఞాదులు చేసే ఇచ్ఛ, పునః సృష్టి చేసే ఇచ్ఛ) లేకుండా పోయి వైరాగ్యము కలిగినది. ఈ విధమైన వైరాగ్యము, భగవద్భక్తి, ప్రాచీనబర్హికి కలిగించిన భగవానుడు విసర్గాన్తప్రదర్శకుడు.

*"భాగవతముఖ్యో భగవాన్నారదో హంసయోర్గతిమ్...." నుంచి ".... ఏవం స్త్రియాఽఽశ్రమః పుంసశ్ఛిన్నోఽముత్ర చ సంశయః" వరకు [భాగ 4-29-80-85)].*

**295. ప్రచేతసాంపతిః :**

"ప్రకృష్టాని చేతాంసి జ్ఞానాని అంతఃకరణాని వా యేషాం శ్రీరుద్ర ప్రసాదాత్ ప్రాప్తభక్తిత్వాత్ తే ప్రచేతసస్తేషాంపతిః". ఎవరికి శుద్ధ జ్ఞానయుత



అంతఃకరణములు కలవో వారు ప్రచేతసులు. వారి పతి లేక ప్రభువు ప్రచేతసాంపతిః" రుద్రుని ప్రసాదము వలన కలిగిన భక్తి కారణముగా ప్రచేతసుల అంతఃకరణలు శుద్ధమైనవి. వారి ప్రభువు ప్రచేతసాంపతి.

*"ప్రచేతసోఽన్తరుదధౌ పితురాదేశకారిణః..." నుంచి "...... పర్జన్యనాదరుతయా సఘృణావలోకః" వరకు [భాగ 4-30 - (3-7)].*

**296. చిత్రభక్తిహేతుః :**

చిత్రభక్తి అంటే విచిత్రమైన భక్తి. ప్రచేతసులు రుద్రునిచే బోధింపబడిన భగవద్భక్తి వలన సముద్రములో నిలుచుని రుద్రగీతము పదివేల సంవత్సరములు నిష్ఠతో జపించి తపస్సు చేసిరి. భగవంతుడు ప్రసన్నుడై దర్శనమిచ్చాడు. ప్రచేతసులు చేసిన ఈ విధమైన భక్తి చిత్రభక్తి. ఇట్టి భక్తి ప్రచేతసులకు కలిగించిన భగవానుడు చిత్రభక్తిహేతువు.

*"తులయామ లవేనాపి న స్వర్గం నాపునర్భవం....." (భాగ 4-30-34).*

**297. జనార్దనః :**

1. "జనా మాయా తామర్దయతి నాశయతి ఇతి జనార్దనః" మాయను నాశనము చేసేవాడు జనార్దనుడు, భగవానుడు.

2. "జనైః అర్ద్యతే" జనులచేత కోరబడేవాడు లేక ప్రార్థింపబడేవాడు జనార్దనుడు, భగవానుడు.

3. జీవులను ప్రళయకాలమున చంపువాడు జనార్దనుడు, భగవానుడు.

**స్మృతిహేతుబ్రహ్మభావసాయుజ్యాదిప్రదః శుభః ।**
**విజయా ...................................... ॥ 65**

**298. స్మృతిహేతుబ్రహ్మభావసాయుజ్యాదిప్రదః :**

స్మృతి అంటే స్మరణము. బ్రహ్మభావమంటే బ్రహ్మత్వము పొందుట.

స్మరణమువలన కలిగే బ్రహ్మభావమువలన సాయుజ్యాదిముక్తులను భగవానుడు. ప్రసాదిస్తాడు. ఈ సాయుజ్యముక్తికి బ్రహ్మభావము కంటే వేరేమీ మార్గములేదు.

ప్రాచీనబర్హికి ఆతని భార్య శతద్రుతికి పదిమంది ధర్మాత్ములైన పుత్రులు కలిగారు. వారిని ప్రచేతసులంటారు. వారు నారదుని దగ్గర ఆత్మబోధ పొంది, భగవత్స్మరణ చేసి బ్రహ్మభావము, తర్వాత సాయుజ్యముక్తి పొందారు. ఇట్టి సాయుజ్యముక్తి పొందుటకు కారణము స్మృతిహేతుబ్రహ్మభావసాయుజ్యాది ప్రదుడైన భగవానుడు.

*"ప్రాచీన బర్హిషః పుత్రాః శతద్రుత్యాం దశాభవన్...."* *(భాగ 4-24-13),*

*"తే ఽపి తన్ముఖనిర్యాతం యశో లోకమలాపహం...." (భాగ 4-31-24).*

## 299. శుభః :

దేనియందు (ఎవరియందు) శుభము ఉన్నదో అది (అతడు) శుభుడు భగవానుడు. పై చెప్పిన స్మృతి వల్ల పొందే సాయుజ్యముక్తి శుభప్రదమైనది. దానిని ప్రసాదించే భగవానుడు శుభుడు. *(వి.స.నా. పూర్వపీఠిక శ్లో 2).*

## 300. విజయీ :

వి విశేషముగా జయీ జయించడమే తన శీలముగా గలవాడు విజయీ, భగవానుడు. *(వి.స.నా. నామము 147, శ్లో॥ 29).*

ఇంతవరకు చతుర్థస్కంధ నామములు.



# శ్రీమద్భాగవత పంచమస్కంధ నామములు

స్థితిలీలా నామములు *(301-406)*

శ్లోక సంఖ్య *(65-85)*

**....................................... ।**

**.......... స్థితిలీలాబ్ధిరచ్యుతో విజయప్రదః ॥ 65**

## 301. స్థితిలీలాబ్ధిః :

1. స్థితి అనగా స్థానము. ఈ స్థితిరూపలీలల సముద్రము. "స్థితిలీలాబ్ధిః." ఈలీలారూపములో నున్న భగవానుడు "స్థితిలీలాబ్ధిః" అని చెప్పబడతాడు.

2. స్థితిలీలలు అంటే వైకుంఠ మందలి లీలలు అని ద్వితీయ స్కంధములో చెప్పబడ్డది.

*"స్థితిర్వైకుంఠవిజయః, పోషణం తదనుగ్రహః"* *(భాగ 2-10-4).*

## 302. అచ్యుతః :

కాలగమనము చేత ప్రకృతిలో మార్పులు (వికారములు) కలుగుతాయి. ఇట్టి మార్పులు భగవానుని స్వరూపలక్షణములలో ఎప్పుడు ఉండవు. అట్టి మార్పులులేని భగవానుడు అచ్యుతుడు.

*"శాశ్వతం శివమచ్యుతం" (శ్రుతి).*

*"యస్మాన్నచ్యుత పూర్వోఽహమచ్యుతస్తేన కర్మణా"* *(మహాభారతము).*

## 303. విజయప్రదః :

1. సంసారము నుండి తరించు ప్రయత్నములో విశిష్టమైన విజయమును చక్కగానిచ్చు భగవానుడు, విజయప్రదుడు.

2. ప్రియవ్రతునకు తన ఇంద్రియములపై విశేషమైన జయమును ప్రసాదించి ఆత్మజ్ఞానమునిచ్చిన భగవానుడు, విజయప్రదుడు.

**స్వసామర్థ్యప్రదో భక్తకీర్తిహేతురథోక్షజః ।**
**ప్రియవ్రతప్రియస్వామీ స్వేచ్ఛావాదవిశారదః ॥ 66**

**304. స్వసామర్థ్యప్రదః :**

ప్రియవ్రతునకు ఆత్మజ్ఞానముతో పాటు భగవద్భక్తి పొందుటకు సామర్థ్యమునిచ్చిన భగవానుడు "స్వసామర్థ్యప్రదుడు".

*"ప్రియవ్రతో భాగవత ఆత్మారామః కథం మునే...." నుంచి "... ఛాయానిర్వృత చిత్తానాం న కుటుంబే స్పృహామతిః" వరకు [భాగ. 5-1 - (1-3)].*

**305. భక్తకీర్తిహేతుః :**

సంసారమునందు అరిషడ్వర్గమును జయించు శక్తినిచ్చుటే కాక పరమభక్తి ప్రసాదించి, భక్తునకు కీర్తి వచ్చుటకు కారణభూతుడైన భగవానుడు భక్తకీర్తిహేతువు. మనుపుత్రుడైన ప్రియవ్రతునకు అట్టి కీర్తి కలిగించిన భగవానుడు "భక్తకీర్తిహేతువు"

**306. అధోక్షజః :**

1. "అధోక్షాణాం జితేంద్రియాణాం జాయతే ప్రత్యక్షీభవతీతి ।" జితేంద్రియుల హృదయములందు ప్రత్యక్షమయే భగవానుడు, అధోక్షజుడు.

2. "అక్షజం జ్ఞానం తదధోయస్మాదితివా ।"

ఇంద్రియ సముదాయము అంతర్ముఖమైనందు వలన తెలియబడే భగవానుడు అధోక్షజుడు. *(వి.స.నా. నామము 415 శ్లో 57).*

3. ఎప్పుడూ క్షీణించుట (శక్తిహీనమగుట) అనేలక్షణము లేనివాడు అధోక్షజుడు, భగవానుడు.

*"అధో న క్షీయతే జాతు యస్మాత్తస్మాదజోక్షజః"(మహాభారతము ఉద్యోగపర్వము).*

4. "ద్యౌరన్తరిక్షం పృథివీ చాధస్తయోర్యస్మాదజాయత మధ్యే వైరాజ రూపేణేతివా అధోక్షజః". అంతరిక్షము, ద్యౌర్లోకము పైభాగములోను, భూమి క్రిందిభాగములోను, విరాట్ రూపముతో ప్రకాశించే భగవానుడు అధోక్షజుడు.



**307. ప్రియవ్రతప్రియస్వామీ :**

భక్తుడైన ప్రియవ్రతునికి ప్రియమైన ప్రభువు అయిన భగవానుడు "ప్రియవ్రతప్రియస్వామీ".

*"యర్హి వావ హ రాజన్ స రాజపుత్రః ప్రియవ్రతః...... ఆత్మనోఽ న్యస్మాదసతోఽ పి పరాభవమన్వీక్షమాణః" (భాగ 5-1-6).*

**308. స్వేచ్ఛావాదవిశారదః :**

1. "స్వ ఇచ్ఛావాద విశారదః" భగవదిచ్ఛానుసారమే భగవల్లీలా రూపముగా సర్వము జరుగుతాయి కాని వేరే విధముగా కాదు అని తెలుసు కున్నవాడు స్వేచ్ఛావాదవిశారదుడు. లేక తన ఇచ్ఛానుసారము లీలా రూపములో సర్వము జరిపించే భగవానుడు స్వేచ్ఛావాదవిశారదుడు.

2. "స్వస్యభగవత ఇచ్ఛయా వదతి ఇచ్ఛావాదో వేదస్తత్ర విశారదః కర్మ కలాపకుశలః ఇత్యర్థః." భగవానుని ఇచ్ఛతో చెప్పబడ్డవి (స్వేచ్ఛా భావములు) స్వేచ్ఛావాదములు, వేదములు. వానియందు వివరింపబడినదంతయు చక్కగా తెలిసినవాడు, నిపుణుడు, స్వేచ్ఛావాదవిశారదుడు, భగవానుడు.

*".... సమావేశిత సకల కారకక్రియాకలాపో...."" (భాగ 5-1-6).*

**సంగ్యగమ్యః స్వప్రకాశః సర్వసంగవివర్జితః ।**
**ఇచ్ఛాయాం చ సమర్యాదస్త్యాగమాత్రోపలంభనః ॥ 67**

**309. సంగ్యగమ్యః :**

"సంగిభిః స్వస్వాధికారనియుక్తైః బ్రహ్మాదిభిరగమ్యః సమ్యక్ జ్ఞాతుమశక్య ఇత్యర్థః." "సంగిభిః అగమ్యః సంగ్యగమ్యః" భగవానుని యందు (సంగమునందు) ఆసక్తికల, దగ్గరగా ఉన్న బ్రహ్మాదులకు కూడా తెలియబడని వాడు భగవానుడు. భగవానునిచే స్వయముగా నియమింపబడి, అందరికన్నా దగ్గరగానున్న బ్రహ్మరుద్రాదులు కూడా భగవల్లీలలలోని రహస్యములు తెలుసుకోలేరు గనుక సంగ్యగమ్యుడు.

*"యద్వావ తంత్యాం గుణకర్మదామభిః ........." (భాగ 5-1-14).*

**310. స్వప్రకాశః :**

ఇతరులపై ఆధారపడకుండా తనంతటతానే ప్రకాశించే భగవానుడు స్వప్రకాశుడు.

**311. సర్వసంగవివర్జితః :**

ఏ విధమైన సంసార విషయమునందు ఆసక్తిలేకుండా వాటిని అంటకుండా ఉన్నవాడు సర్వసంగవివర్జితుడు. ప్రియవ్రతుని పదిమంది కొడుకులలో కవి, మహావీర, సవన అనేముగ్గురు, సంసారసంగము విడిచిపెట్టి ఆత్మవిద్యను అభ్యసించారు. ఈ విధముగా వారిని సంసారబంధములనుండి విముక్తులను చేసిన భగవానుడు.

"…. ఆసన్నూర్ధ్వరేతసస్త ఆత్మవిద్యాయామర్భభావ…." నుంచి

"….. భూతానామాత్మభూతే ప్రత్యగాత్మన్యేవాత్మనస్తాదాత్మ్యమవిశేషణ సమీయుః " వరకు (భాగ 5-1-26, 27).

**312. ఇచ్ఛాయాం(చ) సమర్యాదః :**

ప్రియవ్రతుని పదిమంది కొడుకులు రాజపుత్రులైనప్పటికి, వారిలో కవి, మహావీర, సవనులు భగవదిచ్ఛచేత రాజ్యసౌఖ్యములన్నీ విడిచిపెట్టి బాల్యమందే ఊర్ధ్వరేతస్కులై సర్వసంగపరిత్యాగముచేసి, మర్యాదా పూర్వకముగా సంన్యాసము స్వీకరించారు. ఇట్టి ఉత్తమాధికారులు సంన్యాసాశ్రమము స్వీకరించకపోయినా బ్రహ్మజ్ఞానము పొందగలరు కాని శాస్త్ర మర్యాదను గౌరవించి, సంన్యాసాశ్రమము తీసుకున్నారు.

**313. త్యాగమాత్రోపలంభనః :**

భగవత్కృప కలిగినందు వలననే కవి, మహావీర, సవనులు, ముగ్గురికి భగవద్భక్తి కలిగింది. వారు భగవదిచ్ఛానుసారము సర్వసంగపరిత్యాగము చేసారు.

*"శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్…. త్యాగాచ్ఛాన్తిరనంతరం" (గీత 12-12).*

**అచింత్యకార్యకర్తా చ తర్కాగోచరకార్యకృత్ ।**
**శృంగారరసమర్యాదా ఆగ్నీధ్రరసభాజనమ్ ॥ 68**



**314. అచిన్త్యకార్యకర్తా (చ) :**

మనోవ్యాపార విషయాసక్తిలేని భక్తుని కార్యములనన్నిటిని భక్తునికొరకు చేసే భగవానుడు "అచిన్త్యకార్యకర్త".

*"యావదవభాసయతి…." నుంచి "…. యథా సంఖ్యేనైకైకస్మిన్నేకమేవాధిపతిం విదధే" వరకు [భాగ 5-1 - (30-33)].*

**315. తర్కాగోచరకార్యకృత్ :**

తర్కశాస్త్రజ్ఞాన సహాయముతో కొన్ని కార్యములు సాధ్యపడతాయి. కాని అన్ని కార్యములు చేయడానికి వీలుపడవు. అట్టి వీలుకాని పనులు తర్కాగోచర కార్యములు. ఇవి అలౌకికములు. భగవదుపాసనా బలముచేతనే సాధ్య పడతాయి. ప్రియవ్రతుడు సూర్యుని వెనుక తన దివ్యరథముతో భూమి చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేసి తర్కాగోచరముగా భూమిని సప్తద్వీపములు, సప్త సముద్రములుగా మార్చాడు. *[భాగ. 5-1 - (30-33)].*

**316. శృంగారరసమర్యాదా :**

"శృంగారాఖ్యస్య రసస్య మర్యాదా అవధిః, ఇతోఽధికోఽన్యోనాస్తి." మర్యాదా అనగా అవధి లేక హద్దు. లౌకిక లేదా స్వర్గ సంబంధమైన శృంగార రస ఆనందమునకు హద్దులు ఉంటాయిగాని భగవద్భక్తి ఇచ్చే ఆనందమునకు అట్టి అవధులు లేవు. భగవద్భక్తికన్నా ఏ శృంగారరసమర్యాదా ఎక్కువ ఆనందమివ్వదు.

*"రసోవైసః" (శ్రుతి).*

*తైత్తిరీయోపనిషత్ వివిధములైన లౌకిక ఆనందముల గురించి బ్రహ్మానందము గురించి ప్రమాణపూర్వకముగా వర్ణిస్తుంది.*

*"సైషానందస్య మీమాగ్ంసా భవతి …. స ఏకో బ్రహ్మణ ఆనందః"*

*(తై॥ఉ॥ ఆనందవల్లీ).*

**317. ఆగ్నీధ్రరసభాజనమ్ :**

ఆగ్నీధ్రుడు పూర్వచిత్తి (అప్సరస)తో కలిసి ఎంతో హాయిగా రమించి

ఆనందానుభవము పొందాడు. కాని అతనికి విషయభోగములతో తృప్తి కలుగలేదు. ఆమె వలన తొమ్మండుగురు పుత్రులను పొందిన తరువాత ఆమె అప్సరోలోకమునకు పోయినది. చివరి దశవరకు ఆగ్నీధ్రుడు అనుదినము ఆమెనే కోరుకుంటూ స్వర్గసుఖానుభవము కొరకు కర్మలు చేసి మరణానంతరము ఆమెను చేరి పితృదేవానందము పొందగలిగేడు. కాని అతనికి బ్రహ్మానందము కలుగలేదు. భక్తులు ఏకోరికలతో కర్మలు చేస్తారో భగవంతుడు వానికి అనుగుణమైన ఫలమునిస్తాడు. ఇదే ఆగ్నీధ్రరసభాజనం యొక్క భావము.

*"ఆగ్నీధ్రో రాజాతృప్తః కామానామప్సరసమేవానుదినమధిమన్యమానస్తస్యాః సలోకతాం...." (భాగ 5-2-22).*

**నాభీష్టపూరకః కర్మమర్యాదాదర్శనోత్సుకః ।**
**సర్వరూపోఽద్భుతతమో మర్యాదాపురుషోత్తమః ॥ 69**

## 318. నాభీష్టపూరకః :

ఆగ్నీధ్రుని కుమారుడైన నాభి యజ్ఞముచేసి "భగవానుని వంటి పుత్రుడు కలగాలి" అని భగవానుని కోరుకున్నాడు భగవానుడు యీ కోరికమన్నించి దిగంబరసంన్యాసి, ఊర్ధ్వరేతోమునిరూపమున ధర్మము స్థాపించుటకై, తన అంశతో ఋషభదేవునిగా పుట్టి నాభి కోరిక తీర్చాడు.

*"బర్హిషి తస్మిన్నేవ విష్ణుదత్త...." (భాగ 5-3-20).*

## 319. కర్మమర్యాదాదర్శనోత్సుకః :

మునిధర్మము స్థాపించుటకై అవతరించినను, లోకములో కర్మలు చేయవలసిన రీతిని (మర్యాదను) ప్రదర్శించుటకు ఉత్సాహవంతుడైన (ఉత్కర్షకల) భగవాన్ ఋషభదేవుడు గురుకులవాసము, గృహస్థాశ్రమస్వీకారము, రాజ్యపాలనము మొదలైన లౌకిక ధర్మములు, కర్మలు ఆచరించాడు.

*"అథ హ భగవానృషభదేవః స్వవర్షం కర్మక్షేత్రమనుమన్యమానః ప్రదర్శిత గురుకులవాసో..." నుంచి ".... భరతో జ్యేష్ఠః శ్రేష్ఠగుణ ఆసీద్యేనేదం వర్షం భారతమితి వ్యపదిశన్తి" వరకు (భాగ 5-4-8, 9).*



## 320. సర్వరూపః :

1. "సర్వాణి రూపాణి యస్య సః సర్వరూపః" అన్ని రూపములు ఎవరివో ఆ భగవానుడు, సర్వరూపుడు.

2. "సర్వం కులాచారం రూపయతి కృత్వా "నిరూపయతి, ప్రదర్శయతి...." వివిధములైన కులాచారములు, వర్ణాచారములు, ఏవేవి కలవో వాని రూప కల్పన చేసి, ఆచరింప చేసే విధానములు ప్రదర్శించిన భగవాన్ ఋషభ దేవుడు, సర్వరూపి.

*"సర్వాణి రూపాణి విచింత్య ధీరో నామానికృత్వాఽభివదన్ యదాస్తే (శ్రుతి)*
*"....ప్రదర్శిత గురుకులవాసో...." నుంచి "ప్రశ్రయ ప్రణయభరసుయన్త్రితానప్యుపశిక్షయన్నితిహోవాచ" వరకు [భాగ 5-4; (8-19)].*

## 321. అద్భుతతమః :

అతిశయమైన అనన్యసాధ్యమైన అద్భుతకార్యములు చేసిన భగవాన్ ఋషభదేవుడు. ఈయన చేసిన కార్యములన్నీ అద్భుతములే. [*భాగ 5-4 - (8-19)*].

## 322. మర్యాదాపురుషోత్తమః :

ఇక్కడ "మర్యాదా" అనగా వేదమార్గము. దాని రక్షకుడు పురుషోత్తముడు వేదమార్గరక్షణయే మర్యాదగా గల భగవాన్ ఋషభదేవుడు మర్యాదా పురుషోత్తముడు.

**సర్వరూపేషు సత్యాత్మా కాలసాక్షీ శశిప్రభః ।**
**మేరుదేవీవ్రతఫలమృషభో భగలక్షణః ॥ 70**

## 323. సర్వరూపేషు సత్యాత్మా :

1. ఆబ్రహ్మస్తంబపర్యంతము అన్ని రూపములు గల వస్తువుల యందు ఆత్మస్వరూపుడై యున్న భగవానుడు.

2. బ్రాహ్మణ క్షత్రియాదులందరి రూపములో నున్న మిథ్యారహితుడైన సత్యస్వరూపుడైన భగవానుడు "సర్వరూపేషు సత్యాత్మా" భగవాన్ ఋషభదేవుడు.

**324. కాలసాక్షీ :**

"కాలస్యసాక్షీ నియన్తేత్యర్థః" కాలమును నియమించేవాడు, నడిపించేవాడు కాలసాక్షి. ఋషభదేవుని చరిత్ర అతడు కాలసాక్షి భగవానుడనుటకు నిదర్శనము.

*"భగవాన్‌ఋషభసంజ్ఞ ఆత్మతన్త్రః..." నుంచి "…. సామాదిభిరుపాయైర్జన-తామనుశశాస" వరకు (భాగ. 5-4-14, 15, 16).*

**325. శశిప్రభః :**

ఋషభదేవుని దర్శనము చంద్రుని వెన్నెలవలె ఆహ్లాదమును కలిగించే దగుటచే "శశిప్రభః" అని భగవాన్ ఋషభదేవుని నామము.

**326. మేరుదేవీవ్రత ఫలం :**

నాభి భార్య మేరుదేవి చేసిన పుంసవనాది వ్రతముల ఫలరూపముగా భగవంతుని అంశావతారమై జన్మించిన ఋషభదేవుడు మేరుదేవీవ్రతఫలము.

*"……….మేరుదేవ్యాం ధర్మాన్దర్శయితుకామో…." (భాగ 5-3-20)*

**327. ఋషభః :**

"సర్వస్మాత్ శ్రేష్ఠః ఋషభః" అందరికంటె శ్రేష్ఠుడని తెలిపే నామము "ఋషభః". భగవానుని అంశావతారుడైనందున ఋషభదేవుని యందు అన్ని సద్గుణములు ప్రకాశిస్తూ ఉండేవి. అధర్మమునెంతో దూరముగా వెనుకకు నెట్టి ధర్మముతో నిండిన శుద్ధసత్వగుణము కలవాడు.

*"తస్య హ వా ఇత్థం వర్ష్మణా వరీయసా…." (భాగ 5-4-2).*

*"ఇదం శరీరం మమ దుర్విభావ్యం సత్త్వం హి మే హృదయం యత్ర ధర్మః …….అతో హి మామృషభం ప్రాహురార్యాః" (భాగ 5-5-19).*

**328. భగలక్షణః :**

ఋషభదేవుడు భగవంతుని అంశావతారుడగుటవలన ఆయనలో భగవానుని ఆరుభగలక్షణములు ఉండేవి. (274వ నామము షడ్గుణః, 60వ శ్లోకము చూడుడు).



*"అథ హ తముత్పత్త్యైవాభివ్యజ్యమాన……." నుంచి "…. తస్య హ వా ఇత్థం వర్ష్మణా వరీయసా బృహచ్ఛ్లోకేన చౌజసా, బలేన, శ్రియా, యశసా, వీర్య, శౌర్యాభ్యాం చ పితా ఋషభ ఇతీదం నామ చకార (భాగ 5-4-1,2).*

**జగత్సంతర్పకో మేఘరూపీ దేవేంద్రదర్పహా ।**
**జయన్తీపతిరత్యంతప్రమాణాశేషలౌకికః ॥ 71**

**329. జగత్సంతర్పకః :**

"జగతః ప్రజయాః సమ్యక్ తర్పకః పోషకః జగత్సంతర్పకః" లోకములో గల ప్రజలనందరినీ చక్కగా పోషించే ఋషభదేవుడు, జగత్సంతర్పకుడు.

**330. మేఘరూపీ :**

ఇంద్రుడు ఈర్ష్యచే వర్షములు కురిపించకపోగా తన యోగమాయా ప్రభావముచేత అజనాభఖండములో మేఘరూపమున చక్కటి వర్షము కురిపించి, దేవేంద్రుని గర్వమును పోగొట్టిన భగవాన్ ఋషభదేవుడు.

*".. ప్రహస్యాత్మయోగమాయయా స్వవర్షమజనాభం నామాభ్యవర్షత్"*
*(భాగ 5-4-3).*

**331. దేవేంద్రదర్పహా :**

ఒకప్పుడు దేవేంద్రుడు ఋషభదేవునిపై ఈర్ష్యచేత ఆయన రాజ్యమైన అజనాభఖండములో వర్షములు కురిపించలేదు. అప్పుడు భగవాన్ ఋషభ దేవుడు తన యోగమాయా ప్రభావముచేత తాను పరిపాలించేరాజ్యమంతట చక్కగా వర్షము కురిపించి దేవేంద్రుని గర్వమును పోగొట్టాడు.

*(భాగ 5-4-3).*

**332. జయన్తీపతిః :**

ఇంద్రునికి గర్వభంగము అయిన తర్వాత ఇంద్రునిచే యివ్వబడిన జయన్తి అను కన్యను ఋషభదేవుడు పెండ్లి చేసుకున్నాడు. అందుచేత ఆయన జయన్తీపతి అయినాడు.

**333. అత్యంతప్రమాణాశేషలౌకికః :**

"అంతం అతిక్రాంతో అత్యంతః ప్రమాణాని చ అశేష లౌకికాని చ తేషాం సమాహారః తథా ।" తుదినికూడా దాటిపోయినది, అత్యంతము. లోకములో అసంఖ్యాకములైన లౌకిక ప్రమాణములు ఉన్నవి. వాటి అన్నిటి సమాహారము "అత్యంతప్రమాణాశేషలౌకికః". ఋషభదేవుని షడైశ్వర్యముల గొప్పదనము ఏ అశేష, అలౌకిక ప్రమాణములచేతను కొలువ వీలులేనిది. అంటే, ఏలోకములోను, ఏ ప్రమాణముచేతను తెలుపలేని, అంతములేని, ఎంతచెప్పినా తరగని గొప్పదనము కలవాడు ఋషభదేవుడు.

**శతధాన్యస్తభూతాత్మా శతానందో గుణప్రసూః ।**
**వైష్ణవోత్పాదనపరః సర్వధర్మోపదేశకః ॥ 72**

**334. శతధాన్యస్తభూతాత్మా :**

"శతధా శతప్రకారం న్యస్తః స్థాపితః భూతాత్మా భూతేషు శరీరేషు ఆత్మా యేన సః శతధాన్యస్తభూతాత్మా" వివిధ శరీరములలో ఎన్నోరీతులుగా విస్తరించి ఉన్న ఆత్మ, పుట్టే జీవుల శరీరములలో స్థాపించబడుతుంది అని అర్థము. భార్య జయన్తి ద్వారా ఋషభదేవుడు తనతో సమాన గుణములు గల నూర్గురు కొడుకులను కన్నాడు. "ఆత్మావైజాయతే పుత్రః (శ్రుతి). అనగా తన నూర్గురు పుత్రుల శరీరములలో ఆత్మ స్వరూపుడై ఉన్న ఋషభ భగవానుడు శతధాన్యస్తభూతాత్మ.

*"జయన్త్యామింద్రదత్తాయాం...... ఆత్మజానాం ఆత్మ సమానానాం శతం జనయామాస"* *(భాగ 5-4-8).*

**335. శతానందః :**

1. "శతపుత్రా ఏవానందస్వరూపా యస్య సః శతానందః" ఆనంద స్వరూపులైన నూర్గురు పుత్రులుగల ఋషభదేవుడు. లేక నూరు విధములైన ఆనందముల నిచ్చే నూర్గురు పుత్రులు గల ఋషభదేవుడు.



2. "శతానందో యస్య ఇతి" శతగుణానందము కలిగించిన నూర్గురు పుత్రులుగల ఋషభదేవుడు శతానందుడు.

**336. గుణప్రసూః :**

"గుణం గుణవంతం అభేదవివక్షయా ఆనందనిధానం భరతం ప్రసూత ఇతి తథా" గుణవంతుడు (శ్రేష్ఠమైన గుణములు కలవాడు), ఆనందస్వరూపుడు జ్యేష్ఠుడు అయిన భరతుని, పుత్రునిగా కన్న భగవాన్ ఋషభదేవుడు 'గుణప్రసూః". (ఈ భరతుని పేరు పైననే మనదేశమునకు భారతవర్షమను పేరు వచ్చినది.)

*"యేషాంఖలు మహాయోగీ భరతో జ్యేష్ఠః శ్రేష్ఠగుణ ఆసీద్యేనేదం వర్షం భారతమితి వ్యపదిశన్తి."* *(భాగ 5-4-9).*

**337. వైష్ణవోత్పాదనపరః :**

1. "వైష్ణవో భరతః తదుత్పాదనేన వైష్ణవధర్మాన్ పిపర్తీతి తథా." గొప్ప విష్ణుభక్తుడైన భరతుని కుమారుడుగా పొంది వైష్ణవధర్మమును పరిపూర్ణముగా పోషించి వ్యాపింపచేయుటకు కారణుడైన ఋషభదేవుడు వైష్ణవోత్పాదనపరుడు.

2. "వైష్ణవేషు భక్త్యుత్పాదనపర ఇతి వా" వైష్ణవులయందు భక్తి చక్కగా జనింప జేసిన ఋషభదేవుడు.

**338. సర్వధర్మోపదేశకః :**

బ్రహ్మర్షులు, ప్రజలు ఉన్న సభలో ఋషభదేవుడు తన పుత్రులకు లౌకిక, పారమార్థిక జీవనానికి సంబంధించిన నివృత్తి లక్షణధర్మములను ఉపదేశించాడు. కనుక సర్వధర్మోపదేశకుడు.

*"స కదాచిదటమానో భగవానృషభో బ్రహ్మావర్తగతో బ్రహ్మర్షి ప్రవర సభాయాం...."* *(భాగ 5-4-19). "నాయం దేహో దేహభాజాం నృలోకే......"* నుంచి *".....కృతాన్తపాశాన్న విమోక్తుమీశేత్"* వరకు *[భాగ 5-5-(1-27)].*

**పరహంసక్రియాగోప్తా యోగచర్యాప్రదర్శకః ।**
**చతుర్థాశ్రమనిర్ణేతా సదానందశరీరవాన్ ॥ 73**

### 339. పరహంసక్రియాగోప్తా :

1. సంసార బంధములు లేనివాడు లేక సంసార స్వరూపము బాగుగా తెలుసుకున్నవాడు "హంసః" అనబడుతాడు. లేక సంసారబంధము పోగొట్టువాడు దాని స్వరూపమును తెలిసినవాడు "హంసః" అనబడతాడు.

2. "పరే ఉత్కృష్టాశ్చ తే హంసాశ్చ పరహంసాః". ఉత్కృష్ట హంస లక్షణములు కలవారు పరహంసలు. లేక పరమహంసలు. ఆ పరమహంసల యొక్క యోగ సంబంధమైన తపస్సు, ధ్యానము, భక్తి, ఆత్మసమర్పణ, మొదలైన క్రియలు చేయుట యందు వారికి రక్షణ కల్పించే భగవానుడు "పరహంసక్రియా గోప్తా" అనే భగవానుడు, వృషభదేవుడు.

### 340. యోగచర్యాప్రదర్శకః :

ఇక్కడ యోగమంటే భక్తి. చర్య అంటే ఆచరణము. భక్తియోగ ఆచరణ రూపమును అందరికి ప్రదర్శింపజేసిన ఋషభదేవుడు.

### 341. చతుర్థాశ్రమనిర్ణేతా :

సంన్యాసాశ్రమము చతుర్థాశ్రమము. ఆ సంన్యాసాశ్రమ ధర్మములు, విధులు నిర్ణయించి చెప్పగల భగవానుడు, ఋషభదేవుడు.

### 342. సదానందశరీరవాన్ :

1. సర్వకాలములందు ఆనందమే శరీరముగా గల భగవానుడు. "సదానందశరీరవాన్".

2. "యచ్చానందశ్చ తదుభయాత్మక శరీర ఇతివా" సత్ మరియు ఆనందము అనే రెండు తత్త్వములతో ఏర్పడిన శరీరముగల భగవానుడు సదానందశరీరవాన్, ఋషభదేవుడు.



**ప్రదర్శితాన్యధర్మశ్చ భరతస్వామ్యపారకృత్ ।**
**యథావత్కర్మకర్తా చ సంగానిష్టప్రదర్శకః ॥ 74**

### 343. ప్రదర్శితాన్యధర్మః (చ) :

"ప్రదర్శితః స్థాపితః అన్యేషు ధర్మో యేన ఇతి ప్రదర్శితాన్యధర్మః" పరమ సాత్వికమైన మనస్సుకలవారికి మాత్రమే భగవంతునియందు భక్తి కలుగుతుంది. ఇతరులైన రజోగుణ సంపన్నులకు భక్తికుదురుట దుర్లభము. ఋషభదేవుడు అట్టివారికి కూడా కైవల్యము పొందు మార్గమును (ధర్మమును) ఉపదేశించి భక్తి కలిగింపజేసాడు.

*'అయమవతారో రజసోపప్లుతకైవల్యోపశిక్షణార్థః"* *(భాగ 5-6-12).*

### 344. భరతస్వామీ :

పెద్దకొడుకైన భరతునకు ఋషభదేవుడు గురువు గనుక భరతస్వామి. *".... భక్తిజ్ఞానవైరాగ్యలక్షణం పారమహంస్యధర్మముపశిక్షమాణః స్వతనయ శతజ్యేష్ఠం, పరమభాగవతం భగవజ్జనపరాయణం భరతం.."* *(భాగ 5-5-28).*

### 345. అపారకృత్ :

"నవిద్యతే పారం యస్య ఇతి అపారః సంసార సాగరః" దాటశక్యము కాని సంసారసముద్రము అపారము. "తం కృణత్తి", దానిని ఛేదించేవాడు అపారకృత్. అంటే సంసారసాగరమును (ఛేదించు) దాటించు భగవానుడు.

### 346. యథావత్కర్మకర్తా (చ) :

నిత్యనైమిత్తిక శ్రౌతస్మార్తకర్మలు, యజ్ఞయాగాదులు శ్రద్ధగా నిష్ఠతో ఏ విధముగా నిష్కామముగా చేయాలో అట్లు ఆచరించి తెలిపినట్టి భరతుడు. *"ఈజే చ భగవంతం యజ్ఞక్రతురూపం...." నుంచి "భక్తిరనుదిన మేధమాన రయాజాయత"* వరకు *(భాగ 5-7-5, 6,7).*

## 347. సంగానిష్టప్రదర్శకః :

1. "సంగాత్ భగవద్ సంబంధరహితాత్ అనిష్టం అనర్థం ప్రదర్శయతీతి" భగవంతునితో సంబంధములేని సాంగత్యము వలన అనర్థములు కలుగుతాయని చూపే భగవానుడు సంగానిష్టప్రదర్శకుడు.

2. 'సంగస్య భగవత్సంబంధరహిత జీవనస్య అనిష్టమ్ అనర్థం ప్రదర్శయతీతి వా" భగవంతునితో సంబంధములేని విషయాసక్తి గల జీవనముయొక్క అనర్థము వెంటనే కనబడుతుంది అని చూపే భగవానుడు. భక్తుడైన భరతుని జీవితము చివరి రోజులలో లేడి పిల్లను పెంచుతూ భగవత్సంబంధము లేకపోవుటచేత మరణానంతరము అతడు లేడియై పుట్టవలసి వచ్చినది. ఈవిధమైన సంగానిష్టప్రదర్శకుడైన భగవానుడు.

*"ఏకదా తు మహానద్యాం...." నుంచి "... మృగత్వ నిమిత్తావసానమేవ గణయన్మృగ శరీరం తీర్థోదకక్లిన్నముత్ససర్జ".* [*భాగ 5-8, - (1-31)*]

**ఆవశ్యకపునర్జన్మకర్మమార్గప్రదర్శకః ।**
**యజ్ఞరూపమృగః శాన్తః సహిష్ణుః సత్పరాక్రమః ॥ 75**

## 348. ఆవశ్యకపుర్జన్మకర్మమార్గప్రదర్శకః :

1. చేసిన కర్మననుసరించి ఎట్టి పునర్జన్మ కలుగుతుందో అది ఎంత తప్పని సరియో కర్మమార్గము ప్రదర్శిస్తుంది. భరతుని లేడిజన్మ, తరువాత జన్మలో జడభరతుడై పుట్టుట, ఈ ఆవశ్యకపునర్జన్మకర్మమార్గమును తెలుపుతాయి. "ప్రదర్శకః" అంటే జ్ఞాపకః అని అర్థము. దీనిని ప్రదర్శింపజేసే వాడు లేక జ్ఞాపకము చేసే భగవానుడు ఆవశ్యకపునర్జన్మకర్మమార్గప్రదర్శకుడు.

*''అథ కస్యచిద్ ద్విజవరస్యాంగిరః ప్రవరస్య...'' నుంచి "........దర్శయామాసలోకస్య" వరకు* (*భాగ 5-9-1, 2, 3*).



## 349. యజ్ఞరూపమృగః :

ఒక శూద్రుడు తనకు పుత్రులు కలగాలన్న కోరికతో భద్రకాళికి ఒక మనుష్యుని బలిఇవ్వ నిశ్చయించుకోగా, ఆ బలిపశువు తప్పించుకుపోయాడు. దైవయోగముచే జడభరతుడు వాళ్లకి యజ్ఞపశువును చేయడానికి దొరికాడు.

*"అథ కదాచిత్కశ్చిద్ వృషలపతిర్భద్రకాళ్యై...." నుంచి "....కరాళనిశితముపాదదే"* [*భాగ 5-9-(12-16)*].

## 350. శాంతః :

భద్రకాళికి బలి ఇచ్చుటకు వధించే సమయములో కూడా జడభరతుడు శాన్తస్వరూపముతో కూర్చుని ఉండెను.

*"అథవృషలరాజపణిః పురుషపశో" ... నుంచి "... సహసోచ్చచాట సైవ దేవీ భద్రకాళీ"* (*భాగ 5-9-16, 17*).

## 351. సహిష్ణుః :

"సహిష్ణుః'' అంటే సహనశీలుడు. జడభరతుడు బలిపశువుగా బలికావడానికి ఆటంకపరచలేదు. శాంతచిత్తుడై సహనశీలత కనపరచాడు. దేహాదులయందాత్మభావము లేనివారికి శిరస్సు ఛేదించు సమయమునందు కూడా తొట్రుబాటు, సంభ్రమము కలుగవు. శాంత చిత్తులై అన్నిటినీ సహిస్తారు. ఈ విషయము అద్భుతమైనదిగా కనబడుతుంది కాని ఊహింపజాలనిది కాదు.

*"న వా ఏతద్విష్ణుదత్త మహదద్భుతం...."* (*భాగ 5-9-20*).

## 352. సత్పరాక్రమః :

1. "సత్", అంతటా నిండి ఉన్నది. "సత్పరా" సత్‌యందే పరాయణుడు, భగవానుడు. భగవానుని యందే స్థితి కలవారు సత్పరాక్రములు.

2. సత్‌యందు అనగా భగవంతుని యందు స్థితి కొరకు ప్రయత్న శీలురు. సత్పరాక్రములు. భగవత్పరాయణులు. సత్పరాయణులను ఎవ్వరు ఏమి చెయ్యలేరు (జడభరతుని కథ).

**రహూగణగతిజ్ఞశ్చ రహూగణవిమోచకః ।**
**భవాటవీతత్త్వవక్తా బహిర్ముఖహితే రతః ॥ 76**

**353. రహూగణగతిజ్ఞః (చ) :**

రహూగణమహారాజుకు జ్ఞానము కలిగించు ఉపాయము నెరిగినవాడు రహూగణగతిజ్ఞుడు. అతనికి జ్ఞానము పొందే ఉపాయము చెప్పిన జడభరతుని రూపములో నున్న భగవానుడు. *(భాగ 5వ స్కంధం 11, 12, 13 అ॥లు)*

**354. రహూగణవిమోచకః :**

"రహూగణం వేః కాలాత్ జ్ఞానోపదేశేన మోచితవానిత్యర్థః" రహూగణ మహారాజుకు విమోచనకాలము రాగా, జడభరతుడు అతనికి జ్ఞానబోధ చేసి, సంసారమునుండి విముక్తి మార్గము చూపాడు (మోక్షపదము చూపాడు) ఆజడభరతునిరూపములోనున్న భగవానుడు. *(భాగ 5- 12, 13, 14 అ॥లు).*

**355. భవాటవీతత్త్వవక్తా :**

'భవాటవీ' అంటే సంసారము అనే అరణ్యము. జీవులను పట్టి పీడించే సంసారము యొక్క నిజతత్త్వమును తెలిసిన జడభరతుడు రహూగణ మహారాజుకు జ్ఞానము బోధించి సంసారబంధమునుండి విడిపించాడు. అట్టి జడభరతుని రూపములో నున్న భగవానుడు. *(భాగ 5 - 13, 14 అ॥).*

**356. బహిర్ముఖహితేరతః :**

వేదబాహ్యులు, పాషండులు బహిర్ముఖచిత్తవృత్తులు కలవారు. అంతర్ముఖలైన అవధూతలను (యోగులను, భక్తులను, జీవన్ముక్తులను) గుర్తించలేరు. వారిని గౌరవిపంపరు. మీదుమిక్కిలి వారిని అవమానిస్తారు. అందుచేత అవధూతలు అట్టి వారిని కలిసినపుడు ఆచారరహితులవలె



ఉన్మత్తులవలె, బాలురవలె సంచరించుతూ, వారిని ఆస్తికమార్గములకు మరల్చి హితము చేస్తారు. ఈ విధముగా సంచరించే జడభరతుని రూపములోనున్న భగవానుడు.

**గయస్వామీ స్థానవంశకర్తా స్థానవిభేదకృత్ ।**
**పురుషావయవో భూమివిశేషవినిరూపకః ॥ 77**

**357. గయస్వామీ :**

రాజర్షి గయునికి ప్రభువు అయిన భగవానుడు గయస్వామి.

*"…. గయోరాజర్షి ప్రవర" నుంచి "… ప్రీతః స్వయం ప్రీతిమగాద్గయస్య"*
*[భాగ 5-15 - (6-13)].*

**358. స్థానవంశకర్తా :**

"స్థానం స్థితిధర్మః". ఇది సృష్టి, స్థితి, లయ కార్యములలో స్థితికార్యము. స్థితిధర్మము లోకరక్షణము. ఈ స్థితిధర్మ రక్షణార్థము గయుని వంశమును రక్షించి నిలబెట్టిన భగవానుడు స్థానవంశకర్త.

**359. స్థానవిభేదకృత్ :**

"స్థానస్య వంశ స్థితేః విభేదం సంస్థాం కరోతీతి తథా,పియవ్రతవంశ సంస్థాకర్తేత్యర్థః" అనగా స్థితిధర్మ లోకరక్షణకొరకు ఒక విశేషమైన వ్యవస్థ చేయబడ్డది. ఇది ప్రియవ్రతుని వంశము అనే సంస్థను నిలబెట్టుటద్వారా చెయ్యబడ్డది. అందుచేత భగవానుడు "స్థానవిభేదకృత్" అని చెప్పబడ్డాడు.

**360. పురుషావయవః :**

ప్రియవ్రత వంశములోని రాజులు భూమిని విరాట్ పురుషుని శరీరములో ఒక భాగము లేక అవయవము అనే భావముతో పాలించారు. ఇట్టి భావము వారిలో కలిగించిన భగవానుడు.

"పృథివీ మే శరీరే శ్రితా" (శ్రుతి).

**361. భూమివిశేషవినిరూపకః :**

ప్రియవ్రతుడు రథముతో భూమండలమును ఏడు సార్లు పరిక్రమణము చేయగా రథచక్రముల త్రొక్కిడివల్ల భూమిపై పరిఖలు (కందకములు) చేయబడి సముద్రములు, ద్వీపములు పర్వతములు మొదలైనవి ఏర్పడినవి. అలా ఏర్పడిన సముద్రములు మొదలైన వాని పరిమాణములు విశేషముగా చెప్పబడినవి.

*"…. న వై మహారాజ భగవతో మాయాగుణవిభూతేః…. భూగోలకవిశేషం నామరూపమానలక్షణతో వ్యాఖ్యాస్యామః" (భాగ 5-16-4).*

**జంబూద్వీపపతిర్మేరునాభిపద్మరుహాశ్రయః ।**
**నానావిభూతిలీలాఢ్యో గంగోత్పత్తినిదానకృత్ ॥ 78**

**362. జంబూద్వీపపతిః :**

జంబూద్వీపమని పిలవబడే భూభాగమునకు రాజు అయిన ప్రియవ్రతుడు.

*"యో వాయం ద్వీపః కువలయ కమలకోశాభ్యన్తరకోశో…" నుంచి "… సువిభక్తాని భవన్తి" వరకు (భాగ 5-16-5,6).*

**363. మేరునాభిపద్మరుహాశ్రయః :**

జంబూద్వీపములోని తొమ్మిది వర్షములకు మధ్యగా ఉన్నది ఇలావృతవర్షము. దాని నాభి యందు (మధ్యలో) పద్మములోని కర్ణికవలె పైకి పెరిగి కనిపించే మేరుపర్వతప్రదేశము పేరు మేరునాభిపద్మరుహము. దానిని ఆశ్రయించిన (లేక ఆరూపముగల) భగవానుడు.

*"….. మేరుః శిఖరిణామహం" (గీత 10-23).*

*"ఏషాంమధ్యే ఇలావృతం నామాభ్యంతర వర్షం యస్య నాభ్యామవస్థితః సర్వతః సౌవర్ణః" నుంచి "…. దశాంశాధికాం శేన దైర్ఘ్య ఏవ హ్రసన్తి" (భాగ 5-16-7,8).*



**364. నానావిభూతిలీలాఢ్యః :**

భగవంతుని వివిధములైన విభూతులు లక్ష్మీవిలాస స్థానములుగా సమృద్ధిగా లోకమంతటా నిండిఉంటాయి. వివిధమైన గొప్ప విభూతులతో కూడిన లీలతో సంపన్నుడై, వానిని ప్రదర్శించే భగవానుడు, నానావిభూతి లీలాఢ్యుడు.

*"దేవోద్యానాని చ భవన్తి, చత్వారి నందనం చైత్రరథం వైభ్రాజకం సర్వతోభద్రమితి" (భాగ 5-16-14).*

**365. గంగోత్పత్తినిదానకృత్ :**

గంగ విష్ణు పాదమునుండి పుట్టినది. ఈ విధముగా గంగ జన్మించుటకు స్థానమును ఏర్పరచిన భగవానుడు. "గంగోత్పత్తినిదానకృత్".

*"తత్ర భగవతః సాక్షాద్యజ్ఞలింగస్య విష్ణోర్విక్రమతో వామపాదాంగుష్ఠనఖ నిర్భిన్నోర్ధ్వాండకటాహవివరేణాన్తఃప్రవిష్టా యా బాహ్యజలాధారా…" (భాగ 5-17-1).*

**గంగామాహాత్మ్యహేతుశ్చ గంగారూపోఽతిగూఢకృత్ ।**
**వైకుంఠదేహహేత్వంబుజన్మకృత్ సర్వపావనః ॥ 79**

**366. గంగామాహాత్మ్యహేతుః (చ) :**

గంగామాహాత్మ్యమునకు కారణము విష్ణుపాదము నుండి ఆ నది జన్మించుటయే. అందుచేత గంగామాహాత్మ్యహేతువు - భగవానుడు.

**367. గంగారూపః :**

గంగారూపమున ఉన్న భగవానుడు.

*"…. స్రోతసామస్మి జాహ్నవీ" (గీత 10-31).*

**368. అతిగూఢకృత్ :**

1. ఇతర తీర్థములన్నిటికి వాటివాటి మాహాత్మ్యములున్నప్పటికి వాటన్నిటికంటె గంగాతీర్థమహిమ (విష్ణుపాదమునుండి పుట్టుట వలన) అతిగూఢము, ఉత్తమము.

2. అతి గుప్తమైన పాపములను కూడా పోగొట్టేది గంగా తీర్థము. అందుచేత "అతిగూఢకృత్".

**369. వైకుంఠదేహహేత్వంబుజన్మకృత్ :**

"వైకుంఠో భగవాన్, లోకోవా; తత్సంబంధీ యో దేహస్తత్ర హేతుభూతం యదంబు గంగాజలం తస్య జన్మకర్తా". "వైకుంఠః" అంటేభగవానుడు లేక విష్ణులోకము. తత్సంబంధమైన దేహమునందు (భగవానుని పాదము నందు) పుట్టినది గంగాజలము. అందుచేత ఆ గంగాజల మహాత్మ్యమునకు కారణమైన భగవానుడు "వైకుంఠదేహహేత్వంబుజన్మకృత్" అని చెప్పబడ్డాడు.

2. భగవత్సేవా యోగ్యమగుటకు తగిన దేహము ధరించి గంగ పుట్టినది. అందుచేత "వైకుంఠదేహహేత్వంబుజన్మకృత్" గంగారూపములోనున్న భగవానుడు.

**370. సర్వపావనః :**

ఆబ్రహ్మస్తంబపర్యంతమును గంగారూపముతో పావనముచేసే భగవానుడు సర్వపావనుడు.

**శివస్వామీ శివోపాస్యో గూఢః సంకర్షణాత్మకః ।**
**స్థానరక్షార్థమత్స్యాదిరూపః సర్వైకపూజితః ॥ 80**

**371. శివస్వామీ :**

1. శివునిచే సేవింపబడే ప్రభువు శివస్వామి, భగవానుడు.

2. శివుని రూపములో ఉన్న స్వామి శివస్వామి, భగవానుడు.

*"ఇలావృతే తు భగవాన్ భవ ఏక ఏవ పుమాన్నహ్యన్యః..." (భాగ 5-17-15)*

**372. శివోపాస్యః :**

1. శివునిచే ఉపాసింపబడే భగవానుడు శివోపాస్యుడు.

2. శివత్వము పొంది ఉపాసింపదగిన రూపములోనున్న భగవానుడు శివోపాస్యుడు.



**373. గూఢః :**

ఇలావృత వర్షములో శివుడొక్కడే పురుషుడు. పార్వతీదేవి శాపమువలన ఆ ప్రదేశములో ఏ పురుషుడు కాలుపెట్టినా స్త్రీ అయిపోతాడు. ఇది గూఢము. అనగా రహస్యమైన సత్యము.

*"ఇలావృతేతు భగవాన్ భవ ఏక ఏవ పుమాన్నహ్యన్యస్తత్రాపరో నిర్విశతి భవాన్యాః శాపనిమిత్తజ్ఞో...." (భాగ 5-17-15).*

**374. సంకర్షణాత్మకః :**

"సమ్యక్ కర్షతి అంతకాలే సర్వాణీతి సంకర్షణః" అన్తకాలమందు (ప్రళయ కాలమందు) అందరిని సంహారము చేయు భగవానుడు సంకర్షణుడు, సంహారమూర్తి.

*"ఓం నమో భగవతే మహాపురుషాయ సర్వగుణసంఖ్యానాయానన్తాయా వ్యక్తాయ నమ ఇతి" నుంచి "..తస్మై నమస్తే విలయోదయాత్మనే" వరకు. [భాగ 5-17 - (17-24)]*

**375. స్థానరక్షార్థమత్స్యాదిరూపః :**

"స్థానానాం ద్వీపవర్షాదీనాం రక్షార్థం మత్స్యాది రూపేణ తత్ర తత్ర స్థిత ఇత్యర్థః" ఆ యా ద్వీపములను ఆయా వర్షములను రక్షించుటకు మత్స్యాది రూపములతో ఆయా స్థానములలో అవతరించిన భగవానుడు. భద్రాశ్వవర్షములో హయశీర్ష రూపము; హరవర్షములో నృసింహ రూపము; కేతుమాల వర్షములో కామదేవుని రూపము, హిరణ్మయవర్షములో కూర్మావతార రూపము, ఉత్తరకురువర్షములో వరాహ రూపము, కింపురుషవర్షములో పురుషోత్తమ శ్రీరామ రూపము, భరతవర్షములో నరనారాయణ రూపములతో ఓంకార భగవానుడు అవతరించెను. *(భాగ 5-18; 19 అ.)*

**376. సర్వైకపూజితః :**

"సర్వైః పూజ్యస్వరూపైః భక్తైర్వా ఏక ఏవ పూజితః, ఉపాసనార్థం నానాత్వేఽపి, పరమార్థస్తు సర్వాపి మూర్తిః కృష్ణ స్యైవేతి, స ఏవ పూజితః

ఇతి భావః” ఉపాసనార్థము వివిధ భక్తులచేత, వివిధ దేవతల నామరూపము లతో పూజింపబడే భగవానుడు నిజముగా శ్రీకృష్ణుడు ఒక్కడు మాత్రమే- ఉపాసనలలో నానాత్వము గల వివిధ దేవతల నామరూపములలో పూజింప బడినట్లు కనబడినా ఆయా మూర్తుల నామ రూపములన్నీ శ్రీకృష్ణ నివే కనుక పారమార్థిక ముగా శ్రీకృష్ణుడొక్కడే అందరిచేతను పూజింపబడుతున్నాడు.

*“ఇంద్రం మిత్రం వరుణమగ్నిమాహుః”* *(శ్రుతి).*

**ఉపాస్యనానారూపాత్మా జ్యోతీరూపో గతిప్రదః ।**
**సూర్యనారాయణో వేదకాన్తిరుజ్జ్వలవేషధృక్ ॥ 81**

## 377. ఉపాస్యనానారూపాత్మా :

మత్స్యాది నానావతారముల రూపములలో భక్తులచే ఉపాసింపబడే భగవానుడు “ఉపాస్య నానారూపాత్మా” అనడతాడు. *(భాగ 5వ స్కంధం 18 అ॥).*

## 378. జ్యోతీరూపః :

“జ్యోతీ” అనగా తేజస్సు. తేజస్స్వరూపులలో ఉత్కృష్టుడైనవాడు శ్రీ సూర్యనారాయణ భగవానుడు.

*“జ్యోతిషాం రవిరంశుమాన్”* *(గీత 10-21).*

## 379. గతిప్రదః :

ఉత్తరాయణ దక్షిణాయనములలో గతి మార్చుతూ, అందరికి శుభా శుభములను చక్కగా సమకూర్చే సూర్యనారాయణ భగవానుడు గతిప్రదుడు.

*“యన్మధ్యగతో భగవాంస్తపతాంపతిస్తపన ఆతపేన” నుంచి “.... విష్ణోర్యత్పరమం పదం ప్రదక్షిణం ప్రక్రమంతి” వరకు (భాగ 5-21-3 నుంచి 5-22-17)*

## 380. సూర్యనారాయణః :

సూర్యమండల మధ్యవర్తీ రూపములో నున్న శ్రీ సూర్యనారాయణ స్వరూప భగవానుడు.



*“యథా కులాలచక్రేణ భ్రమతా...” నుంచి “యథోపజోష మృతుగుణాన్ విదధాతి”*
*(భాగ 5-22-2,3)*

## 381. వేదకాన్తిః :

ఋగ్యజుస్సామ (మూడు) వేదముల కాంతియే సూర్యుని కాంతి; లేక మూడు వేదముల కాన్తిరూపమైన సూర్యనారాయణభగవానుడు.

*“...ఆత్మానంత్రయీమయం.....” నుంచి “.... శ్రద్ధయా యజన్తోఽఞ్జసాశ్రేయః సమధిగచ్ఛన్తి వరకు [భాగ 5-22 - (3-4)].*

*“వేదైరశూన్య స్త్రిభిరేతి సూర్యః (శ్రుతి). “ఆదిత్యోవా ఏష ఏతన్మండలం తపతి.....”*
*(తై॥ ఉ॥ నారాయణం)*

*“ఋగ్భిః పూర్వాహ్ణే దివి దేవ ఈయతే యజుర్వేదేతిష్ఠతి మధ్యేఅహ్నః, సామవేదేనాస్తమయే మహీయతే”* *(శ్రుతి).*

## 382. ఉజ్జ్వలవేషధృక్ :

చక్కగా ప్రకాశించే రూపము ధరించిన సూర్యనారాయణ భగవానుడు “ఉజ్జ్వలవేషధృక్”

**హంసోఽన్తరిక్షగమనః సర్వప్రసవకారణమ్ ।**
**ఆనందకర్తా వసుదో బుధో వాక్పతిరుజ్జ్వలః ॥ 82**

## 383. హంసః :

“హన్తి గచ్ఛతి ఆయుః క్షయకారకత్వేన; సర్వాన్ హనస్తి చ హంసః” నిత్యము సూర్యగమనము వలన కాలము జరిగి జీవుల ఆయువు తరిగి పోతుంది. అందుచేత “హంసః” అంటే సూర్యభగవానుడు.

*“యోఽసౌతపన్నుదేతి”* *(శ్రుతి)*

*“హంసః శుచిషద్”* *(శ్రుతి).*

**384. అన్తరిక్షగమనః :**

అన్తరిక్షమందు గమనము గల సూర్యనారాయణ భగవానుడు అన్తరిక్షగమనుడు.

**385. సర్వప్రసవకారణమ్ :**

"ప్రసవ" అనగా ప్రేరణ. అన్ని ప్రాణులకు సూర్యోదయము కాగానే లేచి పనులు చేయుటకు ప్రేరణ ఇచ్చే సూర్యభగవానుడు సర్వప్రసవకారణుడు.

*"సవితాప్రసవానామీశః"* *(శ్రుతి).*

ఇంతవరకు సూర్యనారాయణ భగవానుని నామములు చెప్పబడ్డాయి. ఇకచంద్రుడు ఇతర గ్రహముల నామములు చెప్పబడుతున్నాయి.

**386. ఆనందకర్తా :**

చల్లటి వెన్నల నిచ్చి అన్ని ప్రాణులకు ఆనందము నిచ్చే చంద్రరూప భగవానుడు, ఆనందకర్త.

**387. వసుదః :**

భూమి పుత్రుడు మంగళుడు, కుజగ్రహము. ధనము నిచ్చువాడు. కుజగ్రహము రూపములో గల భగవానుడు "వసుదః" అని చెప్పబడతాడు.

**388. బుధః :**

బోధించేవాడు, బుద్ధిమంతుడు అయిన బుధగ్రహ రూపములో గల భగవానుడు.

**389. వాక్పతిః :**

వాక్ అనగా మాట, భాష అని అర్థము. వాక్కులకు పతి అనగా చక్కగా మాట్లాడే బృహస్పతి లేక గురు గ్రహరూపుడైన భగవానడు వాక్పతి.



**390. ఉజ్జ్వలః :**

తెల్లనైన శరీరముతో శుభ్రముగా ప్రకాశించే శుక్రగ్రహ రూపుడైన భగవానుడు, ఉజ్జ్వలుడు.

**కాలాత్మా కాలకాలశ్చ కాలచ్ఛేదకృదుత్తమః ।**
**శిశుమారః సర్వమూర్తిరాధిదైవికరూపధృక్ ॥ 83**

**391. కాలాత్మా :**

1. 'కాల' అనగా నల్లని, ఆత్మా అనగా శరీరము గల శనిగ్రహరూప భగవానుడు "కాలాత్మా".

2. కాలరూపముతో సర్వులను పీడించే శనిగ్రహము "కాలాత్మా."

**392. కాలకాలః (చ):**

సూర్యుని గ్రహణకాలమందు నల్లని చీకట్లు కలిగించే రాహుగ్రహ రూపుడైన భగవానుడు "కాలకాలుడు".

**393. కాలచ్ఛేదకృత్ :**

నల్లని శరీరముగల రాహువును తన చక్రముతో రెండు ముక్కలు చేసిన భగవానుడు. అట్లు ముక్కలు చేయబడ్డ రాహువు శిరస్సు రాహుగ్రహముకాగా, మొండెము కేతుగ్రహము అయినది.

**394. ఉత్తమః :**

"అతిశయేన ఉత్ ఉత్తమః ఊర్ధ్వతమ ఇత్యర్థః" అన్నింటికన్నా చాల ఎత్తుగా పైనున్న శిశుమారచక్రము "ఉత్తమః" అని చెప్పబడింది-

*"తత ఉత్తరస్మాదృషయ......"(భాగ. 5-22-17) నుంచి "......... నశ్యేత తత్కాలజమాశు పాపమ్" వరకు* *(భాగ 5-23-9).*

**395. శిశుమారః :**

శిశుమార, శింశుమార శబ్దములు సమానార్థకములు.

శిశుమారమనగా మకరము లేక ఒక విధమైన జలజంతువు. నీటిలో ఉండి పొరబాటున (నీటిలో) దిగిన శిశువులను చంపి తినే జంతువు. శిశుమార ఆకృతిగల నక్షత్రసమూహము (తారా చక్రము) శిశుమారము. ఇది సంపూర్ణ జ్యోతిర్గణములకు ఆశ్రయము. ద్వాదశరాశులుగల జ్యోతిశ్చక్రము. కాలచక్ర స్వరూపము. దీనితోక చివరి భాగమునందు (తనస్థానము నుంచి చలించని) ధ్రువనక్షత్రము ఉండును. ఇది సర్వదేవాధిపతి అయిన పరమాత్మ. ఈ రూపములోనున్న భగవానుని మూడు వేళల నమస్కరించాలి. *(భాగ 5-22-17 నుంచి 5-23-9 వరకు).*

**396. సర్వమూర్తిః :**

కాలస్వరూపుడై బ్రహ్మాది దేవతలందరిలోను నిండి ఉండి ప్రకాశించే పరమాత్మ, (భగవానుడు) సర్వమూర్తి.

*"యస్య పుచ్ఛాగ్రే౽ వాక్ శిరసః....." నుంచి "... నమోజ్యోతిర్లోకాయ కాలాయనాయానిమిషాం పతయే మహాపురుషాయాభిధీమహీతి* [*భాగ 5-23; - (5-8)*].

**397. ఆధిదైవికరూపధృక్ :**

జ్యోతిశ్చక్రములో గల సర్వజ్యోతిర్మండలముల యొక్క ఆధిదైవిక రూపమును ధరించి గోచరిస్తున్న భగవానుడు "ఆధిదైవికరూపధృక్" అని చెప్పబడతాడు.

**అనంతసుఖభోగాఢ్యో వివరైశ్వర్యభాజనమ్ ।**
**సంకర్షణో దైత్యపతిః సర్వాధారో బృహద్వపుః ॥ 84**

**398. అనంతసుఖభోగాఢ్యః :**

1. అపరిమితమైన సుఖభోగములతో సమృద్ధిగానుండువాడు, భగవానుడు.
2. అనంత సుఖభోగములు సమృద్ధిగా కలుగజేసే భగవానుడు.
3. అనంత సుఖభోగములు ఎవరియందున్నవో ఆ భగవానుడు.



**399. వివరైశ్వర్యభాజనమ్ :**

భూమికంటె క్రిందనున్న ఏడు అధోలోకములలో (అతలాది బిలముల లోగల అన్ని విధములైన ఐశ్వర్యములను అనుభవించువాడు లేక అట్టి అనుభవములకు ఆశ్రయమైనవాడు, భగవానుడు.

*"ఏతేషు హి బిలస్వర్గేషు స్వర్గాదప్యధికకామభోగైశ్వర్యానంద భూతి విభూతిభిః ........." నుంచి ".......ఇంద్రియోత్స వైరమరలోక శ్రియమతిశయితాని"* [*భాగ 5-24 - (8-10)*].

**400. సంకర్షణః :**

సమ్యక్ కర్షతి, సర్వాన్ ఏకత్రకరోతీతి సంకర్షణః అంటే అన్నిటిని ఒక చోటికిచేర్చి, ఒక్కటిగా చేసేవాడు సంకర్షణుడు.

పాతాళమునకు 30,000 యోజనముల క్రింద అనంతుడని పిలవబడే భగవానుని తామస నిత్యకళ ఉన్నది. దీనిని అహంకారరూపుడైన సంకర్షణుడని పాంచరాత్ర ఆగమ అనుయాయులు చెప్తారు. సంకర్షణుడు- ద్రష్ట, దృశ్యము లను ఏకత్రము చేస్తాడు. ఈ అనంతుని రూపము వాస్తవముగ విశుద్ధసత్త్వ మయమైనది. కాని అంతకాలమున సంహారాదులు చేయువాడు గాన సంకర్షణమూర్తి. రుద్రరూపుడు, తమోమయుని వలె కనబడును.

*"తస్యమూలదేశే త్రింశద్యోజన సహస్రాంతర ఆస్తే యా వై కలా..." నుంచి "...... రుద్ర ఏకాదశ వ్యూహస్త్ర్యక్షస్త్రిశిఖం, శూలముత్తంభయన్నుదతిష్ఠత్* [*భాగ 5-25 - (1-3)*].

**401. దైత్యపతిః :**

దైత్యులు తామస గుణము అధికముగా కలవారు. అనంతుడు తామస గుణము కలవాడగుటచే దైత్యులకు స్వామి లేక ప్రభువు. ఈ అనంతరూపములో గల భగవానుడు దైత్యపతి.

**402. సర్వాధారః :**

ఏడు వివరములతో (ఏడు అధోలోకములతో) నున్న భూగోళమునకు ఆధారమై అనంతరూపములో నున్న భగవానుడు.

**403. బృహద్వపుః :**

బృహత్ అనగా చాలా ఎక్కువగా పెరిగినది (ప్రవృద్ధం). వపుః అంటే శరీరము; ఎంతో ఎక్కువగా పెరిగిన శరీరము గల అనంతరూపభగవానుడు.

*"మూర్ధన్యర్పితమణువత్సహస్రమూర్ధ్నో భూగోలం ......" (భాగ 5-25-12).*

**అనంతనరకచ్ఛేదీ స్మృతిమాత్రార్తినాశనః ।**
**సర్వానుగ్రహకర్తా చ .................. ॥ 85**

**404. అనంతనరకచ్ఛేదీ :**

1. "అనంతానాం నరాణాం కాని శిరాంసి సంహార సమయే ఛినత్తీతి" (కం = శిరస్సు, నరకం = మనుష్యుని శిరస్సు) సంహార సమయంలో లెక్కలేనన్ని మనుష్యుల శిరస్సులను ఖండించే భగవానుడు "అనంతనరకచ్ఛేదీ"

2. స్మరణమాత్రము చేత అనంతములైన నరకయాతనలు పోగొట్టే భగవానుడు "అనంతనరకచ్ఛేదీ"

**405. స్మృతిమాత్రార్తినాశనః :**

స్మరించినంతనే (ఆర్తి) దుఃఖములను నశింపజేసే భగవానుడు స్మృతిమాత్రార్తి నాశనుడు.

**406. సర్వానుగ్రహకర్తా (చ) :**

1. నమస్కరించినంత మాత్రముచేతనే భక్తులను అనుగ్రహించి హితము కలుగజేయు భగవానుడు.

2. నరకయాతనలు ప్రదర్శింపజేసి, అందరికి పాపభీతి కలిగించి, స్మరణమాత్రముచేతనే అనుగ్రహించి, పాపములనుండి విముక్తి కలిగించే భగవానుడు, సర్వానుగ్రహకర్త.

*ఇంతవరకు పంచమస్కంధ నామములు.*



## శ్రీమద్భాగవత షష్ఠస్కంధ నామములు

*పోషణలీలా నామములు (407-470)*

*శ్లోక సంఖ్య (85-98)*

**.......................................... ।**
**................. మర్యాదాభిన్నశాస్త్రకృత్ ॥ 85**

**407. మర్యాదాభిన్న శాస్త్రకృత్ :**

సాధనకు అనురూపమైన ఫలితము (ఫలము) పొందడం శాస్త్ర మర్యాదా. సాధన చెయ్యకుండా లేక అల్పసాధనతో మహాఫలితము పొందడం కేవలం భగవదనుగ్రహము వలననే సిద్ధిస్తుంది. (పోషణం తదనుగ్రహః) పుష్టి అంటే పోషించుట కనక దానిని పుష్టికృతమని చెప్తారు. ఇట్టి మర్యాదాభిన్నపుష్టి లీలలు ఈ ఆరవస్కంధములో వర్ణింపబడ్డాయి. మర్యాదాభిన్నశాస్త్ర ప్రతిపాదకుడు భగవానుడు.

**కాలాంతకభయచ్ఛేదీ నామసామర్థ్యరూపధృక్ ।**
**ఉద్ధారానర్హగోప్తాత్మా నామాదిప్రేరకోత్తమః ॥ 86**

**408. కాలాన్తకభయచ్ఛేదీ :**

కాలః అంటే యముడు. అన్తకః అంటే మృత్యువు. యమునివలన కలిగే నరక భయమును మృత్యువువలనకలిగే మరణభయమును (ఛేదీ) పోగొట్టే భగవానుడు కాలాన్తకభయచ్ఛేది. అజామిల విమోచనలో 'నామ మహిమ (నామస్మరణ సామర్థ్యము) ప్రకటింపబడింది. ఇది మర్యాదాభిన్న పుష్టిలీలలకు ఉదాహరణ.

*"కన్యాకుబ్జే ద్విజః కశ్చిద్...." నుంచి ".... తం యామ్యపాశాన్నిర్ముచ్య విప్రం మృత్యోరమూముచన్" వరకు (భాగ 6-1-21 నుంచి 6-2-20).*

### 409. నామసామర్థ్యరూపధృక్ :

ఎన్నెన్ని పాపములు చేసినా వాటినన్నిటిని పూర్తిగా రూపుమాపేది నామసామర్థ్యశక్తి. అట్టి శక్తిరూపము ధరించిన భగవానుడు.

"యద్య ద్విభూతి మత్సత్త్వమ్....." (గీత 10-41).

### 410. ఉద్ధారానర్హగోప్తాత్మా :

ఉద్ధారమనగా సంసారమునుండి విమోచనము లేక మోక్షము. అనర్హులను కూడా సంసారయాతనలనుండి తరింపజేసి, మోక్షమునిచ్చి రక్షించే భగవానుడు ఉద్దారానర్హగోప్తాత్మా. ఇచ్చట నామోచ్చారణమాహాత్మ్యమువలన అనర్హుడైన దుష్టుడైన అజామిలునికి భగవానుడిచ్చిన మోక్షసిద్ధి ఉదాహరణము. నామోచ్చారణ మహిమ వలన అనర్హ భక్తోద్ధార సంబంధమైన విశేషము లనేక చోట్ల చెప్పబడ్డాయి. శ్రీకృష్ణనామోచ్చారణ మాత్రము చేతనే నరకయాతనలు అనుభవించేవారు కూడా వైకుంఠమును ఆరోహిస్తారని చెప్పబడ్డది.

*నృసింహ పురాణము, నవమోధ్యాయములో మార్కండేయ మృత్యుప్రసంగ సందర్భములో యముడు కింకరులకు చేసిన బోధ యీ స్కంధమునకు చివర అనుబంధముగా ఇవ్వబడ్డది.*

### 411. నామాదిప్రేరకోత్తమః :

నామాదుల శ్రవణము, కీర్తనము, స్మరణము, మొదలైనవి భక్తి సాధనలు. వీనిని ప్రేరేపించుటలో ఉత్తముడు లేక శ్రేష్ఠుడు భగవానుడు. కాబట్టి నామాదిప్రేరకోత్తమ నామము చెప్పబడినది.

**అజామిలమహాదుష్టమోచకోఽఘవిమోచకః ।**
**ధర్మవక్తాఽక్లిష్టవక్తా విష్ణుధర్మస్వరూపధృక్ ॥ 87**

### 412. అజామిలమహాదుష్టమోచకః :

ఎన్నెన్నో పాపములుచేసి మహాపాపి అని పేరుమోసిన దుష్టుడైన



అజామిలుడనే బ్రాహ్మణుని, నామస్మరణ మాత్రముచే ఆ పాపములన్నిటినుండి దూరముచేసిన నారాయణ భగవానుడు, అజామిలమహాదుష్టమోచకుడు.

### 413. అఘవిమోచకః :

శూద్ర స్త్రీ సంబంధము మొదలైన పాపములు చేసిన అజామిలునికి ఆ పాప కర్మఫలము లన్నిటి నుండి ముక్తి కలిగించిన భగవానుడు అఘవిమోచకుడు. ఇది నామసామర్థ్యమహిమ అని తెలుసుకొనవలెను.

### 414. ధర్మవక్తా :

విష్ణుదూతలరూపేణ స్వకీయ వైష్ణవధర్మము చెప్పించిన భగవానుడు.

*"అహోకష్టం (కథం) ధర్మదృశామధర్మః......." నుంచి "…. సంకీర్తితమఘం పుంసో దహేదేధో యథానలః" వరకు [ భాగ 6-2 - (2-18)].*

### 415. అక్లిష్టవక్తా :

1. అక్లిష్ట అంటే శాస్త్రవిరుద్ధము కానిది. అట్టి ధర్మమును చెప్పే భగవానుడు.

2. అక్లిష్ట అంటే సుఖమైనది- నామోచ్చారణోపాయము మాత్రమే సులభమైన సాధన. మిగిలినవన్నీ కష్టసాధ్యములైనవి. ఈ విషయము అనేక పురాణములలో విశదముగా చెప్పబడింది-

*"అయం హి కృతనిర్వేశో జన్మకోట్యం హసామపి.." (భాగ 6-2-7).*

### 416. విష్ణుధర్మస్వరూపధృక్ :

"విష్ణుధర్మా ఏవ స్వం ధనం, యేషాం తే విష్ణుధర్మస్వాః భక్తాః తేషు రూపం స్వస్వరూపం ధారయతి స్థాపయతి వా." విష్ణుధర్మములే తమ ధనముగా కలవారు విష్ణుధర్మస్వరూపులైన భక్తులు.

విష్ణుధర్మస్వరూపము ధరించిన యముడు, తన భృత్యులైన యమదూతలకు విష్ణుధర్మమును బోధించెను.

"పరో మదన్యో జగతస్తస్థుషశ్చ...." నుంచి "..... ద్రష్టుం చ బిభ్యతి తతః ప్రభృతి స్మ రాజన్" [భాగ 6-3 - (12-34)].

"....యమః సంయమతామహం" (గీత 10-29).

**సన్మార్గప్రేరకో ధర్తా త్యాగహేతురధోక్షజః ।**
**వైకుంఠపురనేతా చ దాససంవృద్ధికారకః ॥ 88**

## 417. సన్మార్గప్రేరకః :

"సతాంమార్గః సన్మార్గః" సంతులు సత్స్వరూపుడైన భగవానుని చేరుటకు ఆచరించే మార్గము సన్మార్గము. దీనిని ప్రేరణచేసే భగవానుడు సన్మార్గ ప్రేరకుడు. భగవన్నామస్మరణమువలన భగవన్నామైకపరత కలుగుతుంది. ఇది సత్స్వరూపభగవానునిచేర్చే సన్మార్గము. ఇట్టి సన్మార్గమును ప్రేరేపించే భగవానుడు సన్మార్గప్రేరకుడు.

## 418. ధర్తా :

ధర్తా అంటే ధరించేవాడు. పోషించి రక్షించేవాడు. భక్తులకు జీవనాధారమై వారిని రక్షిస్తూఉండే భగవానుడు "ధర్తా."

*".... కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి" (గీత 9-31).*

## 419. త్యాగహేతుః :

విషయాసక్తి విడిచిపెట్టుట త్యాగము. అట్టి త్యాగము భక్తితోచేసే భగవన్నామస్మరణము వలన కలుగుతుంది. ఇట్టి త్యాగబుద్ధి పుట్టించే భగవానుడు త్యాగహేతువు.

## 420. అధోక్షజః :

"అధోక్షం ఇంద్రియాజన్యం జ్ఞానం జనయతీతి." అక్షమనగా ఇంద్రియ ములు. ఇంద్రియములు అధోభూతములైనపుడు - (అంతర్ముఖము లైనపుడు) భగవంతుని గూర్చి జ్ఞానము పుట్టును. ఈ విధముగా జ్ఞానము కలిగించే భగవానుడు అధోక్షజుడు.



## 421. వైకుంఠపురనేతా (చ) :

1. అజామిలునకు నామస్మరణము చేసినంతమాత్రముచేతనే వైకుంఠప్రాప్తి, అక్కడ కొందరు సేవకులపై నాయకత్వము కలిగినది.

2. వైకుంఠపురము యొక్క నాయకుడు భగవాన్ నారాయణుడు.

## 422. దాససంవృద్ధికారకః :

దాసులనగా భక్తులు, భాగవతులు. సంవృద్ధి అనగా అన్ని విధములా సమృద్ధి కలుగుట. ఈ లోకములో భాగవతోత్తములను సంవృద్ధిచేయుటకు కారణుడైన భగవానుడు దాససంవృద్ధికారకుడు.

**దక్షప్రసాదకృద్ధంసగుహ్యస్తుతివిభావనః ।**
**స్వాభిప్రాయప్రవక్తా చ ముక్తజీవప్రసూతికృత్ ॥ 89**

## 423. దక్షప్రసాదకృత్ :

ప్రాచేతసుడైన దక్షునకు సృష్టి సామర్థ్యము కలిగించి ప్రజాపతిని చేసిన భగవానుడు.

*"తేభ్యస్తస్యాం సమభవద్దక్షః ప్రాచేతసః కిల...." నుంచి "..... రేతసా మనసా చైవ తన్మమావహితః శృణు" వరకు (భాగ 6-4-17,18).*

## 424. హంసగుహ్యస్తుతివిభావనః :

హంస అంటే పరమాత్మ. గుహ్యస్తుతి అంటే రహస్యము తెలిపే స్తుతి. పరమాత్మ సంబంధమైన రహస్యములు బోధించేస్తుతి. విభావనః అంటే ప్రేరణచేసేవాడు, పరమాత్మ. తత్స్వస్తుతిని భక్తుల హృదయములలో ప్రేరణచేసే (చింతింపచేసే) భగవానుడు. దక్షునకు ఇట్టి ప్రేరణ కలిగించిన భగవానుడు.

"అస్తౌషీద్ధంసగుహ్యేన భగవంతమధోక్షజం ..." నుంచి ".... స ఈశ్వరో మే కురుతాన్మనోరథం" వరకు [భాగ. 6-4 - (22-34)]
ఇది హరిని గురించి దక్షునిచే చేయబడ్డ హంసగుహ్యస్తుతి.

**425. స్వాభిప్రాయప్రవక్తా (చ) :**

తన విభూతులు, వాటివలన బ్రహ్మాదిదేవతలు, మనువులు, ప్రజాపతులు ఏఏ విధములుగా వారి వారి కార్యములు చేయుటకు శక్తి కలిగి ఉన్నారో, వాటన్నిటిని దక్షునకు చెప్పి, "అసక్నీ" అనే కన్యను వివాహము చేసుకొని ప్రజాసృష్టి చేయమని చక్కగా బోధించి, ఆదేశించిన భగవానుడు. స్వాభిప్రాయప్రవక్త.

*".... మమైష కామో భూతానాం యద్భూయాసుర్విభూతయః" నుంచి ".... .మదీయయా భవిష్యన్తి హరిష్యన్తి చ మే బలిమ్" వరకు* [*భాగ 6-4 - (44-53)*].

**426. ముక్తజీవప్రసూతికృత్ :**

భగవానుడు దక్షప్రజాపతిని స్త్రీ పురుష సంగమముచే కలుగు సృష్టి కార్యము ప్రారంభించమని ఆదేశించి పదివేల మంది హర్యశ్వులను వేయిమంది శబలాశ్వులను సృష్టించెను. వారు వైరాగ్య సంపన్నులై సృష్టికార్యము తిరస్కరించి ముక్తి మార్గము కోరుకొన్నారు. ఈ విధముగా లోక సంగ్రహార్ధము ముక్తజీవులను ముందుగా పుట్టించిన భగవానుడు, ముక్తజీవప్రసూతికృత్ అని చెప్పబడ్డాడు.

*(భాగ 6వ స్కంధం 4, 5 అధ్యా).*

**నారదప్రేరణాత్మా చ హర్యశ్వబ్రహ్మభావనః ।**
**సుబలాశ్వహితో గూఢవాక్యార్థజ్ఞాపనక్షమః ॥ 90**

**427. నారదప్రేరణాత్మా (చ) :**

నారదునిచే హర్యశ్వులను ముక్తిమార్గమందు ప్రేరేపణ చేయించిన భగవానుడు.

*"తస్యాం సపాంచజన్యాం వై విష్ణుమాయోపబృంహితః...." నుంచి "..... సుమహన్మునిసిద్ధనిషేవితం" వరకు.* [*భాగ 6-5 - (1-3)*]



**428. హర్యశ్వబ్రహ్మభావనః :**

హర్యశ్వులు నారదుని గూఢఉపదేశముపొంది బ్రహ్మభావనకలిగి జీవన్ముక్తులైరి.

*"ఉవాచ చాథహర్యశ్వాః కథం..." నుంచి "... లోకాననుచరన్మునిః" వరకు* [*భాగ 6-5 - (6-22)*].

**429. సుబలాశ్వహితః :**

ఇచ్చట "సుబలాశ్వ" అన్న పేరు మూలములో "శబలాశ్వ" అని ఉన్నది. శబలాశ్వులు వేయిమంది. హర్యశ్వులవలెనే నారదుని ఉపదేశము పొంది ముక్తి మార్గము హితమని దానిని అవలంభించారు.

శోభనమే బలము అయిన భగవానుడు సుబలుడు. ఆ సుబలుడైన భగవానుని పొందినవారు సుబలాశ్వులు వారు ముక్తి మార్గము హితమని తపస్సు చేయసాగారు. వారి హితము కోరి భగవానుడు వారికి ముక్తినిచ్చాడు. వల్లభాచార్య మహాప్రభువుల వాక్యము "ఇక్కడ సుబలాశ్వహితః" అని ఉన్నది. ప్రామాదిక పాఠమువలె ఉంటుంది. శబలాశ్వ శబ్దము హర్యశ్వనామ సూచన వలన కలిగినది. విష్ణుపురాణములో కూడా "శబలాశ్వ" అని ఉన్నది. "సుబలాశ్వ" పదకల్పన కష్టమగుటచే హర్యశ్వ పరత్వవ్యాఖ్యానము లోకప్రసిద్ధము".

*"ఇతి తానపి రాజేంద్ర ప్రతిసర్గధియో మునిః...." నుంచి ".... నాద్యాపి తే నివర్తన్తే పశ్చిమా యామినీరివ" వరకు* [*భాగ 6-5 - (29-33)*].

**430. గూఢవాక్యార్థజ్ఞాపనక్షమః :**

దక్షుడు తన పుత్రులైన హర్యశ్వాదులను సృష్టికార్యము స్వీకరించమని ఆదేశించాడు. వారు తండ్రి ఆదేశమును ఆచరించే బుద్ధితో నారాయణ సరోవరమునకు వెళ్ళి స్నానమాచరించి తపస్సు చేసుకొంటున్న సమయములో నారదుడు వారిని మోక్షసాధన మార్గములో ప్రేరణచేసే గూఢవాక్యములను ఉపదేశించాడు. వారు ఆ వాక్యములలోని రహస్యము తెలుసుకొని సంసార

విషయములనుండి విముక్తి పొందారు. వారికి నారదుని గూఢవాక్యార్థము తెలుసుకొనే సమర్థత ఇచ్చిన భగవానుడు "గూఢవాక్యార్థజ్ఞాపనక్షమః" అనబడతాడు.

*"దాక్షాయణాః సంశృణుత గదతో నిగమం మమ...." నుంచి "..... నాద్యాపి తే నివర్తన్తే పశ్చిమా యామినీరివ" వరకు* [భాగ 6-5 - (30-33)].

**గూఢార్థజ్ఞాపనః సర్వమోక్షానందప్రతిష్ఠితః ।**
**పుష్టిప్రరోహహేతుశ్చ దాసైకజ్ఞానహృద్గతః ॥ 91**

### 431. గూఢార్థజ్ఞాపనః :

నారదుని ఉపదేశము పొంది హర్యశ్వాదులు సృష్టికార్యము చేయమన్న తన ఆదేశము తిరస్కరించి మోక్షమార్గము స్వీకరించారని దక్షుడు తెలుసుకొన్నాడు. నారదుని ఉపదేశమువలన అట్లు జరిగినదన్న రహస్యము తెలుసుకొనే సామర్థ్యము దక్షునకు ఇచ్చిన భగవానుడు గూఢార్థజ్ఞాపనుడు.

*"ఏతస్మిన్ కాల ఉత్పాతాన్....." (భాగ 6-5-34).*

### 432. సర్వమోక్షానందప్రతిష్ఠితః :

1. హర్యశ్వాదులందరిలో మోక్షరూపఆనందము ప్రతిష్ఠింపబడ్డది. ఇట్టి మోక్షానందము వారందరిలో కలుగ చేసిన భగవానుడు, సర్వమోక్షానంద ప్రతిష్ఠితుడు.

2. హర్యశ్వాదులందరికి మోక్షానందము కలుగుటచేత నారదునియందు కూడా మోక్షానందము ప్రతిష్ఠితమైనది. ఇట్టి మోక్షానందము ఎవరి దయవలన వారందరికి కలిగినదో ఆ భగవానుడు సర్వమోక్షానందప్రతిష్ఠితుడు.

### 433. పుష్టిప్రరోహహేతుః (చ) :

ప్రరోహ లేక ప్రరోహణ అంటే బీజము మొలకెత్తుట, పెరుగుట. పుష్టి ప్రరోహణమంటే పుష్టిమార్గముకొరకు సృష్టి. హర్యశ్వాదులు మోక్షమార్గములో



ప్రతిష్ఠింపబడ్డ తరువాత బ్రహ్మదేవుని ఆదేశానుసారము దక్షునకు అరవైమంది ఆడపిల్లలు కలిగిరి. ఈ విధముగా పుష్టిమార్గీయ సృష్టికి కారణభూతుడైన భగవానుడు.

"తతః ప్రాచేతసోఽసిక్న్యామనునీతః స్వయంభువా...." (భాగ 6-6-1).

### 434. దాసైకజ్ఞానహృద్గతః :

దాసులంటే భక్తులు. వారి అనుభవజ్ఞానములో తెలుసుకోబడ్డది జ్ఞాతము. భక్తుల హృదయములందు మాత్రమే తెలుసుకోబడే భగవానుడు, దాసైకజ్ఞాన హృద్గతుడు. భగవద్భక్తులకు హృద్గతజ్ఞానసహితభక్తి కలిగించుట భగవదిచ్ఛ, భగవత్కృప. హర్యశ్వాదులకు నారదుడు గూఢ ఉపదేశమిచ్చుట, వారికి జ్ఞాన- సహితభక్తి కలుగుట భగవదిచ్ఛయే.

**శాంతికర్తా సుహితకృత్ స్త్రీప్రసూః సర్వకామధుక్ ।**
**పుష్టివంశప్రణేతా చ విశ్వరూపేష్టదేవతా ॥ 92**

### 435. శాన్తికర్తా :

హర్యశ్వ శబలాశ్వులు సృష్టికార్యము విడిచిపెట్టి మోక్షమార్గము అనుసరించారని దక్షుడు దుఃఖించుచూఉండగా, అతనికి శాంతి కలిగించుటకు బ్రహ్మదేవునిచే సాంత్వన వాక్యములు చెప్పించి దక్షుని దుఃఖము శాంతింపజేసిన భగవానుడు, శాంతికర్త.

*"తతః ప్రాచేతసోఽసిక్న్యామనునీతః....." (భాగ 6-6-1).*

### 436. సుహితకృత్ :

దక్షునిచే అరవైమంది పుత్రికలను ధర్మాదులకు భార్యలుగా కన్యాదానము చేయించి, అతనికి, అతని సంతానమునకు హితము చేకూర్చిన భగవానుడు "సుహితకృత్".

*"దశ ధర్మాయ కాయేన్దోర్ద్విషట్ త్రిణవ దత్తవాన్..." నుంచి "... విమతేన పరిత్యక్తా గురుణాఽఽఙ్గిరసేన యత్"* [భాగ 6-6 - (2-45)].

**437. స్త్రీప్రసూః :**

"స్త్రీరేవ ప్రసూతవానితి" దక్షుని పుత్రులందరు సంన్యసించిన తరువాత అతనికి అరవైమంది ఆడపిల్లలను మాత్రమే కలుగునట్లు అనుగ్రహించి ఆ పిమ్మట ఆ ఆడపిల్లల ద్వారా వారి వంశవృద్ధి కలుగజేసిన భగవానుడు,

*"స్త్రీ ప్రసూః" (భాగ 6వ స్కంధము 6వ అధ్యాయము).*

**438. సర్వకామధుక్ :**

తన సంతానముయొక్క వంశాభివృద్ధికొరకు దక్షుడు (గృహస్తు) కోరే అన్ని విధములైన విషయభోగవాంఛలు వారికి కలుగజేసిన భగవానుడు, "సర్వకామధుక్".

**439. పుష్టివంశప్రణేతా (చ) :**

పుష్టి అనగా అనుగ్రహము. తన అనుగ్రహము మాత్రముచేతనే దక్షుని వంశము చాలా ఎక్కువగా విస్తరింపజేసిన భగవానుడు, "పుష్టివంశప్రణేతా"

*(భాగ 6 స్కంధం 6 అధ్యాయము).*

**440. విశ్వరూపేష్టదేవతా :**

త్వష్టృప్రజాపతి పుత్రుడైన విశ్వరూపునికి (త్వాష్టునికి) ఇష్టాఇష్ట ఫలము లనిచ్చిన నారాయణరూపుడైన భగవానుడు విశ్వరూపేష్టదేవత.

**కవచాత్మా పాలనాత్మా చ వర్మోపచితికారణమ్ ।**
**విశ్వరూపశిరశ్ఛేదీ త్వాష్ట్రయజ్ఞవినాశకః ॥ 93**

**441. కవచాత్మా :**

నారాయణ కవచరూపమున ఇంద్రుని రక్షించిన విష్ణుభగవానుడు, కవచాత్మ.

**442. పాలనాత్మా (చ) :**

లోకములలో అందరిని దుష్టశక్తులనుంచి రక్షించే భగవానుడు పాలనాత్మ.



**443. వర్మోపచితికారణమ్ :**

'వర్మ' అంటే కవచము. ఇక్కడ నారాయణ కవచము అని అర్థము. 'ఉపచితి' అంటే కవచ ప్రభావము విస్తారముగా చెప్పుట. నారాయణ కవచ ప్రభావముచేత ఇంద్రుడు, ఇతర దేవతలు రక్షింపబడ్డారు. ఈ విధముగా నారాయణ కవచము చేత ఇంద్రాదులు రక్షింపబడుటకు కారణమైన భగవానుడు "వర్మోపచితికారణమ్".

**444. విశ్వరూపశిరశ్ఛేదీ :**

విశ్వరూపుని శిరస్సులు ఇంద్రుడు ఖండించాడు. ఆ ఇంద్రుని రూపములో విశ్వరూపుని శిరములు ఖండించిన భగవానుడు.

*"దేవానామస్మి వాసవః" (గీత 10-22).*

బ్రాహ్మణుని శిరశ్ఛేదము చేయకూడ నప్పటికి ఇది మర్యాదాభిన్నముగా జరిగిన భగవల్లీల.

**445. త్వాష్ట్రయజ్ఞవినాశకః :**

విశ్వరూపుడు చంపబడ్డాక ఇంద్రుని వధించుటకు విశ్వరూపుని తండ్రి త్వష్ట యజ్ఞము చేసాడు. ఇంద్రుని రక్షించుటకొరకు ఆ యజ్ఞము పూర్తి కాకుండా నాశనముచేసిన భగవానుడు త్వాష్ట్రయజ్ఞవినాశకుడు.

**వృత్రస్వామీ వృత్రగమ్యో వృత్రవ్రతపరాయణః ।**
**వృత్రకీర్తిర్వృత్రమోక్షో మఘవత్ప్రాణరక్షకః ॥ 94**

**446. వృత్రస్వామీ :**

వృత్రాసురుని దేహమునకు ప్రభువు.

*"తస్మాద్విష్ణుం మత్వా భజతి." (శ్రుతి).*

**447. వృత్రగమ్యః :**

1. "వృత్రస్య గమ్యః శరణగమనయోగ్యః తేన జ్ఞాతుం యోగ్య ఇతి వా"

భక్తుడైన వృత్రుడు శరణు పొందదగిన (పొందుటకు యోగ్యుడైన) భగవానుడు, వృత్రగమ్యుడు.

2. భగవానుడే శరణు పొందదగినవాడని వృత్రుడు తెలుసుకొనునట్లు చేసిన భగవానుడు వృత్రగమ్యుడు.

**448. వృత్రవ్రతపరాయణః :**

1. వృత్రుడు దేవతల చేతగాని, దేవతల ఆయుధములచేతగాని మరణము లేని వరము కలవాడు. అతని వరప్రసాదభంగముకాకుండా రక్షించుట భగవానుని వ్రతము. అందుచేత వృత్రవ్రతపరాయణుడు అయిన భగవానుడు.

2. వృత్రుని వ్రతము అతని భగవద్భక్తి. (వ్రతం = భక్తి) వృత్రుని భక్తిపరాయణుడైన భగవానుడు వృత్రవ్రతపరాయణుడు.

**449. వృత్రకీర్తిః :**

వృత్రుని కీర్తి, శక్తి, వీరత్వము, భగవద్భక్తి మొదలైన సద్గుణములు ఇంద్రాదులు కూడా పొగిడారు. శత్రువుచేతకూడా పొగడబడే కీర్తి వృత్రునిది. అతనికి అట్టి కీర్తి ప్రసాదించిన భగవానుడు.

**450. వృత్రమోక్షః :**

వృత్రునికి అసురదేహమునుండి ముక్తి ప్రసాదించిన భగవానుడు.

*"కిం వ ఉచ్చరితైర్మాతుర్ధావద్భిః పృష్ఠతో హతైః....."* నుంచి *"..... త్వన్మాయయాఽఽ త్మాత్మజదారగేహేష్వాసక్త చిత్తస్య న నాథ భూయాత్"* వరకు

[*భాగ 6-11 - (4-27)*]



**451. మఘవత్ప్రాణరక్షకః :**

ఇంద్రుని ప్రాణరక్షణకై ఉపాయము ఉపదేశించిన భగవానుడు మఘవత్ప్రాణరక్షకుడు.

**అశ్వమేధహవిర్భోక్తా దేవేంద్రామీవనాశకః ।**
**సంసారమోచకశ్చిత్రకేతుబోధనతత్పరః ॥ 95**

**452. అశ్వమేధహవిర్భోక్తా :**

ఇంద్రుడు చేసిన అశ్వమేధములో హవిస్సును స్వీకరించిన భగవానుడు *అశ్వమేధహవిర్భోక్త ॥ "హయమేధేన పురుషం పరమాత్మానమీశ్వరం...." నుంచి "....నలిప్యసే కిం ఖలనిగ్రహేణ" వరకు* [*భాగ 6-13 - (7-9)*]

**453. దేవేంద్రామీవనాశకః :**

వృత్రాసురుని చంపుటవలన ఇంద్రునకు కలిగిన బ్రహ్మహత్యాదోష రూప రోగమును నాశనముచేసిన భగవానుడు. ఇంద్రుని అశ్వమేధయజ్ఞములో హవిస్సు స్వయముగా స్వీకరించి యజ్ఞఫలితముగా బ్రహ్మహత్యా దోషనివారణ కలిగించిన భగవానుడు.

*"స వాజిమేధేన యథోది తేన ......"* *(భాగ 6-13-21).*

**454. సంసారమోచకః :**

ప్రత్యక్షముగా హవిస్సు స్వీకరించి సంసారమునందు ఇంద్రుడు చేసిన బ్రహ్మహత్యాది సర్వపాపములను పోగొట్టిన భగవంతుడు, సంసారమోచకుడు.

**455. చిత్రకేతుబోధనతత్పరః :**

పుత్రశోకముతో దుఃఖించుచున్న చిత్రకేతునకు అంగిరస, నారద మహర్షులచేత తత్త్వబోధ చేయించి శాంతి కలిగించి రక్షించిన భగవానుడు. చిత్రకేతుబోధనతత్పరుడు. "విలపంత్యా మృతం పుత్రమితి ....." నుంచి "మునిరాజ గామసనారదః"

[*భాగ 6-14- (59, 61*].

"ఊచతుర్మృత కోపాన్తే పతితం.." నుంచి ".. యథా వస్తుని కల్పితః" వరకు
[భాగ 6-15-(1-8)].

**మంత్రసిద్ధిః సిద్ధిహేతుః సుసిద్ధిఫలదాయకః ।**
**మహాదేవతిరస్కర్తా భక్త్యై పూర్వార్థనాశకః ॥ 96**

## 456. మంత్రసిద్ధిః :

1. నారదునిచే చిత్రకేతునికి మంత్రోపదేశము చేయించి అతనికి మంత్ర సిద్ధి కలిగించిన భగవానుడు.

2. మంత్ర-సిద్ధి రూపుడైన భగవానుడు.

*"ఓం నమస్తుభ్యం భగవతే వాసుదేవాయ ధీమహి...." నుంచి ".... ప్రహృష్టరోమానమదాదిపూరుషం" వరకు [భాగ 6-16 - (18-31)].*

## 457. సిద్ధిహేతుః :

సిద్ధి అనగా శోకము లేకుండుట (సిద్ధిర్విశోకత్వం). ఇట్టి సిద్ధిని కలిగించుటకు కారణభూతుడైన భగవానుడు, సిద్ధిహేతువు.

## 458. సుసిద్ధిఫలదాయకః :

చిత్రకేతునికి బ్రహ్మప్రాప్తి అనే అనుభవము కలిగించుట సుసిద్ధి. ఈ ఫలమును ప్రసాదించిన భగవానుడు సుసిద్ధిఫలదాయకుడు.

*"..... సంసిద్ధోఽసి తయా రాజన్ విద్యయా దర్శనాచ్చ మే" నుంచి "... జ్ఞాన విజ్ఞానసంపన్నో ధారయన్నాశు సిధ్యసి" వరకు [భాగ 6-16 - (50-64)]*

## 459. మహాదేవతిరస్కర్తా :

నిండుసభలో పార్వతీదేవితో కూడిఉన్న శంకర భగవానుని నిందించిన దోషమునకు శిక్షగా పార్వతీదేవి చిత్రకేతుని అసురునిగా పుట్టమని శపించింది. దేవుని నిందించినందుకు శిక్ష విధింపజేసిన భగవానుడు.

"ఏ కదా స విమానేన విష్ణుదత్తేన భాస్వతా...." నుంచి ".... సంభావితమతిః స్తబ్ధః సాధుభిః పర్యుపాసితం" వరకు [భాగ 6-17 - (4 -14)].



## 460. భక్త్యై పూర్వార్థనాశకః :

సంపదలు వదులుకున్నప్పుడే ఆ సంపదలవల్లకలిగే గర్వము పోయి భక్తి స్థిరమవుతుంది. మహాభక్తుడైన చిత్రకేతునికి భగవద్భక్తి వృద్ధిచెంది స్థిరపడుటకు సంపదలు అంతరాయమని అతనికిగల విద్యాధరీ సంపత్తిని లేకుండాచేసి అసురజన్మనిప్పించిన భగవానుడు "భక్త్యై పూర్వార్థనాశకుడు."

**దేవబ్రాహ్మణవిద్వేషవైముఖ్యజ్ఞాపకః శివః ।**
**ఆదిత్యో దైత్యరాజశ్చ మహత్పతిరచింత్యకృత్ ॥ 97**

## 461. దేవబ్రాహ్మణవిద్వేషవైముఖ్యజ్ఞాపకః :

దేవతలపట్ల బ్రాహ్మణులపట్ల ద్వేషము, వారియందు విముఖత, భగవద్భక్తికి ప్రతికూలము. ఇట్టి ద్వేషము కలిగిన చిత్రకేతుడు శివుని తిరస్కరించాడు. ఇట్టి అవగుణము ఉండరాదని చిత్రకేతుని ద్వారా లోకమునకు గుర్తుచేయవలెనని పార్వతీదేవి శాపరూపములో చిత్రకేతుని అనుగ్రహించిన భగవానుడు.

## 462. శివః :

సర్వమంగళ స్వరూపుడు, నిర్మలుడు, నిర్వికారుడు, శాంతుడు అయిన శివభగవానుడు.

*"శాశ్వతం శివమచ్యుతం" (శ్రుతి)*

## 463. ఆదిత్యః :

సవితుని పుత్రుడైన ఆదిత్యుని రూపములోనున్న భగవానుడు.

## 464. దైత్యరాజః (చ) :

1. ప్రహ్లాదాది దైత్యులందు వారి పుత్రులందు ప్రకాశించే భగవానుడు లేక ప్రహ్లాదాది దైత్యులను వారిపుత్రులను ప్రకాశింప చేసే భగవానుడు దైత్యరాజు.

2. ప్రహ్లాదాది దైత్యరాజుల రూపములోనున్న భగవానుడు, దైత్యరాజు.

*"అథ కశ్యప దాయాదాన్ దైతేయాన్...." (భాగ 6-18-10).*

**465. మహత్పతిః :**

ప్రహ్లాదుడు, బలి మొదలగు మహాత్ములైన దైత్యరాజులకు కూడా ప్రభువు లేక శాసకుడు అయిన భగవానుడు మహత్పతి.

**466. అచిన్త్యకృత్ :**

ఆలోచనలకు అతీతమైన సామర్థ్యముతో పనులుచేసే భగవానుడు లేక ఆలోచనలచే తెలుసుకోలేని పనులు చేయగల భగవానుడు "అచిన్త్యకృత్".

**మరుతాం భేదకస్త్రాతా వ్రతాత్మా పుంప్రసూతికృత్ ।**
**.................................................. ॥ 98**

**467. మరుతాంభేదకః :**

దితి గర్భస్థశిశువును ఇంద్రుడు ముక్కలుగా చేసి ప్రాణములుతీయ ప్రయత్నించగా భగవానుడు ఆ నలభైతొమ్మిది (49) ముక్కలకు ప్రాణము పోసి నలభైతొమ్మది మరుత్తులు (మరుద్గణము)గా జీవింపజేసాడు. గర్భస్థశిశువును ముక్కలుగా చేయించి తిరిగి వారికి ప్రాణములు పోసిన భగవానుడు మరుతాం భేదకుడు.

*"హతపుత్రా దితిః శక్రపార్ష్ణిగ్రాహేణ విష్ణునా" (భాగ 6-18-23).*

**468. త్రాతా :**

దితిగర్భములో నున్న శిశువును చంపాలని ఇంద్రుడు నలభైతొమ్మిది (49) ముక్కలు చేయగా వాటిని రక్షించి మరుద్గణముగా జన్మింపజేసిన భగవానుడు.

"త్రాతా" "న మమార దితేర్గర్భః శ్రీనివాసానుకంపయా..." (భాగ 6-18-65).

**469. వ్రతాత్మా :**

1. పుంసవనమనే వ్రతరూపము గల పరమాత్మ- వ్రతాత్మా.



2. దితిచేత పుంసవనమనే వ్రతమాచరింపజేసిన భగవానుడు "వ్రతాత్మా"

*(భాగ 6వ స్కంధం 19 అధ్యాయము).*

**470. పుంప్రసూతికృత్ :**

నియమానుసారము పుంసవనవ్రతము చేయుటవలన అనుగ్రహించి ఆ వ్రతములోచెప్పబడ్డ లక్షణములుగల పురుష సంతానము కలుగజేసిన భగవానుడు. "పుంప్రసూతికృత్" అనబడతాడు.

ఇంతవరకు షష్ఠస్కంధ నామములు.

"ఉద్ధారానర్హ గోప్తాత్మా" అనే నామము (షష్ఠస్కంధము, 410వ నామము, 86వ శ్లోకము) క్రింద నృసింహపురాణము, నవమాధ్యాయము నుండి ఉల్లేఖింప బడిన మార్కండేయ మృత్యుప్రసంగములో యముడు నరకస్థులకు చేసిన బోధ.

వ్యాస ఉవాచ :

**ఇత్యేవం కింకరానుక్త్వా మృత్యుం చ పురతః స్థితం ।**
**యమో నిరీక్ష్య చ జనం నరకస్థం ప్రపీడితమ్ ॥ 1**

**కృపయా పరయా యుక్తో విష్ణుభక్త్యా విశేషతః ।**
**జనస్యానుగ్రహార్థాయ తేనోక్తా వాగిమాం శృణు ॥ 2**

**నరకే పచ్యమానస్తు యమేన పరిభాషితః ।**
**కిం త్వయా నార్చితో దేవః కేశవః క్లేశనాశనః ॥ 3**

**ఉదకేనాప్యలాభే తు ద్రవ్యాణాం పూజితః ప్రభుః ।**
**యో దదాతి స్వకం లోకం స త్వయా కిం న పూజితః ॥ 4**

**నారసింహో ఋషీకేశః పుండరీకనిభేక్షణః ।**
**స్మరణాన్ముక్తదో నృణాం స త్వయా కిం న పూజితః ॥ 5**

ఇత్యుక్త్వా నారకాన్ సర్వాన్ పునరాహ స కింకరాన్ ।
వైవస్వతో యమః సాక్షాద్విష్ణుభక్తివిజృంభితః ॥ 6

నారదాయ స విశ్వాత్మా ప్రాహేదం విష్ణురవ్యయః ।
అన్యేభ్యో వైష్ణవేభ్యశ్చ సిద్ధేభ్యశ్చేతి నః శ్రుతం ॥ 7

తద్వః ప్రీత్యా ప్రవక్ష్యామి హరివాక్యమనుత్తమమ్ ।
శిక్షార్థం కింకరాః సర్వే శ్రుణుత ప్రయతో హరేః ॥ 8

కృష్ణ కృష్ణేతి కృష్ణేతి యో మాం స్మరతి నిత్యశః ।
జలం భిత్త్వా యథా పద్మం నరకాదుద్ధరామ్యహమ్ ॥ 9

పుండరీకాక్ష దేవేశ నరసింహ త్రివిక్రమ ।
త్వామహం శరణం ప్రాప్త ఇతి యస్తం సముద్ధరేత్ ॥ 10

త్వాం ప్రపన్నోఽస్మి శరణం దేవదేవ జనార్దన ।
ఇతి యః శరణం ప్రాప్తస్తం క్లేశాదుద్ధరామ్యహం ॥ 11

*వ్యాస ఉవాచ :*

ఇత్యుదీరితమాకర్ణ్య హరివాక్యం యమేన తు ।
నారకాః కృష్ణ కృష్ణేతి నారసింహేతి చుక్రుశుః ॥ 12

యథా యథా హరేర్నామ కీర్తయంత్యత్ర నారకాః ।
తథా తథా హరౌ భక్తిముద్వహన్తో బ్రువన్నిదం ॥ 13

*నారకా ఊచుః :*

ఓం నమో భగవతే వాసుదేవాయ కేశవాయ మహాత్మనే ।
భక్తప్రియాయ దేవాయ యజ్ఞాయ హరయే నమః 14

లోకనాథాయ శాన్తాయ యజ్ఞేశాయాదిమూర్తయే ।
అనంతాయాప్రమేయాయ నారసింహాయ తే నమః ॥ 15



నారాయణాయ గురవే శంఖచక్రగదాభృతే ।
వేదప్రియాయ మహతే త్రివిక్రమ నమో నమః ॥ 16

వారాహాయాప్రతర్క్యాయ వేదాంగాయ గదాభృతే ।
మహాద్యుతిమతే నిత్యం బ్రహ్మణ్యాయ నమో నమః ॥ 17

వామనాయ బహుజ్ఞాయ వేదవేదాంగధారిణే ।
బలిబంధనదక్షాయ వేదపాలాయ తే నమః ॥ 18

విష్ణవే సురనాథాయ వ్యాపినే పరమాత్మనే ।
చతుర్భుజాయ శుద్ధాయ శుద్ధదృశ్యాయ తే నమః ॥ 19

జామదగ్న్యాయ రామాయ దుష్టక్షత్రాంతకాయ చ ।
రామాయ రావణాంతాయ సమస్తుభ్యం మహాత్మనే ॥ 20

అస్మాత్ సుదుఃసహాత్ కృష్ణ నారసింహ జనార్దన ।
అస్మానుద్ధర గోవింద పూజితస్త్వం నమోస్తు తే ॥ 21

*వ్యాస ఉవాచ :*

ఇతి సంకీర్తితో విష్ణుర్నారకైర్భక్తిపూర్వకం ।
నారకీయాతనాః సర్వాస్తేషాం నష్టా మహాత్మనాం ॥ 22

దివ్యరూపధరాః సర్వేః దివ్యవస్త్రవిభూషితాః ।
దివ్యగన్ధానులిప్తాంగా దివ్యాభరణభూషితాః ॥ 23

నానారూప విమానేషు దివ్యేషు హరిపూరుషైః ।
విష్ణులోకం యమోగత్వా నమశ్చక్రే తదా హరిం ॥ 24

యన్నామకీర్తనాద్యాతా నారకాః కేశవాలయం ।
తం నమామి మహాదేవం నారసింహం మహద్గురుం ॥ 25

తస్య వై నారసింహస్య విష్ణోరమితతేజసః ।
ప్రణామం యే చ కుర్వన్తి తేషామపి నమో నమః ॥ 26

దృష్ట్వా ప్రశాంతం నరకాగ్నిముగ్రం యంత్రాది సర్వం విపరీతమత్ర।
పునః స శిక్షార్థమథాత్మదూతాన్ యమో హి వక్తుం కృతవాన్ మనశ్చ॥ 27

వ్యాస ఉవాచ :

స్వపురుషమభివీక్ష్య పాశహస్తం వదతి యమః కిల తస్య కర్ణమూలే।
పరిహర మధుసూదన ప్రపన్నాన్ ప్రభురహమన్యనృణాం న వైష్ణవానాం॥ 28

అహమమరగణార్చితేన ధాత్రా యమ ఇతి లోకహితాయ వై నియుక్తః ।
హరిగురువిముఖాన్ ప్రశాస్మి మర్త్యాన్ హరిచరణప్రణతాన్
నమస్కరోమి ॥ 29

సుగతిమభిలషామి వాసుదేవాదహమపి భాగవతః స్థిరాంతరాత్మా ।
మధుమథనవశోఽస్మి న స్వతంత్రః ప్రభవతి సంయమనే
మమాపి కృష్ణః ॥ 30

భగవతి విముఖస్య నాస్తి సిద్ధిర్విషమమృతం భవతీతి నైతదస్తి ।
వర్షశతమపీహ ధమ్యమానం వ్రజతి న కాంచనతామయః కదాచిత్॥

నహి శశకలుషచ్ఛవిః కదాచిత్తిమిరపరాభవతాముపైతి చంద్రః ।
భగవతి చ హరావనన్యచేతా భృశమలినోపి విరాజతే మనుష్యః ॥32

విషధరకణభక్ష శంకరోక్తిర్దశబలపంచశిఖాక్షపాదవాదాత్ ।
అహమపి సువిచార్య లోకతంత్రం భగవదుపాస్తి మృతే న సిద్ధిరస్తు॥ 33

సురపతిరసురైః సదాభియుక్తః పశుపతిరప్యవినీతభృత్యవర్గః ।
సురగురుర దృఢ ప్రసాదకర్తా హరిచరణౌ మరణాపవర్గ హేతూ॥34

శుభమిదముపలభ్య మానుషత్వం
సుకృతవశేన వృథేంద్రియార్థహేతోః ।



రమయతి కురుతే న మోక్షమార్గం స దహతి
చందనమేవ భస్మహేతోః ॥ 35

ముకులితకరకుడ్మలైః సురేంద్రైః
సతతనమస్కృతపాదపంకజాయ ।
అవిహితగతయే సనాతనాయ
ప్రథమజగత్పతయే నమోఽస్త్వజాయ॥ 36

ఇతి ఘోషయతే యమః స్వదుందుభీన్
గమయతి సర్వదిశాసు యుగ్మతాడితాః ।
యమదూతా బహవశ్చిత్రగుప్త శ్రుణు
ఇత్థం పరిహర విష్ణు భక్తాన్ ॥ 37

యమాష్టకమిదం పుణ్యం పఠతే యః శ్రుణోతిచ ।
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి ॥ 38

ఇదం స్వముక్తం యమవాక్యముత్తమం
యథాధునా తే హరిభక్తికీర్తనం ।
పునశ్చవక్ష్యామి పురాతనీం కథాం
భృగోశ్చ పౌత్రేణ చ యా కృతా పురా ॥ 39

ఇతి నృసింహపురాణే నవమోధ్యాయః ।

# శ్రీమద్భాగవత సప్తమస్కంధ నామములు

*ఊతిలీలా నామములు (471-537)*

*శ్లోక సంఖ్య (98-110)*

**.......................................... ।**
**కర్మాత్మా వాసనాత్మా చ ఊతిలీలాపరాయణః ॥ 98**

## 471. కర్మాత్మా :

జీవుడు ఇంతకు ముందు చేసినది ప్రాకృతం లేక కర్మ. ఆ కర్మరూపము పొందిన ఆత్మ కర్మాత్మ.

## 472. వాసనాత్మా (చ) :

"వస్తేః సర్వం వాసయతీతి వాసనః" పూర్వము చేయబడిన సకల కర్మల యొక్క సంస్కారరూపములో ఉన్నది వాసన. అట్టి వాసనలు స్వరూపముగా గలజీవి వాసనాత్మ.

## 473. ఊతిలీలాపరాయణః :

"ఊతయః" అంటే కర్మ వాసనలు. జీవులకు కర్మ వాసనలు కలిగించి వారిచే తదనుగుణ కర్మలుచేయించు పరమఉత్కృష్ట స్థానముగల భగవానుడు ఊతిలీలాపరాయణుడు.

**సమదైత్యసురః స్వాత్మా వైషమ్యజ్ఞానసంశ్రయః ।**
**దేహాద్యుపాధిరహితః సర్వజ్ఞః సర్వహేతువిద్ ॥ 99**

## 474. సమదైత్యసురః :

దైత్యులను, సురులను సమానముగా చూచే భగవానుడు అని అర్థము.

*"సమః ప్రియః సుహృద్ బ్రహ్మన్ భూతానాం భగవాన్ స్వయం" నుంచి ".... తమసో యక్షరక్షాంసి తత్కాలానుగుణోఽభజత్" వరకు [భాగ 7-1 - (1-8)].*



## 475. స్వాత్మా :

1. అందరియందు తన ఆత్మనే చూచే భగవానుడు "స్వాత్మా."

2. అందరిని తనతో సమానముగా (తనకంటే వేరు కాదని) భావించి చూచే భగవానుడు.

3. తన భక్తుల హృదయములలో ఆత్మరూపముగాఉండి ఆనందించే లేక ఆనందింపజేసే భగవానుడు.

## 476. వైషమ్యజ్ఞానసంశ్రయః :

1. దేవతలను రక్షించుటకు, అసురులను శిక్షించుటకు భగవానుడు సమర్థుడైనప్పటికి దేవాసురులకుగల పరస్పర వైషమ్యమునుగూర్చిన జ్ఞానము పరిపూర్ణముగా తెలిసినవాడు గనుక తాను వైషమ్యభావము ఎవరియందు లేకుండా ఫలితములనిస్తాడు. అందుచే భగవానుడు వైషమ్యజ్ఞానసంశ్రయుడు.

2. పరస్పర వైషమ్య భావములుగల దేవాసురులకు సమభావముతో రక్షణ కల్పించే భగవానుడు.

*"సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః" (గీత 9-29).*

## 477. దేహాద్యుపాధిరహితః :

అహంకారము మొదలు పంచభూతాత్మక దేహము వరకు ఉన్న ఉపాధులన్నిటికి భగవంతుడే ఉపాధి. భగవానునికి స్వయముగా దేహాది ఉపాధులు లేవు కనుక దేహాద్యుపాధిరహితుడు భగవానుడు.

## 478. సర్వజ్ఞః :

సర్వము తెలిసిన భగవానుడు సర్వజ్ఞుడు. నారదాది భక్తులకు, జ్ఞానులకు కూడా అట్టి సర్వజ్ఞత్వము కలిగించిన భగవానుడు సర్వజ్ఞుడు.

## 479. సర్వహేతువిద్ :

జీవుల సర్వకామాదులకు హేతుభూతమై, వాటన్నిటికి కారణములు సహితము తెలిసిన భగవానుడు, సర్వహేతువిద్.

కామాదులకు హేతుభూతమై, ఆ కామాదుల చేత కూడా పొంద సాధ్యమైన భగవానుడు, సర్వహేతువిదుడు.

"కామాద్ ద్వేషాద్ భయాత్ స్నేహాత్ యథాభక్త్యేశ్వరే మనః । ఆవేశ్య తదఘం హిత్వా బహవస్తద్గతిం గతాః । గోప్యః కామాద్ భయాత్ కంసో ద్వేషాచ్చైద్యాదయో నృపాః । సంబంధాద్ వృష్ణయః స్నేహాద్యూయం భక్త్యా వయం విభో ॥ కతమోఽపి న వేనః స్యాత్ పంచానాం పురుషం ప్రతి । తస్మాత్ కేనాప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్॥ మాతృష్వసేయో వశ్చైద్యో దంతవక్త్రశ్చ పాండవ । పార్షదప్రవరౌ విష్ణోర్విప్రశాపాత్ పదాచ్యుతౌ ॥" (యుధిష్ఠిర నారద సంవాదము) [భాగ 7-1 - (29-32)].

**బ్రహ్మవాక్స్థాపనపరః స్వజన్మావధికార్యకృత్ ।**
**సదసద్వాసనాహేతుస్త్రిసత్యో భక్తమోచకః ॥ 100**

## 480. బ్రహ్మవాక్స్థాపనపరః :

తన భక్తులైన సనకాదిబ్రహ్మర్షుల శాపమును నిజము చేసి దాని ఫలసిద్ధి (కలిగించుటయే) స్థాపనచేయుటయే ప్రయోజనముగా గల భగవానుడు బ్రహ్మవాక్స్థాపనపరుడు.

*"రజస్తమోభ్యాం రహితే పాదమూలే మధుద్విషః । పాపిష్ఠామాసురీం యోనిం బాలిశౌ యాతమాశ్వతః ॥ " (భాగ 7-1-37).*

## 481. స్వజన్మావధికార్యకృత్ :

అవధి అంటే హద్దు (చివర). వరాహ, నృసింహ, వామన, రామ కృష్ణాది రూపములతో తానవతరించుట, ఆ అవతారములలో తాను చేయవలసిన పనులు పూర్తిఅయ్యేవరకు శత్రువులు తన్ను ద్వేషించే బుద్ధి వారిలో ప్రేరేపించుట-మొదలైన పనులు చేయించుట, లేక చేసే, భగవానుడు "స్వజన్మావదికార్యకృత్."

## 482. సదసద్వాసనాహేతుః :

భక్తులనుద్ధరించుటకై వారిలో సత్, అసత్ (సదసత్) అనే రెండు విధములైన వాసనలు కలిగించుటకు కారణభూతుడైన భగవానుడు. హిరణ్యకశిపునకు అసద్ వాసనలు కలిగించి భగవానుని శత్రువుగా భావించేటట్లు చేసిన భగవానుడు.

"భ్రాతర్యేవం వినిహతే హరిణా...." నుంచి "... క్రియతామాశు మా చిరమ్" వరకు [భాగ 7-2 - (1-5)].



## 483. త్రిసత్యః :

1. సనకాదుల (బ్రాహ్మణ) వచనము ముమ్మారు నిజము చేయడానికి, జయ విజయులు ముమ్మారు దైత్యులుగా పుట్టునట్లు, మూడు అవతారములెత్తి వారిని వధించి తిరిగి స్వర్గము చేర్చడానికి, కారణమైన సత్యస్వరూపుడు భగవానుడు "త్రిసత్యః" అని తెలుసుకొనవలెను.

2. "త్రిసత్యం" పదవ్యాఖ్యానములో చెప్పిన విధముగా నున్న భగవానుడు. "సత్యవ్రతం సత్యపరం త్రిసత్యం...." (భాగ 10-2-26).

## 484. భక్తమోచకః :

జయవిజయులు భగవద్భక్తులు. వైకుంఠములో ఉండగల అధికారము కలవారు. ఆ భక్తులు శాపగ్రస్తులైరి. వారి శాపవిమోచనము కలిగించుటకు మూడు అవతారములెత్తిన భగవానుడు, భక్తమోచకుడు.

**హిరణ్యకశిపుద్వేషీ ప్రవిష్టాత్మాఽతిభీషణః ।**
**శాంతిజ్ఞానాదిహేతుశ్చ ప్రహ్లాదోత్పత్తికారణమ్ ॥ 101**

## 485. హిరణ్యకశిపుద్వేషీ :

హిరణ్యకశిపుడు విష్ణుద్వేషి. అట్టి ద్వేషభావములు అతనిలో కలుగుటకు కారణమైన భగవానుడు హిరణ్యకశిపుద్వేషీ.

## 486. ప్రవిష్టాత్మా :

1. హిరణ్యకశిపుని బుద్ధిలో విష్ణువు విషయమై ద్వేషరూపము కలదు. అతని బుద్ధిలో ఆ రూపములోనున్న భగవానుడు ప్రతిష్టాత్మ.

2. అంతర్యామి ఆగుట చేత ఎల్లవేళల హిరణ్యకశిపుని హృదయములో స్థిరముగా ఉండి తనకంటె అన్యధారణలేవీ లేనట్లు చేసిన భగవానుడు ప్రవిష్టాత్మ.

*"అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం..."* *(శ్రుతి).*

### 487. అతిభీషణః :

తన తమ్ముడు హిరణ్యాక్షుని భగవానుడు చంపాడన్న కారణము వలన, తన్ను కూడా విష్ణువు చంపవచ్చునన్న అత్యంత భయము హిరణ్యకశిపునకు కలిగించిన భగవానుడు అతిభీషణుడు.

### 488. శాన్తిజ్ఞానాదిహేతుః (చ) :

హిరణ్యాక్షవధ వలన కలిగిన శోకము నుండి శాంతి కలిగించాలని హిరణ్యకశిపుని చేత అతని తల్లికి హిరణ్యాక్షుని భార్యకు, పిల్లలకు, జ్ఞానవాక్యములు చెప్పించిన భగవానుడు శాన్తిజ్ఞానాదిహేతువు.

*"అంబాంబ హే వధూ । పుత్రా వీరం మార్హథశోచితుం......" నుంచి "...... స్వపరాభినివేశేన వినాజ్ఞానేన దేహినాం"* [*భాగ 7-2 - (20-60)*].

### 489. ప్రహ్లాదోత్పత్తికారణం :

1. ప్రహ్లాదుడు పుట్టడానికి కారణభూతుడైన భగవానుడు.

2. భక్తోద్ధారణ భగవంతుని అవతారముఖ్యోద్దేశము. నృసింహావతారము హిరణ్యకశిపుని చంపుటకేకాక భక్తుడైన ప్రహ్లాదుని భక్తియొక్క గొప్పదనము తెలుపుట, ప్రహ్లాదుని ఉద్ధరించుట, అనే కార్యసిద్ధికి ప్రహ్లాదోత్పత్తి అవసరము. అందుకు భగవానుడు కారణము.

**దైత్యసిద్ధాంతసద్వక్తా తపఃసార ఉదారధీః ।**
**దైత్యహేతుప్రకటనో భక్తిచిహ్నప్రకాశకః ॥** **102**



### 490. దైత్యసిద్ధాన్తసద్వక్తా :

దైత్యుడైన ప్రహ్లాదుని ద్వారా పరమభక్తి సిద్ధాంత స్థాపన చేయించిన భగవానుడు "దైత్యసిద్ధాంతసద్వక్తా."

*"తత్సాధు మన్యేఽసుర వర్య దేహినాం..."* *(భాగ 7-5-5).*

### 491. తపఃసారః :

"తపో భజన రూపం, తదేవ సారం యస్యేతి" ఇక్కడ తపస్సు అనగా భజనరూప భక్తి. ఆ భక్తియే తపస్సుయొక్క సారము. అట్టి తపస్సారమైన భక్తియే స్వరూపముగాగల భగవానుడు.

### 492. ఉదారధీః :

"ఉదారధీః" అంటే నిర్మలమైన బుద్ధి. అట్టి నిర్మలమైన భక్తిగల బుద్ధిని ప్రహ్లాదునికి ప్రసాదించిన భగవానుడు "ఉదారధీః"

### 493. దైత్యహేతుప్రకటనః :

1. దైత్యుడైన ప్రహ్లాదునికి భగవద్భక్తి తప్ప వేరే ఏదీ అక్కర లేదు అనే బుద్ధిని ప్రసాదించి, అట్లు ప్రకటింప జేయుటకు కారణుడైన భగవానుడు.

2. ప్రహ్లాదుని విష్ణుభక్తియుతబుద్ధి, అతనికి శత్రువుల సాంగత్యము వలన కలిగినదని హిరణ్యకశిపుడు భావించాడు. అట్టి అసత్యమును సత్యమని హిరణ్యకశిపుడు భావించుటకు, ప్రకటింపజేయుటకు, కారణమైన భగవానుడు. ".. జహాస బుద్ధిర్బాలానాం భిద్యతే పరబుద్ధిభిః" (భాగ 7-5-6).

### 494. భక్తిచిహ్నప్రకాశకః :

భక్తియొక్క లక్షణములు వాని చిహ్నములు (గుర్తులు) ప్రహ్లాదుని యందు ప్రకాశింపజేసిన భగవానుడు భక్తిచిహ్నప్రకాశకుడు.

*"స్వః పరశ్చేత్యసద్గ్రాహః పుంసాం యన్మాయయా కృతః...." (భాగ 7-5-11).*

**సద్వేషహేతుః సద్వేషవాసనాత్మా నిరంతరః ।**
**నైష్ఠుర్యసీమా ప్రహ్లాదవత్సలః సంగదోషహా ॥ 103**

**495. సద్వేషహేతుః :**

సద్వేషమనగా భగవద్వేషము. పైన చెప్పిన భక్తి చిహ్నములు (490, 491, 492, 493, 494 నామములలో చెప్పినవి) సద్భక్తుడైన ప్రహ్లాదునిలో ప్రకాశింపజేసి, అతని తండ్రి హిరణ్యకశిపునకు ప్రహ్లాదుని యందు. భగవంతునియందు ద్వేషము (సద్వేషము) కలిగించుటకు కారణమైన భగవానుడు సద్వేషహేతువు.

**496. సద్వేషవాసనాత్మా :**

జీవులలో సత్ (పరమాత్మ లేక సత్పురుషుల)యందు ద్వేషమును వాసనా రూపములో ఆచ్ఛాదనగా ధరింపజేసే భగవానుడు "సద్వేషవాసనాత్మా"

**497. నిరంతరః :**

"అంతరాతీత్యన్తరః దైత్యేభ్యో నిశ్శేషేణ తథా నిరంతర ఇతి" అంతరమున కతీతమైనది నిరంతరము. వీడు వాడు అనే భేదము లేకుండా (ఏ ఒక్కరిని విడిచిపెట్టకుండా) అందరు దైత్యులలో ఇట్టి సద్వేషవాసనలతోకూడిన బుద్ధి ఎల్లవేళల ఉండేటట్లు చేసే భగవానుడు, నిరంతరుడు.

**498. నైష్ఠుర్యసీమా :**

ఇక్కడ నైష్ఠుర్యమంటే, బాధలు, కష్టాలు, యాతనలు, వీటియొక్క కఠోరత్వము. సీమా అంటే అవధి లేక హద్దు. ప్రహ్లాదుని హిరణ్యకశిపుడు పెట్టిన బాధల కఠోరత్వమునకు హద్దులేదు. భక్తుడైన ప్రహ్లాదుడు వాటినన్నిటినీ సహించాడు (భక్తులు కఠినమైన బాధలను సహిస్తారు. ఓర్చుకుంటారు). ఈ విధముగా భక్తుల సహనశక్తిని ప్రకటింపజేసే భగవానుడు "నైష్ఠుర్యసీమా".

**499. ప్రహ్లాదవత్సలః :**

ప్రహ్లాదునికి ఎప్పుడెప్పుడు ఆపదలు కలిగాయో అప్పుడప్పుడల్లా అతనిని



ఆవు తన దూడ (వత్స)ను ప్రేమతో రక్షించినట్లు ప్రేమించి రక్షించిన భగవానుడు ప్రహ్లాదవత్సలుడు.

**500. సంగదోషహా :**

దైత్యబాలురు వారిబంధువుల, మిత్రుల సాంగత్యమువలన దోషము కలిగి ఉంటారు. భక్తుడైన ప్రహ్లాదుని సహచర్యము, బోధనలవలన వారికి వారి వారి సాంగత్యములలోకలిగిన దోషములుపోయి, భగవంతునియందు ప్రేమ కలిగినట్లుచేసిన భగవానుడు, "సంగదోషహా" అనబడతాడు. మహాభక్తులతో సత్సంగము కలిగినచో సమస్త దుష్టసాంగత్యదోషములు నశిస్తాయి అని భావము.

**మహానుభావః సాకారః సర్వాకారః ప్రమాణభూః ।**
**స్తంభప్రసూతిర్నృహరిర్నృసింహో భీమవిక్రమః ॥ 104**

**501. మహానుభావః :**

1. మహా అంటే ఊహించడానికి సామర్థ్యము లేనంత; అనుభావము అంటే సామర్థ్యము. ఈ సామర్థ్యము కలిగిన ప్రహ్లాదుని రూపములో నున్న భగవానుడు, మహానుభావుడు.

*"ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం"* *(గీత 10-30).*

2. ప్రహ్లాదుని రక్షించుటకు ఎల్లప్పుడు మహా సామర్థ్యము చూపించిన భగవానుడు, మహానుభావుడు.

**502. సాకారః :**

స + ఆకారః = సాకరః - ఆకారః అంటే రూపము. ఏ రూపములో ఆహ్వానముచేస్తే ఆ రూపములోవచ్చి అనుగ్రహించే భగవానుడు సాకారుడు.

*"యస్త్వయా మందభాగ్యోక్తో మదన్యో జగదీశ్వరః......" (భాగ 7-8-13).*

**503. సర్వాకారః :**

1. అన్ని ఆకారములు పొందగల భగవానుడు, సర్వాకారుడు.

2. అన్ని విశేష లక్షణములు కలిసి, అందరికన్న విలక్షణమైన ఆకారము (ఆకారః) కలిగిన నరహరిరూప భగవానుడు, సర్వాకారుడు.

**504. ప్రమాణభూః :**

"ప్రహ్లాద వాక్యస్య ప్రమాణాయ, ప్రమాణ్యాయ భవతి. స్తంభాజ్జాయత ఇతి తథా". భగవంతుడు అంతటా నిండి ఉన్నాడన్న ప్రహ్లాదుని (భక్తుని) మాటలు ఋజువు చేయటకు స్తంభములోనుండి నృసింహరూపములో ఆవిర్భవించి భక్త వాక్యములే ప్రమాణమని చూపించే భగవానుడు "ప్రమాణభూః"

ప్రమాణ్యమంటే ప్రమాణముగా ఉండుట. మూడు కాలములందు బాధింపబడని వస్తువు సత్ లేక బ్రహ్మము. ప్రహ్లాదుని వాక్యములు అంతటా నిండి ఉన్న బ్రహ్మము గురించి సత్యమని ఋజువు చేస్తూ నృసింహరూపములో ఆవిర్భవించిన భగవానుడు.

*"సత్యం విధాతుం నిజభృత్యభాషితం..." (భాగ 7-8-18).*

**505. స్తంభప్రసూతిః :**

స్తంభము నుండి పుట్టుకువచ్చిన భగవానుడు.

*"స సత్త్వమేనం పరితోఽపి పశ్యన్......" నుంచి "…. వధః స్మృతోఽనేన సముద్యతేన కిం" [భాగ 7-8 - (19-23)].*

**506. నృహరిః :**

1. "నా చాసౌ హరిశ్చేతి, నృవిశిష్టోహరిః." ఇది సింహము కాదు. విశేషమైన నరరూపము. సింహాకారముగల భగవానుడు "నృహరిః".

2. "నృణాం భయంహరతి" మనుష్యుల భయము హరించే (పోగొట్టే) భగవానుడు "నృహరి".



3. "నౄన్ హరతి సంహారకత్వాదితివా" మనుష్యులను సంహరించే (పూర్తిగా లేకుండా చేసే) భగవానుడు. "నృహరిః".

**507. నృసింహః :**

1. మనిషి, సింహముల రెండిటి కలయిక గల రూపము ధరించిన భగవానుడు నృసింహుడు.

"క్లీబత్వాభావః" పిరికితనములేని సింహమువలె ఉన్న భగవానుడు, నృసింహుడు.

**508. భీమవిక్రమః :**

1. విక్రమమనగా పరాక్రమము, పాదవిక్షేపము. భీమవిక్రముడనగా: భయము కలిగించే రూపముతో, భయము పుట్టించే రీతిలో అడుగులువేస్తూ నడిచే భగవానుడు.

2. భయము కలిగించే నృసింహరూపముతో భయము కనపరిచే పరాక్రమము ప్రకటించిన భగవానుడు,

3. "భీమేషు ఘోరదైత్యేషు వా" భయము పుట్టించే ఘోరదైత్యులకు కూడ భయము కొలిపే పరాక్రమము చూపించే నృసింహభగవానుడు.

*"తం విక్రమన్తం సగదం గదాధరో.........." నుంచి "....... యూధోఽను పథాన్ సహస్రశః" [భాగ 7-8 - (26-31)].*

**వికటాస్యో లలజ్జిహ్వో నఖశస్త్రో జవోత్కటః ।**
**హిరణ్యకశిపుచ్ఛేదీ క్రూరదైత్యనివారకః ॥ 105**

**509. వికటాస్యః :**

ఆస్య మనగా ముఖము. వికటము లేక విషమముగానున్న ముఖము గల శ్రీనృసింహస్వామి వికటాస్యుడు.

**510. లలజ్జిహ్వః :**

సింహమువలె నాలుకను ముందుకు వెనుకకు కదుల్చుచున్న నృసింహస్వామి "లలజ్జిహ్వ".

**511. నఖశస్త్రః :**

గోళ్ళే ఆయుధములుగాగల నృసింహస్వామి. హిరణ్యకశిపుడు ఏ ఆయుధము చేతను చనిపోకుండునట్లు వరము పొందాడు. అందుచేత భగవానుడు తన గోళ్ళనే ఆయుధములుగా ఉపయోగించాడు. గనుక "నఖశస్త్రః" అన్న నామము.

**512. జవోత్కటః :**

జవః అంటే వేగము, ఉత్కటః అంటే సహించలేనంతటి లేక సహింపనలవి కానట్టి అని అర్థము. యుద్ధము చేయుటకై గొప్ప ఉత్సాహము చూపుతూ శత్రువులు సహింపనలవికాని వేగముతో కదులుచున్న నృసింహస్వామి.

**513. హిరణ్యకశిపుశ్ఛేదీ :**

హిరణ్యకశిపుని చీల్చి చండాడిన నృసింహస్వామి.

**514. క్రూరదైత్యనివారకః :**

క్రూరులైన హిరణ్యకశిపుని, అతని అనుచర దైత్యులను చంపి వారిని పూర్తిగా నివారణచేసిన నరసింహస్వామి.

**సింహాసనస్థః క్రోధాత్మా లక్ష్మీభయవివర్ధనః ।**
**బ్రహ్మాద్యత్యంతభయభూరపూర్వాచింత్యరూపధృక్ ॥ 106**

**515. సింహాసనస్థః :**

సింహాసనముపై కూర్చున్న నరసింహస్వామి.

*"తతః సభాయాముపవిష్టముత్తమే ..."* *(భాగ 7-8-34).*



**516. క్రోధాత్మా :**

కోపముతోకూడుకున్న స్వరూపము గల నరసింహస్వామి.

**517. లక్ష్మీభయవివర్ధనః :**

విష్ణుభగవానుని పత్ని లక్ష్మీదేవికి కూడా ఎక్కువ భయము కలుగజేసిన నృసింహస్వామి.

*"సాక్షాచ్ఛ్రీః ప్రేషితా దేవైర్దృష్ట్వా"* *(భాగ 7-9-2).*

**518. బ్రహ్మాద్యత్యన్తభయభూః :**

బ్రహ్మరుద్రాదులతో సహా దేవతలందరికి ఎంతో భయము కలుగజేయు రూపము, చేష్టలుగల నృసింహభగవానుడు.

*"ఏవం సురాదయస్సర్వే బ్రహ్మ రుద్రపురఃసరాః" నుంచి ".... తాత ప్రశమయోపేహి స్వపిత్రే కుపితం ప్రభుం"* [*భాగ 7-9 - (1-3)*].

**519. అపూర్వాచిన్త్యరూపధృక్ :**

ఇదివరకెన్నడూలేని, కని విని ఎరుగని, మనస్సుచేత కూడా ఊహింపలేని రూపము ధరించి కనుపించిన నరసింహస్వామి.

**భక్తైకశాంతహృదయో భక్తస్తుత్యః స్తుతిప్రియః ।**
**భక్తాంగలేహనోద్ధూతక్రోధపుంజః ప్రశాన్తధీః ॥ 107**

**520. భక్తైకశాన్తహృదయః :**

భక్తుడైన ప్రహ్లాదుని ఒక్కనికొరకు మాత్రమే కోపములేకుండ శాన్తహృదయముగల నృసింహస్వామి.

**521. భక్తస్తుత్యః :**

భక్తుడైన ప్రహ్లాదునిచే స్తుతింపబడి శాంతించిన నృసింహస్వామి.

**522. స్తుతిప్రియః :**

నిర్మలమైన మనస్సుతో, అనన్య భావముతో, భక్తుడైన ప్రహ్లాదుడు చేసిన స్తుతి మాత్రమే నృసింహస్వామికి ప్రీతిపాత్రమైనది. అట్లు చేసిన స్తుతులే భగవానునికి ప్రియమైనవి.

**523. భక్తాంగలేహనోద్ధూతక్రోధపుంజః :**

భక్తుడైన ప్రహ్లాదుని అంగములు ఆస్వాదన చేసినంతనే తాను హిరణ్యకశిపునిపై చూపిన కోపమంతయు పూర్తిగా పోయినట్టి నృసింహస్వామి.

"స్వపాదమూలే పతితం తమర్భకం విలోక్య దేవః...." (భాగ. 7-9-5)

"ప్రహ్లాద భద్ర భద్రం తే ప్రీతోఽహం...." (భాగ 7-9-52).

**524. ప్రశాంతధీః :**

1. క్రోధ రహితమైన ప్రశాంతమైన చిత్తముగల నృసింహస్వామి "ప్రశాంతధీః"

2. విషయపరాన్ముఖమైన ప్రశాంతబుద్ధి ప్రహ్లాదునకు కలిగించిన నృసింహభగవానుడు "ప్రశాంతధీః"

**స్మృతిమాత్రభయత్రాతా బ్రహ్మబుద్ధిప్రదాయకః ।**
**గోరూపధార్యమృతపాః శివకీర్తివివర్ధనః ॥ 108**

**525. స్మృతిమాత్రభయత్రాతా :**

మహాసంకటసమయములో నృసింహస్వామిని స్మరించినంతమాత్రము చేత భయమునుంచి రక్షిస్తాడు. అట్టి భగవానుడు స్మృతిమాత్రభయత్రాతా"

*"ఏతద్ వపుస్తే భగవన్ ధ్యాయతః ప్రయతాత్మనః" (భాగ 7-10-29).*

**526. బ్రహ్మబుద్ధిప్రదాయకః :**

బ్రహ్మ నృసింహస్వామిని స్తుతించాక, స్వామివారు మరల ఎప్పుడూ ఎవరికి హిరణ్యకశిపునకిచ్చినట్టి వరములు ఇవ్వవద్దని బ్రహ్మదేవుని



ఆదేశించారు. ఇట్టి బుద్ధిని బ్రహ్మదేవునికి ప్రసాదించిన భగవానుడు బ్రహ్మబుద్ధిప్రదాయకుడు.

*"మైవం వరోఽసురాణాం తే ప్రదేయః పద్మసంభవ....." (భాగ. 7-10-30).*

**527. గోరూపధారీ :**

శివుడు త్రిపురాసురుని జయించే నిమిత్తము విష్ణువు గోరూపమును, బ్రహ్మ వత్సరూపమును ధరించారు. ఈ విశేషము తెలిపే నామము "గోరూపధారి".

**528. అమృతపాః :**

గో, వత్సల రూపములు ధరించి, త్రిపురములలోనున్న మయనిర్మిత అమృతకూపములోని అమృతమును వారు (బ్రహ్మ, విష్ణువులు) త్రాగేసారు. అందుచేత భగవానుని నామము "అమృతపా." ఈ విశేషములు తెలిపే నామద్వయము "గోరూపదార్యమృతపాః ।"

*"తైః స్పృష్టా వ్యసవః సర్వే నిపేతుః స్మ పురౌకసః...." నుంచి "..... ప్రవిశ్య త్రిపురం కాలే రసకూపామృతం పపౌ" [భాగ 7-10 - (59-62)].*

**529. శివకీర్తివివర్ధనః :**

శివునికి త్రిపురాంతక నామము సార్థకముచేసి, శివకీర్తిని ఎంతో గొప్పగా వృద్ధిచేసిన భగవానుడు. శివకీర్తివివర్ధనుడు.

**ధర్మాత్మా సర్వకర్మాత్మా విశేషాత్మాశ్రమప్రభుః ।**
**సంసారమగ్నసోద్ధర్తా సన్మార్గాఖిలతత్త్వవాక్ ॥ 109**

**530. ధర్మాత్మా :**

ధర్మము (ఆత్మగా) శరీరముగా కల భగవానుడు ధర్మాత్మా. సాధారణ ధర్మముల (వర్ణాశ్రమ లౌకిక మొదలైన ధర్మముల) స్వరూపుడైన భగవానుడు ధర్మాత్మా.

*"భగవంచ్ఛ్రోతు మిచ్ఛామి నృణాం ధర్మం సనాతనం.." (భాగ 7-11-2).*

(శ్రీమద్భాగవత సప్తమస్కంధము 11వ అధ్యాయములో సాధారణ ధర్మములు, వర్ణాశ్రమ ధర్మములు, స్త్రీ ధర్మములు, 12వ అధ్యాయములో బ్రహ్మచర్య వానప్రస్తఆశ్రమ ధర్మములు, 13వ అధ్యాయములో (యతిధర్మములు) సంన్యాసాశ్రమ ధర్మములు, 14వ అధ్యాయములో గృహస్తాశ్రమ ధర్మములు, 15వ అధ్యాయములో గృహస్తుల కొరకు మోక్ష ధర్మము వివరింపబడ్డాయి.)

**531. సర్వకర్మాత్మా :**

"సర్వేషాం వర్ణానాం యత్కర్మ తత్తద్వర్ణధర్మః తద్రూప ఇత్యర్థః" అన్ని వర్ణములవారు అన్ని ఆశ్రమముల వారు, వారి వారి కర్మలు ఏవేవి చేయాలో, ఏఏధర్మాలు పాటించాలో ఆయా వర్ణోచిత ధర్మముల, కర్మముల రూపములలో నున్న భగవానుడు, సర్వకర్మాత్మ.

**532. విశేషాత్మా :**

"ఆత్మ విశేషో ధర్మ విశేషః వర్ణాశ్రమ ధర్మరూపః" వర్ణాశ్రమధర్మముల వంటివి విశేషమైన ధర్మములు, చిహ్నములు, ఏవి కలవో వాటి రూపములలో నున్న భగవానుడు. పాలాశోదండో బ్రాహ్మణస్య – పాలాశదండము బ్రాహ్మణులు ధరిస్తారు. ఇట్టి విశిష్ట చిహ్నములు వర్ణాశ్రమ ధర్మములను తెలియ పరుస్తాయి. వర్ణాశ్రమధర్మములు పాటించేవారిని భగవద్రూపులుగా గౌరవించాలని, ఆ ధర్మచిహ్నములను భగవంతుడు ధరించు చిహ్నములుగా గౌరవించాలని భావము.

**533. ఆశ్రమప్రభుః :**

బ్రహ్మచర్యాది ఆశ్రమములకు ఏఏ ధర్మములు కలవో వాటికి ప్రభువైన భగవానుడు, ఆశ్రమప్రభువు.

*"ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" (వి.స.నా. ఉత్తర పీఠిక శ్లో॥ 137).*

**534. సంసారమగ్నస్యోద్ధర్తా :**

సంసార విషయములందు చిక్కుకున్న తన భక్తులకు శ్రీ భాగవతములో చెప్పిన ధర్మోపదేశము చేసి, వారిని తరింపజేసే భగవానుడు

*"గృహస్థ ఏతాం పదవీం విధినా యేన చాంజసా"* మొదలైనవి.

*(భాగ 7-14 ఆ - 15 అ॥).*



**535. సన్మార్గాఖిలతత్త్వవాక్ :**

ఏఏ శాస్త్రములందు ఏఏ సన్మార్గములు చెప్పబడినవో (చూపబడినవో) వాటిలోగల తత్త్వము లేక ఆధ్యాత్మిక విద్యాస్వరూపమేమిటో వానిని సంపూర్ణముగా వివరించే వాగ్రూపములో నున్న భగవానుడు

*"అధ్యాత్మ విద్యా విద్యానాం....."* *(గీత 10-32).*

**ఆచారాత్మా సదాచారః ...................... ।**
**...................................... ॥ 110**

**536. ఆచారాత్మా :**

1. ఆ = సమన్తాత్, చారః = గమనము లేక జ్ఞానము అనగా సంపూర్ణ జ్ఞానయుక్తముగా సంచరించుట ఆచారము. అన్ని విధములలోను జ్ఞానయుక్తముగా సంచరించువాడు ఉన్నతమైన యీ ఆచారరూపముగల భగవానుడు, "ఆచారాత్మా"

2. మనువు మొదలగు స్మృతి కర్తలు, ఋషులు విధించిన నిత్యనైమిత్తిక కర్మలు ఆచరించుట, శ్రుతి, స్మృతి, ధర్మశాస్త్ర సమ్మతముగా వ్యవహరించుట, దేవపూజ, వ్రతయజ్ఞాదులందు తమ కులగురుసాంప్రదాయమును అనుసరించి చేయుట, ఇవన్నీ ఆచారములలో భాగములు. ఈ ఆచారరూపముల లోనున్న భగవానుడు "ఆచారాత్మా".

**537. సదాచారః :**

సద్భక్తుల ఆచరణరూపములోనున్న జ్ఞానయుక్త భక్తిమార్గము, దాని విధానము సదాచారము. ఆ రూపములోనున్న భగవానుడు.

*ఇంతవరకు సప్తమస్కంధ నామములు.*

## శ్రీమద్భాగవత అష్టమస్కంధ నామములు

*మన్వంతరలీలా నామములు (538-642)*

*శ్లోక సంఖ్య (110-129)*

**........................ మన్వంతరవిభావనః ।**
**స్మృత్యాశేషాశుభహరో గజేంద్రస్మృతికారణం ॥ 110**

**538. మన్వంతరవిభావనః :**

స్వాయంభువు మన్వంతరము నుంచి జరిగిపోయిన ఆరు మన్వంతరములు, జరుగుతున్న వైవశ్వతమన్వంతరము, జరుగబోయే ఏడు మన్వంతరములు, మన్వంతరముల మధ్యకాలము, మొదలైన కాలవిశేషములు, ఆయాకాలములలోఉన్న జ్ఞానులు భక్తులగురించి తెలుసుకోదగ్గ ఉత్తమ భావనలు- ఇవన్నీ మన్వంతరవిభావనలు. ఈ మన్వంతర విభావనల రూపముగల భగవానుడు

*"మనవోఽస్మిన్ వ్యతీతాః షట్ కల్పే స్వాయంభు వాదయః...."*
*(భాగ 8-1-4).*

**539. స్మృత్యాశేషాశుభహరః :**

మొసలిచేత పట్టుకో బడ్డ గజేంద్రుని అన్ని అశుభములు, పాపములు, స్మరణమాత్రముచేతనే హరించిన భగవానుడు స్మృత్యాశేషాశుభహరుడు.

**540. గజేంద్రస్మృతికారణం :**

కష్టములలో చిక్కుకున్న గజేంద్రునికి భగవంతుని శరణుతప్ప వేరే గతి లేదన్న ఉపాయము స్మరణకు తెప్పించిన భగవానుడు గజేంద్రస్మృతి కారణుడు.

*"యః కశ్చనేశో బలినోఽన్తకోరగాత్..."* *(భాగ 8-2-33).*



**జాతిస్మరణహేత్వైకపూజాభక్తిస్వరూపదః ।**
**యజ్ఞో భయాన్మనుత్రాతా విభుర్బ్రహ్మవ్రతాశ్రయః ॥ 111**

**541. జాతిస్మరణహేత్వైకపూజాభక్తిస్వరూపదః :**

1. పూర్వజన్మగురించి అప్పటి ఆ పరిస్థితులు జ్ఞాపకము వచ్చుట జాతిస్మరణము (లేక జాతిస్మృతి). ఇట్టి జాతిస్మరణమునకు కారణమైన భగవంతుని పూజ జాతిస్మరణహేత్వైకపూజ. అట్టి జాతిస్మరణపూజ వలన కలిగిన భక్తి జాతిస్మరణహేత్వైకపూజాభక్తి. అట్టి భక్తిస్వరూపము నిచ్చిన భగవానుడు. తాను పూర్వజన్మములో ఇంద్రద్యుమ్నుడనే రాజునన్న స్మృతి గజేంద్రునికి కలిగింది. ఆ జన్మలో చేసిన పూజాఫలము ఈ ఏనుగుజన్మలో గజేంద్రుని యందు భక్తిరూపము దాల్చినది. ఇట్టి భక్తి గజేంద్రునికికలిగించిన భగవానుడు.

2. భగవద్భక్తి కలిగిన తరువాత గజేంద్రుని అజ్ఞానజనితమైన గజ శరీరముపోయి, పీతాంబర ధారియై చతుర్భుజుడై భగవంతుని సారూప్యము పొందునట్లు అనుగ్రహించిన భగవానుడు.

*"గజేంద్రో భగవత్స్పర్శాద్విముక్తోఽజ్ఞానబంధనాత్...."* *(భాగ 8-4-6).*

**542. యజ్ఞః :**

1. యజ్ఞః అంటే విష్ణువు.
యజ్ఞో వై విష్ణుః । (శ్రుతి).
2. స్వాయంభువ మన్వంతరములో ఆకూతి రుచులకు యజ్ఞుడు అన్న పేరుతో అవతరించిన భగవానుడు.

*"...అఖ్యాస్యే భగవాన్యజ్ఞో యచ్చకార కురుద్వహ"* నుంచి *"...తప్యమానస్తతో ఘోరమిదమన్వాహ భారత"* వరకు [*భాగ 8-1- (6-8)*]

**543. భయాన్మనుత్రాతా :**

స్వాయంభువ మనువు ఉపనిషత్తులు పఠిస్తున్న సమయములో ఆకలిగొన్న

రాక్షసులు అతనిని చంపడానికి రాగా యజ్ఞపురుషుడు రాక్షసులను చంపి, మనువును రక్షించాడు, ఇట్టి భగవానుడు "భయాన్మనుత్రాత."

*"......దృష్ట్వాసురా యాతుధానా జగ్ధుమభ్యద్రవన్‌క్షుదా" (భాగ. 8-1-17).*

## 544. విభుః :

1. వైభవముతో కూడుకున్నవాడు విభుడు, ఈశ్వరుడు లేక వ్యాపించి ఉన్నవాడు.

2. రెండవమనువైన స్వారోచిషమన్వంతరములో వేదశిరాఋషికి అతనిభార్య తృషితాకి భగవానుడు "విభుడు" అనే పుత్రుడుగా అవతరించాడు.

*"..... తస్యాం జజ్ఞే తతో దేవో, విభురిత్యభివిశ్రుతః" (భాగ 8-1-21).*

## 545. బ్రహ్మవ్రతాశ్రయః :

1. వేదాధ్యయనమే వ్రతముగా గలవారు బ్రహ్మవ్రతులు లేక బ్రహ్మచారులు. ఆ బ్రహ్మచారులచే ఆశ్రయింపబడు భగవానుడు

2. బ్రహ్మచర్యమే లేక బ్రహ్మానుసంధానమే వ్రతముగా గలవారు బ్రహ్మవ్రతులు. వారిచే సేవింపబడే భగవానుడు.

3. బ్రహ్మమును తెలుసుకొన్న వారై, బ్రహ్మమునందే ప్రతిష్ఠ గలవారు బ్రహ్మవ్రతులు. వారిచే సేవింపబడే భగవానుడు బ్రహ్మవ్రతాశ్రయుడు.

*"అష్టాశీతి సహస్రాణి మునయో యే ధృతవ్రతాః......." (భాగ 8-1-22).*

**సత్యసేనో దుష్టఘాతీ హరిర్గజవిమోచకః ।**
**వైకుంఠో లోకకర్తా చ అజితోఽమృతకారణం ॥ 112**

## 546. సత్యసేనః :

1. మూడవమనువైన ఉత్తముని కాలములో ధర్మునికి అతని భార్య సూనృతాదేవికి సత్యసేనుడనే పేరుతో భగవానుడు అవతరించాడు.

2. సత్యపరమైయుండువారు సేనగాగల భగవానుడు సత్యసేనుడు.

*"ధర్మస్య సూనృతాయాం తు భగవాన్పురుషోత్తమః...." (భాగ 8-1-25).*



## 547. దుష్టఘాతీ :

దుష్టులనందరిని అంతముచేసే భగవానుడు దుష్టఘాతి.

*"సోఽనృతవ్రత దుఃశీలానసతో యక్షరాక్షసాన్....." (భాగ 8-1-26).*

## 548. హరిః :

1. నాల్గవమనువైన తామసుని కాలములో మేధాఋషికి అతని భార్య హరిణికి హరి అను పేరుతో భగవానుడు అవతరించాడు.

*"తత్రాపి జజ్ఞే భగవాన్ హరిణ్యాం హరిమేధసః" (భాగ 8-1-30).*

2. "హరతి సకలం దుఃఖం స్మృతిమాత్రేణేతి హరిః" స్మరణ మాత్రము చేతనే సకల దుఃఖములను హరించు లేక పోగొట్టు భగవానుడు హరి.

*"హరామ్యఘం హి స్మర్తౄణాం హవిర్భాగం క్రతుష్వహం । వర్ణశ్చ మే హరిః శ్రేష్ఠస్తస్మాద్ధరిరహం స్మృతః ॥ (మహాభారతము) "తత్రాపిజజ్ఞే..." (భాగ 8-1-30)*

## 549. గజవిమోచకః :

మొసలిపట్టునుండి ఏనుగును విడిపించిన హరిభగవానుడు.

*(భాగ 8-1-30).*

## 550. వైకుంఠః :

ఐదవ మనువు రైవతుడు. ఆ మన్వంతరములో శుభ్ర ఋషికి అతని పత్ని వికుంఠాదేవికి "వైకుంఠః" నామము గల పుత్రుడై భగవానుడు అవతరించాడు.
"పత్నీ వికుంఠా శుభ్రస్య వైకుంఠైః సురసత్తమైః....." *(భాగ 8-5-4).*

## 551. లోకకర్తా (చ) :

విష్ణుభగవానునిచే సర్వలోక నమస్కృతమగు వైకుంఠమను పేరుగల

లోకము కల్పించబడింది. అందుచే భగవానుడు లోకకర్త. (ఇక్కడ లోకమనగా వైకుంఠమనే లోకము).

*"వైకుంఠః కల్పితోయేన లోకో లోకనమస్కృతః...."* *(భాగ 8-5-5).*

**552. అజితః :**

1. "న కేనాపి కథమపి జితఇతి తథా" ఎవ్వరిచేతను, ఏవిధముగాను, ఎప్పుడూ జయింపబడని భగవానుడు అజితుడు.

2. చక్షుః అనే ఆరవమనువు కాలములో వైరాజుని పత్ని సంభూతి గర్భమునందు "అజితః" అను పేరుగలవాడై భగవానుడు అవతరించాడు.

**553. అమృతకారణం :**

ఆరవ మన్వంతరము (చక్షుర్మన్వంతర కాలము)లో అజిత రూప భగవానుడు సముద్ర మథనము చేసి అమృతప్రాప్తికి కారణుడైనాడు.

*"ప్రయోధిం యేన నిర్మథ్య సురాణాం సాధితా సుధా..."* *(భాగ 8-5-10)*

**ఉరుక్రమో భూమిహర్తా సార్వభౌమో బలిప్రియః ।**
**విభుః సర్వహితైకాత్మా విష్వక్సేనః శివప్రియః ॥ 113**

**554. ఉరుక్రమః :**

1. ఉరు అంటే విస్తీర్ణమైన, క్రమః అంటే (పాద విక్షేపము) అడుగులు వేయగలవాడు ఉరుక్రముడు, భగవానుడు.

2. ఏడవ మన్వంతరములో (వైవస్వత మన్వంతరములో) కశ్యపునికి అతని భార్య అదితికి వామనుడై భగవానుడు అవతరించాడు. బలి నుండి మూడడుగులు భూమి తీసుకొన్న సందర్భములో ఉరుక్రముడయ్యాడు.

"శన్నో విష్ణురురుక్రమః" (శ్రుతి).

*"అత్రాపి భగవజ్జన్మ కశ్యపాదదితేరభూత్...."* *(భాగ 8-13-6).*



**555. భూమిహర్తా :**

బలిని అణిచిపెట్టి, ఇంద్రునికి తిరిగి ఇవ్వడానికి మూడు లోకములలోని భూమిని తీసుకున్న భగవానుడు "భూమిహర్తా."

**556. సార్వభౌమః :**

1. భూమి అంతటికి ప్రభువైన వాడు సార్వభౌముడు.

2. ఎనిమిదవ మన్వంతరములో (సావర్ణమనువు కాలములో) దేవ గుహ్యునికి అతని భార్య సరస్వతికి సార్వభౌముడనే పుత్రునిగా భగవానుడు పుడతాడు. ఈ సార్వభౌముడు పురందరుడనే ఇంద్రుని నుంచి స్వర్గ రాజ్యము తీసుకొని బలిచక్రవర్తికి ఇస్తాడు.

*"దేవగుహ్యాత్సరస్వత్యాం సార్వభౌమ ఇతి ప్రభుః..."* *(భాగ 8-13-17).*

**557. బలిప్రియః :**

1. బలికి ప్రియుడైన భగవానుడు బలిప్రియుడు. బలి ఎవరికి ప్రియుడో ఆ (సార్వభౌమడు) భగవానుడు.

**558. విభుః :**

విశేషముగా ఐశ్వర్యముగల భగవానుడు విభుడు. తొమ్మిదవ మనువు దక్షసావర్ణికాలంలో ఆయుష్మంతునికి అతని పత్ని అయిన అంబుధారాదేవికి భగవానుడు ఋషభుడై అవతరిస్తాడు. ఈయన ఇచ్చిన త్రిలోకాధిపత్యము అద్భుతుడనే ఇంద్రుడు అనుభవిస్తాడు.

"ఆయుష్మతోఽంబుధారాయామృషభో భగవత్కలా" (భాగ 8-13-20)

**559. సర్వహితైకాత్మా :**

1. అందరికి హితము కూర్చుటయందు మాత్రమే "ఆత్మా" చిత్తముగల (లేక అందరి హితము గురించి మాత్రమే చింతించే) భగవానుడు "సర్వహితైకాత్మా."

2. అందరికి హితముసమకూర్చే ఆత్మస్వరూపముగల భగవానుడు.

**560. విష్వక్సేనః :**

1. "విష్వగఞ్చన్తి పలాయన్తే దైత్యసేనా యస్మాత్ ఇతి విష్వక్సేనః" ఎవరిసేనలు చూచి, బెదిరి, దైత్యసేనలు పారిపోతాయో, అతడు విష్వక్సేనుడు.

2. "విష్వక్ సర్వవ్యాపినీ సేనా యస్యేతి తథా" అన్నిచోట్ల వ్యాపించిఉన్న సేనలు కలవాడు విష్వక్సేనుడు.

పదవ మన్వంతరములో (బ్రహ్మసావర్ణిమనువు కాలములో) విశ్వసృజ్ అతని పత్ని విషూచీదేవికి విష్వక్సేనుడు భగవానుని అంశావతారముగా పుడతాడు. ఇతడు శంభు అనే ఇంద్రునికి మిత్రుడు అవుతాడు.

*"విష్వక్సేనో విషూచ్యాం తు శంభోః సఖ్యం కరిష్యతి..." (భాగ 8-13-23)*

**561. శివప్రియః :**

శివుని ప్రియుడు సఖుడు అయిన విష్వక్సేనరూపములో నున్న భగవానుడు.

**ధర్మసేతుర్లోకధృతిః సుధామాంతరపాలకః ।**
**ఉపహర్తాయోగపతిర్బృహద్భానుః క్రియాపతిః ॥ 114**

**562. ధర్మసేతుః :**

1. మారుతున్న ధర్మాన్ని మర్యాద తప్పకుండా సమయ- సమయమున స్థాపించు భగవానుడు, ధర్మసేతువు.

2. సముద్రము దాటుటకు సేతువు ఉపయోగపడినట్లు సంసార సాగరమును దాటుటకు ధర్మసేతువు తోడ్పడుతుంది. ధర్మము నాశ్రయించినవారు సంసారసాగరమును దాటుతారు. సంసారసాగరము దాటించే శక్తిగల శ్రీ భాగవతరూపములోనున్న భగవానుడు ధర్మసేతువు.

3. పదకొండవ మన్వంతరములో (ధర్మసావర్ణిమనువు కాలములో)



ఆర్యకునికి, అతని పత్ని వైధృతాదేవికి భగవానుడు ధర్మసేతువుగా అవతరిస్తాడు (అంశావతారము) త్రిలోకములను రక్షిస్తాడు.

*"ఆర్యకస్య సుతస్తత్ర ధర్మసేతురితి స్మృతః" (భాగ 8-13-26).*

**563. లోకధృతిః :**

మూడు లోకములను తనయందు ధరించిన ధర్మసేతు భగవానుడు "లోకధృతిః". *(భాగ 8-13-26).*

**564. సుధామాన్తరపాలకః :**

పన్నెండో మన్వంతరకాలములో (రుద్రసావర్ణిమనువు కాలములో) సత్యసహునికి ఆయన పత్ని సూనృతాదేవికి భగవానుడు సుధామ అనే పేరుగల వానిగా అవతరిస్తాడు, ఇతడు ఆ మన్వంతరములో భూమిని పరిపాలిస్తాడు. ఈయన భూమిని పాలించిన కాలము సుధామాన్తరము. (సుధామా, స్వధామా పదములు సమానములు)

*'స్వధామాఖ్యో హరేరంశః... సూనృతాయాః సుతో విభుః" (భాగ 8-13-29).*

**565. ఉపహర్తాయోగపతిః :**

1. "ఉపహరతి దదాతి సుఖం సర్వేభ్యః ఇతి ఉపహర్తేతి స చాసౌ యోగపతిః" అందరికి సుఖము (ఆనందము) ఇచ్చే భగవానుడు "ఉపహర్తా." అతడే యోగపతి. "ఉపహర్తాయోగపతి". ఉపహర్తాయోగపతి ఒకేనామము మహాభారతాంతర్గత అనుశాసనిక పర్వములోని విష్ణుసహస్రనామస్తోత్రంలో "సంకర్షణోఽచ్యుత" అని ఒకే నామము అయినట్లు, ఈ నామముకూడా విశేషణముతో కూడినట్టి ఒకే నామము.

2. పదమూడవ మన్వంతరములో (దేవసావర్ణి మన్వంతర కాలములో) దేవహోత్రునికి అతని పత్ని బృహతికి యోగేశ్వరుడనే పుత్రుడుగా భగవంతుడు అవతరిస్తాడు. దివస్పతి అన్నదేవతకు ఇంద్ర పదవినిస్తాడు.

*"దేవహోత్రస్య తనయ ఉపహర్తా దివస్పతేః...." (భాగ 8-13-32).*

**566. బృహద్భానుః :**

1. చెప్పలేనన్ని (చెప్పలేనంత) సూర్యకిరణముల కాంతి (ప్రకాశము) గల భగవానుడు, బృహద్భానుడు.

2. పద్నాల్గవ మన్వంతరములో (ఇంద్రసావర్ణి మన్వంతరములో) సత్రాయణు నకు అతని పత్ని వితానాదేవికి బృహద్భానుడనే పేరుగల పుత్రునిగా భగవానుడు అవతరించి కర్మకాండను విస్తరింపజేస్తాడు.

*"సత్రాయణస్య తనయో బృహద్భానుస్తదా హరిః...."* (*భాగ 8-13-35*).

**567. క్రియాపతిః :**

"యజ్ఞక్రియాయాః పతిః రక్షకః ప్రవర్తకత్వాత్". యజ్ఞకర్మ (శ్రౌతకర్మ) కాండను విస్తరింపజేయుటచేత బృహద్భానుడు యజ్ఞరక్షకుడౌతాడు. ఇట్టి భగవానుడు క్రియాపతి. (*భాగ 8-13-35*)

*"అహంక్రతు రహంయజ్ఞః..."* (*గీతా 9-16*).

**చతుర్దశప్రమాణాత్మా ధర్మో మన్వాదిబోధకః ।**
**లక్ష్మీభోగైకనిలయో దేవమంత్రప్రదాయకః ॥ 115**

**568. చతుర్దశప్రమాణాత్మా :**

"అత్ర ప్రమాణం స్మృతిరేవ" ఇక్కడ స్మృతియే ప్రమాణము. పద్నాలుగు మన్వంతరములలో పద్నాలుగురు మనువులు స్మృతులను (ధర్మశాస్త్రములను) ప్రజలు అనుసరించునట్లు చేస్తారు. ఈ పద్నాలుగురు మనువులు ఏ భగవానుని అవతారములో, అట్టి భగవానుడు చతుర్దశప్రమాణాత్మ.

*"మన్వంతరేషు భగవన్యథా మన్వాదయస్త్విమే....."* (*భాగ 8-14-1*).

**569. ధర్మః :**

1. "తత్తన్మను ప్రణీత ధర్మరూప ఇతి ధర్మః" ఆయా మనువులు చేసిన ధర్మశాస్త్రముల రూపములలోనున్న భగవానుడు.



వేర్వేరు మన్వంతరములలో మనుధర్మశాస్త్రము కొంతవరకు మారుతూ ఉంటుందని, ఆ మారిన స్మృతులు ఆ మన్వంతరములలో ప్రమాణముగా ఉండేవని గ్రహించవలెను.

*"తతో ధర్మం చతుష్పాదం మనవో హరిణోదితాః"* (*భాగ 8-14-5*).

**570. మన్వాదిబోధకః :**

1. ప్రతి మన్వంతరములోను ఉన్న మనువు, మనుపుత్రులు, సప్తర్షులు, దేవతలు, ఇంద్రుడు వీరందరిని భగవానుడు పైనచెప్పిన వేర్వేరు అవతారములెత్తి ధర్మమును ప్రవర్తింప చేయడానికి శాసిస్తాడు.

2. "మన్వాదీన్ స్వమాహాత్మ్యం బోధయతీతి తేషాం మాహాత్మ్య బోధక ఇతివా" మన్వాదులకు తన మాహాత్మ్యమును బోధిస్తాడు, ఇతరులకు మన్వాదుల మహాత్మ్యమును బోధిస్తాడు. అట్టి భగవానుడు మన్వాదిబోధకుడు.

*"మనవో మనుపుత్రాశ్చ మునయశ్చ మహీపతే...."* నుంచి *"..... విమోహితాత్మభిర్నానా దర్శనైర్నచ దృశ్యతే"* వరకు [*భాగ 8-14 - (2-10)*]

**571. లక్ష్మీభోగైకనిలయః :**

1. "లక్ష్మ్యాః స్వర్గసమ్బన్ధిన్యా భోగోఽనుభవః తస్యైకనిలయః స్థానభూతః ఇత్యర్థః". లక్ష్మీ అంటే స్వర్గసంబంధమైన భోగములు లేక అనుభవములు. అవి లక్ష్మీపతి (విష్ణుమూర్తి) యొద్ద మాత్రమే కలుగుతాయి. అందుచేత భగవానుడు లక్ష్మీభోగైకనిలయుడు లేక ఆ భోగములకు స్థానమైనవాడు.

2. శ్రీమద్భాగవత అష్టమస్కంధ పంచమాధ్యాయములో బ్రహ్మాదేవతలతో కూడి భగవానుని శరణుపొందే నిమత్తము చేసిన స్తుతిలో భగవానుని విభూత్యాదులు వర్ణిస్తాడు. ఆ విభూతులకు భగవానుడే నిలయుడు. ఆ స్తుతిలో "మహావిభూతి" అని వర్ణించిన విభూతులు కలవాడే లక్ష్మీభోగైకనిలయుడు.

*"అవిక్రియం సత్యమనంతమాద్యం.."* నుంచి *"... నసజ్జమానాయ నభ స్వదూతయే"* [*భాగ 8-5 - (26-44)*].

## 572. దేవమన్త్రప్రదాయకః :

మన్త్రము అనగా రహస్యము. క్షీరసముద్రము మథించి దేవతలు అమృతమును ఏ విధముగా పొందగలరో ఆ రహస్యము బ్రహ్మాది దేవతలకు చెప్పిన భగవానుడు.

*"హన్త బ్రహ్మన్నహో శంభో హే దేవా మమ భాషితమ్...."* *(భాగ 8-6-18)*

**దైత్యవ్యామోహకః సాక్షాద్గరుడస్కంధసంశ్రయః ।**
**లీలామందరధారీ చ దైత్యవాసుకిపూజితః ॥ 116**

## 573. దైత్యవ్యామోహకః :

దేవతలకు దైత్యులకు సంధి కుదుర్చుటకు దేవతలు మాటలలోను, చేతలలోను ఏవిధంగా వ్యవహరించాలో ఆదేశించిన వైచిత్ర్యకర్త దైత్య వ్యామోహకుడు.

*"యూయం తదనుమోదధ్వం...."* *(భాగ 8-6-24).*

## 574. సాక్షాద్గరుడస్కంధసంశ్రయః :

"సాక్షాదవ్యవహితో యో గరుడః" గరుత్మంతుడు భగవానుని స్వరూపమే. అతనికంటె వేరు కాదు. ఆ పక్షి భుజముమీద ఉండి మందర పర్వతముతో సహా ఎగిరి వెళ్లిన భగవానుడు సాక్షాద్గరుడస్కంధసంశ్రయుడు.

*"వైనతేయశ్చ పక్షినాం"* *(గీత-10-30).*

దైత్యులు, దేవతలు మందర పర్వతమునెత్తి సముద్రము నకు తీసుకు వెళ్లలేకపోయిరి. శ్రీహరి దానిని తాను కూర్చున్న గరుడ వాహనముపై నుంచి సాగరతీరమునకు చేర్చాడు.

"గిరిం చారోప్య గరుడే హస్తేనైకేన లీలయా" (భాగ 8-6-38).

## 575. లీలామందరధారీ (చ) :

సముద్రమథనము సమయములో అనాయాసముగా మందరాచలమును తనవీపుపై ఉంచుకొన్న ఆదికూర్మరూపుడైన భగవానడు లీలామందరధారి.

*"విలోక్య విఘ్నేశవిధిం తదేశ్వరో....."* *(భాగ 8-7-8).*



## 576. దైత్యవాసుకిపూజితః :

భగవానుడు దైత్యుల సామర్థ్యము తగ్గించుటకై వాసుకిచే హాలాహలము (విషము) సముద్రములో కక్కించాడు. దాని వలన దైత్యుల సామర్థ్యము తగ్గినది. ఈ విధముగా భగవానుడు వాసుకిచేత పూజింపబడ్డాడు. శివునిచే హాలాహల భక్షణ చేయించి, తత్ఫలితముగా (వాసుకి తలవైపు పట్టుకున్న) దైత్యులను రక్షించి వారిచే పూజింపబడ్డాడు. ఈ రెండు విధములుగా దైత్యులచేతను వాసుకిచేతను పూజింపబడిన భగవానుడు దైత్యవాసుకిపూజితుడు

*"తే నాగరాజమామన్త్ర్య ఫలభాగేన వాసుకిం...." నుంచి "...దావాగ్నిదగ్ధాః సరలా ఇవాభవన్" వరకు* *[భాగ 8-7 - (1-14)].*

**సముద్రోన్మథనాయత్తోఽవిఘ్నకర్తా స్వవాక్యకృత్ ।**
**ఆదికూర్మః పవిత్రాత్మా మందరాఘర్షణోత్సుకః ॥ 117**

## 577. సముద్రోన్మథనాయత్తః :

సముద్ర ఉన్మథన + ఆయత్తః = సముద్రోన్మథనాయత్తః. సముద్రమును చిలుకుటకుకావలసిన అన్ని శక్తులను సమకూర్చి చిలుకుటకు సిద్ధమైన భగవానుడు. సముద్రోన్మథనాయత్తుడు. మందరపర్వతము మునిగిపోకుండా తాను ఆదికూర్మమై పైకెత్తుట, దేవతలలోను దైత్యులలోను శక్తిరూపముగా ప్రవేశించి చిలికించుట, వాసుకికి బాధ తెలియకుండా నిద్ర తెప్పించుట, చక్కగా ఏర్పాటు చేసి ఉన్మథనక్రియ సాగింపజేసిన భగవానుడు సముద్రోన్మథ నాయత్తుడు.

*"తముత్థితం వీక్ష్యకులాచలం పునః..." నుంచి ".... మహాద్రిణా క్షోభిత నక్ర చక్రం" వరకు* *[భాగ 8-7 - (9-13)].*

## 578. అవిఘ్నకర్తా :

మందరాచలము మునిగి దేవకార్యమునకు విఘ్నము కలుగకుండా తాను కూర్మమై ఆ పర్వతమును పైకెత్తిన భగవానుడు అవిఘ్నకర్త.

*"విలోక్య విఘ్నేశవిధిం తదేశ్వరో....."* *(భాగ 8-7-8).*

**579. స్వవాక్యకృత్ :**

సముద్ర మథనముచేసి, వచ్చిన అమృతమును త్రాగి అమరులు అవమని భగవానుడు దేవతలకు చెప్పాడు. ఆ సముద్ర మథనము చేయుటలో వచ్చిన అన్ని విఘ్నములు దాటింపజేసి తనమాట నిలబెట్టుకున్నాడు. అందుచేత భగవానుడు "స్వవాక్యకృత్".

**580. ఆదికూర్మః :**

"ఆదిత్వం దేశాపేక్షయా జ్ఞేయం. కూర్మస్య సర్వాధారత్వాదత్రాదిత్వం ఆదిశ్చాసౌ కూర్మశ్చేతి" ఇక్కడ 'ఆది' పదమునకు అర్థము కాలములో మొదటిది అని కాదు. తాబేలు రూపములోనున్న భగవానుడు అన్నింటికి (అన్ని లోకములకు) ఆధారము అని అర్థము. "కుం పృథ్వీం రమయతీతి కూర్మః" అనగా పృథివిని (భూమిని) రంజింపజేయు కూర్మరూపములోను భగవానుడు.

**581. పవిత్రాత్మా :**

"పవిత్రో మేధ్యో ఆత్మా దేహోయస్య ఇతి పవిత్రాత్మా" పవిత్రమనగా మేధ్యము, యజ్ఞ సంబంధమైన క్రియ. అట్టి దేహము కలవాడు లేక యజ్ఞమే దేహముగాగల భగవానుడు "పవిత్రాత్మా".

*యజ్ఞో వై విష్ణుః ।* *(శ్రుతి)*

*"మేధ్యో వా ఏష ప శూనాం యత్కూర్మ ఇతి కూర్మః । "* *(శ్రుతి).*

**582. మందరాఘర్షణోత్సుకః :**

మందర పర్వతముతో సముద్ర మథనము చేస్తున్నపుడు కలిగిన ఘర్షణ కూర్మ రూప భగవానుని వీపు గోకుతునట్లు (కండూయనం) అయి, మథనము చేయుటకు ఉత్సాహము చూపిన భగవానుడు.

*"సురాసురేంద్రైర్భుజవీర్యవేపితం...." నుంచి "... దైవేన నాగేంద్రమబోధ రూపః " వరకు* *[భాగ 8-7-10, 11].*



**శ్వాసైజదబ్ధివార్వీచిః కల్పాంతావధికార్యకృత్ ।**
**చతుర్దశమహారత్నో లక్ష్మీసౌభాగ్యవర్ధనః ॥ 118**

**583. శ్వాసైజదబ్ధివార్వీచిః :**

వాసుకి శ్వాసవలన గాలివీచి, సముద్రములో నీరు కంపించి, పెద్ద కెరటములువచ్చి అల్లకల్లోలమైనది. దీనికి కారణమైన భగవానుడు "శ్వాసైజదబ్ధివార్వీచిః" అని చెప్పబడతాడు.

**584. కల్పాంతావధికార్యకృత్ :**

మందర పర్వతము సముద్రములో మునిగి పోతున్నపుడు, వాసుకి విషము క్రక్కినపుడు, మంటలు పొగలతో హాలాహలము పుట్టుకు వచ్చినపుడు కలిగిన అలజడి కల్పాంతమందు కలిగే అవధులులేని అల్లకల్లోలముల వంటిది. ఈ స్థితి కలిగించిన భగవానుడు "కల్పాంతావధికార్యకృత్."

**585. చతుర్దశమహారత్నః :**

"చతుర్దశ సంఖ్యాకాని మహాన్తి రత్నాని జాతాని యస్మాత్ యస్మైవా, తాని విద్యన్తే యస్యేతి వా - చతుర్దశస్వపి లక్ష్మ్యా దీని మహారత్నాని యస్యేతి వా". క్షీర సముద్ర మథనము చేయగా అందులో నుండి లక్ష్మీదేవితో సహా పద్నాలుగు రత్నములు పుట్టినవి. ఈ చతుర్దశమహారత్న రూపములో నున్న భగవానుడు లేక ఆ చతుర్దశ రత్నములు పుట్టించిన భగవానుడు. 1. కామధేనువు 2. ఉచ్చైశ్రవము, (3-10) అష్టదిగ్గజాలు వాటి భార్యలగు అష్టకరిణులు, 11) కౌస్తుభమణి 12) పారిజాత వృక్షము 13) అప్సరసలు 14) శ్రీదేవి, (రమ, లక్ష్మి) - ఇవి చతుర్దశరత్నములు.

**586. లక్ష్మీసౌభాగ్యవర్ధనః :**

లక్ష్మీదేవి యొక్క సౌందర్యాది సౌభాగ్యములు వృద్ధిచేసిన భగవానుడు

లక్ష్మీసౌభాగ్యవర్ధనుడు. లక్ష్మీదేవి క్షీరసముద్రములో పుట్టిన సహజ సౌభాగ్య వంతురాలు. ఆమె విష్ణువును వరించుట వలన ఆమె సౌభాగ్యములను వృద్ధి చేసిన భగవానుడు.

*"తతశ్చావిరభూత్ సాక్షాచ్ఛ్రీరమా భగవత్పరా......" నుండి ".... హారం సరస్వతీ పద్మజో నాగాశ్చ కుణ్డలే" వరకు [భాగ 8-8 - (8-16)].*

**ధన్వంతరిః సుధాహస్తో యజ్ఞభోక్తార్తినాశనః ।**
**ఆయుర్వేదప్రణేతాచ దేవదైత్యాఖిలార్చితః ॥ 119**

## 587. ధన్వంతరిః :

"ధన్వని మరుస్థానీయే రోగే తరిర్నౌకేత్యర్థః" మరుస్థానములందు కలిగే రోగములనుండి తరింపజేసే నౌక ధన్వంతరి. ఈ ధన్వంతరి రూపములో నున్న భగవానుడు.

*"అథోదధేర్మథ్యమానాత్ కాశ్యపైరమృతార్థిభిః....." నుంచి "..... తమాలోక్యాసురాః సర్వే కలశం చామృతాభృతమ్" వరకు (భాగ 8-8 - 31-35).*

## 588. సుధాహస్తః :

సుధా అంటే అమృతము. అమృతకలశము చేతితో పట్టుకొని వచ్చిన ధన్వంతరి సుధాహస్తుడు. ఆధన్వంతరి రూపములో నున్న భగవానుడు.

*"అమృతా పూర్ణ కలశం బిభ్రద్ వలయభూషితః..." (భాగ 8-8-34).*

## 589. యజ్ఞభోక్తా :

యజ్ఞములో తనకువచ్చే హవిర్భాగము తీసుకొనే భగవానుడు యజ్ఞభోక్త.

## 590. ఆర్తినాశనః :

ఆర్తి అనగా దుఃఖము (పీడ). రోగములవల్లకలిగే పీడను పోగొట్టే భగవానుడు ఆర్తినాశనుడు. ధన్వంతరి రూపములోనున్న భగవానుడు.

*"ధన్వంతరిరితి ఖ్యాత ఆయుర్వేదదృగిజ్యభాక్.........." (భాగ - 8-8-35)*



## 591. ఆయుర్వేదప్రణేతా (చ) :

ఆయుర్వృద్ధికలిగించే ఆయుర్వేదము (ఋగ్వేద ఉపవేదము) యొక్క ప్రమాణములు ప్రవర్తింపజేసే భగవానుడు "ఆయుర్వేదప్రణేతా" *(ధన్వంతరి).*

## 592. దేవదైత్యాఖిలార్చితః :

అమృతము పొందాలనే కోరికతో దేవతలచేత, దైత్యులచేత పూజింపబడ్డ ధన్వంతరి భగవానుడు *(భాగ 8-8-35)*

**బుద్ధివ్యామోహకో దేవకార్యసాధనతత్పరః ।**
**స్త్రీరూపో మాయయా వక్తా దైత్యాంతఃకరణప్రియః ॥ 120**

## 593. బుద్ధివ్యామోహకః :

దైత్యుల బుద్ధిని విశేషముగా మోహింపజేసిన భగవానుడు.

*"ఏతస్మిన్నంతరే విష్ణుః సర్వోపాయవిదీశ్వరః........" నుండి "..... దైత్యయూథపచేతః సు కామముద్దీపయన్ ముహుః" వరకు [భాగ 8-8 - (41-46)].*

## 594. దేవకార్యసాధనతత్పరః :

దేవతలకు మాత్రమే అమృతపానము చేయించుట యందు సావధానము గల భగవానుడు దేవకార్యసాధనతత్పరుడు *[భాగ 8-8 - (41-46)].*

## 595. స్త్రీరూపః :

దైత్యులను మోహింపజేయడానికి మోహినీ రూపము ధరించిన భగవానుడు *[భాగ 8-8 - (41-46)].*

## 596. మాయయా వక్తా :

1. మాయాస్త్రీరూపముచేత దైత్యులను మోహింపజేసి పరిహాస వాక్యములు చెప్పిన భగవానుడు.

2. "మాయైవాన్యథా వదతి న తు స్వయం" స్వయముగా కాక తన మాయచేత మోహము కలిగించే పరిహాసవాక్యములు చెప్పిన భగవానుడు.

*"కథం కశ్యపదాయాదాః పుంశ్చల్యాం మయి సంగతాః....."" నుంచి "... జహసుర్భావగంభీరం దదుశ్చామృతభాజనమ్" వరకు [భాగ 8-9 - (9-11)].*

**597. దైత్యాన్తఃకరణప్రియః :**

మోహినీరూపుడైన భగవానుడు దైత్యులను నమ్మించే ప్రియమైన మాయ మాటలు చెప్పి మోహింప జేసాడు. చివరకు వారికేమాత్రము ప్రియము చేయలేదు. ఇట్టి భగవానుడు దైత్యాంతఃకరణప్రియుడు.

*"ఇతి తే క్ష్వేలితైస్తస్యా ఆశ్వస్తమనసోఽ సురాః"* *(భాగ 8-9-11).*

**పాయితామృతదేవాంశో యుద్ధహేతుస్మృతిప్రదః ।**
**సుమాలిమాలివధకృన్మాల్యవత్ప్రాణహారకః ॥ 121**

**598. పాయితామృతదేవాంశః :**

అమృతము త్రాగించి దేవతలకు అమరత్వము కలుగజేసిన భగవానుడు.

*"దైత్యాన్గృహీతకలశో వంచయన్నుపసంచరైః"* *(భాగ 8-9-21).*

**599. యుద్ధహేతుస్మృతిప్రదః :**

"యుద్ధం ప్రతి హేతుభూతా యా స్మృతిః తాం ప్రకర్షేణ దదాతి" యుద్ధము (చేయుటకు కారణమైన) చేయవలెనన్న స్మృతిని దైత్యులకు బాగుగా కలుగజేసిన భగవానుడు యుద్ధహేతుస్మృతిప్రదుడు. మొదట మోహినీ రూపంతో దైత్యులను వంచించి, దేవతలచే అమృతము త్రాగించి, వంచింపబడ్డా మన్న భావము దైత్యులకు స్మృతిలో తెప్పించి, యుద్ధము చేయడానికి వారిని ప్రేరేపించిన భగవానుడు.

*"సపత్నానాం పరామృద్ధిం దృష్ట్వా తే దితినందనాః....."* *(భాగ 8-10-3).*

**600. సుమాలిమాలివధకృత్ :**

దైత్య దేవతల యుద్ధములో సుమాలి, మాలి అనే అసురులను వధించిన భగవానుడు.

*"మాలీ సుమాల్యతిబలౌ యుధి పేతతుర్యచ్చక్రేణ...."* *(భాగ 8-10-57)*



**601. మాల్యవత్ప్రాణహారకః :**

సుమాలికి, మాలికి సోదరుడైన మాల్యవాననే వేరొక అసురుని ప్రాణములు తీసిన భగవానుడు *(భాగ 8-10-57).*

**కాలనేమిశిరశ్ఛేదీ దైత్యయజ్ఞవినాశకః ।**
**ఇంద్రసామర్థ్యదాతా చ దైత్యశేషస్థితిప్రియః ॥ 122**

**602. కాలనేమిశిరశ్ఛేదీ :**

కాలనేమి శిరస్సు ఖండించిన భగవానుడు "కాలనేమిశిరశ్ఛేది". కాలనేమి తిరిగి కంసునిగా జన్మించాడు. ముమ్ముందు కంసవధ సూచితము.

**603. దైత్యయజ్ఞవినాశకః :**

వామనుడు బలిచక్రవర్తిచేసే యజ్ఞమునకు వెళ్లక పూర్వము (బలి చక్రవర్తితో సహా) దైత్యులు రాజస తామస గుణ ప్రధానమైన కోరికలతో దేవతలకు హవిర్భాగము ఇవ్వకుండా యజ్ఞములు చేసేవారు. ఇవి దైత్య యజ్ఞములుగా చెప్పబడ్డాయి. వామన భగవానుడు యజ్ఞశాలలో ప్రవేశించగానే ఆ యజ్ఞమునకు సాత్వికత్వము, దైవత్వము కలిగాయి. గురువు శుక్రాచార్యులు నిషేధించినప్పటికి, బలిచక్రవర్తి రాజస తామస గుణ ప్రధానమైన కోరికలు లేకుండా సాత్విక బుద్ధితో నిష్కామముగా తనను, తన సర్వస్వమును (యజ్ఞ ఫలితముతో సహా) భగవానునికి సమర్పించుకున్నాడు. అందువలన బలి చక్రవర్తిచేసే యీ యజ్ఞము ఇంతకుముందుచేసిన దైత్యయజ్ఞములవలె కాక సాత్విక యజ్ఞమైనది. సాక్షాత్ భగవానుడే యజ్ఞభోక్త అగుట వలన సాత్వికత్వము, నిష్కామసిద్ధి కలిగినవి. ఈ విధముగా బలిచక్రవర్తి చేసే దైత్యయజ్ఞమును పూర్తిగా నాశనముచేసిన భగవానుడు దైత్యయజ్ఞవినాశకుడు.

**604. ఇంద్రసామర్థ్యదాతా (చ) :**

దైత్యులను జయించే సామర్థ్యము ఇంద్రునికి కలుగజేసిన భగవానుడు ఇంద్రసామర్థ్యదాతా.

**605. దైత్యశేషస్థితిప్రియః :**

దైత్య దేవతల యుద్ధములో చాలామంది దైత్యులు వధింపబడ్డారు. లోకంలో దైత్యులు కూడా ఉండాలన్న కారణముచేత బ్రహ్మదేవుడు నారదుని పంపి యుద్ధము వారించాడు. ఇట్టి ప్రేరణ కలిగించి దైత్యశేషము ఉంచుట యందు ప్రియము గల భగవానుడు దైత్యశేషస్థితిప్రియుడు

*"బ్రహ్మణా ప్రేషితో దేవాన్ దేవర్షిర్నారదో నృప...." (భాగ 8-11-43).*

**శివవ్యామోహకో మాయీ భృగుమంత్రస్వశక్తిదః ।**
**బలిజీవనకర్తా చ స్వర్గహేతుర్వ్రతార్చితః ॥ 123**

**606. శివవ్యామోహకః :**

మోహినీ అవతారము ధరించినపుడు ఆ స్త్రీ రూపము చేత శివుని విశేషముగా మోహింపజేసిన భగవానుడు శివవ్యామోహకుడు.

**607. మాయీ :**

మాయా రూపముతో సిగ్గుపడుతున్నదానివలె కనిపించిన మోహినీ రూపములోనున్న భగవానుడు "మాయీ".

**608. భృగుమన్త్రస్వశక్తిదః :**

భృగువంశములో పుట్టిన దైత్యగురువు శుక్రాచార్యులు, వారి వంశీయులు అయిన బ్రాహ్మణులు మన్త్రసిద్ధులు. వారి మన్త్రములందు భగవానుడు జీవితకారకమైన వారి మన్త్రశక్తి బలిచక్రవర్తిని దేవేంద్రునికన్నా బలవంతునిగా చేసినది. ఈ భృగుమన్త్రశక్తిని బృహస్పతి ఇంద్రునికి తెలుపుతూ భగవానుడుతప్ప వేరెవ్వరూ బలిచక్రవర్తిని ఎదురించలేరని చెప్పాడు. ఇట్టి భగవానుడు "భృగుమన్త్రస్వశక్తిదః" అని చెప్పబడతాడు.

*"జానామిమఘవఞ్ఛత్రోరున్నతేరస్య కారణం...." నుంచి "... నాస్య శక్తః పరః స్థాతుం కృతాన్తస్య యథా జనాః" వరకు (భాగ 8-15-28, 29)*



**609. బలిజీవనకర్తా (చ) :**

ఇంద్రుడు బలిని పరాజితుని చేసి, సంపదలు తీసుకొని, ప్రాణములు కూడా తీసివేయగా శుక్రాచార్యుడు బలిని పునర్జీవితుని చేయుటకు కారణ భూతుడైన భగవానుడు "బలిజీవనకర్త".

*"పరాజితశ్రీరసుభిశ్చ హాపితో హీంద్రేణ రాజన్ భృగుభిః స జీవితః." (భాగ 8-15-3).*

**610. స్వర్గహేతుః :**

ఇంద్రునికి స్వర్గముపై తిరిగి రాజ్యాధికారము కలుగుటకు కారణ భూతుడైన భగవానుడు "స్వర్గహేతువు".

**611. వ్రతార్చితః :**

కశ్యపుడు ఉపదేశించిన పయోవ్రతము ఆచరించి, భగవానునర్చించి అదితి వామనుని కన్నది. ఇట్టి వ్రతము ఆమెచే ఆచరింపజేసిన భగవానుడు వ్రతార్చితుడు.

*"ఏతన్మే భగవాన్ పృష్టః ప్రజాకామస్య..." నుంచి "..... భగవాన్ పరితుష్టస్తే వరానాశు విధాస్యతి" వరకు [భాగ 8-16 - (24-62)].*

**అదిత్యానందకర్తా చ కశ్యపాదితిసంభవః ।**
**ఉపేంద్ర ఇంద్రావరజో వామనబ్రహ్మరూపధృక్ ॥ 124**

**612. అదిత్యానందకర్తా (చ) :**

కశ్యపపత్ని అదితికి సాక్షాత్ పుత్రుడై జన్మించి ఆమెకు ఆనందము కలిగించిన వామనభగవానుడు.

**613. కశ్యపాదితిసంభవః :**

అదితి కశ్యపులు నిమిత్తమాత్రులుగా వారికి కొడుకై పుట్టిన వామన భగవానుడు కశ్యపాదితిసంభవుడు.

**614. ఉపేంద్రః :**

1. అదితి కశ్యపులకు ఇంద్రుని తమ్ముడుగా పుట్టిన వామన భగవానుడు ఉపేంద్రుడు.

2. తనపై ఇంద్రుడు అన్నగాఉన్న వామన భగవానుడు ఉపేంద్రుడు.

*"మమోపరి యథేంద్రస్త్వం స్థాపితో గోభిరీశ్వరః, ఉపేంద్ర ఇతి కృష్ణ త్వాం గాస్యంతి భువి దేవతా"* *(హరివంశము).*

3. "ఉప" అంటే సమీపం. ఇంద్రునికి దగ్గరగా చరించువాడు లేక అనుచరుడు, ఉపేంద్రుడు.

**615. ఇంద్రావరజః :**

ఇంద్రుని తర్వాత చిన్న తమ్మునిగా పుట్టిన వామనుడు ఇంద్రావరజుడు.

**616. వామనబ్రహ్మరూపధృక్ :**

వామనుడు మిగిలిన దేవతలవలె ప్రాకృతజన్మ కలవాడు కాడు. వామన రూపము ధరించి స్వయముగా అవతరించిన పరబ్రహ్మ. అందుచే వామన బ్రహ్మరూపధృక్ అని పేరు.

*యత్తద్ వపుర్భాతి విభూషణాయుధైః..."* *(భాగ 8-18-12).*

**బ్రహ్మాదిసేవితవపుర్యజ్ఞపావనతత్పరః ।**
**యాంచోపదేశకర్తా చ జ్ఞాపితాశేషసంస్థితిః ॥ 125**

**617. బ్రహ్మాదిసేవితవపుః :**

బ్రహ్మాదులచే సేవింపబడే వామనరూప భగవానుడు (వామన పురాణములో విశేషములు చూడవచ్చును.)

**618. యజ్ఞపావనతత్పరః :**

1. బలిచేసే యజ్ఞమును పావనము చేయుటకై ఉద్యుక్తుడైన వామన భగవానుడు, యజ్ఞపావనతత్పరుడు.



2. యజ్ఞములలో ఇచ్చే బలులను రక్షించి యజ్ఞము పవిత్రముగా ఉంచే భగవానుడు, యజ్ఞపావనతత్పరుడు.

3. బలిచేసే యజ్ఞమును పవిత్రముచేసి అతనిని అనుగ్రహించి యజ్ఞమును పూర్తిగా ఫలవంతము చేసిన భగవానుడు, యజ్ఞపావనతత్పరుడు.

**619. యాంచోపదేశకర్తా (చ) :**

బలికి యజ్ఞఫలము లభింపజేయుటకై భగవానుడు తనకు స్వర్గమును సమర్పించమని యాచించాడు. ఈ యాచనే బలికి ఉపదేశము. ఇంతకు పూర్వము ప్రహ్లాదుడు తాను జయించిన స్వర్గమును భగవానునికి నివేదించాడు. అతని మనుమడు బలి కూడా అట్లే చేయవలెనని ఉపదేశపూర్వక యాచన. ఇట్టి భగవానుడు యాంచోపదేశకర్త.

**620. జ్ఞాపితాశేషసంస్థితిః :**

"స్వప్రాకట్యేన జ్ఞాపితా అశేషాణాం కర్మణాం సంస్థితిః సమాప్తిర్యేనేతి న హి ఫలప్రాప్త్యనంతరం కశ్చన సాధనే ప్రవర్తత ఇతి". యజ్ఞములో భగవానుని ప్రాకట్యమువలన అశేషమైన యజ్ఞకర్మలు పూర్తిగా ఆచరించినట్లే అయినది. ఇది బలికి ప్రాప్తించిన ఫలము. ఫలప్రాప్త్యనంతరము సాధన అవసరములేదు. ఈ జ్ఞానమును బలికి కలిగించిన వామన భగవానుడు "జ్ఞాపితాశేషసంస్థితి" అనబడతాడు.

**సత్యార్థప్రేరకః సర్వహర్తా గర్వవినాశకః ।**
**త్రివిక్రమస్త్రిలోకాత్మా విశ్వమూర్తిః పృథుశ్రవాః ॥ 126**

**621. సత్యార్థప్రేరకః :**

"సత్యస్యావితథస్యార్థస్య సంకల్పరూపస్య ప్రేరణకర్తేత్యర్థః యతో నివారితోపి పునః సంకల్పిత వానేవ" అవితథమంటే ఉన్నదున్నట్లు తెలుసు కొనుట. ఈ

విధమైన సత్యమును సంకల్పించుట సత్యార్థము. ఇట్టి సత్యార్థ సంకల్పమును ప్రేరేపించే భగవానుడు సత్యార్థప్రేరకుడు. శుక్రుడు బలిని దానము ఇవ్వవద్దని నివారించినప్పటికి బలిని సత్యార్థమందు ప్రేరేపింప జేసిన భగవానుడు సత్యార్థప్రేరకుడు.

## 622. సర్వహర్తా :

బలిచక్రవర్తిని మూడడుగుల భూమి యాచించి ఆ వ్యాజము (మిష)తో త్రిలోకములు (బలియొక్క సర్వస్వము) తన సొత్తు చేసుకొన్న భగవానుడు సర్వహర్త.

## 623. గర్వవినాశకః :

సర్వేశ్వరుడు వచ్చి, తనను మూడులోకములు ఇమ్మని యాచించాడు అన్న సంగతి తెలిసిన బలికి అటువంటి గర్వము కలుగకుండా దానిని నాశనము చేసిన భగవానుడు గర్వవినాశకుడు.

## 624. త్రివిక్రమః :

1. క్రమణమనగా అడుగులు వేయుట. విశేషమైన మూడడుగులు వేసిన భగవానుడు త్రివిక్రముడు.

2. వామన భగవానుడు విక్రమించి, మూడు పాదములతో త్రిలోకములు కొలిచిన త్రివిక్రమరూపభగవానుడు.

*"ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్" (శ్రుతి).*

## 625. త్రిలోకాత్మా :

సర్వాంతర్యామి అగుటచేత భగవానుడు అవధులు ఏమీ లేకుండా త్రిలోకములలో (లోను పైని) వ్యాపించి ఉన్నాడు. అందుచేత భగవానుడు త్రిలోకాత్మ.

*"యస్యోరుషు త్రిషు విక్రమణేష్వధిక్షిపన్తి భువనాని విశ్వేతి" (శ్రుతి).*



## 626. విశ్వమూర్తిః :

విశ్వమంతయు శరీరముగాకల భగవానుడు లేక విశ్వమంతటను అంతర్యామిగా వ్యాపించి ఉన్న భగవానుడు విశ్వమూర్తి.

*"పురుష ఏవేదగ్ం సర్వం" (శ్రుతి).*

## 627. పృథుశ్రవాః :

పృథు అంటే విస్తీర్ణము శ్రవః అంటే కీర్తి. అంతటా విస్తరించిన కీర్తి కల భగవానుడు పృథుశ్రవుడు.

*"ఉరుగాయస్య విష్ణోః (శ్రుతి).*

**పాశబద్ధబలిః సర్వదైత్యపక్షోపమర్దకః ।**
**సుతలస్థాపితబలిః స్వర్గాధికసుఖప్రదః ॥ 127**

## 628. పాశబద్ధబలిః :

వరుణపాశముతో బలి బంధింపబడ్డాడు. ఇట్టి బంధనమునకు కారణమైన భగవానుడు.

## 629. సర్వదైత్యపక్షోపమర్దకః :

అన్ని దైత్యపక్షములను వారి పక్షములలోనున్న వారిని మర్దించిన భగవానుడు సర్వదైత్యపక్షోపమర్దకుడు.

*"తస్మాదస్య వధో ధర్మో భర్తుః శుశ్రూషణం చ నః" నుంచి "... తే జఘ్నురాసురీం" [భాగ 8-21 - (13-17)].*

## 630. సుతలస్థాపితబలిః :

సుతలమనే పేరు గల భూమిక్రింది మూడవవివరము (లోకము)లో బలిని స్థాపించిన భగవానుడు.

*"తావత్ సుతలమధ్యాస్తాం విశ్వకర్మవినిర్మితమ్" (భాగ 8-22-32).*

## 631. స్వర్గాధికసుఖప్రదః :

స్వర్గసుఖములకన్న అధిక సుఖములను సుతలమందు బలికి ప్రసాదించిన భగవానుడు "స్వర్గాధికసుఖప్రదః" అనబడతాడు.

*"..... సుతలం స్వర్గిభిః ప్రార్థ్యం జ్ఞాతిభిః పరివారితః" (భాగ 8-22-33).*

**కర్మసంపూర్తికర్తా చ స్వర్గసంస్థాపితామరః ।**
**జ్ఞాతత్రివిధధర్మాత్మా మహామీనోఽబ్ధిసంశ్రయః ॥ 128**

## 632. కర్మసంపూర్తికర్తా (చ) :

ఇంతకు పూర్వము మొదలుపెట్టిన యజ్ఞకర్మలను చక్కగా పూర్తి చేయించిన భగవానుడు, కర్మసంపూర్తికర్త. భగవంతుని సాన్నిధ్యములో విధిపూర్వకముగా కర్మ జరిపించుటవలన సాధారణముగాపొందే ఫలితము కన్న ఎంతో అధిక ఫలము కలుగజేసే భగవానుడు కర్మసంపూర్తికర్త.

*"కుతస్తత్కర్మ వైషమ్యం యస్య కర్మేశ్వరో భవాన్...." నుంచి ".... ఏతచ్ఛ్రేయః పరం పుంసాం యత్ తవాజ్ఞానుపాలనం" [భాగ 8-23 - (15-17)].*

## 633. స్వర్గసంస్థాపితామరః :

స్వర్గములో దేవతలను వారివారి స్థానములలో తిరిగి నిలబెట్టిన భగవానుడు "స్వర్గసంస్థాపితామరః" అనబడతాడు.

## 634. జ్ఞాతత్రివిధధర్మాత్మా :

సాత్విక రాజస తామస భక్తులకు తమ తమ గుణధర్మముల ననుసరించి వారి వారి ఉపాస్యదేవతా రూపములలో తెలియబడు ఒకే భగవానుడు జ్ఞానత్రివిధధర్మాత్మ.

*"యేఽప్యన్య దేవతా భక్తా యజన్తే...." (గీత 9-23).*



## 635. మహామీనః :

"మహాంశ్చాసౌ మీనశ్చేతి, మహత్త్వమలౌకికత్వేన. మీయతే హింస్యతే సర్వైరితి మీనః." అందరిచేత హింసింసబడి చంపబడేది మీనము. లోకములో ఎక్కడా ఎప్పుడు, కని విని ఎరుగని గొప్పచేపరూపములో నున్న మత్స్యావతార భగవానుడు, "మహామీనః" అనబడతాడు.

## 636. అబ్ధిసంశ్రయః :

"ఆపోధీయన్తేఽస్మిన్ ఇతి అబ్ధిః" నీరు ఎచ్చట చక్కగా (అన్నిచోట్ల నుండి వచ్చి ఎక్కడికి పోకుండా) నిలుస్తుందో అది అబ్ధి, సముద్రము. ప్రళయకాలములో అన్ని మునిగిపోగా సముద్రమొక్కటే ఉంటుంది. అప్పుడు అది నిలయముగా గల భగవానుడు అబ్ధిసంశ్రయుడు.

*"ఆసీదతీతకల్పాన్తే బ్రాహ్మో నైమిత్తికో లయః...." (భాగ 8-24-7).*

**సత్యవ్రతప్రియో గోప్తా మత్స్యమూర్తిధృతశ్రుతిః ।**
**శృంగబద్ధధృతక్షోణిః సర్వార్థజ్ఞాపకోగురుః ॥ 129**

## 637. సత్యవ్రతప్రియః :

రాజర్షి సత్యవ్రతునికి ప్రియమైన మీనము మత్స్యావతార భగవానుడు. భగవానుడే సత్యము. ఆ సత్యమే వ్రతముగా గలవాడు సత్యవ్రతుడు. అతని ప్రియుడైన భగవానుడు సత్యవ్రతప్రియుడు.

## 638. గోప్తా :

ప్రళయ సముద్రములో వేగముగా ముంచివేస్తున్న జలమునుండి సత్యవ్రతుడు, సప్తమహర్షులు ఎక్కిన నావను మునిగిపోకుండా రక్షించిన మత్స్యరూపభగవానుడు.

*"అహం త్వామృషిభిః సాకం సహనావముదన్వతి" నుంచి ".... మే సంప్రశ్నైర్వివృతం హృది" (భాగ 8-24-37, 38).*

**639. మత్స్యమూర్తిధృతశ్రుతిః :**

వేదములు దొంగిలించిన హయగ్రీవుడనే అసురుని వధించి, వేదములను తిరిగి తన వశము చేసుకొని, వేదరక్షణచేసిన మత్స్యమూర్తి భగవానుడు. ఈ నామమునకు "మత్స్యమూర్త్యుద్ధృతశ్రుతిః" అని పాఠాంతరము కలదు. అర్థము సమానము.

**640. శృంగబద్ధధృతక్షోణిః :**

మునిగి పోతున్న భూమిని పైకి తీసి, తన శృంగమునకు కట్టుకున్న నావతోసహా రక్షించిన మత్స్యభగవానుడు.

*"దోధూయమానాం తాం నావం సమీరేణ బలీయసా..." (భాగ 8-24-36).*

**641. సర్వార్థజ్ఞాపకః :**

సర్వార్థములు అనగా అన్ని పురుషార్థములు, భగవత్స్వరూప సంపూర్ణ రహస్యము, జ్ఞాన, భక్తి, కర్మయోగ సిద్ధాంతములు, ధర్మములు మొదలైనవన్నీ మత్స్యపురాణములో చెప్పబడ్డవి. ఇవన్నీ సత్యవ్రతునకు జ్ఞాపకముచేసిన సర్వార్థజ్ఞాపకుడు మత్స్యరూప భగవానుడు. అందుచేతనే తర్వాత నామము గురువు అని చెప్పబడ్డది.

*"పురాణ సంహితాం దివ్యాం సాంఖ్యయోగక్రియా వతీం.." (భాగ 8-24-55).*

**642. గురుః :**

"గృహ్ణాతి ఉపదిశతి తత్త్వం ఇతి గురుః' భగవత్తత్త్వోపదేశముచేసి శిష్యుని అనుగ్రహించినవాడు గురువు. సత్యవ్రతునకు ఇట్టి ఉపదేశము చేసిన మత్స్యభగవానుడు గురువు.

*"అనాద్యవిద్యోపహతాత్మసంవిదః....." నుంచి "....మత్స్యరూపీ మహాంభోధౌ విహరంస్తత్త్వమబ్రవీత్" వరకు. [భాగ 8-24 - (46-54)].*

ఇంతవరకు అష్టమస్కంధ నామములు.



## శ్రీమద్భాగవత నవమస్కంధ నామములు

*ఈశానుకథాలీలా నామములు (643-728)*

*శ్లోక సంఖ్య (130-148)*

**ఈశసేవకలీలాత్మా సూర్యవంశప్రవర్తకః ।**
**సోమవంశోద్భవకరో మనుపుత్రగతిప్రదః ॥ 130**

**643. ఈశసేవకలీలాత్మా :**

ఈశః భగవానుడు. ఈశసేవకః భగవద్భక్తుడు. ఈశసేవకలీలా అంటే భగవంతునికి భక్తునికి మధ్యగల సేవ్య- సేవకలీలలు. ఇట్టి లీలలు చిత్తమందు గల భక్తుని కంటె వేరుకాని భగవానుడు "ఈశసేవకలీలాత్మ".

**644. సూర్యవంశప్రవర్తకః :**

సూర్యవంశమునందు పుత్ర పుత్రికా సంతానము కలుగచేసి వారిచే ఆ వంశపరంపరలను చక్కగా నిర్వహింపజేసిన భగవానుడు, సూర్యవంశ ప్రవర్తకుడు.

*"పరావరేషాం భూతానామాత్మా యః పురుషః పరః...." (భాగ 9-1-8).*

**645. సోమవంశోద్భవకరః :**

సోమునితో (చంద్రునితో) ప్రారంభమైన వంశము సోమ (చంద్ర) వంశము. బ్రహ్మపుత్రుడు అత్రి. అతని తనయుడు సోముడు. సోమునికి తార వలన బుధుడు జన్మించాడు. బుధునికి ఇలాదేవికి పుత్రుడు పురూరవుడు. సోమవంశము వృద్ధి చెంది ఇలాదేవి ద్వారా పురూరవుడు జన్మించుటకు వారి వంశములోని రాజుల చరిత్రకు, కారణమైన భగవానుడు సోమవంశోద్భవకరుడు.

**646. మనుపుత్రగతిప్రదః :**

వైవశ్వతమనువు పుత్రుడైన పృషధ్రునికి సద్గతి ప్రసాదించిన

భగవానుడు మనుపుత్రగతిప్రదుడు. పృషధ్రుడు కులగురువైన వశిష్ఠుని శాపముచేత క్షత్రియవర్ణమునుండి పతితుడైనాడు. కాని అతడు బ్రహ్మచర్య నిష్ఠలో సమస్త ప్రాణులయందు అహైతుక హితముకలిగి వాసుదేవుని భక్తుడై సద్గతిని పొందాడు. ఇట్టి సద్గతి నిచ్చిన భగవానుడు మనుపుత్రగతిప్రదుడు.

**అంబరీషప్రియః సాధుర్దుర్వాసాగర్వనాశకః ।**
**బ్రహ్మశాపోపసంహర్తా భక్తకీర్తివివర్ధనః ॥ 131**

## 647. అంబరీషప్రియః :

అంబరీషునికి ప్రియుడైన భగవానుడు. అంబరీషుడు ఎవరికి ప్రియుడో, ఆ భగవానుడు అంబరీష ప్రియుడు.

*"అంబరీషో మహాభాగః సప్తద్వీపవతీం మహీం..." నుంచి ".... ఏకాన్త భక్తి భావేన ప్రీతో భృత్యాభిరక్షణం" వరకు* [*భాగ 9-4 - (15-28)*].

## 648. సాధుః :

"సాధయతి భక్తకార్యం సర్వప్రకారేణేతి సాధుః." అన్ని విధములచేత భక్తుల కార్యములను సాధించే భగవానుడు సాధువు. దూర్వాసుని క్రోధమునుండి అంబరీషుని రక్షించిన భగవానుడు సాధువు.

"తస్మా అదాద్ధరిశ్చక్రమ్ ప్రత్యనీకభయావహం:..." (భాగ 9-4-28)

"అహో అస్య నృశంసస్య శ్రియోన్మత్తస్య పశ్యత..." నుంచి ".... క్షమాపయ మహాభాగం తతః శాన్తిర్భవిష్యతి" వరకు [భాగ 9-4- (44-71)].

## 649. దుర్వాసాగర్వనాశకః :

అంబరీషుని నియమభంగము చేయాలని తలచిన దూర్వాసుని తపో గర్వనాశనము చేసిన భగవానుడు.



*"ఉపాయం కథయిష్యామి తవ విప్ర శృణుష్వ తత్" నుంచి "క్షమాపయ మహాభాగం తతః శాన్తిర్భవిష్యతి" వరకు* [*భాగ 9-4 - (69-71)*].

## 650. బ్రహ్మశాపోపసంహర్తా :

దూర్వాసుడు (బ్రాహ్మణుడు) అంబరీషునిపై ప్రయోగించిన కృత్యను తత్క్షణమే సుదర్శన చక్రముచే సంహరించిన భగవానుడు "బ్రహ్మశాపోప సంహర్తా" అనబడతాడు.

*"దదాహ కృత్యాం తాం చక్రం కృద్ధాహి మివ పావకః" (భాగ 9-4-48).*

## 651. భక్తకీర్తివివర్ధనః :

అంబరీషుడు భాగవతోత్తముడు. అట్టివారు భాగవతులలో లేరు అన్న ఘనకీర్తి అంబరీషునికి కలదని అందరికి తెలుయునట్లు ఆ కీర్తిని వర్ధిల్లజేసిన భగవానుడు భక్తకీర్తివివర్ధనుడు.

*"అహం భక్త పరాధీనో హ్యస్వతంత్ర ఇవ ద్విజ...." నుంచి ".... సాధుషు ప్రహితం తేజః ప్రహర్తుః కురుతేఽ శివమ్" వరకు* [*భాగ 9-4 - (63-69)*].

**ఇక్ష్వాకువంశజనకః సగరాద్యఖిలార్థదః ।**
**భాగీరథమహాయత్నో గంగాధౌతాంఘ్రిపంకజః ॥ 132**

## 652. ఇక్ష్వాకువంశజనకః :

వైవస్వతమనువు జ్యేష్ఠపుత్రుడైన ఇక్ష్వాకుని వంశములో తాను రాముడై జన్మించుట కొరకు ఆ వంశమును శ్రేష్ఠమైనదిగా వృద్ధి చేయుటకు కారణుడైన భగవానుడు.

## 653. సగరాద్యఖిలార్థదః :

సగరునకు ఆతని సంతానమునకు ఔర్వఋషిచే ఉపదేశము చేయించి వారికి అఖిల పురుషార్థములు చేకూర్చిన భగవానుడు సగరాద్యఖిలార్థదుడు.

*"రాజ్యమంశుమతి న్యస్య నిఃస్పృహో ముక్తబంధనః" (భాగ 9-8-31).*

## 654. భగీరథమహాయత్నః :

1. తన పితృపితామహులకు ఉత్తమగతి కలిగించుటకు గంగను పాతాళమునకు తీసుకు వచ్చుట అవసరము. అందుకొరకు భగీరథుడు చేసిన గొప్ప ప్రయత్నము భగీరథమహాయత్నము. ఆ ప్రయత్నరూపముగల భగవానుడు.

2. ఏ భగవంతుని అనుగ్రహముచేత భగీరథుడు గంగను పాతాళము వరకు తీసుకురాగలిగెనో ఆ ప్రయత్నము భగవదనుగ్రహరూపము. ఆ అనుగ్రహరూపుడైన భగవానుడు. భగవానుని దయ ఉండుటచేతనే భగీరథుని ప్రయత్నము సఫలమైనది. ఆతని పితృపితామహులకు అట్టి భగవదనుగ్రహము లేకపోవుటచే వారి ప్రయత్నములు సఫలముకాలేదు.

## 655. గంగాధౌతాంఘ్రిపంకజః :

1. గంగచే కడుగబడ్డ పాదపంకజములు గల భగవానుడు.

2. ఏ భగవానుని పాదములు కడిగిన నీటిచే గంగాతరంగములు పుట్టినవో ఆ భగవానుడు గంగాధౌతాంఘ్రిపంకజుడు.

**బ్రహ్మస్వామీ శివస్వామీ సగరాత్మజముక్తిదః ।**
**ఖట్వాంగమోక్షహేతుశ్చ రఘువంశవివర్ధనః ॥ 133**

## 656. బ్రహ్మస్వామీ :

బ్రహ్మదేవునకు, బ్రహ్మణ్యులకు, బ్రహ్మర్షులకు ప్రభువైన భగవానుడు బ్రహ్మస్వామి.

## 657. శివస్వామీ :

నిర్మలుడైన శివునికి భాగవానుడు ఉపాస్యుడు, ప్రభువు. కనుకనే శివుడు విష్ణుపాదముల నుండి పుట్టిన గంగను శిరస్సుపైన ఉంచుకున్నాడు.అందుచేత భగవానుడు శివస్వామి.



## 658. సగరాత్మజముక్తిదః :

అరవైవేల సగరుని కుమారులకు (గంగాజలముచే వారి అస్థికలు తడుపజేసి) మోక్షమిచ్చిన భగవానుడు. "సగరాత్మజముక్తిదః" అనబడతాడు.

*"స్రోతసామస్మిజాహ్నవీ" (గీత 10-31).*

## 659. ఖట్వాంగమోక్షహేతుః (చ) :

ఖట్వాంగ మహారాజుకు మోక్షము నిచ్చిన భగవానుడు. ఖట్వాంగుని ఆయుర్దాయము చెల్లిపోగ, అతడు ఇంద్రియములు, మనస్సు, వాటి అధిదేవతలు పెట్టే ప్రలోభమును తిరస్కరించి భగవానునే స్మరిస్తూ మరణించాడు. ఖట్వాంగునికి అట్టి బుద్ధి ప్రసాదించిన భగవానుడు ఖట్వాంగమోక్షహేతువు.

*"యోదేవైరర్థితో దైత్యానవధీద్ యుధి దుర్జయః..." నుంచి ".... భగవాన్ వాసుదేవేతి యం గృణన్తి హి సాత్వతాః" వరకు [భాగ 9-9 - (42-49)].*

## 660. రఘువంశవివర్ధనః :

రఘు వంశమును శౌర్య, ఐశ్వర్య, ధర్మాదులతో కూడినదిగాను, ఇతర రాజవంశములకన్నా ఎక్కువగా వృద్ధి పొందినదిగాను చేసిన భగవానుడు రఘువంశవివర్ధనుడు. రఘువంశము రాజవంశములలో సర్వోత్తమమైన దగుటచేత ఆవంశమునందు స్వయముగా భగవానుడు పురుషోత్తముడైన శ్రీరామచంద్రునిగా అవతరించాడు. శ్రీరామచంద్రుడు సాక్షాత్ పరబ్రహ్మమైన శ్రీహరియే. లక్ష్మణ భరత శత్రుఘ్నులుకూడా భగవానుని అంశలే. ఇట్లు శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురు భగవానుని అవతారాలే. (వీరు నలుగురు చతుర్వ్యూహమూర్తులు (వ్యూహ విగ్రహః 675వ నామము చూడుడు).

*"తస్యాపి భగవానేష సాక్షాద్బ్రహ్మమయో హరిః...." నుంచి "... శ్రుతం హి వర్ణితం భూరి త్వయా సీతాపతేర్ముహుః" (భాగ 9-10-2, 3).*

ఈ తర్వాత కొన్ని నామములు పురాణాంతరములలోని విషయములకు సంబంధించినవని తెలుసుకొనవలెను.

**రఘునాథో రామచంద్రో రామభద్రో రఘుప్రియః ।**
**అనంతకీర్తిః పుణ్యాత్మా పుణ్యశ్లోకైకభాస్కరః ॥ 134**

### 661. రఘునాథః :

రఘుకులము వారందరికి ప్రభువు రఘునాథుడు. "నాథృ నాధృ యాంచో పతాపైశ్వర్యాశీఃష్వితి ధాతుపాఠాత్ రాఘువోనాథాః" నాధృధాతువునకు ఐశ్వర్యము లేక ఆశీష్‌ల నిచ్చుట అని అర్థము. "రాఘవోనాథాః ప్రాప్తైశ్వర్యా యస్మాదితి వా." రఘువంశరాజులు ఎవరివలన ఐశ్వర్యము పొందేరో ఆ భగవానుడు రఘునాథుడు. రఘువంశము ఐశ్వర్యాది గుణసంపన్నమైనది. ఆ వంశములో షడ్గుణైశ్వర్యసంపన్న భగవానుడు, శ్రీరాముడై అవతరించి మరింత ఉత్కృష్టత ఆ వంశమునకు కలిగించాడు.

### 662. రామచంద్రః :

"రమన్తే యోగినో ఽ నన్తే సదానందే చిదాత్మని । ఇతిరామ పదేనాసౌ పరబ్రహ్మా భిధీయతే" (రామోపనిషత్). స్వస్వరూపానందముతో క్రీడిస్తూ రమించు పరబ్రహ్మమని 'రామ'పదమునకు అర్థము. అందరిని ఆహ్లాదపరుస్తాడు గనుక చంద్రుడు. (వా.రా. బాల 1వ సర్గ, శ్లో 2, 3, 4). అందుచేత రామచంద్ర శబ్దమునకు పరమానందస్వరూపుడై, అందరిని ఆహ్లాదపరిచే పరబ్రహ్మమని అర్థము.

చంద్రుడు నక్షత్రములకు రాజైనా చంద్రునిలో కళంకములున్నాయి. పూర్తి ఆనందమునివ్వలేడు. రాముడు పరమేశ్వరుడు. పరమాహ్లాదకరుడు. 'రామచంద్ర" పదములో చంద్ర శబ్దమున్నప్పటికి రామునిలో కళంకములు లేవు. అందుచేతనే ఆనందస్వరూపుడైన శివుడు పార్వతికి యీ విధంగా చెప్పేడు. "రా కారాదీని నామాని శృణ్వతో మమ పార్వతీ। మనః ప్రసన్నతా మేతి రామనామాభిశంకయా" "రా అన్న అక్షరముతో మొదలైన ఏ పదము వినినా "రామ" శబ్దము చిత్తమునందు మెదలి ప్రసన్నత ఆనందము కలుగుతాయి. అందుకే "రామచంద్రః" భగవానుని నామము.



### 663. రామభద్రః :

"రామ ఏవ భద్రః మంగళరూపః" రాముడే భద్రశబ్దార్థము. మంగళ స్వరూపుడు. తత్త్వవేత్తలు శ్రీరాముని "కళ్యాణానాం నిధానం" అని చెప్తారు. కనుక "రామభద్రః" భగవానుని నామము.

### 664. రఘుప్రియః :

రఘు వంశములోని రాజులందరికి ప్రియుడు రాముడు. రఘు వంశ మంటే భగవానునికి ప్రీతి. రఘువంశములోని రాజులందరు భగవానునికి ప్రియులు కనుక "రఘుప్రియః" అని భగవానుని నామము.

### 665. అనన్తకీర్తిః :

అనంత అంటే దేశకాల పరిమితులు లేనిది. కీర్తి అంటే ప్రతాప స్వరూపము. అట్టి అనంత కీర్తి కలవాడు శ్రీరాముడు. హనుమద్వాల్మీకి ప్రభృతులు ఇట్టి రాముని అనంతప్రతాపస్వరూప కీర్తిని ప్రశంసించారు. కీర్తించారు. కనుకనే "అనంతకీర్తిః" భగవానుని నామము.

### 666. పుణ్యాత్మా :

రాముడు పుణ్యపుంజములన్నీ మూర్తీభవించిన స్వరూపుడు. అందు వలననే రాముని ధ్యేయస్వరూపునిగా స్తుతిస్తారు పురాణాంతరములలోని రాముని ధ్యానశ్లోకములు రాముడే ధ్యేయస్వరూపుడని, చెప్పబడ్డాయి.

"రామం దూర్వాదళశ్యామం, పద్మాక్షం, పీతావాససం । యే స్మరన్తి నరా నిత్యం న తే, సంసారిణోభువి । ధ్యాయేదాజానుబాహుం ధృతశరధనుషం బద్ధపద్మాసనస్థం । పీతం వాసోవసానం నవకమలదళస్పర్ధినేత్రం ప్రసన్నం, వామాంకారూఢ సీతాముఖ కమలమిలల్లోచనం నీరదాభం నానాలంకారదీప్తం దధత పురుజటామండలం । రామభద్రం వామే కోదండదండం, నిజకరకమలే దక్షిణే బాణమేకం పశ్చాద్భాగే చ నిత్యం ధతమభిమతం సాసితూణీరభారం । ధవామే వామే వసద్భ్యాం సహమిలితతనుం జానకీ లక్ష్మణాభ్యాం। శ్యామం రామం భజేహం ప్రణత జనమనః ఖేదవిచ్ఛేదదక్షమ్ ॥

రాముడు పుణ్యాత్ముడు, పరమాత్ముడు.

## 667. పుణ్యశ్లోకైకభాస్కరః :

1. శ్లోకః అనగాకీర్తి; స్తుతింప, లేక కీర్తింప, లేక పొగడదగిన వాడు. పుణ్యశ్లోకః అనగా గొప్ప కీర్తిగలవాడు లేక ఎవని నామము కీర్తించుట పుణ్యప్రదమో అట్టివాడు. రాముడు అట్టి పుణ్యశ్లోకులందరిలో శ్రేష్ఠుడు. తన కీర్తిచేత ప్రపంచ మంతటిని ప్రకాశింప జేసేవాడు. కనుక పుణ్యశ్లోకైకభాస్కరుడు.

2. పుణ్యముచేత, కీర్తిచేత ప్రకాశించే వారందరిలో రామునికి రాముడే సాటి అని లోక ప్రసిద్ధి చెందిన శ్రీరాముడే పుణ్యశ్లోకైకభాస్కరుడు.

**కోశలేంద్రః ప్రమాణాత్మా సేవ్యో దశరథాత్మజః ।**
**లక్ష్మణో భరతశ్చైవ శత్రుఘ్నో వ్యూహవిగ్రహః ॥ 135**

## 668. కోశలేంద్రః :

"కోశలానాముత్తరకోశలానామింద్రః ఈశ్వరః; సర్వేశ్వరత్వేపి తేషాం మాతృపక్షత్వాద్విశేషోక్తిః "కోశలేంద్రః". అంటే ఉత్తర కోశలదేశమునకు రాజు అని అర్థము. భగవానుడు రాముడు సర్వేశ్వరుడైనప్పటికి కౌసల్య సుతు డగుటచేత మాతృపక్ష విశేషముగల నామము ఇది. రామావతార సంబంధిత భగవన్నామము.

## 669. ప్రమాణాత్మా :

1."ప్రమాణానాం శ్రుత్యాదీనామాత్మా తత్ప్రతిపాద్య సారభూత ఇత్యర్థః." వేదములు మొదలైన శాస్త్రములు ప్రమాణములు. శ్రుత్యాదులలో ప్రతిపాదింప బడినట్టి, ఆ వేదాదులకే సారభూతమైనట్టి పరబ్రహ్మస్వరూపుడైన రాముడు "ప్రమాణాత్మా".

2. "ప్రమా రూప ఇతివా" ప్రమ అనగా యథార్థవస్తుజ్ఞానము – జ్ఞానస్వరూపుడైన భగవానుడు "ప్రమాణాత్మా".

3. భగవదైశ్వర్య లక్షణములుకల రాముడు వేద నిర్ణీత ప్రమాణముల కతీతమైన కార్యములు కూడా, వేద ప్రమాణముల నంగీకరించి వాని కనుగుణమైన విధముగానే ఆచరించి లోకమునందు అందరికి ప్రమాణమైనాడు. అందుచేత రాముడు "ప్రమాణాత్మ".



## 670. సేవ్యః :

సేవింపయోగ్యుడైన శ్రీరాముడు సేవ్యుడు. ఇచ్చట కర్మబోధకములై శ్రుత్యాది ప్రమాణములననుసరించి చేసే ఆరాధనలు, పూజలు అన్న అర్థములో సేవ్య పదము చెప్పబడలేదు. ఆచార్యులు ప్రమేయరూప భగవానుని 'భజనయే సేవ' అని చెప్పారు.

ఇచ్చట ఒక సూక్ష్మార్థము ఉన్నది. శ్రుత్యాది ప్రమాణములు పాటిస్తూ చేసే భగవత్సేవలో భక్తుని శ్రద్ధ భగవంతునిపైని కాక ప్రమాణములపై ఉంటుంది. అథవా, భగవంతునిపైనే కాక ప్రమాణములపై కూడా ఉండి శ్రద్ధ ద్వివిధమై భక్తులు భగవంతుని అనన్యముగా భజించలేరు. అనన్యము సతతము చేసే భజన యందు భగవంతుని యందలి ప్రేమ మాత్రమే ఉంటుంది. కనుక అవిచ్ఛిన్న ప్రేమ భక్తియే నిజమైన సేవా లక్షణము. ఇది సుసాధ్యము కూడా. అందుచేత అనన్య సతత ప్రేమభక్తితో సేవింప(భజింప)దగిన భగవానుడు, సేవ్యుడు.

## 671. దశరథాత్మజః :

భగవానుడు దశరథునికి పుత్రుడై (శ్రీరాముడై) అవతరించాడు. భగవంతుడే తాను దశరథునికి కొడుకుగా పుడతానని అన్నందువలన (ప్రమేయ బలము వలన) భగవానుడు (రాముడు) దశరథాత్మజుడని చెప్పుటకు మరి ఏ ప్రమాణము అక్కరలేదు.

## 672. లక్ష్మణః :

"లక్ష్మ" అంటే పాపము. దీనిని పోగొట్టేవాడు లక్ష్మణుడు, భగవానుని సంకర్షణరూపము.

## 673. భరతః :

1. "భరః పోషణం తేన త్రాయతే రక్షతి ప్రజాం ఇతి భరతః." ప్రజలను పోషణచేసి రక్షించేవాడు భరతుడు.

2. "భరం యుద్ధం తనోతీతివా." స్థిరముగా నిలిచి యుద్ధము చేయువాడు భరతుడు. ఇట్టి గుణములుగల భరతుని రూపములోనున్న భగవానుడు.

**674. శత్రుఘ్నః :**

శత్రువుల నోడించే శీలము కలవాడు లేక శత్రువులను చంపేవాడు శత్రుఘ్నుడు. ఇట్టి శత్రుఘ్నరూపములోనున్న భగవానుడు.

**675. వ్యూహవిగ్రహః :**

దేవకార్యము చేయుటకై అవతరించిన శ్రీరామ, భరత, లక్ష్మణ శత్రుఘ్నులు భగవానుని చతుర్వ్యూహమూర్తులు – వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధులు. వీరందరి రూపములలో నున్న భగవానుడు.

*"... రామలక్షణ భరత శత్రుఘ్నా ఇతి సంజ్ఞయా"* *(భాగ 9-10-2)*

*"బ్రూహ్యాత్మానం చతుర్ధావై వాసుదేవాది మూర్తిభిః సృష్ట్యాదీన్ ప్రకరోత్యేష విశ్రుతాత్మా జనార్దన"* *(వ్యాసుడు).*

**విశ్వామిత్రప్రియో దాన్తస్తాడకావధమోక్షదః ।**
**వాయవ్యాస్త్రాబ్ధినిక్షిప్తమారీచశ్చ సుబాహుహా ॥ 136**

**676. విశ్వామిత్రప్రియః :**

రామునికి విశ్వామిత్రుడు ప్రియుడు. విశ్వామిత్రునికి రాముడు ప్రియుడు. విశ్వామిత్రుని యాగరక్షణకై రాక్షసవధచేసి రాముడు విశ్వామిత్రునికి ప్రీతి కలుగజేసాడు. విశ్వామిత్రుడు రాముని సీతాస్వయంవరమునకు తీసుకొని వెళ్లి రామునికి ప్రియము కలుగ చేసాడు. రామునికి శస్త్రాస్త్రములు ఇచ్చాడు.

**677. దాన్తః :**

"దమయతి రాక్షసాన్ ఇతి దాన్తః" రాక్షసులను చంపిన రాముడు దాన్తుడు.



**678. తాడకావధ మోక్షదః :**

తాటక ఏ సాధన చేయలేదు. అయినా ఆ రాక్షసిని వధించుట మాత్రముచేతనే ఆమెకు మోక్షమిచ్చిన రాముడు.

**679. వాయవ్యాస్త్రాబ్ధినిక్షిప్తమారీచః (చ) :**

విశ్వామిత్రుని యజ్ఞము పాడుచేయుటకు వచ్చిన మారీచుని వాయవ్యాస్త్రము ప్రయోగించి సముద్రములోనికి త్రోసివేసిన రాముడు.

**680. సుబాహుహా :**

విశ్వామిత్రుని యజ్ఞరక్షణ సమయములో సుబాహుని చంపిన రాముడు "సుబాహుహా".

**వృషధ్వజధనుర్భంగప్రాప్తసీతామహోత్సవః ।**
**సీతాపతిర్భృగుపతిగర్వపర్వతనాశకః ॥ 137**

**681. వృషధ్వజధనుర్భంగప్రాప్తసీతామహోత్సవః :**

జానకీ స్వయంవరమునకు శివధనుస్సు ఎక్కుపెట్టుట పణముగా పెట్టబడినది. శ్రీరాముడు ఆ ధనుస్సు ఎక్కుపెట్టగా అది విరిగినది. శ్రీరాముడు యీ విధముగా సీతాస్వయంవర ప్రతిజ్ఞను నిలబెట్టి సీతాదేవిని పెండ్లాడాడు. ఈ సీతారామకళ్యాణమహోత్సవ ఆనందమును పొందిన శ్రీరాముడు.

**682. సీతాపతిః :**

సీతాదేవి భర్త అయిన శ్రీరాముడు సీతాపతి.

**683. భృగుపతిగర్వపర్వతనాశకః :**

పరశురాముడు క్షత్రియకులక్షయము చేయాలని ప్రతిజ్ఞచేసి, ఇరవై ఒక్కసార్లు దేశమంతా తిరిగి రాజులను చంపి, ఆ గర్వముతో శ్రీరాముని

ఎదిరించాడు. ఈ సంఘటన సీతాకళ్యాణానంతరము అయోధ్యకు తరలి వెళ్ళే సమయములో జరిగినది. పర్వత సమానమైన గర్వము కలిగి శ్రీరాముని నిందిస్తూ అడ్డు నిలిచాడు. శ్రీరాముడు పరశురాముని విష్ణుధనుస్సు తీసుకుంటూ ఆ పరశురాముని శక్తినికూడా ఆకర్షించాడు. ఆతని గర్వపర్వతమును నాశనము చేసాడు. భృగుపతిగర్వపర్వతనాశకుడైన భగవానుడు.

**అయోధ్యాస్థమహాభోగయుక్తలక్ష్మీవినోదవాన్ ।**
**కైకేయీవాక్యకర్తా చ పితృవాక్పరిపాలకః ॥ 138**

**684. అయోధ్యాస్థమహాభోగయుక్తలక్ష్మీవినోదవాన్ :**

అయోధ్యానగరములోనున్న సకల రాజభోగములను లక్ష్మీరూపిణి యగు సీతాదేవితో కలిసి ఆనందోత్సాహక్రీడలతో ఆనందించిన శ్రీరాముడు.

**685. కైకేయీవాక్యకర్తా (చ) :**

పదునాలుగేళ్లు అరణ్యవాసము చేయమని కైకేయీదేవి రాముని ఆదేశించినది. ఆ ఆదేశము నెరవేర్చిన శ్రీరాముడు కైకేయీవాక్యకర్త.

**686. పితృవాక్పరిపాలకః :**

తండ్రి దశరథుడు శ్రీరామునికి ఏమియు చెప్పలేకపోయెను. తండ్రి ఆదేశముగా రాముడు వనవాసము చేయవలెనని కైకేయి చెప్పగా (ధర్మజ్ఞులు ఆ పని చేయనక్కరలేదని వారించినా) శ్రీరాముడు పితృవాక్పరిపాలన చేసాడు. ఇట్టి పితృవాక్పరిపాలకుడు రాముడు.

**వైరాగ్యబోధకోఽనన్యసాత్వికస్థానబోధకః ।**
**అహల్యాదుఃఖహారీ చ గుహస్వామీ సలక్ష్మణః ॥ 139**

**687. వైరాగ్యబోధకః :**

శ్రీరాముని కర్తవ్య ఆచరణ వైరాగ్యబోధకము. సర్వము పరిత్యజించి ఇతరులకు తన ఆచరణచేత వైరాగ్యము బోధించిన శ్రీరాముడు వైరాగ్యబోధకుడు.



తండ్రి తనకు యౌవరాజ్యపట్టాభిషేకము చేస్తానని చెప్పినప్పుడు సంతోషముగాని, అదే సమయానికి అరణ్యవాసము చేయమని పంపినపుడు దుఃఖము గాని శ్రీరాముని హృదయములో కలుగలేదు. ఉదాసీనుడై ఉండెను. నిత్యజీవితములో ఇట్టి వైరాగ్య లక్షణము కలిగి ఉండాలని బోధన. ఇట్లు వైరాగ్య బోధకుడైన భగవానుడు.

**688. అనన్యసాత్వికస్థానబోధకః :**

"నాస్తన్యో యస్మిన్నిత్యనన్యం నిర్జనం; యత్ సాత్వికం సత్త్వప్రధాన స్థానం అరణ్యవాసః; తస్య బోధకో జ్ఞాపక ఇత్యర్థః." దేనియందు తనకన్నా వేరైనది లేదో అది అనన్యము లేక నిర్జనము, అనన్యము, సత్త్వప్రధానమైన ప్రదేశము- అరణ్యము. అందు నివసించుట అరణ్యవాసము. "తస్య బోధకో జ్ఞాపక ఇత్యర్థః." దాని గురించి బోధించువాడు లేక జ్ఞాపకము చేయు వాడు అని అర్థము. "వైరాగ్యేజాతే అరణ్యస్థితి రుచితేతి భావః" వైరాగ్యము కలుగగా అరణ్యవాసము రుచించునని భావము. అనన్య సాత్వికస్థానము గురించి శ్రీరాముడు సీతకు బోధించాడు. ఇట్టి అనన్యసాత్వికస్థానబోధకుడైన భగవానుడు.

**689. అహల్యాదుఃఖహారీ (చ) :**

భర్తశాపము చేత శిలారూపము పొందిన గౌతమముని భార్య అహల్యను తిరిగి స్త్రీగా చేసి ఆమె దుఃఖమును పోగొట్టిన శ్రీరాముడు "అహల్యాదుఃఖహారి".

**690. గుహస్వామీ :**

గుహుడనే నిషాధరాజుకు ప్రభువైన శ్రీరాముడు గుహస్వామి.

**691. సలక్ష్మణః :**

లక్ష్మణునితో కలిసి సంచరించుచున్న శ్రీరాముడు,"సలక్ష్మణః"

*(వా.రా. బాల 1-30).*

**చిత్రకూటప్రియస్థానో దండకారణ్యపావనః ।**
**శరభంగసుతీక్ష్ణాదిపూజితోఽగస్త్యభాగ్యభూః ॥ 140**

**692. చిత్రకూటప్రియస్థానః :**

రాముడు తన వనవాసములో మొట్టమొదట చిత్రకూటములో ఉండవలెనని అభిమతించెను. ఆప్రదేశము సీతారాములకు ఎక్కువగా ప్రియమైనది. ఇట్లు చిత్రకూటము ప్రియస్థానమైన రాముడు.

**693. దండకారణ్యపావనః :**

తన పాదయాత్రచే దండకారణ్యమంతటినితిరిగి, ఆ అరణ్యమును పావనముచేసిన శ్రీరాముడు. శ్రీరాముడు దండకారణ్యముచేరి అచ్చటనున్న రాక్షసులను సంహరించి,తన ఆశ్రమమునకు దగ్గరగానున్న ఋషులను రాక్షసులబాధనుండి రక్షించాడు. ఈ విధముగా దండకారణ్యమును పావనము చేసిన శ్రీరాముడు దండకారణ్యపావనుడు.

**694. శరభంగసుతీక్ష్ణాదిపూజితః :**

శరభంగసుతీక్ష్ణాది భక్తుల దగ్గరకు వెళ్ళి, వారిచే ఆతిథ్యము, పూజలు అందుకొనిన శ్రీరాముడు శరభంగసుతీక్ష్ణాదిపూజితుడు.

**695. అగస్త్యభాగ్యభూః :**

1) అగస్త్యునికి తన దర్శనభాగ్యము కలుగచేసిన శ్రీరాముడు.

2) అగస్త్యుని తపఃఫలరూపమైన భాగ్యము వలన అతని ఆశ్రమమునకు వెళ్ళి దర్శనమిచ్చిన శ్రీరాముడు.

**ఋషిసంప్రార్థితకృతిర్విరాధవధపండితః ।**
**ఛిన్నశూర్పణఖానాసః ఖరదూషణఘాతకః ॥ 141**

**696. ఋషిసంప్రార్థితకృతిః :**

రామునికి స్వయముగా ఎవరియుందును (రాక్షసులందుకూడా) ద్వేషములేదు. రాగద్వేషములకు అతీతుడైన రాముడు దండకారణ్య వాసులైన ఋషులను రాక్షసులు బాధించి చంపుచుండుటచేత ఋషులు ప్రార్థన చేయగా రాక్షస సంహారము చేసాడు. ఈ కారణము చేత రాముడు “ఋషిసంప్రార్థిత కృతిః” అనబడ్డాడు.



**697. విరాధవధపండితః :**

విరాధుడనే రాక్షసుని వధించుటలో శక్తి, ప్రవీణత చూపిన శ్రీరాముడు విరాధవధపండితుడు (ప్రావీణ్యుడు).

**698. ఛిన్నశూర్పణఖానాసః :**

రావణుని చెల్లెలు శూర్పణఖ (చేటలవలె పెద్ద గోళ్లు కలది గనక ఆమె పేరు శూర్పణఖ). ఆమె ముక్కు కోసి (రెండుగా చేసి) లక్ష్మణుడు వెళ్లగొట్టాడు. ఇట్లు లక్ష్మణునిచే చేయించిన శ్రీరాముడు. “ఛిన్నశూర్పణకానాసః” అనబడతాడు.

**699. ఖరదూషణఘాతకః :**

ఖరుడు దూషణుడు అనే రాక్షసులను వారి సైన్యముతోసహా ఒక్కడై చంపిన శ్రీరాముడు ఖరదూషణఘాతకుడు.

**ఏకబాణహతానేకసహస్రబలరాక్షసః ।**
**మారీచఘాతీ నియతసీతాసంబంధశోభితః ॥ 142**

**700. ఏకబాణహతానేకసహస్రబలరాక్షసః :**

వెయ్యి యోధుల బలముగల రాక్షసవీరులనేకమందిని, లేక వేల కొలది రాక్షసులు గల సేనలను, ఒకే బాణముతో చంపిన (శక్తి) ప్రవీణత గల శ్రీరాముడు.

**701. మారీచఘాతీ :**

బంగారు వన్నెగల లేడి రూపములో వచ్చిన మారీచుని చంపిన శ్రీరాముడు.

**702. నియతసీతాసంబంధశోభితః :**

మాయాసీతాపహరణము జరిగినను, అసలు సీత యొక్క లక్ష్మీ సంబంధిత శోభతోకూడి ప్రకాశించు శ్రీరాముడు నియతసీతాసంబంధశోభితుడు.

**సీతావియోగనాట్యశ్చ జటాయుర్వధమోక్షదః ।**
**శబరీపూజితో భక్తహనుమత్ప్రముఖావృతః ॥ 143**

**703. సీతావియోగనాట్యః (చ) :**

మాయా సీతను రావణుడు దొంగిలించుకుపోగా (ఆ దొంగిలింపబడ్డ సీత మాయాసీత అయినప్పటికి) సీత తనతో లేదన్న వియోగదుఃఖమును (నటునివలె) నటించిన శ్రీరాముడు.

**704. జటాయుర్వధమోక్షదః :**

సీతారక్షణ ప్రయత్నముచేసిన జటాయువు (గృధ్రము) రావణునిచే కొట్టబడ్డాడు. తనతో మాట్లాడుతూ ప్రాణములు వదిలిన జటాయువునకు రాముడు, కుమారుడు తండ్రికి ఉత్తరక్రియలు చేసిన విధముగా, అంత్యక్రియలు చేసాడు. ఆతనికి మరల జనన మరణములు లేకుండా మోక్షము ప్రసాదించాడు. "జటాయువధమోక్షదః" అన్న రెండవ పాఠము కలదు రెండు పాఠములు సాధువులే.

**705. శబరీపూజితః :**

స్త్రీ అయిన శబరిచే సత్కరింపబడి పూజింపబడ్డ శ్రీరాముడు శబరీ పూజితుడు.

**706. హనుమత్ప్రముఖావృతః :**

హనుమదాదిప్రముఖ భక్తగణము చుట్టూచేరిఉన్న శ్రీరాముడు (సుగ్రీవాది గొప్పభక్తులలో హనుమంతుడు శ్రేష్టుడు. అందుచే హనుమదాదిప్రముఖులని చెప్పబడింది).



**దుందుభ్యస్థిప్రహరణః సప్తతాలవిభేదనః ।**
**సుగ్రీవరాజ్యదో వాలీఘాతీ సాగరశోషణః ॥ 144**

**707. దుందుభ్యస్థిప్రహరణః :**

సుగ్రీవునికి రాముని శక్తియందున్న శంక దూరము చేయడానికి దుందుభి అనే అసురుని ఎముకల ప్రోగును తన పాదాంగుష్ఠముచేత దశయోజనముల దూరము చిమ్మిన శ్రీరాముడు.

**708. సప్తతాలవిభేదనః :**

ఏడు తాటిచెట్లను ఒకేఒక్క గొప్పబాణముతో నరికిన శ్రీరాముడు.

**709. సుగ్రీవరాజ్యదః :**

వాలివధానంతరము సుగ్రీవునకు కిష్కింధారాజ్యము ఇచ్చిన శ్రీరాముడు.

**710. వాలీఘాతీ :**

సుగ్రీవుని అన్నఅయిన వాలిని చంపిన శ్రీరాముడు వాలీఘాతీ.

**711. సాగరశోషణః :**

శోషణమంటే ఎండబెట్టుట. సముద్రుడు రామునికి, వానర సైన్యానికి లంక వెళ్లడానికి దారి ఇవ్వకపోగా, సముద్రమును ఎండపెడతానని బాణము సంధించిన రాముడు సాగరశోషణుడు.

*"యద్రోషవిభ్రమ వివృత్త కటాక్షపాత..."* *(భాగ 9-10-13).*

**సేతుబంధనకర్తా చ విభీషణహితప్రదః ।**
**రావణాదిశిరశ్ఛేదీ రాక్షసాఘౌఘనాశకః ॥ 145**

**712. సేతుబంధనకర్తా :**

సముద్రముదాటడానికి కొండరాళ్లతోను, చెట్లతోను నీటిపై సేతువు (వారధి) కట్టిన శ్రీరాముడు, సేతుబంధనకర్త.

**713. విభీషణహితప్రదః :**

విభీషణునికి ప్రియమైన (హితమైన) అనన్యభక్తిని ప్రకర్షముగా ఇచ్చిన శ్రీరాముడు విభీషణహితప్రదుడు.

**714. రావణాదిశిరశ్ఛేదీ :**

రావణ, కుంభకర్ణాదిరాక్షసుల శిరశ్ఛేదము చేసిన శ్రీరాముడు.

**715. రాక్షసాఘౌఘనాశకః :**

1) "రాక్షసానామఘస్య పాపస్య ఓఘః ప్రవాహోవిచ్ఛేదః; తస్య నాశకః భగవత్సాన్నిధ్యేఽ మృతత్వాత్." రాక్షసుల యొక్క పాపప్రవాహములను (సమూహములను) నాశనము చేసిన శ్రీరాముడు రాక్షసాఘౌఘనాశకుడు. భగవత్సాన్నిధ్యము నందు మరణించిన వారి పాపములన్నీ నశించిపోతాయి.

2) "యద్వా రాక్షసా ఏవ ఓఘౌఘాః, తేషాం. రాక్షసస్య రావణస్యవా" రాక్షసులే పాపసమూహములు. రావణుని, యితర రాక్షసులయొక్క పాప సమూహములను (ఛేధించి) నాశనము చేసిన శ్రీరాముడు. ఇట్టి రాక్షసాఘౌఘ నాశకుడైన భగవానుడు.

**సీతాఽ భయప్రదాతా చ పుష్పకాగమనోత్సుకః ।**
**అయోధ్యాపతిరత్యంతసర్వలోకసుఖప్రదః ॥ 146**

**716. సీతాఽ భయప్రదాతా (చ) :**

సీతకు అభయమునిచ్చిన శ్రీరాముడు. ఆమెకు రాక్షసులవలన భయము ఏ మాత్రము లేకుండా చేసిన శ్రీరాముడు, సీతాఽ భయప్రదాత.

**717. పుష్పకాగమనోత్సుకః :**

పుష్పకవిమానముపై అయోధ్య వెళ్లుటకు ఉత్సాహము కలిగిన శ్రీరాముడు.



**718. అయోధ్యాపతిః :**

అయోధ్యారాజ్యమునకు ప్రభువు, రక్షకుడు అయిన శ్రీరాముడు అయోధ్యాపతి.

**719. అత్యన్తసర్వలోకసుఖప్రదః :**

"అత్యన్తమతిశయితం సర్వలోకేభ్యః సుఖం తత్ప్రదదాతి సానుకంపామృత నిరీక్షణేనేతి తథా." అతిశయమైన కృపతో కూడిన తన అమృతవీక్షణముల చేత సర్వలోకములకు అనన్తమైన సుఖమును కలుగజేయు శ్రీరాముడు. అత్యన్తసర్వలోకసుఖప్రదుడు.

**మథురాపురనిర్మాతా సుకృతజ్ఞస్వరూపదః ।**
**జనకజ్ఞానగమ్యశ్చ ఐలాన్తప్రకటశ్రుతిః ॥ 147**

**720. మథురాపురనిర్మాతా :**

శత్రుఘ్నునిచే లేక ఆ రూపములో, మధువన ప్రదేశములో మథురా నగరము నిర్మించిన శ్రీరాముడు మథురాపురనిర్మాత.

**721. సుకృతజ్ఞస్వరూపదః :**

పుణ్యముగురించి తెలిసినవారు సుకృతజ్ఞులు. భక్తులకు సుకృతజ్ఞతను కలుగజేసిన లేక అట్టి స్వరూపమును ప్రసాదించిన శ్రీరాముడు.

**722. జనకజ్ఞానగమ్యః (చ) :**

రామరాజ్యములో ప్రజలకు రాముడే తమ తండ్రి (జనకుడు) అనే భావము (జ్ఞానము) కలిగించి తదనుగుణముగా ప్రవర్తింపజేసిన శ్రీరాముడు జనకజ్ఞానగమ్యుడు.

*జుగోప పితృవద్ రామో మేనిరే పితరం చ తం."* *(భాగ 9-10-51).*

**723. ఐలాన్తప్రకటశ్రుతిః :**

1. ఇలా అంటే భూమి. అన్తమనగా చివరి హద్దు. ఐలాన్తః అంటే భూప్రదేశము ఉన్నంత వరకు, లేక భూమి ఉన్నన్నాళ్ళూ అని అర్థము. "ఐలాన్తప్రకటశ్రుతిః." అంటే శ్రీరామునికీర్తి సర్వలోకములలో వ్యాపించి ఆచంద్రార్కము అందరికి ప్రకటీకృతమై అందరిచే కీర్తింపబడుతుంది.

2. భాగవతపరంగా ఐలః అంటే పురూరవుడు. పురూరవవంశ రాజులు భూమిని పాలించినంత కాలము, ఆ దేశముల చివర వరకు శ్రీరాముని కీర్తి భూమిపై ప్రకటింపబడుతూ, సర్వేసర్వత్రా కీర్తింపబడుతూ ఉంటుంది.

**హైహయాన్తకరో రామో దుష్టక్షత్రవినాశకః ।**
**సోమవంశహితైకాత్మా యదువంశవివర్ధనః ॥ 148**

**724. హైహయాన్తకరః :**

హైహయచక్రవర్తి అయిన కార్తవీర్యార్జునుని అంతము చేసిన పరశు రామభగవానుడు హైహయాన్తకరుడు.

*"హైహయానామధిపతిరర్జునః......." నుంచి "..... చిచ్ఛేద రామః ప్రసభం త్వహేరివ" వరకు [భాగ 9-15 - (17-34)].*

**725. రామః :**

1. మహేంద్రాదుల మనస్సులు ద్రవింపజేసే స్వరూపానందము చేత రమించు పరశురాముడు.

2. యుద్ధములో యోధులను తన యుద్ధకుశలతచే రమింపజేసే పరశురాముడు.

**726. దుష్టక్షత్రవినాశకః :**

దైవభక్తి, జ్ఞానము లేని దుష్టక్షత్రియులను (జాతి మాత్రముచే క్షత్రియులు



గాని వారి కుండవలసిన ఉత్తమ రాజలక్షణములు లేనివారిని) విశేషముగా నాశనము చేసిన పరశురాముడు.

**727. సోమవంశహితైకాత్మా :**

చంద్రవంశరాజుల యొక్క హితమును మాత్రమే ప్రయోజనముగా చిత్తము నందుంచుకొన్న భగవానుడు. బ్రహ్మణ్యత్వము, ధర్మజ్ఞత్వము సంపాదించి ఆ బ్రహ్మణ్యత్వ ధర్మజ్ఞత్వముల ననుసరించి అన్ని దేశకాలములందు ప్రజలను రక్షించు చంద్రవంశ రాజులయందు హితము చూపే భగవానుడు.

**728. యదువంశవివర్ధనః :**

యయాతి జ్యేష్ఠపుత్రుడగు యదువు యొక్క వంశము చాలా పవిత్రమైనది. యదువంశచరిత్ర మహాపుణ్యప్రదము. ఆ వంశ చరిత్ర విన్నవారు సర్వపాప విముక్తులౌతారు. సాక్షాత్ భగవానుడు శ్రీకృష్ణుడై యీ యదువంశములో నరరూపములో అవతరించాడు. యదుమహారాజునకు 1) సహస్రజిత్ 2) క్రోష్టా 3) నల 4) రిపు అను నలుగురు పుత్రులు జన్మించిరి. క్రోష్టుని మొదల్కొని ఈ యదువంశమును వర్ధిల్లజేసిన భగవానుడే యదువంశ వివర్ధనుడు.

*"....యయాతేర్జ్యేష్ఠపుత్రస్య యదోర్వంశం నరర్షభ" నుంచి '....యదోః సహస్రజిత్ క్రోష్టా, నలోరిపురితి శ్రుతాః॥" వరకు [భాగ (9-23-18, 19, 20).]*

ఇంతవరకు నవమస్కంధ నామములు.

## శ్రీమద్భాగవత దశమస్కంధ(పూర్వార్ధ) నామములు

*నిరోధలీలా నామములు (729–915)*

*శ్లోక సంఖ్య (149–201)*

**పరబ్రహ్మావతరణః కేశవః క్లేశనాశనః ।**
**భూమిభారావతరణో భక్తార్థాఖిలమానసః ॥ 149**

### 729. పరబ్రహ్మావతరణః :

"అక్షరబ్రహ్మణః పరం ఉత్కృష్టం యత్పురుషోత్తమాఖ్యం తత్పరబ్రహ్మేత్యుచ్యతే, తచ్చపరబ్రహ్మ శ్రీకృష్ణాఖ్యమితి జ్ఞేయమ్." అక్షరబ్రహ్మ కన్న ఉత్కృష్టమైన (శ్రేష్ఠమైన) పురుషోత్తమనామముచే పిలువబడే ఏ స్వరూపమున్నదో అది పరబ్రహ్మము అని చెప్పారు. "యస్మాత్క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః। అతోఽస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః॥" (గీత 15–18) ఈ భగవద్వాక్యము వలన పురుషోత్తమ నామముచే పిలువబడే పరబ్రహ్మ క్షర, అక్షర స్వరూపుల కన్న అతీతుడు. ఆ పరబ్రహ్మమే శ్రీకృష్ణుడని తెలియబడుచున్నాడు. శ్రీకృష్ణ పదముచే పరబ్రహ్మ నిర్వచింపబడుతుంది. "కృషి భూవాచకః శబ్దోణశ్చనిర్వృతి వాచకః తయోరైక్యం పరంబ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే." (1వ నామము, 9వ శ్లోకము చూడుడు). "పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుం." (గీత 10–12). "అవతరతి ఆవిర్భవతి ఇత్యవతరణః." అవతరణమనగా ఆవిర్భవించుట. శ్రీకృష్ణునిగా ఆవిర్భవించిన పరబ్రహ్మ అని అర్థము.

### 730. కేశవః :

1. ప్రశస్తమైన ఆకర్షనీయమైన కేశములుగల శ్రీకృష్ణుడు.

2. కేశి అనే రాక్షసుని చంపిన శ్రీకృష్ణుడు.



*"యస్మాత్త్వయైవ దుష్టాత్మా హతః కేశీ జనార్దన । తస్మాత్ కేశవనామ్నా త్వం లోకే జ్ఞేయో భవిష్యసి"* (విష్ణుపురాణము)

('జ్ఞేయో'కి బదులు 'ఖ్యాతో' అని పాఠాంతరము కలదు)

3. క్ + అ + ఈశః బ్రహ్మ విష్ణు మహేశ్వరలు (త్రిమూర్తులు) కేశః శబ్దార్థము. వీరి ప్రభువు లేక వీరిని వశములో పెట్టుకున్న భగవానుడు కేశవుడు.

4. బ్రహ్మ, ఈశ్వరులకు మూలభూతమై హరిరూపములో నున్న భగవానుడు కేశవుడు "కశ్చ ఈశ శ్చ, తయోర్వమమృతం యస్మాదితి కేశవః" క బ్రహ్మ ఈశ ఈశ్వరుడు – వారికి వః అమృతత్వ మెవ్వరి వలన కలిగినో ఆ శ్రీహరి భగవానుడు కేశవుడు.

5. సూర్యాదుల తేజోకిరణములు కేశములు. ఆ తేజములవలె అంతట నిండియున్న పరబ్రహ్మ, లేక అజ్ఞానమనే చీకట్లను పోగొట్టే జ్ఞానము అనే తేజోకిరణములు పరబ్రహ్మ, లేక కేశవుడు. "సూర్యాదిసంక్రాంతాస్తేజోఽంశవః కేశసంజ్ఞితాః తద్వత్తయా వా కేశవః."

6. కేశవ శబ్దము శక్తిని తెలుపుతుంది. అట్టి శక్తిరూపములో బ్రహ్మశివుల యందున్నవాడు కేశవుడు "కోబ్రహ్మేతి సమాఖ్యాత ఈశోఽహం సర్వదేహినాం। ఆవాం తవాంగే సంభూతౌ తస్మాత్ కేశవనామవాన్." (హరివంశము).

### 731. క్లేశనాశనః :

భూమి మొదలైన భక్తుల మూడు విధములైన క్లేశములు (దుఃఖములు) నశింపజేసే భగవానుడు క్లేశనాశనుడు. పరమేశ్వరుడు శ్రీకృష్ణునిగా అవతరిస్తాడని వినగానే భూమిక్లేశనివారణ అయినది.

*"పురైవ పుంసావధృతో ధరాజ్వరో" నుంచి "...... ఆదిష్టా ప్రభుణాఽంశేన కార్యార్థే సంభవిష్యతి"* [*భాగ 10–1 – (22–25)*].

### 732. భూమిభారావతరణః :

దుష్టరాజుల వలన కలిగే భూమి భారము పోగొట్టుటకు అవతరించే

భగవానుడని అర్థము. భూమి భారము పోగొట్టుట అనే కారణము, నిమిత్త మాత్రమే. భగవానుడు అవతరించుటకు ఎన్నో ఇతర కారణములు (భక్తరక్షణ, భక్తులలో భక్తిభావము కలిగించుట, పెంపొందించుట మొదలైనవి) ఉంటాయి. వేర్వేరు విధములైన భూమిభారములు ఎవరి సంకల్పము వలన కలుగుతాయో, ఆ భగవంతుడే ఆ భారము పోగొట్టడానికి అవతరిస్తాడని అర్థము. ఇవే భగవల్లీలలు.

## 733. భక్తార్థాఖిలమానసః :

1. భక్తులకు కావలసిన ప్రయోజనములన్నిటిని ఉద్దేశించి, అంటే, భక్తులు ఏఏకోరికలు కలిగి ఉంటారో వాటి వాటిని తన అవతారసమయములో ఎలా పూర్తి చేయాలో ఆ విషయమును మనస్సులో ఉంచుకునే భగవానుడు, భక్తార్థాఖిలమానసుడు.

2. భక్తుల కొరకు, భక్తులందరికి విరోధులైన జరాసంధ, దుర్యోధనాదుల యొక్క మానము, గర్వము పోగొట్టే శ్రీకృష్ణ భగవానుడు, భక్తార్థాఖిలమానసుడు.

**సర్వభక్తనిరోధాత్మా లీలానంతనిరోధకృత్ ।**
**భూమిష్ఠపరమానందో దేవకీశుద్ధికారణమ్ ॥ 150**

## 734. సర్వభక్తనిరోధాత్మా :

గోకులవాసులు మొదలైనవారితో సహా, అందరు భక్తుల చిత్తములు ప్రపంచ విషయముల స్మృతి లేకుండా పరబ్రహ్మ శ్రీకృష్ణునియందు మాత్రమే నిలిచి రమింపజేసే శ్రీకృష్ణుడు సర్వభక్తనిరోధాత్మ. "నిరోధోఽ స్యానుశయనం ప్రపంచే క్రీడనం హరేః." (వల్లభాచార్యులు). నిరోధమంటే జీవుని చిత్తము ప్రపంచ విషయములందుగాక, భగవానునియందే నిలుపుట, ప్రపంచములో తాము చూచే కార్యములు (తమకు సంబంధించినవి,ఇతరములు) కూడా నిత్యము జరుగుతూ ఉంటాయి. భక్తులు వాటిని లోకరీతిగా కాక భగవల్లీలలు (క్రీడలు)గానే



విశ్వసించి ఆ లీలలు చేసే భగవానునే, తమ చిత్తములో నిలిపి, స్మరిస్తూ ఉంటారు. ఇట్టి నిరోధస్థితి భక్తులలో కలిగించే పరమాత్మ, సర్వభక్తనిరోధాత్మ.

729 నుంచి 734 వరకు గల నామములు స్కంధార్థమును తెలుపుతాయి.

## 735. లీలానన్తనిరోధకృత్ :

1. భగవల్లీలలు అనంతములు. ఈ లీలలు భక్తుల చిత్తములను భగవంతునియందే నిరోధింపచేస్తాయి. ఇవి లీలల మాహాత్మ్యము. ఇట్టి అనంత లీలలతో భక్తుని చిత్తము భగవానునిపై నిరోధింపజేసే భగవానుడు "లీలానన్తనిరోధకృత్".

2. లీలా అంటే శక్తి, అనంతః అంటే శేషుడు. శ్రీకృష్ణుడు తన లీలా శక్తి చేతను, శేషుడైన బలరాముని చేతను దుష్టుల దుష్కార్యములు నిరోధించాడు. అట్టి భగవానుడు "లీలానన్తనిరోధకృత్" అనబడతాడు.

3. అసంఖ్యాకులైన తన భక్తుల హృదయములను తన లీలలచే నిరోధింప జేసిన శ్రీకృష్ణుడు.

## 736. భూమిష్ఠపరమానందః :

1. "భూమౌ తిష్ఠన్తి భూమిష్ఠాః భక్తాః వ్రజవాసినస్తేషాం పరమశ్చా సావానన్దశ్చేతి, స యస్మాదితివా." కారణ జన్ములైన వ్రజవాసులు శ్రీకృష్ణ సాన్నిధ్యమందు ఆనందము పొందడానికి భూమిపై పుట్టిన భక్తులు. వారందరికి బ్రహ్మానందము కలిగించే శ్రీకృష్ణుడు భూమిష్ఠపరమానందుడు.

2. భూమిష్ఠా అంటే మథురానగరము. ఆనగరవాసులందరు పరమేశ్వ రుని దగ్గరగా ఉండి పరమానందము అనుభవిస్తారు. అందువలన శ్రీకృష్ణుడు భూమిష్ఠపరమానందుడు.

**737. దేవకీశుద్ధికారణమ్ :**

1. దేవకీదేవి వివాహసంస్కారము (దేవకీ శుద్ధి) భగవత్ప్రాకట్యమునకు కారణము. "దేవక్యాం విష్ణు రూపిణ్యాం." విష్ణుదేవుని రూపిణియైన దేవకి అని చెప్పి, దేవకీదేవి శుద్ధి తెలుపబడింది. అట్టి శుద్ధి ఆమె ఎదుట భగవత్ప్రాకట్యమునకు కారణము.

2. "భక్తానాం బహుదుఃఖేన భగవత్ప్రాకట్యం, తచ్చ వివాహాంగ గృహ ప్రవేశసమయ ఏవాకాశవాణీ నిమిత్తక కంస కృతమితి పరంపరయాకారణమ్." భగవత్ప్రాకట్యము జరుగుటకు ముందు భక్తులు సాధారణముగా అనేక దుఃఖములు (కష్టములు) అనుభవించవలసి ఉంటుంది. దేవకీదేవి వివాహ కాలమందుచేసే గృహప్రవేశ సమయములో ఆకాశవాణి పలుకులు విన్న కంసుడు దేవకీ వసుదేవులను పలుకష్టములకు పాలుచేసాడు. (దేవకిని చంపబూనుట, దేవకీ వసుదేవులను ఖైదుచేయుట, వారి మొదటి ఆరు గురుపుత్రులను చంపుట, మొదలైన బహుదుఃఖములు కలిగించాడు.) ఇట్టి దుఃఖములనుభవించి వారు శుద్ధి పొందారు. ఈ శుద్ధి కారణము వలననే వారు భగవత్ప్రాకట్యము చూడగలిగారు. అందుచేత భగవానుడు దేవకీశుద్ధి కారణరూపుడు.

**వసుదేవజ్ఞాననిష్ఠసమజీవనివారకః ।**
**సర్వవైరాగ్యకరణస్వలీలాధారశోధకః ॥ 151**

**738. వసుదేవజ్ఞాననిష్ఠసమజీవనివారకః :**

"వసతి వస్తే సదా సర్వమితి వా, 'వసుర్విష్ణుర్విష్ణుర్వసుః' (శ్రుతి) తం దీవ్యతి తేన దీవ్యత ఇతి వా వసుదేవః" వసతి అంటే నివసించి ఉండుట. వస్తే అంటే (వస్త్రమువలె) ధరించి యుండుట– విశ్వమందు అంతటను నివసించు వాడు లేక విశ్వమంతటిని ధరించి ఉన్నవాడు. వసువు. వసువే విష్ణువు విష్ణువే వసువు, విశ్వము నంతటిని ప్రకాశింప జేయువాడు లేక ఎవరిచే విశ్వమంతయు ప్రకాశింపబడుతున్నదో అతడు వసుదేవుడు. వసుదేవ నామముచే శుద్ధ సత్త్వస్వరూపము చెప్పబడుచున్నది– "సత్త్వం విశుద్ధం వసుదేవ సంజ్ఞితం" అన్నవాక్యార్థము వసుదేవ పదము తెలుపుతుంది. ఇట్టివారు భగవంతునితో కలిసి సరిసమానముగా ఉంటారు– (సమః). దేవకీదేవిభర్త వసుదేవుడు ఇట్టి లక్షణములు కలవాడు. అతనియందు జ్ఞానరూపమైన నిష్ఠ సంపూర్ణముగా నిరంతరము ఉండెను. ఇట్టి లక్షణములు కలుగుటచేతనే వసుదేవుడు తన మొదటి ఆర్గురు పుత్రులను కంసుడు చంపినా తాను సత్త్వాత్మక సమబుద్ధితో ప్రవర్తించాడు. ఈ ఆరుగురు శాపగ్రస్తులైన వసువులు. కంసునిచే చంపబడి భగవదనుగ్రహముతో తిరిగి జన్మలు లేనివారయ్యారు. వసుదేవునికి జ్ఞాననిష్ఠను, సమత్వమును ప్రసాదించుటయేకాక ఆతని మొదటి ఆర్గురు పుత్రులకు పునర్జన్మను నివారణ చేసిన భగవానుడు ఈ నామముచే వర్ణింపబడ్డాడు.

*"దృష్ట్వా సమత్త్వం తచ్చౌరేః సత్యే చైవ వ్యవస్థితిం".* *(భాగ 10-1-59).*

**739. సర్వవైరాగ్యకరణస్వలీలాధారశోధకః :**

1. దేవకీ వసుదేవులకు పుత్రుడై భగవానుడు తన ప్రకటరూపముతో దర్శనమిచ్చి వారికి అన్ని విషయములలో వైరాగ్యము కలిగించాడు. ఈ భగవత్ప్రాకట్యలీలవలన దేవకీదేవికి దోషపరిహారమయి శుద్ధి కలిగినది. (వంధ్యత్వము, పిల్లలు చచ్చిపోవుట అనేవి స్త్రీకి కుక్షిగత దోషములు. భగవద్దర్శనము వలన యీ రెండవ దోషము దేవకీ దేవికి పరిహారమై శుద్ధి కలిగింది.)

2. భగవానుడు తనప్రాకట్యముచే దేవకీదేవిపై తనమాయ విస్తరింపజేసి వ్రజభూమిలో ఆ తర్వాత జరగవలసిన తన లీలలు చేయదానికి అవకాశము కలిగించుటకు ఆమెకు వైరాగ్యము కలిగించాడు.

**మాయాజ్ఞాపనకర్తా చ శేషసంభారసంభృతిః ।**
**భక్తక్లేశపరిజ్ఞాతా తన్నివారణతత్పరః ॥ 152**

**740. మాయాజ్ఞాపనకర్తా (చ) :**

యోగమాయ చేయవలసిన కార్యములు – దేవకీ సప్తమగర్భమును

రోహిణియందారోపించుట, భగవానుని ప్రాకట్యసమయమున ఆమె యశోదా దేవికి పుత్రికగా జన్మించుట, ఆ సమయములోనే అందరిపై వ్యాపించి శ్రీకృష్ణుని యశోదాదేవి దగ్గర (ప్రక్కను) ఉంచి ఆమెను మథురానగర ఖైదులోకి తెచ్చుట, అనే పనులు జరిగే వరకు అందరిని నిద్రలో ఉంచుట, కంసుని చేతులో నుంచి తప్పించుకు పోవుట, మొదలైనవి- గుప్తముగా చేయవలెనని ఆజ్ఞాపించిన భగవానుడు మాయాజ్ఞాపనకర్త.

*"గచ్ఛ దేవి వ్రజం భద్రే..." (భాగ 10-2-7).*

**741. శేషసంభారసంభృతిః :**

1. భగవత్ప్రాకట్యమునకు ముందు యోగమాయ చేయవలసిన కార్యములు కాక మిగిలిన కార్యములు అన్నివిధముల చక్కగా జరిపించి సంపూర్తిచేసిన భగవానుడు.

2. సంకర్షణమూర్తి అయిన శేషుని అంశతో బలరాముడు జన్మించుట కూడ అవతార కార్యక్రమములో భాగమే. దేవకీగర్భస్థబలరాముని, రోహిణీ గర్భములో ప్రవేశపెట్టిన తర్వాత తాను పూర్ణరూపముతో ఆమె గర్భములో ప్రవేశించి అవతరించుటకుగల అన్ని ఏర్పాట్లు చేసిన భగవానుడు.

**742. భక్తక్లేశపరిజ్ఞాతా :**

భక్తుల క్లేశములు అన్నివిధములా పూర్తిగా తెలిసినవాడు కనుక వారి దుఃఖములు పోగొట్టుటకొరకు అవతరించిన భగవానుడు.

**743. తన్నివారణతత్పరః [తత్ (క్లేశ) నివారణతత్పరః] :**

తన భక్తుల దుఃఖములను (క్లేశములను) నివారణ చేసి వారిని పోషించి, రక్షించుట యందే ఎల్లప్పుడు మిక్కిలి ఆసక్తి చూపే భగవానుడు తన్నివారణ తత్పరుడు.

**ఆవిష్టవసుదేవాంశో దేవకీగర్భభూషణమ్ ।**
**పూర్ణతేజోమయః పూర్ణః కంసాధృష్యప్రతాపవాన్ ॥ 153**



**744. ఆవిష్టవసుదేవాంశః :**

వసుదేవుని మనస్సులో ప్రద్యుమ్నాంశతో చక్కగా (అనన్య భావము కలుగునట్లు) ప్రవేశించిన భగవానుడు

*"...... ఆవివేశాంశభాగేన మన ఆనకదుందుభేః" (భాగ 10-2-16).*

**745. దేవకీగర్భభూషణం :**

దేవకీదేవి గర్భమందు ప్రవేశించిన భగవానుడు ఆమెకు ఒక అలంకారమై ఉన్నట్లు తన తేజస్సుచేత ప్రకాశమును, గొప్ప శోభను ఆమెకు ఇచ్చాడు.

*"తాం వీక్ష్య కంసః ప్రభయాజితాంతరాం, విరోచయన్తీం...." (భాగ 10-2-20)*

**746. పూర్ణతేజోమయః :**

పూర్ణః అంటే ఇక్కడ సర్వధర్మాత్మకుడైన "ధర్మి" రూప భగవానుడు. దేవకీదేవి గర్భములో అట్టి 'ధర్మిరూపి' భగవానుడు ఉండుటచే ఆ తేజస్సుతో ఆమె నిండి ఉన్నట్లు తేజోమయి అయి ప్రకాశించుచున్నది. ధర్మి రూపములో దేవకీదేవి శరీరమంతట తేజోపుంజముతో ప్రకాశించే భగవానుడు పూర్ణతేజో మయుడు.

**747. పూర్ణః :**

1. అంతటా పరిపూర్ణముగా నిండియున్న పరబ్రహ్మ పూర్ణుడు.

2. "పూర్యతే స్వయమేవ ఐశ్వర్యాదిభిః ఇతి పూర్ణః అఖండితః" ఐశ్వర్యాది భగలక్షణములతో స్వయముగా అంతటా నిండియున్న పరమాత్మ పూర్ణుడు. అఖండితుడు అపరిచ్ఛిన్నుడు.

**748. కంసాధృష్యప్రతాపవాన్ :**

భగవానుని గర్భమందు ధరించిన దేవకీదేవి ప్రకాశము (తేజస్సు) కంసుడు ఎదుర్కొనలేనిది, అసాధ్యమైనది, అనిర్వచనీయమైనది, మహిమా విశేషము గలది.

కారాగృహమంతా వ్యాపించినట్లు చూచిన ఆ భగవత్ప్రకాశమును కంసుడు సహించలేకపోయాడు. ఇట్టి తేజస్సు గల దేవకీదేవి గర్భస్థభగవానుడు.

*"కిమద్య తస్మిన్ కరణీయమాశు మే" నుంచి "..చింత యానో హృషీకేశమపశ్యత్ తన్మయం జగత్" వరకు* *[భాగ 10-2 - (21-24)].*

**వివేకజ్ఞానదాతా చ బ్రహ్మాద్యఖిలసంస్తుతః ।**
**సత్యో జగత్కల్పతరుర్నానారూపవిమోహనః ॥ 154**

### 749. వివేకజ్ఞానదాతా (చ) :

కంసుడు మహాసురుడు. దేవకీదేవి భగవానుని గర్భములో ధరించినపుడు ఆమె ప్రకాశము చూచి దుష్టబుద్ధితో ఆమెను చంపదలచలేదు. భగవానుని ప్రతాపము, మహిమచేత, అసురునికి వివేకము కలిగినది. ఈ విధముగా కంసునికి సదసద్వివేచనా (పుణ్యపాప వివేచనా) రూపమైన జ్ఞానము కలిగించిన భగవానుడు వివేకజ్ఞానదాత.

### 750. బ్రహ్మాద్యఖిలసంస్తుతః :

బ్రహ్మ రుద్రాది దేవతలందరు దేవకీదేవి గర్భములోనున్న శ్రీకృష్ణుని - అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు, పూర్ణపురుషోత్తముడు మొదలైన నామములచే స్తుతించారు. అందుచే బ్రహ్మాద్యఖిలసంస్తుతుడు.

*"బ్రహ్మా భవశ్చ తత్రైత్య మునిభిర్నారదాదిభిః......"* *(భాగ 10-2-25).*

### 751. సత్యః :

"సత్యః" అనగా సత్యవ్రతము కలవాడని అర్థము. భగవానుడు సత్య సంకల్పుడు, సత్యసంధుడు, సత్యమే భగవత్ప్రాప్తికి సాధనము, ఇట్టి అనేక అర్థములను అనుసంధానము చేసుకొనవచ్చును. "ధర్మి - సత్యత్వముల గురించి చెప్పుకొనేటప్పుడు ధర్మియగు భగవానుడే సత్యమని చెప్పాలి. అందువల్లనే బ్రహ్మాది దేవతలస్తుతి మొదటి శ్లోకములో "..... సత్యాత్మకం త్వాం శరణంప్రపన్నాః" *(భాగ-10-2-26).*



అంటే సత్యస్వరూపుడవైన నిన్ను శరణము పొందుచున్నాము అని చెప్పారు. అందుచే "సత్యః" అంటే భగవానుడు.

### 752. జగత్కల్పతరుః :

భగవంతుడు యీ స్థావర జంగమాత్మకజగత్తు రూపములో ప్రత్యక్షముగా కన్పించు కల్పవృక్షము వంటివాడు. కల్పవృక్షము దేవతల కోర్కెలను మాత్రమే తీరుస్తుంది. భగవంతుడు సర్వుల కోర్కెలు తీరుస్తాడు. అందుచేతనే భగవానుడు జగత్కల్పతరువు.

*"ఏకాయనోఽసౌ ద్విఫలాస్త్రిమూలశ్చతూరసః....."* *(భాగ 10-2-27).*

### 753. నానారూపవిమోహనః :

బ్రహ్మాదిస్తంబపర్యంతము రజస్తమోసత్వగుణములతో నిండియున్నట్టి జగత్తు నంతటిని విశేషముగా మోహింపజేసే భగవానుడు నానారూప విమోహనుడు. భగవంతునిచే మోహము చెందిన జీవులు జగత్తులో నానాత్వము చూస్తూ మోహింపబడతారు కాని జగత్తును భగవత్స్వరూపముగా ఒక్కటిగా చూడలేరు.

*"..... త్వన్మాయయా సంవృతచేతసస్త్వాం...."* *(భాగ 10-2-28).*

**భక్తిమార్గప్రతిష్ఠాతా విద్వన్మోహప్రవర్తకః ।**
**మూలకాలగుణద్రష్టా నయనానందభాజనమ్ ॥ 155**

### 754. భక్తిమార్గప్రతిష్ఠాతా :

కర్మజ్ఞానాదిమార్గములకంటె భక్తిమార్గము ఎక్కువగా ప్రశస్తమైనది- లేక కర్మజ్ఞానమార్గములు చక్కని భక్తి మార్గమును ప్రతిష్ఠింపజేస్తాయి అనవచ్చును. ఇట్టి భక్తిమార్గము ప్రతిష్ఠించిన భగవానుడు భక్తిమార్గప్రతిష్ఠాతా.

*"బిభర్షి రూపాణ్యవబోధ ఆత్మా...." నుంచి "..... నిధాయ యాతాః సదనుగ్రహో భవాన్"* *[భాగ 10-2 - (29-31)].*

## 755. విద్వన్మోహప్రవర్తకః :

కేవలజ్ఞాననిష్ఠతో, తాము ముక్తులమయిపోయామనే భావము కల విద్వాంసులు నిజమైన భక్తితత్త్వము తెలిసినవారుకారు. అట్టి విద్వాంసులకు తాము ముక్తులమయ్యేమన్న అభిమానము వలన సత్యము స్ఫురింపక మోహము కలుగుతుంది. భగవత్తత్త్వము అనుభవములోనుండదు. ఆ విద్వాంసుల మనస్సులను మోహమందు ప్రవర్తింపజేసే భగవానుడు విద్వన్మోహప్రవర్తకుడు.

*"యేఽ న్యేఽ రవిందాక్ష విముక్తమానినః..."* *(భాగ 10-2-32).*

## 756. మూలకాలగుణద్రష్టా :

1. సృష్టిప్రారంభమునకు ముందుగల కాలములో సత్త్వరజస్తమో గుణములు సామాన్యావస్థలో నున్నపుడు- ఆ త్రిగుణముల కంటె వేరుగా నుండి వానికి ద్రష్టఅయిన భగవానుడు మూలకాలగుణద్రష్ట.

2. ద్రష్ట అనగా ప్రేరకుడు అని అర్థము ఉన్నది.సర్వమునకు మూల కారణమైన శ్రీకృష్ణుని జన్మకాలమునందు కలిగిన శుభలక్షణములకు ప్రేరకుడైన భగవానుడు మూలకాలగుణద్రష్ట.

*"అథ సర్వగుణోపేతః కాలః పరమ శోభనః..."* నుంచి *"....ఆవిరాసీద్ యథా ప్రాచ్యాం దిశీన్దురివ పుష్కలః"* *[భాగ 10-3 - (1-8)].*

## 757. నయనానందభాజనం :

భగవంతుని ప్రాదుర్భావము చూచిన వసుదేవునికి పట్టలేని నేత్రానందము కలిగించిన భగవానుడు నయనాందభాజనుడు.

*"స విస్మయోత్ఫుల్లవిలోచనో హరిం సుతం"* *(భాగ 10-3-11).*

**వసుదేవసుఖాబ్ధిశ్చ దేవకీనయనామృతమ్ ।**
**పితృమాతృస్తుతః పూర్వసర్వవృత్తాంతబోధకః ॥ 156**



## 758. వసుదేవసుఖాబ్ధిః (చ) :

1. వసుదేవుని సుఖము లేక ఆనందము ఎల్లలులేని సముద్రమువలె విస్తరించింది. అట్టి ఆనందరూప జలములు ఎవనిలోనికి ప్రవహించి నిలబడినవో (సుఖాబ్ధి) ఆ భగవానుడు, "వసుదేవసుఖాబ్ధిః."

2. ఎవరి జన్మ (ఆవిర్భావము) వలన వసుదేవుని ఆనందమనే జలము సముద్రమువలె విస్తరించి పొంగినదో ఆ శ్రీకృష్ణభగవానుడు; "వసుదేవసుఖాబ్ధి."

*"తమద్భుతం బాలకమంబుజేక్షణం...."* నుంచి *".... విరోచయంతం గతభీః ప్రభావవిత్"* *[భాగ 10-3 - (9-12)].*

## 759. దేవకీనయనామృతం :

శ్రీకృష్ణభగవానుని ప్రాదుర్భావ సమయములో, దేవకీదేవి కళ్లలో మొదట దుఃఖరేఖలు కనిపించినా భగవానుని సర్వశక్తిమయత్వము తన భావములోనికి రాగా ఆమె నేత్రములలో అమృతతుల్య ఆనందము కలిగినది. దేవకీదేవికి నయనానందము కలిగించిన భగవానుడు, దేవకీనయనామృతము.

*"అథైనమాత్మజంవీక్ష్య..."* *(భాగ 10-3-23).*

## 760. పితృమాతృస్తుతః :

శ్రీకృష్ణుని ఆవిర్భావసమయములో తండ్రి వసుదేవుడు, తల్లి దేవకీదేవి, ఒకరి తర్వాత ఒకరు భగవానుని స్తుతించారు. ఇట్లు తల్లిదండ్రులిద్దరిచే స్తుతింపబడ్డ భగవానుడు. [భాగ 10-3 - (13-31)].

## 761. పూర్వసర్వవృత్తాన్తబోధకః :

దేవకీ వసుదేవులు శ్రీకృష్ణుని స్తుతించారు. అప్పుడు భగవానుడు వారి పూర్వజన్మల వృత్తాంతము నంతటిని బోధించి ఏ విధముగా వారికి ముమ్మారు తాను పుత్రుడై పుట్టాడో తెలియజేసాడు. దేవకీవసుదేవులు మొదటి జన్మలో (స్వాయంభువ మన్వంతరములో) పృశ్ని సుతపా అన్నవారు. వారు సంతానము కొరకు తీవ్ర తపస్సు చేసారు. భగవానుడు ప్రసన్నుడై వరము కోరుకోమనగా

భగవానునివంటి పుత్రుడు కావలెనని కోరుకున్నారు. పృశ్నిగర్భుడు అనే పేరుతో వారికి మొదటిసారి భగవానుడు పుత్రుడై జన్మించాడు. వారు రెండవజన్మలో అదితి, కశ్యపులై పుట్టారు. భగవానుడు "ఉపేంద్రుడనే పేరుతో వారికి (కొడుకై) వామనుడై పుట్టాడు. వారు మూడవ జన్మలో దేవకీవసుదేవులు. శ్రీకృష్ణుడై వారికి భగవానుడు ఆవిర్భవించాడు. పూర్వము పృశ్నిగర్భుడు, వామనుడుగా భగవానుడు జన్మించినను రెండు సందర్భములలోను తల్లితండ్రులకు పూర్ణ ఫలము కలుగకపోవుటచే వారికి మూడవజన్మ కలిగినది. శ్రీకృష్ణజన్మ సమయమున భగవానుడు పూర్ణ రూపముతో అవతరించుటచేత దేవకీ వసుదేవులకు వారి సాధన సమాప్తి అయినది. పూర్ణ ఫలప్రాప్తి కలిగినది అని భావము. ఈ విధముగా భగవానుడు పూర్వసర్వవృత్తాంతబోధకుడు.

*"త్వమేవ పూర్వసర్గేఽ భూః పృశ్నిః..." నుంచి "... చిన్తయన్తౌ కృతస్నేహౌ యాస్యేథే మద్గతిం పరాం"* *[భాగ 10-3 - (32-45)].*

**గోకులాగతిలీలాప్తవసుదేవకరస్థితిః ।**
**సర్వేశత్వప్రకటనో మాయావ్యత్యయకారకః ॥ 157**

## 762. గోకులాగతిలీలాప్తవసుదేవకరస్థితిః :

"గోకులమునకు వచ్చుటకై చేసిన లీలలో యమునా నది దాటుటకు (నిమిత్తము) ఆప్తుడైన తండ్రి వసుదేవుని చేతులలో ఉండుట అనే స్థితి పొందిన భగవంతుడు శ్రీకృష్ణుడు.

## 763. సర్వేశత్వప్రకటనః :

సర్వేశత్వము అనగా అన్నిటిని నియమించే సామర్థ్యము. పరబ్రహ్మ యొక్క సర్వేశ్వరత్వమును ఆయనయొక్క సర్వైశ్వర్యత్వమును చక్కగా ప్రకటించిన శ్రీకృష్ణుడు, సర్వేశత్వప్రకటనుడు.

*"తాః కృష్ణవాహే వసుదేవ ఆగతే...." నుంచి ".... మార్గం దదౌ సింధురివ శ్రియః పతేః"* *[భాగ 10-3- (49, 50)].*



## 764. మాయావ్యత్యయకారకః :

మాయా అనగా యోగమాయ. వ్యత్యయమనగా స్థాన వినియమము లేక చోటు మార్పు. దేవకీదేవికి జన్మించిన శ్రీకృష్ణుని, యశోదాదేవికి పుట్టిన యోగమాయను మార్పిడి చేసే లీలకు కారకుడైన శ్రీకృష్ణభగానుడు మాయావ్యత్యయకారకుడు.

*"నందవ్రజం శౌరిరుపేత్య తత్ర...." నుంచి "... ప్రతిముచ్య పదోర్లోహమాస్తే పూర్వవదావృతః"* *[భాగ 10-3 - (51, 52)].*

**జ్ఞానమోహితదుష్టేశః ప్రపంచాస్మృతికారణమ్ ।**
**యశోదానందనో నందభాగ్యభూగోకులోత్సవః ॥ 158**

## 765. జ్ఞానమోహితదుష్టేశః :

దేవకీదేవికి శిశువు జన్మించినదని విన్న దుష్టకంసుడు తనను చంపే కాలుడు పుట్టేడని తెలుసుకొని, మోహవశుడై ఆ తరువాత అంతటా మృత్యువునే చూచేవాడు. కంసునకు ఇట్టి మోహము కలిగించిన భగవానుడు జ్ఞానమోహిత దుష్టేశుడు.

*"స తల్పాత్ తూర్ణముత్థాయ కాలోఽ యమితి విహ్వలః...." (భాగ 10-4-3).*

## 766. ప్రపంచాస్మృతికారణం :

యోగమాయా జననకాలమునందు యశోదాదేవి అలసిపోయి నిద్ర పోవుటచేత ఆమెకు శిశువు జన్మించినదని తెలుయును గాని, ఆ శిశువు మగశిశువా లేక ఆడశిశువా అన్న విషయము (ప్రపంచ విషయము) యోగమాయాశక్తి వలన తెలియలేదు. ఇట్లు ప్రపంచ విషయస్మృతి లేకపోవడానికి కారణమైన భగవానుడు, "ప్రపంచాస్మృతికారణం".

*"యశోదా నందపత్నీ చ జాతం పరమబుధ్యత. న తల్లింగం పరిశ్రాంతా నిద్రయాపగతస్మృతిః"* *(భాగ 10-3-53).*

**767. యశోదానందనః :**

యశోదాదేవి కోరికలన్నీ పూర్తిగా ఫలించి ఆనందింపజేసిన శ్రీకృష్ణుడు యశోదానందనుడు.

**768. నందభాగ్యభూగోకులోత్సవః :**

1. శ్రీకృష్ణుని జన్మముచే నందుని భాగ్యభూమి అయిన గోకులమందు ఆనందోత్సాహములు పొంగిపొరలినవి. వారు ఆనందముతో గోకులములో ఉత్సవము జరుపుకున్నారు. ఈ విధముగా గోకులోత్సవమునకు కారణుడైన శ్రీకృష్ణభగవానుడు నందభాగ్యభూగోకులోత్సవుడు.

2. నందునికి పుత్రుడు కలుగుట అనే భాగ్యమును (భూమికగా) నిమిత్తము చేసి (శ్రీకృష్ణజన్మనందుని భాగ్యము) భూమి, గోకులముల రెండిటి యందు ఉత్సవములు జరిగినవి. దీనికి కారణుడైన శ్రీకృష్ణభగవానుడు నందభాగ్యభూగోకులోత్సవుడు.

**నందప్రియో నందసూనుర్యశోదాయాః స్తనంధయః ।**
**పూతనాసుపయఃపాతా ముగ్ధభావాతిసుందరః ॥ 159**

**769. నందప్రియః :**

1. నందునికి ప్రియుడైన శ్రీకృష్ణుడు.

2. గోకులప్రవేశము చేసి, నందుని సకల కోరికలు తీర్చి, ఆతనికి ప్రీతికలిగించే శ్రీకృష్ణుడు నందప్రియుడు.

*"తత ఆరభ్య నందస్య వ్రజః సర్వసమృద్ధిమాన్....". (భాగ 10-5-18).*

**770. నందసూనుః :**

నందుని పుత్రుడైన శ్రీకృష్ణుడు నందసూనుడు.

*"నందస్త్వాత్మజ ఉత్పన్నే జాతాహ్లాదో మహామనాః.....". (భాగ 10-5-1).*



**771. యశోదాయాః స్తనన్ధయః :**

యశోదాదేవి స్తనముల నుండి పాలు త్రాగిన శ్రీకృష్ణుడు.

**772. పూతనాసుపయఃపాతా :**

పూతన స్తన్యపానము చేస్తూ పాలతో సహా అసువులను తీసిన శ్రీకృష్ణుడు.

*"........ తత్ప్రాణైః సమం రోషసమన్వితోఽపిబత్" (భాగ 10-6-10).*

**773. ముగ్ధభావాతిసుందరః :**

భయం లేకుండా పూతన గుండెలపై కూర్చుని ఆడుకుంటూ, ముఖార విందములో ముగ్ధభావము కలిగి సుందరముగా శోభిస్తూ ఉన్న శ్రీకృష్ణుడు, ముగ్ధభావాతిసుందరుడు.

**సుందరీహృదయానందో గోపీమంత్రాభిమంత్రితః ।**
**గోపాలాశ్చర్యరసకృత్ శకటాసురఖండనః ॥ 160**

**774. సుందరీహృదయానందః :**

వ్రజగోపికల (సుందరీమణుల) హృదయములో ఆనందరూపుడుగా నున్న శ్రీకృష్ణభగవానుడు లేక ఆ సుందరీమణులకు హృదయానందము కలిగించిన భగవానుడు, సుందరీహృదయానందుడు

*"...గోప్యస్తూర్ణం సమభ్యేత్య జగృహుర్జాతసంభ్రమాః" (భాగ 10-6-18).*

**775. గోపీమంత్రాభిమంత్రితః :**

పూతన మరణానంతరము, గోపికలు శ్రీకృష్ణుని రక్షకొరకు (తాము తమ శిశువుల రక్షకొరకు చదివే కవచములను బోలు) మంత్రములు చదివారు. ఇవి గోపీ మంత్రములని చెప్పబడతాయి. శ్రీకృష్ణుని శరీరములోని అన్ని అంగములను విష్ణువు వివిధ దేవతా రూపములలో రక్షించుగాక అని వీటి అర్థము.

*"అవ్యాదజోఽంఘ్రి మణిమాంస్తవ జాన్వథోరూ..." నుంచి "...సర్వేనశ్యన్తు తే విష్ణోర్నామగ్రహణభీరవః" వరకు [భాగ 10-6 - (22-29)].*

మంత్రములకు ఋషి, ఛందస్సు, దేవత, న్యాసము ఉంటాయని యీ పామర గోపికలకు తెలియదు. గోపీ సంబంధమున్న మంత్రములు గనుక యీ గోపీమంత్రములకు గోపికలే ఋషులని చెప్పవచ్చును.

**776. గోపాలాశ్చర్యరసకృత్ :**

శ్రీకృష్ణుడు శకటాసురుని శకటమును తలక్రిందులు చేసి చక్రములు, ఇరుసు విడదీసి చంపగా, నందాదిగోపాలురందరు చెప్పలేనంత ఆశ్చర్యముతో ఆనందించారు. సర్వరసములు పుట్టించే శ్రీకృష్ణభగవానుడు యీ లీలలో ఆశ్చర్యము కలిగించుట ఉచితమే. ఇట్లు గోపాలాశ్చర్యరసకృత్ అయిన భగవానుడు.

**777. శకటాసురఖండనః :**

శకటమును పైకెగురవేసి, (తిరుగదోసి, ముక్కలు చేసి) దానితో శకటము పైనున్న మాయావి అసురుని కూడా చంపిన శ్రీకృష్ణుడు. భాగవతములో చెప్పకపోయినా బ్రహ్మాండపురాణములో ధరణీ శేషసంవాదరూపములో ఇచ్చిన వివరములు ప్రసిద్ధము. నందుని ఇంట్లో శ్రీకృష్ణఆగమనము తర్వాత అన్ని వస్తువుల సమృద్ధి జరిగినది. అట్టి పరిస్థితులలో వృధాగా శకటము విరగగొట్టుట తద్విరోధము అనిపించవచ్చును గాని, అక్కడ కొందరు అసురులు కూడా ఉండేవారు. వారిని చంపుట అవసరము. శ్రీకృష్ణుడు బండిని విరిచి, రాక్షసుని చంపి, గోకులములో ఆనందము వృద్ధి చేసాడు.

**నందవ్రజజనానందీ నందభాగ్యమహోదయః ।**
**తృణావర్తవధోత్సాహో యశోదాజ్ఞానవిగ్రహః ॥ 161**

**778. నందవ్రజజనానందీ :**

నందుడు, వ్రజ ప్రదేశము, అందలి జనులు, వీరందరిని ఆనందింప జేసిన శ్రీకృష్ణుడు "నందవ్రజజనానందీ" అని పిలువబడతాడు.



**779. నందభాగ్యమహోదయః :**

భగవంతుని కృప లేకుండా ఏ భాగ్యములు కలుగవు. భగవంతుని సంబంధము కలుగగానే నందునికి (వ్రజ ప్రదేశములో) అన్ని భాగ్యభోగములు గొప్పగా వృద్ధి చెంది ఆనందము చేకూర్చేయి. ఈ విధముగా చేసిన నంద భాగ్యమహోదయుడు శ్రీకృష్ణుడు.

**780. తృణావర్తవధోత్సాహః :**

సుడిగాలి రూపములో వచ్చిన తృణావర్తుని ఎంతో ఉత్సాహముతో శ్రీకృష్ణుడు వధించాడు అని యీనామార్థము. తృణావర్తవధానంతరము వ్రజవాసులందరు ఎంతో ఉత్సాహముతో ఉత్సవము చేసుకొన్నారు. అట్టి ఉత్సాహమునకు కారణమైన శ్రీకృష్ణుడు.

*"దైత్యో నామ్నా తృణావర్తః కంసభృత్యః...." నుంచి "... లబ్ధ్వా పునః ప్రాపురతీవ మోదమ్"* *[భాగ 10-7 - (20-30)].*

**781. యశోదాజ్ఞానవిగ్రహః :**

శ్రీకృష్ణుడు యశోదకు తన నోటిలో విరాట్ స్వరూపము చూపించి తాను భగవంతుడనే జ్ఞానము కలిగించాడు. అందుచేత శ్రీకృష్ణుడు యశోదా జ్ఞానవిగ్రహుడు.

*"ఏకదాఽఽ ఉ త్మజమాదాయ స్వాంకమారోప్య భామినీ..." నుంచి "... సమ్మీల్య మృగశాబాక్షీ నేత్రే ఆసీత్ సువిస్మితా"* *[భాగ 10-7 - (34-37)].*

**బలభద్రప్రియః కృష్ణః సంకర్షణసహాయవాన్ ।**
**రామానుజో వాసుదేవో గోష్ఠాంగణగతిప్రియః ॥ 162**

**782. బలభద్రప్రియః :**

బలభద్రుని ప్రియుడు శ్రీకృష్ణుడు. లేక బలభద్రుడు ఎవరికి ప్రియుడో ఆ శ్రీకృష్ణుడు.

## 783. కృష్ణః :

1. కృష్ణ పదమునకు వ్యాఖ్య ఇంతకు ముందే చెప్పబడ్డది. (1వ నామము 9వ శ్లోకము)

2. యుద్ధభూమిలో శత్రువులను కర్షించు (నలగగొట్టు)వాడు.

3. "ఆకర్షతి పుచ్ఛేన వత్సాన్ వా గోష్ఠే" పశువులశాలలో దూడలు తోకలు పట్టుకులాగేవాడు.

4. "శ్యామత్వాద్వా" శ్యామ (నల్లని) వర్ణము కలవాడు శ్రీకృష్ణుడు.

## 784. సంకర్షణసహాయవాన్ :

"సమ్యక్ కర్షత్యరీన్ ఇతి సంకర్షణః". శత్రువులను యుద్ధభూమిలో కర్షించి యుద్ధము చేయువాడు సంకర్షణుడు. ఆ సంకర్షణుని (బలభద్రుని) సహాయము కలవాడు లేక బలభద్రునికి సహాయము చేయువాడు. సంకర్షణ సహాయవాన్ అనబడే శ్రీకృష్ణభగవానుడు.

## 785. రామానుజః :

"రమయతిలోకానితిరామః, బలభద్రః" లోకములను రమింపజేయువాడు రాముడు, బలరాముడు. ఆతని తమ్ముడు కావున శ్రీకృష్ణుడు రామానుజుడు.

## 786. వాసుదేవః :

"వసుదేవస్యాపత్యం వాసుదేవః" వసుదేవుని పుత్రుడు వాసుదేవుడు.

*"ప్రాగయం వసుదేవస్య క్వచిజ్జాతస్తవాత్మజః" (భాగ 10-8-14).*

"వసతి సర్వత్ర, వాసయతి ఆచ్ఛాదయతి స్వయమితి వాసు; దీవ్యతి క్రీడతి, విజిగీషతే, వ్యవహరతి, ద్యోతతే, స్తూయతే, దృశ్యతే, గచ్ఛతీతి, వాసుశ్చాసౌదేవశ్చ వాసుదేవః" అన్నిటిలో నిండి ఉండుట అంతటా స్వయముగా వ్యాపించి ఉండుట 'వస్' దాతువు అర్థము. ప్రకాశించేది, క్రీడించేది,



జయించేది, పనులుచేసేది కనిపించేది నడిపించేది అని దేవ పదమునకు అర్థము. ఈ రెండు లక్షణములు కలిసి ఉన్న భగవానుడు వాసుదేవుడు (వి.స.నా. 332వ నామము శ్లో॥ 49).

"ఛాదయామి జగద్విశ్వం భూత్వా సూర్య ఇవాంశుభిః సర్వభూతాధివాసశ్చ వాసుదేవస్తతః స్మృత" (మోక్షధర్మము)

"వసనాత్ సర్వభూతానాం వాసుత్వాదేవ యోనినః తతో వాసుదేవ జ్ఞేయ ఇతి" (మహాభారతము - ఉద్యోగపర్వము)

"సర్వత్రాసౌ సమస్తం చ వసత్యత్రేతి వై యతః తతః స వాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే" (విష్ణుపురాణము).

"సర్వాణి తత్ర భూతాని వసన్తి పరమాత్మని। భూతేషు చ స సర్వాత్మ వాసుదేవ ఇతి స్మృతిః" (విష్ణుపురాణము)

## 787. గోష్ఠాంగణగతిప్రియః :

వ్రజస్థానములో నున్న గోశాలలో ప్రాకుతూ తిరుగుట ప్రియమైన శ్రీకృష్ణుడు.

ఆ విధముగా ప్రాకుతూ తిరుగుతూ ఉండుట చేత వ్రజస్థానములో అందరికి ప్రియుడైన శ్రీకృష్ణుడు.

*"కాలేన వ్రజతాల్పేన గోకులే రామకేశవౌ..." (భాగ 10-8-21).*

**కింకిణీరవభావజ్ఞో వత్సపుచ్ఛావలంబనః ।**
**నవనీతప్రియో గోపీమోహసంసారనాశకః ॥ 163**

## 788. కింకిణీరవభావజ్ఞః :

చిన్న పిల్లల నడుముకు కట్టే చిన్న చిన్న గంటల(మువ్వల)తో కూడిన ఆభరణము కింకిణి. పిల్లలు ప్రాకుతున్నపుడు నడుస్తున్నపుడు, నాట్యము చేస్తునపుడు కింకిణులు చేసే శబ్దము కింకిణీరవము. ఈ కింకిణీరవములు ఎన్నో విధములుగా చేస్తూ ఆనందించే శ్రీకృష్ణుడు కింకిణీరవభావజ్ఞుడు.

*"తవాంఘ్రి యుగ్మమనుకృష్య సరీసృపన్తౌ..." నుంచి "...ప్రేక్షన్త్య ఉజ్ఝితగృహా జహృషుర్హసన్త్యః" వరకు [భాగ 10-8 - (22-24)].*

**789. వత్సపుచ్ఛావలంబనః :**

ఆవు దూడల తోకలు పట్టుకొని ఇటు, అటు పరుగు పెట్టడం ఆటగా చేసుకున్న శ్రీకృష్ణుడు వత్సపుచ్ఛావలంబనుడు

*"యర్హ్యంగనాదర్శనీయకుమార లీలా..." (భాగ 10-8-24).*

**790. నవనీతప్రియః :**

వెన్న ఎంతో ఇష్టమైన శ్రీకృష్ణుడు నవనీతప్రియుడు.

**791. గోపీమోహసంసారనాశకః :**

గోపికలు శ్రీకృష్ణుని విచిత్రమైన బాలలీలలు చూస్తూ మోహింపబడి వారి వారి పనులు మరిచిపోయేవారు (సంసారమోహనాశనము). శ్రీకృష్ణుని లీలలు చూసేక వాటినే జ్ఞాపకం చేసుకొనుట వలన అలౌకికభక్తి కుదిరి, మోహమయ సంసారమునుండి ముక్తి పొందారు. లౌకిక విషయములపై మోహము సంసారదుఃఖము కలిగిస్తుంది. కాని శ్రీకృష్ణుని లీలల ఎడలగల మోహము సంసార నాశనము కలిగిస్తుంది. అందుచేత శ్రీకృష్ణుడు గోపీమోహసంసారనాశకుడు.

**గోపబాలకభావజ్ఞశ్చౌర్యవిద్యావిశారదః ।**
**మృత్స్నాభక్షణలీలాస్యమాహాత్మ్యజ్ఞానదాయకః ॥ 164**

**792. గోపబాలకభావజ్ఞః :**

ఎవరెవరిఇళ్ళకు వెళ్లి అక్కడ ఎలా వెన్న దొంగిలించాలో ఇటువంటి ఎన్నో భావములున్న తన మిత్రులైన గోపబాలకుల భావములు తెలిసిన శ్రీకృష్ణుడు గోపబాలకభావజ్ఞుడు.



**793. చౌర్యవిద్యావిశారదః :**

ఉపాయముతో ఎలా వెన్న దొంగలించాలో ఆ చౌర్యవిద్యలో నిపుణుడైన శ్రీకృష్ణుడు చౌర్యవిద్యావిశారదుడు.

*"హస్తాగ్రాహ్యే రచయతి విధిం పీఠ కోలూఖలాద్యైః...." నుంచి ".... ప్రహసితముఖీ న హ్యుపాలబ్ధు మైచ్ఛత్" వరకు (భాగ 10-8-30, 31).*

**794. మృత్స్నాభక్షణలీలాస్యమాహాత్మ్యజ్ఞానదాయకః :**

కృష్ణుడు మట్టి తిన్నాడన్న మాటవిని యశోదాదేవి ఆతని నోరు విప్పి చూపించమన్నది. శ్రీకృష్ణుడు లీలగా నోరు విప్పి అందులో అనంతముగా వ్యాపించిన భువనములు, వ్రజభూమి, అక్కడ ఉన్న యశోదను చూపించాడు. ఆ మహాత్మ్యము చూపి, యశోదకు తాను భగవానుడన్న జ్ఞానము కలిగించిన శ్రీకృష్ణుడు అని యీ నామార్థము.

*"నాహం భక్షితవానంబ సర్వే మిథ్యాభిశంసినః...." నుంచి ".... వైష్ణవీం వ్యతనోన్మాయాం పుత్రస్నేహమయీం విభుః" [భాగ 10-8 - (35-43)].*

**ధరాద్రోణప్రీతికర్తా దధిభాండవిభేదనః ।**
**దామోదరో భక్తవశ్యో యమలార్జునభంజనః ॥ 165**

**795. ధరాద్రోణప్రీతికర్తా :**

ద్రోణుడనే వసుశ్రేష్ఠుడు, అతని భార్య 'ధర', నందయశోదలుగా పుట్టారు. అందుచేత ధరా అంటే యశోదాదేవి; ద్రోణ అంటే వసుశ్రేష్ఠుడైన నందుడు. వీరుకారణజన్ములు. వారిద్దరికి తన యందు ప్రీతి కలిగించే శ్రీకృష్ణభగవానుడు ధరాద్రోణప్రీతికర్త.ః

*"ద్రోణో వసూనాం ప్రవరో ధరయా సహ భార్యయా...." (భాగ 10-8-48).*

**796. దధిభాండవిభేదనః :**

పెరుగు చిలికి వెన్నతీయుటకు సిద్ధముగా నున్న పెరుగుకుండను

కోపము నటించి ముక్కలు చేసిన శ్రీకృష్ణుడు దధిబాండవిభేదనుడు. శ్రీకృష్ణుడు "సంజాతకోపః స్ఫురితారుణా ధరం..." (భాగ 10-9-6).

**797. దామోదరః :**

1. యశోదాదేవి శ్రీకృష్ణుని (ఉదరము) పొట్టను (దామము) త్రాడుతో కట్టినది. అందుచేత శ్రీకృష్ణుడు దామోదరుడు.

2. దామము లంటే లోకములు (భువనములు). అవి ఉదరము (పొట్ట)లో ఉన్నవాడు దామోదరుడు, భగవానుడు.

*"త్యక్త్వాయష్టిం సుతం భీతం విజ్ఞాయార్భకవత్సలా..." (భాగ 10-9-12).*

*"తయోర్మధ్యగతం బద్ధం దామ్నా గాఢం తథోదరే తతశ్చ దామోదరతాం సయయౌ దామబంధనాత్. (బ్రహ్మపురాణము)*

*"దామాని లోకనామాని తాని యస్యోదరాంతరే। తేన దామోదరోదేవః శ్రీధరత్వం సమాశ్రితః" (వ్యాసుడు ప్రకారాంతరములో చెప్పాడు).*

3. "దమాది సాధనేన ఉదరా ఉత్కృష్టా యా మతిస్తయా గమ్యతఇతి" దమాది (శమదమాది) సాధనములచే గొప్పదైన ఏ బుద్ధి కలదో అట్టి బుద్ధిచే పొందశక్యమైన భగవానుడు దామోదరుడు.

**798. భక్తవశ్యః :**

త్రాటితో శ్రీకృష్ణుని పొట్టను కట్టి, ఆత్రాడు రోలుకు కట్టుటకు ప్రయత్నము చేసి అలసిపోయి, యశోదాదేవి ఏమి చేయాలో తెలియక ఉన్నదని తెలుసుకొని యశోదాదేవి యొక్క వాత్సల్యభక్తికి ఆమెపై దయ కలిగి కట్టబడడానికి ఆమెకు వశుడై బంధింపబడ్డ శ్రీకృష్ణుడు, భక్త వశ్యుడు.

*"స్వమాతుః ఖిన్నగాత్రాయా విస్రస్తకబరస్రజః (భాగ 10-9-18).*

**799. యమలార్జునభంజనః :**

యమళార్జున వృక్షములని పేరుగల వృక్షయుగళమును పడగొట్టి, నలకూబర మణిగ్రీవులకు శాపవిమోచనము కలిగించిన శ్రీకృష్ణుడు, యమలార్జున



భంజనుడు. యమళ అనగా రెండు కలసి ఒకేసారి పుట్టిన, అర్జున వృక్షములు. నలకూబర మణిగ్రీవులు- కుబేరుని పుత్రులు; నారద శాపవశులై యమళార్జున వృక్షములైనారు.

*"బాలేన నిష్కర్షయతాన్వగులూఖలం తద్..." (భాగ 10-10-27).*

**బృహద్వనమహాశ్చర్యో వృందావనగతిప్రియః ।**
**వత్సఘాతీ బాలకేలిర్బకాసురనిషూదనః ॥ 166**

**800. బృహద్వనమహాశ్చర్యః :**

బృహద్వనము అనే పేరుగల వ్రజభూమిలో ఉండగా, పూతనాది దుష్టరాక్షసులను వధించి అందరికి చెప్పలేనంత ఆశ్చర్యము కలిగించిన శ్రీకృష్ణుడు. మహోత్పాతములు చేసే రాక్షసుల బాధ తగ్గుతుందన్న ఉద్దేశ్యముతో నందుడు వ్రజవాసమును వృందావనప్రాంతానికి తరలించాడు. నందాది వ్రజవాసులు స్థిరనివాసము లేనివారు (Nomadic Tribes).

*"గోపవృద్ధా మహోత్పాతాననుభూయ బృహద్వనే...." నుంచి ".... గోపగోపీగవాం సేవ్యం పుణ్యాద్రి తృణవీరుధం [భాగ 10-11 - (21-28)].*

**801. వృందావనగతిప్రియః :**

1. నందుడు, గోపాలురు బృహద్వనము వదలి వృందావనమునకు వెళ్లుటకు నిశ్చయించగా ఆ వృందావనము వెళ్ళుటకు ఆసక్తి, ప్రియత్వముగల శ్రీకృష్ణుడు వృందావనగతిప్రియుడు.

2. వృందావనములో చేయవలసిన శ్రీకృష్ణలీలలు మహాప్రభావ వంతమైనవి. ఆ లీలలు భక్తుల ఉద్ధరణకు అవసరము. అందుచేత వృందావన గతిప్రియుడైన భగవానుడు.

*"వృందావనం గోవర్ధనం యమునాపులినాని చ...." నుంచి "... సేతుబంధైర్మర్కటోత్ప్లవనాదిభిః" వరకు [భాగ 10-11 - (36-59)].*

**802. వత్సఘాతీ :**

గోపబాలురతో దూడలు మేపుతున్న సమయములో వత్స(దూడ) రూపములో వచ్చిన అసురుని బలరామునిచే చంపించిన శ్రీకృష్ణుడు "వత్సఘాతీ".

*"తం వత్సరూపిణం వీక్ష్య వత్సయూథగతం హరిః.." (భాగ 10-11-42).*

**803. బాలకేలిః :**

గోపబాలురతో లౌకిక బాలకునివలె చిన్న పిల్లలు ఆడుకునే అన్ని విధముల ఆటలు ఆడుకున్న శ్రీకృష్ణభగవానుడు.

**804. బకాసురనిషూదనః :**

బకాసురు డనే పేరు గల రాక్షసుని చంపిన శ్రీకృష్ణుడు బకాసురనిషూదనుడు.

*"తమాపతన్తం స నిగృహ్య తుండయోర్దోర్భ్యాం బకం కంస సఖం..."*

*(భాగ 10-11-51).*

**అరణ్యభోక్తాప్యథవా బాలలీలాపరాయణః ।**
**ప్రోత్సాహజనకశ్చైవమఘాసురనిషూదనః ॥ 167**

805 నుంచి 818 వరకు గల నామములు ప్రక్షిప్తాధ్యాయములైన 12, 13, 14వ అధ్యాయములలోనివని తెలియనగును. అయినను ఆ నామము లిచ్చుట పొందుపరచడమైనది. అందుకే అథవా అన్నమాట ఉపయోగింప బడినది. (శ్రీమద్వల్లభాచార్యులవారి శ్రీమద్భాగవతసుబోధిని ననుసరించి 10వ స్కంధములో 12వ అధ్యాయము, అఘాసుర ఉద్ధరణ 13వ అధ్యాయము, బ్రహ్మయొక్క మోహము ఆ మోహనాశనము, 14వ అధ్యాయము - బ్రహ్మ దేవునిచే భగవానుని స్తుతి - ప్రక్షిప్తాధ్యాయములు.)

**805. అరణ్యభోక్తా (ఉ_పృథవా) :**

గోపబాలురతో దూడలను మేపుటకు వెళ్లి, వారితో కలిసి కూర్చుని చద్ది అన్నము మొదలైన పదార్థములు భుజించిన శ్రీకృష్ణుడు "అరణ్యభోక్తా".



**806. బాలలీలాపరాయణః :**

1. ఒకానొక వనప్రదేశములో, సమీపములో జలాశయము (నీటి మడుగు) కలదని ఇతర గోపబాలురు చెప్పగా అచ్చటకు వెళ్లి బాలలీలలు సలుపుట యందు తత్పరుడైన శ్రీకృష్ణుడు బాలలీలాపరాయణుడు.

"గత్వా జలాశయాభ్యాశం పాయయిత్వా పపుర్జలమ్" (భాగ 10-11- 46).

2. శ్రీకృష్ణుని లీలలో గోపబాలురతో కలిసి చేసిన బాలలీలలు ముఖ్య మైనవి. ఈ బాల లీలలు పూర్తిచేయుటకు వనమునకు వెళ్లిన శ్రీకృష్ణుడు బాలలీలా పరాయణుడు.

3. గోపబాలురతో కలిసి దూడలను మేపుటకు వనమునకు వెళ్ళినపుడు పరమ ఉత్కృష్టమైన బాలలీలలు చేయుటయే గమ్యముగా గల శ్రీకృష్ణుడు బాలలీలా పరాయణుడు.

**807. ప్రోత్సాహజనకః (చ) :**

గోపబాలురతో ఆడుకుంటున్నపుడు "నేనుముందు, నేను ముందు" అన్న ఉత్సాహమును వారిలో కలిగించిన శ్రీకృష్ణుడు ప్రోత్సాహజనకుడు.

**808. (ఏవమ్) అఘాసురనిషూదనః :**

కొండచిలువ రూపములో నున్న అఘాసురుని వధించిన శ్రీకృష్ణుడు అఘాసురనిషూదనుడు (ఈ నామము కూడా ప్రక్షిప్తాధ్యాయమునకు సంబంధించినదని తెలుసుకొనవలెనని ఏవమ్" అన్నమాట చెప్పబడింది).

**వ్యాలమోక్షప్రదః పుష్టో బ్రహ్మమోహప్రవర్ధనః ।**
**అనంతమూర్తిః సర్వాత్మా జంగమస్థావరాకృతిః ॥ 168**

**809. వ్యాలమోక్షప్రదః :**

అజగరరూపములో వచ్చిన అఘాసురునికి మోక్షమిచ్చిన శ్రీకృష్ణుడు వ్యాలమోక్షప్రదుడు.

*"పీనాహిభోగోత్థితమద్భుతం మహజ్జ్యోతిః................" నుంచి "......... నిత్యాత్మసుఖానుభూత్యభివ్యుదస్తమాయోఽన్తర్గతో హి కిం పునః" (భాగ 10-12; 33-39).*

## 810. పుష్టః :

కొండచిలువ రూపములోనున్న అఘాసురుడు దూడలను, గోపాలురను మ్రింగగా, వారిని రక్షించుటకు శ్రీకృష్ణుడు ఆ అజగరము నోటిలో ప్రవేశించి కంఠమునకు అడ్డుగా నిలిచి తన శరీరము పెద్దదిగా చేసాడు. ఇట్లు తన శరీరము పెద్దదిగా చేసి (పుష్టి) అఘాసురుని వధించి దూడలను గోపాలురను రక్షించిన శ్రీకృష్ణుడు "పుష్టః" అని చెప్పబడ్డాడు.

## 811. బ్రహ్మమోహప్రవర్ధనః :

కృష్ణుని మోహింపజేయాలని చతుర్ముఖబ్రహ్మ గోపాలురను, దూడలను బ్రహ్మలోకములో దాచాడు. బ్రహ్మతిరిగి గోకులం వచ్చి చూడగా, అట్లే ఉన్న గోపబాలురు, దూడలు కృష్ణునితో చేరి ఉన్నవి. బ్రహ్మకు అక్కడ చూచిన ప్రతిగోపబాలునిలోను, దూడలలోను, భగవానుని రూపము కనిపించినది. శ్రీకృష్ణుని యీ సంపత్తిని చూచి బ్రహ్మ యొక్క మోహము ఇంకా ఎక్కువైనది. ఇట్లు బ్రహ్మమోహమును ప్రబలముగా వృద్ధి చేసిన శ్రీకృష్ణభగవానుడు, బ్రహ్మమోహప్రవర్ధనుడు.

*"ఏవమేతేషు భేదేషు చిరం ధ్యాత్వా స ఆత్మభూః...." నుంచి ".... తద్ధామ్నా భూదజస్తూష్ణీం పూర్దేవ్యన్తీవ పుత్రికా"* [ భాగ 10-13 - (43-56) ].

## 812. అనన్తమూర్తిః :

బ్రహ్మదేవుడు గోపబాలురను దూడలను దాచిన సమయములో వారందరి రూపములు దాల్చిన శ్రీకృష్ణుడు అనన్తమూర్తి. (అనన్తము అసంఖ్యాకము).

"తతః కృష్ణో ముదం కర్తుం తన్మాతౄణాం చ కస్య చ..." నుంచి "....పాలయన్ వత్సపో వర్షం చిక్రీడే వనగోష్ఠయోః" [ భాగ 10-13 - (18-27)].



## 813. సర్వాత్మా :

అనంతమూర్తి అనే నామములో పరబ్రహ్మ యొక్క బాహ్యసర్వస్వ రూపత్వము తెలిపి, ఆ గోపబాలురలో, దూడలలో ఆత్మస్వరూపుడై ఉన్న శ్రీకృష్ణుని సర్వాంతర్యామిత్వము తెలుపునామమిది. అందరిలోనున్న ఆత్మ స్వరూపుడైన శ్రీకృష్ణభగవానుడు సర్వాత్మ.

## 814. జంగమస్థావరాకృతిః :

జంగమములైన గోపబాలుర రూపములోనే కాక వారి వారి వస్త్రాభరణాది స్థావర రూపములలో కూడా ఉన్న శ్రీకృష్ణుడు. అవయవముల కూర్పువలన కలిగే రూప విశేషము కూడా శ్రీకృష్ణుడే అని అర్థము.

**బ్రహ్మమోహనకర్తా చ స్తుత్య ఆత్మా సదాప్రియః ।**
**పౌగండలీలాభిరతిర్గోచారణపరాయణః ॥ 169**

## 815. బ్రహ్మమోహనకర్తా (చ) :

"మా లక్ష్మీః (ఐశ్వర్యం) తస్యా ఊహనం వితర్కః భగవదచిన్త్య ఐశ్వర్యమేవంభవితుమర్హతి, ఇత్యేవం రూపో వితర్కో మోహనం బ్రహ్మణి తత్కారక ఇత్యర్థః." అచిన్త్యమైన భగవదైశ్వర్యమును గురించి వితర్కము కలగుట వలన భగవానుడు బ్రహ్మకు మోహము కలిగించాడు.

*"ఏవం సమ్మోహయన్ విష్ణుం విమోహం విశ్వమోహనం......" నుంచి "............ నిహంత్యాత్మని యుంజతః"* వరకు *(భాగ 10-13-44, 45).*

811వ నామము 'బ్రహ్మమోహప్రవర్ధనః' మోహఉపక్రమ కర్తృత్వమును, 815వ నామము, 'బ్రహ్మ మోహనకర్తా' తత్ఫలితమును తెలుపుతాయి. కనుక పునరుక్తి కాదు.

బ్రహ్మ భగవంతుని వలన తనకు మోహము కలిగిందని తెలుసుకొని శ్రీ కృష్ణుని స్తుతించాడు.

**816. స్తుత్యః :**

తాను భగవానునిచే మోహవశుడనైతినని తెలుసుకొని బ్రహ్మ శ్రీకృష్ణుని స్తుతించాడు. ఆవిధముగా స్తుతింపబడ్డ శ్రీకృష్ణుడు స్తుత్యుడు

*"నౌమీడ్య తేఽభ్రవపుషే..."* *(భాగ 10-14-1).*

**817. ఆత్మా :**

"సర్వ దేహి నామితి శేషః ఆత్మా" దేహము కలవాడు దేహి. దేహము నశించినా నాశనము లేకుండా మిగిలేది ఆత్మ. ఆత్మ అనగా సమస్త దేహధారులలో ఆత్మ స్వరూపముగా ఉన్న భగవానుడని అర్థము.

*"నారాయణస్త్వం న హి సర్వదేహినామాత్మాస్యధీశాఖిలలోకసాక్షీ..."*

*(భాగ 10-14-14).*

**818. సదాప్రియః :**

ఎల్లకాలములందు అందరికి ప్రియుడైన శ్రీకృష్ణభగవానుడు సదా ప్రియుడు.

**819. పౌగండలీలాభిరతిః :**

ఏడవ సంవత్సరము వచ్చిన దగ్గర నుండి పదకొండవ సంవత్సరము నిండేవరకుగల వయస్సు పౌగండావస్థ. ఆ వయస్సులో శ్రీకృష్ణుడు చేసిన లీలలు పౌగండలీలలు. వీనియందు సర్వవిధములా ప్రీతి (అభిరుచి) గల శ్రీకృష్ణుడు – ధేనుకాసుర ఉద్ధరణ, కాళీయమర్దనము. మొదలు శ్రీకృష్ణుని రాస లీలల వరకు చేసిన లీలలు పౌగండలీలలు. (అధ్యా ॥ 15 – అధ్యా ॥ 35 వరకు.)

**820. గోచారణపరాయణః :**

"గవాంచారణం గోచారణమ్ – అభీష్ట తృణజలాదిభిః పోషణం తదేవ పరముత్కృష్టమయనం స్థానం యస్యేతి వా." ఆవులను వాటి కిష్టమైన, పోషకమైన, గడ్డి నీరు ఉన్న స్థలాలలో మేపుట గోచారణము. ఆ పనియందు పరమ ఉత్కృష్టమైన భావము కల శ్రీకృష్ణుడు గోచారణపరాయణుడు.



**వృందావనలతాగుల్మవృక్షరూపనిరూపకః ।**
**నాదబ్రహ్మప్రకటనో వయఃప్రతికృతిస్వనః ॥ 170**

**821. వృందావనలతాగుల్మవృక్షరూపనిరూపకః :**

వృందావనములో పూవులు, పండ్లు ఎక్కువగా ఉండుటచేత ఆ బరువుకు లతలు పొదలు, వృక్షములు భూమిని త్రాకుతున్నట్టు ఉండెను. ఆ వృందావన లతాగుల్మవృక్షముల రూపములను గొప్పగా వర్ణించి స్నేహితులకు చూపించు శ్రీకృష్ణభగవానుడు వృందావనలతాగుల్మవృక్షరూపనిరూపకుడు.

*"అహో అమీ దేవవరామరార్చితం...." నుంచి "...గోప్యోఽన్తరేణ భుజయోరపి యత్స్పృహా శ్రీః" వరకు* *[భాగ 10-15 - (5-8)].*

**822. నాదబ్రహ్మప్రకటనః :**

నాదము లేక గానము శబ్ద బ్రహ్మరూపమని తెలిసేటట్లు (అట్టి భావము కలిగేటట్లు) సఖులతోకూడి గానముచేయుచు ఆ నాదరూపశబ్దబ్రహ్మమును ప్రకటింపచేసే శ్రీకృష్ణుడు

"క్వచిద్గాయతి గాయత్సు మదాంధాలిష్వనువ్రతైః...." నుంచి "... గ్రామ్యైః సమం గ్రామ్యవదీశచేష్టితః" వరకు [భాగ 10-15 - (10-19)].

**823. వయఃప్రతికృతిస్వనః :**

పక్షులు కూస్తున్నట్లు పిల్లనగ్రోవి వాయిస్తూ, కలహంసలతో గొంతు కలుపుతూ, స్నేహితులను ఆనందింపజేసే శ్రీకృష్ణుడు "వయఃప్రతికృతిస్వనః" అనబడతాడు.

*"క్వచిచ్చకలహంసానామనుకూజతి కూజితమ్..."* *(భాగ 10-15-11).*

**బర్హినృత్యానుకరణో గోపాలానుకృతిస్వనః ।**
**సదాచారప్రతిష్ఠాతా బలశ్రమనిరాకృతిః ॥ 171**

**824. బర్హినృత్యానుకరణః :**

నెమళ్ళుచేస్తున్న నృత్యములను అనుకరించే శ్రీకృష్ణుడు "బర్హినృత్యాను కరణః" అనబడతాడు.

**825. గోపాలానుకృతిస్వనః :**

గోపబాలురు చేసే శబ్దములు, గానములు మొదలైనవి, తన వేణువులో పుట్టించి వారిని ఆనందింపజేసే శ్రీకృష్ణుడు "గోపాలానుకృతిస్వనః" అనబడతాడు.

**826. సదాచారప్రతిష్ఠాతా :**

పెద్దల ఆచరణను మన్నించి, పెద్దలకు పాదసంవాహనము (కాళ్లుపట్టుట) మొదలగు సేవలను ఆచరించి, సదాచారమును ప్రతిష్ఠింపజేసిన శ్రీకృష్ణుడు సదాచారప్రతిష్ఠాత.

*"క్వచిత్ క్రీడాపరిశ్రాన్తం గోపోత్సంగోపబర్హణం...." (భాగ 10-15-14).*

**827. బలశ్రమనిరాకృతిః :**

బలరాముడు రాక్షసదమనము మొదలగు కార్యములను చేసి శ్రమించిన తర్వాత అన్నగారిసేవచేసి శ్రమపోగొట్టే శ్రీకృష్ణుడు"బలశ్రమనిరాకృతిః" అనబడతాడు.

**తరుమూలకృతాశేషతల్పశాయీ సఖిస్తుతః ।**
**గోపాలసేవితపదః శ్రీలాలితపదాంబుజః ॥ 172**

**828. తరుమూలకృతాశేషతల్పశాయీ :**

సఖులు (గోపాలురు)- చిగుళ్లు పువ్వులు మొదలైన మృదువైన పదార్థము లతో చెట్ల మొదళ్ళదగ్గర చేసిన తల్పములపై పడుకున్న శ్రీకృష్ణుడు అని అర్థము.

*"క్వచిత్ పల్లవతల్పేషు నియుద్ధశ్రమకర్శితః..." (భాగ 15-15-16).*



**829. సఖిస్తుతః :**

సఖులనగా తనతో సమానమైన స్వభావము, అలవాట్లు, ఇష్టానిష్టములు గల మిత్రులు. తనతో ఆడుకునే గోపాలురచే (సఖులచే) కీర్తింపబడే (స్తుతింపబడే) శ్రీకృష్ణుడు, సఖిస్తుతుడు.

**830. గోపాలసేవితపదః :**

గోపబాలురచే పాదసంవాహనాది (కాళ్ళు పట్టుట మొదలైన) రూపమున సేవింపబడే శ్రీకృష్ణుడు. సఖులు శ్రీకృష్ణుని పాదపద్మములను సేవించేవారు.

**831. శ్రీలాలితపదాంబుజః :**

లక్ష్మీదేవిచే స్నేహపూర్వకముగా లాలింపబడే శ్రీహరి పాదపద్మములు శ్రీలాలితపదాంబుజములు.

**గోపసంప్రార్థితఫలదాననాశితధేనుకః ।**
**కాలీయఫణిమాణిక్యరంజితశ్రీపదాంబుజః ॥ 173**

**832. గోపసంప్రార్థితఫలదాననాశితధేనుకః :**

శ్రీదామ, సుబలాది గోపబాలురు తాటిపండ్లు కోసి తినిపించమని కోరగా, ఆ తోట రక్షించే గాడిదరూపములోనున్న ధేనుకాసురుని చంపి గోపబాలురకు ఫలముల నిచ్చిన బలరాముడు "గోపసంప్రార్థితఫలదాననాశితధేనుకః" అనబడతాడు.

**833. కాలీయఫణిమాణిక్యరంజితశ్రీపదాంబుజః :**

శ్రీకృష్ణుడు కాళీయనాగుని పడగలపై నాట్యము చేసినప్పుడు ఆ పాము పడగలపైగల మణుల కాంతిచేత శ్రీకృష్ణుని పాదపద్మములు ప్రకాశించినవి. అవియే లక్ష్మీదేవి సేవించే శోభాయమానమైన భగవానుని పాదపద్మములుగా తెలిసుకోవలెనని ఈ నామార్థము.

**దృష్టిసంజీవితాశేషగోపగోగోపికాప్రియః ।**
**లీలాసంపీతదావాగ్నిః ప్రలంబవధపండితః ॥ 174**

**834. దృష్టిసంజీవితాశేషగోపగోగోపికాప్రియః :**

కాళీయవిషపూరిత జలము త్రాగి అశేషమైన గోపబాలురు, గోవులు, గోపికలు ప్రాణములు పోగొట్టుకొన్నారు. వారందరిని తన అమృతమయదృష్టిచే శ్రీకృష్ణుడు మరల బ్రతికించాడు. ఇట్లు శ్రీకృష్ణునిచే ప్రాణదానము పొందిన గోపబాలురకు గోవులకు గోపికలకు శ్రీకృష్ణుడు మిక్కిలి ప్రియుడు అని ఈ నామార్థము.

**835. లీలాసంపీతదావాగ్నిః :**

యమునాతీరమున గోవులు, గోపాలరు నిద్రిస్తున్న సమయములో దావాగ్ని వారందరిని చుట్టిముట్టగా ఆ దావాగ్నిని అనాయాసముగా, పూర్తిగా పానము చేసిన శ్రీకృష్ణుడు.

"ఇత్థం స్వజనవైక్లబ్యం నిరీక్ష్య జగదీశ్వరః" (భాగ 10-17-25).

**836. ప్రలంబవధపండితః :**

ప్రలంబాసురవధ తన అవతార ప్రయోజనమని బలరామునికి జ్ఞాపకము చేసి దైత్యుని వధకు కారణమైన శ్రీకృష్ణుడు.

*"పశూంశ్చారయతోర్గోపైస్తద్వనే రామకృష్ణయోః...." నుంచి "... గిరిర్యథా మఘవత ఆయుధాహతః"* *[భాగ 10-18 - (17-29)].*

**దావాగ్న్యావృతగోపాలదృష్ట్యాచ్ఛాదనవహ్నిపః ।**
**వర్షాశరద్విభూతిశ్రీర్గోపీకామప్రబోధకః ॥ 175**

**837. దావాగ్న్యావృతగోపాలదృష్ట్యాచ్ఛాదనవహ్నిపః :**

దావాగ్నిచే చుట్టుముట్టబడిన గోపాలురను కళ్ళు మూసుకోమని ఆజ్ఞాపించి ఆ దావాగ్నిని త్రాగివేసిన శ్రీకృష్ణుడు అని యీ నామార్థము.

*"తతః సమన్తాద్వనధూమకేతుః...." నుంచి "...దావాగ్నేరాత్మనః క్షేమం వీక్ష్య తే మేనిరేఽ మరమ్।"* *[భాగ 10-19 - (7-14)].*



**838. వర్షాశరద్విభూతిశ్రీః :**

1. వర్షశరదృతువులలో శోభాయమానముగానున్న వృందావన పరిసరములలోగల ప్రకృతి శోభాసంపత్తి ఎవరి లీలచే ఎన్నో రెట్లు వృద్ధి చేయబడినదో ఆ శ్రీకృష్ణభగవానుడు "వర్షాశరద్విభూతిశ్రీః" అనబడతాడు.

2. వర్షశరదృతువులలో వృందావన పరిసరములలో గల ప్రకృతి శోభ భగవంతుని విభూతి యొక్క రూపమై ఉండెను అని అర్థము.

*"సాంద్రనీలాంబుదైర్వ్యోమ సవిద్యుత్...." నుంచి "...పక్వసస్యాఢ్యా కలాభ్యాం నితరాం హరేః" వరకు* *[భాగ 10-20 - (4-48)].*

**839. గోపీకామప్రబోధకః :**

గోపికలకు తనయందు ప్రీతికలిగించి, వారికి తనయందు కామము ప్రకర్షముగా జనింపచేసి, రాసలీలల కొరకై వారిని ప్రేరణ చేసిన శ్రీకృష్ణుడు గోపీకామప్రబోధకుడు.

*"తద్వ్రజస్త్రియః ఆశ్రుత్య వేణుగీతం స్మరోదయం..." నుంచి ".... శ్రుత్వా వ్రజస్త్రియః సర్వా వర్ణయంత్యోఽభిరేభిరే" వరకు* *[భాగ 10-21 - (3-6)].*

**గోపీరత్నస్తుతాశేషవేణువాద్యవిశారదః ।**
**కాత్యాయనీవ్రతవ్యాజసర్వభావాశ్రితాంగనః ॥ 176**

**840. గోపీరత్నస్తుతాశేషవేణువాద్యవిశారదః :**

1. గోపికలు రత్నములు. శ్రీకృష్ణునియందాకర్షితులైనవారు. శ్రీకృష్ణుని మధురమైన వేణువాద్య విశేషమును వారెంతో స్తుతిస్తూఉంటారు. అట్టివారికి తన వేణునాదవాద్యముచే ఇంకా ఎక్కువగా మాధుర్యము కలిగించి తన్మయులను చేసే నేర్పుగల శ్రీకృష్ణుడు గోపీరత్నస్తుతాశేషవేణువాద్యవిశారదుడు.

2. గోపీరత్నములు (గోపికలలో శ్రేష్ఠులైనవారు) శ్రీకృష్ణుని, అతని

వేణునాదమందలినేర్పును స్తుతించుతూ ఉండగా, వారి స్తుతుల కనురూపముగా వేణునాదవాద్యము చేసే శ్రీకృష్ణుడు 'గోపీరత్నస్తుతాశేషవేణువాద్యవిశారదుడు'.

**841. కాత్యాయనీవ్రతవ్యాజసర్వభావాశ్రితాఙ్గనః :**

సర్వాత్మకుడైన శ్రీకృష్ణుని భర్తగా పొందవలెనని, ఆతనియందు ప్రీతితో హేమంతఋతువు ప్రథమ మాసమైన మార్గశీర్ష మాసములో, గోపకన్యకలు కాత్యాయనీవ్రతము చేసారు. ఈ వ్రతము ఒక వాజ్యము (మిష). వారు తమ సర్వభావములను శ్రీకృష్ణునియందే నిలిపి, దేవీ వ్రతము చేసారు. ఈ విధముగా సర్వభావములతో శ్రీకృష్ణుని భర్తగాకోరుకొనే గోపకన్యలుగల శ్రీకృష్ణుడు "కాత్యాయనీవ్రతవ్యాజసర్వభావాశ్రితాంగనః" అని అర్థము.

*"హేమంతే ప్రథమే మాసి..." నుంచి ".... ఇతి మంత్రం జపన్త్యస్తాః పూజాం చక్రుః కుమారికాః"* *[భాగ 10-22 - (1-4)].*

**సత్సంగతిస్తుతివ్యాజస్తుతవృందావనాంఘ్రిపః ।**
**గోపక్షుచ్ఛాంతిసంవ్యాజవిప్రభార్యాప్రసాదకృత్ ॥ 177**

**842. సత్సంగతిస్తుతివ్యాజస్తుతవృందావనాంఘ్రిపః:**

'సన్' అంటే భగవానుడు. 'సంతః' అంటే భక్తులు, గోపబాలురు. వారి సంగము సత్సంగము, సత్సంగతి. వృందావనములో నున్న వృక్షములు కూడా (వర్షశరదృతువుల సమయములో) పువ్వులు పళ్ళతో నిండి భగవంతునితో సత్సంగము చేస్తున్నాయి. ఇది మిషగా (వ్యాజముగా) చేసుకొని వృందావనము లోని వృక్షములను కృష్ణుడు, గోపబాలురు స్తుతించారు. సత్సంగస్తుతి చేసారు.

2. సంతులు ఇతరులు పెట్టే బాధలు సహించి వారికి ఉపకారము (మేలు) చేస్తారు. ఆ విధంగానే వృక్షములు తమ ఫలములను ఆశించేవారు పెట్టే బాధలు సహించి, ఎండబాధ సహించి, పళ్ళను, చల్లని నీడను ఇస్తాయి. ఇట్లు పరోపకార విషయములో వృక్షములు, సంతులు ఒకే విధముగా



ఉండడము అందరికీ తెలిసిన విషయము. అందుకని వృందావనవృక్షముల సంగము సత్సంగమని కృష్ణుడు, గోపబాలురు స్తుతించారు. ఇది ఈ నామార్థము.

*"పశ్యతైతాన్ మహాభాగాన్, పరార్థైకాంతజీవితాన్...." నుంచి "... తతో నృప స్వయం గోపాః కామం స్వాదు పపుర్జలమ్" వరకు [భాగ 10-22 - (32-37)].*

**843. గోపక్షుచ్ఛాన్తిసంవ్యాజవిప్రభార్యాప్రసాదకృత్ :**

గోపబాలుర ఆకలి తీర్చదానికి, శ్రీకృష్ణుడు యజ్ఞము చేయుచున్న బ్రాహ్మణులను భోజన మిమ్మని తానడిగినట్లు చెప్పి పంపగా ఆ బ్రాహ్మణులు వారికి భోజనము ఇవ్వలేదు. శ్రీకృష్ణుడప్పుడు గోపబాలురను ఆ యజ్ఞము చేసే బ్రాహ్మణుల భార్యలను భోజనమిమ్మని అడుగమనగా వారు యజ్ఞము కొరకు చేసిన సర్వపదార్థములను యజ్ఞపురుషుడైన శ్రీకృష్ణుడే అడిగాడని సంతోషించి స్వయముగా వారే భోజనపదార్థములు తీసుకుపోయి శ్రీకృష్ణునికి సమర్పించారు. శ్రీకృష్ణుని కృపచే వారు అనన్యకృష్ణభక్తిని పొందారు. ఈ విధముగా గోపబాలుర ఆకలి మిషతో తన భక్తులైన ఆ బ్రాహ్మణపత్నులకు అనన్యభక్తి ప్రసాదించిన శ్రీకృష్ణభగవానుడు "గోపక్షుచ్ఛాన్తిసంవ్యాజవిప్రభార్యా ప్రసాదకృత్" అనబడతాడు.

*"రామ రామ మహావీర్య కృష్ణ దుష్టనిబర్హణ..." నుంచి "....యత్సంపర్కాత్ ప్రియా ఆసంస్తతః కోన్వపరః ప్రియః"* *[భాగ 10-23 - (1-27)].*

**హేతుప్రాప్తేంద్రయాగస్వకార్యగోసవబోధకః ।**
**శైలరూపకృతాశేషరసభోగసుఖావహః ॥ 178**

**844. హేతుప్రాప్తేంద్రయాగస్వకార్యగోసవబోధకః :**

హేతుప్రాప్తమంటే ధర్మార్థకామములను పొందే నిమిత్తము అని అర్థము. 'స్వకార్య' అంటే 'స్వం' సామగ్రి, 'కార్య' చేసే యాగక్రియ; 'గోసవ' అంటే–

ఇక్కడ(గో) గోవులు, బ్రాహ్మణులు, గోవర్ధనపర్వతము కొరకు (సవ) సంపాదింపబడిన సామగ్రి గోసవములు. ఇంద్రుని యాగముచేసి ధర్మార్థకామ సంబంధమైన కోర్కెలు తీర్చుకొనుటకు బదులుగా గోవులకు మేతపెట్టి ఆ గోవుల ద్వారా మనకు అన్ని సంపదలుఇచ్చే గోవర్ధనపర్వతమునుద్దేసించి పూజలు చేయుట మంచిదని, గోవులను, బ్రాహ్మణులను పూజించి, సంతోషింప జేయమని నందాది గోపులకు బోధించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

**845. శైలరూపకృతాశేషరసభోగసుఖావహః :**

ఇంద్రయాగము చేయుటకు బదులు గోవర్ధనపర్వతమునకు ప్రదక్షిణము చేసి షడ్రసములతో కూడిన భోగములన్నిటిని, గోవర్ధనపర్వతమునకు నందాదులు సమర్పించారు. అప్పుడు శ్రీకృష్ణభగవానుడు వేరైన రూపముతో గోవర్ధనపర్వతముపై దర్శనమిచ్చి "నేను గోవర్ధనపర్వతమును. మీ పూజలను స్వీకరిస్తున్నాను. ప్రసన్నుడనైనాను" అని చెప్పాడు. ఇంద్రాదిదేవతలు దర్శన మివ్వకుండా (పరోక్షముగా) యజ్ఞహవిస్సు స్వీకరిస్తారు కాని గోకులవాసుల ముందు ప్రత్యక్షముగా నిలిచి "నేను గోవర్ధనపర్వతమును, మీ పూజలు స్వీకరించాను" అని వారిని శ్రీకృష్ణుడు సంతోషపెట్టాడు. ఇట్లు శైలరూప కృతాశేషరసభోగసుఖావహుడైన శ్రీకృష్ణుడు.

**లీలాగోవర్ధనోద్ధారపాలితస్వవ్రజప్రియః ।**
**గోపస్వచ్ఛందలీలార్థగర్గవాక్యార్థబోధకః ॥ 179**

**846. లీలాగోవర్ధనోద్ధారపాలితస్వవ్రజప్రియః :**

గోవులకు ఆహారము తృణాదులు. వీనిని సమృద్ధిగా సమకూర్చి గోవులకు ఇచ్చేది గోవర్ధనపర్వతము. ఆ పర్వతమును సునాయాసముగా గొడుగువలె పైకెత్తి తన వారైన నందాదులను, వారి గోసంపదను ప్రియులైన గోపగోపికలను, ఇంద్రుని ఆజ్ఞచే శిలల (వడగళ్ళు)తో కూడిన వర్షము నుంచి రక్షించిన శ్రీకృష్ణుడు "లీలాగోవర్ధనోద్ధారపాలితస్వవ్రజప్రియుడు."



*"తస్మాన్మచ్ఛరణం గోష్ఠం మన్నాథం మత్పరిగ్రహమ్..." నుంచి "... పశ్యతాం సర్వభూతానాం స్థాపయామాస లీలయా"* వరకు *[భాగ 10-25 - (18-28)].*

**847. గోపస్వచ్ఛందలీలార్థగర్గవాక్యార్థబోధకః :**

"గోపానాం, స్వచ్ఛన్దం భయాభావపూర్వకం స్వచ్ఛన్దలీలాకరణార్థం పూర్వం నన్దం ప్రత్యుక్తగర్గవాక్యానాం నందముఖాత్ పునస్తేషామర్థస్య బోధకో జ్ఞాపకో గోపేష్వితి." శ్రీకృష్ణుడు భగవానుని అవతారపురుషుడని, ఆయన స్వచ్ఛందముగా చేసే లీలలచే గోపాలురకు సంకట సమయములలో పూర్తిగా అభయము కలుగుతుందని, పూర్వము గర్గమహాముని నందునికి చెప్పిన మాటలు నందుడు గోపజనమునకు బోధపరిచినట్లు ప్రేరేపించిన శ్రీకృష్ణుడు.

*"శ్రూయతాం మే వచో గోపా వ్యేతు శంకా చ వోఽర్భకే..." నుంచి "... ముదితా నందమానర్చుః కృష్ణం చ గత విస్మయాః"* వరకు *[భాగ 10-26 - (15-24)].*

**ఇంద్రధేనుస్తుతిప్రాప్తగోవిందేంద్రాభిధానవాన్ ।**
**వ్రతాదిధర్మసంసక్తనందక్లేశవినాశకః ॥ 180**

**848. ఇంద్రధేనుస్తుతిప్రాప్తగోవిందేంద్రాభిదానవాన్ :**

ఇంద్రుడు మూసలధారావర్షముతో వ్రజప్రదేశమును పీడించిన సమయములో గోవర్ధనగిరినెత్తి గోవులను గోప, గోపికలను, వారి సంపదలను రక్షించిన శ్రీకృష్ణుని కామధేనువు (ఇంద్రధేనువు) గోవిందుడని (గోవులకు ఇంద్రుడని) స్తుతించింది.

*"కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వసంభవ.." నుంచి "....అవతీర్ణోఽసి విశ్వాత్మన్ భూమేర్భారాపనుత్తయే"* *[భాగ 10-27 - (19-21)].*

*గోవిందనామ నిర్వచనము చాలా విధములుగా చేయబడినది :*

గవామింద్రః గోవిందః । "అహం కిలేంద్రో దేవానాం త్వం గవామింద్రతాంగతః గోవింద ఇతిలోకాస్త్వాం స్తోష్యన్తి భువి శాశ్వతం" (హరి వంశము)

గౌరీశాను తథా వాణీ తాం వై వేదయతే భవాన్ । గోవిందస్తు తతో దేవ మునిభిః...॥ (హరి వంశము)

గాం భువం వాణీం వా విన్దతీతి గోవిందః (నిరుక్తము)

నష్టాం వై ధరణీం పూర్వమవిన్దం వై గుహాం గతామ్ । గోవింద ఇతి మాం దేవైస్తతో వాగ్భిరభిష్టుతః" (మహాభారతము).

## 849. వ్రతాదిధర్మసంసక్తనందక్లేశవినాశకః :

సాక్షాత్ భగవానుడే శ్రీకృష్ణుడై అవతరించి తన దగ్గర ఉన్నప్పటికి వ్రతములు చేయడంలోని క్లేశములు సహిస్తూ నందుడు ఏకాదశ్యాది వ్రతములు ఎంతో ఆసక్తితో చేసేవాడు. క్లేశములు పొందుతూ వ్రతములు ఆచరించ నవసరము లేదని నందునికి శ్రీకృష్ణుడు బోధించాడు. ఇట్లు వ్రతాది ధర్మసంసక్తనందక్లేశవినాశకుడైన శ్రీకృష్ణుడు.

*"ఏకాదశ్యాంనిరాహారః సమభ్యర్చ్య జనార్దనం..." నుంచి "... ఆదాయాగాత్ స్వపితరం బంధూనాం చావహన్ముదమ్" వరకు [భాగ 10-28 - (1-9)].*

**నందాదిగోపమాత్రేష్టవైకుంఠగతిదాయకః ।**
**వేణువాదస్మరక్షోభమత్తగోపీవిముక్తిదః ॥ 181**

## 850. నందాదిగోపమాత్రేష్టవైకుంఠగతిదాయకః :

నందునికేగాక, సకల బాలవృద్ధ సాధారణ గోప సముదాయమునకు వారు మనస్సులో కోరుకుంటున్న వైకుంఠదర్శనము కలిగించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"తేత్వౌత్సుక్య ధియోరాజన్ మత్వా గోపాస్తమీశ్వరమ్..." నుంచి ".... కృష్ణం చ తత్రచ్ఛందోభిః స్తూయమానం సువిస్మితాః" [భాగ 10-28 - (11-17)].*

## 851. వేణువాదస్మరక్షోభమత్తగోపీవిముక్తిదః :

ఇళ్ళలో నుండి బయటికి రాలేని గోపికలు శ్రీకృష్ణుని వేణువాదము విని తమ కామవాంఛ వృద్ధి పొందగా, భరించలేక, శ్రీకృష్ణుని సౌందర్యము మాధుర్యము తలుచుకుంటూ ధ్యానముద్రలోకి పోయేవారు. ఇట్టి మార్పు రాగా వారిలోని సాంసారిక అశుభలక్షణములుగల వాంఛలు పోయి, శ్రీకృష్ణ



దర్శనమైనది. శ్రీకృష్ణపరమాత్మ దర్శనముతో వారికి ఎనలేని బ్రహ్మానందము కలిగినది. ఇట్లు వేణువాదస్మరక్షోభమత్తగోపీవిముక్తదుడైన శ్రీకృష్ణుడు.

*"అన్తర్గృహ గతాః కాశ్చిద్ గోప్యోஉలబ్ధ వినిర్గమాః.." నుంచి ".... ధ్యానప్రాప్తాచ్యుతా శ్లేష నిర్వృత్యాక్షీణమంగలాః" [భాగ 10-29 - (9, 10)].*

**సర్వభావప్రాప్తగోపీసుఖసంవర్ధనక్షమః ।**
**గోపీగర్వప్రణాశార్థతిరోధానసుఖప్రదః ॥ 182**

## 852. సర్వభావప్రాప్తగోపీసుఖసంవర్ధనక్షమః :

రాసలీలా సమయమందు గోపికల చిత్తములు ఏ ఇతర సంసారిక విషయముల యందు పోకుండా సర్వాత్మకుడైన శ్రీకృష్ణునియందే నిలిపేటట్లు వారికి బ్రహ్మానందము కలిగింప సమర్థుడైన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"మైవం విభోஉర్హతి భవాన్ గదితుం నృశంసం........" నుంచి ".......వ్రజసుందరీణాముత్తంభయన్ రతిపతిం రమయాంచకార" [భాగ 10-29 - (31-46)].*

## 853. గోపీగర్వప్రణాశార్థతిరోధానసుఖప్రదః :

రాసలీలా సమయమందు గోపికలకు శ్రీకృష్ణుని సాన్నిధ్యము గర్వమును కలిగించినది. ఆ గర్వముపోగొట్టి నిజమైన భక్తి, ఆనందము వారిలో కలిగించుటకు శ్రీకృష్ణుడు అంతర్ధానమైనాడు. బాహ్యముగా అంతర్ధానమైనా గోపికల అంతఃకరణములో కృష్ణుడు స్థిరముగా నున్నాడు. అందువలన వారి అంతఃకరణములలో శ్రీకృష్ణుడే నిలిచినట్లు చేసి, గోపికలకు మిక్కిలి అధికమైన ఆనందము నిచ్చిన శ్రీకృష్ణభగవానుడు అని ఈ నామార్థము.

*"ఏవం భగవతః కృష్ణాల్లబ్ధమానా మహాత్మనః....." నుంచి "...ప్రశమాయ ప్రసాదాయ తత్రైవాన్తరధీయత" వరకు (భాగ 10-29-47, 48).*

*"అంతర్హితే భగవతి సహసైవ వ్రజాంగనాః..." నుంచి "... స్తాస్తా విచేష్టా జగృహుస్తదాత్మికాః" వరకు (భాగ 10-30 - 1, 2).*

**కృష్ణభావవ్యాప్తవిశ్వగోపీభావితవేశధృక్ ।**
**రాధావిశేషసంభోగప్రాప్తదోషనివారకః ॥ 183**

**854. కృష్ణభావవ్యాప్తవిశ్వగోపీభావితవేశధృక్ :**

శ్రీకృష్ణుడు యశోదానందుల పుత్రుడు, దేహమాత్రధారియును కాదని, ఆత్మ స్వరూపుడై విశ్వమంతటా వ్యాపించి ఉన్నవాడని, అందుచేత తమ అంతః కరణములోకూడా ఉన్నాడన్న భావము గోపికలలో కలిగింది. గోపికలు తమ అంతఃకరణములలో శ్రీకృష్ణుని స్మరించుచును శ్రీకృష్ణసంబంధమైన లీలా వేషములు తమలోను, ఇతరగోపికలలోను, భావించుకొనుచును ప్రత్యక్ష ముగా శ్రీకృష్ణుని సమక్షములో రాసక్రీడ జరుపుకొనుచును, ఆనందానుభవము పొందుతూ ఉన్నట్లు భావించుతూ ఉండిరి. గోపికల అంతఃకరణములలో ఈ విధముగా ప్రేరేపించిన శ్రీకృష్ణభగవానుడు అని ఈ నామార్థము.

*"గాయన్త్య ఉచ్చైరముమేవ సంహతా....."* *(భాగ 10-30-4).*

**855. రాధావిశేషసంభోగప్రాప్తదోషనివారకః :**

సంభోగమనగా అనుభవించుట, హర్షించుట, సంతోషించుట. (అన్యాపేక్షయా) ఇతరులకన్న తనకే భగవంతుడు విశేషమైన సంతోషము, అనుభవము కలిగించాడన్న గర్వము రాధ మనస్సునందు కలిగింది. అహంకారము, సంసారభావము కలుగుట దోషము. భగవదపచారము. అందువలన శ్రీకృష్ణుడు అంతర్ధానమయ్యాడు. రాధకు గర్వభంగమైనది. తిరిగి ఆమె శ్రీకృష్ణుని యందే చిత్తము నిలిపింది. అప్పుడు సంసారాభావము, నిరహంకారము, భగవానుడే సర్వము అనే భావము కలుగగా దోషనివారణము, భగవదనుగ్రహప్రాప్తి కలిగినవి. ఇట్టి రాధావిశేషసంభోగ ప్రాప్తదోషనివారకుడైన శ్రీకృష్ణుడు.

*"ఇత్యేవం దర్శయన్త్యస్తాశ్చేరుర్గోప్యో విచేతసః" నుంచి "... అవమానంచ దౌరాత్మ్యాద్ విస్మయం పరమం యయుః"* *[భాగ 10-30 - (36-42)].*

**పరమప్రీతిసంగీతసర్వాద్భుతమహాగుణః ।**
**మానాపనోదనాక్రందగోపీదృష్టిమహోత్సవః ॥ 184**



**856. పరమప్రీతిసంగీతసర్వాద్భుతమహాగుణః :**

గోపికలు శ్రీకృష్ణుని విరహముతో అందరికి ప్రీతికలిగించేవి, ఇతరులెవ్వరు పొందశక్యము గానివి, అయిన శ్రీకృష్ణుని ఉత్కృష్టమైన అద్భుతగుణములు స్తుతిస్తూ గానము చేసారు. ఈ గీతములు పాడుతూ శ్రీకృష్ణునియందు చిత్తములు లయము చేసి, ఆనందములో మునిగిపోయారు. ఇట్టి ప్రేమభక్తిపరాకాష్ఠస్థితి వారికి కలిగించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"జయతి తేఽధికం జన్మనా వ్రజః శ్రయత ఇందిరా శశ్వదత్ర హి:" నుంచి "....కూర్పాదిభిర్భ్రమతి ధీర్భవదాయుషాం నః" వరకు [భాగ 10-31 - (1-19)].*

**857. మానాపనోదనాక్రందగోపీదృష్టిమహోత్సవః :**

తమను (గోపికలను) శ్రీకృష్ణుడు గౌరవించలేదని, చిన్న చూపు చూచాడని, నిర్లక్ష్యము చేసాడని, కనపడకుండా అదృశ్యమయ్యాడని గోపికలు ఏడుస్తున్నారు. రోదిస్తూ ఉన్న గోపికలమధ్య శ్రీకృష్ణుడు అకస్మాత్‌గా ప్రత్యక్షమయ్యాడు. శ్రీకృష్ణునిపై వారి దృష్టి పడగానే వారికి పట్టలేనంత సంతోషము ఆనందోత్సవము కలిగినవి. ఇట్టి ఆనందోత్సవము వారికి కలుగజేసిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

**గోపికావ్యాప్తసర్వాంగః స్త్రీసంభాషావిశారదః ।**
**రాసోత్సవమహాసౌఖ్యగోపీసంభోగసాగరః ॥ 185**

**858. గోపికావ్యాప్తసర్వాంగః :**

1. గోపికలు శ్రీకృష్ణుని పాదపద్మములను, హృదయపద్మమును, ముఖాంభోజమును, నేత్రపద్మములను, కరపద్మములను, ఇట్లే సర్వాంగములను, ధ్యానము చేస్తూ ఉండేవారు. అందుచేత గోపికల హృదయములందు స్థాపించబడిన మరియు వ్యాపించబడిన సర్వాంగములుకల శ్రీకృష్ణుడు.

2. గోపికలచే లెస్సగా ఆక్రమించబడిన సర్వాంగములు కల శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"కాచిత్కరాంబుజం శౌరేర్జగృహేఽ ఞ్జలినా ముదా"* నుంచి *"...పుల కాంగ్యుపగుహ్యాస్తే యోగీవానందసంప్లుతా"* *[భాగ 10-32 - (4-8)].*

## 859. స్త్రీసంభాషావిశారదః :

1. స్త్రీలతో (గోపికలతో) సందర్భానుసారముగా చతురత్వముతో మాటలు చెప్పి, వారడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పి, వారిని ఆనందింపజేసే గొప్ప నేర్పరితనముగల శ్రీకృష్ణుడు స్త్రీసంభాషావిశారదుడు.

*"భజతో ఽ నుభజన్త్యేక, ఏక ఏతద్విపర్యయం...."* నుంచి *".... సంవృశ్చ్య తద్ వః ప్రతియాతు సాధునా"* వరకు *[భాగ 10-32 - (16-22)].*

గోపికలు అడిగిన ధార్మికమైన ప్రశ్నలకు (భాగ 10-32-16), శ్రీకృష్ణని సమాధానము [భాగ 10-32 - (17-20)] శ్రీకృష్ణని మధుర సంభాషణ [భాగ 10-32 - (21, 22)]. శ్రీకృష్ణుడు స్త్రీ సంభాషా విశారదుడని తెలుపుతాయి.

## 860. రాసోత్సవమహాసౌఖ్యగోపీసంభోగసాగరః :

రాసక్రీడోత్సవము శ్రీభాగవత దశమస్కంధములో 33వ అధ్యాయములో వర్ణింపబడింది. రాసోత్సవములో శ్రీకృష్ణునితో కూడి గోపికలు తనివితీరని సంతోషానుభవము పొందారు. అది పరిపూర్ణమైన, అక్షయమైన రసము - స్వరూపానందము. ఎంత ఆనందము పొందినా తనవితీరనిది. అవధులు లేని మహాసముద్రము వంటిది, (మహదానాందము). అట్టి ఆనందానుభవము గోపికలకు కలిగించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

**జలస్థలరతివ్యాప్తగోపీదృష్ట్యభిపూజితః ।**
**శాస్త్రానపేక్షకామైకముక్తిద్వారవివర్ధనః ॥ 186**

## 861. జలస్థలరతివ్యాప్తగోపీదృష్ట్యభిపూజితః :

నీటిలోను, భూమిమీద, గోపికలు శ్రీకృష్ణునితో క్రీడించి రమించునపుడు ఆ ఆనందము గోపికల శరీరమంతటను, వారి బుద్ధియందును, సర్వత్ర



వ్యాపించినది. ఆ ఆనంద సమయములో, గోపికలు (వారి నయనకమలము లతో) తమ నమ్రతగలచూపులతో, శ్రీకృష్ణునికి కృతజ్ఞత తెలుపుతూ పూజించారు. ఇట్టి శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"సోఽ ంభస్యలం యువతిభిః పరిషిచ్య మానః....."* *(భాగ 10-33-24).*

## 862. శాస్త్రానపేక్షకామైకముక్తిద్వారవివర్ధనః :

1. శాస్త్రమనగా ఇక్కడ మర్యాద. మర్యాదలనతిక్రమించి, శ్రీకృష్ణుని యందు మాత్రమే అలౌకికకామము (శ్రీకృష్ణుడు తప్ప వేరేమీ అక్కరలేదు అనే కోరిక) కలిగిన గోపికలకు శాస్త్రానుసారము సాధనచేసే భక్తులకన్న సులభముగా సంసారకోరికలనుండి విముక్తి కలిగింది. ఆ అలౌకికకామము వారిలో వృద్ధిపొందించి వారికి ముక్తిద్వారము చక్కగా తెరిచి, వారి ప్రేమ భక్తివృద్ధిచేసి తన సాన్నిధ్యము ప్రసాదించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

2. ఏ శాస్త్రాధారసాధనలేకుండా, గోపికలు "శ్రీకృష్ణ సాన్నిధ్యము పొందుట మాత్రమే" అనే కోరిక కలిగి ఉండిరి. స్వరూపమాత్రనిష్ఠగల భక్తులై రాసోత్సవమునందు వారు శ్రీకృష్ణుని సాన్నిధ్యము పొందుట శాస్త్రానపేక్షకామై కముక్తి. గోపికలకు ఇట్టి ముక్తి ఉపాయము విశేషముగా ప్రసాదించిన శ్రీకృష్ణ భగవానుడు అని ఈ నామార్థము.

*"విక్రీడితం వ్రజవధూభిరిదం చ విష్ణోః..."* *(భాగ 10-33-40).*

**సుదర్శనమహాసర్పగ్రస్తనందవిమోచకః ।**
**గీతమోహితగోపీధృక్శంఖచూడవినాశకః ॥ 187**

## 863. సుదర్శనమహాసర్పగ్రస్తనందవిమోచకః :

శాపవశమున మహాసర్పమైన సుదర్శనుడనే విద్యాధరుడు సరస్వతీ నదీ తీరములో నందుని పట్టుకున్నాడు. ఆ పట్టునుంచి నందుని విడిపించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"కశ్చిన్మహానహిస్తస్మిన్ విపినే ఽతిబుభుక్షితః...." నుంచి "....కథం జుగుప్సితామేతాం గతిం వా ప్రాపితోఽ వశః" వరకు. [భాగ 11-34 - (5-11)].*

**864. గీతమోహితగోపీధృక్శంఖచూడవినాశకః :**

శ్రీకృష్ణుని గీతములు (గానము) వింటూ, ఆ గీతములచేత మోహింపబడి మూర్ఛితులై నిస్తేజసులైన గోపికలను తన ప్రగల్భశక్తిచే పట్టుకొని కట్టివేసి, తీసుకుపోతున్న శంఖచూడుని వధించిన శ్రీకృష్ణుడు అని ఈ నామార్థము.

*"గోప్యస్తద్గీతమాకర్ణ్య మూర్ఛితా నావిదన్ నృప" నుంచి ".... అగ్రజాయాదదాత్ ప్రీత్యా పశ్యన్తీనాం చ యోషితామ్" వరకు [భాగ 10-34 - (24-32)].*

**గుణసంగీతసంతుష్టిర్గోపీసంసారవిస్మృతిః ।**
**అరిష్టమథనో దైత్యబుద్ధివ్యామోహకారకః ॥ 188**

**865. గుణసంగీతసంతుష్టిః :**

శ్రీకృష్ణుడు గోచారము చేయుటకు పగటిపూట వనమునకు వెళ్ళగా, ఇంటిదగ్గర భక్తులైన గోపికలు శ్రీకృష్ణుని చింతనతో, అతని గుణములు లెస్సగాగల కీర్తనలు, పాటలు పాడుకుంటూ, తమ అంతఃకరణములో ఎంతో తృప్తి పొందేవారు. వారి హృదయాంతరస్థితుడైన శ్రీకృష్ణభగవానుడు ఆ పాటలు విని శారీరకముగా వారికి దగ్గరగా లేకపోయినా వారికి ఎంతో సంతోషము తృప్తి కలిగించేవాడు. ఇట్టి గుణసంగీతసంతుష్టి కలిగించిన శ్రీకృష్ణుడు.

*"వామబాహుకృత వామకపోలో వల్గితభ్రురధరార్పిత వేణుమ్" నుంచి "....మోచయన్ వ్రజగవాం దినతాపమ్" (భాగ 10-35 - (2-25).*

**866. గోపీసంసారవిస్మృతిః :**

జీవుల మనస్సులు ప్రపంచవిషయములపై ఆసక్తికలిగి ఉంటాయి. అవి వారిని తమ వెంట చక్కగా తీసుకుపోతాయి. (సమ్యక్ సరణం సంసారం – చక్కగా తీసుకుపోయే సంసారవిషయాలు). గోపికలకు సంబంధించినంత వరకు



శ్రీకృష్ణునిలీలా కథలు, శ్రీకృష్ణునిస్మృతులు, మాత్రమే వారి ప్రపంచ విషయములు. శ్రీకృష్ణుడు దూరముగా వనములో సంచరించుచు అచ్చట ఆతడు చేయు లీలలు (కార్యములు) వారికి స్ఫురించి వారు ఆ కృష్ణుని లీలలు వర్ణించుకుంటూ ఉండే వారు. ఆ స్థితిలో వారి హృదయములలో శ్రీకృష్ణుడు తప్ప వేరేమీ ఉండకపోవుటచే వారు సాధారణ సంసారిక విషయములు పూర్తిగా మరచి శ్రీకృష్ణుని మాత్రమే మనసారా అర్చించే వారు. ఈ విధమైన మనోస్థితి గోపికలకు కలిగించి, ఎల్లప్పుడు వారి హృదయములలో నుండి, వారు సంసారమును పూర్తిగా మరిచిపోయినట్లు చేసిన శ్రీకృష్ణ భగవానుడు, గోపీసంసారవిస్మృతిరూపుడు.

**867. అరిష్టమథనః :**

అరిష్టుడనే రాక్షసుని చంపిన శ్రీకృష్ణుడు.

*"అథ తర్హ్యాగతో గోష్ఠమరిష్టో వృషభాసురః...." నుంచి "... పుష్పైః కిరన్తో హరిమీడిరే సురాః" వరకు [భాగ 10-36 - (1-14)].*

**868. దైత్యబుద్ధివ్యామోహకారకః :**

నారదుడు చెప్పిన మాటలు (బలరామకృష్ణుల జన్మవృత్తాంతము) విని కంసుని బుద్ధి మోహావేశముతో కూడుకొని (వసుదేవుడు తనకు అపరాధము చేసేడని) దేవకీ వసుదేవులను బంధించి బాధించాడు. ఈ విధముగా కంసునిలో వ్యామోహము కలిగించి, వసుదేవునికి అపరాధము తలపెట్టినట్లు చేసిన భగవానుడు.

*"....కంసాయాథాహ భగవాన్ నారదో దేవదర్శనః" నుంచి "....విశసన్తు పశూన్ మేధ్యాన్ భూతరాజాయమీఢుషే" వరకు [భాగ 10-36 - (16-26)].*

**కేశీఘాతీ నారదేష్టో వ్యోమాసురవినాశకః ।**
**అక్రూరభక్తిసంరాద్ధపాదరేణుమహానిధిః ॥ 189**

**869. కేశీఘాతీ :**

కేశి అనే రాక్షసుని చంపిన శ్రీకృష్ణుడు.

*"...ప్రతియాతే తు దేవర్షౌ కంస ఆభాష్య కేశినం" (భాగ 10-36-20).*

**870. నారదేష్టః :**

1. నారదునికి లోక కళ్యాణము ఇష్టము. లోకకళ్యాణార్థము కంసాదుల వధ జరుగుటకు కారణభూతుడైన భగవానుడు.

2. నారదుని ఇష్టదేవత అయిన శ్రీకృష్ణుడు, "నారదేష్టః". నారదుడు చేసిన శ్రీకృష్ణుని స్తుతిలో గల అంశములు నారదునకు ఇష్టము.

*దేవర్షిరుప సంగమ్య భాగవతప్రవరో నృప.." నుంచి "...స్తూయమానః సురైర్గోపైః ప్రవివేశ స్వగోకులమ్" వరకు [భాగం 10-37 - (10-34)].*

**871. వ్యోమాసురవినాశకః :**

గోపాలవేషములో నున్న మాయావి, మయపుత్రుడు అయిన వ్యోమా సురుని చంపిన శ్రీకృష్ణుడు.

*"మయపుత్రో మహామాయో వ్యోమో గోపాల వేషధృక్....." నుంచి ".... పశ్యతాం దివి దేవానాం పశుమారమమారయత్" వరకు [భాగ 10-37 - (29-33)].*

**872. అక్రూరభక్తిసంరాద్ధపాదరేణుమహానిధిః :**

భక్తితో శ్రీకృష్ణుని ఆరాధించే అక్రూరునకు శ్రీకృష్ణుని పాదధూళియే మహానిధి. అది అక్షయమగు కోశము వంటిది అని తెలుసుకొనుట చేత శ్రీకృష్ణుని లీలలు తన హృదయములో చక్కగా చూచాడు. ఎవరి పాదరేణువులు మహానిధి అని భక్తితో అక్రూరుడు ఆరాధించాడో ఆ శ్రీకృష్ణుడని ఈ నామార్థము.

*"గచ్ఛన్ పథి మహాభాగో భగవత్యంబుజేక్షణే...." నుంచి ".... పరిరేభేఽభ్యుపాకృష్య ప్రీతః ప్రణతవత్సలః" [భాగ 10-38 - (2-36)].*



**రథావరోహశుద్ధాత్మా గోపీమానసహారకః ।**
**హృదసందర్శితాశేషవైకుంఠాక్రూరసంస్తుతః ॥ 190**

**873. రథావరోహశుద్ధాత్మా :**

మథురానగరము వెళ్ళే సమయములో నిర్మల చిత్తముతో రథము నెక్కిన శ్రీకృష్ణుడు. గోపికలు తమ హృదయములో ఎంతో ఆవేదన కలిగి రాబోవు శ్రీకృష్ణవిరహమును ఊహించి దుఃఖిస్తూ ఉంటే స్వయముగా తాను కూడా అదేవిధముగా బాధపడుతూ ధైర్యభావము తెచ్చుకొని శుద్ధాత్ముడై (నిర్మల చిత్తము కలవాడై) రథమునెక్కిన శ్రీకృష్ణుడు రథావరోహశుద్ధాత్ముడు. గోపికలకు ప్రేమపూర్వకముగా తాను త్వరగా తిరిగి వస్తానని కబురు చేసి వారికి ఓదార్పుకలిగించిన శ్రీకృష్ణుడు.

*"తాస్తథా తప్యతీర్వీక్ష్య స్వప్రస్థానే యదూత్తమః..." నుంచి "....విశోకా అహనీ నిన్యుర్గాయన్త్యః ప్రియచేష్టితం" వరకు [భాగ 10-39 - (35-37)].*

**874. గోపీమానసహారకః :**

1. మథురానగరము వెళ్ళే శ్రీకృష్ణుని చూస్తూ దుఃఖిస్తూ ఉన్న గోపికల మనస్సులలో శ్రీకృష్ణుడు తప్ప వేరే ఏ విషయము లేదు. ఈ విధముగా గోపికల మనస్సులు దోచుకున్న శ్రీకృష్ణుడు గోపీమానసహారకుడు.

*"...అను ప్రస్థాపితాత్మానో...." నుంచి ".... విశోకా అహనీ నిన్యుర్గాయన్త్యః ప్రియ చేష్టితం" వరకు [భాగ 10-39 - (36-37)].*

**875. హృదసందర్శితాశేషవైకుంఠాక్రూరసంస్తుతః :**

1. బ్రహ్మహ్రదములో స్నానము చేయుటకై నీటిలో మునగగా అక్రూరునకు అతని హృదయములో సమస్త వైకుంఠము దర్శింపజేసిన భగవానుడు. మొదట తాను స్తుతించిన శ్రీకృష్ణుడే విష్ణుభగవానుడని తెలుసుకొని తిరిగి అక్రూరుడు

శ్రీకృష్ణుని స్తుతించాడు. ఎవరి దయచే అక్రూరుడు అశేషమైన వైకుంఠము దర్శించాడో ఆ శ్రీకృష్ణభగవానుడు, హృదసందర్శితాశేషవైకుంఠాక్రూరసంస్తుతుడు.

2. స్నానము చేయునపుడు శ్రీకృష్ణ బలరాములు వైకుంఠమందలి విష్ణువు అంశగా అక్రూరునికి కనిపించారు.

*"నిమజ్జ్య తస్మిన్సలిలే జపన్ బ్రహ్మ సనాతనం.." (భాగ 10-39-41) నుంచి "...హృషీకేశ నమస్తుభ్యం ప్రపన్నం పాహి మాం ప్రభో వరకు. [భాగ 10-40-1-30]*

**మథురాగమనోత్సాహో మథురాభాగ్యభాజనమ్ ।**
**మథురానగరీశోభాదర్శనోత్సుకమానసః ॥ 191**

### 876. మథురాగమనోత్సాహః :

1. మథురానగరము వెళ్ళి అచ్చటి కార్యములు చేయుట యందు ఎంతో ఉత్సాహము ప్రదర్శిస్తున్న శ్రీకృష్ణుడు.

2. మథురానగరమునకు శ్రీకృష్ణ బలరాములతో ప్రయాణము చేయునపుడు, అక్కడ జరగబోయే శ్రీకృష్ణలీలలు దర్శించడానికి అక్రూరుని మనస్సులో ఎంతో ఉత్సాహము కలిగించిన శ్రీకృష్ణుడు.

*"ఇత్యుక్త్వా చోదయా మాస స్యందనం గాందినీసుతః..." నుంచి "... వయం త్విహావముచ్యాథ తతో ద్రక్ష్యామహే పురీమ్" వరకు [భాగ 10-41- (6-10)].*

### 877. మథురాభాగ్యభాజనం :

భాజనమనగా ఆధారము, పాత్ర, పాత్రుడు, యోగ్యుడు. మథురా నగరములోగల సకలభాగ్యములు సంపత్తులు స్వీకరింప ఉత్తమస్థానభూతుడైన (అర్హుడైన) శ్రీకృష్ణుడు.

### 878. మథురానగరీశోభాదర్శనోత్సుకమానసః :

1. సర్వలక్షణసంపన్నమైన, శోభాయమానమైన, మథురానగరము చూడడానికి మనస్సుఉవ్విళ్ళూరుతూ ఉత్సాహపడుచున్న రామకృష్ణులు.



2. మథురానగరమందలి పుణ్యాత్ములకు భగవద్దర్శనము కలుగ చేయుటకు ఉత్సాహము చూపే శ్రీకృష్ణుడు.

*"అథాపరాహ్నే భగవాన్ కృష్ణః సంకర్షణాన్వితః మథురాం ప్రావిశద్" నుంచి "....యా హ్యేతావనుపశ్యన్తి నరలోకమహోత్సవౌ" వరకు [భాగ 10-41 - (19-31)].*

**దుష్టరంజకఘాతీ చ వాయకార్చితవిగ్రహః ।**
**వస్త్రమాలాసుశోభాంగః కుబ్జాలేపనభూషితః ॥ 192**

### 879. దుష్టరంజకఘాతీ (చ) :

1. దుష్టులకు (కంసాదులకు) ప్రీతితో వస్త్రములిచ్చి రంజింపజేసే రంగకారుడు శ్రీకృష్ణునికి వస్త్రములు ఇవ్వడానికి నిరాకరించాడు. ఆరంగకారుని చంపిన శ్రీకృష్ణుడు.

2. దుష్టులను రంజింపజేసే గుణము కలవారిని నశింపజేసే భగవానుడు.

*"ఏవం వికత్థమానస్య కుపితో దేవకీసుతః" నుంచి "...శేషాణ్యాదత్త గోపేభ్యో విసృజ్య భువి కానిచిత్" [భాగ 10-41 - (37-39)].*

### 880. వాయకార్చితవిగ్రహః :

బట్టలునేసే వాయకునిచే పూజింపబడి అతడిచ్చిన క్రొత్తవస్త్రములు ధరించిన శ్రీకృష్ణబలరాములు.

*"తతస్తు వాయకః ప్రీతస్తయోర్వేషమకల్పయత్..." నుంచి "... శ్రియంచ పరమాం లోకే బలైశ్వర్యస్మృతీన్ద్రియమ్" వరకు [భాగ 10-41 - (40-42)].*

### 881. వస్త్రమాలాసుశోభాంగః :

1. వాయకుడిచ్చిన చక్కటి వస్త్రములు కట్టుకొని వానిపై సుదాముడు కట్టిన పూలమాలలు ధరించి ఎంతో అందమైన శ్యామల- గౌరశరీరాంగములతో శోభించే బలరామకృష్ణులు. (వస్త్రములపై వేసుకున్న మాలా-వస్త్రమాలా లేక వస్త్రముల చేత మాలలచేత శోభించే బలరామకృష్ణులు అని అర్థము.)

*"తతః సుదామ్నో భవనం మాలాకారస్య జగ్మతుః....." నుంచి "...... పుంసోఽ త్యనుగ్రహో హ్యేష భవద్భిర్యన్నియుజ్యతే" వరకు [భాగ 10-41 - (43-48)].*

**882. కుబ్జాలేపనభూషితః :**

కుబ్జ సుగంధద్రవ్యములతో చేసిన లేపనములు ఇవ్వగా అలంకరించు కొని శోభించుచున్న రామకృష్ణులు.

**కుబ్జాసురూపకర్తా చ కుబ్జారతివరప్రదః ।**
**ప్రసాదరూపసంతుష్టహరకోదండఖండనః ॥ 193**

**883. కుబ్జాసురూపకర్తా (చ) :**

మూడు (చోట్ల) వంకరలు తిరిగి వికృతరూపము గల కుబ్జాశరీరము యొక్క వంకరలు తీర్చి చక్కటి రూపము కలిగించిన శ్రీకృష్ణుడు.

*"ప్రసన్నో భగవాన్ కుబ్జాం త్రివక్రాం రుచిరాననామ్" నుంచి "... ముకుంద స్పర్శనాత్ సద్యో బభూవ ప్రమదోత్తమా" వరకు [భాగ 10-42 - (6-8)].*

**884. కుబ్జారతివరప్రదః :**

కుబ్జ శ్రీకృష్ణునితో రమించుటకు కోరుకొనగా ఆవరము ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

*"ఏష్యామి తే గృహం సుభ్రూః పుంసామాధివికర్శనమ్.." [భాగ 10-42-12].*

**885. ప్రసాదరూపసంతుష్టహరకోదండఖండనః :**

ప్రసాదరూపమున పొందబడి, కంసునికి సంతోషము కలిగించే శివధనుస్సు యజ్ఞస్థానములో ఉంచబడింది. దానిని (ఖండించిన) ముక్కలు చేసిన శ్రీకృష్ణుడు.

**శకలాహతకంసాప్తధనూరక్షకసైనికః ।**
**జాగ్రత్స్వప్నభయవ్యాప్తమృత్యులక్షణబోధకః ॥ 194**



**886. శకలాహతకంసాప్తధనూరక్షకసైనికః :**

శ్రీకృష్ణుడు శివధనుస్సు ముక్కలు చేయగా ఆ ధనుస్సును రక్షిస్తున్న కంసుని ఆప్తులు, గొప్పసైనికులు, అయినవారు, రామకృష్ణులను పట్టుకొనుటకు చుట్టుముట్టిరి. అప్పుడు ఆ విరిగిన ధనుస్సు ముక్కలతో ఆ సైనికులను కొట్టి సంహరించిన రామకృష్ణులు.

*"అథ తాన్ దురభిప్రాయాన్ విలోక్య బలకేశవౌ..." నుంచి ".... నిష్క్రమ్యచేరతుర్హృష్టౌ నిరీక్ష్య పురసంపదః" వరకు [భాగ 10-42 - (20-21)].*

**887. జాగ్రత్స్వప్నభయవ్యాప్తమృత్యులక్షణబోధకః :**

జాగ్రదవస్థలోనే కాక స్వప్నావస్థలో కూడా (సుషుప్తావస్థ కలుగుటకు అవకాశమే లేదు) భయముతో తనకు మృత్యువు తప్పదని తెలిపే లక్షణములు కంసునిలో ప్రేరణచేసిన శ్రీకృష్ణభగవానుడు.

*"దీర్ఘ ప్రజాగరో భీతో దుర్నిమిత్తాని దుర్మతిః......" నుంచి "..... పశ్యన్ మరణ సంత్రస్తో నిద్రాం లేభే న చింతయా" వరకు [భాగ 10-42 - (27-31)].*

**మథురామల్ల ఓజస్వీ మల్లయుద్ధవిశారదః ।**
**సద్యః కువలయాపీడఘాతీ చాణూరమర్దనః ॥ 195**

**888. మథురామల్లః :**

మథురానగరములో తనకన్న గొప్ప మల్లులు లేరని స్వేచ్ఛగా తిరిగే శ్రీకృష్ణుడు.

**889. ఓజస్వీ :**

ఓజస్ అనగా ఉత్సాహము; ఓజస్సు కలవాడు ఓజస్వీ. ఏ భగవానుని యందు ఉత్సాహము, విశేషమైన ప్రయత్నము కలవో ఆ శ్రీకృష్ణుడు.

**890. మల్లయుద్ధవిశారదః :**

మల్లయుద్ధమంటే ప్రత్యేక ఆయుధములు లేకుండా ఒకరితో ఒకరు

ఎదురుగా కుస్తీపట్లు, ముష్టియుద్ధము కలిపి చేసేది. అట్టి మల్లయుధములో నున్న నేర్పులు, మెలుకువలు తెలిసిన మల్లయుద్ధవిశారదుడు శ్రీకృష్ణుడు.

**891. సద్యః కువలయాపీడఘాతీ :**

రంగభూమిని చూడడానికి వెళుతున్న బలరామకృష్ణులపై విడిచిపెట్టిన కువలయాపీడమనే మదపుటేనుగును అక్కడకక్కడే సంహరించిన శ్రీకృష్ణుడు.

*"....రంగద్వారం సమాసాద్య తస్మిన్నాగమవస్థితం" నుంచి "దన్తముత్పాట్య తేనేభం హస్తిపాంశ్చాహనద్ధరిః" వరకు [భాగ 10-43 - (2-14)].*

**892. చాణూరమర్దనః :**

చాణూరుడనే మల్లుని మర్దించి వధించిన శ్రీకృష్ణుడు.

*"... ఆససాదాథ చాణూరం ముష్టికం రోహిణీ సుతః" నుంచి ".... విస్రస్తాకల్పకేశస్రగింద్రధ్వజ ఇవాపతత్" వరకు [భాగ 10-44 - (1-23)].*

**లీలాహతమహామల్లః శలతోశలఘాతకః ।**
**కంసాంతకో జితామిత్రో వసుదేవవిమోచకః ॥ 196**

**893. లీలాహతమహామల్లః :**

అవలీలగా, అనాయాసముగా మల్లులలో శ్రేష్టుడైన ముష్టికుని చంపిన బలరాముడు

*"తథైవ ముష్టికః పూర్వం స్వముష్ట్యాభిహతేన వై...." నుంచి ".... వ్యసుః పపాతోర్వ్యుపస్థే వాతాహత ఇవాంఘ్రిపః" వరకు (భాగ 10-44 - 24, 25).*

**894. శలతోశలఘాతకః :**

శలుడు, తోశలుడు అనే మల్లులను చంపిన శ్రీకృష్ణుడు.

*"తర్హ్యేవ హి శలః కృష్ణ పదాపహత శీర్షకః..." నుంచి ".... శేషాః ప్రదుద్రువుర్మల్లాః సర్వే ప్రాణ పరీప్సవః" వరకు (భాగ 10-44-27, 28).*



**895. కంసాంతకః :**

కంసుని చంపిన శ్రీకృష్ణుడు.

*"ప్రగృహ్యా కేశేషు చలత్కిరీటం......నుంచి ...... సర్వజనైర్నరేంద్ర ..... " వరకు. (భాగ 10-44-37,38)*

**896. జితామిత్రః :**

జితా అమిత్రాః శత్రవోయేనేతి జితామిత్రః" శత్రువులను జయించిన శ్రీకృష్ణుడు జితామిత్రుడు. కంసుని వధ జరుగగానే అందరు శత్రువులను జయించినట్లయినదని భావము. అట్టి శ్రీకృష్ణుడు జితామిత్రుడు.

**897. వసుదేవవిమోచకః :**

వి-విశేషముగా, మోచకః విడిచిపెట్టించినవాడు- వసుదేవుని (దేవకీ దేవితో సహా అని తెలుసుకోవాలి) చెరసాలనుండి విడిపించిన శ్రీకృష్ణుడు. "నామైకదేశే నామగ్రహణమితి న్యాయాత్ - వసుర్వసుదేవః దేవో దేవకీ తయోర్విమోచకః" ఇద్దరి గురించి ఒకే పేరుతో చెప్పినపుడు వసుదేవః అనే పదములో వసుః" వసుదేవుడు "దేవః" దేవకీదేవి. వారిద్దరిని విడిపించిన శ్రీకృష్ణుడు అని ఆ ఒకే నామముతో చెప్పబడ్డది.

*"మాతరం పితరం చైవ మోచయిత్వాథబంధనాత్..." (భాగ 10-44-50).*

**జ్ఞాతతత్త్వపితృజ్ఞానమోహనామృతవాఙ్మయః ।**
**ఉగ్రసేనప్రతిష్ఠాతా యాదవాధివినాశకః ॥ 197**

**898. జ్ఞాతతత్త్వపితృజ్ఞానమోహనామృతవాఙ్మయః :**

శ్రీకృష్ణునిలోని భగవత్తత్త్వస్వరూపము వసుదేవునకు తెలిసినదే. అయినా వసుదేవుని యందున్న అట్టి జ్ఞానమును మరుగుపరుచుటకును (కప్పిపుచ్చుటకు) పుత్రస్నేహము వర్ధిల్లజేయుటకును, కృష్ణుడు తల్లిదండ్రులకు నమస్కరిస్తూ

“తల్లిదండ్రులగు మీయిద్దరికి నమస్కారము” మొదలగు అమృత వాక్కులు పలికి వసుదేవుని జ్ఞానమును మోహవశముచే కప్పివేసెను. అట్టి శ్రీకృష్ణుడు.

**899. ఉగ్రసేనప్రతిష్ఠాతా :**

తన తాత అయిన (మాతామహుడైన) ఉగ్రసేనుని మథురా రాజ్య సింహాసనముపై ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడు. మాతామహుడు కావున వృద్ధుడగు ఉగ్రసేనుని మర్యాదాపూర్వకముగా సింహాసనముపై కూర్చొండపెట్టి, రాచ కార్యములను శ్రీకృష్ణుడే చూచేవాడని భావము.

**900. యాదవాధివినాశకః :**

ఉగ్రసేనుని రాజుగా సింహాసనముపై కూర్చొండబెట్టి, కంసునిచే బాధింపబడి అన్ని దిక్కుల పారిపోయిన యాదవులందరి మనోవ్యథ (ఆధి) పోగొట్టిన శ్రీకృష్ణుడు.

*“సర్వాన్ స్వాన్ జ్ఞాతి సంబంధాన్ దిగ్భ్యః కంసభయా కులాన్.. (భాగ 10-45-15).*

**నందాదిసాంత్వనకరో బ్రహ్మచర్యవ్రతే స్థితః ।**
**గురుశుశ్రూషణపరో విద్యాపారమితేశ్వరః ॥ 198**

**901. నందాదిసాంత్వనకరః :**

నందునికి ఆతనితో వచ్చిన గోపులకు సాంత్వనవచనములు చెప్పి మథురానగరమునుంచి వ్రజస్థానమైన వృందావనమునకు తిరిగి పంపించిన శ్రీకృష్ణుడు.

*“అథ నందం సమాసాద్య భగవాన్ దేవకీసుతః...” (భాగ 10-45-20).*

**902. బ్రహ్మచర్యవ్రతేస్థితః :**

1. ఉపనయన సమయమందు గాయత్రీమంత్రదీక్ష తీసుకొని విద్యాభ్యాసము ప్రారంభము చేసినప్పటినుంచి, చదువు పూర్తిఅయ్యేవరకు బ్రహ్మచర్యవ్రతదీక్షను నిష్ఠతో పాటించిన శ్రీకృష్ణుడు.



2. బ్రహ్మచర్యమంటే బ్రహ్మస్వరూపమందు సంచరించుట. ఉపనయన సంస్కారముతో ఆరంభమైన యీ బ్రహ్మచర్యవ్రతము నిష్ఠతోచేసిన శ్రీకృష్ణుడు.

*“తతశ్చలబ్ధసంస్కారౌ ద్విజత్వం ప్రాప్య సువ్రతౌ....” (భాగ 10-45-29).*

**903. గురుశుశ్రూషణపరః :**

గురువైన సాందీపనిఋషియొక్క శుశ్రూషయందు (సేవయందు) తత్పరుడై ఎల్లప్పుడు సావధానముగానున్న శ్రీకృష్ణుడు.

*“యథోపసాద్య తౌ దాన్తౌ గురౌ...” (భాగ 10-45-32).*

**904. విద్యాపారమితేశ్వరః :**

1. చతుర్దశవిద్యలు సంపూర్ణముగా అభ్యసించినవారు, అందు శ్రేష్ఠత్వము సంపాదించినవారు, విద్యాపారమితేశ్వరులు.

2. విద్యలన్నిటిని పూర్తిగా తెలుసుకొని వాటికి స్వామి అయిన శ్రీకృష్ణుడు. పరమేశ్వరునకు అన్ని విద్యలు మితములైనవే.

3. “విద్యాపారం మితం యేనేతి వా విద్యాపారమితః స చాసావీశ్వరశ్చేతి”. అన్ని విద్యలయొక్క పరిమితి ఎవరిచే నిర్ణయింపబడినదో అతడు “విద్యాపార మితః”. ఆ విద్యాపరిమితులకు ప్రభువైన శ్రీకృష్ణుడు అట్టి విద్యాపారమితేశ్వరుడు.

**సాందీపనిమృతాపత్యదాతా కాలాంతకాదిజిత్ ।**
**గోకులాశ్వాసనపరో యశోదానందపోషకః ॥ 199**

**905. సాందీపనిమృతాపత్యదాతా :**

సముద్రములో మునిగిపోయి చనిపోయిన సాందీపని గురువుగారి పుత్రులను తిరిగి తీసుకువచ్చి గురువుగారికి (గురుదక్షిణగా) ఇచ్చిన శ్రీకృష్ణుడు.

*“తమాహ భగవానాశు గురుపుత్రః ప్రదీయతామ్...” (భాగ 10-45-39).*

**906. కాలాంతకాదిజిత్ :**

కాలుడు అంటే మృత్యువు. అన్తకుడంటే యముడు. వీరిని, ఇతర

విఘ్నములను జయించిన శ్రీకృష్ణభగవానుడు, కాలాన్తకాదిజిత్

*"తథేత్యథారుహ్య మహారథౌ రథం..." నుంచి "... లీలా మనుష్య హే విష్ణో యువయోః కరవామ కిమ్" వరకు. [భాగ-10-45-(38-44)].*

## 907. గోకులాశ్వాసనపరః :

శ్రీకృష్ణుని విరహతాప దుఃఖముతో కృంగి కృశించిన వ్రజవాసులందరికి చిత్తసమాధానము కలిగించుటకు ఉద్ధవుని పిలిచి శ్రీకృష్ణుడు అతని ద్వారా సందేశము పంపాడు. (ఆస్వాసనే చిత్తసమాధానకరణే). గోకులములోని సర్వజనులను ఓదార్చి చిత్తసమాధానము కలుగజేయుట యందు తత్పరుడైన శ్రీకృష్ణుడు.

## 908. యశోదానందపోషకః :

ఉద్ధవుని ద్వారా సందేశము పంపి, శ్రీకృష్ణుని కొరకు యశోదానందులు పడే దుఃఖము తగ్గించి, వారిని సంతోషపెట్టిన శ్రీకృష్ణభగవానుడు. ఇట్లు యశోదానందులకు ప్రాణపోషకుడైన శ్రీకృష్ణుడు.

**గోపికావిరహవ్యాజమనోగతిరతిప్రదః ।**
**సమోద్ధవభ్రమరవాక్ గోపికామోహనాశకః ॥ 200**

## 909. గోపికావిరహవ్యాజమనోగతిరతిప్రదః :

శ్రీకృష్ణుడు దగ్గరగా లేకపోవుటవలన గోపికలకు (బాహ్య) విరహ దుఃఖము కలిగినది. కాని ఆ విరహములో, వారి మనస్సులో శ్రీకృష్ణుడు మరియు శ్రీకృష్ణుని మనస్సులో ఆ విరహము అనుభవించే గోపికలు, ఎల్లప్పుడు ఉండుట చేత గోపికలు, శ్రీకృష్ణుడు కూడా మానసికంగా ఒకరితో ఒకరు రమించేవారు. ఈ భావము వారిలో స్థిరముగా ఉండి వారికి బాహ్య విరహదుఃఖము కలుగకుండా చేయాలని శ్రీకృష్ణుడు తన సందేశమును వారికి ఉద్ధవుని ద్వారా పంపేడు. గోపికలు ఆ సందేశము విని, శ్రీకృష్ణుడు తమ మనస్సులో ఎల్లవేళల ఉండి తమతో ఆనందముగా రమించుచున్నట్లు భావించి, శ్రీకృష్ణవిరహదుఃఖము లేకుండా ఉండిరి. ఇట్టి స్థితి గోపికలకు కలిగించిన శ్రీకృష్ణుడు.



## 910. సమోద్ధవభ్రమరవాక్ :

"భగవతా సమః సదృశో యః" ఉద్ధవుడు శ్రీకృష్ణభగవానునితో అన్ని విధములలో (ఆకారము, లక్షణములు, మాట్లాడే తీరు మొదలైన విధములలో) అంతకుమించి భగవంతునితో సమానమగు భక్తుడగుటలోను సామ్యత కలవాడు. అందుచేత ఆతడు సమోద్ధవుడు. 'భ్రమరవాక్' అనగా ఆహ్లాదము కలిగించే తుమ్మెదల ఝుంకారము (గీతము)వలె మాటలాడ గలవాడు. భ్రమరములు పద్మములను చేరినట్లు వ్రజస్థానములోనున్న గోపికలనే పద్మములను ఉద్ధవుడుచేరి, ప్రీతిని కలిగించే రీతిలో, ప్రేమభక్తి పూరితములైన మాటలలో, శ్రీకృష్ణసందేశమును వినిపించాడు. (అందుచేత ఆతని మాటలు భ్రమరవాక్కులని చెప్పబడినది) ఆ సమోద్ధవభ్రమరవాక్కులు గోపికల బాహ్యవిరహము పోగొట్టి వారి మనస్సులను ఆనందింపజేసినవి. ఈ విధముగా గోపికలను ఆహ్లాదింప జేసిన శ్రీకృష్ణుడు.

*"తం వీక్ష్య కృష్ణానుచరం వ్రజస్త్రియః...." నుంచి "...తముత్తమశ్లోక పదాంబుజాశ్రయమ్" వరకు (భాగ 10-47-1,2).*

*'కాచిన్మధుకరం దృష్ట్వా ధ్యాయన్తీ కృష్ణ సంగమమ్..." (భాగ 10-47-11). నుంచి "తతస్తాః కృష్ణసందేశైర్వ్యపేత విరహజ్వరాః..." వరకు (భాగ 10-47-53).*

## 911. గోపికామోహనాశకః :

శ్రీకృష్ణుని, ఆతని లీలలను తప్ప వేరే ఏ సాంసారిక విషయములను గోపికలు తమ హృదయములలో ఉంచుకోలేదు. అన్ని సందర్భములలో శ్రీకృష్ణుడే వారి మనస్సులో ఉండుట వలన వారికి సంసారమోహబంధములు లేవు. ఈ విధముగా శ్రీకృష్ణుడు గోపికల మోహనాశకుడు. ఈ స్థితిని వారిలో చూచిన ఉద్ధవుడు ఆశ్చర్యపడి, గోపికల హృదయములు శ్రీకృష్ణునికి పూర్తిగా అర్పితమైనవని వారిని ప్రశంసించాడు.

*"అహోయూయం స్మ పూర్ణార్థా భవత్యో లోకపూజితాః......." నుంచి "...... యమాదాయాగతో భద్రా అహం భర్తూరహస్కరః" వరకు [భాగ 10-47 - (23-28)].*

**కుబ్జారతిప్రదోఽక్రూరపవిత్రీకృతభూగృహః ।**
**పృథాదుఃఖప్రణేతా చ పాండవానాం సుఖప్రదః ॥ 201**

## 912. కుబ్జారతిప్రదః :

శ్రీకృష్ణునికి సుగంధలేపనము చేసిన కుబ్జకు మంచి రూపము ప్రసాదించిన శ్రీకృష్ణుడు, ఆమె కోరికపై ఆమెకు రతిని వరము రూపములో ప్రసాదించాడు. (884వ నామము) ఈ వరము ఇచ్చి ఆమె కోరిన రతిని ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

*"అథ విజ్ఞాయ భగవాన్ సర్వాత్మా సర్వదర్శనః.." నుంచి "..... యోవృణీతేమనోగ్రాహ్యమసత్త్వాత్ కుమనీష్యసౌ" వరకు [భాగ 10-48-(1-11)].*

## 913. అక్రూరపవిత్రీకృతభూగృహః :

1. మథురానగరము రాగానే అక్రూరుడు శ్రీకృష్ణుని తన ఇంటికి రమ్మని ప్రార్థించాడు. ఆ ప్రార్థన గుర్తుపెట్టుకొని శ్రీకృష్ణుడు అక్రూరుని ఇంటికి వెళ్ళి ఆ భూమిని, గృహమును పవిత్రము చేసాడు.

2. 'గృహః'కు బదులు "గ్రహః" అన్న పాఠము ఉన్నది. ఆ సందర్భములో భూః అంటే గృహము క్రిందనున్న భూమి ప్రదేశము. ఆ భూమిని, దానిపైనున్న గ్రహములనుండి, పవిత్రముచేసిన శ్రీకృష్ణుడని అర్థము.

## 914. పృథాదుఃఖప్రణేతా (చ) :

కౌరవులు భీమునికి విషము పెట్టారు పాండవులున్న లక్క ఇల్లు కాల్చారు. ఇంకా ఎన్నో కుయుక్తులతో పాండవులను చంప ప్రయత్నించారు. కుంతీదేవి పాండవులు, యీ బాధలు అనుభవిస్తూ ఎంతో దుఃఖించేవారు. ఇది తెలిసి



శ్రీకృష్ణుడు అక్రూరునిద్వారా ధృతరాష్ట్రునికి హితము బోధిస్తూ సందేశము పంపాడు. దీని వలన కుంతీదేవికి ఊరట కలిగింది. ఇట్లు కుంతీదేవి దుఃఖము ఉపశమింప జేసిన శ్రీకృష్ణుడు.

*"స భవాన్ సుహృదాం వై నః శ్రేయాంచ్ఛ్రేయశ్చికీర్షయా...." నుంచి "... విజ్ఞాయ తద్ విధాస్యామో యథా శం సుహృదాం భవేత్" వరకు [భాగ 10-48 - (32-35)].*

## 915. పాండవానాం సుఖప్రదః :

శ్రీకృష్ణుడు అక్రూరుని ద్వారా ధృతరాష్ట్రునికి హితము బోధిస్తూ పంపిన సందేశము వలన పాండవులు ఊరటచెంది సుఖము పొందారు. ఇట్లు చేసిన శ్రీకృష్ణభగవానుడు

*ఇంతవరకు దశమస్కంధ (పూర్వార్ధ) నామములు.*

## శ్రీమద్భాగవత దశమస్కంధ(ఉత్తరార్ధ) నామములు

*నిరోధలీలా నామములు (916-1016)*

*శ్లోక సంఖ్య (202-235)*

**జరాసంధసమానీతసైన్యఘాతీ విచారకః ।**
**యవనవ్యాప్తమథురాజనదత్తకుశస్థలిః ॥ 202**

### 916. జరాసంధసమానీతసైన్యఘాతీ :

మగధరాజు జరాసంధుడు ఇరవైమూడు అక్షౌహిణీల సైన్యము (ఒక అక్షౌహిణీ సైన్యములో 21,870 రథములు, 21,870 ఏనుగులు, 65,610 గుఱ్ఱములు, 1,09,350 పాదచారసైనికులు ఉంటారు) సమకూర్చుకొని పదిహేడుసార్లు మథురపై దండెత్తేడు. ఈ సైన్యమునంతటినీ అంతము చేసిన శ్రీకృష్ణుడు.

*"అస్తిః ప్రాప్తిశ్చ కంసస్య మహిష్యౌ భరతర్షభ....." నుంచి "... యదురాజాయ తత్ సర్వమాహృతం ప్రాదిశత్ ప్రభుః" వరకు [భాగ 10-50 - (1-41)].*

### 917. విచారకః :

పద్దెనిమిదవసారి జరాసంధుడు మథురపై దండెత్తి వస్తున్నాడని తెలిసి బలరామాదులతో పరిస్థితి విచారించి, మథుర వాసులనందరిని కుశస్థలికి పంప నిశ్చయించిన శ్రీకృష్ణుడు.

*"తం దృష్ట్వా చింతయత్ కృష్ణః సంకర్షణ సహాయవాన్" (భాగ 10-50-46).*

### 918. యవనవ్యాప్తమథురాజనదత్తకుశస్థలిః :

మూడుకోట్ల సైనికులతో యవనుడు మథురానగరము చుట్టుముట్టునని తెలుసుకొని, నగరములోనున్న ప్రజల క్షేమము ఆలోచించి వారిని కుశస్థలికి పంపిన శ్రీకృష్ణుడు.



**ద్వారకాద్భుతనిర్మాణవిస్మాపితసురాసురః ।**
**మనుష్యమాత్రభోగార్థభూమ్యానీతేంద్రవైభవః ॥ 203**

### 919. ద్వారకాద్భుతనిర్మాణవిస్మాపితసురాసురః :

సురులు అసురులు ఆశ్చర్యపడునట్లు అద్భుతముగా ద్వారకానగర నిర్మాణము చేయించిన శ్రీకృష్ణుడు.

*"ఇతి సమ్మన్త్ర్య భగవాన్ దుర్గం ద్వాదశయోజనమ్..." నుంచి "... సర్వం ప్రత్యర్పయామాసుర్హరౌ భూమిగతేనృప" వరకు [భాగ 10-50 - (50-57)].*

### 920. మనుష్యమాత్రభోగార్థభూమ్యానీతేంద్రవైభవః :

సామాన్య మనుష్యులు భూమిమీద స్వర్గ సుఖములు, ఇంద్రవైభవములు అనుభవించడానికి వీలుగా వాటన్నిటినీ ద్వారకానగరములో కలుగజేసిన శ్రీకృష్ణుడు.

**యవనవ్యాప్తమథురానిర్గమానందవిగ్రహః ।**
**ముచుకుందమహాబోధయవనప్రాణదర్పహా ॥ 204**

### 921. యవనవ్యాప్తమథురానిర్గమానందవిగ్రహః :

యవనుడు మథురానగరము ఆక్రమించగా, ఆయుధములు ధరించ కుండా, మథురానగరము బయటికి వచ్చి, ఆనందపూర్వకముగా సచ్చిదానంద విగ్రహుడై శ్రీకృష్ణుడు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

*"..... నిర్జగామ పురద్వారాత్ పద్మమాలీ నిరాయుధః" (భాగ 10-50-58).*

### 922. ముచుకుందమహాబోధయవనప్రాణదర్పహా :

మాంధాత పుత్రుడైన ముచుకుందుడు బహుకాలనిద్రలో ఉన్నాడు. ఆ నిద్ర భంగము చేస్తే, అతడు (ముచుకుందుడు) కళ్ళువిప్పి చూడగా అతనికి ఎదురుగా ఉన్నవారు మండిపోతారు. ఈ జ్ఞానముకల శ్రీకృష్ణుడు ఆ విధముగా యవనుని వధించి తర్వాత జరాసంధుని గర్వము కూడా అణచివేసాడు.

*"స ఉత్థాయ చిరంసుప్తః....." నుంచి "దేహజానాగ్నినా దగ్ధోభస్మసా భవత్ క్షణాత్"*

*(భాగ 10-51-11, 12)*

**ముచుకుందస్తుతాశేషగుణకర్మమహోదయః ।**
**ఫలప్రదానసంతుష్టిర్జన్మాంతరితమోక్షదః ॥ 205**

## 923. ముచుకుందస్తుతాశేషగుణకర్మమహోదయః :

శ్రీకృష్ణుని అశేషగుణసంపత్తులను, మహాశ్చర్యకరమైన కర్మల ఆధిక్యతను, ముచుకుందుడు చక్కగా స్తుతించాడు. ముచుకుందునిచే వర్ణింపబడిన గుణకర్మల ఆధిక్యతగల శ్రీకృష్ణుడు.

*"విమోహితోఽయం జన ఈశ మాయయా..." నుంచి ".... పరాత్మన్న భయమృతమశోకం పాహి మాఽఽపన్నమీశ" [భాగ 10-51- (46-58)].*

## 924. ఫలప్రదానసంతుష్టిః :

"భక్తిరూపఫలప్రదానేన ముచుకుందస్య సమీచీనా తుష్టిర్యస్మాదితి" ముచుకుందునికి భక్తి అనే ఫలప్రదానము చేసి యథార్థమైన సంతృప్తి కలుగజేసిన శ్రీకృష్ణుడు.

"విచరస్వ మహీం కామం మయ్యావేశితమానసః అస్త్వేవ నిత్య దా తుభ్యం భక్తిర్మయ్యనపాయినీ (భాగ 10-51-62).

## 925. జన్మాంతరితమోక్షదః :

ముచుకుందుడు తిరిగి వచ్చే జన్మలో బ్రాహ్మణునిగా పుట్టి, భక్తి ఫలరూపమైన మోక్షము పొందునట్లు వరము ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

*"జన్మన్యనంతరే రాజన్ సర్వభూతసుహృత్తమః...." (భాగ 10-51-64).*

**శివబ్రాహ్మణవాక్యాప్తజయభీతివిభావనః ।**
**ప్రవర్షణప్రార్థితాగ్నిదానపుణ్యమహోత్సవః ॥ 206**



## 926. శివబ్రాహ్మణవాక్యాప్తజయభీతివిభావనః :

రుద్రుడు, బ్రాహ్మణులు జరాసంధునికి జయము కలుగుతుందని చెప్పగా అతడు పద్దెనిమిదో పర్యాయము యుద్ధభూమికి వచ్చాడు. వారి మాటలు నిజమయ్యాయని, తన గొప్పసైన్యము చూచి భయపడి, మానవ సహజమైన భీతితో బలరామకృష్ణులు పారిపోతున్నారని జరాసంధుడు నమ్మేటట్లు చేసి, శ్రీకృష్ణబలరాములు కలిసి ప్రవర్షణపర్వతము పై నున్న అడవిలోనికి పారి పోయారు. ఇట్లు యుద్ధము చేయకుండా పారిపోయిన శ్రీకృష్ణుని "రణఛోడ్' అని పిలుస్తారు.

*"...... మనుష్యచేష్టామాపన్నౌ రాజన్ దుద్రువతుర్ద్రుతమ్" (భాగ 10-52-7).*

## 927. ప్రవర్షణప్రార్థితాగ్నిదానపుణ్యమహోత్సవః :

పరుగెత్తుతూపోయి, బలరామకృష్ణులు ప్రవర్షణపర్వతముపై కెక్కినపుడు జరాసంధుడు చెట్లతో (ఇంధనముతో) నిండిన ఆ కొండకు నాలుగు మూలల అగ్నిపెట్టాడు. బలరామకృష్ణులు బహునేర్పుతో, ఎవ్వరూ చూడకుండా, ఆ పర్వతము చుట్టూ ఉన్న జరాసంధుని సైన్యమును దాటుకొంటూ బయటకి వచ్చి, ద్వారకానగరము చేరారు. బలరామకృష్ణులు ఆ మంటలలో కాలిపోయారని జరాసంధుడు తలచాడు. ఇట్టి ఊహించ వీలులేని లీలలు చేసి జరాసంధుని మాయలో ముంచిన శ్రీకృష్ణుడు పుణ్యమహోత్సవుడు.

*"సోఽపిదగ్ధావితిమృషా మన్వానో బలకేశవౌ..." (భాగ 10-52-14).*

**రుక్మిణీరమణః కామపితా ప్రద్యుమ్నభావనః ।**
**స్యమన్తకమణివ్యాజప్రాప్తజాంబవతీపతిః ॥ 207**

## 928. రుక్మిణీరమణః :

1. రుచించేది, ఇష్టపడేది, అయిన బంగారము "రుక్మ". అట్టి వర్ణము కలది రుక్మిణీదేవి. రమణః = భర్త; రంజింపజేసేవాడు. రుక్మిణీ రమణుడు, శ్రీకృష్ణుడు.

2. రుక్మిణీదేవితో రమించే శ్రీకృష్ణభగవానుడు రుక్మిణీరమణుడు.

3. రుక్మిణీ లక్ష్మీరూపము, శ్రీకృష్ణుడు విష్ణురూపము. అందుచే రుక్మిణీ రమణుడు శ్రీకృష్ణుడు.

*"రాజాఽఽసీద్ భీష్మకో నామ విదర్భాధిపతిర్మహాన్..." (భాగ 10-52-21) నుంచి 53వ అధ్యాయం చివరి వరకు.*

**929. కామపితా :**

హరునిచే దగ్ధమైన కాముడు శ్రీకృష్ణునికి రుక్మిణీదేవికి ప్రద్యుమ్నుడనే పేరుతో కొడుకై పుట్టాడు. అందుచేత శ్రీకృష్ణుడు కామపితా. పద్యుమ్నుడు వాసుదేవుని అంశ కలవాడు.

*"కామస్తు వాసుదేవాంశో దగ్ధః ప్రాగ్ రుద్ర మన్యునా...." (భాగ 10-55-1).*

**930. ప్రద్యుమ్నభావనః :**

"ప్రద్యుమ్నాఖ్యం జ్యేష్ఠం పుత్రం భావయతి ఉత్పాదయతీతి" ప్రద్యుమ్నుడనే పెద్ద కొడుకును కన్న శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణరుక్మిణీదేవుల పెద్దకొడుకు ప్రద్యుమ్నుడు.

*"స ఏవ జాతో వైదర్భ్యాం కృష్ణవీర్యసముద్భవః...." (భాగ 10-55-2).*

**931. స్యమన్తకమణివ్యాజప్రాప్తజాంబవతీపతిః :**

స్యమన్తకమణిని సత్రాజిత్తుకు ఇవ్వడమనే మిషతో వెళ్ళి జాంబవంతుని పుత్రిక అయిన జాంబవతిని భార్యగా పొందిన శ్రీకృష్ణుడు.

*"మణిహేతోరిహ ప్రాప్తా వయం ఋక్షపతే బిలం..." (భాగ 10-56-31)*

**సత్యభామాప్రాణపతిః కాలిందీరతివర్ధనః ।**
**మిత్రవిందాపతిః సత్యాపతిర్వృషనిషూదనః ॥ 208**

**932. సత్యభామాప్రాణపతిః :**

"సత్యః స్వకార్యకరణక్షమో యథార్థోభామః క్రోధోయస్యాః సా సత్యభామా తస్యా ప్రాణానాం పతిః ప్రాణానాం నాథః ఇత్యర్థ". కోపము తెచ్చుకొని అయినా



తన కార్యమును కావలసినట్లు చేసుకొనేది అని సత్యభామ పదమునకు అర్థము. అట్టి సత్యభామకు ప్రాణసమానుడైన భర్త సత్యభామాప్రాణపతి శ్రీకృష్ణుడు.

**933. కాలిందీరతివర్ధనః :**

సూర్యుని పుత్రిక అయిన కాలింది కృష్ణునియందు ప్రీతి పెంచుకొని పెండ్లి చేసుకున్నది. ఆమెకు తన యందు ప్రేమ వృద్ధి అయినట్లు చేసిన శ్రీకృష్ణుడు.

*"తత్రోపస్పృశ్య విశదం పీత్వా వారి మహారథౌ...." నుంచి "అథోపయేమే కాలిందీం సుపుణ్యర్త్వృక్ష ఊర్జితే...." వరకు [భాగ 10-58 - (17-29)].*

**934. మిత్రవిందాపతిః :**

మిత్రవిందాదేవి భర్త అయిన శ్రీకృష్ణుడు.

*"విందానువిందావావన్త్యౌ దుర్యోధనవశానుగౌ...." (భాగ 10-58-30).*

**935. సత్యాపతిః :**

కోసలదేశ రాజైన నగ్నజిత్తు కుమార్తె సత్యా. నగ్నజితి అని కూడా ఆమెపేరే. ఆమె భర్త శ్రీకృష్ణుడు.

*"నగ్నజిన్నామ కౌసల్య ఆశీద్ రాజాతిధార్మికః..." నుంచి "... లేభిరే పరమానందం జాతశ్చ పరమోత్సవః" వరకు [భాగ 10-58 - (32-48)].*

**936. వృషనిషూదనః :**

ఎవరికీ లొంగని ఏడు ఎద్దులను, ఎవరు వశము చేసుకొందురో, అతనికి తన కూతురు "సత్య" నిచ్చి వివాహము చేతునని, నగ్నజిత్తు మహారాజు స్వయంవర ప్రతిజ్ఞ ప్రకటించాడు. ఆ స్వయంవర ప్రతిజ్ఞ ప్రకారము, ఆ ఏడు ఎద్దులను వశపరచుకొని వృషనిషూదనుడైన శ్రీకృష్ణుడు సత్యాదేవి (నగ్నజితి)ని పెండ్లాడాడు,

*"తాం శృత్వా వృషజిల్లభ్యాం భగవాన్ సాత్వతాం పతిః..." నుంచి "... వ్యకర్షల్లీలయా బద్ధాన్ బాలో దారుమయాన్ యథా" వరకు* [భాగ 10-58- (34-46)].

**భద్రావాంఛితభర్తా చ లక్ష్మణావరణక్షమః ।**
**ఇంద్రాదిప్రార్థితవధనరకాసురసూదనః ॥ 209**

**937. భద్రావాంఛితభర్తా (చ) :**

శ్రుతకీర్తి కుమార్తె భద్రాదేవి. ఆమె శ్రీకృష్ణుని భర్తగా కోరుకొన్నది. శ్రీకృష్ణుడామెను పెండ్లాడి ఆమె కోరికతీర్చి భద్రావాంఛిత భర్త అయ్యాడు.

*"శ్రుతకీర్తేః సుతాం భద్రాముపయేమే పితృష్వసుః"* (భాగ 10-58-56).

**938. లక్ష్మణావరణక్షమః :**

మద్రదేశరాజుకూతురైన లక్ష్మణాదేవిచే స్వయంవరములో వరింపబడి, ఆమెను పెండ్లాడిన శ్రీకృష్ణుడు.

**939. ఇంద్రాదిప్రార్థితవధనరకాసురసూదనః :**

నరకాసురుని బాధలుపడలేక ఇంద్రాదిదేవతలు ఆ అసురుని వధించమని శ్రీకృష్ణుని ప్రార్థించారు. వారిప్రార్థన మన్నించి నరకాసురుని వధించిన శ్రీకృష్ణుడు.

*"ఇంద్రేణ హృతచ్ఛత్రేణ హృతకుండలబంధునా...."* (భాగ 10-59-2).

**మురారిః పీఠహంతా చ తామ్రాదిప్రాణహారకః ।**
**షోడశస్త్రీసహస్రేశః ఛత్రకుండలదానకృత్ ॥ 210**

**940. మురారిః :**

"మురస్య అరిః మురారి". మురుని శత్రువు అని అర్థము. మురుడనే అసురుని చంపిన శ్రీకృష్ణుడు మురారి.

*"తామాపతన్తీం గదయాగదాంమృధే..."* (భాగ 10-59-10).

**941. పీఠహంతా (చ) :**

పీఠాసురుడనే పేరుగల నరకాసురుని సేనానిని చంపిన శ్రీకృష్ణుడు.



**942. తామ్రాదిప్రాణహారకః :**

మురుని పుత్రులైన తామ్రాదులు ఏడుగురు కలరు. వారు మహావీరులు. వారి ప్రాణములు తీసిన శ్రీకృష్ణుడు. (తామ్రుడు, అన్తరిక్షుడు, శ్రవణుడు, విభావసువు, వసువు, నభస్వానుడు, అరుణుడు అనే ఏడుగురు మురుని పుత్రులు).

*"..... తస్యాత్మజాః సప్త పితుర్వధాతురాః...." నుంచి "...తామ్రోఽన్తరిక్షః శ్రవణో, విభావసుర్వసుర్నభస్వానరుణశ్చ సప్తమః..."* [భాగ 10-59 (11-12)].

**943. షోడశస్త్రీసహస్రేశః :**

నరకాసురుడు చెరలోనుంచిన పదహారువేల రాచకన్యలను నరకాసుర వధానంతరము విడిపించి, వారిని వివాహము చేసుకొనిన శ్రీకృష్ణుడు.

*"తత్ర రాజన్యకన్యానాం షట్సహస్రాధికాయుతమ్, భౌమాహృతానాం విక్రమ్య రాజభ్యో దదృశే హరిః* (భాగ 10-59-33).

**944. ఛత్రకుండలదానకృత్ :**

నరకాసురుని వధించిన తరువాత అమరావతి వెళ్ళి అక్కడ ఇంద్రుని ఛత్రము అదితికుండలములు దానమిచ్చిన శ్రీకృష్ణుడు.

"గత్వా సురేంద్రభవనం దత్త్వాదిత్యై చ కుండలే..." (భాగ 10-59-38).

**పారిజాతాపహరణో దేవేంద్రమదనాశకః ।**
**రుక్మిణీసమసర్వస్త్రీసాధ్యభోగరతిప్రదః ॥ 211**

**945. పారిజాతాపహరణః :**

స్వర్గ ఉద్యానవనములోని పారిజాతవృక్షమును బలాత్కారముగా ఎత్తుకు వచ్చిన శ్రీకృష్ణుడు.

**946. దేవేంద్రమదనాశకః :**

పారిజాతవృక్షము శ్రీకృష్ణుడు తీసుకుపోతున్నపుడు దేవేంద్రుడు శ్రీకృష్ణునితో యుద్ధము చేసాడు. ఆ యుద్ధములో దేవేంద్రుని పూర్తిగా పరాజయముచేసి ఆతని గర్వము నశింపజేసిన శ్రీకృష్ణుడు.

*"చోదితో భార్యయోత్పాట్య పారిజాతం గరుత్మతి..." నుంచి ".... మహానహో సురాణాంచ తమో ధిగాఢ్యతామ్"* [భాగ 10-59, - (39-41)].

**947. రుక్మిణీసమసర్వస్త్రీసాధ్యభోగరతిప్రదః :**

శ్రీకృష్ణుని అందరి భార్యలు భాగ్యభోగ్యఐశ్వర్యాదులను, అతని ప్రేమను రుక్మిణీదేవితో సరిసమానముగా పొందేటట్లు ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

*"గృహేషు తాసామనపాయ్యతర్క్యకృన్నిరస్త..." నుంచి "...దాసీశతా అపి విభోర్విదధుః స్మ దాస్యమ్" వరకు [భాగ 10-59 - (43-45)].*

**రుక్మిణీపరిహాసోక్తివాక్తిరోధానకారకః ।**
**పుత్రపౌత్రమహాభాగ్యగృహధర్మప్రవర్తకః ॥ 212**

**948. రుక్మిణీపరిహాసోక్తివాక్తిరోధానకారకః :**

రుక్మిణీదేవితో పరిహాసోక్తులు పలికి ఆమె నోట మాటరానట్లు చేయుటకు కారకుడైన భగవానుడు. లేక – ఆమె మనస్సు శ్రీకృష్ణుని యందు తిరోధానము చెంది లీనమైనట్లు చేసిన శ్రీకృష్ణుడు.

*"రాజ పుత్రీప్సితా భూపైః.... "నుంచి"..... గృహమేధీయాన్ ధర్మాంల్లోకగురుర్హరిః" వరకు [భాగ 10-60 - (10-59)].*

**949. పుత్రపౌత్రమహాభాగ్యగృహధర్మప్రవర్తకః :**

భోగభాగ్యములతో నిండియున్న గృహముతో కొడుకులు, మనుమలతో కలసి గృహస్థాశ్రమ ధర్మమును నిర్వహించు శ్రీకృష్ణుడు.

*"ఏకైకశస్తాః కృష్ణస్య పుత్రాన్ దశదశాబలాః..." నుంచి ".... మాతరః కృష్ణ జాతానాం సహస్రాణి చ షోడశ" [భాగ 10-61 - (1-19)].*

**శంబరాన్తకసత్పుత్రవివాహహతరుక్మికః ।**
**ఉషాపహృతపౌత్రశ్రీర్బాణబాహునివారకః ॥ 213**

**950. శంబరాన్తకసత్పుత్రవివాహహతరుక్మికః :**

శంబరుడనే దైత్యుని ప్రద్యుమ్నుడు చంపాడు. ఆ శంబరాంతక ప్రద్యుమ్నుని పుత్రుడైన అనిరుద్ధుని వివాహసమయములో ప్రద్యుమ్నుని మేనమామ రుక్మి, బలరామునిచే చంపబడ్డాడు. అట్టి రుక్మి బావమరిదిగాగల శ్రీకృష్ణుడు.

*"తస్మిన్నభ్యుదయే రాజన్ రుక్మిణీ రామకేశవౌ...." నుంచి "... క్రుద్ధః పరిఘముద్యమ్య జఘ్నే తం నృమ్ణసంసది" వరకు [భాగ 10-61 - (26-36)].*

**951. ఉషాపహృతపౌత్రశ్రీః :**

బాణుని కూతురు ఉష. బాణుని మంత్రి కూతురు చిత్రలేఖ, ఉషాసఖి. స్వప్నములో శ్రీకృష్ణుని పౌత్రుడు అనిరుద్ధుని చూచిన ఉష, అతనిని తీసుకు రమ్మని చిత్రలేఖను కోరింది. ఆమె అతనిని దొంగతనముగా తీసుకువచ్చి ఉషకు సమర్పించింది. శ్రీకృష్ణుడు బాణాసురుని శిక్షించి ఉషా అనిరుద్ధులతో ద్వారకకు తిరిగి వచ్చాడు.

*"తస్యోషా నామదుహితా స్వప్నే ప్రాద్యుమ్నినా రతిం...."(భాగ 10-62-12) నుంచి ".... సపత్నీకం పురస్కృత్య యయౌ రుద్రానుమోదితః" వరకు. (భాగ 10-63-51)*

**952. బాణబాహునివారకః :**

బాణాసురునకు వెయ్యి చేతులుండేవి. నాలుగుచేతులే ఉంచి మిగిలిన చేతులన్నిటిని ఖండించిన (యీ విధముగాబాణాసురుని శిక్షించిన) శ్రీకృష్ణుడు.

*"బాహుషుచ్ఛిద్యమానేషు బాణస్య భగవాన్ భవః". (భాగ 10-63-33)*

(బాణాసురుడు బలిచక్రవర్తి పుత్రుడు. పూర్వము ప్రహ్లాదుని వంశములో పుట్టిన వారి నెవ్వరిని చంపనని విష్ణుమూర్తి అతనికి వరమిచ్చాడు. అట్లే శివుని వరము సార్థకము చేయుట కూడా ముఖ్యము. అందుచేత శ్రీకృష్ణుడు బాణాసురుని చంపకుండా ఆతని చేతులు ఖండించి శిక్షించాడు.)

**శీతజ్వరభయవ్యాప్తజ్వరసంస్తుతషడ్గుణః ।**
**శంకరప్రతియోద్ధా చ ద్వంద్వయుద్ధవిశారదః ॥ 214**

**953. శీతజ్వరభయవ్యాప్తజ్వరసంస్తుతషడ్గుణః :**

వైష్ణవ శీతజ్వరము వ్యాపించి యుద్ధములో మహేశ్వర జ్వరమును ఆక్రమించగా, దాని తీక్ష్ణతకోర్వలేక మహేశ్వర జ్వరము షడ్గుణైశ్వర్య సంపన్నుడైన శ్రీకృష్ణభగవానుని స్తుతించి వైష్ణవ శీతజ్వరబాధను పోగొట్టుకొన్నది. ఇట్టి శక్తిగల శ్రీకృష్ణుడు.

*"మాహేశ్వరః సమాక్రన్దన్ వైష్ణవేన బలార్దితః...."* (భాగ 10-63-24).

**954. శంకరప్రతియోద్ధా (చ) :**

ఆ యుద్ధములో బాణాసురునకు సహాయముగా కార్తికేయునితోను ప్రమథగణములతోను కలసి స్వయముగా నందివాహనముపై శంకరుడు, రామకృష్ణులతో యుద్ధమునకు వచ్చాడు. బాణాసురుని పక్షమున శంకరుడు శ్రీకృష్ణునితో యుద్ధమునకు రాగా, శంకరుని ఎదురుకొన్న శ్రీకృష్ణుడు శంకరప్రతియోద్ధా.

**955. ద్వంద్వయుద్ధవిశారదః :**

శంకర శ్రీకృష్ణుల ద్వంద్వయుద్ధము వర్ణనాతీతము. అట్టి ద్వంద్వ యుద్ధములో ఎంతో విస్తారమైన నిపుణతగల శ్రీకృష్ణుడు ద్వంద్వయుద్ధ విశారదుడు.

*"....ప్రత్యస్త్రైః శమయామాస శార్ఙ్గపాణిరవిస్మితః"* (భాగ 10-63-12).

**నృగపాపప్రభేత్తా చ బ్రహ్మస్వగుణదోషదృక్ ।**
**విష్ణుభక్తివిరోధైకబ్రహ్మస్వవినివారకః ॥ 215**

**956. నృగపాపప్రభేత్తా (చ) :**

ఇక్ష్వాకుని కొడుకైన నృగమహారాజు ఒకానొక సందర్భములో బ్రాహ్మణుడు శపించగా ఊసరవెల్లి అయినాడు. అతడు చేసిన పాపము పోగొట్టి తిరిగి అతనికి నిజరూపము ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

"తత్రాగత్యారవిందాక్షో భగవాన్ విశ్వభావనః................" నుంచి "స్వర్వ్యద్భుతాలంకరణాంబరస్రక్" వరకు (భాగ 10-64-5, 6).



**957. బ్రహ్మస్వగుణదోషదృక్ :**

బ్రహ్మ పదము ఇక్కడ బ్రాహ్మణజాతిని గురించి మాత్రమే చెప్పబడలేదు. బ్రాహ్మణునికిచ్చిన విత్తము భగవానుని కిచ్చినదన్న అర్థములో బ్రహ్మస్వపదము వాడబడింది. బ్రాహ్మసంబంధముగా నిచ్చిన విత్తము వలన కలిగే పుణ్యఫలము (గుణము) అట్టి విత్తము తెలియకుండా అయినా తిరిగి పొందుట వలన కలిగే పాపఫలము (దోషము) బాగుగా దర్శింపజేసే భగవానుడు శ్రీకృష్ణుడు. నృగమహారాజు ఒక బ్రాహ్మణునకు గోవులు దానము చేసిన పుణ్యఫలముగా భగవద్దర్శనరూప ఫలము పొందేడు (గుణము). అజ్ఞానము చేత (తెలియక) ఒక బ్రాహ్మణునకు దానముచేసిన ఒక గోవును తిరిగి మరియొక బ్రాహ్మణునకు దానముచేయుట వలన కలిగిన స్వల్పదోషఫలముగా ఊసరవెల్లి జన్మము పొందాడు. ఈ రెండింటిని నృగమహారాజుకు తెలియజేసిన శ్రీకృష్ణుడు బ్రహ్మస్వగుణదోషదృక్.

**958. విష్ణుభక్తివిరోధైకబ్రహ్మస్వవినివారకః :**

విష్ణుభక్తి హృదయమునందు ప్రతిష్ఠింపబడకుండుటకు ఒకే ఒక అసాధారణమైన ప్రతిబంధకము- బ్రాహ్మణులసొత్తు నపహరించుట. అట్టి బ్రహ్మస్వాపహరణ దోషము శ్రీకృష్ణుని కృపవలననే నివారింపబడుతుంది. నృగమహారాజుకు అట్టి ప్రతిబంధకము నివారించిన శ్రీకృష్ణుడు. ఇట్లు విష్ణుభక్తి విరోధైకబ్రహ్మస్వవినివారకుడు.

**బలభద్రాహితగుణో గోకులప్రీతిదాయకః ।**
**గోపీస్నేహైకనిలయో గోపీప్రాణస్థితిప్రదః ॥ 216**

**959. బలభద్రాహితగుణః :**

గోకులములో నందయశోదాదులు, గోపగోపికలు శ్రీకృష్ణవియోగ తాపముతో బాధపడుతూ ఉన్నారు. వారికి సాంత్వనము (ఓదార్పు) కలిగించుటకు శ్రీకృష్ణుడు బలరాముని గోకులమునకు పంపించాడు. తన సమతాదిగుణములతో

కూడిన సాంత్వన వాక్యములను బలరాముడు వారికి చెప్పి వారి శోకనివారణ చేసాడు. బలరాముని పంపి ఇట్టి సాంత్వన వాక్యములు వారికి చెప్పించిన శ్రీకృష్ణుడు.

## 960. గోకులప్రీతిదాయకః :

ఎంతోకాలము తరువాత బలరాముడు గోకులమునకు వచ్చి, గోకుల వాసులందరికి తన ప్రీతివచనములు చెప్పి, శ్రీకృష్ణసందేశము వారికి తెలిపి వారందరికి చాలా ప్రీతిని కలిగించాడు.

*"బలభద్రః కురుశ్రేష్ఠ భగవాన్ రథమాస్థితః......" నుంచి ".... నిహత్య నిర్జిత్య రిపూన్ దిష్ట్యా దుర్గం సమాశ్రితాః" వరకు [భాగ 10-65 - (1-8)].*

## 961. గోపీస్నేహైకనిలయః :

గోకులములోని గోపికలు తమ అనన్యస్నేహరూపప్రేమను శ్రీకృష్ణుని యందు నిలుపుకున్నారు. అందుచేత వారి హృదయనిలయుడైయున్న శ్రీకృష్ణుడు గోపీస్నేహైకనిలయుడు. భగవంతుడు హృదయమందు లేకుంటే "భగవత్ స్నేహభక్తి" ఉండదు. అందుచేత గోపికలు నవ్వుతూ కృష్ణుని గురించి వ్యంగ్యపూర్వక ప్రేమవాక్యములు బలరామునితో చెప్పారు.

"గోప్యో హసన్త్యః పప్రచ్ఛూ రామసందర్శనాదృతాః.." నుంచి ".... గతిం ప్రేమపరిష్వంగం స్మరన్త్యో రురుదుః స్త్రియః" వరకు [భాగ 10-65 - (9-15)].

## 962. గోపీప్రాణస్థితిప్రదః :

బలరాముని ద్వారా సందేశము పంపి కృష్ణుని కొరకు తపించుకుపోతున్న గోపికల ప్రాణాలకు సాంత్వనము కలిగించి, సుస్థితి పొందింపజేసిన శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుని కృపకలిగినవారికే మనస్సు, ప్రాణములు అలజడిపొందకుండా సమస్థితిలో ఉంటాయి.

*"సంకర్షణస్తాః కృష్ణస్య సందేశైర్హృదయంగమైః....." (భాగ 10- 65-16).*



**వాక్యాతిగామియమునాహలాకర్షణవైభవః ।**
**పౌండ్రకత్యాజితస్పర్ధః కాశీరాజవిభేదనః ॥ 217**

## 963. వాక్యాతిగామియమునాహలాకర్షణవైభవః :

గోపికలతో యమునానదిలో జలక్రీడలాడడానికి యమునానదిని బలరాముడు తన దగ్గరకు రమ్మనగా మత్తులోనున్న ఆతనిఆజ్ఞ ఆమె పాటించలేదు. తనమాటలను జవదాటిన (వాక్యాతిగామి) యమునా నదిని బలరాముడు తన నాగలి చివరితో తన దగ్గరకు లాగగా ఆమె (యమునానది) ఆతని పాదముల దగ్గరకు వచ్చి క్షమాపణ వేడుకొన్నిది. బలరామ భగవానుని సామర్థ్యము అట్టిది.

"స ఆజుహావయమునాం జలక్రీడార్థమీశ్వర..." నుంచి "..ఉవాచ చకితా వాచం పతితా పాదయో నృప" వరకు (భాగ. 10-65-23, 24,25).

## 964. పౌండ్రకత్యాజితస్పర్ధః :

మూర్ఖుడైన కరూషదేశరాజు పౌండ్రకుడు శ్రీకృష్ణునిపై స్పర్ధతో తానే వాసుదేవుడనని, ఇతరులెవ్వరు వాసుదేవుడు కాదని, వాసుదేవుడైన శ్రీకృష్ణునుద్దేశించి సందేశము పంపాడు. తరువాత శ్రీకృష్ణునిచే వధింపబడ్డాడు. సారూప్యముక్తి పొందాడు.

*"అథాహ పౌండ్రకం శౌరిర్భోఃభోః పౌండ్రక యద్ భవాన్...." నుంచి "....బిభ్రాణశ్చ హరే రాజన్ స్వరూపం తన్మయోఽభవత్"*

*[భాగ 10-66 - (19-24)].*

## 965. కాశీరాజవిభేదనః :

పౌండ్రకుని మిత్రుడైన కాశీరాజును చంపిన శ్రీకృష్ణుడు.

*"తథా కాశిపతేః కాయాచ్ఛిర ఉత్కృత్య పత్రిభిః" (భాగ 10-66-22).*

**కాశీనిదాహకరణః శివభస్మప్రదాయకః ।**
**ద్వివిదప్రాణఘాతీ చ కౌరవాఖర్వగర్వనుత్ ॥ 218**

### 966. కాశీనిదాహకరణః :

చక్రమును ప్రయోగించి కాశీని దహింపజేసిన శ్రీకృష్ణుడు. కాశీరాజు కొడుకు సుదక్షిణుడు, శివుని ఆదేశముతో అభిచారము చేసి కృత్యను ద్వారకానాశనము చేయమని పంపాడు. శ్రీకృష్ణుడు ఆకృత్యపైకి సుదర్శన చక్రము ప్రయోగించి కృత్యను కాశీనగరము వరకు తరిమి కాశీనగరాన్ని పూర్తిగా భస్మము చేసాడు.

*".... విజ్ఞాయ తద్విఘాతార్థం పార్శ్వస్థం చక్రమాదిశత్" నుంచి ".... భూయః పార్శ్వముపాతిష్ఠత్ కృష్ణస్యాక్లిష్టకర్మణః" వరకు [భాగ 10-66 - (38-42)].*

### 967. శివభస్మప్రదాయకః :

కాశీనగరము కాల్చివేయగా వచ్చిన భస్మమును శివుని శరీర లేపనార్థము ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

### 968. ద్వివిదప్రాణఘాతీ (చ) :

నరకాసురుని మిత్రుడైన ద్వివిదుడనే వానరుడు ద్వారకను ధ్వంసము చేయడానికి రాగా శ్రీకృష్ణుడు బలరామునిచే వానిని చంపించాడు.

*"యాదవేంద్రోऽపి తం దోర్భ్యాం త్యక్త్వా ముసలలాంగలే...." నుంచి ".... సంస్తూయమానో భగవాఞ్జనైః స్వపురమావిశత్" వరకు [భాగ 10-67-(25-28)].*

### 969. కౌరవాఖర్వగర్వనుత్ :

దుర్యోధనాది కౌరవులు తమ సిరిసందలతో చెప్పలేనంత మదోన్మత్తులు కాగా (సాంబుని వివాహ సందర్భమున) వారి ఆ గర్వమును నిశ్శేషముగా పోగొట్టిన శ్రీకృష్ణుడు.

*"దృష్ట్వా కురూణాం దౌఃశీల్యం శ్రుత్వావాచ్యానిచాచ్యుతః" నుంచి ".... విశ్వకర్మన్ నమస్తేऽస్తు త్వాం వయం శరణం గతాః" వరకు [భాగ 10-68 - (30-48)].*



**లాఙ్గలాకృష్టనగరీసంవిగ్నాఖిలనాగరః ।**
**ప్రపన్నాభయదః సాంబప్రాప్తసన్మానభాజనమ్ । 219**

### 970. లాంగలాకృష్టనగరీసంవిగ్నాఖిలనాగరః :

బలరాముడు తన నాగలితో హస్తినాపురము చుట్టూత్రవ్వి ఆ నగరాన్ని గంగానదివైపు ఈడ్చుతూఉంటే నగరవాసులందరు ఏమిచేయాలో తెలియక భయముతో నిశ్చేష్టులైపోయారు.

*"లాంగలాగ్రేణ నగరముద్విదార్య గజాహ్వయం...." నుంచి "...... విశ్వకర్మన్ నమస్తేऽస్తు త్వాం వయం శరణం గతాః" వరకు [భాగ 10-68 - (41-48)].*

### 971. ప్రపన్నాభయదః :

నగరవాసులందరూ మృత్యుభయముతో బలరాముని శరణు వేడుకొని స్తుతించగా వారియందు దయచూపుతూ అభయమిచ్చిన బలరాముడు.

*"ఏవం ప్రపన్నైః సంవిగ్నైర్వేపమానాయనైర్బలః" (భాగ 10-68-49).*

### 972. సాంబప్రాప్తసన్మానభాజనం :

జాంబవతీ తనయుడైన సాంబుడు దుర్యోధనుని పుత్రిక అయిన లక్ష్మణను స్వయంవర సభనుండి హరింపగా కౌరవులతో అతనికి యుద్ధము జరిగింది. ఆయుద్ధములో సాంబుని కౌరవులు బంధించారు. సాంబుని విడిపించడానికి బలరాముడు వెళ్లగా కౌరవులు ఆతనిని తిరస్కరించి యుద్ధమునకు సిద్ధమైరి. బలరాముడు తన నాగలితో హస్తినాపురమును అంతను లాగి గంగలో కలుపుటకు ఉద్యుక్తుడు కాగా కౌరవులు, ఆపురజనులు భయార్తులయ్యారు. వారు అప్పుడు బలరాముని ప్రార్థించి లక్ష్మణను సాంబునికిచ్చి పెండ్లి చేయుటకు అంగీకరించారు. వారు బలరామునికి చతురంగసేనలు ఆభరణములు, ఇతర కానుకలిచ్చి గౌరవించారు. అట్టి సన్మానమునకు యోగ్యుడైన బలరాముడు.

*"దుర్యోధనః పారిబర్హం కుంజరాన్ షష్టిహాయనాన్..." నుంచి ".... ససుతః సస్నుషః ప్రాగాత్ సుహృద్భిరభినందితః" వరకు [భాగ 10-68 - (50-52)].*

**నారదాన్విష్టచరణో భక్తవిక్షేపనాశకః ।**
**సదాచారైకనిలయః సుధర్మాధ్యాసితాసనః ॥ 220**

### 973. నారదాన్విష్టచరణః :

నరకాసురుని చంపాక పదహారువేల రాజకుమార్తెలను పెండ్లాడిన శ్రీకృష్ణుడు ఇంతమంది భార్యలతో ఎట్లు గృహస్థాశ్రమనిర్వహణ చేస్తున్నాడో చూద్దామని నారదుడు ఆభార్యలందరి గృహములకు వెళ్ళి చూడగా ప్రతిగృహము లోను శ్రీకృష్ణుడు ఆ భార్యతో కూడి నారదునకు అర్ఘ్యపాద్యముల నిచ్చాడు. ఈ శ్రీకృష్ణ మహాత్మ్యము చూచి నారదుడు శ్రీకృష్ణుని స్తుతించాడు.

*"నరకం నిహతం శ్రుత్వా తథోద్వాహం చ యోషితాం...." నుంచి ".... ప్రాహ ప్రభో భగవతే కరవామహే కిమ్" వరకు [భాగ 10-69 - (1-16)].*

### 974. భక్తవిక్షేపనాశకః :

భక్తుడైన నారదుని చిత్తమందు భగవత్సామర్థ్యము గురించి శంక కలుగుట వలన చిత్తవిక్షేపము కలిగినది. శ్రీకృష్ణుడు ప్రతి ఇంట్లో నారదున కెదురేగి అర్ఘ్యపాద్యములిచ్చి నారదుని చిత్తవిక్షేపము దూరము చేసాడు.

*"బ్రహ్మన్ ధర్మస్య వక్తాహం కర్తా తదనుమోదితా...." (భాగ 10-69-40).*

### 975. సదాచారైకనిలయః :

సదాచారము లేక శిష్టాచారములన్నిటికి మూలభూతమైన (నిలయమైన) శ్రీకృష్ణుడు సదాచారనిలయుడు.

*"బ్రాహ్మే ముహూర్త ఉత్థాయ వార్యుపస్పృశ్య మాధవః" నుంచి "...కృచ్ఛ్రాద్ విసృష్టో నిరగాజ్జాతహాసో హరన్ మనః" వరకు [భాగ 10-70 - (4-16)].*



### 976. సుధర్మాధ్యాసితాసనః :

ద్వారకానగరములో "సుధర్మా" అనే పేరుగల సభాస్థలిలో సింహాసన స్థుడైన శ్రీకృష్ణుడు సుధర్మాధ్యాసితాసనుడు.

*"సుధర్మాఖ్యాం సభాం సర్వై ర్వృష్ణిభిః పరివారితః...." (భాగ 10-70-17).*

**జరాసంధావరుద్ధేన విజ్ఞాపితనిజక్లమః ।**
**మంత్ర్యుద్ధవాదివాక్యోక్తప్రకారైకపరాయణః ॥ 221**

### 977. జరాసంధావరుద్ధేన విజ్ఞాపితనిజక్లమః :

జరాసంధుడు తన దిగ్విజయయాత్రలో తన ఆధిపత్యము నంగీకరించని రాజులను గిరివ్రజము అనే తన దుర్గమునందు బంధించి హింసించుచుండే వాడు. జరాసంధుని బందీగృహములో బాధలు పడుచున్న రాజులు ఒక దూత ద్వారా శ్రీకృష్ణునికి ఆ బాధల గురించి విజ్ఞాపన చేసుకొన్నారు. ఆ రాజులచే విజ్ఞాపనపొందిన శ్రీకృష్ణుడు.

*"తత్రైకః పురుషోరాజన్నాగతోఽపూర్వదర్శనః । విజ్ఞాపితో భగవతే ప్రతీహారైః ప్రవేశితః॥" (భాగ 10-70-22).*

### 978. మంత్ర్యుద్ధవాదివాక్యోక్తప్రకారైకపరాయణః :

వృష్ణివంశజులలో శ్రేష్ఠులు (పెద్దలు) మాత్రమే మంత్రులు అవుతారు. ఉద్ధవాదులు అట్టి శ్రేష్ఠులు. వారు మనువు, బృహస్పత్యాదుల మతానుయాయులు. వారిచే చెప్పబడిన వాక్యముల (సలహాల, ఆదేశాల) ప్రకారము నడుచు కొనుటయే తన కర్తవ్యమని భావించిన శ్రీకృష్ణుడు. దుష్టరాజులైన జరాసంధాదు లను శిక్షించుటకు ముందుగా యుధిష్ఠిరునిచే దిగ్విజయయాత్ర చేయించి, అతనిచే రాజసూయయాగము చేయించవలెనని ఉద్ధవాది మంత్రులు సూచించగా, ఆ రాజనీతిని అంగీకరించి అట్లే చేసిన శ్రీకృష్ణుడు.

*"యదుక్తమృషిణా దేవ సాచివ్యం యక్ష్యతస్త్వయా...." (భాగ 10-71-2).*

**రాజసూయాదిమఖకృత్ సంప్రార్థితసహాయకృత్ ।**
**ఇంద్రప్రస్థప్రయాణార్థమహత్సంభారసంభృతిః ॥ 222**

**979. రాజసూయాదిమఖకృత్ :**

రాజసూయాదియజ్ఞములు యుధిష్ఠిరుడు చేసే విధానములను అన్నిటిని ఎప్పటికప్పుడు ఆదేశించి చేయించిన శ్రీకృష్ణుడు.

*"శ్రుత్వాజితం జరాసంధం నృపతేర్ధ్యాయతో హరిః...." (భాగ 10-72-15).*

**980. సంప్రార్థితసహాయకృత్ :**

భక్తులు తనను ఏ సహాయము కొరకై ప్రార్థిస్తే వారికి ఆ సహాయము చేసే శ్రీకృష్ణభగవానుడు.

**981. ఇంద్రప్రస్థప్రయాణార్థమహత్సంభారసంభృతిః :**

యుధిష్ఠిరుని గౌరవమునకు, తమ (యాదవుల) గౌరవమునకు తగిన రీతిలో, యుధిష్ఠిరుడు చేసే యజ్ఞమునకు కావలసిన అన్నాది సామగ్రి, భరణము క్రింద ఇతర వస్తువులను రాసులుగా తీసుకొని, యుధిష్ఠిరుని రాజధానీ నగరమైన ఇంద్రప్రస్థమునకు వెళ్ళిన శ్రీకృష్ణుడు.

**జరాసంధవధవ్యాజమోచితాశేషభూమిపః ।**
**సన్మార్గబోధకో యజ్ఞక్షితివారణతత్పరః ॥ 223**

**982. జరాసంధవధవ్యాజమోచితాశేషభూమిపః :**

జరాసంధవధను నిమిత్తము (మిష) చేసుకొని అశేషమైన (ఇరవైవేల ఎనిమిది వందలమంది) రాజులను చెరనుండి విడిపించిన శ్రీకృష్ణుడు.

*"అయుతే ద్వే శతాన్యష్టౌ లీలయా యుధి నిర్జితాః...." (భాగ 10-73-1).*

**983. సన్మార్గబోధకః :**

జరాసంధుని చెరనుండి విడిపించిన రాజులు కృతజ్ఞతతో శ్రీకృష్ణుని స్తుతించారు. వారికి సన్మార్గము (భక్తి మార్గము) బోధించిన శ్రీకృష్ణుడు.



*"అద్యప్రభృతి వో భూపా మయ్యాత్మన్యఖిలేశ్వరే...." నుంచి ".... మయ్యావేశ్యమనః సమ్యఙ్మామన్తే బ్రహ్మయాస్యథ"* వరకు *[భాగ 10-73 - (18-23)].*

**984. యజ్ఞక్షితివారణతత్పరః :**

ఇక్కడ "క్షితి" అంటే క్షయము, నాశనము. యజ్ఞము చేసేటపుడు విధానములందుగాని దానధర్మములందుగాని వేరే విధమైన లోపములు తప్పులు జరుగుట వలన యజ్ఞనాశనము, యజమానికి నష్టము కలుగుతాయి. అలా కాకుండా కలుగకుండా ఉండేటట్లు, ఋత్విజులచే యజ్ఞము జరిపించిన శ్రీకృష్ణుడు.

*"ఇత్యుక్త్వా యజ్ఞియే కాలే వవ్రే యుక్తాన్ స ఋత్విజః...." (భాగ 10-74-6).*

**శిశుపాలహతివ్యాజజయశాపవిమోచకః ।**
**దుర్యోధనాభిమానాబ్ధిశోషబాణవృకోదరః ॥ 224**

**985. శిశుపాలహతివ్యాజజయశాపవిమోచకః :**

తనను నిందిస్తూ దుర్వచనములు పలికేడన్న మిషతో శిశుపాలుని వధించి జయుడనే వైకుంఠములోని తన ద్వారపాలకునికి మూడవ జన్మ (శిశుపాలుని రూపము) అనంతరము ముక్తి కలిగించి స్వస్థానము ప్రసాదించిన శ్రీకృష్ణుడు.

*"చైద్యదేహోత్థి తం జ్యోతిర్వాసుదేవముపావిశత్...." (భాగ 10-74-45).*

**986. దుర్యోధనాభిమానాబ్ధిశోషబాణవృకోదరః :**

దుర్యోధనుని దురభిమానమనే సముద్రమును వృకోదరుడు (భీముడు) అనే బాణము చేత శోషింపజేసిన శ్రీకృష్ణుడు. (రామాయణములో సేతు బంధనమునకు ముందుగా శ్రీరాముడు సముద్రమును శోషింపజేస్తానని బాణము సంధించాడు. సముద్రశోషణ యీవిధముగా ప్రసిద్ధము).

*"తత్రదుర్యోధనో మానీ పరీతో భ్రాతృభిర్నృపః" (భాగ 10-75-36).*

**మహాదేవవరప్రాప్తపురశాల్వవినాశకః ।**
**దంతవక్త్రవధవ్యాజవిజయాఘౌఘనాశకః ॥ 225**

### 987. మహాదేవవరప్రాప్తపురశాల్వవినాశకః :

శివుని వరముచే శాల్వుడు సౌభమనే పెద్దనగరము వంటి ఒక విమాన వాహనమును పొందాడు. దానిని మయుడు నిర్మించి యిచ్చాడు. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థములో ఉన్న సమయములో శాల్వుడు ఆసౌభవాహనమును తీసుకొని ద్వారకానగరముపై దండెత్తి మాయా యుద్ధము చేసాడు. ఇది తెలిసి శ్రీకృష్ణుడు ద్వారకకు వచ్చి యుద్ధములో శాల్వుని వధించాడు.

*"తం శస్త్రపూగైః ప్రహరన్త మోజసా...." (భాగ 10-77-33).*

### 988. దంతవక్త్రవధవ్యాజవిజయాఘౌఘనాశకః :

దంతవక్త్రుని వధించాడన్నమిషతో అతనిపాప సమూహములను నాశనము చేసి వైకుంఠములో ద్వారపాలకుడైన విజయునికి శాప విముక్తి కలిగించిన శ్రీకృష్ణుడు.

*"తతః సూక్ష్మతరం జ్యోతిః కృష్ణమావిశదద్భుతం...." (భాగ 10-78-10).*

**విదూరథప్రాణహర్తా న్యస్తశస్త్రాస్త్రవిగ్రహః ।**
**ఉపధర్మవిలిప్తాంగసూతఘాతీ వరప్రదః ॥ 226**

### 989. విదూరథప్రాణహర్తా :

దంతవక్త్రుని తమ్ముడు విదూరథుని వధించిన శ్రీకృష్ణుడు.

*"విదూరథస్తు తద్ భ్రాతా భ్రాతృశోకపరిప్లుతః......." నుంచి ".... శిరో జహార రాజేంద్ర సకిరీటం సకుండలం" వరకు (భాగ 10-78-11, 12).*

### 990. న్యస్తశస్త్రాస్త్రవిగ్రహః :

శస్త్రాస్త్రములు ఎక్కడికక్కడ విడిచి మహాభారతయుద్ధములో తాను ఎవరి



పక్షమున యుద్ధము చేయనని నిశ్చయించి, తీర్థయాత్రలు చేయతలపెట్టిన బలరాముడు.

*"శ్రుత్వా యుద్ధోద్యమం రామః కురూణాం సహ పాండవైః..."(భాగ 10-78-17).*

### 991. ఉపధర్మవిలిప్తాంగసూతఘాతీ :

"స్వధర్మాతిరిక్తో ధర్మః ఉపధర్మః గౌణ ఇతి యావత్" స్వధర్మమును అతిక్రమించిన ధర్మము ఉపధర్మము. ఇది ముఖ్యధర్మము కాదు. రోమహర్షణుడనే సూతుడు బ్రాహ్మణుల ఆదేశము పొంది, బ్రాహ్మణుల స్థానములో (బ్రహ్మాసన మందు) కూర్చొని ఇతిహాస పురాణములు బోధిస్తున్నాడు. (ఉపధర్మము). బలరాముడచటికి వచ్చినపుడు సూతుడు తన ఆసనముపైనుండి లేవలేదు. అచ్చటనున్న ఋషులు, బ్రాహ్మణులు లేచి బలరామునికి నమస్కరించారు. ప్రత్యుత్థానము చేసారు. ప్రతిలోమజాతుడు, బ్రహ్మాసనముపై కూర్చున్నవాడు అయిన రోమహర్షణుడు, వినయముతో ప్రత్యుత్థానము చేయలేదని బలరాముడు కృద్ధుడై అతనిని నిందించి, వధార్హుడని నిశ్చయించి, చంపాడు. యోగీశ్వరుడైనను, ధర్మా ధర్మ నియమముల కతీతుడైనను, బలరాముడు యీ కార్యము చేయుట అనుచితమని, బ్రహ్మహత్యయని అచ్చట నున్న ఋషులు చెప్పారు. బలరాముడు లోక సంగ్రహార్థము ప్రాయశ్చిత్తము చేసుకొనవలెనని చెప్పారు. రోమహర్షుని పుత్రుడైన ఉగ్రశ్రవునికి పురాణవక్తయగుటకు అధికారము, దీర్ఘాయువు, ఇంద్రియపటుత్వము అనువరములు ప్రసాదించి, బలరాముడు ప్రాయశ్చిత్తము చేసుకొన్నాడు.

*"అప్రత్యుత్థాయినం సూతమకృతప్రహ్వాణాంజలిమ్" (భాగ 10-78-23).*

### 992. వరప్రదః :

రోమహర్షుని స్థానములో అతని పుత్రుని సూతునిగా నియమించి ఋషులు చేయుచున్న సత్రసమాపనము చేయమని బలరాముడు వరమిచ్చాడు.

*"దీర్ఘమాయుర్బతైతస్య సత్త్వమింద్రియమేవ చ.."* (భాగ 10-78-34).

**వల్వలప్రాణహరణపాలితర్షిశ్రుతిక్రియః ।**
**సర్వతీర్థాఘనాశార్థతీర్థయాత్రావిశారదః ॥ 227**

**993. వల్వలప్రాణహరణపాలితర్షిశ్రుతిక్రియః :**

ఋషుల సత్రములను అపవిత్రముచేస్తున్న ఇల్వల పుత్రుడు వల్వలుని బలరాముడు వధించి ఋషుల సత్రయాగమును రక్షించాడు.

*"తతః పర్వణ్యుపావృత్తే ప్రచండః పాంసువర్షణః...." నుంచి "... ముంచన్నార్తస్వరం శైలో యథా వజ్రహతోఽఽరుణః" వరకు* [భాగ 10-79 - (1-6)].

**994. సర్వతీర్థాఘనాశార్థతీర్థయాత్రావిశారదః :**

పాపములుచేసినవారు తీర్థములలో స్నానములుచేసి వారి పాపములు తీర్థములందు పోగొట్టుకొనడం చేత తీర్థసామర్థ్యము తగ్గుతుంది. అందుచేత అన్ని తీర్థములలో స్నానముచేసి వాటన్నిటి మొత్తం సామర్థ్యము చేతగాని, సామర్థ్యము తగ్గని తీర్థఫలము చేతగాని సూతుని చంపిన పాపము పోగొట్టుకొన వలసినదని ఋషులు సిద్ధాంతము చేసి బలరామునికి చెప్పారు. తీర్థయాత్రల గురించి చక్కగా తెలిసిన బలరాముడు ఋషులు చెప్పినట్లు చేసి, తీర్థయాత్రా విశారదుడైనాడు.

**జ్ఞానక్రియావిభేదేష్టఫలసాధనతత్పరః ।**
**సారథ్యాదిక్రియాకర్తా భక్తవశ్యత్వబోధకః ॥ 228**

**995. జ్ఞానక్రియావిభేదేష్టఫలసాధనతత్పరః :**

క్రియాపదమువలన కర్మ చెప్పబడుతుంది. జ్ఞానమునకు కర్మలకు గల విభేదము లేక జ్ఞానమార్గ సాధన, కర్మమార్గ సాధనలలో గల పరస్పర విభేదము జ్ఞానక్రియావిభేదము. ఆయాసాధనలు చేసే వారిని ఆయా మార్గముల



ననుసరింపజేసి, అందువలన పొందదగిన ఇష్టఫలము పొందింపజేయుట యందు తత్పరుడైన భగవానుడు యీ నామముచే చెప్పబడుతున్నాడు. జ్ఞానము వలన సకల శుభాశుభకర్మనాశకత్వము కలుగుననుట సుప్రసిద్ధము. జ్ఞానమార్గమునకు అనధికారులు, కర్మనిష్ఠగలవారు అయిన ఋషులు జ్ఞానము కన్న కర్మనిష్ఠయే లోకములో ఫలప్రదమని, అతిశయత్వము కలదని తలుస్తారు. లోకమునకు ఇది తెలుపుటకు బలరాముడు ఋషుల ఆదేశమును గౌరవించి, కర్మనిష్ఠను ఆచరించాడు.

996, 997 నామములు శ్రీకృష్ణునికి పాండవులయందుగల భక్త వాత్సల్యము తెలిపేవి.

**996. సారథ్యాదిక్రియాకర్తా :**

మహాభారత యుద్ధములో శ్రీకృష్ణుడు అర్జునుని రథసారథ్యము చేసి పాండవులకు జయము సమకూర్చాడు. బలరాముడు దుర్యోధనభీముల గదాయుద్ధము మానమని చెప్పినపుడు వారు బలరాముని మాటలు వినలేదు. శ్రీకృష్ణుడు వారి యుద్ధము వారించలేదు; జరగనిచ్చాడు. ఈవిధముగా సారథ్యాదిక్రియలు చేసిన శ్రీకృష్ణభగవానుడు.

*"గదాపాణీ ఉభౌ దృష్ట్వా సంరబ్ధౌమై విజయైషిణౌ........." నుంచి "........ అనుస్మరంతావన్యోన్యం దురుక్తం దుష్కృతాని చ" వరకు* [భాగ 10-79 - (25-28)].

**997. భక్తవశ్యత్వబోధకః :**

బలభద్రుడు భీమసేనదుర్యోధనులు యుద్ధము చేయరాదని చెప్పినప్పటికి శ్రీకృష్ణుడు భీమసేనుని వారించలేదు. సరికదా, దుర్యోధనుని తొడపై కొట్టమని భీమునకు సంజ్ఞలద్వారా జ్ఞాపకము చేసాడు. ఈ విధముగా తన భక్తవశ్యత్వము బలరామునకు, లోకమునకు బోధించిన శ్రీకృష్ణుడు.

**సుదామారంకభార్యార్థభూమ్యానీతేంద్రవైభవః ।**
**రవిగ్రహనిమిత్తాప్తకురుక్షేత్రైకపావనః ॥ 229**

**998. సుదామారంకభార్యార్థభూమ్యానీతేంద్రవైభవః :**

సుదాముడు శ్రీకృష్ణుని సహాధ్యాయి.కృష్ణభక్తుడు. బీదవాడు. కుచేలుడు అన్నపేరు కలవాడు. భాగ్యభోగముల కొరకు భార్యపంపగా శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళేడు. కాని భాగ్యభోగములను యాచించలేదు. అడగకపోయినా శ్రీకృష్ణుడు సుదామునికి ఆయన భార్యకు సర్వసుఖములు, ఇంద్రవైభవములు ఇహ లోకములో కలిగించాడు.

*"తం విలోక్యాచ్యుతో దూరాత్ ప్రియాపర్యంకమాస్థితః..." నుంచి "... తస్య వై దేవదేవస్య హరేర్యజ్ఞపతేః ప్రభో....." వరకు [భాగ 10-80-18 నుంచి 10-81-39].*

**999. రవిగ్రహనిమిత్తాప్తకురుక్షేత్రైకపావనః :**

సూర్యగ్రహణసమయమందు ఆప్తులందరు పవిత్రమైన కురుక్షేత్రమందు స్నానాదులాచరించి పావనులు అవాలని తలచి వారిని కురుక్షేత్రమునకు శ్రీకృష్ణుడు పిలిపించాడు. తాను కూడా వచ్చి స్నానముచేసి కురుక్షేత్రమును పావనము చేసాడు.

*"అథైకదా ద్వారవత్యాం వసతో రామకృష్ణయోః...." నుంచి అధ్యాయము చివరి వరకు" (భాగ 10-82 అధ్యాయం).*

**నృపగోపీసమస్తస్త్రీపావనార్థాఖిలక్రియః ।**
**ఋషిమార్గప్రతిష్ఠాతా వసుదేవమఖక్రియః ॥ 230**

**1000. నృపగోపీసమస్తస్త్రీపావనార్థాఖిలక్రియః :**

యుధిష్ఠిరాదులు, దేవకీవసుదేవులు, నందయశోదాది గోపగోపికా సముదాయము గ్రహణకాలములో కురుక్షేత్రమందు స్నానము చేసి పావనుల వాలన్న మిషతో (భక్తులందరిని రప్పించి) వారికందరికి తన దర్శన భాగ్యము కలిగించిన శ్రీకృష్ణభగవానుడు.

**1001. ఋషిమార్గప్రతిష్ఠాతా :**

కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు) ఇతర ఋషులు ప్రతిపాదించిన జ్ఞాన,



కర్మ, భక్తి మార్గములను ప్రతిష్ఠించి, మరియు తాను కూడా స్వయముగా ఆ మార్గములను ఆచరించి చూపిన శ్రీకృష్ణుడు.

*".. ఆయయుర్మునయస్తత్ర కృష్ణరామాదిదృక్షయా" నుంచి "... జనసంగ్రహ ఇత్యూచుః స్మయన్తస్తం జగద్గురుం" వరకు [భాగ 10-84 - (2-15)]*

**1002. వసుదేవమఖక్రియః :**

1. వసుదేవునిచే చేయబడిన యజ్ఞములు ఇతర కర్మలు ఏ భగవానుని గురించి చేయబడినవో, ఆ శ్రీకృష్ణుడు.

2. వసుదేవునిచే చేయబడిన యజ్ఞములు క్రియలు ఏఫలమాసించి చేయింపబడినవో అవి చేయించిన శ్రీకృష్ణుడు.

*"ఇతి తద్వచనం శ్రుత్వా వసుదేవో మహామనాః...." (భాగ 10-84-42).*

**వసుదేవజ్ఞానదాతా దేవకీపుత్రదాయకః ।**
**అర్జునస్త్రీప్రదాతా చ బహులాశ్వస్వరూపదః ॥ 231**

**1003. వసుదేవజ్ఞానదాతా :**

వసుదేవుడు ద్వైపాయనాదిమునులచే శ్రీకృష్ణతత్త్వము, మహాత్మ్యము తెలుసుకొనునట్లు చేసిన భగవానుడు, శ్రీకృష్ణుడు.

*"అథైకదాऽऽత్మజౌ ప్రాప్తౌ కృత పాదాభివందనౌ...." (భాగ 10-85-1).*

**1004. దేవకీపుత్రదాయకః :**

దేవకీదేవి శ్రీకృష్ణుని ప్రార్థించగా "కీర్తిమత్ ప్రభృతి" అనగా మొదటినుండి పుట్టి చనిపోయిన దేవకీదేవి ఆరుగురు పుత్రులను తీసుకువచ్చి యిచ్చిన శ్రీకృష్ణుడు

*"అథ తత్ర కురుశ్రేష్ఠ దేవకీ సర్వదేవతా..." నుంచి "... మిషతాం సర్వభూతానాం యయుర్ధామ దివౌకసామ్" వరకు [భాగ 10-85 - (27-56)].*

**1005. అర్జునస్త్రీప్రదాతా (చ) :**

బలరామాదులకు బోధపరిచి సుభద్రను అర్జున కిచ్చి వివాహము చేయించిన శ్రీకృష్ణుడు.

*"అర్జునస్తీర్థయాత్రాయాం పర్యటన్నవనీం ప్రభుః...." నుంచి "... మహాధనోపస్కరే భరథాశ్వనర యోషితః" వరకు (భాగ 10-86 - 2-12).*

**1006. బహులాశ్వస్వరూపదః :**

మిథిలానగరరాజు బహులాశ్వుడు. ఆయన ఇంటికి వెళ్ళి తనదర్శనమిచ్చిన శ్రీకృష్ణుడు.

*"తథా తద్రాష్ట్రపాలోఽఙ్గ బహులాశ్వ ఇతి శ్రుతః...." నుంచి ".... గీతం సురైర్నృభిరగాచ్ఛనకైర్విదేహాన్.." వరకు [భాగ 10-86 - (16-21)].*

**శ్రుతదేవేష్టదాతా చ సర్వశ్రుతినిరూపితః ।**
**మహాదేవాద్యతిశ్రేష్ఠో భక్తిలక్షణనిర్ణయః ॥ 232**

**1007. శ్రుతదేవేష్టదాతా (చ) :**

మిథిలానగరమందున్న శ్రుతదేవుడనే బ్రాహ్మణ భక్తునికి (ఏకాంత భక్తునికి) దర్శనమిచ్చి ఆతని కోరికలు తీర్చిన శ్రీకృష్ణుడు.

*"కృష్ణస్యాసీద్ద్విజశ్రేష్ఠః శ్రుతదేవ ఇతి శ్రుతః...." నుంచి "... నాధికం తావతా తుష్టః క్రియాశ్చక్రే యథోచితాః" వరకు [భాగ 10-86 - (13-15)].*

**1008. సర్వశ్రుతినిరూపితః :**

శ్రుతులు వేర్వేరు అంశములపై తమ శక్త్యానుసారము (మాటలలో చెప్పగలిగినంత వరకు) భగవత్స్వరూప జ్ఞానమును మాహాత్మ్యములను వర్ణించుచు స్తుతించేయి. (భాగ 10-87 అధ్యాయము).



*"...... వేదైశ్చ సర్వైరహ మేవవేద్యః....(గీతా 15-15) "ప్రతత్తే అద్య శిపివిష్టనామార్థః శగ్ంసామి వయునాని విద్వాన్। తం త్వా గృణామి తవసమతవ్యాన్ క్షయన్తమస్య రజసః పరాకే" (శ్రుతి)*

శిపివిష్టనామార్థము 47వ నామమైన "గూడాత్మా-సర్వవేరేషు" క్రింద 64వ పేజీలో వివరింపబడ్డాది.

**1009. మహాదేవాద్యతిశ్రేష్ఠః :**

మహాదేవుడైన శివుడు బ్రహ్మ మొదలైన అతి శ్రేష్ఠులైన దేవతలు అత్యన్తము ప్రశంసించే పరమాత్మ శ్రీకృష్ణుడు.

*"దేవాసురమనుష్యేషు" నుంచి "...విరుద్ధ శీలయోః ప్రభ్వోర్విరుద్ధా భజతాంగతిః " వరకు [భాగ 10-88-(1, 2)].*

**1010. భక్తిలక్షణనిర్ణయః :**

ఎటువంటి భక్తి భగవదనుగ్రహము వలన మాత్రమే లభిస్తుందో అట్టి భక్తి లక్షణములేవో, వాటిని నిర్ణయము చేసిన భగవానుడు.

*"యస్యాహమను గృహ్ణామి హరిష్యే తద్ధనం శనైః...." నుంచి "... సద్యః శాపప్రసాదోఽఙ్గ శివో బ్రహ్మా నచాచ్యుతః" వరకు [భాగ 10-88 - (8-12)].*

**వృకగ్రస్తశివత్రాతా నానావాక్యవిశారదః ।**
**నరగర్వవినాశార్థహృతబ్రాహ్మణబాలకః ॥ 233**

**1011. వృకగ్రస్తశివత్రాతా :**

శకుని అనే రాక్షసుని కొడుకు వృకుడు. తాను ఎవరి నెత్తిన చేయి వేస్తే వారు భస్మమైపోవాలని శివుని గురించి తపస్సుచేసి ఆ వరము పొందుతాడు. (అందుచేత ఆ రాక్షసుడు భస్మాసురుడని చెప్పబడతాడు.) ఆ వరప్రభావము పరీక్షించుటకై శివుని పట్టుకొన ప్రయత్నించాడు. ఆ సంకటము నుంచి శివుని రక్షించిన భగవానుడు.

*"అత్రైవోదాహరన్తీమితిహాసం పురాతనం...." నుంచి "... ఓ మితి ప్రహసంస్తస్మై దదేౖ హేరమృతం యథా" వరకు [భాగ 10-88 - (13-22)].*

## 1012. నానావాక్యవిశారదః :

కార్యసాధనకై ఎన్నో విధములైన మాటలు చెప్పుటలో నేర్పరి అయిన భగవానుడు.

*"ఏవం చేత్తర్హి తద్వాక్యం న వయం శ్రద్ధధీమహి...." నుంచి "... క్షేమీ స్యాత్ కిము విశ్వేశేకృతాగస్కో జగద్గురౌ" వరకు [భాగ 10-88 - (32-39)].*

## 1013. నరగర్వవినాశార్థహృతబ్రాహ్మణబాలకః :

ద్వారకలో ఒక బ్రాహ్మణుని తొమ్మిదిమంది సంతానము సూతిగృహము లోనే మరణించేవారు. బలరామాదులు నీ సంతానము రక్షించ లేకపోయినా నేను రక్షిస్తానని గర్వముతో ప్రగల్భములు పలికిన అర్జునుడు ఎన్నో ప్రయత్నములు చేసాడు. సూతికాగృహము చుట్టూ బాణములతో పంజరము కట్టి పదవ సంతానమైన బాలుని ప్రాణములు పోకుండా చేయాలని స్వయముగా కాపలాకాచాడు. కాని ఆ బ్రాహ్మణుని సంతానము సూతగృహము లోనే మరణించాడు. అర్జునుడు రక్షించలేకపోయాడు. ఈ విధముగా అర్జుననికి (నరునికి) గర్వము పోగొట్టిన శ్రీకృష్ణ భగవానుడు.

*"ఏకదా ద్వారవత్యాం తు విప్రపత్న్యాః కుమారకః...." నుంచి "...అగ్నిం వివిక్షుః కృష్ణేన ప్రత్యుక్తః ప్రతిషేధతా" వరకు [భాగ 10-89 - (22-45)].*

**లోకాలోకపరస్థానస్థితబాలకదాయకః ।**
**ద్వారకాస్థమహాభోగనానాస్త్రీరతివర్ధనః ॥ 234**

## 1014. లోకాలోకపరస్థానస్థితబాలకదాయకః :

భూలోకము యొక్క అంతమందున్న లోకాలోకపర్వతముల కన్నా పై నున్న ఏదో స్థానములో ఉన్న బ్రాహ్మణ బాలకులను (సూతగృహములోనే చనిపోయిన వారిని) తెచ్చి బ్రాహ్మణునకిచ్చిన భగవానుడు.



*"ద్విజాత్మజా మే యువయోర్దిదృక్షుణా........" నుంచి "........అంజసా వర్తయామాస ధర్మం ధర్మసుతాదిభిః" వరకు [భాగ 10-89 - (59-66)].*

## 1015. ద్వారకాస్థమహాభోగనానాస్త్రీరతివర్ధనః :

1. ద్వారకానగరమందున్న బహువిధ భోగములను అనుభవించుట యందు వివిధ స్త్రీలకు ప్రీతికలిగించే శ్రీకృష్ణుడు.

2. ద్వారకానగరము నందలి బహువిధ భోగములను, అనుభవించే స్త్రీల చిత్తములలో తనయందు ప్రీతి (ప్రేమ) వర్ధిల్లజేసే శ్రీకృష్ణుడు.

*"సుఖం స్వపుర్యాం నివసన్ ద్వారకాయాం శ్రియః పతిః...." నుంచి "జగద్గురుం భర్తృబుద్ధ్యా తాసాం కిం వర్ణ్యతే తపః" వరకు [భాగ 10-90 - (1-27)].*

**మనస్తిరోధానకృతవ్యగ్రస్త్రీచిత్తభావితః ।**
**.................................... ॥ 235**

## 1016. మనస్తిరోధానకృతవ్యగ్రస్త్రీచిత్తభావితః :

మనస్తిరోధానము అనగా మనస్సులో నున్న సాంసారిక విషయముల గురించి కలిగే వృత్తులు హరింపబడుట, లేక, లేకుండాపోవుట. వ్యగ్ర చిత్తములనగా మనోచిత్తవృత్తులు విక్షిప్తమగుట (తీసివేయబడుట). ఇందు వలన మనస్సు తిరిగి వాటియందు పోకుండా భగవంతుని యందు నిలిచియుండుట అని అర్థము.

శ్రీకృష్ణుని నర్మవచనములు మొదలగు వాటిచే సుందరీమణుల (స్త్రీల) మనస్సులు తిరోధానము చేయబడి వారిచిత్తములందు శ్రీకృష్ణభగవానుని రూపములు లీలలు మాత్రమే వారి వారిచే భావింపబడునట్లు చేసే శ్రీకృష్ణుడు.

*ఇంతవరకు దశమస్కంధ (ఉత్తరార్ధ) నామములు.*

## శ్రీమద్భాగవత ఏకాదశస్కంధ నామములు

*ముక్తిలీలా నామములు (1017-1043)*

*శ్లోక సంఖ్య (235-241)*

**.................................... ।**

**ముక్తిలీలావిహరణో మౌశలవ్యాజసంహృతిః ॥ 235**

### 1017. ముక్తిలీలావిహరణః :

ముక్తిరూపమనే స్వస్వరూపముతో విహరిస్తూ, క్రీడగా ముక్తిలీలలు చేసే భగవానుడు. ముక్తిలీలలు చేసే సమయములో తనవారు, పైవారు అనే విచక్షణ లేకుండా యాదవకులము నంతటిని హరించిన శ్రీకృష్ణుడు. యాదవు లందరు తమలో తాము యుద్ధము చేసుకొని చనిపోయారు.

*"కృత్వా దైత్యవధం కృష్ణః సరామో యదుభిర్వృతః" (భాగ 11-1-1).*

### 1018. మౌశలవ్యాజసంహృతిః :

బ్రాహ్మణ శాపము నిమిత్తమై, సాంబుని గర్భమునుండి పుట్టిన ముసల (రోకలి) సంబంధిత యుద్ధము మిషగా యాదవకులమును సంపూర్ణముగా సంహరింపజేసిన శ్రీకృష్ణుడు.

*"ఏవం వ్యవసితో రాజన్ సత్యసంకల్ప ఈశ్వరః..." (భాగ 11-1-5).*

**శ్రీభాగవతధర్మాదిబోధకో భక్తినీతికృత్ ।**
**ఉద్ధవజ్ఞానదాతా చ పంచవింశతిధా గురుః ॥ 236**

### 1019. శ్రీభాగవతధర్మాదిబోధకః :

శ్రీభాగవతధర్మములు శ్రీమద్భాగవతములో విశదముగా చెప్పబడ్డాయి. ఈ ధర్మములు భగవదైశ్వర్యయుక్తములు. భగవద్భక్తులు (భాగవతులు) ఆచరించేవి. కావ్యాదులలో చెప్పబడ్డాయి. నారదుని చేత వసుదేవునకు యీ భాగవత ధర్మములు బోధింపజేసిన శ్రీకృష్ణుడు.



*"తమేకదా తు దేవర్షిం వసుదేవో గృహాగతం...." నుంచి "..... స భవతి భాగవతప్రధాన ఉక్తః" వరకు [భాగ 11-2- (3 - 55)].*

### 1020. భక్తినీతికృత్ :

"భక్తేర్నీతిం జ్ఞానం ప్రాప్తిం వా భక్తౌ స్థితిం వా జనకస్య యోగేశ్వరస్య వచనైః కరోతీతి తథా" భక్తియొక్క నీతిని అనగా జ్ఞానమును, భక్తిని పొందు విధానమును, భక్తియందు స్థిరముగా నుండుటను, యోగీశ్వరుడైన జనకునికి తెలియజేసిన భగవానుడు. (విదేహరాజు లందరికి జనకుడనే పేరు ఉంటుంది). ఆ రోజులలో నిమిచక్రవర్తి విదేహరాజు. ఆయన కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు ద్రుమితుడు, చమసుడు, కరభాజనుడు అనే యోగ్వేశ్వరుల నుండి తెలుసుకొన్న భక్తి-నీతిని నారదుని ద్వారా వసుదేవునికి చెప్పించిన శ్రీకృష్ణుడు.

*"విదేహస్తానభిప్రేత్య నారాయణ పరాయణాన్.." భాగ 11-2-26 నుంచి భాగ 11-5 అధ్యా॥ చివరివరకు.*

### 1021. ఉద్ధవజ్ఞానదాతా (చ) :

రాబోవు శ్రీకృష్ణుని నిర్యాణముగురించి విని, శోకించు ఏకాంతభక్తుడైన ఉద్ధవునకు శోకము పోగొట్టి తత్త్వ జ్ఞానము ప్రసాదించిన శ్రీకృష్ణ భగవానుడు, ఉద్ధవజ్ఞానదాత.

*"దేవదేవేశ యోగేశ పుణ్యశ్రవణ కీర్తన...." (భాగ 11-6-42) నుంచి 25వ అధ్యాయం చివరి వరకు.*

### 1022. పంచవింశతిధా గురుః :

అవధూతకు తత్త్వజ్ఞానమునుపదేశించిన ఇరవైఐదు గురువులు

*"సన్తి మే గురవో రాజన్ బహవో బుధ్యుపాశ్రితాః...." (భాగ 11-7-32) నుంచి భాగ 11-9 వ అధ్యాయం చివరి వరకు).*

**ఆచారభక్తిముక్త్యాదివక్తా శబ్దోద్భవస్థితిః ।**
**హంసో ధర్మప్రవక్తా చ సనకాద్యుపదేశకృత్ ॥ 237**

## 1023. ఆచారభక్తిముక్త్యాదివక్తా :

**ఆచారః** – కామనారహిత భావముతో వర్ణాశ్రమకులాచారములను భగవదర్పణముగా ఆచరించుట.

*"మయోదితేష్వవహితః స్వధర్మేషు మదాశ్రయః" మొదలైనవి. (భాగ 11-10 అ.)*

**ముక్తిః** – బంధమోక్షముల వ్యాఖ్యలో విశదీకరించినది ముక్తి. క్లుప్తముగా చెప్పాలంటే వాస్తవానికి జీవునకు బంధములుగాని, ముక్తిగాని లేవు. జీవునికి సబంధించిన ఈ బంధము ముక్తి లక్షణములు భాగవతములో విశదీకరింప బడ్డాయి. "బద్ధోముక్త ఇతి వ్యాఖ్యా గుణతో మే న వస్తుతః.." నుంచి "... ఆత్మారామో౽నయా వృత్త్యా విచరేజ్జడవన్మునిః" వరకు
[భాగ 11-11 - (1-17)].

**భక్తిః** – భగవంతుని శరణాగతి పొంది, సర్వప్రాణులయందు కృప చూపుతూ పాపవాసనారాహిత్యముతో, భగవంతుని అనన్య భక్తితో భజించుట నిజమైన భక్తి.

*"ఏవం జిజ్ఞాసయాపోహ్య నానాత్వ భ్రమమాత్మని..." నుంచి "... లభతే నిశ్చలాం భక్తిం మయ్యుద్ధవ సనాతనే" [భాగ 11-11 - (21-24)].*

**ఆది** – పైని చెప్పిన ఆచారము, ముక్తి, భక్తులకు సంబంధించిన ఉప ధర్మములనన్నింటిని గురించి ఉద్ధవునకు బోధించిన శ్రీకృష్ణభగవానుడు ఆచారముక్తిభక్త్యాదివక్త.

## 1024. శబ్దోద్భవస్థితిః :

శబ్దమునకు పరా, పశ్యన్తి, మధ్యమ, వైఖరి అనే నాలుగు విధములైన రూపములు ఉంటాయి. ఈ నాలుగు ఎక్కడెక్కడ పుడతాయో, వాటి లక్షణములు ఏవో తెలిపే జ్ఞానము శబ్దోద్భవస్థితి.



*"స ఏష జీవో వివరప్రసూతిః ప్రాణేన ఘోషేణ గుహాం ప్రవిష్టః...." నుంచి "..... సంపద్య చాత్మానమథ త్యజాస్త్రమ్" వరకు (భాగ 11-12 - (17-24).*

"చత్వారి వాక్ పరిమితాని పదాని తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః. గుహా త్రీణి నిహితానేంగయంతి తురీయం వాచో మనుష్యా వదన్తి. (శ్రుతి). శబ్దము (వాచః శబ్దబ్రహ్మణః) హృదయము, కంఠము, తాలువు నాలుక అనే నాలుగు స్థానములకు పరిమితమైనది. హృదయకంఠతాలువలలో శబ్దము గుప్తముగా ఉండి పైకి వినబడదు. జిహ్వ నుండి మాత్రమే వైఖరీ అనే పేరు గల శబ్దము బయటకికి ఉచ్చరింపబడి వినబడుతుంది.

## 1025. హంసః :

"హన్తి సంసారం, హన్యతే జ్ఞాయతే వా హంసః పరమాత్మా." జ్ఞానము కలుగజేసి సంసారమును అంతము చేసేది "హంస", పరమాత్మ.

*"స మామచిన్తయద్ దేవః ప్రశ్నపారతితీర్షయా...." (భాగ 11-13-19).*

## 1026. ధర్మప్రవక్తా :

ముముక్షువులకు సంశయముల నన్నిటినీ పూర్తిగా పోగొట్టి భగవద్ధర్మ మును తెలిపే భగవానుడు ధర్మప్రవక్త.

*"వస్తునో యద్యనానాత్వమాత్మనః ప్రశ్న ఈదృశః....." (భాగ 11-13-22).*

## 1027. సనకాద్యుపదేశకృత్ :

సనకాదులకు బ్రహ్మతత్త్వము ఉపదేశము చేసిన భగవానుడు.

**భక్తిసాధనవక్తా చ యోగసిద్ధిప్రదాయకః ।**
**నానావిభూతివక్తా చ శుద్ధధర్మావబోధకః ॥ 238**

## 1028. భక్తిసాధనవక్తా (చ) :

"భక్తిరేవ సాధనం భక్తేర్వా, ఉద్ధవాయ స్వప్రాప్తిముఖ్యసాధనస్య భక్తే

ర్వక్తేత్యర్థః" । భక్తి మాత్రమే, లేక భక్తి యందుండుట సాధనము అని (భగవత్ప్రాప్తి భక్తి వలననే కలుగుతుందని) ఉద్ధవునకు బోధించిన శ్రీకృష్ణభగవానుడు.

*"వదన్తి కృష్ణ శ్రేయాంసి బహూని బ్రహ్మవాదినః....." నుంచి ".... చక్షుర్య-ఖైవాంజనసంప్రయుక్తమ్" వరకు [భాగ 11-14 - (1-26)].*

## 1029. యోగసిద్ధిప్రదాయకః :

యోగులు తమ చిత్తవృత్తులు నిరోధించి భగవానుని రూపము ధ్యాన యోగమున ధారణ చేసి అణిమాదిసిద్ధులు పొందుతారు. ఇట్టి సిద్ధులను వారికి ప్రసాదించే భగవానుడు యోగసిద్ధిప్రదాయకుడు.

*"సిద్ధయోఽ ష్టాదశ ప్రోక్తా ధారణా యోగపారగైః..." నుంచి "..... మయి సత్యే మనో యుంజంస్తథాతత్ సముపాశ్నుతే" వరకు [భాగ 11-15 - (3-26)].*

## 1030. నానావిభూతివక్తా (చ) :

బహువిధములైన భగవద్విభూతులు (భగవానుని ఐశ్వర్యస్థానములు) ఉద్ధవునికి చెప్పిన శ్రీకృష్ణభగవానుడు.

*"ఏవమేతదహం పృష్టః ప్రశ్నం ప్రశ్నవిదాం వర" నుంచి ". మద్భక్తియుక్తయా బుద్ధ్యా తతః పరిసమాప్యతే" వరకు [భాగ 11-16 - (6-44)].*

## 1031. శుద్ధధర్మావబోధకః :

భగవత్ప్రాప్తికి అవసరమైన శ్రౌత, స్మార్త, వర్ణాశ్రమ, ఆపద్ధర్మములు మొదలైన ధర్మములు ఏవేవి కలవో వాటి నన్నిటిని ఉద్ధవునకు బోధించిన శ్రీకృష్ణుడు.

*"ధర్మ్యఏష తవ ప్రశ్నో నైఃశ్రేయసకరో నృణామ్" నుంచి "అతృప్తస్తాననుధ్యాయన్ మృతోఽన్ధం విశతే తమః" వరకు [భాగ 11-17 - (9-58)].*

**మార్గత్రయవిభేదాత్మా నానాశంకానివారకః ।**
**భిక్షుగీతాప్రవక్తా చ శుద్ధసాంఖ్యప్రవర్తకః ॥ 239**



## 1032. మార్గత్రయవిభేదాత్మా :

కర్మ, జ్ఞాన, భక్తి మార్గములు మార్గత్రయము. ఈ మార్గముల అవలంబ-నలోనున్న సాధనా భేదములను, ఈ మార్గములవలన ప్రాప్తించే ఫలభేదము లను, ఉద్ధవునకు బోధించిన శ్రీకృష్ణుడు

*"కర్మణాం పరిణామిత్వాదావిరించాదమంగలం..." నుంచి "... గుణేష్వసంగో వైరాగ్యమైశ్వర్యం చాణిమాదయః" వరకు [భాగ 11-19 - (18-27)].*

## 1033. నానాశంకానివారకః :

శ్రీకృష్ణుడు బోధించిన సాధనావిధానములలోను యమనియమాది ఆచరణలలోను, ఉద్ధవునికి గల శంకలను నివృత్తి చేసిన (పోగొట్టిన) శ్రీకృష్ణుడు.

*"యమః కతివిధః ప్రోక్తో నియమో వారికర్శన...." నుంచి "... గుణదోష దృశిర్దోషో గుణస్తూభయవర్జితః" వరకు [భాగ 11-19 - (28-45)].*

## 1034. భిక్షుగీతాప్రవక్తా (చ) :

అవంతీనగరములో ఒక భిక్షువుచే చెప్పబడిన గీతము "భిక్షుగీత." దీని సారాంసమేమిటంటే అహంకార మమకారములు లేకుండా నిత్యయుక్తుడై భగవానునియందే స్థితి కలిగి ఉండినచో అదియే సర్వయోగ సాధనాసారము. ఇది ఆచరించుటకు ఏ క్రమనియమముల అవసరములేదు. ఈ భిక్షుగీతను ఉద్ధవునకు బోధించిన శ్రీకృష్ణుడు.

*"కథయన్తి మహత్పుణ్యమితిహాసమిహోద్ధవ........" నుంచి "........ ముహూర్తేన బ్రహ్మలోకం ఖట్వాంగః సమసాధయత్" వరకు [భాగ 11-23 - (4-30)].*

## 1035. శుద్ధసాంఖ్యప్రవర్తకః :

కపిలభగవానుని చేత సాంఖ్యశాస్త్రములో చెప్పబడిన ఆత్మానాత్మ వివేకసారమును ఉద్ధవునకు బోధించిన శ్రీకృష్ణుడు.

*"కతి తత్త్వాని విశ్వేశ సంఖ్యాతాన్యృషిభిః ప్రభో...." నుంచి అధ్యాయము చివరవరకు (భాగ 11-22 అ.)*

**మనోగుణవిశేషాత్మా జ్ఞాపకోక్తపురూరవాః ।**
**పూజావిధిప్రవక్తా చ సర్వసిద్ధాన్తబోధకః ॥ 240**

### 1036. మనోగుణవిశేషాత్మా :

"మనసాధిష్ఠితా యే గుణాః సత్త్వాదయః తే విశేషాత్మనో దేవాదయో యస్మాద్యస్యేతి వా." సత్త్వరజస్తమోగుణములు మనస్సును అధిష్టించి (మనస్సుపై అధికారము కలిగి) అందరిలోను ఉంటాయి. (సత్త్వగుణము కొందరిలోను, రజోగుణము మరికొందరిలోను, తమోగుణము యింకా ఇతరులలోను ప్రధానముగా ఉండి, మిగిలిన రెండు గుణములు తక్కువగా ఉంటాయి. సత్త్వగుణప్రధానులైన వారిలో దేవతలు ముఖ్యముగా చెప్పబడతారు). కర్మలచే ఏర్పడిన మనస్సును అధిష్ఠించిన సత్త్వాది గుణములచేత జీవులలో విశేషము (భేదము) ఏర్పడుచున్నది. నిర్విశేషుడైన పరమాత్మ వలన ఇట్టి ఏర్పాటు చేయబడుటచే భగవానుడు మనోగుణవిశేషాత్మ.

*"మనః కర్మమయం నృణామింద్రియైః పంచభిర్యుతమ్..." [భాగ 11-22-36].*

### 1037. జ్ఞాపకోక్తపురూరవాః :

ఊర్వశి పురూరవుని విడిచిపెట్టి స్వర్గలోకము వెళ్ళిన తరువాత ఆతడు త్రిగుణాత్మకమైన తన సంసారవిషయలోలత తెలుసుకొని వైరాగ్యము పొందునట్లు చేసిన (జ్ఞానము కలుగజేసిన) భగవానుడు "జ్ఞాపకోక్తపురూరవాః". 'ఐలః' అంటే, ఐలుడు. ఇలానందనుడు, పురూరవుడు.

*"ఐలః సామ్రాడిమాం గాథామగాయత బృహచ్ఛ్రవాః...." నుంచి ".... సంత ఏతస్య ఛ్ఛిందంతి మనోవ్యాసంగముక్తిభిః" వరకు [భాగ 11-26 - (4-26)]*



### 1038. పూజావిధిప్రవక్తా (చ) :

"వైదికతాంత్రికమిశ్రభేదేన యః పూజావిధిః ప్రకారస్తస్య ప్రవక్తః." వైదిక తాంత్రిక మిశ్ర భేదములచే నిర్ణయించబడిన పూజా విధులను చక్కగా బోధించిన భగవానుడు.

*"న హ్యన్తోఽనన్తపారస్య కర్మకాండస్య చోద్ధవ...." నుంచి "కర్మణాం భాగినః ప్రేత్య భూయో భూయసి తత్ ఫలమ్" వరకు [భాగ 11-27 - (6-55)].*

### 1039. సర్వసిద్ధాంతబోధకః :

1. అన్ని సిద్ధాంతములలో గల గుణదోషములు ఉద్ధవునకు బోధించి తెలియజేసిన శ్రీకృష్ణుడు.

*"పరస్వభావకర్మాణి న ప్రశంసేన్నగర్హయేత్....." నుంచి ".... ఆద్యన్తవదసజ్జ్ఞాత్వా నిస్సంగో విచరేదిహ" వరకు (భాగ 11-28 - (1-9).*

2. అన్ని సిద్ధాంతముల యందు చర్చింపబడి, నిశ్చయింపబడి యున్న (లేదా చెప్పబడియున్న) సిద్ధాంత నిశ్చితార్థమును ఉద్ధవునకు బోధించి, తెలియజేసిన శ్రీకృష్ణుడు.

**లఘుస్వమార్గవక్తా చ స్వస్థానగతిబోధకః ।**
**యాదవాఙ్గోపసంహర్తా సర్వాశ్చర్యగతిక్రియః ॥ 241**

### 1040. లఘుస్వమార్గవక్తా (చ) :

అనాయాసముగా (సులభముగా) భగవంతుని అనుగ్రహము పొందించ గల భక్తిమార్గము (స్వమార్గము)ను గురించి చెప్పిన భగవానుడు.

*"హన్త తే వర్ణ (కథ) యిష్యామి మమ ధర్మాన్ సుమంగలాన్..." నుంచి ".... మద్భావః సర్వభూతేషు మనోవాక్కాయవృత్తిభిః" వరకు [(భాగ 11-29 - (8-19)]*

### 1041. స్వస్థానగతిబోధకః :

1. భగవానుని స్థానము (స్వస్థానము) అయిన వైకుంఠము చేరుటకు లేక భగవంతుని చేరుటకు ఏ విధమైన సాధన చేయాలో దానిని ఉద్ధవునికి బోధించిన శ్రీకృష్ణుడు.

2. ఉద్ధవుడు చేరవలసిన నరనారాయణుల స్వస్థానము అయిన బదరికాశ్రమము చేరి అతనిని తపస్సు చేయవలసినదని బోధించిన (ఆదేశించిన) శ్రీకృష్ణుడు.

*"గచ్ఛోద్ధవ మయాఽఽదిష్టో బదర్యాఖ్యం మమాశ్రమమ్..." నుంచి "... అతివ్రజ్య గతీస్తిస్రో మామేష్యసి తతః పరమ్" వరకు [భాగ 11-29; - (41-44)].*

## 1042. యాదవాంగోపసంహర్తా :

"యాదవానామంగస్య దేహస్య ఉపసంహారకం ఇతి." యాదవులు అందరు దేవతల అంశతో భూమిపై పుట్టారు. (అంగము = దేహము) శ్రీకృష్ణావతార ఉపసంహరణ సమయము దగ్గర పడగా వారు మానవ దేహములను ఉపసంహరించు కొని వారి దేవతాంశలతో చేరాలి. అందుచేత వారికి ఒకరిపై ఒకరికి కోపము వచ్చి, ఒకరినొకరు సంహరించుకొన్నట్లు చేసిన శ్రీకృష్ణుడు.

*"యుయుధుః క్రోధసంరబ్ధా వేలాయామాతతాయినః..." (భాగ 11-30-14).*

## 1043. సర్వాశ్చర్యగతిక్రియః :

1. శ్రీకృష్ణనిర్యాణసమయములో అందరికి ఎంతో ఆశ్చర్యము కలిగించే విధముగా స్వధామగమనక్రియ (వైకుంఠమునకు వెళ్ళినరీతి) తెలియ జేయుటకు కారకుడైన శ్రీకృష్ణుడు.

*"భగవాన్ పితామహం వీక్ష్య విభూతీరాత్మనో విభుః..." నుంచి "... విస్మితాస్తాం ప్రశంసన్తః స్వం స్వం లోకం యయుస్తదా" వరకు [భాగ 11-31 - (5-10)].*

2. సర్వజనులు ఆశ్చర్యపడే విధముగాను అసురులు మోహింపబడే విధముగాను జరిగే క్రియాగతులుగల శ్రీకృష్ణభగవానుడు.

ఇంతవరకు ఏకాదశస్కంధ నామములు.



# శ్రీమద్భాగవత ద్వాదశస్కంధ నామములు

*ఆశ్రయలీలా నామములు (1044-1075)*

*శ్లోక సంఖ్య (242-248)*

**కాలధర్మవిభేదార్థవర్ణనాశనతత్పరః ।**
**బుద్ధో గుప్తార్థవక్తా చ నానాశాస్త్ర విధాయకః ॥ 242**

## 1044. కాలధర్మవిభేదార్థవర్ణనాశనతత్పరః :

1. ధర్మవిభేదమనగా ధర్మలోపము. వర్ణనాశనమనగా బ్రాహ్మణాది అన్ని వర్ణములు కలిసిపోయి ఏకవర్ణభావము పొందుట. రౌద్రమైన కలికాల రూపములో భగవానుడు ధర్మలోపము కలిగించుటకు వర్ణనాశనము చేయుట యందు సక్రియుడౌతాడు. ఈ విధమైన మార్పులు వచ్చినను, ధర్మపరిరక్షణ యందు తత్పరుడైన భగవానుడు, కాలధర్మవిభేదార్థవర్ణనాశనతత్పరుడు. అనగా జగత్తులో జరిగే సర్వశుభాశుభకార్యములన్నిటిని తన లీలలుగా జరిపించే భగవానుడు.

*"మత్తః సర్వం ప్రవర్తతే" (గీత 10-8);*
*"తతశ్చానుదినం ధర్మః సత్యం శౌచం క్షమా దయా (భాగ 12-2-1).*

## 1045. బుద్ధః :

దేశకాలాదులననుసరించి, తనంతటతానే ధర్మాధర్మములనన్నింటిని తెలుసుకొనే (తెలుసుకున్న లేక తెలిసిన) భగవానుడు.

## 1046. గుప్తార్థవక్తా (చ) :

1. గుప్త అంటే గూఢమైన; గుప్తార్థ అంటే ఆ గూఢమైన ధర్మరూపమును, వక్తా అంటే చెప్పే భగవానుడు, గుప్తార్థవక్త.

2. దేశకాలపరిస్థితుల కనుగుణముగా పాషండులు, నాస్తికులు మొదలైన వారిచే ధర్మము యొక్క గూఢార్థమును "జీవ(భూత) హింస చేయరాదు" మొదలైన విధముగా చెప్పించే భగవానుడు.

## 1047. నానాశాస్త్రవిధాయకః :

చార్వాకాది ఎన్నో అవైదిక శాస్త్రములకు కూడా కర్త అయిన భగవానుదు.

**నష్టధర్మమనుష్యాదిలక్షణజ్ఞాపనోత్సుకః ।**
**ఆశ్రయైకగతిజ్ఞాతా కల్కిః కలిమలాపహః ॥ 243**

## 1048. నష్టధర్మమనుష్యాదిలక్షణజ్ఞాపనోత్సుకః :

కలికాలములో ధర్మములు లోపించినపుడు మనుష్యులలో కలిగే లక్షణములు తెలియజేసే భగవానుడు.

*"విత్తమేవ కలౌనౄణాం జన్మాచారగుణో దయః..." నుంచి ".... త్రింశద్వింశతి వర్షాణి పరమాయుః కలౌ నృణాం" వరకు [భాగ 12-2 - (2-11)].*

## 1049. ఆశ్రయైకగతిజ్ఞాతా :

"ఆభాసశ్చ నిరోధశ్చాధ్యవసీయతే స ఆశ్రయః, పరబ్రహ్మ, పరమాత్మేతి శబ్ద్యతే ఇతి ఉక్తరూపో య ఆశ్రయః తదేకగతేః సచాసావేకగతిశ్చేతి తస్య జ్ఞాతా, ఆశ్రయస్య స్వరూపత్వాత్ తత్ జ్ఞాతా స్వయమేవ నాన్య ఇతి భావః." 'ఆభాసః' అనగా అద్దములోని ప్రతి బింబమువలె (సదృశముగా కనబడు తున్నా) యథార్థము కానిది. 'నిరోధః' అంటే మనోవృత్తులు నిగ్రహింపబడి భగవానునియందే నిలిచి ఉండుట. 'ఆశ్రయః' అంటే శరణాగతుడైన భక్తునికి ఆశ్రయమైన పరబ్రహ్మ లేక పరమాత్మ. ఆభాస నిరోధ లక్షణములు చక్కగా తెలుసుకొని, భగవంతునియందే చిత్తము నిలుపుట ఆశ్రయము. ఇదే పరబ్రహ్మ, పరమాత్మ శబ్దముచే తెలియబడుతుంది. "జీవునికి ఆ ఆశ్రయమే గతికాని వేరే మరి ఏ ఒక్క గతిలేదు." అన్నజ్ఞానము కలవాడు ఆశ్రయైకగతిజ్ఞాత, ఆశ్రయ స్వరూపభగవానుడే ఈ ఏకైక గతినిగూర్చి తెలిసినవాడు, అట్టి జ్ఞానము కలిగించువాడు. (ప్రసాదించువాడు). ఇట్లు ఆశ్రయైకగతిజ్ఞాత అయిన భక్తుడు భగవంతుని కంటే వేరు కాదు.



## 1050. కల్కిః :

"కల్కిః" అంటే శత్రువులను బాధించువాడు లేక కలిని చంపువాడు అని అర్థము.

*"ఇత్థం కలౌ గతప్రాయే జనే తు ఖరధర్మిణి...." (భాగ 12-2-16).*

## 1051. కలిమలాపహః :

తన ప్రాకట్యము (తాను అవతరించుట)చేత కలియుగమందలి పాపములు పోగొట్టే భగవానుడు, కలిమలాపహుడు, కల్కి.

*"అథ తేషాం భవిష్యంతి మనాంసి విశదాని వై...." నుంచి ".... ఏకరాశౌ సమేష్యన్తి తదా భవతి తత్ కృతమ్" వరకు [భాగ 12-2 - (21-24)].*

**శాస్త్రవైరాగ్యసంబోధో నానాప్రలయబోధకః ।**
**విశేషతః శుకవ్యాజపరీక్షిజ్జ్ఞానబోధకః ॥ 244**

## 1052. శాస్త్రవైరాగ్యసంబోధః :

శ్రీమద్భాగవతము భక్తిశాస్త్రము. ఈ శాస్త్రమును శుకుని ద్వారా పరీక్షిత్‌కు బోధింపజేసి జ్ఞానసహితవైరాగ్యము (సకల విషయనివృత్తి) సమ్యక్ భక్తిని కలుగజేసిన (ప్రసాదించిన) భగవానుడు "శాస్త్రవైరాగ్యసంబోధః"

*"కథా ఇమాస్తే కథితా మహీయసాం...." నుంచి ".... కృష్ణే ఉ మలాం భక్తి మభీప్సమానః" వరకు (భాగ 12-3-14, 15).*

## 1053. నానాప్రలయబోధకః :'

'ప్రలీయన్తేఽస్మిన్ సర్వం ఇతి ప్రలయః" అంటే దేనినుంచి యీ విశ్వమంతా సృష్టింపబడినదో దానియందే అది తిరిగి లీనమవడము అని అర్థము. ఈ భౌతిక ప్రపంచములో సృష్టింపబడిన అన్నిటికి పూర్వరూపము పోయి క్రొత్త రూపములో కనిపిస్తూ మార్పులు చెందుతూ ఉండడమే ప్రళయము. ఈ ప్రళయము మహాకాల స్వరూప భగవానునిచే చేయబడుతుంది. శాస్త్రములో

నాలుగు విధములైన ప్రళయములు చెప్పబడ్డాయి. అవి, – నైమిత్తిక, ప్రాకృతిక, ఆత్యన్తిక, నిత్యములని చెప్పబడతాయి. ఈ ప్రళయములలోని భేదములు బోధించిన శ్రీకృష్ణుడు. నానాప్రలయబోధకుడు. *(భాగ 12-4 అ.)*

### 1054. విశేషతః శుకవ్యాజపరీక్షిజ్జ్ఞానబోధకః :

శ్రీభాగవతశాస్త్రములోగల యదార్థ భగవద్ధర్మమును శుకుని రూపములో విశేషముగా (విశేషమైన) జ్ఞానబోధచేసిన భగవానుడు.

*"అత్రానువర్ణ్యతేఽభీక్ష్ణం విశ్వాత్మా భగవాన్ హరిః...." నుంచి*

*(భాగ 12-5 అ॥ చివరి వరకు).*

**శుకేష్టగతిరూపాత్మా పరీక్షిద్దేహమోక్షదః ।**
**శబ్దరూపో నాదరూపో వేదరూపో విభేదనః ॥ 245**

### 1055. శుకేష్టగతిరూపాత్మా :

శుకునకు జ్ఞానసహిత భక్తి ఇష్టతమము. శుకుడు చెప్పగా భాగవత శ్రవణము చేసి పరీక్షిత్ కూడా అట్టి జ్ఞానసహితభక్తి పొందాడు.

*"ఏతన్నిశమ్య మునినాభిహితం పరీక్షిద్..." నుంచి "..... జగామ భిక్షుభిః సాకం నరదేవేన పూజితః" వరకు [భాగ - 12-6 - (1-8)].*

### 1056. పరీక్షిద్దేహమోక్షదః :

పై విధమైన శుకేష్టగతిరూపాత్మత పొందిన పరీక్షిత్ యొక్క భౌతికదేహము" తక్షక విషముచే దగ్ధముకాగా మోక్షము ప్రసాదించిన భగవానుడు.

*"పరీక్షిదపి రాజర్షిరాత్మన్యాత్మానమాత్మనా...." నుంచి ".... వవృషుః పుష్పవర్షాణి విబుధాః సాధువాదినః" వరకు (భాగ 12-6 - 9-15).*

### 1057. శబ్దరూపః :

శబ్దబ్రహ్మరూపుడైన పరబ్రహ్మము.



### 1058. నాదరూపః :

నాదమంటే ప్రణవము. ప్రణవరూపుడైన పరమాత్మ. వేదములందు 'ఓం'కారరూపుడై (ప్రణవరూపుడై) ఉన్న భగవానుడు.

*"ప్రణవః సర్వవేదేషు (గీత 7-8). ఓమితి బ్రహ్మ, ఓమితీదగ్ం సర్వం" (తై ఉ) "సమాహితాత్మనో బ్రహ్మన్ బ్రహ్మణః పరమేష్ఠినః..." నుంచి "వేదాన్ బ్రహ్మర్షయో వ్యస్యన్ హృది స్థాచ్యుత చోదితాః" వరకు [భాగ 12-6 - (37-47)].*

### 1059. వేదరూపః :

ఋగ్యజుస్సామఅధర్వణ వేదరూపములలో నున్న వేదరూప భగవానుడు లేక సామవేదరూప భగవానుడు.

*వేదానాం సామవేదోఽస్మి.... (గీత 10-22).*

### 1060. విభేదనః :

వేదములను ఋగ్యజుస్సామఅధర్వణ అనే నాలుగు భాగములుగా వ్యాసుడు విభజించాడు. అట్టి వ్యాసరూపుడైన భగవానుడు.

**వ్యాసః శాఖాప్రవక్తా చ పురాణార్థప్రవర్తకః ।**
**మార్కండేయప్రసన్నాత్మా వటపత్రపుటేశయః ॥ 246**

### 1061. వ్యాసః :

వేదములను క్రోడీకరించి, పురాణములను విస్తరించిన వ్యాసుడు విష్ణుని అవతారము. కావున వ్యాసుడు చేసిన కార్యములు భగవానుడు చేసిన కార్యములని తెలుసుకొనవలెను.

*"వ్యాసాయవిష్ణురూపాయ...." (వి.స.నా. పూర్వపీఠిక 2 శ్లో॥)*

*'పరాశరాత్ సత్యవత్యామంశాంశకలయా విభుః..." (భాగ 12-6-49).*

### 1062. శాఖాప్రవక్తా (చ) :

ముందు వచ్చే కాలములో వేదములు సురక్షితము చేయడానికి

వేదశాఖలు (బహ్వృచాది వేదశాఖలు) శిష్యుల ద్వారా ప్రవర్తింపజేసిన వేదవ్యాసరూపభగవానుడు.

**1063. పురాణార్థప్రవర్తకః :**

పురాణముల లక్షణములు, వాని లక్ష్యములు, వాని ద్వారా వేద ధర్మములను బోధించిన భగవానుడు.

*"పురాణలక్షణం బ్రహ్మన్ బ్రహ్మర్షిభిర్నిరూపితమ్...." (భాగ 12-7-8).*

**1064. మార్కండేయప్రసన్నాత్మా :**

1. మార్కండేయుడు తపస్సు, ధ్యానము మొదలైన సాధనలచే ప్రసన్న (శాంతియుత) చిత్తము పొందునట్లు చేసిన భగవానుడు.

2. మార్కండేయునిపై ఎల్లప్పుడు ప్రసన్నుడై ఉండే భగవానుడు.

"తస్యైవం యుంజతశ్చిత్తం మహాయోగేన యోగినః...." నుంచి "....పునరానమ్య పాదాభ్యాం గరిష్ఠావిదమబ్రవీత్" వరకు [భాగ 12 - 8 - (14-39)].

**1065. వటపత్రపుటేశయః :**

మార్కండేయునికి మాయా దర్శనమందు, ప్రళయమహాసముద్రములో వటపత్రశాయియగు బాలముకుంద భగవానుడు దర్శనమిచ్చాడు.

*"సకదాచిద్ భ్రమంస్తస్మిన్ పృథివ్యాః కకుదిద్విజః" నుంచి ".... ముఖే నిధాయ విప్రేందో ధయన్తం వీక్ష్య విస్మితః" వరకు [12-9 - (20-25)].*

**మాయావ్యాప్తమహామోహదుఃఖశాన్తిప్రవర్తకః ।**
**మహాదేవస్వరూపశ్చ భక్తిదాతా కృపానిధిః ॥ 247**

**1066. మాయావ్యాప్తమహామోహదుఃఖశాన్తిప్రవర్తకః :**

మాయ పూర్తిగా వ్యాపించి మార్కండేయునికి కూడా అజ్ఞానజనిత మోహము, దాని వలన దుఃఖము కలిగించింది. అప్పుడు అతనికి దర్శనమిచ్చి శాన్తి కలిగించిన భగవానుడు.



*"అథ తం బాలకం వీక్ష్య నేత్రాభ్యాం ధిష్ఠితం హృది...." (భాగ 12-9-32).*

**1067. మహాదేవస్వరూపః (చ) :**

మహాదేవుడైన శంకరుని రూపములో మార్కండేయునికి తిరిగి దర్శనమిచ్చిన భగవానుడు

*"రుద్రాణాం శంకరశ్చాస్మి" (గీత 10-23).*

*"తమిత్థం (తమేవం) నిభృతాత్మానం వృషేణ దివి పర్యటన్..." (భాగ 12-10-3).*

**1068. భక్తిదాతా :**

మార్కండేయునికి భక్తిరూప వరమిచ్చిన భగవానుడు భక్తిదాత.

*వరం వృణీష్వ నః కామం వరదేశా వయం త్రయః..." నుంచి "... బ్రహ్మవర్చస్వినో భూయాత్ పురాణాచార్యతాస్తు తే" వరకు [భాగ 12-10 - (19-37)].*

**1069. కృపానిధిః :**

వరములన్నిటిలో అతిదుర్లభమైన భక్తిని వరము రూపములో నిచ్చిన కృపానిధి భగవానుడు.

*"వరమేకం వృణేఽథాపి పూర్ణాత్ కామాభి వర్షణాత్...." నుంచి ".... బ్రహ్మవర్చస్వినో భూయాత్ పురాణాచార్యతాస్తు తే" వరకు [భాగ 12-10 - (34-37)].*

**ఆదిత్యాంతర్గతః కాలః ద్వాదశాత్మా సుపూజితః ।**
**శ్రీభాగవతరూపశ్చ సర్వార్థఫలదాయకః ॥ 248**

**1070. ఆదిత్యాంతర్గతః :**

ఆదిత్యమండల మందు అంతర్గతుడై ఉన్నభగవానుడు.

*"శుకో యదాహ భగవాన్ విష్ణురాతాయ శృణ్వతే..." నుంచి ".... స్మరతాం సంధ్య యోర్నృణాం హరన్త్యంహో దినే దినే" వరకు [భాగ 12-11 - (27-45)].*

**1071. కాలః :**

"కలయతి విశ్వం క్షణలవాదిభిః ఇతికాలః" క్షణము లవము మొదలైన చిన్న చిన్న కాలభాగములచేత విశ్వమంతటిని నడిపించే కాలరూపుడైన భగవానుడు.

**1072. ద్వాదశాత్మా :**

ధాతృ, అర్యమాది ద్వాదశాదిత్యులు (సూర్యులు) లేక ఆ సూర్యుల రూపములలో నున్న భాగవానుడు.

*"మధ్వాదిషు ద్వాదశసు భగవాన్ కాలరూపధృక్....." (భాగ 12-11-32).*

**1073. సుపూజితః :**

ఉపాసకులు భగవానుని వివిధ దేవతా రూపములలో ఆయా దేవతా (శక్తులకు సంబంధించిన) మంత్ర తంత్రాది పద్ధతులలో చక్కగా పూజిస్తారు. ఆ అన్నిదేవతా రూపములలో చక్కగా పూజింపబడే భగవానుడు, సుపూజితుడు.

**1074. శ్రీభాగవతరూపః (చ) :**

1. శ్రీ భాగవతానుక్రమణికలో చెప్పబడ్డ వివిధమైన రూపములు ధరించిన శ్రీకృష్ణభగవానుడు.

2. పన్నెండు స్కంధములుగల శ్రీ భాగవతమే పన్నెండు అంగములుగల శ్రీకృష్ణభగవానుడు.

3. శ్రీభాగవతవాఙ్మయమే రూపముగా గల శ్రీకృష్ణభగవానుడు.

*"అత్ర సంకీర్తితః సాక్షాత్ సర్వపాపహరో హరిః" నుంచి "..... సురఋషభాయ నమః సనాతనాయ" వరకు [భాగ 12-12 - (3-67)].*

**1075. సర్వార్థఫలదాయకః :**

శ్రీభాగవతము భగవంతుని స్వరూపము. శ్రీభాగవత పఠన శ్రవణాదులు ధర్మాది పురుషార్థములన్నిటి ఫలరూపమైన భక్తిని ఇస్తాయి. పురుషార్థముల ఫలములు ఏవేవి కలవో వాటినన్నిటినీ ఇస్తాయి. భగవంతుని దరిచేర్చుట (స్వయమేవ తద్రూపదాయకః) అనే ఫలము నిస్తాయి. ఇటువంటి సామర్థ్యము గల భగవానుడు సర్వార్థఫలదాయకుడు.

*య ఏవం శ్రావయేన్నిత్యం యామక్షణమనన్యధీః శ్రద్ధావాన్ యోఽనుశృణుయాత్ పునాత్యాత్మానమేవ సః" (భాగ 12-12-58).*

ఇంతవరకు ద్వాదశస్కంధ నామములు.



**ఇతీదం కీర్తనీయస్య హరేర్నామసహస్రకమ్ ।**
**పంచసప్తతివిస్తీర్ణం పురాణాంతరభాషితమ్ ॥ 249**

శ్రీపురుషోత్తమనామసహస్రము కీర్తింపదగినది. సర్వ దుఃఖములను హరించునది. ఇతర పురాణములలో చెప్పబడ్డ డెబ్బైఐదు నామములు యీ నామావళిలో చేర్చబడ్డాయి. ఈ డెబ్బైఐదు (75) నామములు. క్రింద ఇయ్య బడినవి. (శ్లోక సంఖ్య నామసంఖ్య నామమునకెదురుగా బ్రాకెట్‌లో ఇవ్వబడినవి).

1. శుకవాగమృతాబ్ధీన్దుః (12-20)
2. కోటిసూర్యసమప్రభః (48-205)
3. బ్రహ్మకోటి ప్రజాపతిః (49-209)
4. సుధాకోటిస్వాస్థ్యహేతుః (49-210)
5. కామధుక్కోటి కామదః (49-211)
6. సముద్రకోటి గంభీరః (50-212)
7. తీర్థకోటిసమాహ్వయః (50-213)
8. సుమేరుకోటినిష్కంపః (50-214)
9. కోటిబ్రహ్మాండవిగ్రహః (50-215)
10. కోట్యశ్వమేధపాపఘ్నః (51-216)
11. వాయుకోటిమహాబలః (51-217)
12. కోటీందుజగదానందీ (51-218)
13. శివకోటిప్రసాదకృత్ (51-219)
14. అమానీ (58-259)
15. మానదః (58-260)
16. జనార్దనః (64-297)
17. అధోక్షజః (88-420)
18. ఉపేంద్రః (124-614)
19. ఇంద్రావరజః (124-615)
20. త్రిలోకాత్మా (126-625)
21. విశ్వమూర్తిః (126-626)
22. పృథుశ్రవాః (126-627)
23. రఘునాథః (134-661)
24. రామచంద్రః (134-662)
25. రామభద్రః (134-663)
26. రఘుప్రియః (134-664)
27. అనంతకీర్తిః (134-665)
28. పుణ్యాత్మా (134-666)
29. పుణ్యశ్లోకైకభాస్కరః (134-667)
30. అహల్యాదుఃఖహారీ (139-689)
31. గుహస్వామీ (139-690)

32. సలక్ష్మణః (139-691)
33. శరభంగసుతీక్ష్ణాదిపూజితః (140-694)
34. అగస్త్యభాగ్యభూః (140-695)
35. జటాయుర్వధమోక్షదః (143-704)
36. శబరీపూజితః (143-705)
37. దుందుభ్యస్థిప్రహరణః (144-707)
38. సప్తతాలవిభేదనః (144-708)
39. చిత్రకూటప్రియస్థానః (140-692)
40. దండకారణ్యపావనః (140-693)
41. ఋషిసంప్రార్థితకృతిః (141-696)
42. విరాధవధపండితః (141-697)
43. సర్వసాక్షీ (19-59)
44. కేశవః (149-730)
45. నందవ్రజజనానందీ (161-778)
46. రామానుజః (162-785)
47. వాసుదేవః (162-786)
48. అరణ్యభోక్తా (167-805)
49. బాలలీలాపరాయణః (167-806)
50. ప్రోత్సాహజనకః (167-807)
51. అఘాసురనిషూదనః (167-808)
52. వ్యాలమోక్షప్రదః (168-809)
53. పుష్టః (168-810)
54. బ్రహ్మమోహప్రవర్ధనః (168-811)
55. అనంతమూర్తిః (168-812)
56. సర్వాత్మా (168-813)
57. జంగమస్థావరాకృతిః (168-814)
58. బ్రహ్మమోహనకర్తా (169-815)
59. స్తుత్యః (169-816)
60. ఆత్మా (169-817)
61. సదాప్రియః (169-818)
62. కాలీయఫణిమాణిక్య-
రంజితశ్రీపదాంబుజః (173-833)
63. గోపీరత్నస్తుతాశేష
వేణువాద్య విశారదః (176-840)
64. వేణువాదస్మరక్షోభమత్త
గోపీవిముక్తిదః (181-851)
65. సద్యః కువలయాపీడఘాతీ (195-891)
66. చాణూరమర్దనః (195-892)
67. సాన్దీపనిమృతాపత్యదాతా (199-905)
68. కాలాంతకాదిజిత్ (199-906)
69. సహస్రకవచచ్ఛేదీ (56-244)
70. సుదామారంకభార్యార్థ
భూమ్యానీతేంద్రవైభవః (229-998)
71. షోడశస్త్రీసహస్రేశః (210-943)
72. బుద్ధః (242-1045)
73. గుప్తార్థవక్తా (242-1046)
74. చతుర్మూర్తిః (33-127)
75. సాక్షీ (33-124)



## ఫలశ్రుతి

**య ఏతత్ప్రాతరుత్థాయ శ్రద్ధావాన్ సుసమాహితః ।**
**జపేదర్థాహితమతిః స గోవిన్దపదం లభేత్ ॥ 250**

తాత్పర్యము : లౌకిక విషయములు మనస్సులోనికి రానట్టి పురుషుడు లేక అచంచల భక్తిరూపము చెందినమనస్సు గల పురుషుడు ప్రాతః కాలమందు లేచి ఏకాగ్రచిత్తముతో శ్రద్ధగా శ్రీపురుషోత్తమనామసహస్రమును జపిస్తే అతనికి శ్రీగోవిందుని (గోవర్ధనోద్ధారుని) చరణసన్నిధి దొరుకుతుంది.

పై శ్లోకము నందు శ్రద్ధాయుక్త అవ్యగ్రచిత్తుని గురించి చెప్పబడింది. ఇప్పుడు అట్లు చేయుటకశక్తుడైన పురుషునకు కూడా శ్రీపురుషోత్తమనామ-సహస్రము చదివినంత మాత్రాన సత్ఫలితము కలుగుతుందని చెప్పుచున్నారు.

**సర్వధర్మవినిర్ముక్తః సర్వసాధనవర్జితః ।**
**ఏతద్ధారణమాత్రేణ కృష్ణస్య పదవీం వ్రజేత్ ॥ 251**
**హర్యావేశితచిత్తేన శ్రీభాగవతసాగరాత్ ।**
**సముద్ధృతాని నామాని చింతామణినిభాని హి ॥ 252**
**కంఠస్థితాన్యర్థదీప్త్యా బాధన్తేఽజ్ఞానజం తమః ।**
**భక్తిం శ్రీకృష్ణదేవస్య సాధయన్తి వినిశ్చితమ్ ॥ 253**

తాత్పర్యము : ఏ ధర్మము పాటించనివాడైనా, ఏ సాధనలు చేయని వాడైనా శ్రీపురుషోత్తమనామసహస్రమును హృదయమందు నిశ్చలముగా ధారణచేసినంత మాత్రమున శ్రీకృష్ణుని పాదపద్మములప్రాప్తి పొందుతాడు. భగవానుని స్థానమును చేరుతాడు. శ్రీభాగవతపురాణమనే సముద్రమును మథించి వెలికి తీసిన ప్రకాశించే రత్నములవంటి శ్రీపురుషోత్తమనామ సహస్రమును కంఠస్థముచేసి, శ్రీహరిని చిత్తమునందు నిలిపి, భావయుక్తముగా పఠించినవారు ఈ నామముల (అర్థదీప్త్యా) అర్థము యొక్క (దివ్యత్వము)

ప్రకాశముచేత వారి అజ్ఞానమనే చీకట్లు తొలగి శ్రీకృష్ణచరణ కమలములందు జ్ఞానయుక్తభక్తిని సాధిస్తారు.

ఇట్టి సాధనయొక్క మహాత్మ్యము వలన కలిగే పరాకాష్ఠ చెప్పబడుతున్నది.

**కిం బహూక్తేన భగవాన్ నామభిః స్తుతషడ్గుణః ।**
**ఆత్మభావం నయత్యాశు భక్తిం చ కురుతే దృఢామ్ ॥ 254**

తాత్పర్యము : భగవానుని ఐశ్వర్యాది షడ్గుణముల స్తుతితో కూడిన ఈ శ్రీపురుషోత్తమనామసహస్రము పఠిస్తే శీఘ్రముగా ఆత్మజ్ఞానము కలిగి, భగవద్భక్తి దృఢపడుతుందని వేరే చెప్పనవసరము లేదు.

ఎన్నో సాధనలచే ప్రాప్తించిన ఫలితము కన్న గొప్పఫలితము ఇచ్చే శ్రీకృష్ణభక్తి ఒక్కటే చరితార్థమైనది.

**యః కృష్ణభక్తిమిహ వాంఛతి సాధనౌఘై-**
**ర్నామాని భాసురయశాంసి జపేత్స నిత్యమ్ ।**
**తం వై హరిః స్వపురుషం కురుతేతి శీఘ్ర-**
**మాత్మార్పణం సమధిగచ్ఛతి భావతుష్టః ॥ 255**

తాత్పర్యము : ఎవరైనా శ్రీకృష్ణుని భక్తిని గాఢముగా కోరుకుంటే అట్టి భక్తి పొందుటకు చేసే సాధన సముచ్చయములన్నిటిలో ముఖ్యమైనది "శ్రీ పురుషోత్తమనామసహస్రమును నిత్యము జపించుట" ఆ నామములు వర్ణించే భగవత్కీర్తి వలన ఆ జపించువానిని శ్రీహరి తన నిజభక్తునిగా చేసుకుంటాడు. ఆ భక్తుడు తనను తాను భగవానునికి ఆత్మార్పణచేసుకొని, భగవానుని శరణుపొంది, భక్తి భావముతో సంతుష్టుడై ఉంటాడు.

**శ్రీకృష్ణ కృష్ణసఖ వృష్ణివృషావనిధ్రుక్-**
**రాజన్యవంశదహనానపవర్గవీర్య ।**
**గోవింద గోపవనితావ్రజభృత్యగీత**
**తీర్థశ్రవః శ్రవణమంగల పాహి భృత్యాన్ ॥ 256**



తాత్పర్యము : శ్రీకృష్ణ పరబ్రహ్మాను తెలిపే విశేషసంబోధనము.

**కృష్ణ సఖ –** కృష్ణస్య అర్జునస్య సఖ – అర్జునునకు కృష్ణ అనే పేరు కలదు. కనుక అర్జునుని సఖుడైన శ్రీకృష్ణుడు.

**వృష్ణి, వృష, అవని ధ్రుక్ –** వృష్ణివంశజులైన వసుదేవాదులను, వృష అనగా ధర్మమును, అవని అనగా భూమిని, హింసించే లేక బాధించే

**రాజన్యవంశదహనానపవర్గవీర్యః –** (ఆ బాధించే రాజ వంశములను నాశనము చేయగలిగిన వీర్యము కల శ్రీకృష్ణుడు.

**గోవింద** గోవులకు ఇంద్రుడు లేక ప్రభువైన శ్రీకృష్ణుడు.

**గోపవనితా వజభృత్య గీత** గోపవనితలు, వ్రజవాసులు భృత్యులు లేక భక్తులు, కీర్తించే లేక వారందరిచే కీర్తించబడే శ్రీకృష్ణుడు.

**తీర్థశ్రవః** ప్రతి ఒక్క తీర్థము యొక్క కీర్తిలేక మహాత్మ్యము కల తీర్థ రూప భగవానునిగా కీర్తింపబడే శ్రీకృష్ణుడు.

**శ్రవణ మంగళ** శ్రవణమాత్రముచేతనే సకల కళ్యాణములు ప్రసాదించే శ్రీకృష్ణుడు. ఇట్టి విశేషమైన నామార్థములతో శ్రీకృష్ణుని సంబోధించి, భక్తులను రక్షింపమని ప్రార్థన చేయబడ్డది. (పాహిభృత్యాన్)

ఇది శ్రీమద్వల్లభాచార్యుల వారిచే శ్రీమద్భాగవతమహాపురాణము నుండి వెలికి తీయబడిన శ్రీ పురుషోత్తమనామసహస్రము.

**కృష్ణనామ సహస్రాక్షమాలేయం వాఙ్మణీమయీ ।**
**గ్రథితా శ్రుతి సూత్రేణ రచితా కృష్ణపాదయోః ॥**

**శ్రీ విఠ్ఠల తనూజేన రుక్మిణీ గర్భ సంభువా ।**
**రఘునాథేన గాథేయం నామసు వ్యరచిస్స్ఫుటమ్ ॥**

**ఇతి శ్రీమద్వల్లభనందన చరణకమల పరాగమాత్ర ।**
**సనాథ రఘునాథస్య కృతౌ నామచంద్రికా సమాప్తా ॥**

తాత్పర్యము : ప్రకాశించే మణులవంటి శ్రీకృష్ణుని సహస్రనామముల మాలకు (శ్రీపురుషోత్తమనామసహస్రమునకు) శ్రుతి సమ్మతమైన “నామచంద్రికా” అనేవ్యాఖ్య శ్రీ విఠ్ఠలాచార్య రుక్మిణీ దంపతుల పుత్రుడైన రఘునాథుడనైననాచే శ్రీకృష్ణ పాదసన్నిధిని రచింపబడినది అని అర్థము.

శ్రీవల్లభాచార్యుల కుమారుడైన విఠ్ఠలాచార్యుని చరణకమలపరాగ మాత్రముచే సనాథుడైన రఘునాథునిచే చేయబడిన “నామచంద్రికా” సమాప్తము.

**శ్రీ కృష్ణార్పణమస్తు ।**

*ఓం శాంతిః శాంతిః శాంతిః ।*